16681

# గోపీచంద్
# స్మారక సంచిక

ప్రచురణ :

శ్రీ త్రిపురనేని గోపీచంద్
సంస్మరణ కార్యక్రమ సంఘము

ఆవిష్కరణ :,
పూజ్యశ్రీ తాపీ ధర్మారావు
ఆదివారం, 15-12-1963

వెల రూ. 6/-

ముద్రణ :
పవన్ ప్రింటింగ్ వర్క్సు,
ఇసామియా బజార్, హైదరాబాద్.

# గోపీచంద్ సంస్మరణ కార్యక్రమ సంఘము

పాట్రన్ :

**డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి, ఎం. పి.**

అధ్యక్షులు :

**శ్రీ పి. వి. నరసింహారావు,**

రాష్ట్ర ప్రభుత్వ న్యాయ, సమాచార శాఖామాత్యులు.

ఉపాధ్యక్షులు :

**శ్రీ ముళ్ళపూడి తిమ్మరాజు, తణుకు.**

**శ్రీ దుక్కిపాటి మధుసూదన రావు,**

ప్రొడ్యూసర్: అన్నపూర్ణా పిక్చర్స్, హైదరాబాద్.

కార్యదర్శి :

**శ్రీ ఆవుల సాంబశివరావు,**

అడ్వొకేట్, హిమాయత్‌నగర్, హైదరాబాద్.

సంయుక్త కార్యదర్శి :

**శ్రీ కోగంటి సుబ్రహ్మణ్యం, రేపల్లె.**

కోశాధికారి :

**శ్రీ ఎన్. రంగారావు,**

యువ ప్రెస్, హైదరాబాద్.

ప్రచార కార్యదర్శి :

**శ్రీ పోలవరపు శ్రీహరిరావు,**

ఎడిటర్: ఎలైట్ వీక్లీ, హైదరాబాద్.

కార్యవర్గ సభ్యులు :

**శ్రీ బి. ఎస్. మూర్తి,**

కేంద్ర ప్రభుత్వ సమాజాభివృద్ధి శాఖామాత్యులు.

**శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య,**

ఆంధ్రప్రదేశ కాంగ్రెసు అధ్యక్షులు.

**శ్రీ కూర్మా వేణుగోపాలస్వామి,**

ఆంధ్ర విశ్వ విద్యాలయం రిజిష్ట్రారు.

**శ్రీ తాపీ ధర్మారావు, హైదరాబాద్.**

**శ్రీ దేవులపల్లి రామానుజరావు,**

ఆంధ్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి, హైదరాబాద్.

శ్రీ కోట పున్నయ్య, ఎం.పి., ఖమ్మంమెట్టు,
శ్రీ గౌతు లచ్చన్న, ఎం. ఎల్. ఏ., హైదరాబాద్.
శ్రీమతి అద్దేపల్లి వివేకానందదేవి, రాజమండ్రి,
శ్రీ పి. బాబుల్‌రెడ్డి, అడ్వొకేట్, హైదరాబాద్,
డాక్టర్ బి. రామరాజు, హైదరాబాద్.
శ్రీ నార్ల వెంకటేశ్వరరావు, "ఆంధ్రజ్యోతి", విజయవాడ.
శ్రీ కాట్రగడ్డ రాజగోపాలరావు, "విశాలాంధ్ర", విజయవాడ
శ్రీ వల్లూరు బసవరాజు, "డెయిలీన్యూస్'', హైదరాబాద్.
శ్రీ నూకల నరోత్తమరెడ్డి, ''గోలకొండ పత్రిక'', హైదరాబాద్.
శ్రీ గోరాశాస్త్రి, ''ఆంధ్రభూమి'', సికిందరాబాద్,
శ్రీ వి. హనుమంతరావు, హైదరాబాద్,
శ్రీ పోతుకూచి సాంబశివరావు, ఆంధ్రవిశ్వసాహితి, సికిందరాబాద్.
శ్రీ గొట్టిపాటి సుబ్బరాయలు, అనంతపురం.
శ్రీ అట్లూరి రామమోహనరావు, విజయవాడ,
శ్రీ బొందలపాటి శివరామకృష్ణ, విజయవాడ.
శ్రీ పి. వి. రత్నం, ఏలూరు.
శ్రీ వెంపో, వరంగల్లు
శ్రీ పర్వతనేని భూషయ్య చౌదరి, విజయవాడ,
శ్రీ పాతూరి నాగభూషణం, పడమట, విజయవాడ.
శ్రీ ఆవుల గోపాలకృష్ణమూర్తి, తెనాలి,
శ్రీ పి. వి. సుబ్బారావు, తెనాలి.
శ్రీ దోనేపూడి రాజారావు, తెనాలి,
శ్రీ టి. యస్. కృష్ణానందమ్, సత్తెనపల్లి.
శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రి, విశాఖపట్నం.
శ్రీ యర్రోజు మాధవాచార్యులు, గుడివాడ.
శ్రీ తిరుమల రామచంద్ర, మద్రాసు.
శ్రీ వై. అర్జునరావు, న్యూఢిల్లీ.
శ్రీ నర్రా కోటయ్య, హైదరాబాద్.
శ్రీ త్రిపురనేని సుబ్బారావు, హైదరాబాద్.

# సూచిక


| | | | | |
|---|---|---|---|---|
| 1. | తమసో మా జ్యోతిర్గమయ | —శ్రీ అవుల సాంబశివరావు | .... | 7 |
| 2. | సంస్మరణ | —డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి | .... | 8 |
| 3. | జీవితచరిత్ర | —శ్రీ త్రిపురనేని సుబ్బారావు | .... | 9 |
| 4. | గొప్ప గోపీచంద్ | — ,, విశ్వనాధసత్యనారాయణ | .... | 20 |
| 5. | మా జీవయాత్ర | — శకుంతలాగోపీచంద్ | .... | 21 |
| 6. | శ్రద్ధాంజలి | —శ్రీ జాషువ | ... | 24 |
| 7. | మన గోపీచంద్ | — ,, తాపీ ధర్మారావు | .... | 25 |
| 8. | సహృదయుడు | — ,, దేవులపల్లి రామానుజరావు | .... | 27 |
| 9. | అశ్రుతర్పణము | — ,, దుర్గానంద్ | .... | 29 |
| 10. | గుండెగలవాడు | — ,, నార్ల వెంకటేశ్వరరావు | .... | 30 |
| 11. | తండ్రికి తగిన తనయుడు | — ,, ఆచార్యరంగా | .... | 31 |
| 12. | నేను-మా గోపీచంద్ | — ,, అవుల గోపాలకృష్ణమూర్తి | .... | 34 |
| 13. | సూతాశ్రమం | — ,, "బైరాగి" | .... | 37 |
| 14. | నేనెరిగిన గోపీచంద్ | — ,, బుచ్చిబాబు | .... | 39 |
| 15. | నా పరిచయం | — ,, కుందుర్తి | .... | 44 |
| 16. | రేఖా చిత్రం | — ,, బాలాంత్రపు రజనీకాంతరావు | .... | 47 |
| 17. | ప్రతిభావంతుడు | — ,, డి. రామలింగం | .... | 51 |
| 18. | కథన గాండీవి | — ,, ఉండేల మాలకొండారెడ్డి | .... | 63 |
| 19. | శ్రద్ధాంజలి | —డాక్టర్ త్రిపురనేని వేంకటేశ్వరరావు | .... | 64 |
| 20. | మరణమూ—గోపీచంద్-నేనూ | —శ్రీ పి. వి. సుబ్బారావు | .... | 69 |
| 21. | గోపీచంద్‌తో కొంతకాలం | — ,, కె. సుబ్రహ్మణ్యం | .... | 73 |
| 22. | ప్రేరణాసక్తి | —శ్రీమతి వి. యస్. రమాదేవి | .... | 77 |
| 23. | అక్షరాభిషేకము | —శ్రీ కాకాని నరసింహారావు | .... | 82 |
| 24. | మద్రాసులో.... | — ,, మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి | .... | 83 |
| 25. | నా అనుభవం | — ,, కె. యల్. నరసింహారావు | .... | 87 |
| 26. | మాసిపోని రాతకాదా | — ,, కాళోజీ నారాయణరావు | .... | 91 |
| 27. | దివ్యస్మృతి | — ,, కొడాలి గోపాలరావు | .... | 92 |
| 28. | కథానికా రచన | — ,, పాలగుమ్మి పద్మరాజు | .... | 93 |
| 29. | కథాకథన చాతురి | — శ్రీఅవుల సాంబశివరావు | .... | 100 |
| 30. | అమర కథకుడు | — ,, పి. బాబుల్‌రెడ్డి | .... | 103 |
| 31. | జోహార్ | — ,, కొడాలి ఉమామహేశ్వరరావు | .... | 106 |
| 32. | భావ పరిణామం | — ,, ఎన్. వి. బ్రహ్మం | .... | 107 |

| | | | |
|---|---|---|---|
| 33. | భావోపజీవి | —శ్రీ జాస్తి జవహర్‌లాల్ | .... 110 |
| 34. | లేఖలు | — ,, దోనేపూడి రాజారావు | .... 119 |
| 35. | సంస్కృతి | — ,, విద్వాన్ కోగంటి దుర్గామల్లికార్జునరావు | .... 127 |
| 36. | రేడియో రచయితగా | — ,, దాశరథి | .... 128 |
| 37. | గోపీచంద్ పాత్రలు | — ,, టి. యస్. కృష్ణానందమ్ | .... 136 |
| 38. | వీలునామా | — ,, రావూరి భరద్వాజ | .... 152 |
| 39. | ఒక ప్రశంస | — ,, నాయని సుబ్బారావు | .... 162 |
| 40. | గడియ పడని తలుపులు | — ,, సి. హెచ్. ఆచార్య | .... 163 |
| 41. | శిథిలాలయం | — ,, టి. రమేష్ | .... 169 |
| 42. | సినీసీమలో | — ,, బొమ్మకంటి సుబ్బారావు | .... 173 |
| 43. | గ్రామీణ జీవితము | —డాక్టరు బి. రామరాజు | .... 176 |
| 44. | స్వగతాలు | —శ్రీ నర్రా కోటయ్య | .... 182 |
| 45. | వచనరచన | — ,, పోతుకూచి సాంబశివరావు | .... 187 |
| 46. | తండ్రీ కొడుకులు | — ,, త్రిపురనేని వెంకటేశ్వరరావు, విజయవాడ | .... 192 |
| 47. | మానసిక పరిణామం | — ,, వేలూరి సహజానంద | .... 198 |
| 48. | అమరుడైన | — ,, గొట్టిపాటి సుబ్బరాయలు | .... 202 |
| 49. | నా స్నేహితుడు | — ,, ఆచంట జానకిరామ్ | .... 203 |
| 50. | బహుముఖ ప్రజ్ఞాశాలి | — ,, దేశపతిరావు | .... 206 |
| 51. | యమపాశం | — ,, మండవ శ్రీరామమూర్తి | .... 208 |
| 52. | జ్ఞాపకాలు | — ,, సి. ప్రసాద్ | .... 210 |
| 53. | విశిష్ట వ్యక్తిత్వం | — ,, బాసాని సుదర్శన్‌రెడ్డి | .... 214 |
| 54. | అసమర్థుని జీవయాత్ర | — ,, అడ్సుమిల్లి పూర్ణచంద్రరావు | .... 216 |
| 55. | యధార్థవాది | — ,, సింగరాజు లింగమూర్తి | .... 219 |
| 56. | నాకు నచ్చిన నవల | — ,, సురమౌళి | .... 220 |
| 57. | మాట్లాడే మౌని | —డాక్టర్ సి. నారాయణరెడ్డి | .... 227 |
| 58. | మనస్తత్వవేత్త | —శ్రీ దుర్గానంద్ | .... 228 |
| 59. | ప్రగతిశీలి | —శ్రీమతి నాయని కృష్ణకుమారి | .... 231 |
| 60. | కథావీధి | —శ్రీమతి టి. జయప్రదాదేవి | .... 234 |
| 61. | చందనంవంటి | —శ్రీ వడ్లమూడి గోపాలకృష్ణయ్య | .... 239 |
| 62. | గంభీరుడు | — ,, "ఉషశ్రీ" | .... 241 |
| 63. | పట్టిందల్లా బంగారం | — ,, ఎన్. వి. ఎస్. ప్రసాదరావు | .... 243 |
| 64. | బహుధా | — ,, పోలవరపు శ్రీహరిరావు | .... 245 |
| 65. | గేయరచన | — కీ. శే. గోపీచంద్ | .... 251 |
| 66. | శాంతిగీతి | —శ్రీ రజనీకాంతరావు | .... 252 |

**సంపాదక వర్గము :**

శ్రీ పి. వి. నరసింహారావు,

శ్రీ దేవులపల్లి రామానుజరావు,

శ్రీ ఆవుల సాంబశివరావు,

శ్రీ పోతుకూచి సాంబశివరావు,

శ్రీ పోలవరపు శ్రీహరిరావు,

కన్వీనర్

ముఖచిత్రం : శ్రీ బాపు, మద్రాసు

**కృతజ్ఞతలు :**

ఉదారులైన దాతలకు;

సహృదయులైన రచయితలకు, చిత్రకారులకు;

ఇది తమ పనిగానే భావించి పనిచేసిన —

**కన్నెగంటి జగ్గయ్యగారికి,**
**నర్రా కోటయ్యగారికి,**
**త్రిపురనేని సుబ్బారావుగారికి,**
**జాస్తి జవహర్‌లాల్‌గారికి,**

మరిన్నీ శ్రమించి, ఈ సంచికకు సుందర రూపాన్ని కల్పించిన ఏవన్ ప్రింటింగ్ వర్క్సు వారికి.

# తమసో మా జ్యోతిర్గమయ

వెలుగును వెతకడమే గోపీచంద్ జీవితాశయం. కాంతిని ప్రసరించడమే గోపీచంద్ జీవిత కార్యక్రమం. జీవించినన్నాళ్ళు నిశిత జిజ్ఞాసతో, సత్యాన్ని వెతుకుతూనే ఉన్నాడు. ఊపిరున్నంతవరకు తానునమ్మిన సత్యాన్ని, వెన్నెలజల్లుగా వెదజల్లుతూనే ఉన్నాడు. ఆలోచించడానికి వెరిచే మానవులలో ఆలోచనలు రేకెత్తిస్తూనే ఉన్నాడు.

'ఎందుకు' అన్నప్రశ్నను, కన్నతండ్రి కవిరాజు అంకపీఠాన తెలుసుకున్నాడు. అందుకు సమాధానాలను అన్వేషించే హేతువాదపటిమ మానవేంద్రనాథ్‌రాయ్ అడుగుజాడల్లో అలవరచుకున్నాడు. తత్ఫలితంగా గోపీచంద్ నిత్యసత్యాన్వేషి అయినాడు. ఈ అన్వేషణలో మానవుణ్ణి, మానవ ప్రకృతిని, మానవ ప్రయత్నాన్ని, మానవ చరిత్రను, అంతరాంతరాల్లోకి దిగి పరిశీలించాడు. విశ్వగమనాన్ని విమర్శనాత్మకంగా సమీక్షించాడు.

ఈ జిజ్ఞాసామార్గాన పయనించి, పయనించి, గోపీచంద్ కొన్నిమజిలీలు చేరుకున్నాడు. విశ్వకర్మ ఒకాయన ఉన్నాడని తేల్చుకున్నాడు. మరణం పిమ్మట తిరిగి జీవించటం ఉన్నదని నిర్ధారణ చేసుకున్నాడు. అంతటితో గోపీచందు గమ్యస్థానం చేరాడని అనలేము. జీవించే వుంటే, ఆపయనంలో ఇంకెన్ని సోపానాలు ఆరోహించేవాడో మరి!

గోపీచంద్ వ్రాసిన ప్రతిపదంలోను ఈ జిజ్ఞాస, ఈ అన్వేషణ కనిపిస్తూనే వుంటుంది. రమ్యాతి రమ్యాలైన ఆయన వచనరచనా రూపాలకు, నిష్ణాతమైన ఆయన కథాకథనశిల్పానికి, జీవంపోసినది, ఆయన ప్రతి అణువులోను స్పందించిన ఈ జిజ్ఞాసాతృష్ణే.

గోపీచంద్‌తో పాఠకులు ఏకీభవించక పోవచ్చును. కాని ఆయన ప్రసరించిన భావ తరంగాలతో ఉత్తేజితులవుతారు. ఆలోచనాపరులవుతారు. పర్యవసానంలో పాఠకులు జిజ్ఞాసాపరులవుతారు.

గోపీచంద్ ఆకస్మికమరణంతో ఒకమధుర స్వప్నం భంగమయినట్లయింది. ఉదాత్తము ఉత్తేజకరమైన ఒక మహదానుభూతి మధ్యలో భగ్నమయినట్లయింది.

విషాదపూరితమైన గోపీచంద్ అశేషమిత్రమండలి ఆయన కృషిని పదిలపరచాలని సంకల్పించింది. ఈసంకలనం ఆ సంకల్పఫలితం. గోపీచంద్ మధురస్మృతికి ఆయన మిత్రబృందం ప్రేమతో, కృతజ్ఞతతో అందిస్తున్న నీరాజన మిది. అక్షరరూపం ధరించిన అశ్రుతర్పణ మిది.

—ఆవుల సాంబశివరావు

# సంస్మరణ

అనేక విజయాలు సాధించి, మరెంతో ప్రతిభను వెలార్చనుండి నడి వయసులోనే హఠాన్మరణము నొందిన శ్రీ గోపీచంద్ వ్యక్తిత్వము, రచనలపై ఒక సంస్మరణ సంచికను ప్రచురిస్తున్నందుకు నాకెంతో సంతోషంగా వుంది.

శ్రీ గోపీచంద్ అనేకరంగాల్లో కృషిచేసి ప్రతి రంగం లోను అనేకమంది మిత్రులను, అభిమానులను సృష్టించుకుని వెళ్ళిపోయారు. తమ స్నేహార్ద్ర ప్రవర్తనతో, సారస్వత సృష్టితో విస్తార మిత్ర కోటికి ఆత్మీయులయ్యారు.

సాంస్కృతి కాంశాలలో ఒక నూతనాసక్తిని ప్రేరే పించడానికి బహుధా కృషిచేసి, మనలను వీడిపోయిన ఆ మిత్రుని స్మరించి, గౌరవించుదాం.

ఈ స్మారక సంచిక ఆశయ లక్ష్యాలు జయప్రదం అగుగాక !

డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి



అమరజీవి త్రిపురనేని గోపీచంద్

# జీవితచరిత్ర

శ్రీ త్రిపురనేని సుబ్బారావు

ఆంధ్ర దేశంలో త్రిపురనేనివారు కీర్తి ప్రతిష్ఠల నందినవారు. పండిత ప్రకాండులు, గాయకులు, కవులు, గణిత శాస్త్రజ్ఞులు, పౌరాణికులు, న్యాయవాదులు, వైద్యశాస్త్ర నిపుణులు ఈ వంశంలో జన్మించారు. కొందరు శివాలయాలను ప్రతిష్ఠించారు. అగ్రహారాలను దానం చేశారు, తటాకాలనూ, ఉద్యానాలనూ ఏర్పాటు చేశారు. ఈ వంశీకులు కృష్ణా జిల్లాలో అంగలూరు, గుంటూరు జిల్లాలో కూచిపూడి, తాడికొండ గ్రామాలలో ఉన్నారు. వీరందరూ 'పువ్వాడ' గోత్రీకులు.

మా వంశం యొక్క పుట్టు పూర్వోత్తరాలను గురించి నాకు అట్టే తెలియదు. అందుచేత తెలుసుకోవాలనే కుతూహలంతో ఒకసారి సుప్రసిద్ధ చరిత్రకారులు శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మ గారిని నేను హైదరాబాదులో కలుసుకొన్నాను. కుశల ప్రశ్నల అనంతరం శర్మగారితో ''ఏమండీ ! మా వంశం యొక్క పుట్టు పూర్వోత్తరాలను గురించి తెలుసుకోవాలనే కోరిక కలిగింది'' అన్నాను.

అడిగినదే తడవుగా వారు ''మీ వంశానికి మూల పురుషుడు కాకతీయ త్రిపురనాయకుడు. అతని పేరు శంభుడు. అతడు ప్రతాపరుద్రుని కొలువులోని ముఖ్య సేనాపతులలో ఒకడు. అతడు ఆంధ్రదేశ పరిరక్షణ కొరకు ఢిల్లీ సుల్తానుల నెదిరించి పోరిన మహావీరుడు. మీది కదన రంగంలో కత్తులు దూసిన సైనిక వంశం'' అన్నారు.

త్రిపుర + రేడు అనగా మూడు పురములకు రాజు. 'రేడు' క్రమేణా 'నేడు'గా మారి, దాని ద్వితీయా విభక్త్యంత రూపమే 'నేని' అయింది.

అప్పటినుండీ ప్రసిద్ధులైన పూర్వీకుల పేరునుబట్టి ఏర్పడ్డ మా ఇంటిపేరులోని విశిష్టత నాకు బోధపడింది.

ఇట్టి మహత్తర ప్రాచీన వైభవం, ఆధునిక ప్రశస్తిగల కమ్మ కులంలోని ఒక వంశం మా త్రిపురనేని వంశం.

ఈ వంశానికి వన్నె తెచ్చిన ఘనులు శ్రీ త్రిపురనేని గోపాలయ్యగారు. వీరిది అంగలూరు. ఈ గోపాలయ్య గారికి నలుగురు కొడుకులూ, ముగ్గురు కూతుళ్ళూ జన్మించారు. మూడో కొడుకు చలమయ్య గారు; రామమాంబ వీరి భార్య.

చలమయ్యగారు ఆజానుబాహువు. తలపాగా, పొన్నుకర్ర, కిర్రు చెప్పులూ ధరించి ధర్మమూర్తిలా కనిపిస్తుండేవారు. సజ్జనులకు వారెంత ఆప్తులో, దుర్జనులకు అంత దుర్నిరీక్ష్యంగా వుండేవారు. ఒకసారి అభయ మివ్వడం జరిగితే దానికి తిరుగంటూ వుండేదికాదు. రౌద్ర, కరుణ రసాలు సమపాళ్ళలో వారిలో చిప్పిలు తుండేవి. అన్యాయ మెదురైనప్పుడు రౌద్రమూర్తులైతే, ఆర్తులు కనిపించినప్పుడు కరుణా సముద్రు లయ్యేవారు.

ఇక, రామమాంబగారు శాంత స్వభావానికి ప్రతీక. కోపమంటే ఏమిటో ఆమెకు తెలియదు. శత్రువులనైనా కన్న బిడ్డలవలె ఆదరించడం ఆమెకు వెన్నతో బెట్టిన విద్య. విసుగూ—విరామమూ లేకుండా అతిథి సత్కారాలు చేస్తూ వుండేవారు.

ఈ దంపతులకు ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె కలిగారు. వీరి మొదటి కుమారుడు గోపాలకృష్ణయ్య గారు. వీరు కమ్మని కవిత్వ మల్లేవారు. రెండోవారు నరసయ్యగారు. అనేక సంవత్సరాలపాటు గురుకులవాసంచేసి, సంస్కృతాంధ్ర భాషలలో అద్వితీయమైన పాండిత్యాన్ని గడించారు. మూడోవారు శ్రీరాములుగారు. సాధు సజ్జన సంఘ సాంగత్యశీలురు, మంచి వ్యవహర్త. నాలుగో కొడుకు సుబ్రహ్మణ్యం. ఈయన 'శాలివాహన విజయము' అనే నాటకం వ్రాశారు. కడగొట్టుబిడ్డ రామస్వామిగారు. కూతురు సీతారత్నం విదుషీమణి.

ఈ విధంగా రామస్వామిచౌదరి గారి కుటుంబం సంగీత సాహిత్యాదులలోనూ, శాస్త్రవ్యవహారాదులలోనూ గణుతి కెక్కింది. రామస్వామిగారిలో తమ పూర్వీకుల ప్రతిభలన్నీ పుంజీవించాయి వారు జన్మించేనాటికి (క్రీ॥శ॥ 1886 సం॥) మన దేశం ఒకవంక—పరదేశీయుల పాలనలోనూ, మరోవంక—మౌఢ్యాంధకారంలోనూ మునిగివుంది. ఇతర జాతుల మీద అగ్రజాతుల నిరంకుశత్వం నిరాఘాటంగా సాగిపోతూవుంది. మూఢనమ్మకాలంటే రామస్వామి గారికి మొదటినుండి గిట్టేవికావు. హేతుబద్ధంకాని వాటిని ఆయన బాల్యంనుండీ విశ్వసించేవారు కాదు. 1898 సం॥ లో రామస్వామిగారికి వివాహ మయింది. భార్యపేరు పున్నమాంబగారు. వీరి దాంపత్యజీవితం ఆదర్శవంతమయింది. వీరికి 1910 సం॥ సెప్టెంబరు 8 వ తేదీ (వినాయకచవితి)న ఒక కుమారుడు జన్మించాడు. వీరే ప్రఖ్యాత కథకులూ, నవలారచయిత శ్రీ గోపీచంద్. తరువాత ఐదుసంవత్సరాలకు ఒక కూతురు కలిగింది. ఈమెపేరు సరోజిని. ఈమెను శ్రీ కానుమిల్లి సుబ్బారావుగారి కిచ్చి వివాహం చేశారు. శ్రీ సుబ్బారావు గారు కొంతకాలం మనరాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిగా పనిచేశారు. ప్రస్తుతం వరంగలు జిల్లా కలక్టరుగా వున్నారు.

ప్రథమ ప్రపంచ మహాసంగ్రామం జరుగుతున్న రోజుల్లో ఉన్నతవిద్యాభ్యాసంకోసం రామస్వామిగారు ఇంగ్లండు వెళ్ళారు. 1917 లో బారిష్టరు పట్టాపుచ్చుకొని స్వదేశానికి తిరిగివచ్చారు. న్యాయవాద వృత్తిని స్వీకరించారు. న్యాయవాదిగా సంఘంలోని అవకతవకలను గమనించారు. న్యాయం వైపు నిలబడటం తమ ధర్మంగా భావించారు. ఫలితంగా సంఘసేవ, సారస్వతసేవ, బ్రాహ్మణేతర ఉద్యమం మొదలుపెట్టారు. కమ్మకుల చరిత్రను వ్రాయ సంకల్పించారు. టంగుటూరులో 1922 సం॥ లో జరిగిన కమ్మమహాజన సభలకు అధ్యక్షత వహించారు. అధ్యక్షపీఠం నుంచి వారు చేసిన ఉపన్యాసం కమ్మకులంలో జాగృతిని కలిగించింది.

రామస్వామి చౌదరిగారు అంగలూరును వదలి, తెనాలి పట్టణం చేరుకొన్నారు. అందులకు కారకులు శ్రీ పాములపాటి వెంకట కృష్ణయ్యగారు. వెంకట కృష్ణయ్యగారికి 'రైతు' పత్రికను తెనాలినుండి ప్రచురించాలనే ఉద్దేశం కలిగింది. రామస్వామి గారిని సంపాదకులుగా ఎన్నుకొన్నారు. కాని అనుకొన్నట్లుగా ఆ పత్రిక వెలువడలేదు. కాని రామస్వామి చౌదరిగారు మాత్రం తెనాలిలోనే స్థిరపడిపోయారు. తెనాలి పురపాలక సంఘానికి రెండుసార్లు (1925_30, 1934_38) ఛైర్మన్‌గా వుండి వ్యవహార దక్షతతో ఆ పదవిని నిర్వహించారు. వారి ఇల్లొక 'సూతాశ్రమం'. సాహిత్య వాదోప వాదాలతోనూ, సంస్కర్తల పద ధ్వనులతోనూ ఎప్పుడూ ప్రతిధ్వనిస్తూ వుండేది. నాస్తికులు, ఆస్తికులు, రాజకీయ వేత్తలు, లౌకిక వ్యవహర్తలు, పండితులు, పామరులు, కవులు, గాయకులు, జ్యోతిష్కులు మరెందరో ప్రముఖ వ్యక్తులు ఎప్పుడో ఒకప్పుడు 'సూతాశ్రమం'లో అడుగు పెట్టకుండా వుండేవారు కాదు. ఆ తియ్యని నీళ్ళు ఒక్క పుడిసెడైనా త్రాగకుండా వుండేవారు కాదు. వీరందరితో మా రామస్వామి చౌదరిగారు వాదోప వాదాలు సాగిస్తూ వుండేవారు. గోపీచంద్ గారు పెరిగి పెద్దవారయ్యాక ఈయనను కూడా ఆ చర్చల్లోకి దింపుతూ వుండేవారు. రామస్వామిగారు 'గోపీ' అంటూ కొడుకును పిలిచి, 'వారేదో అంటున్నారు చూడు' అనేవారు ఎదుట కూర్చున్న పెద్ద మనిషిని చూపించి.

వెంటనే గోపీచంద్ గారు రంగంలోకి దూకేవారు. వారిద్దరూ వాదించుకొంటూవుంటే, చౌదరిగారు ముసిముసి నవ్వులు నవ్వుతూ వుండేవారు.

చౌదరిగారు అనునిత్యం సాహిత్య గోష్ఠులలో మునిగి తేలుతూవుంటే పున్నమాంబగారు అతిథులకు సంతర్పణలు చేస్తూవుండేవారు. అలాంటి పున్నమాంబ గారు హఠాత్తుగా కాలధర్మం చెందారు.

ఆ తరువాత 1920 సం॥ లో రామస్వామిగారు ద్వితీయ వివాహం చేసుకొన్నారు. ఈమె పేరు చంద్రావతి. వీరికొక కుమారుడు జన్మించాడు. ఈయన పేరు శ్రీ గోకుల్‌చంద్. ఈయన ప్రస్తుతం విజయవాడలో వాణిజ్యరంగంలో వున్నారు.

1932 సం॥ లో రెండోభార్య కూడా స్వర్గస్తురాలయింది. రామస్వామి చౌదరిగారు 1933 సం॥ లో మూడో పెళ్ళి చేసుకొన్నారు. ఈమెపేరు అన్నపూర్ణమ్మ. వీరికి ఒక కూతురు పుట్టింది. పేరు చౌదరాణి. ప్రఖ్యాత కథకులు శ్రీ అట్లూరి పిచ్చేశ్వర రావుగారు ఈమెను వివాహం చేసుకొన్నారు,

రామస్వామి చౌదరిగారు బారిష్టరు మాత్రమే కాదు శతావధానులు, బహు గ్రంథ కర్తలు—"సూతపురాణం", "కురుక్షేత్ర సంగ్రామం", "ఖూనీ" "శంబుక వధ", "వివాహ విధి", "కుప్పుసామి

శ్రీ త్రిపురనేని సుబ్బారావు

శతకం'', ''ధూర్త మానవా'', ''సూతాశ్రమ గీతాలు'', ''భగవద్గీత'' వీరి ముద్రిత గ్రంథాలు. వీరి భాషా సేవకు అలరిన ఆంధ్రమహాసభ బెజవాడలో 1929 సం॥ లో ''కవిరాజు'' బిరుదు నిచ్చి తననుతానే గౌరవించుకొంది. శ్రీ బెజవాడ రామచంద్రారెడ్డిగారి ఆధిపత్యంలో, చల్లపల్లి సంస్థానాధీశుల సమక్షంలో, చిత్రభాను వైశాఖంలో చౌదరిగారికి గుడివాడలో గజారోహణోత్సవంతో ఘనంగా సన్మానం జరిగింది. వివిధ ప్రాంతాలనుండి అనేక మంది ప్రముఖులు, వేలాది స్థానిక ప్రజలు ఆ సన్మానంలో పాల్గొని 'కవిరాజు'కు బ్రహ్మరథం పట్టారు. సన్మాన సంచికలో రమారమి వందమంది పండిత కవులు, ప్రసిద్ధ రచయితలు చౌదరిగారి సాహిత్య, సాంఘిక సేవలను ఉగ్గడించారు. 1943 సం॥ జనవరి 16 వ తేదీ రాత్రి గం॥ 1-30 ని. లకు వారు కీర్తిశేషులయ్యారు.

కవిరాజు బ్రతికివుండగా వారి పేరు వింటే కవితాలోకం గజగజలాడింది. పాండిత్య ప్రకర్షలో వారిని ఎదిరించిన పండితుడు ఒక్కడూ లేడు. శ్రీ చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు 'కవిరాజు'ను తన శిష్యుడని చెప్పుకోడానికి ధైర్యం చాలడంలేదన్నారు. అలాంటి ధీరత్వంగల తెలుగురాజు త్రిపురనేని కవిరాజు.

తరతరాలనుండీ సంప్రదాయసిద్ధంగావున్న విద్వత్ కుటుంబంలో శ్రీ గోపీచంద్‌గారు జన్మించారు. వీరి బాల్యం అంగలూరు, చౌటపల్లి, రామాపురం గ్రామాలలో గడిచిపోయింది. విద్యార్థి దశలోనే గోపీచంద్ గారిలో స్వతస్సిద్ధంగా వున్న తేజోవికాసం, కుశాగ్ర బుద్ధి, ధారణాశక్తి ఉపాధ్యాయులను ఆశ్చర్య చకితులను చేశాయి. సమాజంలో గతానుగతికంగావున్న అర్థంలేని ఆచారాలనూ, అంధవిశ్వాసాలనూ నిశితంగా విమర్శిస్తుండే వారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బి.ఏ. పరీక్షలో ఉత్తీర్ణు లయ్యారు. షేక్సుపియర్, ఇబ్సన్, బెర్నార్డ్ షా, ఆస్కార్ వైల్డ్ మొదలయిన ఆంగ్లనాటకకర్తల రచనలను సాంగోపాంగంగా చదివారు. తరువాత న్యాయశాస్త్రం చదవాలనే వాంఛ కలిగింది. మద్రాసు విశ్వవిద్యాలయంలో న్యాయవాద పట్టాపుచ్చుకున్నారు. కొద్దికాలం ప్రాక్టీసు పెట్టారు. న్యాయవాద వృత్తిలో డబ్బుకోసం న్యాయాన్యాయాలను తలక్రిందులు చేయవలసి వుంటుంది. అందుచేత ఆ వృత్తి వారికి రుచించలేదు. వెంటనే ఆ వృత్తికి స్వస్తి చెప్పారు. వారు ఇలాచేయడం వల్లనే ఆంధ్ర సరస్వతికి ఎనలేని మేలు చేకూర్చగలిగారు.

1932 సం॥ మే 25 వ తేదిన శ్రీ కొమ్మానారయ్యగారి ఏకైక పుత్రిక శకుంతలా దేవిగారిని వివాహం చేసుకొన్నారు. ఈమె అసాధారణ ఉదాత్తగల సాధ్వీమణి.

గోపీచంద్‌గారు సాహితీరంగంలో అడుగుపెట్టే నాటికి వాస్తవికవాదం ముమ్మరంగా ప్రచారంలో వుంది. కళ్ళకు కనిపించినదాన్ని నమ్మడం, లేనిదాన్ని కాదనడం-ఇదీ ధోరణి. 'దేవుడువుంటే చూపించు' అన్నవరకూ పోయింది ఆ అతివాస్తవిక వాదం. దేవునిపేరిట దారుణమైన దోపిడీజరిగే రోజుల్లో, ఆస్తిక సమాజంలో పుట్టిన శ్రీ గోపీచంద్ గారు నాస్తిక వాతావరణంలో పెరిగి పెద్దవారయ్యారు.

నాటిసంఘం అల్లకల్లోలంగా వున్నదనీ అన్యాయం, అధర్మం, అవినీతి, అసమానతలు పెచ్చుపెరిగిపోతున్నాయనీ గోపీచంద్‌గారు గమనించారు. వీటిని సమూలంగా నిర్మూలించడానికి సాహితీరంగం అనువైనదిగా భావించారు. సామాన్యప్రజను ప్రబుద్ధం చేయడానికిగాను వారికి అందుబాటులో వుండే కథ, నవల, నాటకం, వ్యాసం స్వీకరించి, తమ అభిప్రాయాలను ప్రచారం చేయాలని సంకల్పించారు.

ఆనాడు భావకవితా మేఘాలు సారస్వతాకాశాన్ని దట్టంగా కమ్ముకొన్నాయి. అక్షరజ్ఞానం వున్న ప్రతి వారికీ సాహిత్యమంటే భావకవిత్వమే నన్న భ్రమ కూడా వుండేది. ఆ భ్రమను ఎంత త్వరగా వదిలించు కొంటే అంత మంచిదనే నిశ్చయానికొచ్చారు. విశాల మైన సాహితీ రంగంలో భావకవిత్వం ఒక భాగమే కాని, అదే సంపూర్ణ సాహిత్యం కాదని వాదిస్తూ వారు ప్రభంజనునివలె విజృంభించారు. శరపరంపరగా అనేక వ్యాసాలు వ్రాసి ఆ మేఘాలను చెల్లాచెదరు చేశారు.

ఆ రోజుల్లోనే వారు మార్క్సిజాన్ని బాగా అధ్య యనం చేశారు. రష్యా విప్లవం అప్పటికే దేశదేశా ల్లోని యువజనుల హృదయాలలో ఆశాజ్యోతులను వెలిగిస్తూవుంది. పీడితవర్గాలకు ఏకైక ప్రతినిధిగా రష్యా నిలబడింది. రష్యన్ రాజకీయ ప్రభావం గోపీచంద్‌గారి రచనల్లోకి ప్రసరించింది. రాజకీయా లనే ఇతివృత్తంగా తీసుకొని ''బీదవాళ్ళంతా ఒకటి'', ''దేశం ఏమయ్యేట్టు'', ''గోడమీది మూడోవాడు'', ''ఇలా జరిగేను'', ''పిరికివాడు'' మొదలైన ఆణి ముత్యాల్లాంటి కథలు వ్రాశారు. ఆ రోజుల్లోనే ''మార్క్సిజమంటే ఏమిటి?'' ''పట్టాభిగారి సోష లిజం'' ''సోషలిష్టు ఉద్యమచరిత్ర''వంటి రాజకీయ గ్రంథాలు కూడా రచించారు.

కొంత కాలానికి మార్క్సిజంలోని లోటుపాట్లు గోపీచంద్‌గారికి తెలిసివచ్చాయి. వాటికి సమాధానం యం. యన్. రాయ్ గారి 'రాడికల్ డెమోక్రటిక్ పార్టీ'లో కనిపించింది. రాయ్‌గారు రచించిన గ్రంథా లన్నీ క్షుణ్ణంగా చదివారు. ఆంధ్రా రాడికల్ డెమో క్రటిక్ పార్టీ కార్యదర్శిగా వారు కొంతకాలం పని చేశారు. ఆంధ్రదేశంలో 'నవ్యమానవవాదం' వ్యాపింప చేసిన వారిలో గోపీచంద్‌గారు ప్రథమ గణ్యులు. వారు ఎంతో మంది యువకులను హేతువాదులుగా తయారు చేశారు. వారు ఏ రాజకీయ పార్టీతోనూ పూర్తిగా ఏకీభవించలేకపోయారు. జీవిత ప్రవాహం రాజకీయ పార్టీలనూ, సిద్ధాంతాలనూ అధిగమించక తప్పదని వారి విశ్వాసం. అందుచేత పార్టీరాజకీయాల నుంచి పూర్తిగా విరమించుకొన్నారు. వారి జీవితం సంపూర్తిగా సాహిత్య సేవకే అంకితం చేయా లను కొన్నారు.

విశ్వకథాసాహిత్యంలో విశిష్టస్థానం సంపాదిం చిన చెకోవ్, చేట్సు, టాల్‌స్టాయ్, సారోయాన్, పుష్కిన్, గోర్కీ, మామ్, మపాసా, ఓ హెన్రీ, పెరల్‌బక్ మొదలయిన ప్రముఖ రచయితల కథలను చదివి బాగా ఆకళింపు జేసుకొన్నారు. నూతన దృష్టితో కథాసృష్టి చేశారు. రమారమిగా మూడు వందల కథలు వ్రాశారు. ''భార్యల్లోనే వుంది'', ''దేశం ఏమయ్యేట్టు'', ''గీతాపారాయణం'', ''తండ్రులు – కొడుకులు'', ''సరే కానివ్వండి'' ''ధర్మాసుపత్రి'', ''దేవుని జీవితం'', ''ఇరుగు – పొరుగు'', ''కూపస్తమాండూక్యం'', ''పాతపగలూ– కొత్తవగలూ'', సంపుటాలుగా వెలువడ్డాయి. ఏది వ్రాసినా కొన్ని వేల ప్రతులు అమ్ముడుపోవలసిందే. ఏ కొత్త పుస్తకం ప్రచురించబడినా, వాదోపవాదాలు చెలరేగవలసిందే. ఆయన సృష్టించిన పాత్రల 'ఒరిజినల్సు' కోసం విజ్ఞులు, విమర్శకులు తమ పరిచ యస్థులలో వెతకడం ప్రారంభించేవారు. తమకు తాముగా కొన్ని నిర్ణయాలు చేసుకొనేవారు.

గోపీచంద్‌గారు కొన్ని కథలను సంఘటనలకు ప్రాధాన్యతనిచ్చి వ్రాస్తే, మరి కొన్నింటిని మనస్త త్వవాతావరణం ప్రధానంగా రూపొందించారు. అవసర మనుకొంటే కథకు 'క్లయిమాక్స్' పెట్టడం జరిగేది. '' నేను కథ ఎలా వ్రాస్తాను ? '' అన్న ప్రశ్నకు

శ్రీ త్రిపురనేని సుబ్బారావు

గోపీచంద్‌గారు "నేను కథ వ్రాయడం మానసిక చర్య గా మనస్సులో వ్రాసుకొని కాగితం మీద పెడతాను. నా కథలు నేను ఇంటిదగ్గిర పడుకొని చూరువైపుకు చూస్తూ వ్రాస్తాను. వీధుల్లో నడుస్తూ, లోపలికి చూచు కొని వ్రాస్తాను. పది మందితో మాట్లాడుతూ వ్రాస్తాను. కాని, అన్నిట్లోకీ నాకు నడుస్తూ వ్రాయ డమే సరదా" అన్నారు.

ఆయన సమాజ శ్రేయస్సుకై సాహితీ కృషి సాగించిన మహా రచయిత. కలం పట్టుకొంటే జీవితంలోని క్లిష్ట సమస్యలను గురించే వ్రాసేవారు. ఈనాడు మానవులను కలవరపెడుతున్న అనేక సమ స్యలను తను రచనలకు ఇతివృత్తంగా తీసుకొనే వారు. వ్రాసింది హృదయానికి హత్తుకొనేటట్లు వ్రాయడమేగాక అతి సరళంగానూ, నిర్దుష్టంగానూ వ్రాసేవారు. ఎన్నో రకాల మనస్తత్వాలను అద్భు తంగా చిత్రించేవారు. ప్రతి సంఘటననూ నిశితంగా పరిశీలించేవారు. ఎంతటి జటిల సమస్యనైనా ప్రతిభా వంతంగా తమ కథలలో పరిష్కరించేవారు. భావ స్పష్టీకరణలోనూ, శైలీ సారళ్యంలోనూ ఆయనకు ఆయనే సాటి. సరళంగానూ, సున్నితంగానూ విష యాలను అవగాహనకు వదలడమూ, ఆలోచనలను రేకెత్తించి, పరితల జిజ్ఞాసను పెంపొందించడమూ గోపీచంద్‌గారి ప్రత్యేకత.

వీరి కథల్లో హేతువాదం, సమతాధర్మం, సత్యా న్వేషణా కనిపిస్తాయి. ఇంతేకాదు-చెకోవ్‌లోని కథా గంభీర గమనం, ఠాగూర్‌లోని కథా సంవిధానం, గోర్కీలోని విప్లవ భావాలు, టాల్‌స్టాయ్ కథల్లోని మానవతా దృష్టి, మపాసాలోని సున్నిత హాస్యం, ప్రేమ్‌చంద్‌లో పెల్లుబికే ప్రేమానురాగాలు గోపీచంద్ గారి కథల్లో గోచరిస్తాయ్. అందుచేత గోపీచంద్‌గారి రచనా వైదుష్యం ఇలా ప్రశంసించబడింది:

"Gopichand is a distinguished writer of remarkable short stories. His stories strike a happy balance between their form and content. Being a rationalist, he refuses to be lead astray by popular fads and shibboleths. His insight into human nature, sense of form and humanistic zeal for the balanced development of the individual' render his stories memorable. Historical vein, sparkling wit and command over the living idiom have set a stamp of individuality upon his style. He excells in very short pieces as well as longer ones, displaying great gifts of analysis and narration."

*(The short story in Telugu–Deccan Chronicle July 29th, 1962.)*

గోపీచంద్‌గారు గొప్పకథకులుగా ఖ్యాతిగడిం చారు. అప్పుడప్పుడే దక్షిణ భారతావనిలో చలన చిత్ర పరిశ్రమ వృద్ధిలోకి వస్తూవుంది. వివిధ రాష్ట్రా లకు సినిమా పరిశ్రమ పరంగా మద్రాసు కూడలి. తెలుగుసినిమా పరిశ్రమలోకి అభ్యుదయ భావాలు కలిగిన యువకులు అడుగుపెడుతున్నారు. ఇదే సమయమని గ్రహించిన గోపీచంద్‌గారు శ్రీ గూడ వల్లి రామబ్రహ్మంగారి ప్రోత్సాహంతో సినిమా పరిశ్రమలో ప్రవేశించారు. 1949 సం॥ నుండి 1953 సెప్టెంబరు వరకూ గోపీచంద్ జీవితం మద్రాసులో గడిచిపోయింది. "రైతుబిడ్డ" "గృహప్రవేశం" చిత్రాలకు భావగర్భితమైన సంభాషణలు వ్రాశారు. 'రైతుబిడ్డ'కు సహాయ దర్శకుడుగా కూడా పనిచేశారు. "లక్ష్మమ్మ" "పేరంటాలు" "ప్రియురాలు" మొదలైన చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఇటీవల వెలు వడిన "కలిమిలేములు" చిత్రంలో గోపీచంద్‌గారు తమ

కలంబలం చూపారు. ''చదువుకున్నఅమ్మాయిలు'' చిత్రానికి కూడా వారు మనోరంజకమైన సంభాషణలు వ్రాశారు. హాస్యరసపోషణలోనూ, భావోద్రేక సన్నివేశముల నిర్వహణలోనూ ఆయన సిద్ధహస్తులు. తెలుగుతనం తొణికిసలాడే అత్యుత్తమ చిత్రాలలో ''లక్షమ్మ'' చిత్రం ఒకటి.

గూడవల్లి రామబ్రహ్మంగారు 'పల్నాటియుద్ధం' చిత్రంగా తీయదలచినప్పుడు విషయసేకరణ బాధ్యతను గోపీచంద్‌గారికి అప్పగించారు. ఆ పనిమీద వారు కొన్ని మాసాలు పల్నాడంతా పర్యటించారు. ఎందరో వృద్ధులను కలుసుకొని, అనూచానంగా వస్తూవున్న అనేక కథలను సేకరించారు. వేయి పుటల గ్రంథం తయారుచేశారు. అయితే ఆ చిత్రాన్ని అనుకొన్న సమయానికి రామబ్రహ్మంగారు ప్రారంభించక పోవడమూ, వారు ప్రారంభించే నాటికి గోపీచంద్‌గారు అక్కడ లేకపోవడమూ సంభవించింది. పల్నాటివీరచరిత్రను గురించి కొన్ని వ్యాసాలు 'ప్రజామిత్ర' పత్రికలో ప్రకటించారు. అదే ఇతివృత్తంగా తీసుకొని ''మాంచాల'' నాటకం వ్రాశారు. ఈ నాటకం ఆకాశవాణి మద్రాసు కేంద్రం నుంచి ప్రసారమై, అనేక మంది ప్రముఖుల ప్రశంసలను పొందింది.

వారు మద్రాసులో వున్నంతకాలం గ్రంథరచన ఆట్టేసాగలేదు. ఎక్కువకాలం సినిమాలతోనే గడిచిపోయేది. అయినా ప్రతిరోజూ ఉదయం ఎన్ని పనులున్నా ఒక గంటసేపు గ్రంథరచన కొనసాగిస్తూనే వుండేవారు. ఏ పరిస్థితుల్లోనూ మనస్సుకి ఆహ్లాదాన్ని కూర్చే రచనావ్యాసంగాన్ని విడువరాదనేది వారి అభిమతం.

వారు మద్రాసులో వున్నప్పుడు శ్రీ అచంట జానకిరామ్‌గారితో కలిసి అరవిందాశ్రమం వెళ్ళడం జరిగింది. ఇది వారిజీవితంలో మరొక ముఖ్యఘట్టం. అరవిందుని దర్శనం గోపీచంద్‌గారి జీవితపథాన్ని పూర్తిగామార్చి వేసింది. ఈ మార్పువల్ల సినిమావాతావరణంలో వారువుండలేకపోయారు.

ఇదేసమయానికి 40 సంవత్సరాలనుంచి ప్రత్యేక రాష్ట్ర నిర్మాణంకోసం ఆంధ్రులుచేసిన అవిరళ కృషి ఫలించింది. పొట్టి శ్రీరాములుగారి పూర్ణాహుతితో 1-10-1953న ఆంధ్ర రాష్ట్రం అవతరించింది. మద్రాసునుండి ఆంధ్రులందరూ మూటాముల్లె కట్టుకొని, ఆంధ్రరాష్ట్ర రాజధాని అయిన కర్నూలు తరలి వచ్చారు. నూతనంగా ఏర్పడ్డ ఆంధ్రప్రభుత్వం గోపీచంద్‌గారిని సమాచారశాఖడైరెక్టరు పదవికి ఆహ్వానించింది. ఆ ఆహ్వానాన్ని వారు అంగీకరించారు. కొత్తగా ఏర్పడ్డ రాష్ట్ర ప్రభుత్వానికి సహాయపడటం తమవిధ్యుక్త ధర్మంగా భావించారు. సినిమారంగాన్ని పూర్తిగా వదలివేశారు. మద్రాసు నుంచి కర్నూలు వచ్చారు, ప్రభుత్వవిధి నిర్వహణలో మునిగిపోయారు. వారి అసాధారణ ప్రతిభాసంపత్తి, అకుంఠిత కార్యదీక్ష, పరిపాలనా సామర్థ్యం అప్పటి గవర్నరు శ్రీ సి.యం. త్రివేదిగారిని ముగ్ధుణిచేశాయి. వారిప్రశంసలను కూడాపొందాయి. ప్రభుత్వోద్యోగంలోవున్నా వారికి డాబూ-దర్పం వుండేవికావు.

1955 సం॥ ఆంధ్రరాష్ట్ర అవతరణోత్సవంలో గవర్నరు ఆంగ్లప్రసంగానికి గోపీచంద్‌గారు తెనుగు అనువాదకులుగా వ్యవహరించారు. ఈ ఉత్సవాలకు మంత్రులు అధికార, అనధికార ప్రముఖులు, అసంఖ్యాకంగా ప్రజలు హాజరయ్యారు. కొండారెడ్డి బురుజువద్దనున్న పోలీసు ఇన్‌స్పెక్టర్ జనరల్ కార్యాలయం ప్రజలతో క్రిక్కిరిసి పోయింది. గవర్నరు ఆంగ్లప్రసంగాన్ని గోపీచంద్‌గారు ఝరీసదృశమైన ఆవేగంతో భాషాంతరీకరణము చేసుకొని పోతున్నారు.

శ్రీ త్రిపురనేని సుబ్బారావు

ఇసుక వేసినా రాలని జనసందోహం ఎంతోనిశ్శబ్దంగా వుంది. ఇలాంటి ఉత్సవ సందర్భాలలో ఇంతటి ప్రశాంతతను గవర్నరు అంతకుముందు ఎక్కడా తిలకించలేదు. వారి పర్యటనల్లో కొన్ని చోట్ల వారొకటి ఉపన్యసిస్తూవుంటే, అనువాదకులు మరోటిచెప్పిన సంఘటనలు, గందర గోళం జరిగిన సందర్భాలు లేక పోలేదు. కాని గోపీచంద్‌గారి అనువాదం శ్రోతలను మంత్రముగ్ధులను చేసింది. ఈవిషయాన్ని గమనించిన గవర్నర్ తమ ఉపన్యాసం ముగించగానే గోపీచంద్ గారి వంకకుతిరిగి ఒక నమస్కారబాణం సంధించారు. ఇది వారి ప్రతిభా సామర్థ్యాలకు ఒక నిదర్శనం మాత్రమే.

కర్నూలులో వారి జీవితం సాఫీగా గడిచిపోయింది. 1–11–56 న ఆంధ్రుల చిరకాలవాంఛ అయిన ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డ తరువాత కూడా కొంతకాలంపాటు సమాచార, పౌరసంబంధశాఖకు 'సంయుక్త నిమంత్రణాధికారి' (Joint Director) గా పని చేశారు. అనివార్యమైన కారణాలవల్ల ఆ పదవిని కూడా వారు పరిత్యజించవలసి వచ్చింది.

ఆ తరువాత కొద్దిరోజుల్లోనే ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంలో చేరి 'గ్రామస్థుల కార్యక్రమాల ప్రయోక్త' (Rural Programmes' Producer)గా చివరి క్షణంవరకూ పని చేశారు. అస్వస్థతగా వున్నప్పటికీ ఆకాశవాణి కేంద్రానికి వెళ్ళి జాతీయ రక్షణ నిధికి రు. 116/– సమర్పించిన అకలంక దేశభక్తుడాయన.

ఆకాశవాణి గ్రామస్థుల కార్యక్రమాల నిర్వహణను స్వీకరించిన తరువాత వాటి రూపురేఖలలో మౌలికమైన మార్పులనుతెచ్చారు. గ్రామీణ ప్రజలకు నిజంగా అవసరమైన వేమిటో శ్రీ గోపీచంద్‌గారికి బాగా తెలుసు. కారణం వారి బాల్యమంతా పల్లెలలో గడిచిపోవడమే. వారి 'ఉభయకుశలోపరి'లో మన పల్లెటూళ్ళ యదార్థచరిత్ర కళ్ళకుకట్టినట్లు కనిపిస్తుంది. గ్రామీణ జీవితంలోని మధురసన్నివేశాలనూ, వారి ఆచారవ్యవహారాలనూ, జీవిత విధానాలనూ ఆధారం చేసుకొని వారెన్నో ప్రసంగాలను ప్రసారంచేశారు. వారు వివిధ గ్రామాల అభ్యుదయ కార్యక్రమాలను రికార్డు చేసుకొనివచ్చి ప్రసారం చేసిన సందర్భాలు చాలావున్నాయి. కాళిదాసు రచనల నన్నింటినీ రేడియో రూపకాలుగా వ్రాశారు. వారి "లయతప్పిన మనుషులు", "చీకటి కోణాలు", "మాంచాల", "కాల ప్రవాహం", "విచిత్ర ప్రక్రియ", "అభాగిని", "తత్వమసి", "విశ్వరూప సందర్శనం", "నిలబడిన పరువు", "రోడ్డుమధ్య రాయి", "రచ్చబండ", "పేవ్‌మెంటు మీది పుస్తకం", మొదలైన నాటికలు, నాటకాలు శ్రోతల అభినందన పరంపరలను అందుకొన్నాయి. వీటన్నింటిలోనూ గోపీచంద్‌గారి ప్రత్యేకత ద్యోతకమవుతుంది.

గోపీచంద్‌గారి కథలు నన్నెంత ముగ్ధుణ్ణి చేస్తాయో, అంతకన్నా వారి నవలలు మరింతగా ముగ్ధుణ్ణి చేస్తాయి. ఎంతో గంభీరమైన విషయాన్ని గోపీచంద్‌గారు చాలా సులభమైన మాటలలో హృద్యంగమంగా పొదగగలరు. పది వాక్యాలలో ఇమిడిపోయే గల్పిక వ్రాసినా, పది పదుల పేజీలుండే పెద్ద కథ వ్రాసినా, అవి పఠితల మనస్సుమీద చెరగని ముద్రవేసి, వినూత్న భావాలను రేకెత్తిస్తాయి. అందలి శిల్పవిన్నాణం వారిని దిగ్భ్రాంతులనుచేస్తుంది. వారు ప్రయోగాత్మకమైన, ప్రయోజకమైన రచనలు చేశారు. వారి అమృత లేఖిని నుండి "అసమర్థుని జీవయాత్ర", "పరివర్తన", "మెరుపుల మరకలు", "పిల్లతెమ్మెర", "గడియపడని తలుపులు", "పండిత



గోపీచంద్ గారి తండ్రి, 'ఎందు' కని ప్రశ్నించడం మప్పిన గురువు

"కవిరాజు" త్రిపురనేని రామస్వామి చౌదరి గారు

— రేఖాచిత్రణ : శ్రీ కవుతా రామమోహన శాస్త్రి.



శ్రీ గోపీచంద్‌ను పెంచి, పోషించిన మాతృమూర్తి;
రామస్వామి చౌదరిగారి రెండవ భార్య చంద్రావతిగారు.

పరమేశ్వరశాస్త్రి వీలునామా", "ప్రేమోపహతులు", "శిథిలాలయం", "యమపాశం'', "చీకటిగదులు" (అసంపూర్తి) మొదలైన నవలలు పుంఖానుపుంఖముగా వెలువడ్డాయి. ఇవన్నీ స్వతంత్ర రచనలు; అనువాదాలు, అనుసరణలుకాదు. తెనుగు సాహిత్య క్షేత్రంలో స్వతంత్ర రచనల పంట పండించిన ఘనత గోపీచంద్‌గారికే దక్కింది. వెల్లివిరిసిన వారి రచనలలో ఆంధ్ర సాహిత్య సరస్వతి నూతన కాంతులను విరజిమ్మింది.

శ్రీ నార్ల వెంకటేశ్వరరావుగా రన్నట్లు "గోపీచంద్ రచనలన్నింటిలో-అది చిన్న కథ కానివ్వండి; పెద్ద నవల కానివ్వండి - మూలతత్వ విచారణకై ప్రయత్నం కనపడుతుంది. ఫలితమేమైనా, దీక్షగా, ధైర్యంతో ఆయన ఈ పరిశీలన చేశారు. ఇదే ఆయన రచనలకు ఒక ప్రత్యేకత కూర్చింది. ఇదే వాటికి ఒక వైశిష్ట్యాన్ని సాధించింది. జీవితం-సాహిత్యం - ఇవి శ్రీ గోపీచంద్‌కు విభిన్నరంగాలు కావు. జీవితమే ఆయనకు సాహిత్యం; సాహిత్యమే జీవితం.''

ఈ విధంగా ఆయన జీవిత సాహిత్యాలు ఒకదానికొకటి పెనవేసుకొన్నప్పటికీ, ఆయనను తత్వశాస్త్రం ఆకర్షించింది. ప్రాచ్య, పాశ్చాత్య తత్వవేత్తల గ్రంథా లనేకం అవలోకన చేశారు. అరవిందుడు, డాక్టర్ రాధాకృష్ణన్, జాన్‌డ్యూయీ, బెర్ట్రాండ్ రస్సెల్ మొదలగు పండితుల తాత్వికభావాలను ఆకళింపు జేసుకొన్నారు. వారిలో తాత్విక జిజ్ఞాస ఆనాటికానాటికీ అభివృద్ధి నొందసాగింది. ఆయన తత్వశాస్త్రాన్నిగురించి ఇలా అంటూవుండేవారు ''ఇప్పుడున్నదంతా సత్యమని మనం అనుకోకూడదు. అలాగని ఇది అసత్యంకూడా కాదు. ఇప్పుడున్నది ఇప్పటివరకే సత్యం. ఇది అర్ధ సత్యం. దీన్ని ఆధారంచేసుకొని, మనం నిత్యసత్యం కోసం తపించాలి. ఆ తపనే 'తత్వశాస్త్రం'. ఆ తపనే ఆయనను శ్రీ బెజవాడగోపాలరెడ్డి గారన్నట్లు ''వేదనాజీవి''గా మార్చివేసింది. వారు 'తత్వవేత్తలు' అనే గ్రంథం రెండుభాగాలు వ్రాశారు.

గోపీచంద్‌గారు భౌతికవాదిగా జీవితం ప్రారంభించారు. వారు క్రమానుగతంగా పరిణతిచెంది, భగవంతుని మీద పరిపూర్ణమైన విశ్వాసంతో జీవించారు. అరవిందుని దర్శనం, తత్వగ్రంథ పఠనం, జీవితం నేర్పిన పాఠాలు గోపీచంద్‌గారిని ఆధ్యాత్మికవాదిగా మార్చివేశాయి. సూక్ష్మదృష్టితో చూస్తే ఆస్తిక-నాస్తిక వాదాల ఘర్షణే వారి జీవితం.

మనం తత్వ శాస్త్రాన్ని పరిశీలిస్తే భౌతిక, ఆధ్యాత్మిక సిద్ధాంతాలు అనాది నుండీ వున్నట్లుగా కనిపిస్తుంది. ఈ రెండు వాదాలనూ సమన్వయపరచవలసిన ఆవశ్యకతను శ్రీ గోపీచంద్‌గారు గుర్తించారు. భౌతిక, ఆధ్యాత్మిక వాదాలను సమన్వయ పరుస్తూ ''పోస్టుచెయ్యని ఉత్తరాలు'' రచించారు. ఈ లేఖలు తాత్వికరంగంలో గొప్ప సంచలనాన్ని కలిగించాయి. భౌతిక, ఆధ్యాత్మిక సమన్వయ తత్వవేత్తగా ప్రపంచ తత్వవేత్తల కోవలో చేరారు.

ప్రతివ్యక్తి ఏదో ఒక్క రంగంలోనే ప్రవీణుడు కాగల డన్నది సూక్తి. కాని గోపీచంద్‌గారి వంటి బహుముఖ ప్రతిభావంతులకు మాత్రం అది వర్తించదు. వారు ఏ రంగంలో అడుగుబెట్టినా, అందులో ఉన్నత శిఖరాలను అందుకొన్న మేధావులు.

గోపీచంద్‌గారిని కలుసుకొని వారితో మాట్లాడటం - అదో అపూర్వమైన అనుభవం. ఆయన మాట కటువు, మనసు వెన్నకంటె మృదువు. వారు చక్కని సంభాషణాచతురులు. సంభాషణలో చెణుకులు విసురుతుంటే ప్రతిపక్షులు కూడా పగలబడి నవ్వేవారు. ఆయన రచనల్లో కూడా చెణుకులు మెరుపుల్లాగా మెరుస్తుంటాయి.

శ్రీ త్రిపురనేని సుబ్బారావు

ఆయన మిత్రకోటిలో అన్ని వర్గాలవారూ, అన్ని వర్ణాలవారూ వున్నారు. అందరితోనూ ఆయన అతి సన్నిహితంగా మెలుగుతూ వుండేవారు. అంతా సంఘంలోని భాగమనీ, ఏ ఒక్కరితో పరిచయం లేకపోయినా ఆమేరకు సంఘాన్ని అర్థంచేసుకో లేమని వా రంటూవుండేవారు. సమగ్రమైన సాంఘిక దృష్టిలేని రచయిత పాఠకులకు న్యాయం కలుగజేయ లేడని వారి దృఢ విశ్వాసం.

గోపీచంద్‌గారు 'సజీవ గ్రంథాలయ' మన్నప్పటికీ వారిని సమగ్రంగా చిత్రించినట్లు కాదు. ఆయన ఒక మహాసంస్థ, ఒక సంఘం, ఒక సమన్వయం. ఆదరణ, ఆప్యాయతల సమ్మిళితం శ్రీ గోపీచంద్‌గారు. ఆంధ్ర దేశంలో ఆయన కున్నంతమంది అభిమానులు మరే యితర రచయితకూ లేరని ఘంటాపథంగా చెప్ప వచ్చు. ఆంధ్రాంగ్ల సాహిత్యాలలో ఆయన చదవని గ్రంథం లేదనడం అతిశయోక్తి కాదు. అతి క్లిష్ట సమ స్యలనూ, నిగూఢ ప్రకృతి రహస్యాలనూ చర్చించే 'దివ్యజీవన గ్రంథం', 'అతీత మానవుడు' వంటి తాత్విక గ్రంథాలనుండీ, తేలికగా అర్థ మయ్యే 'డిటెక్టివ్' నవలలవరకూ ఆయన శ్రద్ధగా చదివే వారు. ఒక్క క్షణంకూడా వృథా కావడం వారు సహించేవారు కాదు.

గోపీచంద్‌గా రొక నిరంతర చైతన్య స్రవంతి. ఉన్నత లక్ష్యాల వేపుగా ప్రయాణం చెయ్యడమే కాకుండా, సహచరులను కూడా తమతో పాటుగా చేయిపట్టుకొని తీసుకుపోగలిగిన విశాల హృదయు డాయన. స్వ పర భేదాలకు అతీత స్థితిలో నిల్చిన అద్వైతమూర్తి, సామ్యవాది, సౌమ్యవాది. జీవితాన్ని సర్వతోముఖంగా శోధించి, మధించి అనుభవించిన పూర్ణపురుష డాయన. ఆకాశమంతటి విశాలమైన వ్యక్తిత్వం కలిగిన మరపురాని మహామనీషి ఆయన.

గోపీచంద్‌గారు సతతహరిత జాతికి చెందిన ఫలవృక్షం లాంటివారు. వారినుంచి ఇంకా ఎన్ని సారస్వత ఫలాలు ఆంధ్ర సరస్వతికి లభించి వుండేవో చెప్పలేము. విధి ఆ మహావృక్షాన్ని 2-11-62న సాయంకాలం గం. 5-20 ని॥ లకు పెకలించి వేసింది. అప్పటికి వారి వయస్సు 52 సంవత్సరాలు మాత్రమే. నిర్యాణ సమయంలో వారి సతీమణి శకుంతలాదేవిగారు, ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు-అందరూ ఆయన సన్నిధినే వున్నారు. ఈ విషాదవార్తవిన్న అశేష ఆంధ్ర ప్రజానీకం ఒక్క క్షణంపాటు నిశ్చేతన మయింది. సాహితీ లోకంపై పిడుగు పడ్డట్లయింది.

నవంబరు 3వ తేదీ ఉదయం 9 గంటలకు ఈ 'కథక చక్రవర్తి' భౌతికకాయం ఊరేగింపుతో బయలు దేరింది. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య, గ్రంథాలయోద్యమ నాయ కుడు శ్రీ పాతూరి నాగభూషణం, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి శ్రీ కె. సుబ్బారావు, రాష్ట్ర శాసనసభ కార్యదర్శి శ్రీ జి.వి. చౌదరి, నటకావతంస శ్రీ స్థానం నరసింహారావు, మహాకవి దాశరథి, విద్వాన్ విశ్వం, సుప్రసిద్ధ న్యాయవాది శ్రీ ఆవుల సాంబశివ రావు, పండిత గోపదేవ్, డాక్టర్ టి. వెంకటేశ్వర రావు, శ్రీ టి. గోకుల్‌చంద్, శ్రీ న్యాపతి రాఘవ రావు, శ్రీ రావూరి భరద్వాజ తదితర ప్రముఖులు 'కథా సాహిత్య సమ్రాట్' భౌతికదేహం వెంట నడి చారు. దోవ పొడవునా పూలు వర్షంలా కురిశాయి.

రుద్రభూమి వచ్చింది. స్మశాన వాటికవద్ద శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్యగారు మాట్లాడుతూ ''నాకు సన్నిహితులైన మిత్రులు శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులుగారు, శ్రీ త్రిపురనేని రామస్వామి చౌదరి గారు. గోపీచంద్‌గారిని నేను చిన్నతనంనుండి ఎరుగు దును. వారి సాహిత్యం ఆంధ్ర సరస్వతికి భూషణం

వంటిది. వారు మన మధ్య లేకపోవడం చాలా దుర దృష్టకరం. ఈనాడు దేశానికి మేధావుల అవసరం ఎంతోవుంది. ఈ విపత్సమయంలో వారులేకపోవడం కన్నా దురదృష్టాన్ని ఊహించలేను'' అన్నారు.

శ్రీ స్థానం నరసింహారావుగారు ప్రసంగిస్తూ ఇలా అన్నారు : ''తెనాలిలో వుండగానే గోపీచంద్ గారికీ నాకూ సన్నిహిత సంబంధం ఏర్పడింది. ఈ నాడు భౌతిక కాయంతో మనమధ్య లేకపోయినా, సాహిత్య రూపంలో చిలకాలం తెలుగువారి హృదయా లలో వా రుండగలరు. శ్రీ గోపీచంద్ ఈ దృష్ట్యా చిరంజీవులు, యశఃకాయులు.''

మహాకవి దాశరథి మాట్లాడుతూ ''శ్రీ గోపీచంద్ సాహిత్య జగత్తులో మేధాశక్తితో ఐదు దశాబ్దాలు ఉజ్వలంగా ప్రజ్వరిల్లిన ప్రతిభాశాలి, తాను నమ్మిన సిద్ధాంతాలకోసం చివరి క్షణం వరకూ కలం విడిచి పెట్టని వీరుడు'' అన్నారు.

ఇంకా అనేక మంది సాహితీ ప్రియులు, పుర ప్రముఖులు తమ సజల నేత్రాలతో సాహితీ తపస్వికి శ్రద్ధాంజలి ఘటించారు.

మానవులు శోకించునట్లుగానే దేవతలు కూడా తమ దుఃఖాశ్రువులను కుంభవర్షంగా కురిపించారు. ఆనాటితో కథా సాహిత్యంలో ఒక స్వర్ణయుగం అంతరించింది.

గోపీచంద్‌గారు చేసిన సాహిత్యసేవ ఆంధ్ర వాఙ్మయ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖింపదగింది. వారు యావదాంధ్రులకు చిరస్మరణీయులు. వారి కిదే నా అక్షరాంజలి.

# చిత్తజల్లు

నాకు జీవితంమీద ఆశైతేవుందిగాని తెలివిగా బ్రతకటం చేతగాదు. అందు చేత బంధంమీద బంధం బంధంమీద బంధం చుట్టుకుంటూ వెళ్తుంటాను, చివరికి ఊపిరి సలపని పరిస్థితికి వస్తాను. చూశేవారందరూ ఆశవదులుకుంటారు; అయి పోయింది అనుకుంటారు. అప్పుడొక అద్భుతం జరుగుతుంది. ఎవ్వరో ఒకరు వీపున ఫెళ్ళున చరుస్తారు, నేను త్రుళ్ళిపడి లేస్తాను, వొళ్ళు విదిలించుకుంటాను. ఈ విదలింపుల జల్లులే నా పుస్తకాలు; అందులో ఇది ముఖ్యం. ఇది నాకు మూడేళ్ళ కొకసారి జరగటం ఖాయం. మొదట్లో బంధనాలు సృష్టించుకోటానికి భయం వేసేది. వీపుమీద ఫెళ్ళునపడే చరుపులు తలుచుకుంటే వొణుకు పుట్టేది. ఇప్పు డదేమీలేదు, నిజంగాలేదు. ఇప్పుడు, ఎప్పటికప్పుడు పడబోయే జల్లులు జ్ఞాపకంవచ్చి ఆహ్లాదకరంగానే వుంటుంది. పైగా ఎప్పుడు బంధాలు పెన వేయించుకుందామా, ఎప్పుడు చరుపులు చరిపించుకుందామా అని ఉవ్విళ్ళూర బుద్ధి అవుతూవుంది కూడాను. ఎందుకేముంది ? చిత్తజల్లుల కోసం.

"పోస్టుచెయ్యని ఉత్తరాలు"
పీఠికనుండి.

—గోపీచంద్

# గొప్ప గోపీచంద్

ఒక మర్యాదను కలిగిన కులమున పుట్టుటయె గొప్ప గోపీచంద్
ఒక మంచి వంశమందున జనియించుట మరియు గొప్ప గోపీచంద్
ఒక గొప్ప తండ్రి కడుపున పుట్టుట యింకొక్క గొప్ప గోపీచంద్
ఒక గొప్ప చదువు చదువుట మరియు సదృష్టమ్ము సుమ్మో గోపీచంద్

మరియును నా వెంబడి బడి యూహకలిగియుంట గొప్ప గోపీచంద్
పరమ రహస్యమ్ములు తెలుసుక మెలగుట యది గొప్ప గోపీచంద్
అరయగ చదువునకు దగిన యుద్యోగము సేత గొప్ప గోపీచంద్
మరి యుద్యోగము లోపల పాడి చెడమి గొప్ప గోపీచంద్

న్యాయమతిని చరియించుచు జీవితమున నడక గొప్ప ఓ గోపీచంద్
సాయము చేయుచు మిత్రుల కెంతే బ్రదుకుటయు గొప్ప ఓ గోపీచంద్
ధ్యేయము మరపక యెప్పుడు సూటిగ నడచుటయు గొప్ప ఓ గోపీచంద్
మాయురె యనిపించుకొనుచు నలుగురిలో నుంట గొప్ప ఓ గోపీచంద్

పెఱ మతముల వారికి కీడును జేయమి గొప్ప ఓయి గోపీచంద్
మరియాద యిచ్చి పుచ్చుక బ్రదుకుట గొప్పోయి గోపీచంద్
వెఱవక ధర్మపు త్రోవను నడచుట అది గొప్ప ఓయి గోపీచంద్
చఱచి యొకమాటమీదను నిలుచుట గొప్పోయి గోపీచంద్

తన బాసలోన గ్రంథమ్ములు వ్రాయుట గొప్పయోయి గోపీచంద్
జనులకు బ్రదుకు రహస్యము బోధించుట గొప్పయోయి గోపీచంద్
ఘనములు రహస్య విషయమ్ములు తెలియుట గొప్పయోయి గోపీచంద్
తనకు తెలిసినది చక్కని బాస వచించుటయు గొప్ప గోపీచంద్

విశ్వనాథ సత్యనారాయణ

# మా జీవయాత్ర

శకుంతలా గోపీచంద్

నిన్న మొన్నటివరకు నందనోద్యానంగా వెలసిన జీవితం నేడు ఎడారిగా మారిపోయింది. ఈ జీవన లతకు సాధుమూర్తి అయిన వటవృక్షాన్ని ఆలంబన చేసి, శాఖోపశాఖలతో బహుముఖంగా వ్యాపింపచేస్తూ ఒక్కసారిగా కూల్చివేసాడు. ఇదేమిటని ఘోషిస్తే 'అంతా మాయే' అని నిరూపిస్తాడా చిద్విలాసమూర్తి.

ఎంతో సుందరమూర్తులను తృణీకరించే ఆ గంభీర మూర్తి 1932 వ సంవత్సరము "కొంచం చదువు సంస్కారంగల అమ్మాయి కావాలి'' అని పదునారు సంవత్సరముల ప్రాయముగల నన్ను వివాహం చేసుకున్నారు. వివాహం అయ్యింది మొదలు సామాన్యురాలనైన నన్ను తమ అర్ధశరీరంగా భావించుకున్నారు. శివుడు గంగను జటాఝూటంలో ధరించినట్లు ఎంతో గౌరవించారు. అటువంటివారికి ఆత్మార్పణ గావించుకున్నాను. తమ నర్ధంచేసుకున్నందుకు చాలా సంతుష్టులయ్యారు.

నాకు తెలిసినదగ్గరనుంచి ''దేవుడున్నాడా లేడా?'' అనే జిజ్ఞాసతోనె ఉండేవారు. ఈ సమస్యను గురించి చాల మందితో వాదోపవాదాలు జరుపుతూ ఉండేవారు. నిరంతరం పూజలు సలిపే మాతృదేవికి ఉద్భవించటం వల్ల పూర్తిగా తండ్రిగారిని అనుసరించలేకపోయారేమొ!

పితృదేవుల జ్ఞానాన్ని సిద్ధాంతాలను సంతరించుకొని జీవితం మొదట్లోనే హేతువాదిగా పైమెట్టుకు ఆరోహణచేశారు. కాని అక్కడే తిష్ఠ వేయటానికి

మనస్కరించక, ఇంకా పైకి ఆరోహణ చేయటానికి ఆరాటపడ్డారు.

ఉన్నవ దంపతులదగ్గర ఎనిమిది సంవత్సరములు శిక్షణపొందిన నేను మాస్టరుగారి ప్రార్థన చేస్తూ ఉంటే చూచి వారుకూడ చెయ్యాలని దృఢనిశ్చయులయ్యారు.

భిన్న దృక్పథాలు కలవారైనా ఒకే గమ్యాన్ని సాధించిన మా మామగారు శ్రీ రామస్వామి చౌదరి గారూ, పితృతుల్యులు శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులుగారు ఆప్తమిత్రులు. పంతులుగారు తెనాలి వచ్చినప్పుడు సూతాశ్రమములో దిగుతూఉండేవారు. ఒకసారి వచ్చినప్పుడు వారు పంతులుగారిని ''మాస్టరు గారి ప్రార్థనమంత్రం ఉపదేశం చెయ్యమని''కోరారు.

అడిగినదే తడవుగా ఎంతో ఆనందముతో పంతులు గారు వారికి మంత్రోపదేశం చేశారు. భారత భాగవత రామాయణములు కూడ చదవమని సలహా ఇచ్చారు.

ఆనాటినుండి వారు పంతులుగారిని దీక్ష నిచ్చిన గురువుగా భావించుకున్నారు. చివరివరకు అవకాశాన్ని పురస్కరించుకొని తమ గురువుగారి ఔన్నత్యాన్ని శక్తివంచన లేకుండ చాటుతూ ఉండేవారు. ''చీకటి గదుల''లో కూడ శివకామయ్య పాత్రను పంతులుగారి నుద్దేశించి చాల విశాలంగా వ్రాసారు.

1937 వ సంవత్సరము తెనాలిలో వకీలుగా ప్రాక్టీసు మొదలుపెట్టారు. కాని 'బుధవారమునాడు పుట్టి, భూమిని బ్రద్దలు చేస్తాడు' అన్న పెద్దల ఆశీ ర్వాదమును పొందిన వారు సామాన్య జీవితాన్ని ఎలా సాగించ గలుగుతారు ?

ఈ లోకానికి సంబంధించిన వ్యక్తిగా ఉండేవారు కాదు. రేపటి విషయమే ఆలోచించేవారు కాదు. ధనార్జన విషయం వారిని ఏమాత్రం బాధపెట్టేదికాదు. ఆ దృష్టి చాలసంకుచితంగా కనపడేది. ఆర్థిక బాధలు లేక పోవడంవల్ల ఎప్పుడూ ఏవో చదువుతూ వ్రాస్తూ ఉండేవారు.

ఆ రోజులలో మంచి చమత్కారము, రసపుష్టి కలిగిన రచనలు చాల తక్కువగా వెలువడుతూ ఉండేవి. అందువల్ల ప్రచురింపబడ్డ వారి ప్రతి కథకు, ప్రతి వ్యాసానికి మంచిపేరు రావటం మొదలు పెట్టింది. దానితో సాహిత్యరంగంలో వారికి అభిరుచి బాగా కలిగింది. తమ స్థానాన్ని గుర్తించారు. కాలా నికి అనుగుణంగా నవీన భావాలను వెదజల్లే రచనలు పటుత్వమైన శైలిలో సాగించారు. సంఘాన్ని మేల్కొలపటం మొదలుపెట్టారు.

1939 వ సంవత్సరము పూజ్యులు శ్రీరామ బ్రహ్మంగారు అవ్యాజానురాగంతో వారిని ''రైతు బిడ్డ''కు అసిస్టెంటు డైరెక్టరుగా సినిమారంగంలోకి ఆహ్వానించారు. కాని అక్కడకూడ వారు సంతృప్తిని పొందలేకపోయారు. అయినా ఆ రంగంలోనే 1952 వరకు ఆ పవిత్రమూర్తి తామరాకు మీద నీటి బిందువులాగు నిలచి పనిచేసారు. ఎన్ని గాలిదుమా రాలకూ చలించేవారుకాదు.

అప్పుడప్పుడు మహర్షుల ఆశ్రమాలకు వెళ్లి దర్శించి వచ్చేవారు. చివరకు అరవిందుని ఆశ్రమానికి వెళ్లివచ్చిన తరువాత మాత్రం చాలా పరివర్తన కలి గింది. అప్పటినుంచి అరవిందబాబు గ్రంథాలు, ఇంకా ఇతర వేదాంత గ్రంథాలు ఎక్కువగా చదివే వారు. పోస్టుచెయ్యని ఉత్తరాలూ, తత్త్వవేత్తలను గురించీ వ్రాస్తూ ఉండేవారు. అరవిందుని సిద్ధాంతాలను పాఠకులకు సుళువుగ అర్థమయ్యేటట్లు తమ నవలల్లో వ్రాయబూనుకున్నారు.

రామాయణ భారత భాగవతములు కూడ ఎక్కు వగా చదువుతూ ఉండేవారు. రామాయణము చదివే

టప్పుడు ఆ శ్రీరామచంద్రుని ప్రతిభను, విశాలత్వాన్ని గురించి వర్ణించి వర్ణించి చెప్పుతూ ఉండేవారు. భారత భాగవతములు చదివేటప్పుడు మాత్రం శ్రీకృష్ణునితో తాదాత్మ్యం చెందేవారు. ఆ కపట నాటక సూత్రధారుని లీలలను వర్ణిస్తూ తన్మయావస్థను పొందుతూ ఉండేవారు.

1953 వ సంవత్సరంలో ప్రచారశాఖ డైరెక్టరుగా గవర్నమెంటు ఉద్యోగంలో ప్రవేశించారు. ఆ రోజు నుంచి మనస్సుకు కొంత స్వస్థత చేకూరింది. పెద్ద వారితో స్నేహాలు పరిచయాలు విరివిగా ఆరంభిం చారు. వారి పాద ధూళితో మా గృహం పావనం కావటం మొదలు పెట్టింది.

మజిలీ మజిలీకి ఎందరెందరితోనో స్నేహాలు చేస్తూ ఉండేవారు. అవన్నీ ఒక ఎత్తు, మొదటినుంచి చివరివరకు సోదరులు శ్రీ ఆవుల సాంబశివరావు గారితో చేసిన స్నేహం ఒక ఎత్తు. వారిద్దరు నర నారాయణులను మరపించేటంత మైత్రితో ఉండే వారంటే అతిశయోక్తి కాదేమో !

ప్రచారశాఖ డైరెక్టరు అగ్రిమెంటు ముగియగానే రేడియో స్టేషనులో గ్రామస్థుల కార్యక్రమాల ప్రొడ్యూసరుగా ప్రవేశించారు. అప్పటినుంచి వారి మనస్సు పూర్తిగా కుదుటబడింది. తమ రచనలకు సంపూర్ణావకాశం లభించినందుకు చాల తృప్తిగా ఉండేవారు.

రేడియో కార్యక్రమముల ద్వారా పెద్ద పెద్ద మేధా వులతోను పండితులతోను మరి ఎందరెందరితోనో పరిచయాలు కల్పించుకున్నారు. ఆఫీసులో తమ బాధ్యతకు మించినపని చేస్తూ ఉండేవారు. ''ఎంత విజ్ఞాన ఖని '' అని అందరిని ఆశ్చర్యచకితుల్ని చేసారు. స్టేషను డైరక్టర్లందరి మన్ననలను పొందారు.

ఆఫీసుకు, పత్రికలకు, పబ్లిషర్సుకు, అడిగినవారికి లేదనకుండ ఎప్పుడూ ఏదో ఒకటి వ్రాసి ఇస్తూనే ఉండే వారు. ఎవరువచ్చినా గంటలకొలది సంభాషిస్తూ ఉండే వారు. లోకం శ్రేయస్సే తమ శ్రేయస్సుగా రాత్రిం బవళ్లు శ్రమించారు. అవకాశం లభించినప్పుడంతా భగవద్ధ్యానంలో నిమగ్నులయ్యేవారు. ఎన్నో అను భూతులు పొందేవారు.

ఆత్మజ్ఞానం వృద్ధిఅయిన కొలదీ అహాన్ని, ఆడంబ రాన్ని పూర్తిగా విసర్జించారు. ఇంటా బయట్లా అంద రికీ సహాయం చేయడం మొదలు పెట్టారు. అనా రోగ్యంతో ఉంటున్న నన్ను విశ్రాంతిగా ఉంచటానికి పిల్లల బాధ్యతలు వీరే నంతవరకు తామే నిర్వహిస్తూ ఉండేవారు. తమ సహాయార్థం ఎవరువచ్చినా, ఏ సలహా అడిగినా పితృవాత్సల్యంతో చాలా ఆదరణ చూపుతూఉండేవారు.

మొదటినుంచీ వారిని ప్రతిభగల వ్యక్తిగా మాత్రమే భావించుకున్నాను. అలాంటి వారి సహ చారిణి నయినందుకు ఎంతో గర్వపడ్డాను. కాని చివర చివరకు తామొక జ్యోతిలాగు వెలిగి ఇతరులకు వెలు గును చూపిస్తూ ఉంటే దైవాంశ సంభూతులనుగా ఊహించుకున్నాను. పూజారిణినై వారిని పూజించు కున్నాను. అందుకే కాబోలు ''మంచివారికి మరణమే సాక్షి'' అన్నట్లు ఒక్కసారిగా అదృశ్యులయ్యారు !

స్వప్నంలోకూడ ఊహించని ఈ దృశ్యంచూచి హృదయం బ్రద్దలయ్యింది. అంతా అంధకారం ! అంతా అగాధం ! అంతా అగమ్య గోచరం ! పశు పక్ష్యాదులుకూడ అనుభవించలేని దీ బాధ! తండ్రికోసం విలపించే ఆరుగురు సంతానాన్ని ఆదరించే నిమిత్తం ఆ తేజోమూర్తిని అనుసరించలేకపోయాను. జీవచ్ఛవంగా మిగిలిపోయాను.

శకుంతలా గోపీచ ద్

# శ్రద్ధాంజలి

నిజముపల్కు, త్రిపురనేని తనూజుడై
కథక చక్రవర్తిగా రహించి
తెలుగు వాణి బిట్టు విలపింప కథయయ్యె
ధీ పయోంబురాశి, గోపిచందు.

కథలెల్లన్ సుధలై మనోహరములై
గంగా ప్రవాహంబులై
ప్రథిత ఖ్యాతి గడింప వాఙ్మయ సము
ద్రం బుబ్బి మిన్నంట, దు
ర్విధి, చూపోపక కొంచుపోయె,
మహితాంధ్ర పుత్రముక్తామణిన్
మధురస్వాంతుని, గోపిచందును, మరం
ద స్వాదు వాచావిదున్.

జాషువ

# మనగోపీచంద్

శ్రీ తాపీ ధర్మారావు

ఇది విపరీతం. అంతేకాదు, మహాఘోరం — మన గోపీచంద్ లేకపోవడ మేమిటి? ఆ ముక్కూ మొఖం తీరు, తెలివి తొణికిసలాడుతూ ఉండే ఆ వర్చస్సు, పెదవులమీద ఎల్లప్పుడూ చిందులు తొక్కుతూఉండే ఆ మందహాసము, ఉక్కు తునకలాంటి ఆ శరీరము ఇవన్నీ అకాల ఆకస్మిక మృతికి గురికావలసినవా? అర్ధాయుష్షులో అంతరించి పోవలసినవేనా? ఎవడు నమ్మగలడు—ఎక్కడో పెద్ద పొరపాటు జరిగిందని అనుకోవాలి. నిన్నరాత్రి ఆ శరీరం దగ్గర ఏడుస్తూఉంటే—"చప్పుడుచేయకండి—నిద్రపోతున్నారు" అని అనాలని—ఒక రెప్పపాటు కాలం—అనిపించింది. అంత నమ్మరాని విషయం అయింది. "దీర్ఘాయు వనుట కర్ధము, నిర్ఘాతాయత పటిష్ఠ నిహతి" అయిందే—ఇది దేశ దౌర్భాగ్యమూ, ఆంధ్రదేశ దారిద్ర్యమూ—అనక తప్పదు. కార్యోత్సాహమూ, తెలివితేటలూ, ప్రజాభిమానమూ ఉన్న వారి అవసరం ఇప్పుడు మన దేశానికి ఉంది. ఇటువంటప్పుడు, గోపీచంద్‌వంటి మణిపూసను పోగొట్టుకోవటం దౌర్భాగ్యంకాదా! పాదరసంలాంటి తెలివి, విసుగూ విరామం ఎరగని కార్యదీక్ష, ఉత్తమ భావాలతో ప్రజాశ్రేయస్సునుకోరే ఆలోచన, ఇవన్నీ ఒక్కసారి, పిడుగుపాటుగా అంతరించి పోవడం దరిద్రతాలక్షణం కాక మరేమిటి?

ఇక ఆంధ్రభాషా సరస్వతికి కలిగిన ముప్పు ఎంతనగలం. ఇక గోపీచంద్‌లాగా, కథానికలు

వ్రాసి, జనసామాన్యాన్ని ఉత్తేజపరిచిన రచయితలు ఎందరున్నారు? అమృత స్రవంతిలాగా మొదటి పుటనుంచి, చివరి పుట వరకు సాగిపోతూఉండే ఆ కథలు మరి మనకు చిక్కవు. సంఘములోని పరిస్థితులను సునిశితమైన విమర్శతో కడిగి వడకట్టి ఆంధ్రపాఠకలోకాని కిచ్చేవా రెవరున్నారు? కథా రచనలోనూ, నవలా రచనలోనూ సిద్ధహస్తు లనిపించుకొని ఆంధ్రహృదయాలకు చాలా దగ్గరగా వచ్చిన గోపీచంద్ మరి వ్రాయడు. భాషాపరిచయము, విమర్శనా జ్ఞానము, భావనాపటిమ ఇన్నింటినీ మేళవించి సుధా మధుర రచన మరి గోపీచంద్ చేయడు. కథానికలు వేలూ, లక్షలూ రావచ్చును, కాని గోపీచంద్ రచనల వంటివి రాగలవా అన్న సందేహం అకారణం కాదు.

అతనిది బంగారంవంటి బుద్ధి. దేనిలో పెట్టినా చక్కగా శోభించేది. దేశ సమస్యలు, సంఘసమస్యలు చర్చలకు వచ్చినపుడు అతని ఆలోచనలు వింటూఉంటే ఎంతో ముచ్చటగా ఉండేవి. ప్రజాశ్రేయస్సునే అన్ని వేళల కోరేవాడు కాబట్టి ప్రజలతో సన్నిహిత సంబంధం కలిగించుకోడానికీ, ఆ రూపంగా ప్రజలకు ఇతోధిక సేవచేయడానికి గోపీచంద్ సినిమా పరిశ్రమలోను గూడా ప్రవేశించాడు. ఈ రంగంలో గూడా అతని ఊహాపటిమ, రచనాపాటవము ప్రత్యక్షంగా చూపించారు. సజాతీయమైన కథలను వ్రాయడంలోనూ, గ్రామీణ జీవితమును యథాతథంగా నిరూపించడములోనూ అద్వితీయుడని పేరుపొందాడు. అంతేకాదు, అటువంటి కథా వస్తువులను చక్కగా చిత్రించడం తెలియక కొందరు దర్శకులు తడబడుతుండడం చూచి, తానే దర్శకత్వం నిర్వహించడానికి పూనుకొన్నాడు. దర్శకుడుగా తాను తీసిన చిత్రాలు ఎన్నో లేకపోయినా, తీసినవన్నీ కథా నిర్మాణానికీ, రచనా సౌష్ఠవానికీ, దర్శకప్రతిభకు, అనేక ప్రశంసల నందుకోగలిగాయి. గోపీచంద్ ఉపన్యసిస్తున్నాడని వింటే, తెలివితేటలు కలవారు చాలామంది పని పెట్టుకొని ఆ ఉపన్యాసానికి వెళ్ళేవారు. విషయము ఎంతక్లిష్టమయినదైనా, అరటి పండొలచినట్లు బోధించడమే కాక, ఆ విషయ అంతరాంతరంలోని అర్థం విప్పిచెప్పేవాడు. ఆయన మరి పదేళ్ళు బ్రతికి ఉన్నట్టయితే ఆంధ్రసారస్వతానికి ఉపకారం ఎంతో జరిగివుండేది. కవులను గూర్చి ఉపన్యాసమిచ్చినప్పుడు అతని విమర్శనా విధానం ఎంత ఉదాత్తంగా ఉంటుందో, చెప్పితే బోధపడదు, ప్రత్యక్షానుభవం కావాలి. అతి సునిశితమయిన బుద్ధితో గోపీచంద్ ఆ కవి హృదయాన్ని పట్టుకొని దాన్ని శ్రోతలకు నివేదించేవాడు. అటువంటి ప్రతిభాశాలి ఆత్మకు శాంతికలగాలని కోరడము, సానుభూతి తెల్పడం తప్ప మనం చేయగలిగిం దేమీలేదు.

(ఆకాశవాణి, హైదరాబాదు కేంద్రం సౌజన్యంతో)

# స హృ ద యు డు

శ్రీ దేవులపల్లి రామానుజరావు

ఆరోజు ప్రొద్దున శనివారము, దుర్ముహూర్తము. పత్రిక తెరచి పుటలు త్రిప్పగా నమ్మడానికి వీలులేని వార్త, పిడుగువంటి వార్త అందులో కనుపించినది. త్రిపురనేని గోపీచంద్‌గారు హృదయ చలనం ఆగిపోయి నిన్న సాయంకాలం అసువులను కోల్పోయినారని పత్రికలలో వచ్చిన యీ ఘోరమైన వార్తను చదివినపుడు యెక్కడలేని విషాదం ముంచుకొచ్చినది. విషాదంతోపాటు కొన్ని నిముషాల తరువాత యీ వార్త నిజంకాదేమోనని అనుమానం ఒక అవ్యక్తమైన ఆశాభావాన్ని కలిగించింది. కాని ఆ ఆశాభావము నా మనసులో యెక్కువసేపు నిలువలేదు. గోపీచంద్‌గారు యిక మన మధ్యలేరు. ఇది యెంతో బాధతో, యెంతో విచారముతో కాని నమ్మలేని అత్యంత సంతాపకరమైన సంగతి.

ఇంతకు కొద్దిసేపు క్రిందటి వరకుగూడ గోపీచంద్‌గారితో మాట్లాడుతున్నట్లే అనిపిస్తున్నది. నిన్నగాక మొన్న ఆయన ఆరోగ్యంగా, ఆలోచనల బరువుతో రిక్షాలో కూర్చుని వెళ్ళడం చూచినాను. ఇది ఒక్క మొన్నటి విషయమేకాదు; ప్రతిరోజు ఆయన కార్యక్రమమే అది. ఎంత సందడిలోనుండి వెళ్ళుతున్నా ఆయన యెక్కడనో, యేవో ఆలోచనలలో తేలిపోయేవాడు. ఉంగరాల వెంట్రుకలతో, కంటి అద్దాల వెనుక నిశితమైన చూపులతో ఆయన ఆకారము కన్నులకట్టుతున్నది. ఆయనతో మాట్లాడిన సందర్భాలు అనేకంగా జ్ఞప్తికివస్తున్నవి. ఎప్పుడూ

మహపురాని సహృదయుడు, స్నేహమూర్తి శ్రీ గోపీచంద్.

మరణించే సమయానికి గోపీచంద్‌గారికి 52 సంవత్సరాలు కూడా నిండలేదు. ఇంత తొందరగా మృత్యువుకు కన్నులు కుట్టగలవని యెవరను కుంటారు! గోపీచంద్‌గారి అకస్మాత్ మరణం ఆంధ్ర భారతికి తీరనిలోటు. తెలుగు సాహిత్యానికి గోపీచంద్ గారి లేఖిని నుండి మరికొన్ని అమూల్యమైన రచనలను అందుకునే భాగ్యము తొలగిపోయినది.

గోపీచంద్‌గారి పలుకులు దారుణాఖండల శస్త్ర తుల్యమైనవి అయినా హృదయము మాత్రము నవనీతము వంటిది. వ్యక్తిగలమైన యీ గుణము ఆయన రచనలలో స్పష్టముగా కనిపిస్తుంది. తెలుగుదేశములోని అధునాతన, అగ్రేసర కథకులలో, నవలా రచయితలలో ప్రత్యేకమైన, విశిష్టమైన స్థానాన్ని సంపాదించుకొన్న గోపీచంద్‌గారు పరిచయ వాక్యాలు అక్కరలేనివారు. అక్షర జ్ఞానము కలిగిన తెలుగు వారందరికిని గోపీచంద్‌గారు తమ కథలద్వారా నవలలద్వారా బాగా పరిచితులైనవారు. గోపీచంద్‌గారి ఆలోచనలచేత, అభిప్రాయాలచేత ప్రభావితులైనవారు. ఆయన మార్గములో రచనలు చేస్తున్నవారు, ఆయన అభిమానులు తెలుగు దేశములో అసంఖ్యాకులు. ఆయన సంపాదించుకున్న కీర్తికి యింతకన్నా మంచి నిదర్శనం మరొకటి లేదని చెప్పవచ్చును.

గోపీచంద్‌గారి కథలు, నవలలు అన్నీ విమర్శనాత్మకంగా పరిశీలించవలసినవి. ఏవొక్క కథనూ, ఏవొక్క నవలనూ ఆయన ఊసుపోకకు వ్రాయలేదన్న భావము ప్రతి పాఠకునికి కలిగితీరగలదు. ఆయన తాను రచించిన ప్రతివొక వాక్యానికి సాంఘిక ప్రయోజనాన్ని ఉపలక్షించినారు. ప్రతివొక కథలోను, నవలలోను వాస్తవిక జీవితాన్ని చిత్రించి, తోడ్తోడుగా ఆ కథను ఆ నవలను కళాఖండంగా రసాత్మకంగా తీర్చిదిద్దినారు. "అసమర్థుని జీవయాత్ర" మొదలుకొని మొన్న మొన్న రచించిన "పరమేశ్వర శాస్త్రి వీలునామా" వరకు అన్ని రచనలలోను యీ అసామాన్య ప్రతిభను గోపీచంద్‌గారు ప్రదర్శించినారు. "మాకూ ఉన్నాయి స్వగతాలు" వారి భావుకతకు మచ్చుతునకలు.

అన్ని సందర్భాలలోనూ గోపీచంద్‌గారి అభిప్రాయలతో పాఠకుడు యేకీభవించలేక పోవచ్చును. అయితేనేమి; ఆయన కథా కథనము, నవలా శిల్పము మనందరిని అబ్బుర పరుస్తుంది. ఇక అభిప్రాయ భేదాల ప్రసక్తి వచ్చినచో అది వేరుసంగతి. ఆయన ఆలోచనలలో వచ్చిన తీవ్ర పరిణామాలకు అనువుగా, ఆయన భావ విప్లవానికి అనుగుణంగా ఆయన రచనలలో అభిప్రాయాలు ప్రకటితమైనవి. క్రమక్రమంగా ఆయన మస్తిష్కములో కలిగిన సంచలనానికి ప్రతిబింబాలు ఆయన రచనలు, ఆయన కేవలము జీవిత వాస్తవికతను దర్శించి ప్రదర్శించే గొప్ప కథకుడేకాదు; తాత్త్వికుడు కూడా.

గోపీచంద్ సాహిత్యకృషిని నిర్విరామ పరిశ్రమగా, నిరంతర తపస్సుగా భావించినవాడు. ఆయన తన కలాన్ని యెన్నడూ క్రిందపెట్టలేదు. ఈ విషయములో ఆయనకూ చాలామంది ఇతర రచయితలకు గమనీయమైన భేదము ఉన్నది. జీవితంలో తుదిక్షణం వరకు గోపీచంద్‌గారి సాహిత్యకృషి సాగుతూనేవుంది. తమ జీవిత సమాప్తి వరకు పుంఖాను పుంఖమైన రచనలను గోపీచంద్‌గారు వెలుగురేకలుగా వెదజల్లినారు.

బహుముఖమైన జీవితాన్ని చిత్రించడానికి రెండు మూడు మాటలు సరిపోవు. అడుగుపెట్టిన ప్రతి రంగములోను గోపీచంద్‌గారు తమకు సహజమైన

సహృదయుడు

ప్రతిభను, నిజాయితీని కనబరచినారు. గోపీచంద్ గారికి పత్రికా రచనలో విశేషమైన ఆసక్తి ఉండేది. ఆంధ్ర రాష్ట్రానికి సమాచారశాఖ డైరెక్టరుగా ఆయన పనిజేసి, ఆంధ్రప్రదేశ్ యేర్పాటు తరువాత కూడా సమాచారశాఖలో ఉన్నతోద్యోగాన్ని వారు నిర్వహించినారు. ప్రభుత్వోద్యోగాన్ని వదలుకొన్న తరువాత పత్రికా సంపాదకుడుగా నుండవలెనని వచ్చిన అభ్యర్థనను కొన్ని కారణాల వలన వారు అంగీకరించలేదు. సినిమా రంగములో గోపీచంద్ గారిది ప్రత్యేకమైన స్థానము. విశేషమైన నైపుణితో కథను అల్లి, మాటలను సమకూర్చి, దర్శకత్వము వహించి ప్రగతిశీలమైన, ప్రజారంజకమైన చక్కని సినిమా చిత్రాలను ఆయన నిర్మించినారు. ఆకాశవాణి గ్రామస్థుల కార్యక్రమాలకు స్వచ్ఛమైన తెలుగు గ్రామీణ వాతావరణాన్ని కల్పించి రేడియో కార్యక్రమాల ఆశయాలకు ఆదర్శాలకు సఫలతను కలిగించిన గౌరవము గోపీచంద్‌గారికే దక్కుతుంది.

తెలుగు సాహిత్య ప్రపంచము యీనాడు త్రిపురనేని గోపీచంద్‌గారి అస్తమయానికి శోకముతో, సంతాపముతో క్రుంగి పోతున్నది. తెలుగు పాఠకులు గోపీచంద్‌గారికి సర్వదా ఋణపడి యుండగలరు. సహృదయుడూ, సజ్జనుడూనైన గోపీచంద్‌గారు దేహయాత్ర చాలించినా ఆయన కీర్తి నిత్యమై నిలిచి వుండగలదు.

[ఆకాశవాణి, హైదరాబాదు కేంద్రం సౌజన్యంతో]

# అశ్రుతర్పణము

ఓ మనస్వీ! ఓ యశస్వీ!
ఓ నిరతరచనా వర్షబిందూ!
గోపిచందూ! నీవు లేవు.

కవిని కవిగా చూచు అచ్చపు
సుకవిసింహుడు లేడు నేడు.

రచన, నడకలపొత్తు గుదరక
రాజసము తొణకాడ నంతలొ
గలగలంచును పరుసదనమే
కరగి పారే నగవు లేదు.

అలతి తెగ్గుల మేడపై
జలతారు తీగెలు చెక్కినావే!
అతికి చిక్కని తెగ్గునేలల
నతుకు పల్కుల నాడినావే!

నవలభామకు రెండు చేతుల
నొదుగు గుత్తపు గాజులొత్తిన
నవల రాయడ! వచన గండడ!
లేవు గోపీచంద్! లేవు.

శ్రీ దుర్గానంద్

# గుండెగలవాడు

## శ్రీ నార్ల వెంకటేశ్వరరావు

ఎంత గుండె గలవాడు శ్రీ గోపీచంద్! అట్టి వాడే గుండెజబ్బుతో నడివయస్సులో హఠాత్తుగా కన్నుమూయడం విడ్డూరం కాదా?

ఆకృతిలోనేకాదు; స్వభావంలోకూడా శ్రీ ఎమ్. ఎన్. రాయ్‌తో శ్రీ గోపీచంద్‌కు పోలికలు హెచ్చు. ఇదే ఆయనను శ్రీ రాయ్‌కి కొంతకాలంపాటు శిష్యుని, భక్తుని చేసినదేమో!

''ఎందుకు?'' అనే ప్రశ్న వేయడాన్ని తమ తండ్రి శ్రీ త్రిపురనేని రామస్వామి చౌదరిగారి వద్దనే శ్రీ గోపీచంద్ నేర్చుకొన్నారు. ఆ ప్రశ్నే ఆయనను ఆదిలో ''రేషనలిస్టు''గా చేసింది; అదే తరా ''రాయిస్టుగా'' మార్చింది; అదే ఇటీవల కొంత కాలంగా ఆయనను శ్రీ అరవిందయోగి దిక్కుకు ఆకర్షించినట్టుగా కనబడుతుంది.

''ఎందుకు?'' అనే ప్రశ్న రాజ్యం చేసే వాతావరణంలో పుట్టి, పెరిగినవాడైనందునే శ్రీ గోపీచంద్ రచనలన్నింటిలో–అది చిన్న కథ కానివ్వండి, పెద్దనవల కానివ్వండి, మరేదైనా కానివ్వండి–మూలతత్వ విచారణకై ప్రయత్నం కనబడుతుంది. ఫలితమేమైనా దీక్షగా, ధైర్యంతో ఆయన ఈ పరిశీలన చేశారు. ఇదే ఆయన రచనలకు ఒక ప్రత్యేకతను కూర్చింది; ఇదే వాటికి ఒక వైశిష్ట్యాన్ని సాధించింది.

జీవితం, సాహిత్యం – ఇవి శ్రీ గోపీచంద్‌కు విభిన్నరంగాలు కావు. జీవితమే ఆయనకు సాహిత్యం; సాహిత్యమే జీవితం. ఇందువల్లనే ఆయన సృష్టించిన ప్రతి పాత్రలోనుంచి ఆయనే తొంగిచూస్తున్నట్టుగా వుంటుంది; లేదా, ఆయన జీవితంతో గట్టిగా పెనవైచుకున్న మరొకరెవరో పలకరిస్తున్నటుగా వుంటుంది!

ఈ మేధావి, ఈ ప్రతిభావంతుడు, ఈ ప్రముఖ రచయిత అకాల మరణంవల్ల ఆధునిక సాహిత్యానికే అపారనష్టం వాటిల్లింది. ... ...

('ఆంధ్రజ్యోతి' సంపాదకీయము)

# తండ్రికి తగిన తనయుడు

ఆచార్య రంగా

గత రెండు దశాబ్దములుగా కీ॥శే॥ త్రిపురనేని గోపీచంద్ ఆంధ్ర సాహితీలోకమునకు చేసిన నిర్మాణాత్మకమైన కృషి ప్రశంసనీయమైనది. వారు రచించిన కథలు ఆధునిక తెలుగు సంస్కృతికి ప్రతిబింబాలు. సాంఘికోన్నతికి అమూల్యమైన బహుమానాలు. వారి రచనలు చదువరులకు చక్కని ఊహాలు, దివ్యమైన ఆలోచనలు పుట్టించుతాయి. ఇది నిజంగానే వారి సాహస కృత్యమే అని అనుకోవాలి.

తన కుటుంబ వారసత్వమును బట్టే గోపీచంద్ అత్యుత్తమ సాహితీవేత్త కాగలిగారు. వారి తండ్రి శ్రీ త్రిపురనేని రామస్వామి చౌదరిగారు సుప్రసిద్ధ పండితులు, గద్యరచనా ధురీణులు, సాంఘిక విప్లవోద్యమ ప్రదాత. వారి మేనమామలు, పెద్దతండ్రి, పినతండ్రి సంతానము – అందరూ కవులూ. పేరు బడ్డ విమర్శకులూ. సామ్రాజ్య కాంక్షాపరులైన ఢిల్లీ సుల్తానులకు వ్యతిరేకముగా ఆంధ్రస్వాతంత్ర్యం కొరకు యుద్ధముజరిపిన వీరయోధుడు కాకతీయుల త్రిపురనాయకుని యశశ్చంద్రికలను, సాహితీ లలామను నిలబెట్టినది నిశ్చయముగా ఈ త్రిపురనేని కుటుంబమే.

గోపీచంద్ ప్రథమముగా నాకు గుంటూరులోని ఒక విద్యార్థి హాస్టలో పరిచయం చేయబడ్డాడు. సాక్షాత్తు రామస్వామి చౌదరిగారి ముఖకవళికలు నాకు ఆయనలో కనుపించాయి. ఆ విశాలవక్ష

స్థలము, ఆ గాంభీర్యత, ఆ దృష్టిలో ఏకాగ్రత, విశాలమైన నుదురు, నిటారుగా నిలబడ్డ తలవెంట్రు కలు–రామస్వామిగారి రూపురేఖా విలసితములు ప్రతి బింబించినవి. ఆయన యొక్క చిరునవ్వు సైనిక శీవితో కూడిన తనతండ్రి నవ్వుకంటే హృదయం గమము అయ్యేడిది. నా మిత్రుడు రామస్వామిమీద ఉన్న హితత్వంతోనేగాక స్వతహాగా కూడ నే నెప్పుడూ ఆయనను ప్రేమతో చూచుచుండెడివాడను.

కాని వారు నాకున్న రాజకీయ మిత్రులలో ఒకరుగా స్థానం పొందలేకపోయారు. అలా కొన్ని సంవత్సరాలు గడిచాకకూడా ఐక్యతా చిహ్నముతో కూడిన శ్రేయోభిలాషిత్వం కూడా మాలో నెలకొన లేకపోయింది. ఇది నిశ్చయముగా ఆనాటి సమకాలీ నములైన మేధావు లందరి యెడల జరిగిన క్రియయే. ఎందువల్ల ? నేను పూర్తిగా గాంధీజీ అనుయా యుడను. గాంధేయ సిద్ధాంతాలను ఆచరించువాడను. త్రికరణ శుద్ధితో గాంధేయ ఆశయాలను విశ్వసించు వాడను. విగ్రహారాధన, ఆధ్యాత్మిక చింతన కలిగిన మేము వారికి హేతువాదులముగా కనుపించి యుండ లేదు. హేతువాదానికి ఆచార్యులైన ఎం. ఎన్. రాయ్ శిష్యత్వము స్వీకరించేముందు తెనాలిలోని వీరు, వీరితోబాటు కొందరు మిత్రులు–మేధావులు సోష లిష్టులు. గోపీచంద్ హేతువాదాన్ని ఎప్పుడు చేపట్టారోమాత్రం నాకు తెలియదు. రాయ్ బోధనలు గోపీచంద్‌కు నవీనములేమీ కాదు. సాంఘిక విప్ల వోద్యమములో తనతండ్రి ఓం ప్రథమముగానే ఆంధ్రుల భావవిప్లవమునకుగాను పటుతరమైన సంస్క రణవాదాన్ని ప్రవేశపెట్టిఉన్నారు. తనతండ్రి నడపిన ఉద్యమముల అనుభవములుండబట్టి ఆయన ఈ ఉద్య మాలలో అతి సునాయాసంగా నాయకత్వం వహించ డం సర్వసాధారణ విషయమే.

తండ్రికి తగిన తనయుడు

కొంతకాలనికి వారు కొత్తదారి పట్టినారు. చలన చిత్రసీమవైపున పయనిస్తున్నట్లు చూచాను. వారు మహాపతివ్రత అయిన 'లక్ష్మమ్మ'ను చిత్రంగా తీశారు. సాహిత్యలోకానికి, వెండితెరకు ఆయన అందించిన అపూర్వకానుక. ఆ చిత్రములోని సంఘ టనలను కృష్ణాపత్రిక ఆ రోజులో సమీక్షించింది. నేనూ, భారతీదేవి ఇద్దరము ఆ చిత్రమును చూచి ఆయన దర్శకత్వ ప్రతిభకు చాలా ఆనందించాము.

చిత్రసీమలో ఆయన అంతగా ద్రవ్యార్జన చేయ జాలకపోయారు. తన తండ్రివలె అతడూ అదృ ష్టాన్ని వరించలేకపోయాడు. తెలుగు వాఙ్మయ విమర్శకాగ్రేసరుడు, జీవితచరిత్రకారుడు, పండిత గొర్రెపాటి గోపీచంద్ కథారచనా నైపుణ్యానికి చేసిన సేవను బహుముఖాలుగా ఉటంకించారు. శ్రీ కె. గోపాలస్వామికూడా 'తెలుగుసాహిత్యం' అనువిషయంపై రేడియోలో మాట్లాడుతూ గోపీచంద్ తెలుగుసాహిత్యమునకు చేసిన సేవను ప్రశంసించారు.

మన మిత్రుడు శ్రీ మోటూరి సత్యనారాయణవల్ల ఆల్ ఇండియా రేడియోలో శ్రీ గోపీచంద్ కుదర బోతున్నారని విని నేను చాలా ఆశ్చర్యపడ్డాను. తెలుగుశాఖ అభివృద్ధిచెందగలదని మేము అభిలషించి నాము. ఎలాగైతేనేం ఆంధ్రమంత్రివర్గం వారి విధా నాలు పరివ్యాప్తి నొందించుకోటానికి ఆయనను వినియోగించుకున్నారు. అది ఆయనకు సంతృప్తి కలగసందున అదీ వదలిపెట్టుట జరిగింది.

దరిద్రబాధలు అనుభవించకుండా తమ భావోద్వేగ ములను ప్రస్ఫుటముగా తెలుపుకోగలందులకు ప్రజ లతో అనునిత్య సంబంధం ఉంచుకొనుటకు రేడియో గోపీచంద్‌కే గాక జాషువా, కాటూరి, పింగళి, దీక్షితులు మొదలైన రచయితలకు ఎంతగానో

తోడ్పడింది. దానికి నేను ఆనందించడమే గాక, అభినందిస్తున్నాను.

కాంగ్రెసును వదలిపెట్టి నెహ్రూ నాయకత్వమును నేను విమర్శించడంవల్ల ఎప్పుడూ చూపనటువంటి గోపీచంద్ అప్పుడు బహిరంగసభలలో ఆసక్తిని కనబరుస్తూ ఉండేవారు. వినోబాభావే నిర్మాణకార్య క్రమముపై వారికి దృష్టిపడ్డది. వాహిని జన్మదిన సంచికకు సందేశమిస్తూ వారు అందులో వినోబాభావేను అనుకరించమని సలహా యిచ్చారు. నేను నాగపూర్ మహాసభలో తీసుకున్న సమష్టి వ్యవసాయ విధానమునకు విరుద్ధమైన వాడను. అందువల్లనే వినోబా గ్రామదానము, భూదానోద్యమాలను వినే నిరోధించాను. అంతేగాదు, జవహర్‌లాల్‌జీ గ్రామదాన రాజకీయపు పెత్తులకు వ్యతిరేకించాను. నాకు రైతాంగ వ్యవస్థలోనే విశ్వాస మున్నదని అప్పటికి గోపీచంద్ గ్రహించారు.

స్వయంపోషకత్వం రైతాంగానికి స్వేచ్ఛను, సుఖాన్ని పొందించునది. రైతాంగ వ్యవస్థకూ రాయిస్టు మానవతా వాదానికీ చేరువసంబంధ మున్నదనటంలో సందేహంలేదు. కాని నిరాత్మ మయమైన కమ్యూనిజం మాత్రం సన్నిహితంకాదు. మానవత్వమునకు స్వయంచోదిత పోషకత్వం చాలా అవసరం. దానికి మూలం నేటి రైతాంగవ్యవస్థ. అందువల్లనే వారు నాతో మిత్రత్వం వహించుటకు ముందుకు వచ్చారు. ఆధునిక సోక్రటీసు అనదగ్గ పూజ్య రాజాజీతోను మాతోను నేడు ఏకీభవించుటకు ఉద్యుక్తులైనారు. సమకాలీన ఆంధ్ర సాహితీ పరులలో మహామేధావులలోగూడా ఈ విధమైన అభిప్రాయము ఉద్భవించినవి.

వారి రచనలు ముఖ్యంగా మేధావులలో బహుళ ప్రచారమందినవి. 'పోస్టుచేయని ఉత్తరాలు' వారి మేధాసంపన్నతకు తార్కాణము.

గోపీచంద్ మృతిచెందడం తీరని లోటనే చెప్పవలసి యున్నది. అంతిమ సమయంలో భగవంతుడు, స్వర్గలోకము అనేవాటిని వారు విశ్వసించ వలసి వచ్చింది. తండ్రికి ఉత్తమకుమారుడు అనదగ్గవారు. ఈ మధ్యనే ఒక నాటకం వ్రాశారు. అందులో వర్తమాన కలుషిత వాతావరణాన్ని చూచి, కాంగ్రెసు దుస్థితినిచూచి ఎంతగా విలపించవలసి వచ్చిందో విపులీకరించారు. కాని ఇప్పుడు ఈ భారతదేశ మత రాహిత్య ప్రజాస్వామ్యాన్ని దాని వైఫల్య పోకడలను ఉత్తమకుమారుడు ఏవిధముగా అభివ్యక్తపరచుచున్నాడోకదా!

# నేను - మా గోపీచంద్

శ్రీ ఆవుల గోపాలకృష్ణమూర్తి

గోపీచంద్ కవిరాజు రామస్వామి చౌదరిగారి అబ్బాయి. అందుచేతనే గోపీచంద్ మా గోపీచంద్ కాలేదు. ఒకనాడు గోపీచంద్ రాయిస్టు; అప్పటికి రాడికల్ అవునోకాదో తెలియదు. 'రాయ్ వ్యాసాలు' 'ప్రజామిత్ర' వార పత్రికలో వ్రాసేవాడు. అది 1938 ప్రాంతంలో. ఎం. ఎన్. రాయ్ సంపాదకత్వాన నడిచే 'ఇండిపెండెంటు ఇండియా' అనే ఇంగ్లీషు వారపత్రికలో సంపాదకునికని లేఖలుగా వ్రాసేవాడు.

కవిరాజుమీద నాకు అప్పటికే వున్న విశ్వాసం, రాయ్‌మీదకలిగిన గురుత్వం, నన్ను గోపీచంద్ వైపుకు కదల్చినవి.

కాని ఆరోజుల్లో తీవ్రతరమైన గ్రాంధిక భాషావాదిని. మా ఎలవర్తి రోశయ్యగారితో కలసి 'యధార్థ నవ్య సాహితీ సమితి'ని పెట్టి, దాని పీఠాధిపత్యం వహిస్తూవున్న రోజులు. అంటే మిత్రులు, పెద్దలు తల్లావఝ్ఝుల శివశంకరశాస్త్రిగారు (నేటి స్వామీ శివ శంకరులు) అధ్యక్షత వహిస్తూవున్న 'నవ్య సాహితీ సమితి'కి ప్రతిగా, పోటీగా, భాషావివాద పరిష్కారం కోసమని, మేము మడిగట్టిన భాషా వాదాల్ని ప్రోత్సహించే రోజులవి.

గోపీచంద్, శ్రీ జి. వి. కృష్ణయ్య (నేటి డా॥ జి. వి. కృష్ణారావు), కోగంటి రాధాకృష్ణమూర్తి, పి. వి. సుబ్బారావు మొదలైనవారంతా ఒకవైపున రాయిస్టులు, మరోవైపు సాహిత్యావలంబులు,

సాహిత్యంలో రాయిస్టు దృక్పథగాములుగా వీరివంక ఆంధ్రదేశం చూచేది.

నేను, మిత్రుడు ఏలవర్తి రోశయ్యా గోపీచంద్ సాహిత్యాన్ని గురించి వ్రాసిన వ్యాసాన్నిచూచి, వారి పరిభాషను చూచి (సాహిత్యంలో బూర్జువా డెమొక్రాటిక్ విప్లవం రావాలి అన్న వారి నినాదాన్ని) అంగీకరించకపోగా, యేవగించుకొనేవాళ్లము.

అందువల్ల రాజకీయరంగంలో, సాంఘికరంగంలో నాకు గోపీచంద్‌కువున్న సన్నిహితత్వం, సాహిత్యరంగంలో లేక పోయింది. తరువాత కొన్నాళ్లకు నేను గ్రాంధికవాదాన్ని వదలటం జరిగింది. గోపీచంద్ సాహిత్యాన్ని రాజకీయదృష్టితో అన్వయించటం ఆపివేశాడు.

నేను తెనాలికి 1942 లో వచ్చినప్పటినుంచీ మా యిద్దరికీ యెక్కువ సాన్నిహిత్యం వుండేది. అంతకు ముందు 1942 వేసంగిలో కవిరాజు సన్మాన సంచిక వేసేరోజుల్లో ఒకటి రెండుసార్లు మాత్రం కలిశాము.

గోపీచంద్ చురుకైన సంభాషణలుచేసే వ్యక్తి. అతనిలో ప్రధానమైన గుణం అదే. అతని సంభాషణలు అతనికి ఎంతో సంతోషాన్ని, బలాన్ని యిచ్చేవి. ఆ చురుకుదనంలో ఒక రకమైన హాస్యం వుండేది. వక్రోక్తి కొంతహెచ్చు. అయినా రక్తికట్టేవి.

గోపీచంద్‌లో మరొక ముఖ్యగుణం – బాగా చదివేవాడు. చదివినట్లు కనబడేవాడుకాదు. చదివింది మననం చేసేవాడు. తనలోకి లాక్కొని తనదిగా చేసేవాడు; చేసిన తర్వాతగాని వ్రాసేవాడు కాదు. వ్రాయటం మొదలుపెట్టినా అచ్చుకు వెళ్లనిచ్చేవాడుకాదు.

వ్రాసిన కథలే అనేక పర్యాయాలు వ్రాసేవాడు. చెడగొట్టి, చెడరాసి, అచ్చుకిచ్చాక మళ్లీ చూచి, ప్రూఫుల్లో దిద్ది, ఫారంకట్టినాకగూడా దిద్ది దుంప తెంచేవాడు. అదంతా మంచిగా చెప్పాలన్న మనోగత భావాన్ని పురస్కరించుకొని జరిగేది. రచనలో తన వ్యక్తిత్వాన్ని బాగా ప్రతిబింబించేవాడు. శైలిని బట్టి మనిషివరవడిని చెప్పటానికి గోపీచంద్ శైలి మంచి నమూనాపాకంగా వుండేది.

1942 నుండి మూడునాలుగేళ్లు పార్టీగత, రాయిగత విషయాలమీద బాగా శ్రద్ధచూపి, ఆంధ్రరాష్ట్ర రాడికల్ డెమోక్రాటిక్ పార్టీ ప్రధాన కార్యదర్శియైనాడు. 'రాడికల్' పత్రికలో తరచు వ్రాసేవాడు.

ఆనాటి సాంఘికాభిప్రాయాలుగాని, రాజకీయాభిప్రాయాలు గాని, తాత్త్విక రంగానికి సంబంధించిన భావాలు గాని హేతువాద పునాదిమీద వుండేవి. ఆనాడు గోపీచంద్, నావంటి చాలమందిలాగ నాస్తికుడు.

తరువాత గోపీచంద్ రాడికల్ పార్టీకి దూరంగా, తెనాలికి దూరంగా వెళ్ళి, మద్రాసులో సినిమా రంగంలోకని వెళ్ళినదగ్గరనుండి గోపీచంద్‌లో క్రమానుగత పరిణామం వచ్చింది. సినిమా డైరెక్టరు కావాలన్న ధ్యాస ఆయనకు హెచ్చుగా వుండేది. "మన తత్త్వానికి కదిపడదు. అందులో మీకు బొత్తిగా పడదు. వ్రాస్తే దూరంగా వుండి కథలు వ్రాస్తూ, రచనలోనే ప్రధానంగా వుండండి" అని నే నెన్నోసార్లు చెప్పాను. 'మీ తత్త్వానికి పడదేమో' కాదనట్లు నవ్వేవాడు. గోపీచంద్ నవ్వు అనేది ప్రత్యేకం. పెద్దగా యిల్లుకప్పు యెగిరేటంతగా నవ్వేవాడు.

సినిమాలో యిమడలేదు. కొన్నాళ్లు కాసట బీసటగా వుంది. హేతువాదిగా వున్న గోపీచంద్ దిగజారి, మతవాదిగా మారిపోయాడు. రాయ్‌ని వదలి అరవిందుని ఆశ్రయించాడు. కవిరాజులో నాస్తికతకు బదులు ఆస్తికత చూడనారంభించాడు. రచనలో

పూర్వం వున్న బిగువుపోయి పలచబడింది. గోపీచంద్‌లో అపూర్వపరిణామం వచ్చింది. పోస్టు చెయ్యని ఉత్తరాల్లో పడింది వరవడి. దాంతో గోపీచంద్ మాకు కొంచం దూరంగా జరగటం మొదలు పెట్టాడు. మనుషులము దగ్గరగా కూర్చున్నా భావాల వలయాలు వేరువేరుగా వుండిపోయినై.

హేతువాదంలోకన్నా మత వాదంలో పరిధి పెద్ద దన్న భ్రాంతిలోపడ్డాడు. రాడికల్‌గా వున్న గోపీచంద్, హ్యూమనిస్టుకాకుండానే మతవాదిగా రూపాంతరం పొందాడు. దానితో మాకు మార్గభేదం, వాదభేదం యేర్పడినవి.

రచయితగా గోపీచంద్ ప్రాయికంగా కథకుడు. కథకుడుగా అతని స్థానం వుదాత్తమైంది.

మనిషిగా గోపీచంద్ అతని రచనల్లో కనబడినట్లు తెలుగునాటి మరే రచయితా కనబడడు. అతని వ్యక్తిత్వాని కిదే తార్కాణం.

రచయితగా, వ్యక్తిగా గోపీచంద్ చిరస్థాయిగా మనగలడు.

# వచ్చిన మార్పు

నా కథాకథనంలోని బిగువు తగ్గుతూ వస్తూవుంది. అలా తగ్గటంవల్ల ఏర్పడిన ఖాళీ స్థలంలోకి జీవితం చొచ్చుకువస్తూవుంది. అలా చొచ్చుకురావటానికి జీవితం పడే తాపత్రయం నాకు చూడ ముచ్చటగా వుంటూవుంది.

ఏక ముఖం, బిగిసిన ముఖం కలిగిన విమర్శకులు నా ఈ మార్పుకి కారణాలు వెతికి వారివారి స్థానాలకు ఉచితమైన వాటిని ఏకరువు పెట్టవచ్చు. కాని చట్రం సడలటంవల్ల వచ్చిన నష్టమేముంది? ముఖ్యంగా ఆ సడలింపు ఒక ప్రయోజనాన్ని సాధించటానికి జరిగినప్పుడు లాభమేగదా!......

రచనా విధానంలోని ఈ రకమైన సడలింపు రచయితకు అనుభవం, వివేకం పెరగటంవల్ల వస్తుందని నేను అనుకుంటున్నాను. జీవితానుభవం ఎక్కువ అవుతున్న కొద్దీ మన దృష్టి ఎంత అసమగ్రమైందో మనకు తెలిసివస్తుంది. వివేకం హెచ్చినకొద్దీ మనం నమ్మినదానికంటే ఈ ప్రపంచంలో ఇంకో దృష్టి మసలటానికి వీల్లేదనే ఊహం నశిస్తుంది. అప్పుడు మనం ఏదో ఒక అర్ధసత్యాన్ని చదువరులమీద రుద్దలేం. ఆ స్థాయిలో జీవితాన్ని బహుభంగుల చిత్రీకరించి వూరుకోబుద్ధి అవుతుంది. అప్పుడు జీవితం మనం గీసుకున్న సరిహద్దులనుదాటి పొర్లుతుంది. మనం అనుసరించే విధానాన్ని కప్పివేసి ప్రవహిస్తుంది. దీనివల్ల విధాన వాదులకు, విధానం పలచబడినందుకు బాధ కలిగితే కలగవచ్చుగాని సాహిత్యానికిమాత్రం ఏలోటూ రాదు.

ఇది ఋజువు కాబడిన సత్యం.

[కథల పీఠికనుండి]

గోపీచంద్

# సూత్రాశ్రమం

కత్తివంటిది తార్కికబుద్ధి
ఇరువంకల పదనుగల కత్తివంటిది.
సుత్తివంటిది ప్రజల మూఢవిశ్వాసం
ఆటంకాల సహించని అహంకారం.
రెండూ ఢీకొనినవేళ విలయ విప్లవ స్ఫులింగ మహాసారం
సృష్టికావ్య నవాశ్వాస మహోచ్ఛ్వాసం
తార్కిక శిలల నిర్జల సంకుల సంకటభూమి
సామాన్య కుసుమ కన్యల నెలవుకాదు
శూలాగ్రాల శయనించే (కల్పనాకోమల హంసతూలికల
తల్పంమీదకాదు)
అశరీర దివ్యాప్సరలు మాత్ర మచట
అసిధారా ప్రఖర తీక్ష్ణ మేధా గంధవీచికలపై నర్తిస్తారట.
అన్యు లచ్చట చొరరాదు
ఆ అందం అందరికొఱకుకాదు.
రోమాన్సుల రోమాంచాలు
స్తన స్తబక కలనా నమ్ర లలనా క్రమ తనూ వల్లరీ వేల్లిత
ప్రాబంధిక ప్రణయ నికుంజాలనీడ
మానవ మాంస గంధమాదన పర్వతాల బంగరు
విరుల మరుల వాడ
భావంలేని చీకటిలో మాటల బాణసంచాలు
ఇవి అందరికీ అందే ఆనందాలు.

బైరాగి

త్రోవతేలిక కౌగిలినుంచి మంచంవరకు
ఆకలినుంచి కంచంవరకు
సూతాశ్రమ సత్రమాధ్వం అందరిదీకాదు
శస్త్రకారుని శస్త్రం దయతో నవ్విన అందం
ఎర్రని మూసలోన, అనాయాస శ్వాసలాగ
కవిరాజు పద్యంలా పారే లోహపు అందం.
మింటిన ఒంటరిగా పయనించే ఇనుపడేగ తెల్లనిరెక్కల అందం
డీనుస్విఫ్టు, అనటోల్ ఫ్రాంసుల వ్యంగ్యపు టందం అందరిదీకాదు.
హిమాలయపు వాయొలిన్‌పై మంచుతుపానుల కమాను
రేపిన మహోగ్ర సంగీతం
సహారా ఎడారిలోన సైకతఝంఝం, సూర్యుని తప్త హేమజ్వాల
చుక్కల ప్రఖర హైమజ్వాల
సాగరాలు, భూధరాలు, ఊహల కాననాలు
ఆవేదనల అనంతంలో మానవ హృదయ గ్రహ గోళాలు
కవితనుగూర్చి 'నేతినేతి' అననివానిని
గోష్పదమంత జలంలో మునిగిచావమనవద్దా?
ఇసుకను చూచి బెదరే రసికులకు
సులభాశయ జలాశయాలు కనుపించాలి
చేరువలో నీరుల కలకలాలు వినిపించాలి.
పాపం వారి కేమి తెలుసు
ఇసుకలోనే దాగిఉంది మానవుల మహాతీర్థం
అమృతపు అంతర్వాహిని
సరస్వతి.

# నేనెరిగిన గోపీచంద్

శ్రీ బుచ్చిబాబు

మొదటిసారి 1936 లో మద్రాసులో కలుసుకున్నాను గోపీచంద్‌గారిని. తాత్విక చింతనలో ముడివడ్డ రాజకీయ, సాంఘిక సిద్ధాంతాల ప్రచారంలో కృషి చేస్తూ కొన్ని రచనలు చేసినట్లు విన్నానుగాని అప్పట్లో వారి రచనలు నేను చదువలేదు. గంభీరమైన విగ్రహం, నిండైన కంఠం, ఆహ్లాదాన్ని సూచించే నవ్వు, కచ్చితమైన మాటల్లో స్పష్టమైన భావ ప్రకర్ష, లోతుగా తికమకలతో కూడి సువిశాలంగా కనబడే విషయాన్ని చటుక్కున గ్రహించి, సూటిగా పరామర్శించ గల ఊహాశక్తి—ఇవి మరపురానివి.

రేడియో నాటికలు వ్రాయించే సందర్భంగా వారితో స్నేహం ఏర్పడింది ఆ రోజుల్లో. నైతిక, ఆధ్యాత్మిక విలువల్ని సాంఘిక దృష్ట్యా పరిశీలించే అవసరం ఉందన్న వారి అభిప్రాయాన్ని పురస్కరించుకొని, అట్లాంటి నాటికలకి అనువైన వస్తువు సూచించి, వారితో చర్చించిన సందర్భాలుండేవి. వీటి ఫలితంగా వారు వ్రాసిన కొన్ని నాటికలను గురించి చెప్తాను. ఒకటి మాంచాల. ఇది చారిత్రక నాటిక—దేశభక్తి, త్యాగము ప్రధాన విషయము. వీర, రౌద్ర, విషాద రసాల వ్యుత్పన్నత, నటుల కౌశల్యంపై ఆధారపడి ఉంటుంది. చెయ్యవలసిన పనికి పురికొల్పడానికి ఉద్రేకం అవసరం అవుతుంది కాని, తర్కం కాదు. కాని గోపీచంద్‌గారి నాటికలో, పాత్రలు తమ ఉద్రేకాలని అదుపులోకి తెచ్చుకుని, వారి నిర్ణయాలకు, చేష్టలకు కారణాలు పేర్కొని నిదానంగా చర్చించు

కుంటాయి. నిర్ణయానికి కారణాలు సమంజసమైనవి, ఆచరణీయమైనవి అని తోచగానే ఆ కారణాలే ఉద్రేకాలుగా ఎదుర్కోడం, ఈ నాటికలో ప్రత్యేకత అనుకునేవాడిని. ఉద్రేకం పాటలోనో, పద్యంలోనో అంతం అవాలన్న నాటక సంప్రదాయం ప్రకారం సుదీర్ఘమైన చర్చకి, తర్కానికి చోటులేదు. ''కవిత మాత్రం ఆవేశం రేకెత్తించగల"దన్న అభిప్రాయం సరైంది కాదని ఇబ్సెన్, షా, ప్రీస్లే, నాటకాలు ఋజువు చేశాయి. రేడియోకి వ్రాసినప్పటికీ, 'మాంచాల'లో తర్కబద్ధమైన ప్రేరణ రసానుభూతికి సాధనగా ఉపకరించడం విశేషం.

ఆ రోజుల్లో బుద్ధిని కవ్వించి, వూహల్ని చక్కిలిగింతలు పెట్టిన పుస్తకాలు హక్స్‌లీ 'బ్రేవ్ న్యూ వరల్డ్' సామ్యుఅల్ బట్లర్ 'ఎరివాన్' అనేవి. హక్స్‌లీ పుస్తకంలో మెళుకువలు పూర్తిగా అవగాహన చేసుకోవాలంటే, వివిధ శాస్త్రాలలో ఆధునిక విజ్ఞాన శాస్త్రం గావించిన పరిశోధనలతో పరిచయం ఉండాలి. బట్లర్ ''ఎరివాన్''కి ఇదేమీ అంతగా అక్కర్లేదు. ''ఎరివాన్'' అన్న మాటకి అర్థంలేదు. ఎక్కడా లేదు అన్న అర్థం సూచించే 'Nowhere' అన్న పదాన్ని కుడినుండి ఎడమ వైపుకు అక్షరాలు త్రిప్పి వ్రాస్తే వచ్చినమాట. ఎరివాన్‌లో ఆదర్శాలతో నిండిన రామ రాజ్యం లాంటి ఒక వూహాసమాజం చిత్రితమైంది. మానవుడు అనుసరించగల నైతిక విలువలను, ఆతనికి ఆనందాన్ని సమకూర్చే సామాజిక సంప్రాదాయాలను మానవుడే సమకూర్చుకోవాలి గాని,—ఇతర శక్తుల మీద ఆధారపడకూడ దన్న హేతువాదం యీ పుస్తకంలో ప్రధాన వస్తువు. 'మానవుడు చేసిన ఘన కార్యాలలో నిజాయితీ గల దైవాన్ని సృష్టించడం ముఖ్యమైంది' అన్న నిర్వచనం చేసిన రచయిత ఈ ఎరివాన్ రచించిన బట్లరే. ఇందులో అస్వస్థులైన వారిని కోర్టులో విచారణచేసి, వారి వారి జాడ్యాలు, జబ్బులనుబట్టి కారాగారశిక్ష విధిస్తారు. నేరస్థులను—హాస్పిటల్స్‌లో ఉంచి చికిత్సచేసి, కుదిర్చి ఇంటికి పంపుతారు. ఈ అంశాన్ని వస్తువుగా నాటకం కూర్చాలని సూచించగా, గోపీచంద్‌గారు బట్లర్ పుస్తకం చదివి, 'విచిత్ర ప్రక్రియ' అనే నాటికని కూర్చారు. ఇది వినోదకరంగాను, సుబోధకంగానూ ఉంటుంది. ఆ రోజుల్లోనే వారి దృష్టి మానవతావాదంపై (Humanism) మరలిందనుకుంటాను. ఆచంట జానకిరామ్‌గారి సూచనపై అప్పుడే ఉన్నవ లక్ష్మీనారాయణ "మాలపల్లి"ని నాటకంగానూ, 'పశ్చిమ వాహిని' అన్న మరో నాటకమూ వ్రాశారు. శిక్షణకి, తర్కానికి లొంగని శారీరక వాంఛ—యౌవనోద్రేకం కల్పించిన ప్రేమ కల, వాస్తవిక జ్వాలలో ఎల్లాగ కరిగిపోతుందో చిత్రిస్తుంది 'పశ్చిమ వాహిని'. అంతర్జాతీయ సంస్కృతి నెలకొల్పాలని ఉబలాటపడేవారికి జాతీయ తత్వం రుచించక పోవచ్చు. దేశభక్తినుండి జనించే జాతీయ సంస్కృతి నిలబడే సంస్కృతి. అట్లాంటి అనేక జాతీయ సంస్కృతులు కలిపి, ఒక ఉమ్మడి సంస్కృతి నెలకొల్పడం అసాధ్యం, ఒకవేళ సాధ్య పడినా నిష్ప్రయోజనం, అని టి. ఎస్. ఎలియెట్ లాంటివారు అభిప్రాయ పడుతున్నారు. నేడు మన దేశానికి క్లిష్ట పరిస్థితి ఏర్పడింది. ఈ సందర్భంలో దేశభక్తి, జాతీయతత్వంపట్ల అభిమానం సన్నగిల్లడం సముచితమా అన్న ప్రశ్నని మేధావులందరూ తరిచి చూడాలి.

గోపీచంద్‌గారి అప్పటి నాటికలలో యీ రకం సమస్యల ప్రస్తావన నిగూఢంగా వుంది. అది అందలి ప్రత్యేకత.

తర్వాత వారు సినిమారంగంలోనూ, కొంత కాలం ఇన్‌ఫర్‌మేషన్ శాఖలోనూ కృషిచేసి,

ఆంధ్రప్రదేశ్ అవతరించగానే హైద్రాబాద్ వచ్చినప్పుడు, మళ్ళీ అక్కడ వారితో కలిసి పనిచేసే అవకాశం కలిగింది.

అప్పుడు వారు మరికొన్ని నాటికలు వ్రాశారు. ప్రతివారూ వారికి రుచించనిది జరిగినప్పుడు సంఘాన్ని దూషించటం పరిపాటవుతుంది. ''పోనిస్తురూ, గుడ్డి సంఘం'' అని సంఘాన్ని ఆడిపోస్తారు. ఈ గుడ్డి సంఘం ఎవరు? సంఘాన్ని కళ్ళులేని ఒక వృద్ధురాలిగా చూపాలి. ఆమె దోవలో పోతూవుంటే నలుగురూ తిడతారు. ఆమె సమాధానం ఏమిటి? మీరు యీ విషయాన్ని నాటకంగా రూపొందించాలని కోరగానే, గోపీచంద్‌గారు 'గ్రుడ్డి సంఘం' అనే నాటిక వ్రాశారు. ఇదొక చక్కని సాంకేతిక ఊహాచిత్రం. సంఘంలో వ్యక్తుల నైతిక నాడులని కదిపే సన్నివేశాలు, మానవతావాదం లేవదీసిన భవనం పునాదులను ఊపిచూసే ఊహాబలముగల నాటిక యిది.

గోపీచంద్ ఇంకా ఎన్నో రేడియో నాటికలు వ్రాశారు, నిర్వహించారు. నాకు తెలిసిన కొన్నింటిని చెప్పాను. వివిధ సాహితీ ప్రక్రియలతో కృషిచేసి విజయం సాధించిన రచయిత గోపీచంద్. రచయిత అంతరంగ జగత్తులో ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించి, తన వ్యక్తిత్వంతో సమన్వయం కుదుర్చుకునేందుకు, కథానిక, నవల—గద్య రచయిత విషయంలో వుపకరిస్తాయి. ఈ సమన్వయం కుదిరి, వ్యక్తిగతశీలం స్థిరపడిం తర్వాత, తన చుట్టూవున్న స్థూల జగత్తులోని సమస్యలు, వాటి పరిష్కారం గురించి పట్టించుకుంటాడు రచయిత. ఈ దశలో వ్యాసం, నాటకం ద్వారా పరిష్కారానికి పూనుకుంటాడు. గోపీచంద్‌గారి రచనలు ఈ రెండు దశలలోనూ కొనసాగాయి. అంతరంగ జగత్తు నుండి వెలువడ్డ కథానిక, నవల కాలానుగుణమైన సామాజిక సమస్య సాలిగూడులో చిక్కుపడక కొంత కాలం పాటు చలామణి అయ్యే విలువల్ని కలిగి వుండడం సహజంగనుక, గోపీచంద్‌గారి కథలూ, నవలలూ సాహితీ రంగంలో ఒక స్థానాన్ని సంపాదించుకున్నాయి. వారి 'అసమర్థుని జీవయాత్ర' చాలా మంచి నవల. లోపలి వస్తువుకి సాంకేతికం అనడం మాత్రమేకాక, ఆ పేరులో జీవిత విమర్శ, భావగర్భితమైన తీర్పు కూడా యిమిడి ఉన్నాయి. హేతువాదులు (Rationalists), మానవతావాదులు (Humanists) శాస్త్రీయమైన నిదర్శనాలు లేనిదే ఏదీ నమ్మనక్కర్లేదనీ, మానవ శ్రేయస్సు కంటే ముఖ్యమైన ఆదర్శం ఏదీ వుండనక్కర్లేదనీ ప్రచారంచేస్తూ వచ్చారు. డార్విన్, ఫ్రాయిడ్, ఫ్రేజర్—తర్వాత తర్వాత ఐన్‌స్టీన్ ప్రముఖ ఖగోళ శాస్త్రజ్ఞుల పరిశోధనా ఫలితాల నాధారంగా వెల్స్, బెనెట్, జోలా, ఆనటోల్ ఫ్రాన్స్, ఆర్వెల్ లాంటి రచయితలు వాస్తవిక ధోరణిలో సాంఘిక, నైతిక విలువలని పరామర్శించారు. మూఢాచారాలకు గురియైన ప్రతి సంఘంలోనూ, హేతువాదం ప్రచారం అవసరం. సర్వేపల్లి రాధాకృష్ణగారన్నట్లు శిఖరాన్ని సాధించేటందుకు చాలా మార్గాలున్నా, శిఖరం చేరుకున్న తర్వాత పైనుండి కనబడే దృశ్యం ఒకటే. పారిశ్రామిక పురోభివృద్ధి, విజ్ఞానశాస్త్రం సాధించిన ఫలితాలు మానవుడికి కొత్తశక్తుల్నీ జిజ్ఞాసనీ సమకూర్చాయి. అయినా, బహు సంఖ్యాకుల గుంపు తత్వంలో వ్యక్తి నలిగి అసమర్థు డవుతున్నా డన్న ధ్వని వుంది యీ నవలలో. 1958లో నా ఏకైక సోదరుడు అస్తమించినప్పుడు, ఒక మిత్రుడు ''విచారించి ఏం ప్రయోజనం. మనం చేసేది ఏమీలేదు'' అని సానుభూతి తెల్పుతూ అన్నాడు. ''చేసేది ఏమీలేదు గనకనే బాధ, ఆవేదన'' అన్నాను. ప్రక్కనే వున్న గోపీచంద్ ''అవును,

అదెట్లాంటిదో నాకు తెలుసు'' అన్నారు. ''అందంగా, నిశ్చలంగా, బాధ, ఆవేదన లేకుండా వుండటం ప్రకృతియొక్క ఆదర్శం. నే నది సాధించలేక పోయినా, ఆ స్థితిని ఊహించగలను.'' అన్న రిచర్డ్ జెఫ్రెస్ వాక్యాలు జ్ఞప్తికొచ్చాయి.

వారెన్నో కథానికలు వ్రాశారు. దేశభక్తి నైతిక జీవితంతో ముడిపడ్డ శీలంద్వారా మానవుడు సంఘంలో తేగలమార్పు కథానికలకి ప్రేరణ. మానవుడుగా నిజాయితీ అలవర్చుకున్న తర్వాతే రచయిత కృషికి విలువ, ప్రయోజనం వుంటాయని గోపీచంద్ గారి విశ్వాసంలా తోస్తుంది. వ్యక్తి శీలమూ, నిజాయితీ ప్రవర్తనలో కనబడ్డట్లే, రచయిత ఊహాబలమూ, ప్రతిభ, రచనలో కనబడతాయి. వారి 'సంపెంగపువ్వు' అనే కథలో నాయిక అన్నమాటల వెనుక, వారికంఠమే వినబడుతున్నట్లుంది :

''నేను చాలామంది రచయితల్ని ఎరుగుదు. వాళ్ళ రచనల్లో వెలిబుచ్చే అభిప్రాయాలు ఎంత అభివృద్ధి దాయకంగావుంటై ! కాని ప్రవర్తన మామూలు మనిషి ప్రవర్తనకంటె అధ్వాన్నంగా వుంటుంది. దీనికి భావాలను, ఆలోచనలను, ఆచరణలోకి, అనుభవంలోకి తీసుకురావాలనే ప్రయత్నం లేకపోవటమే కారణం అనుకుంటాను.'' సాహిత్యంద్వారా సంస్కారానికి పూనుకునే రచయిత మొదట తన్నుతాను పరీక్షించుకొని, తన నిజాయితీ, శీలం, వ్యక్తిత్వం పట్ల నమ్మకం కలిగింతర్వాతగాని అర్హుడు కాడన్న వీరి అభిప్రాయం గమనింపతగింది.

గోపీచంద్‌గారిది నిరాడంబరమైన శైలి. సూటిగా, సులభంగా, స్పష్టంగా చెప్పడమే వీరి ఆశయం. ఇదికూడా సహజంగా, అప్రయత్నంగా కొనసాగాలి. తికమకలకు, మెలికువలకు, గారడీలకు, బాణసంచా పేల్పులకు వారికి వ్యవధిలేదు. వాస్తవిక ధోరణిలో వ్రాయాలనుకున్నప్పుడు, అట్లాంటి ప్రయత్నం వుండదేమో. వారి కథానికలో ఒక పాత్ర అంటుంది ''నేను అందంగా, తెలివిగా మాట్లాడుతున్నానా లేదా ? అనే గొడవేగాని, సహజంగా మాట్లాడుదాం అనిగానీ, యదార్థంగా మాట్లాడుదాం అనిగానీ మీకు ఎందుకు వుండదు ?'' వారి శైలికి మచ్చుగా ఈ వాక్యాలు చూడండి.

''నాకు ఇంకొక లోకంలో వున్నట్లుంది. ఆమె మాత్రం వీటిని గమనించనట్లు యథా ప్రకారం మాట్లాడుతూనేవుంది. అందరినీ ఒకేమోస్తరుగా పలకరిస్తూ మాట్లాడింది. సెక్సునుగురించి ఆమె ఫ్రీగా మాట్లాడుతూవుంటే కుర్రవాళ్లంతా కిక్కురుమనకుండా విన్నారు. అవునూ, కాదూ అంటానిక్కూడ వాళ్లకు ధైర్యంలేకపోయింది. ఊకొట్టటానికే వాళ్లకు సిగ్గు వేసింది. 'నేనుస్త్రీని' అనే భావం ఆమెకు చచ్చినా గుర్తుకురాలేదు.''

ఇవి సహజంగా మామూలుగా మాట్లాడుకునేటప్పుడు వాడే పదాలతో కూర్చిన వాక్యాలు. 'సెక్సు', 'ఫ్రీగా' అన్నవాటికి తెలుగు మాటలు వాడాలన్న యత్నంలేదు. 'ఆమెకు చచ్చినా గుర్తుకురాలేదు' అన్నదాంట్లో 'చచ్చినా' అన్నది మామూలుగా వాడే మాట. ఆలోచిస్తే మరొక మాట వాడితే మంచి దనిపించవచ్చు. శైలికోసం యత్నం చెయ్యకపోవ డానికిది ఉదాహరణ. ఇది అనుకొన్నంత సుళువుకాదు.

తత్వజ్ఞుల జీవిత చరిత్రలు, వివిధ రాజకీయ, వైజ్ఞానిక తత్వాలనిగురించి వ్యాసాలు ఎన్నో వ్రాశారు. గోపీచంద్, ''చీకటిగదులు'' అనే పెద్దనవల పూర్తవకుండా నిలిచిపోయింది. చివరి రోజుల్లో వారింకా దేన్నో అన్వేషిస్తున్నట్లుంది-ప్రాక్ పాశ్చాత్య తత్వాలను క్రోడీకరించి, సమన్వయపరిచి, ఆ కలయిక నుండి, మరేదో కొత్తతత్వాన్ని తెలుసుకుని, దాని

వెలుగులో తమతోటి వారితో యాత్ర సాగించాలన్న పట్టుదలతో చివరివరకూ కృషిచేశారు.

జీవిత రహస్యం తెలుసుకున్నాక యోగిగా అయి, వ్రాతకే పూనుకోడేమో రచయిత. తాము అంతరంగ జగత్తులో తలపెట్టిన విజయం పూర్తికాకుండా, మధ్యలో, నడివయస్సులో గోపీచంద్ పరమపదించడం సాహిత్యలోకం దురదృష్టం. రచయిత సంఘంతో బంధనాలు తెంచుకోలేని ఏకాంత జీవి. అతని దృక్పథాన్ని హర్షించి, స్వీకరించి, అతని అంతరంగాన్ని పంచుకోవాలని ఉబలాటపడే సమకాలిక తోటి రచయితలు ఎందరోవుండరు. ఉన్నవారిలో ఒకరిని గోల్పోయినందుకు నాలోవున్న బాధని పాఠకులతో పంచుకోవాలనే యీ ప్రశంసా వాక్యాలు. రచయిత కోరేది తన రచనలు నలుగురూ చదవడం. గోపీచంద్ రచనలన్నీ పరిశీలించి, వాటిలోంచి వైవిధ్యంగల రచనలని ఏరి, ఒక వెయ్యిపేజీల ఆమ్నిబస్ గ్రంథంగా వెలువరించి తక్కువ వెలలో అందజెయ్యవల్సిన అవసరం ఎంతేనావుంది.

# పాపిష్టి సంఘం

మంచాన్ని అంటుకుపోయి మూలుగుతూ పడుకున్న కేశవయ్య కొడుకుని దగ్గరకు పిలిపించుకునేటప్పటికి వరండాలో మూగిన అప్పులవాళ్ళల్లో గుంపుచింపులు— ''ముసలి ముండాకొడుకు ధనం దాచేవుంటాడు. మన సంగతి ఏంచెపుతాడో !''

కేశవయ్య కొడుకుని దగ్గరకు రమ్మని ఇలా చెప్పాడు: ''బాబూ, నే బ్రతకను. చచ్చిపోయేముందు నీకొక సలహా చెబుతాను...'' అని చెప్పి బాధతో కొంచెంసేపు ఆగి, ఈ విధంగా పూర్తిచేశాడు—''చచ్చిపోయేటప్పటికి వీలైనన్ని అప్పులుచేసి వుంచుకో. ఈ పాపిష్టి సంఘాన్ని మోసం చెయ్యగలిగాననే తృప్తి వుంటుంది.''

తండ్రి ఈ మాటలు చెప్పినప్పుడు కొడుక్కి కష్టంవేసింది. కాని పెద్దవాడై లోకులు తన్ను ముంచి, చచ్చిపోయేటప్పుడు ఒక్క పిట్టయినా చూడటానికి రానప్పుడు, తండ్రిమాటలు విననందుకు పశ్చాత్తాపపడ్డాడు—

గోపీచంద్

# నా పరిచయం

దేశస్వాతంత్ర్య ప్రమాదానికీ, ఒక అభిమాన వ్యక్తి మరణానికీ పోలిక చెప్పడం భావ్యం కాదుగాని, ఎందుకో చైనాదాడి వార్తవిన్నప్పుడు ఎలా వుందో నా మనస్సు, గోపీచంద్ మరణ వార్త విన్నప్పుడూ అలానేవుంది. కొన్ని క్షణాల వరకు ఏమీ తోచని స్తబ్ధత. సరిగా వారంరోజుల క్రితం రేడియో స్టేషన్లో కలుసుకున్నప్పుడు ''హైదరాబాదులో యిల్లు కట్టుకోవాలనే ప్రయత్నం ఏమైనా వుందా?'' అని అడిగాడు. ఎప్పుడు కలిసినా ఆదర్శాలు మాత్రమే వల్లించకుండా, జీవితపు వాస్తవ స్థితిలోకి దిగి ఎదుటివాడి కుటుంబ విషయాలు, యోగ క్షేమాలు విచారించడం ఆయనకు అలవాటు. ''నాకింకా ఆస్థితి రాలేదని'' నేను సమాధానమిచ్చాను. దీక్షవుంటే ఆస్థితి దానంతట అదే వస్తుందన్నాడు. అసలే గోపీచంద్‌ది సింహగంభీరమైన విగ్రహం. నడుస్తుంటే మేరువు కదుల్తున్నట్లుంటుంది. ఆయనముందు కూచుని, చెప్పేది వింటుంటే నాకు ఎదొకరకంగా వుంటుంది. అవతలి వాడు ఎంతటివాడైనా మామూలుగా నా అభిప్రాయం నేను చెప్పగలను. నాతత్వమే అది. కాని గోపీచంద్ ముందు ఎందుకో జంకేవాణ్ణి. ఆరోజు మాత్రం నేను వెనక్కు తగ్గి మాట్లాడడానికి వీలే లేకపోయింది. ఎందుకంటే ఆయన అన్నాడు గదా– ''తెనాలిలో మాయిల్లు వగైరా అమ్మేసి హైదరాబాద్‌లో యిల్లు కట్టించుకోవాలని వుంది. ఇంక మేము తెనాలి పోయేదిలేదు. ఎందుకక్కడ యిల్లు?'' నా కేమీ నచ్చలేదు. నేనన్నాను–''మీకు సంపాదనకు

శ్రీ కుందుర్తి

తక్కువేమీలేదు. కట్టితే హైదరాబాదులో యిల్లు కట్టండిగాని తెనాలిలోది అమ్మడం దేనికి ?" "ఏం అది పిల్లలు పెడుతుందా" అన్నాడు. ముక్తసరిగా చెప్పాను. "తెనాలిలో మీయింటికి ఒక చరిత్రవుంది. ఎవరైనా కుటుంబ చరిత్రను అమ్ముకుంటారా ?" ఆయన మళ్ళీమాట్లాడలేదు.సంభాషణ మరొక విషయం వేపుమళ్ళింది. నే నన్నది ఆయనకు నచ్చిందో లేదో తెలియదు. అడిగి తెలుసుకునే అవకాశం కూడ యింకలేదు. హైదరాబాదులో సొంత యిల్లు కట్టుకోవాలని చివరి రోజుల్లో ఆయనకు అంతగాఢంగా మనసులో వుండేది. ఆకోర్కె తీరకుండానే ఆజీవి వెళ్ళిపోయింది. స్మారక చిహ్నాల సంగతి తరువాత చూద్దాంగాని, హైదరాబాదులో సొంత యిల్లువుండి, ఆయన అభిమానులైన వారిలో ఎవరైనా ఒకరు తమ యింటికి ఆయన పేరు పెట్టుకుంటే బావుంటుందేమో.

ఆంధ్ర ప్రజలను ఆ మాత్రం కోరేహక్కు గోపీచంద్‌కువుంది. ఎందుకంటె యిటీవలి తెలుగు సాహిత్యం ఆయనవల్ల చాలా బలపడింది. ఆయనకు ఋణపడింది. వాస్తవికతా చిత్రణకు ఆయనది పెట్టినపేరు. మరీ ఆయన హైదరాబాదు వచ్చాక సవ్యసాచిలాగా సాహిత్యసృష్టి చేశాడు. గోపీచంద్ రచనా పాటవం తగ్గిపోయిందనుకున్న వారు దిగ్భ్రాంతి చెందేటట్లు శరపరంపరలుగా నవలలు రాశారు. సినిమా డైరెక్టరుగానూ, సమాచారశాఖ డైరెక్టరుగానూ వున్నప్పుడు చేయలేనిపని హైదరాబాదు వచ్చాక జరిగింది. ఇదీ ఒకందుకు మేలేలే అని నాబోటివాళ్ళు అనుకున్నారు. ఒకసారి రేడియో స్టేషనుకు వెళ్ళిన సందర్భంలో "ఏమండీ యిటీవల కలం భలే జోరుగా నడుపుతున్నారే" అంటే "రాస్తాను" అన్నాడు. తన చుట్టుప్రక్కల సాగుతున్న జీవితాన్ని నిశితంగా పరిశీలించి, తన అనుభూతిని సాహిత్యంగా మలుచుకోవడంలో గోపీచంద్ బహునేర్పరి. అందుకే ఆయన పాత్రలలో మనకు చిరపరిచితులైన వారు తరచు కనిపిస్తుంటారు. గోపీచంద్‌కు సాహిత్యంలో అధికోత్పత్తి అంటే చాలా యిష్టం. కర్నూలులో ఉన్నప్పుడు నా కొకసారి ఒక గంటసేపు బోధచేశాడు "కనీసం ప్రతి ఆరునెలల కొకసారైనా మన పేరుతో ఒక పుస్తకం కనిపించాలి. లేకుంటే ప్రజలు మనల్ని సులభంగా మర్చిపోతారు." అని, ఆయన చివరిరోజు వరకు అంతకు మించిన వేగంతోనే కలం నడిపించాడు. ఆయన కర్నూలులో అన్నమాట నామీద గాఢమైన ముద్ర వేసింది. నేను వ్రాయగలిగినా, వ్రాయలేకపోయినా సాహిత్యంలో "వాక్యూం"కు కూడా ప్రాధాన్యం వుందనే వాదానికి చెందిన వాణ్ణి. ముఖ్యంగా యీనాడు మనం చేస్తున్నది నూతన సృష్టి అని అనుకుంటున్నాం కాబట్టి, దీనికొక నిలకడ అయిన స్థితి రావాలంటే గోపీచంద్ చెప్పినదాన్ని అందరం గుర్తుంచుకోవాలి. ఇటీవల ఒకసారి సంభాషణలో అన్నాడు: "విశ్వనాథ సత్యనారాయణ ఎన్ని పుస్తకాలు రాస్తే నేనూ అన్నిపుస్తకాలు రాస్తా"నని. నిజంగా అంతపట్టుదల గలవాడే. "ఆయన అభిప్రాయాలు కొన్ని నాకు నచ్చవు, కాని సాహిత్యశక్తి నాకు నచ్చుతుంది" అన్నాడు. ఈపోటీ చాలా బాగుంది అనుకున్నాను నేను మనస్సులో.

గోపీచంద్ ఫోటో యింట్లో పెట్టుకుని పూజించుకోవాలనేటంత ఉత్సాహం చూపించిన యువరచయితలను నేనెరుగుదును. యువకులను ఆయన ఆకర్షించినంతగా యిటీవలి కాలంలో మరే సాహిత్యవేత్తా ఆకర్షించి వుండడు. రచయితగా ఎంత కీర్తి వుందో వ్యక్తిగా ఆయనకంత పేరుంది. తెలుగు

శ్రీ కుందుర్తి

దేశంలోని యువ రచయితలలో అధిక సంఖ్యాకులకు ముగ్గురు యిష్టదైవా లున్నారు. గోపీచంద్, గోరా శాస్త్రి, బుచ్చిబాబు. ఇందులో బుచ్చిబాబు సభలకూ సమావేశాలకు అంతగా వచ్చేవాడు కాదు కాబట్టి మిగిలిన యిద్దరూ ఏ సభలోనైనా ప్రసంగించవలసి వచ్చేది. సాహిత్యం, సంస్కృతి, తత్వశాస్త్రాలకు సంబంధించిన ఏ సమావేశంకూడా గోపీచంద్ లేకుండా జరిగేదికాదు. జరిగితే లోటుగానే వుండేది. పండిత నెహ్రూలాగా వయస్సు పెరుగుతున్నప్పటికీ యువకుల ప్రతినిధిగా వుండే లక్షణాన్ని గోపీచంద్ చివరిరోజువరకూ కోల్పోలేదు. ఆయన వ్యక్తిత్వంలో అదొక ప్రత్యేకత.

# నేనూ - నా పాత్రా

ఒకరోజు రాత్రి నేను కన్ను మయ్యగానే నా కథల్లోని ఒక పాత్ర వొచ్చి నన్ను లేపింది.

నేను నిద్రమొహంతోనే, ''ఏమిటి, ఇప్పుడొచ్చావ్?'' అని అడిగాను.

నా పాత్ర బిక్కమొహం పెట్టుకొని, "నన్నిట్లా చెయ్యటం మీకు న్యాయం కాదు. నన్ను సృష్టించి, నా కథంతా రాయకుండా, మధ్యలో విడిచి పెట్టటం మీకు న్యాయం కాదు. మీరెప్పుడూ నన్నిట్లాగే చేస్తున్నారు'' అన్నది.

''నేను వ్రాసేది నీ కథ కాదు. నేను రాసే కథల్లోకి కావలసిన హంశాలు నీ జీవితంలోంచి తీసుకుంటాను. మిగిలిన నీ జీవితం నా కనవసరం. నా చదువరులకు అనవసరం. వెళ్ళు; నీ జీవితం రాయించుకోవాలని ఉంటే ఈ వూళ్ళో చాలామంది కథకులు వున్నారు. వాళ్ళ దగ్గరకు వెళ్లు" అని మళ్ళీ నిద్రపోయాను.

ఇంతవరకు ఆ పాత్ర మళ్ళీ నామీద కంప్లెయింటు చెయ్యలేదు.

గోపీచంద్

# రేఖాచిత్రం

శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావు

సుమారు పాతిక ఏళ్లక్రితం—చెదరుగా రేగిన పొడుగాటి ఉంగరాల జుట్టు క్రాపూ, వెడల్పాటి నల్ల ఫ్రేము కళ్లజోడులోనుంచి నీలాకాశంలోకి దూసుకుపోయే చూపూ, గడ్డంకింద ముడిచినచేయి ప్రాపూ, ప్రొఫైల్‌లో బస్టు ఫోటోగ్రాపుతో కాగడా పత్రికలోను, ప్రజామిత్ర పత్రికలోను శ్రీ త్రిపురనేని గోపీచంద్ వ్యాసాలు తొలిసారి చదివాను. మనుచరిత్రాది ప్రబంధాలను ఒక్కొక్కటీ తీసికొని, వాటిలోని పాత్ర నిరూపణమూ, కథా కథన చాతురీ, కవితాశిల్పమూ పరిశీలించి పక్వంచేసికొన్న భావనతో సాహిత్య తత్త్వదిదృక్షతో వ్రాసిన వ్యాసాలవి. పరిశోధ నాత్మకమైన విమర్శదృష్టి మాత్రమేకాక ఆ వ్యాసాలలో మౌలికరచనాశక్తిగల క్రొత్తకంఠం ఒకటి వినిపిస్తూండేది నాకు.

విద్యార్థిదశలో శ్రీ గోపీచంద్‌కు సమకాలికుడూ, ఆప్తమిత్రులలో ఒకడైన సాహితీ ప్రియంభావుకుడు మా బావగారు శ్రీ బుద్ధవరపు నాగరాజామాత్యుని ద్వారా—శ్రీ గోపీచంద్ ఆనాడు కంటూండే సాహిత్య స్వప్నాలను గురించీ, ఆయన పఠన పాఠనాలను గురించీ, రచనా లాఘవమునుగురించీ, మిత్రకూటములో ఆయన వాక్చాతుర్యమును గురించీ, నేను ఆరోజుల్లో అప్పుడప్పుడు వింటూండేవాడిని. ఆ వ్యక్తితో పరిచయంకోసం కొంత కుతూహలంకూడా రేగుతూండేది.

రైతుబిడ్డ సినీమా చూసినప్పుడు – సంభాషణలలో గిలిగింతలుపెట్టే చమత్కారమూ, తెలివితేటలుగల ఆంగ్లసాహితీ పాఠకుడు తెలుగుతనము పోకుండా తన మనోవికాసాన్ని పాఠకులకూ, ప్రేక్షకులకూ, పంచగలిగే రచనాశిల్పమూ గోపీచందుకు కరతలా మలకములు అని తెలుసుకుని ఆయన్ని కలుసుకో డానికి మరింత ఉత్సాహం కలిగింది.

పందొమ్మిది వందల నలభై, నలభై ఒకట్లలో అనుకుంటాను – మద్రాసు రేడియోలో 'ఉభయకుశలోపరి' అనేశీర్షికతో గ్రామస్థులకు వినోద విజ్ఞానాలు కలిగించే ప్రసంగాలు చేస్తున్నపుడు ఆయన్ని తొలి సారి కలిశాను.

'కవిరాజుగారి కుమారుణ్ని కలిసినందుకూ, ఆయనతో పరిచయం కలిగినందుకు నాకెంతో సంతోషంగా ఉందండీ'–అన్నాను నేను.

'ఈమాటలకేంలే. కవిరాజహంసగారి కుమారుణ్ని కలిసినందుకు నేనెంత సంతోషిస్తున్నానో– అడగవేం'–అన్నాడు ఆయన.

ఈ సంభాషణ ఆయన వాక్చాతుర్యానికి నాయెరుకలో తొలి మచ్చుతునక!

ఆతర్వాత సారథివారి గృహప్రవేశం, శోభనాచలవారి లక్ష్మమ్మ, పేరంటాలు చిత్రాలలో ఆయన రచయితగాను, దర్శకుడుగాను పనిచేస్తూండే రోజులలో నేనాయనకు ఎంతో సన్నిహితుణ్ణయి పోయాను.

నిత్యజీవితంలో ఆయన సంభాషణ ధోరణిలో గాంభీర్యమూ, పారుష్యమూ, సూటిగా గుచ్చుకొనే వ్యంగ్యధోరణీ ఆయన మనస్సును సరిగా అర్థం చేసుకోలేని మిత్రుల్నికూడా అప్పుడప్పుడు దూరం చేసేది. తనకథల్లోను, నవలల్లోను పాత్రల మనస్తత్త్వాలు బయటపడేటట్లు మెలికలు, పల్టీలువేసి సంభాషణలను గొలుసుకట్టుగా లాగుకొని పోయే ధోరణి, నిత్యజీవిత సంభాషణల్లో కూడా ఎక్కువగా దొర్లిపోతూండేది. అందులో ఎదటివారు ఊహించని రీతిగా తనసంభాషణలో మెలికలువేసి అప్పుడప్పుడు 'సస్పెన్సు', ఆతర్వాత ఏదో హాస్యోక్తిద్వారా కడుపు నిండా నవ్వించి 'పెద్ద' 'రిలీఫు' (Relief) కలుగ జెయ్యడం ఆయనకు ఒక క్రీడాప్రాయంగా ఉండేదని ఆయనతోనే అనేవాడిని నేను. ''సుప్పుపాటలో కలుగ జేసే 'సస్పెన్సూ' 'సర్ప్రైజూ' లాంటివి నేను మాటల్లో చెయ్యకపోతే ఎందుకు వ్రాయడం చెప్పు'' అని కళ్ళజోడులోనుంచి నవ్వేవాడాయన.

1945–46లో ఆయన గృహప్రవేశం కథ తయారు చేస్తూండి నప్పటికి ఇండియా విభజన జరగలేదు, స్వరాజ్యంరాలేదు–కాని, అందులోని ''వెనుకాడెదేల నోయీ'' అనే పాటలో (భానుమతి పాడింది)–

''మతమనుచు కులములనుచు
ద్వేషములు పెరిగిపోయె
శాద్వలశ్యామ భూమి, రక్తసంసిక్తమాయె''
లేలెమ్మ, రారమ్మ...కంకణమ్మునుగైకొమ్మ
తెగద్రెంచెద మిక దేశపు దాస్యపు సంకెలలు
తొలగించెద మిక మనదారిద్ర్య కొటకాలు
రూపుమాపుదము కులమత జాతి విభేదాలు
రారమ్మ రారమ్మ
పావన హృదయముతో నవజీవన పథమునకు
భవ్యాశయ మహా గృహప్రవేశమునకు!!''

భారతదేశానికి స్వాతంత్ర్యప్రాప్తి, దానికి పూర్వాపరాలలో మన దేశస్థులు జాతిపునర్నిర్మాణమునకై చేయవలసిన కృషి ఇంకా స్వప్న ప్రాయంగా ఉండిన

ఆనాడు (1946 లో) పై పాటలోని సన్నివేశాన్ని ఊహించిన గోపీచంద్‌గారితో, ఆ పాట రికార్డింగూ చిత్రీకరణా పూర్తయిన రోజున, 'భావిభారత భాగ్యోదయ దర్శిష్టలలో ఒకడుగా మిమ్మల్ని పొగడుతారు స్వతంత్రం వచ్చాక మనదేశస్థులు' అన్నాను నేను. గృహప్రవేశంలోనే భానుమతి పాడినమరో పాట:

'మేలుకో మేలుకో ఓ భారతనారీ మేలుకో
పితకో పతికో సుతునకో ఆజీవితమూ విధేయతా
యుగయుగాలకు లభింపదా యిక స్వతంత్రతా,'

ఈ పాటలోని సన్నివేశకల్పననుబట్టి నారీజనోద్ధరణకై కంకణం కట్టుకున్న వీరేశలింగం పంతులు మొదలయిన సంఘ సంస్కర్తల శ్రేణిలోకి శ్రీ గోపీచంద్‌ను చేరిస్తే, ఈ మాట శుష్కమైన అతిశయోక్తి అని ఎవ్వ రనగలరు ?

ఈ దేశ పునర్నిర్మాణ భావాలు, 'దేశం ఏమయ్యేట్టు' మొదలయిన ఆయనరచనలలో ఇంకా స్పష్టమూ, సూటీ అయిన మార్గాన్ని పట్టాయి. ఆయన రచనాదక్షతా, దర్శకత్వ ప్రతిభా 'లక్ష్మమ్మ' నూ 'పేరంటాలు' నూ తెలుగు గ్రామ జీవితంలోని వివిధ ప్రాంతాలతో సన్నివేశాలతో అత్యంత రసవత్కళాఖండాలుగా తీర్చి, ఆంధ్రుల ఆదరపాత్రము లైనాయి.

చిత్రపరిశ్రమలో ఉంటున్న రోజులలో ఆయన చేస్తూండిన రేడియో రచనలలో శ్రోతలను బాగా ఆకర్షించినవి 'పరివర్తనం' అనే సీరియల్ నవలా, 'పశ్చిమవాహిని' అనే నాటకమూ, ఉన్నవలక్ష్మీనారాయణగారి మాలపల్లి నవలకు నాటకీకరణమూ (సీరియల్).వీటిలో మొదటి రెండూ ఆచంట జానకిరాంగారి ప్రోత్సాహ సహచర్యాలలో నడిచిన రచనలు. పరివర్తనలో—తానెంతగానో ప్రేమించిన భార్యను కోల్పోయిన భర్త తన నిత్యజీవితంలో ప్రతి వస్తువూ ఆమె జ్ఞాపకమునే రేకెత్తిస్తూ, వియోగబాధనే రెట్టింపజేస్తూ ఉండగా, మరొక యువతి క్రమక్రమముగా ఆతని ఆదరాన్నీ, అనురాగాన్నీ, ప్రేమనూ చూరగొన గలిగి అతనిలో మనః పరివర్తన తీసికొని రాగలగడం చిత్రింపబడింది. సుకుమారమైన సన్నివేశాలూ, మెల్లగాసాగే కథనమూ, బరువుగా, ఉవ్వెత్తున ఉబికే రసావేశమూ కలిగి, ఈ రచన గోపీచంద్ రచనల్లోకల్లా అన్ని తరహాల పాఠకులనూ లట్టేకదిలించి వెయ్యగల శక్తి కలది.

ఈ యుగంలో సాంఘిక, రాజకీయ, ఆర్థిక విప్లవ భావాలెన్నో మన రచయితల్ని కదిలించాయి. ఒకప్పుడాయన ఎమ్. ఎన్. రాయిగారి రాజకీయ భావాలతో ప్రభావితుడై ఉండేవాడు. బ్రహ్మసూత్రాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, వాటిపై శంకరుడు, తిలక్, గాంధీ, అరవిందుడువంటి మేధావుల వ్యాఖ్యానాలు, పాశ్చాత్య తత్త్వశాస్త్రవిషయాలు అనేకము చదివిన మీదట, మానవజాతి తత్త్వచింతనములో ఒక క్రమగతి పరిణామం ఉన్నదనీ, ఆ పరిణామంలో దేనినీ కాదనడానికి వీలులేదనీ, ఆయాయుగాలలోని ఒక్కొక్క తత్త్వ సూత్రమూ తనకు పూర్వాపరముల సూత్రములతో సాపేక్ష సంబంధము కలిగి క్రమగతి బద్ధమై ఉంటుందనీ ఆయన కొన్ని వ్యాసాలువ్రాసి ప్రకటించారు. ఈ సిద్ధాంతమును అనుసరించిన కొన్ని నవలలు సీరియల్సుగా ఇటీవల 10 ఏళ్లలో చాలా పత్రికలలో వస్తూవుండినవే. ఈ సిద్ధాంతం ఆయనలో పాదుకొంటున్న తొలిరోజులలో (10 ఏళ్లక్రితం) భగవద్గీతలోని విశ్వరూప సందర్శనమును, కురుక్షేత్ర యుద్ధరంగంలో కృష్ణార్జునులు ప్రధాన పాత్రలుగా నాటకీకరించి మద్రాసునుంచి ప్రసారంచేశారు. తన తండ్రిగారికి అభిమాన ప్రదమైన (పల్నాటి) భగవద్గీతను

శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావు

కూడా ఇతివృత్తముగా తీసుకొని, 'మాంచాల' పాత్రకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చి 'మగువ మాంచాల' నాటకము కూడా ఆరోజుల్లోనే మద్రాసునుంచి ప్రసారం చేశారు. ఆయన అసమర్థుని జీవయాత్ర విపరీత మనస్తత్వంగల పాత్ర చిత్రణలోను, ఆఖ్యాన శిల్పంలోను ఆయనకు పేరుతెచ్చింది.

1960 లో నేను హైదరాబాదు చేరుకునేసరికి, గ్రామస్థుల కార్యక్రమ ప్రయోక్తగా శ్రీ గోపీచంద్ విశ్వరూపం ధరించి వీరహారం చేస్తూండేవారు. వివిధగ్రామాలకు వెళ్లడం, అక్కడి గ్రామస్థులతోను, ఆటవికజాతులతోను సంభాషణలు జరిపి, వారి కష్ట సుఖాలను, వృత్తి వికాసాలను, కథాగానవినోదాలను రికార్డుచేసి, ఎంతో శ్రమ సాధ్యమైన కార్యక్రమా లను వినిపించేవారు. ఆయన నిర్వహణతో, నా సంగీతంతో ఉన్నవవారి మాలపల్లి హైదరాబాదు నుంచి సీరియల్‌గా మళ్లీ ప్రసారం అయింది.

ఎప్పుడూ ఏదో చదువుతూ, ఏదో ఆలోచిస్తూ, ఏదో వ్రాస్తూ తప్ప, మరొకలా కాలం వృధా చేస్తూండగా ఆయన్ని ఎవరూ చూసి యుండరు. గ్రామస్థుల కార్యక్రమాలు చేస్తూనే, రూపకశాఖ తరఫునఎన్నో పెద్ద రూపకాలనుకూడా నిర్వహిస్తూండే వారు. వాటిలో ప్రత్యేకించి చెప్పుకోవలసినవి శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు రచించిన ఆంధ్ర వాఙ్మయచరిత్ర రూపకాలు. నన్నయయుగం, తిక్కన యుగం మొదలుకొని, ఆధునిక యుగములో భావకవిత యుగం, హేతువాద సాహిత్యం వరకూ ఏడెనిమిది రూపకాలకు పైగా వినిపించారు.

చివరి అయిదారేళ్లుగా, ఆయన తన ఉద్యోగ ధర్మంగా రేడియో కార్యక్రమాలు నిర్వహిస్తూనే అహోరాత్రాలు శ్రమపడి కొన్ని సీరియల్ నవలలు వ్రాసి ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, యువ మొదలైన పత్రికలలో ప్రచురిస్తూ వచ్చారు. వాటిలో వారి జీవితానుభవపరిపక్వతా, తత్త్వచింతనాపటిమా, లోక వృత్త వైవిధ్యమూ బహువిస్తరంగా కనబడతాయి. వీటిలో ఏ ఒక్కదాన్నీ పూర్తిగా చదివే అవకాశం నాకు లభించకపోయినా సీరియల్స్‌లో అప్పుడప్పుడూ కొన్ని అధ్యాయాల్ని చదివిన జ్ఞాపకంమీద ఇంత మాత్రం చెప్పగలుగుతున్నాను.

ఆధునిక గద్య రచయితల్లో—ఆధునికాంధ్ర గద్య నిర్మాతల్లో ప్రథమశ్రేణికి చేరవలసిన కొద్ది మందిలో ఒకరయిన శ్రీ గోపీచంద్ దివ్యస్మృతి కివే నా జోహారులు.

# ప్రతిభావంతుడు

శ్రీ డి. రామలింగం

ఆధునిక తెలుగు సాహిత్యం సజీవమై, వైవిధ్య వికసితమై, వైశిష్ట్య సమన్వితమై అలరారుతూ ఇతర భారతీయ సాహిత్యాలతో తులతూగడమే గాక వాటిలో లేని కొన్ని విశిష్టతలుకూడా కలిగి ఉందంటే అందుకు స్వీయ సంఘమును అవగాహన చేసుకొని, పాశ్చాత్య విజ్ఞానాన్ని సముపార్జించుకొని, కొత్తను కాంక్షించి, వ్యతిరేకతలను సరకుగొనకుండా ధైర్యం చేసి, నూత్న మార్గావలంబకులై నవ్య భావాలు వెలార్చగల ప్రతిభావంతులైన రచయితలు ఆవిర్భవించడమే ముఖ్య హేతువని చెప్పాలి. అలాంటి ప్రతిభావంతులను లెక్కించవలసి వచ్చినపుడు కీ. శే. త్రిపురనేని గోపీచంద్ మొదటి వరుసలోనే గుర్తుకు వస్తారు. ఆయన జీవితంలో ఎన్ని వృత్తులు అవలంబించినా, ఏ మార్గాలలో పయనించినా ప్రధానంగా రచయితగానే జీవించాడు. ఒక కొత్త నడకతో తెలుగు కథానికను, నవలను సుసంపన్నం చేయడమే గాక,జన్మతః మేధావియై, స్వభావరీత్యా తత్త్వ జిజ్ఞాస కలవాడవడంవల్ల వేదనాజీవియై, సత్యాన్వేషకుడై ఈ తరం పాఠకులను, రచయితలను ఆలోచనా వాహినిలో ఓలలాడించాడు.

గోపీచంద్ వాస్తవికత ముఖ్య లక్షణంగాగల కథకుడుగా మొదట తెలుగు సాహిత్య రంగంలో ప్రవేశించాడు. ఆంధ్రదేశ గ్రామీణ జీవితాన్ని, మధ్య తరగతి సంఘాన్ని యథార్థంగా చిత్రించిన రచయితగా పేరు పొందాడు. ఇక్కడ గ్రామీణ జీవితము,

వాస్తవికత అనే మాటలను ప్రత్యేకంగా విశదీకరించ వలసి ఉన్నది. గోపీచంద్ బాల్యం కృష్ణా జిల్లా అంగలూరు మొదలగు గ్రామాలలో గడచింది. బాల్య స్మృతులు ఈయనలో పల్లె జీవితంపట్ల కుతూహలం కలుగజేశాయి. ఆంధ్రలో రైత్వారీ పద్ధతి అమలులో ఉండడంచేత మధ్య తరగతి ఏర్పడిందని తెలుసు కున్నాడు. మన పల్లెలు వెనుకటి నాగరికతను దాటి కొత్త నాగరికతలో పడే సంధి యుగంలో ఎన్ని ఒడుదుడుకులకు లోనవుతున్నాయో గ్రహించాడు. ఊళ్ళు విచిత్రంగా మారిపోతున్నాయి. ఆచార వ్యవ హారాలలో, దృక్పథంలో, నమ్మకాలలో అన్నిటా వ్యత్యాసాలే! మన తాతల కాలానికీ ఇప్పటికీ ఎంత తేడా ఉంది! సంఘీభావం, పరస్పర ప్రేమ, కట్టు బాట్లు సడలిపోతున్నాయి. ఎవరికి వారు డబ్బు విలువను గ్రహించి జాగ్రత్తపడుతున్నారు. అబద్ధా లను నీతులుగా ప్రచారం చేస్తున్నారు. ఇవన్నీ చూచి "ప్రస్తుతం మన కుటుంబాలను చూస్తూ ఉంటే ఒకప్పుడు వైభవోపేతంగా ఉండి శిథిలాలైన పురాతన కట్టడాలు జ్ఞాపకమొస్తున్నాయి" అన్నాడు గోపీచంద్. అయితే సంధి యుగంలో ఇలాంటి స్థితి తప్పదనీ, కొత్త నాగరికతలోని చెడులను చూచి వెనక్కి దేకడం శ్రేయస్కర మనుకోవద్దనీ, వాటిని తొల గించుకొని ముందుకు పోవాలనీ ఉద్ఘాటించాడు. భావా లకు ఎల్లలు లేవు. నవీన భావాలు పాశ్చాత్యుల ముల్లె కాదు, మన దేశమూ ప్రపంచంలోనిదే. ప్రపంచంతో పాటు మనమూ వృద్ధిజెందా లన్నాడు.

గ్రామీణ జీవితం ఆయనకు అసంఖ్యాకమైన ఇతి వృత్తాల నిచ్చింది. ఆ రోజులలో కథానిక బాగా వ్యాప్తిలో ఉంది. తాను భావిస్తున్న విషయాలను పాఠకులకు చెప్పాలంటే కథ మంచి సాధన మని పించింది. వాస్తవికత ప్రాతిపదికగా కథారచన కుపక్రమించాడు. వాస్తవికత అంటే సామాన్యంగా ఉన్న వాటిని ఉన్నట్లు వ్రాయడం. కాని గోపీచంద్ పద్ధతి కొంచెం భిన్నమైనది. సంఘంలో జరిగింది జరిగినంతవరకే, చూసింది చూసినంతవరకే చెబితే ఆ రచయిత కేవలం ఫోటోగ్రాఫర్ మాత్రమే అవు తాడని అంటూ, సంఘంలో జరిగే సంఘటనలకు ప్రయోజనం కలిపి రచయిత చదువరులకు ఒక దృష్టిని కలిగించాలని ఆయన తలపెట్టాడు. వస్తువు ఏదైనప్పటికీ రచయిత చదువరులకు కలిగించదల చిన దృష్టి, దాన్ని సాధించగలిగిన రచనా విశేషమూ ఉత్తమ లక్షణాలని ఆయన భావం, సంఘానికి అప కారం చేసే రచనలు_వాటి రచనా విశేషం ఎంత గొప్పదైనా. ఉత్తమ రచనలు కావు. అవి ప్రజలను ఇంకా అజ్ఞాన దశకు తీసుకుపోతాయి. ప్రజాసామాన్యా నికి శ్రేయస్సు చేకూర్చే భావాలను వాళ్లకు నచ్చేట్టు చెప్పడమే ఉత్తమ రచన అవుతుంది. అందుకు గోపీ చంద్ ప్రజలు తన రచనల పట్ల నిరాదరణ చూపుతా రేమోనని వెనుకాడలేదు. మొదటి కొద్దికాలం నిరాద రణ చూపినా క్రమేణా దానిలోని పరమార్థాన్ని కొంద రైనా గ్రహిస్తారు, అప్పుడు ఆ రచయితకే పలుకు బడి వస్తుంది. ఉత్తమ రచనకు నిదర్శనం ప్రజల ఆదరం ఒక్కటే కాదు. ప్రజల శ్రేయస్సుకు ఉప యోగపడే భావాలు కావాలి. మనిషి మనస్సును పెంచి అతనికి ఆహ్లాదం కలుగజేయడం కూడా కళయొక్క ప్రయోజనాలలో ఒకటి. కథా రచయితకు మానవుని మనస్సు చాలా ముఖ్యమైందని ఆయన భావం. మనస్సు పరిపరి విధాల పోతుంది. మనిషిలో క్రౌర్యం ఉంది, దౌష్ట్యం ఉంది. మళ్లీ ఇతరులకు మేలుచేసి ఆ మేలును వారు పొందుతుండగా చూచి ఆనందించి సంతృప్తిపడే కాంక్ష ఉంది. అసలు ప్రపంచంలోని విచిత్ర వస్తువుల్లోకెల్లా చిత్రమైన వస్తువు మనిషి.

మానవ స్వభావమే ఒక క్లిష్ట సమస్య. అదే మానవునిలోని ఆకర్షణ కూడా అని చెప్పినవాడు కాబట్టే తీరుతీరుల పాత్రలను, విభిన్న పరిస్థితులను చిత్రిస్తూ సొంత భావన కొంత జోడిస్తూ, చిన్నా పెద్ద రమారమి నూరు కథలదాకా వ్రాశాడు. ఈయన కథలను సాంఘికమైనవి, రాజకీయ సంబంధమైనవి, సెక్సు సంబంధమైనవి అని మూడు రకాలుగా విభజింపవచ్చును. తండ్రీ కొడుకుల సంబంధాలు, దారిద్ర్యంతో విరిగిన మనసులు, ధర్మానుపత్రుల అధర్మాలు, పీడనతో వెతలతో సగం పిచ్చివాళ్లయిపోయిన దీనుల స్థితులు, సంస్కారాలు భిన్నమైనపుడు భార్యాభర్తల మధ్య వచ్చే పొరపొచ్చములు, రాములవారి కాలం నుంచి వస్తూవున్న ధర్మ వడ్డీలు, కలల బరువులు, ఆస్తులపై మమకారాలు, పతితులు, ఆత్మద్రోహులు, విఫలమైన జీవితాలు—ఇట్లా సంఘంలో తాను చూచిన వ్యక్తులను, స్థితులను కథలుగా అల్లాడు. కథా రచయితగా, తాత్వికుడుగా గోపీచంద్ ప్రతిభకు "ఆశాజ్యోతి" కథ ఒక్కటి చాలు. ఈ కథలో ఒంటరియై నిస్సహాయై, ఇద్దరు బిడ్డలు గల స్త్రీ బ్రతుకు దైన్యానికి మారు రూపంగా కన్పిస్తుంది. బ్రతకాలా ? వద్దా ? బ్రతికితే దేనికోసం ? దేనికి బ్రతకడం అనేది అర్థంలేని ప్రశ్న అంటాడు రచయిత. బ్రతకడమే ఆనందం. అంటీ అంటకుండా బ్రతకడమే జీవితాన్ని జయించడం. ఇందులో బ్రతుకుకూ, చావుకూ సంకేతాలుగా దీపాన్నీ కొడినీ ప్రస్తావించాడు. ఒక్కొక్కప్పుడు కొడి పెద్దదై దీపాన్ని ఆర్పేసేట్టుగా ఉంటుంది. కొంతసేపటికి దానంతట అదే రాలిపోతుంది. దీపం తిరిగి కాంతిగా వెలుగుతుంది. జీవితం కూడా అంతే. ఈ కథలన్నీ యువతరం వారిపై కలుగజేసిన ప్రభావం గణనీయమైంది. ఉన్నవ లక్ష్మీనారాయణ గారితో ఆరంభమైన ఆంధ్ర గ్రామీణ జీవిత చిత్రణం, గోపీచంద్‌తో మరొక అడుగు ముందుకు వేసి,కొత్త నాగరికతలోకి పోబోతూ ఉన్న మధ్య తరగతిని కూడా కలుపుకొని మన కథా సాహిత్యంలో ఒక కొత్త ధోరణి వ్యక్తమైంది. మనం ఇండ్లలో, వీధులలో చూచే మనుషులు, చుట్టూ కన్పించే పరిసరాలు, పరిస్థితులు కథలలో నిలిచి రచయిత చెప్పదలుచుకున్న అంశాలను దృగ్గోచరం చేయ మొదలెట్టాయి. కొన్ని కథలైతే పాత్రలనూ, పరిస్థితులనూ పెట్టి రచయిత తన నిర్వచనానికి అనుగుణంగా ప్రయోగాలు చేసినట్లుండేవి. కథలలో సామాన్యంగా ఆయన ఒక సారాంశాన్ని ఇదమిత్థమని తేల్చి చెప్పలేదు. అలా చెప్పడానికి ఆయన వేరే వ్యాసాలు ఎన్నో వ్రాసి ప్రకటించాడు. ఆ వ్రాయడం కూడా ఉద్యమ నాయకుడి వలె వ్రాశాడు. అవి ప్రసిద్ధ వ్యాసాలు. యువతరంవారి నవి ఆకర్షించాయి. కథ ద్వారా పాఠకుల కొక సంస్కారాన్ని, ఒక కొత్త దృష్టిని కలిగించడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు గోపీచంద్. అయినా అవి రచయిత ఉద్దేశాన్ని నెరవేర్చాయి. రాజకీయాలను కూడా తడవా లనుకున్నప్పుడు 'దేశం ఏమయ్యేట్టు ?', 'గోడమీది మూడోవాడు', 'బీదవాళ్లంతా ఒకటి' వంటి కథలు వ్రాశాడు. అవి కొన్నిచోట్ల సంభాషణలవలె, వట్టి వాక్చిత్రాలవలె కన్పించినా, కథ కుండవలసిన బిగువు లేకపోయినా, దేశ రాజకీయ స్థితిని ప్రయోజనకరంగా బయల్పరచాయి. గోపీచంద్ అంటే కేవలం ఏవో కథలు వ్రాసుకునేవాడు మాత్రమే కాదు. రాజకీయాలు, పార్టీల సంగతి బాగా ఎరిగినవాడని వాటివల్ల వ్యక్తమైంది.

గోపీచంద్ కూడా సెక్సు విషయాలను గూర్చి వ్రాశాడు. ముఖ్యంగా "పతివ్రత అంతరంగం" అనే కథలో ఫ్రాయిడియన్ మనస్తత్వ శాస్త్ర సూత్రాల ననుసరించి భర్త చనిపోయాడన్న వార్త విని స్పృహ

శ్రీ డి. రామలింగం

తప్పి పడిపోయిన ఒకానొక పతివ్రత మనోలోకంలో కన్పించాయని చెబుతూ ఆయన చిత్రించిన దృశ్యాలు మొరటుగా అరాచకంగా బూతుగా ఉన్నాయని చెప్పక తప్పదు. ''బొమ్మల పెళ్ళిళ్ళు...ఆడ బొమ్మను మగ బొమ్మ దగ్గరికి నెట్టడం ... నిమ్మకాయలు ... ఏపేరమ్మా ఆ చెట్టు కాయల పేరు ... దేవాలయాల మీద బూతు బొమ్మలు ... రవికలోనికి చెయ్యి పోనిస్తాడేం...వారా లబ్బాయికి తలంటి పోస్తూ ... రాత్రే కార్యం అయిన ఆ అమ్మాయిని చూచి జాలిపడి నొప్పులా అని అడగడం... పెట్రొమాక్సు లైటుకు ఎవరో గ్యాసు కొడుతూ ఉంటే గుండె దడదడలాడ్డం ...పెట్టపై పుంజెక్కడం...చెరచడం అంటే ఏమిటీ అనుకోవడం'' ఇంకా చాలాచాలా. అయితే తానూ ఫ్రాయిడియన్ ఫక్కీలో ప్రతిభావంతంగా వ్రాయగల నని చూపడానికే రచయిత ఈ కథ వ్రాసి ఉంటాడని నా ఉద్దేశ్యం. అంతకు మినహా అలాంటి ధోరణులను వ్యాప్తం చేయడం ఆయన లక్ష్యం కాదు. గోపీచంద్ మేధావికదా, ఇలాంటివి వ్రాయడ మేమిటీ అని కొందరు పాఠకులు ఆశ్చర్యపొయ్యారు. అందుకు ఆయన చెప్పిన సంజాయిషీ యిది: ''సెక్సు కూడా జీవితానికి సంబంధించినదే. దానిపై ఎందుకని నిషేధం? కామేచ్ఛ మానవులలో ఉంటూనే ఉంటుంది. కాని శృతిమించి పబ్లిక్ న్యూసెన్స్ కాకూడదు. అలా ప్రవర్తించేవారు Sex perverted. వారి చేష్టలను అధిక్షేపించవలసిందే."

స్త్రీ పురుషుల సంబంధాల విషయంలో గోపీచంద్ వెర్రి మాలోకాల పొంత బోలేదు. కాల్పనిక లోకాలలో విహరించలేదు. కేవలం ఆచరణ సాధ్యమైన రీతిలోనే ఆలోచించాడు. పరస్పరము ఆకర్షితులైన స్త్రీ పురుషులు అతి సన్నిహితంగా ఉంటూ తమది కామేచ్ఛ లేని నిష్కళంకమైన ప్రేమ అని చెప్పుకొని తమని తాము ఏమేమిగానో వూహించుకొంటూ ఇతరులకు అర్థం గాకుండా ప్రవర్తించేవాళ్ల వ్యవహారాన్ని ఆయన ''అమలిన శృంగారం'' అనే కథలో చిత్రించాడు. ఈ కథలో "నీకు అక్కరలేదా?'' అని అడిగిన స్త్రీతో ఆ యువకుడు "అది మలినం" అని చెబుతాడు. మరి అంతవరకూ జరిగిందేమిటంటే అమలిన శృంగారం అంటాడు. ఫలిత మేమిటంటే—ఇద్దరిలోనూ చివరకు అసంతృప్తి పెరిగిపోతుంది. తీరని కోర్కెలతో ఇద్దరి మతులూ చెడిపోతాయి. వాళ్లని చూసినవాళ్లు కలవరపడిపోతారు. తెలుగు సాహిత్యంలో కాల్పనికోద్యమ కాలంలో భావ కవులు వారి కవితలలో ప్రధానంగా ప్రచారం చేసిన సంస్కారం విరహం అని గోపీచంద్ అభిప్రాయం. అయితే దీనినిబట్టి ఆయన అసలు ప్రేమనే నిరసించాడని అనుకోవడానికి వీలులేదు. తాను నిరసించేది ''ప్రేమకంటే ఉదాత్తమైన దేమీ లేదనే భావాన్ని, తాను ప్రేమించిన వ్యక్తి లభ్యం కానప్పుడు కృశించడమే పరమ ధర్మమని చెప్పే సంస్కారాన్ని, కృత్రిమ బ్రహ్మచర్యాన్ని ప్రోత్సాహించే సిద్ధాంతాన్ని'' అని చెప్పుకున్నాడు. ''మరేం చెయ్యాలి?'' అని ప్రశ్నించేవారికి ''పరివర్తనం'' నవలలో సమాధానం చెప్పాడు. ఇది గోపీచంద్ మొదటి నవల. ఇందులో రాజారావు భార్య చనిపోయిన తర్వాత ఆ వియోగంలో హృదయ దౌర్బల్యం కల్పించుకొని క్షోభపడుతూ ఉంటాడు. అతనికి వేదనలోనే సుఖం ఉందా అనిపిస్తుంది చూచేవారికి. అంతా అతనిపై ఆశలు వదులుకుంటారు. ఈ స్థితి జీవితం నుంచి తప్పించుకు తిరగడమేననీ, దీనివల్ల వ్యక్తి దృష్టి సాంఘిక సమస్యలపైకి కాదు గదా, తన చుట్టూ ఉన్నవారి వైపే ప్రసరించదనీ ఈ నవల ద్వారా రచయిత చెప్పదలిచాడు. చివరకు రాజారావులో పరివర్తనం కలిగి అతను మళ్లీ పెళ్లికి

ప్రతిభావంతుడు

సుముఖుడై ఈ లోకంలో పడడంతో కథ ముగుస్తుంది. ఇది ఇతర దేశీయ భాషలలోకి పరివర్తనం కావలసిన నవల. కథానాయకుడి వేదనతోపాటు అతని చుట్టూ ఉన్న పాత్రలన్నీ తమ తమ వైఖరులతో ఆవేదన పడతాయి. వాస్తవ ప్రపంచంలో మానసిక సీమలను కల్పించి హృదయంగమంగా చేసిన కల్పన ఇది. రచయిత బహు కొద్ది సంభాషణలతోనే కథను కరుణరస ప్రధానం చేశారు.

అలాగే వాస్తవాలను చూచుకోకుండా ఆదర్శాలను స్వప్నాలు కని, ప్రేమ వివాహాలు స్వేచ్ఛగా చేసుకొని, వూహా సౌధాలలో నివసిస్తూ, ఎవరికీ అందని దివ్య సీమలలో విహరిస్తున్నామనే భ్రమచెందే యువతీ యువకులు మనుషులలోకి వచ్చి యదార్థ జీవితాన్ని ఎదుర్కోవాల్సి వచ్చేసరికి ఎలా ఆశాభంగం చెందుతారో "ఆత్మగతం" అనే కథలో చూపెట్టాడు. ఒకప్పుడు అసాధారణుడైన పురుషునికి తాను భార్య అయినందుకు మురిసిపోయి గర్వించిన లీల క్రమేణా దివి నుండి భువికి దిగివస్తుంది. ఇదివరకు అతడు చెంత కూర్చుంటేనే పరవశత్వం కలిగేది. ఇప్పుడు విసుగు పుడుతూ ఉంది. ఇతరుల ఎదుట ఆయన దగ్గరగా ఉంటేనే సిగ్గుగా ఎలాగో ఉంటూంది అనుకుంటుంది.

ఆధునికాంధ్ర సాహిత్య రంగంలో చలం వచ్చి స్త్రీ పురుషులు కామంతో లేచిపోవడాన్ని ముఖ్య ఇతివృత్తంగా పెట్టుకొని చేసిన అసంఖ్యాక రచనలవల్ల కుటుంబ జీవితానికి 'ముప్పు' వచ్చిందని గోపీచంద్ భావించాడు. మరి చలం వ్రాసినవి మన సంఘంలో లేవా అంటే—ఉన్నవి అని ఆయన అంగీకరించాడు. కుటుంబ జీవితాలలో చెడుగు లున్నాయి. ఇటువంటివేనా, ఇంకా రకరకాల చెడుగులున్నాయి. కాని చెడుతోపాటు మంచికూడా ఉంది. ఆ మంచిని చలం పట్టించుకోలేదన్నాడు. స్త్రీకి సంఘంలో, కుటుంబాలలో తగిన స్థానం, గౌరవం లేదని ఒకే తీరున గొడవ పెట్టి చలం సాంఘిక జీవితంలోని ఒక వైపును మాత్రమే అదేపనిగా విచ్చలవిడిగా చిత్రించాడు. పోనీ ఆయన చెప్పినట్టు అలా లేచిపోయినవాళ్లు సుఖపడుతున్నారా అంటే అదీ లేదన్నాడు. ఆపైన రోగాలు, ఆర్థికమైన ఇబ్బందులతో బాధపడి ముసలితనం వచ్చి నానా అగచాట్లు పడుతున్నారు. వాళ్లకి జీవితంలో సంతృప్తి లేదు. ఈ అంశాన్నే గోపీచంద్ ఒకానొక వ్యంగ్య రచనలో వెంకటచలం అనే పాత్రను సృష్టించి చలం ధోరణిని అవహేళన చేశాడు. "అతని అన్ని పాత్రలూ ఒకే రకంగా ఉన్నాయి. అదే నునుపు, అదే ఉబుకు, అదే వంపు. నాకు ఒక్కటే భేదం కన్పించింది. కొన్ని పాత్రలకు ఉల్లిపొర రవికె లున్నాయి. కొన్నిటికి అవికూడా లేవు'' అని వ్యంగ్యగా వర్ణిస్తూ "ఎప్పుడూ డబ్బు సంగతి ఆలోచించలేదు, ముసలితనం వస్తుందనీ, కురూపి అవుతామనీ ఆలోచించలేదు. అసలు ఆ ఆలోచనలకు తీరిక ఉందా ? ఆ వెన్నెల్లో, ఆ మైదానంలో, ఆ గులాబీ తోటల్లో, ఆ తీయని కమ్మని వాసనల్లో'' అని చెప్పి తన పాత్రలకు అసలు ఆకలే వెయ్యదని ఆ రచయిత విశ్వాసం అన్నాడు.

కుటుంబ జీవితం లేకుండా మానవులు సుఖపడరని గోపీచంద్ ప్రగాఢ విశ్వాసం. ఈ విశ్వాసాన్నే ఆయన అనేక రచనల్లో ఉద్ఘాటించాడు. ఒకవేళ ఎవరైనా ఒక స్త్రీ కాలుజారి భర్తను వదలి లేచి పోయినా కొన్నాళ్లకు భర్తమీద ఆమెకు తప్పక సానుభూతి కలుగుతుందని ఆయన "పునస్సమాగమం'' అనే కథలో చెప్పాడు. లేచిపోయిన భార్యను మళ్లీ భర్తతో కలిపాడు. అతడు కూడా ఆమె రాకకు కరిగిపోయి, ఆమె ఓదార్పుతూ

ఉంటే నిశ్చేష్టు డవుతాడు. ఇలాంటి సమస్యే ''మెరుపుల మరకలు'' అనే నవలలోది. ఇందులో వివాహితయై కాపురం చేస్తూవున్న ఉషారాణికి ఒక వ్యక్తిని ప్రేమించి అతనితో జీవయాత్ర గడపడంలో నమ్మకంలేదు. ఫ్రెంచి సాహిత్యంతో, సార్త్రే అస్తిత్వ వాదంతో పరిచయం గల జవ్వని ఆమె. ఒకే కాలంలో అనేకులను ప్రేమిస్తుంది. విచ్చలవిడిగా, ఒక్కొక్కప్పుడు ప్రమాదకరంగా సంచరిస్తుంది. తన ప్రభావంలోకి వచ్చిన ఏపురుషుణ్ణీ విడిచిపెట్టదు. చివరకు జీవితాన్ని త్యజించి యేకోరికా లేకుండా హిమాలయాలలో అంతర్థానమై పోతుంది. ఆమెకు పరిచితుడైన చంద్రవదనులు కూడా ఆమెలాగే Sex perverted మనిషి. ఉషారాణి వంటి జాణ కాదు గాని—''పిల్ల తెమ్మెర'' నవలలో నాయిక శమంతకమణి కూడా దాదాపు అంతే. ఇతరులకు తప్పులుగా కన్పించేవి ఆమెకు తప్పులుగా కన్పించవు. ఒక కుర్రవాడితో లేచిపోయి సినిమాకు వెళ్లి వచ్చినదానికి మల్లే తాపీగా ఇంటికి తిరిగి వస్తుందట! మొగుడి వద్ద నుంచి పారిపోయి బ్రతికినన్నాళ్ళు పిల్ల తెమ్మెరలాగా బ్రతుకుతుంది. అది తప్పో ఒప్పో ఆమెకు అక్కర లేదు. చివరకు లేవదీసుకు పోయినవాడే ఆమెను హత్య చేస్తాడు. ''గడియ పడని తలుపులు'' నవలలో కోటేశ్వరమ్మది కూడా భగ్నజీవితమే. ఆమె పరిచయంలోకి వచ్చినవా రెవరూ స్థిమితంగా బ్రతకలేరు. చివరి కామెకు ఏకాంతం మిగులుతుంది. నిరాశ, నిస్పృహ, విరక్తి పెరుగుతాయి. తుది ఘడియలలో అసలు భర్త చిత్రానికి అంజలి ఘటించి ప్రాణాలు విడుస్తుంది. ఇవన్నీ లయతప్పిన జీవితాలని రచయిత చెప్పదలుచుకున్నాడు. ఇలాంటి స్త్రీపురుషుల జీవితాలను చిత్రిస్తూ పోగా మానవ జీవితంలో ఏదో 'మిస్టరీ' ఉందేమో అన్న భావం రచయితకు తట్టింది. ముఖ్యంగా స్త్రీ వ్యక్తిత్వంలోని ఇంద్రధనుస్సులకు విభ్రాంతి చెందాడు. ''ఎంత మనోహరమైనది ఈ స్త్రీ సృష్టి! స్త్రీలో తరచినకొద్దీ లోతులు కనిపిస్తూనే ఉంటై'' అన్నాడు ఒకచోట.

ఆలోచనలలో, అభిప్రాయాలలో, సిద్ధాంతాలలో, జ్ఞానాన్నీ సత్యాన్నీ అన్వేషించడంలో గోపీచంద్ వలె అనేక మానసిక సంఘర్షణలకు లోనైనవారు మన రచయితలలో చాలా తక్కువమంది కన్పిస్తారు. గోపీచంద్ మొదట భౌతికవాది. హేతువాద యుగంలో పుట్టి పెరిగాడు. అనేక సిద్ధాంతాల మధ్య మసిలాడు. తండ్రి త్రిపురనేని రామస్వామి చౌదరిగారు నాస్తికులు. మన వర్ణ వ్యవస్థపైన, సంప్రదాయాల పైన, కట్టుబాట్ల పైన తిరుగుబాటుచేసి ఆధునికాంధ్ర సాహిత్యంలో హేతువాద యుగాన్ని ప్రారంభించిన వారిలో ప్రముఖంగా చెప్పుకోదగినవా రయ్యారు. ఆయన రచించిన "సూతపురాణం'' లో పచ్చి నాస్తికవాదం ఉంది. తండ్రి ప్రభావంవల్ల గోపీచంద్ నాస్తికు డయ్యాడు. తనతండ్రిలో బెర్నార్డుషా లక్షణా లుండేవని ఒకసందర్భంలో చెప్పుకున్నాడు. షా నాటకం ''కారవాన్ ఆఫ్ ది క్యూరియస్''లో దేవు డున్నాడా లేదా అనే చర్చ ఉంది. మానవుడికి విమర్శా జ్ఞానం కలిగినప్పటి నుంచీ ఈ దేవు డేమిటీ అని ఆలోచించడం మొదలు పెట్టాడట. తుదకు దేవుడికోసం వెదకడం నిష్ప్రయోజనమని అందులో తేల్చబడింది. అయినా అన్ని దేశాలలో ఆస్తికు లున్నారు. ఈ విషయమై నాస్తికుల వాదం ఇట్లా ఉంది. జ్ఞానం వృద్ధి చెందినప్పుడు, ప్రకృతిని లోబరుచుకునే శక్తులను మానవుడు సంపాదించనప్పుడు మానవుడు విశ్వాసాన్ని ఆశ్రయించాడు. అదే ఆధ్యాత్మిక నాగరికత. జ్ఞానం వచ్చి సైన్సు వచ్చిన తరువాత దేవునిపైగల విశ్వాసం పోయింది. పైగా దేవుణ్ణి నమ్మడంతో అతని ఉనికిని బలపరచ

డానికి కర్మ సిద్ధాంతం స్వర్గ నరకాలు సృష్టింపబడ్డవనీ, పుక్కిటి పురాణాలు వచ్చాయనీ, మతం భగవంతుడు అనే భావాలు సామాన్య ప్రజలను దోచుకోవడానికి మాత్రమే ఉపయోగపడుతున్నందున వాటిని ఎదిరించాలనీ చెబుతూ, అసలు మన సంఘంలో పాత పద్ధతుల నన్నిటినీ పునర్విమర్శ చేసి హేతువాదానికి సరిపోతేనే వాటిని అంగీకరించాలని గోపీచంద్ మొదట తీవ్రంగా వాదించి, ప్రచారంకూడా చేశాడు. తరువాత మార్క్స్, అతగాడి కమ్యూనిస్టు మేనిఫెస్టో గోపీచంద్‌ను ప్రభావితం చేశాయి. అందులోని సాంఘిక న్యాయం అనే సూత్రం ఆయనను కొంత ఆకర్షించింది. అయితే మార్క్సిజం ఎంతసేపటికీ ఆకలి సంగతి చెబుతుందే గాని మరొక ఆలోచనకు ఎడమే ఇవ్వదు. దాని ప్రభావం పల్చబడ్డ తరువాత ఎం. ఎన్. రాయ్ ప్రతిపాదించిన నవ్య మానవతా వాదం (New Humanism) ఈయనకు నచ్చింది. అది మార్క్సిజంపై ఒక మెట్టు పైకి పోయిందనుకున్నాడు. (1) "Beyond Communism" (2) "Reason, Romanticism & Revolution" అనే రాయ్ గ్రంథాలు ఈయనను ఆకర్షించాయి. వాటిలో మానవ వ్యక్తిత్వాన్ని గూర్చిన చర్చ ఉంది. నవ్య మానవతావాదం మనిషి మారాలంటుంది. దీనినే ముఖ్యాంశంగా స్వీకరించి గోపీచంద్ "అసమర్థుని జీవయాత్ర" అనే తన ప్రసిద్ధ నవలను రచించాడు. తెలుగు నవలా సాహిత్యంలో ఈ నవల ఒక మైలురాయి. మాక్సిం గోర్కీ నవల Foma Gordayev (The man who was afraid) అనే నవల ఛాయలు దీనిలో ఉన్నాయని కొందరు పోల్చుకున్నారు. కాని రెండింటికీ అల్లికలో, నిర్వచనంలో ఉద్దేశించిన సిద్ధాంతంలో ప్రబలమైన సామ్యమేమీలేదు. ప్రతిపాదించిన విషయంలో, ప్రవేశపెట్టిన పాత్రలలో, పాత్రల వైఖరుల ద్వారా ముఖ్యాంశాన్ని విశదీకరించిన వైనంలో "అసమర్థుని జీవయాత్ర" దానికదే సాటి కావడం వల్లనూ, అలాంటి అసమర్థుని లక్షణాలు నేటి తరం యువకులలో కొద్దో గొప్పో ఉన్నాయి గనుకనూ ఈ నవల యువజనం దృష్టి నాకర్షించింది. వారికి ఆత్మ విమర్శ చేసుకున్నట్లయింది. అందులో సమస్యలే తమనూ ఎదుర్కొనేవి, అనుకున్నారు. రచయిత తన ఈ నవలను 'ఎందుకు?' అనే ప్రశ్న వేయడం నేర్పినందుకు తన తండ్రికి అంకిత మిచ్చానని తెలుపుకున్నాడు. ఇందులో కథానాయకుడు సీతారామారావు తానొక ప్రత్యేకతగల మనిషి ననుకుంటాడు. సంఘంతోపాటు అతను మారలేడు. సాటి మనుషులతో తనను సరిపెట్టుకోలేడు. జీవితంలో కష్టనిష్ఠురాలను ఎదుర్కోవలసి వచ్చేటప్పటికి బిత్తరపోయి అతివాదియై వెర్రివాడై తుదకు తన్ను తానే అంతం చేసుకుంటాడు. నవలలో ఒక పాత్ర జీవిత సత్యాన్ని ఇట్లా చెబుతుంది: "జీవిత ప్రవాహం ప్రచండ వేగంతో వెళ్లిపోతూ ఉంటుంది. ఎవరెవరి సంస్కారాన్నిబట్టి వాళ్లు తమ సుఖం కోసం పోటీ పడుతున్నారు. ఇదొక మహా సంగ్రామం. ఇందులో పిరికివాళ్లకు, అసమర్థులకు చోటు లేదు. అంతేకాదు, జ్ఞానమును సంఘ జీవితానికి ఉపయోగపరిచే మన స్తత్వం కూడా కావాలి. అది లేకపోతే సంఘర్షణ, పతనం తప్పవు" అది ఈ నవల నేటి యువజనానికి చేసిన హెచ్చరిక. అయితే నవ్యమానవతావాదం మనిషి మారాలంటుంది. కాని ఎలా మారాలో చెప్పదని గోపీచంద్ త్వరలోనే తెలుసుకున్నాడు. కనుకనే పై నవలలో ఎవరెన్ని హితవులు చెప్పినా సీతారామారావుకి మారడం ఎలాగో తెలియ లేదు. అసలు కిటుకంతా మనస్సులోనే ఉందనీ కనుక మనస్సును ఆరోగ్యపరచుకోవాలనీ అతనికి తట్టనే

(శ్రీ) డి. రామలింగం

లేదు. తట్టినా అందుకు సాధనాలు పద్ధతులు అతనికి అంతకంటే తెలీవు. ఈ సమస్య ఎదుర్కొన్న గోపీచంద్ అనేక తత్వశాస్త్ర గ్రంథాలు చదువుతూ పొయ్యాడు. బాల్యంలో అతను ఆస్తికులైన ఉన్నవ లక్ష్మీనారాయణగారి ముఖతా విన్న మాటలు, వాదాలు ఎక్కడో ఒకమూల ఉండనే ఉన్నాయి. ఐన్‌స్టీన్, విల్బర్ మార్షల్, వైట్‌హెడ్, బెర్గసన్, టాల్‌స్టాయి మున్నగువారి అభిప్రాయాలను గమనించాడు. బెర్ట్రండ్ రస్సెల్ గ్రంథాలను చదివి రస్సెల్‌కు ముందు తత్త్వశాస్త్రం మహారణ్యంగా ఉండేదనీ, ఆయన తికమకలను తొలగించి సాఫీ మార్గం ఏర్పరచ గలిగాడనీ అనుకున్నాడు. పాశ్చాత్య నాగరికతకు మానవాధికారం, హేతువాదం, ప్రజాస్వామికం ముఖ్య లక్షణాలన్న సర్వేపల్లి రాధాకృష్ణ పండితుని అభిప్రాయాన్ని గమనించాడు. అయినా చివరి ప్రశ్నకు ఆయనకు సంతృప్తికరమైన జవాబు లభించలేదు. ఆ సమయంలో అరవిందుడు ఈయన జ్ఞాన వీధిలోకి ప్రవేశించాడు. అరవిందుడు సంస్కృతాంగ్ల సాహిత్యాలను బాగా ఎరిగినవాడు, ఆ రెండు భాషలలోని తాత్విక గ్రంథాలను క్షుణంగా పరిశీలించిన వాడు. పైగా ఆ మహర్షి యే పాత సిద్ధాంతాలనూ తిరస్కరించలేదు. కాని వైరుధ్యాలను తొలగించాడు. సమన్వయం ద్వారా ఒక సంపూర్ణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. తన సిద్ధాంతంలో భౌతిక వాదానికి కూడా స్థానమిచ్చిన ఆధ్యాత్మికవేత్త అరవిందుడు. ముఖ్యంగా 'Life Divine', 'Supramental Conciousness', 'Human Spiral', 'The synthesis of yoga' అనే అరవిందుని గ్రంథాలు గోపీచంద్‌కు నవ్య జ్ఞానోదయం కలిగించాయి. అంతవరకూ తాను నమ్మిందీ, చెప్పిందీ పూర్తి సత్యం కాదని గ్రహించాడు. 'ఏ విషయమైనా తప్పు అని అనకూడదనీ, అసంపూర్ణమనే అనుకోవచ్చునీ అన్నాడు. భౌతిక ఆధ్యాత్మిక వాదాలు ఒకదాని కొకటి వ్యతిరేకం కాదనే సత్యం తెలిసింది. భావాల సంఘర్షణ తొలగిపోయి, మనస్సు శాంత పడింది. మనిషి ఎలా మారాలో ఆచరణ సాధ్యమైన రీతిని అరవిందుడు చెప్పాడు. జడమైనఈప్రపంచాన్ని మనస్సుఅతీతమైన చైతన్యం (Supramental Consciousness) తో బాగుచేయవచ్చుననీ, ప్రతిదీ దివ్యమైనదేననీ, పదార్థమును కూడా దివ్యమైన దానినిగా చేయవచ్చుననీ అరవిందుడు చెప్పి మనస్సుకు అతీతమైనదాన్ని సాధించే మార్గం చూపాడు. దానికి గోపీచంద్ తాను అంతకుముందు స్వీకరించిన నవ్యమానవతావాదాన్ని కూడా జోడించి భౌతికవాద, ఆధ్యాత్మికవాద సమన్వయం చేసి తాను గైకొన్న నిర్ణయాలను దృష్టాంత సహితంగా, ప్రామాణికంగా వివరిస్తూ 1949 లో కొన్ని వ్యాసాలు వ్రాశాడు. ఈ వ్యాసాలు 'పోస్టు చేయని ఉత్తరాలు' అను శీర్షికతో ఆంధ్రపత్రికలో మొదట వరుసగా ప్రకటితమయ్యాయి. ఇవి ఆయన మిత్రులకూ, పాఠకులకూ, ఆయన భావాలను గమనిస్తున్నవారికీ ఆశ్చర్యం కలిగించాయి. ఇక గోపీచంద్ హేతువాది కాదనీ, ఆధ్యాత్మిక వాదిగా మారాడనీ అంతా అనుకున్నారు. ఇలా మారేవాడు ఇకముందు ఒక నిశ్చయంపై నిలబడతాడనే నమ్మక మేమిటని అన్నారు. వారికి ఆయన సమాధానమిస్తూ గాంధిగారిని కూడా ఇలాగే విమర్శించటం జరిగిందనీ, అందుకు ఆ మహాత్ముడు 'నీకు కావలసినది సత్యమా' లేక వెనుక చెప్పిందానికి వైరుధ్యం లేకపోవడమా అని ఎవరైన అడిగితే నేను సత్యాన్నే కోరుకుంటాను అని చెప్పిన జవాబును ఉట్టంకించాడు. అంతేగాక నెహ్రూ వ్యక్తిత్వాన్ని కూడా ఉదహరించి నెహ్రూ ఎప్పటి కప్పుడు నూత్న జ్ఞానాన్ని తనలో కలుపుకుంటూ విశాలమవుతూ

ప్రయాణం చేస్తూ ప్రకృతి గర్భంలోని అద్భుతాలు తన నెప్పుడూ తన్మయుణ్ణి చేస్తాయని అంటున్నాడనీ చెప్పాడు. పోనీ అసలు సత్యమేదో తేలేదాకా దేన్నీ నమ్మకుండా ఉంటే? ఆలోచనాపరుల కది సాధ్యం కాదంటాడు గోపీచంద్. ఏ దృష్టి లేకుండా మనిషి ఈ ప్రపంచంలో ఒక్క క్షణం ఉండలేడు, ఏ నమ్మకం లేకుండా ఒక్కపనీ చెయ్యలేడు. కనుక ఎప్పటికప్పుడు ఒక సిద్ధాంతాన్ని నమ్మి పనిచేస్తూ ఆ సిద్ధాంతం సంపూర్ణ మనుకోకుండా ఎప్పుడూ నూత్న జ్ఞానాన్ని అన్వేషిస్తూ అలా పొందిన జ్ఞానాన్ని తన సిద్ధాంతంలో కలుపుకుని మారుతూ మానవుడు జీవించాలని ఆయన ఉద్దేశం. జ్ఞానం అసంపూర్ణం కదా అని దాని జోలి మనకెందు కనుకుంటే జ్ఞానమూ లేదు, అభివృద్ధీ లేదు. ఇప్పుడున్న జ్ఞానాన్ని నమ్మి పని చేయబట్టే అది సంపూర్ణమనే జ్ఞానాన్ని పొందగలుగుతున్నామని వాదించాడు. మానవుడు 'నేను' ఏమిటో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడమే గాక బాహ్య పరిస్థితులను కూడా అవగతం చేసుకొని సమన్వయం చేసుకుంటే సత్యం బోధపడుతుంది. ఒకప్పుడు ఆధ్యాత్మికవాదం శాస్త్రజ్ఞానం లేని కొంతమంది సనాతనుల వాదం అని విమర్శించిన గోపీచంద్ దృష్టిలో మార్పు వచ్చిన తరువాత మొత్తం ప్రపంచాన్ని ఒకటిగా చూడకపోవడంవల్ల అనర్థాలు వచ్చాయంటూ సంపూర్ణమైన చెడుగు ఎందులోనూ లే దన్నాడు. ధ్యానంలో తనకు నమ్మకం కలుగుతూ ఉందన్నాడు. ఆధ్యాత్మిక శక్తిని అంగీకరించాడు. మనిషి మానసికంగా పెరగాలని ప్రబోధించాడు. మానవునిమీద పరిస్థితుల ప్రభావం వల్లనే సంఘం, సంప్రదాయం రూపొందుతాయని మార్క్సిస్టులు చెబితే అదిపూర్తిగా నిజమని నమ్మిన గోపీచంద్ పోను పోను క్రమేణా మానవునిపై పరిస్థితుల ప్రభావం నశిస్తూ ఉందనీ, మానవుడు తనకు కావలసిన పరిస్థితులను సృష్టించుకొని పరిస్థితుల ప్రభావాన్ని అధిగమించి కూడా బ్రతుకగలుగుతున్నాడని ఒప్పుకున్నాడు. అయితే హేతువాదం అవసరం లే దనే వారితో ఆయన ఏకీభవించలేదు. హేతువాదం మనజీవితానికీ, ఆలోచనలకూ మార్గం చూపుతుందని చివరివరకూ ఆయన విశ్వాసం. నేడు కావలసింది ఆధ్యాత్మికతను అంగీకరించడమే. ఈ మీమాంస అంతా విన్నారు–గోపీచంద్ భావకవుల ప్రేయసినీ, ప్రణయమునూ, విరహమునూ విమర్శించినట్లే మరొకరు "అయ్యా ఈ గొడవంతా ఏమిటి? దేవుడు లేడని లోకమంతా గోలపెడుతూ ఉందా? ఆధ్యాత్మిక వాదం నేటి అవశ్యకత అని జనం నినాదాలు చేస్తూఉందా? ఈ సంఘర్షణ అంతా మీ రెందుకు కల్పించుకొని మమ్మల్ని బాధపెడతారు? అసలు ఇవి ఈనాడు ముఖ్య సమస్యలా?" అని అడగవచ్చు. కాని ఇది భావకవుల వేదనవలె ప్రాతిపదికలేని వైయక్తిక భావంకాదు. వారివలె గోరంతను కొండంతలుగా వూహించే అంశమూ కాదు. ప్రపంచ మేధావులను (వారు కొద్దిమందే కావచ్చు) ఒకప్పుడిది బాగా కలత పెట్టిన సమస్య. మానవ సంఘం ఉనికి, సంప్రదాయాల అవలంబన, సాధనాల నిర్ణయం మొదలగు విషయాలపై దీనిప్రభావం అధికం అయితే ఈసంఘర్షణ ప్రత్యక్షంగా సాంఘికరంగంలో కాక వ్యక్తుల మనస్సులో జరుగుతూ ఉంటుంది. కమ్యూనిస్టు రాజ్యాలు వచ్చిన తరువాత ఈసమస్యకు సాంఘిక ప్రాముఖ్యం కూడా కలిగినట్లున్నది. ఇవన్నీ అటుండనిచ్చి గోపీచంద్ సమగ్రజ్ఞానం సముపార్జించుకోకుండా మొదట్లోనే పరిసర ప్రభావాలకు లోనై భౌతికవాది అయ్యాడు. ఆ వాదమును ప్రచారం కూడా చేశాడు. కనుక తత్వం బోధపడ్డ తర్వాత మిన్నకుండా ఎలా ఉంటాడు? తాను మొదటపడ్డ పొరపాటునూ తరువాత

తెలుసుకున్న అంశములనూ లోకానికి చెప్పవలసిన అవసరాన్ని గ్రహించాడు. ఫలితమే అందరినీ ఉద్దేశించి ఆయన వ్రాసిన ఉత్తరాలు; కాని పోస్టుచేయని ఉత్తరాలు. ఈ గ్రంథమును ఆస్తికులైన శ్రీ శివలెంక శంభుప్రసాద్‌గారికి అంకితమివ్వడం మరొక విశేషం. గోపీచంద్ తన యీ నూత్న సిద్ధాంతాన్ని తాను సృష్టించబోయ్యే సాహిత్యానికి కూడా అన్వయం చేసుకున్నాడు. మనిషి మానసికంగా పెరగాలంటే మన కళారూపాలలో బాహ్య సమస్యలకే గాక భౌతికాతీతమైన సమస్యలకుకూడా స్థాన మివ్వాలని ఉద్బోధించాడు.

దృక్పథంలో, సిద్ధాంతంలో ఇట్టి మార్పు వచ్చిన తరువాత గోపీచంద్ వ్రాసిన రెండు నవలలు ముఖ్యంగా పరిశీలింప దగ్గవి. మొదట ''చీకటి గదులు'' నవలను తీసుకుందాము. ఇందులో స్వాతంత్ర్యానికి పూర్వం నాటి ఆంధ్ర దేశ సాంఘిక రాజకీయ స్థితిగతులు ఇతివృత్తంగా కథ ఆరంభమైంది. బ్రాహ్మణ, అబ్రాహ్మణ భేదాలు, బ్రాహ్మణేతరోద్యమం వేసిన వెర్రితలలు, ఒక్క బ్రాహ్మణ్యం లోనే గాక ఇతర వర్ణాలలోకూడా ప్రవేశించిన చెడులు, బ్రాహ్మణేతరులలో పైవర్గాలవారి సంగతి మాత్రమే పట్టించుకొని దిగువ కులాలను, హరిజనులనూ విస్మరించి ఆర్థిక స్థితులను పట్టించుకోనట్టి జస్టిస్ పార్టీ, ఇంకా కాంగ్రెస్, సోషలిస్టు, కమ్యూనిస్టు పార్టీల విభేదాలు, అసలు తల్లి, సవతి తల్లి అనే నమ్మకాలు—ఈ విధంగా సంఘంలో మనుషుల మనస్సులలో సహృదయత్వం క్షీణిస్తూ ఎన్ని గదులు తయారవుతున్నాయో వాటిలో చీకటే గాని వెలుతురుకు ఆస్కారంలేక పోవడానికి హేతువు లేమిటో చాలా పెద్ద కాన్వాసుపై చిత్రించాడు. సమగ్రమైన దృష్టి మన సంఘంలోని వ్యక్తుల కవసరమని ఈ నవలలో తేల్చాడు. రెండవ నవల ''పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా'' లో మతిమంతులు (బహుశా తెలివికల వారని కాబోలు) ఎవరికి వారు తమ చుట్టూ ఏర్పరచుకొనే వలయాలవల్ల ఒకరినొకరు అర్థం చేసుకోక పోగా, సమ్యగ్దృష్టి, సమన్వయశక్తి కొరవడి అసూయాద్వేషాలను పెంచుకొని, జీవితాన్ని ఒక పెద్ద విషవలయంగా తయారు చేస్తున్నారని చెప్పి, ఇది సంఘానికి అరిష్టహేతువు అని హెచ్చరించాడు. అయితే సమన్వయం కావాలంటే మనస్సును అధిగమించి పై అంతస్థులలో భావన చెయ్యాలని చెప్పాడు. అరవిందుడు చెప్పిన అతీత మానసిక ప్రవృత్తిని స్పృశించడానికి గోపీచంద్ ఈ నవల వ్రాశాడు. నవల చివరిభాగం అరవిందుని తత్త్వ చర్చలతో నిండి ఉంది. ఆ తత్త్వంలోపడ్డ రచయిత కేశవమూర్తి. ఆయన భార్య సౌజన్యాల రాశి సుజాత, బ్రతికున్నంతవరకూ పట్టు విడవకుండా చివరకు సమ్యగ్దృష్టి కనపరచి అందరినీ ఆశ్చర్యపరచిన పరమేశ్వరశాస్త్రి, దొంగ వెధవలు— సీమంతం, రాధారమణ, శారద్వతుడు అందరూ అన్ని వలయాలు. అంతా పొరపాట్లు చేసినవారే. ''విశ్వాన్నంతా తనలో చూచుకోగల్గిన మానవుడు పుట్టుకురావడానికి ప్రజాస్వామిక విధానం పునాది'' అని గోపీచంద్ ఈ నవలలో చెప్పగలిగాడంటే మార్క్సిజం నుంచి ఆయన ఎంతవరకు పురోగమించాడో అర్థం చేసుకోవచ్చు.

తెలుగు సాహిత్యంలో గోపీచంద్ ఉత్తమ కథకుడుగా, ప్రసిద్ధ నవలా రచయితగా నిలిచిపోయ్యాడు. ఇతర ప్రక్రియలలో కూడా ఆయన కొంత వ్యాసంగం చేశాడు. లేఖలు, వ్యాసాలు వ్రాశాడు. ప్రపంచ తత్త్వవేత్తలను గూర్చి వ్రాశాడు. 'మాంచాల', 'అభాగిని' వంటి నాటకాలు, 'తత్వమసి' మున్నగు

నాటికలు, ఇంకా చాలా రేడియో నాటికలు వ్రాశాడు. నాటక రచయితగా మన సాహిత్యంలో ఆయనకంతగా ప్రశస్తి రాదేమో. కారణం – నాటక రచన ఆయన ప్రక్రియ కాదు. తాత్వికునికీ, తన ముక్కుకు సూటిగాపొయ్యే వాస్తవికవాదికీ నాటకీయత పట్టుబడదు. బెర్నార్డుషా వంటి నాటకకర్త కూడా ఈ విమర్శను తప్పించుకోలేక పొయ్యాడు. గోపీచంద్ ఇటీవల ''మాలపల్లి'' నవలకు చేసిన నాటకీకరణంలో కూడా చెప్పకోతగినంతగా కృతకృత్యుడు కాలేదు. ఆయన ప్రతిభ కథానికలలో, నవలల్లోనే గాఢంగా అభివ్యక్తమైంది. ఆ రెండు ప్రక్రియలలో ఆయన సిద్ధహస్తుడు. ఎంత చిన్న అంశాన్నయినా ఒక కథగా, ఎటువంటి సంక్లిష్ట ఇతివృత్తమునైనా ఒక నవలగా రూపొందించగల నేర్పు ఆయన కుంది. మొట్టమొదటి కథ వ్రాసినప్పుడు ఆయనకూడా కృత్యాద్యవస్థ అనుభవించాడు. ఆ అవస్థనే 'నా మొదటికథ' అని ఒక కథగా చిత్రంగా వ్రాశాడు. క్రమేణా ఆ ప్రక్రియను సాధనంచేశాడు. చెకోవ్, మపాసా, బేట్స్, సారోయన్, పుష్కిన్, గోర్కి, మామ్, ఓ హెన్రీల రచనా విధానాలన్నీ ఈయనను ఆకర్షించాయి. వారందరి పద్ధతులలోనూ ఈయన రచనలు చేశాడు. ముఖ్యంగా బేట్స్ గోపీచంద్‌కు ఎక్కువగా నచ్చినట్లు కన్పిస్తాడు. కేవలం వాతావరణాన్ని చిత్రిస్తూ కథను అల్లడంలో బేట్స్ నేర్పరి. బేట్స్ కథలకు అనుసరణలుకూడా ఈయన వ్రాశాడు. చలం కథల ఇతివృత్తాలు సరిపడవు గాని కథా రచనలో చలం చూపిన శిల్పచాతుర్యాన్ని గోపీచంద్ ఒక సందర్భంలో ప్రశంసించాడు. చలం ఏ దేశంలోని కథకుడికీ తీసిపోడని ఆయన అన్నాడు. ప్రపంచ కథా సాహిత్యాన్ని, అది సాధించిన ప్రయోజనాలనూ చూపినప్పుడు గోపీచంద్ తాను చెప్పదలుచుకున్న విషయాలకు కథ చక్కని సాధనమని గ్రహించాడు. తన ప్రత్యేకతను కూడా చూపిస్తూ ప్రయోగాలవంటి సంఘటనలను పాత్రలను కల్పించి 'గోపీచంద్' అనే ప్రశస్తిని ఆర్జించుకున్నాడు. గోపీచంద్ కథ అంటే– దాని ముఖ్య లక్షణాలు నాకు తోచినంతవరకు ఇవి: వాస్తవమైన గ్రామీణ జీవితం లేదా మధ్యతరగతి జీవితం ప్రాభవము. నిరాడంబరత, అవిచ్ఛిన్నంగా సాగిపొయ్యే అల్లిక, తలుపుచాటునుంచి తొంగిచూచే తరుణివలె ఒకానొక సంస్కారము లేదా తాత్విక జిజ్ఞాస, సొంతనిర్వచనం, సుపరిచితమైన తెనుగు నుడికారం. భాషకు ఆయనకు తండ్రి రచనలే ఒరవడి. ముఖ్యంగా ''తండ్రులు–కొడుకులు'' వంటి కథలలో మధ్యాంధ్ర గ్రామీణుల భాష స్వచ్ఛనిసర్గంగా దర్శనమిచ్చింది. రైతాంగములో తండ్రి, తల్లి, కొడుకు, కోడలు, అల్లుడు, మరదలు, ఆసామి, పాలేరు, పాలమనిషి, కూరగాయల మనిషి ఎలా మాటాడుతారో, వారి నేర్పులేమిటో ఆ మాటల స్వారస్యాలేమిటో గోపీచంద్ ప్రతిభావంతంగా వ్రాశాడు. మొదటి రచనలలోకంటె ఈయన తరువాత చేసిన రచనలలో కావాలని వర్ణనలుచేసి అలంకారాలు చూపాడు. ''మెరుపుల మరకలు'' నవలలో ఇలాంటి అలంకారాలు అనేకం. అసలు ఏ ప్రక్రియలోనైనా గోపీచంద్ ఆరంభంలో చేసిన రచనలలోకంటె తరువాతి రచనలలోనే రచనాకళ సొగసులను విశేషంగా చూపుతూపొయ్యాడు. రచయిత పెరుగుతూ పొయ్యాడనడానికి ఇదే నిదర్శనం.

గోపీచంద్ తీసుకున్న కొన్ని ఇతివృత్తాలు ఆధునికత, ఆంగ్లవిద్య, నాగరికత, విజ్ఞానం తెలిసినవారికి మాత్రమే బోధపడే విషయాలు అయినా వాటిని మామూలు పాఠకుల స్థాయిలోకి తెచ్చి రచనచేశాడు. వాటికీ వాస్తవపరిస్థితులే, సంభావ్యమైన పని చేశాలే

శ్రీ డి. రామలింగం

ప్రాతిపదికలు. కానికొన్ని తావులలో పాత్రలచేత అభిప్రాయాలు చెప్పించినప్పుడు ఆయన ఔచిత్యాన్ని పరామర్శించుకున్నట్లు కన్పించదు. ఉదాహరణకు ''అసమర్థుని జీవయాత్ర''లో పామరుడుగా కన్పించే రామయ్యా తాతచేత నవ్యమానవతావాదంలోని అంశా లను విపులీకరించి చెప్పించడం. వాటిని రచయిత చెబితే సిద్ధాంతాలు చెప్పినట్లు వుంటుందని రెండు పాత్రల సంభాషణలో ఆ చర్చను ప్రవేశపెట్టాడు. నవల చదవడం పూర్తిఅయిన తర్వాత ఆలోచిస్తే "రామయ్యా తాతకు అంత సిద్ధాంత పరిజ్ఞానమే!'' అని ఆశ్చర్య పోతాము. అట్లే ''గడియపడని తలుపులు"లో కోటేశ్వరమ్మ స్వీయ ప్రేమగాథను ఒక పురుషునికి విడమరచి చెప్పడం. అదేమళ్ళీ "పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామా'' లో మొదట కథను రచయిత చెప్పడం మొదలుపెట్టినా అక్కడక్కడా రవీంద్రుని ''ఇంటా—బైటా'' నవలవలె పాత్రలచేతనే ఆయా కథలు చెప్పించడంవల్ల వాటి దృక్పథాలు సమగ్రంగా అర్థమయ్యే వీలుకలిగింది.

కథకుడుగా ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రభ వించిన గోపీచంద్ నవలా రచయితగా వాసికెక్కి ఎప్పటికప్పుడు యేదో ఒక తత్వాన్ని అనుసరిస్తూ, చివరకు విభిన్న తత్వాల సమన్వయం చేసుకొని చివరిదశలో ''నా కిప్పుడు తత్త్వ జిజ్ఞాసే ఆనందాన్ని ఇస్తూవుంది'' అన్నాడు. సిద్ధాంతాలకంటే, భావాల కంటె జీవితం ముఖ్యం—అంటే మానవుడు ముఖ్యం. జీవిత పరమావధి ప్రతి మానవుడికీ ఈ లోకాన్ని వాసయోగ్యం చేయడమే అని వేదాంతివలె భావిం చాడు. ఆయనే చెప్పుకొన్నట్లు ఆయన రచనలు జీవితంలో కలిగిన అనుభవాల మూలంగా వెలువడిన విదలింపులజల్లులు. ఈ పరిణామమును చూస్తే ''ఇరవయ్యో శతాబ్దపు రచయితలు చివరకు తత్త్వ వేత్తలుగా మారవలసివస్తుంది. జీవితాన్ని సంపూ ర్ణంగా చూచేస్థితికి వారు వస్తారు'' అన్న బెర్నార్డుషా మాట గోపీచంద్‌పట్ల సార్థకమైం దనిపిస్తుంది. నిరం తరం ఆలోచనాపరుడై, నిలకడగా పుంఖాను పుంఖంగా రచనలుచేస్తూ (గోపీచంద్ ఇటీవలనే వెయ్యి పేజీల నవలను వ్రాయ తలపెట్టినట్లు తెలు స్తున్నది) వచ్చిన ఈ తెలుగు రచయిత జీవయాత్రలో సగంవరకు మాత్రమే ప్రయాణించి ఆకస్మికంగా కన్నుమూయడం వల్ల ఆంధ్ర సాహిత్యానికి వచ్చిన లోటు ఇంతలో తీరేదికాదు. పరమేశ్వరుడు ఆయన ఆత్మకు శాంతి కలిగించుగాక!

# కథన గాండీవి

1. మధుర మృదు కథనామృత మహిమచేత
ఎన్ని గుండెలనో కదలించినట్టి
నీదు గుండియ త్రుటిలోన నిలిచె, నిట్టి
వైపరీత్యము కల దెందు ! గోపిచందు !

2. ''అసమర్దుని''కి ''జీవయాత్ర'' కల్పింపగా
ఎన్ని యూహలమెట్ల నెక్కినావొ ?
''మెరపుల'' కున్ గూడ ''మరకలు'' గూర్ప క
వోష్ణ రక్తం బెంత యొలికినావొ ?
''తత్త్వ వేత్త''ల ప్రబోధ రహస్యములవెంట
ఎన్ని యుగాల్ వెన్క కేగినావొ ?
ప్రతినతో ''గడియలు'' పడని ''తల్పులు'' మూయ
ఎంత యుద్ధతి ప్రదర్శించినావొ ?

కలము విలుపట్టి సాహిత్య కదనమందు
పలుకు ములుకుల జడివాన చిలికినట్టి
కథన గాండీవి ? నీ పరాక్రమము ముందు
వెన్నుచూపిరి ప్రత్యర్థి వీరులెల్ల.

3. కనుల నొక్కమాఱు కలయ జూచిన జాలు
వ్రాయనేర్తు వెదుటివాని చరిత,
నిజము దాచు ఘనులు నినుడాయ వెఱచెద
రెచట గఱచినాడ విట్టి విద్య ?

4. మృత్యువు వచ్చి మీదబడి మ్రింగెడు దాకను, లేఖినీ సు సాం
గత్యము వీడనట్టి మొనగాడవు, నీ నుడిలో జనించి, సా
హిత్య మహాద్రిశృంగముల నెక్కి నటించెడు నీదు పాత్రలా
మృత్యువు గెల్చినిల్చెను సుమీ, రసికాంధ్ర హృదంతరమ్ములన్

5. అభినవసూతుడై నిజము నారసి, భారత సంస్కృతి ప్రభా
విభవ యథా స్వరూపమును విప్పి వచించిన మేటి విప్లవ
ప్రభుడగు కన్నతండ్రి కొక వన్నియపెంచిన గద్యసాహితీ
విభుడవు, నీకు అంజలు లివే, సకలాంధ్ర సభాముఖమ్మునన్.

శ్రీ ఉండేల మాలకొండారెడ్డి

# శ్రద్ధాంజలి

డాక్టర్ త్రిపురనేని వేంకటేశ్వరరావు

గోపీచంద్‌గారు నాకు ప్రియ సోదరులు. వారు ఎప్పుడు పుస్తకములు వ్రాసినా, నాకు ఒక కాపీ పంపించెడివారు. వారు 1955 సం॥లో "పోస్టు చెయ్యని ఉత్తరాలు" (ఆధ్యాత్మికవాద_భౌతికవాద సమన్వయము) అను పుస్తకము వ్రాసిరి. ఆ పుస్తకము పంపించుచు దానిమీద నా అభిప్రాయముకూడ వ్రాసింపవలసినదిగా కోరినారు. వారు ఉద్యోగ రీత్యా కర్నూలులో ఉంటున్నారు. నేను ఆ పుస్తకము చదివిన వారము రోజులకు వేరే పనిమీద కర్నూలు వెళ్లితిని. నేను ఎప్పుడు వెళ్లినా ఒకటి రెండు రోజులు ఉండమని శరీరశాస్త్రములు (Physiology) తెలిసికొనిడి వారు. కాని ఈ సారి "పోస్టు చెయ్యని ఉత్తరాలు" అను గ్రంథము మీద వాదోపవాదాలు జరిగినవి. వాని పర్యవసానమే ఈ వ్యాసము.

ప్రశ్న:_సమాధ్యవస్థ ఒకటి ఉన్నదని, దాని వలన అతీత చైతన్య శక్తి కల్గునని వైద్యశాస్త్రం ఒప్పుకుంటుందా? అని గోపీచంద్‌గారు నన్ను అడిగారు.

జవాబు:_ఒప్పుకోదు.

ప్రశ్న:_సమాధ్యవస్థను గూర్చి మీ వైద్య శాస్త్రము ఏమి చెప్పుతుంది?

జవాబు:_సమాధ్యవస్థను, అనైచ్ఛిక శ్రద్ధ (Involuntary attention) అని నేటి శాస్త్రజ్ఞులు నిర్వహించియున్నారు. అనగా, శరీరము మనస్సు వశమునందుండదు. కాని వివేకము, భావములు, సాధారణ స్థితియందే యుండవచ్చును. వాటిపై మనస్సుకుగల స్వాధీనము, యిచ్ఛాశక్తి మాత్రము

లోపించును. శరీర చేష్టలకు వలయు సమాధ్యవస్థ, కల్పించువాని సూచన (Suggestion) ల వలన కలుగును. సూచన వలన నొక అభిప్రాయము స్థిరముగా మనస్సున నాటును. ఇదియే సమాధ్యవస్థ.

ప్రశ్న:-సూచన అనగా నేమి? అని వెంటనే గోపీచంద్‌గారు ప్రశ్నించిరి.

సమాధ్యవస్థ కల్పించుట యందు దిది ఎక్కువగా ప్రయుక్తమగును. అస్వాభావిక స్థితియందున్న మనస్సు సూచనగా వచ్చిన ఏ అభిప్రాయమునైనను స్వీకరించును. అది అసందర్భమైనను, అనావశ్యకమైనను భోక్త దానిని విశ్వాసముతో స్వీకరించి శిరసావహించును. సూచన మాటలతోనే గాక సంజ్ఞల ద్వారానైనా కలుగవచ్చును. మనస్సు యొక్క సూచితస్థితి ఎల్లప్పుడును ఒక విధముగా నుండదు. మెదడుయొక్క వికాసమును బట్టియు, కర్తను బట్టియు, సూచింపబడు విషయమును బట్టియు, అది మారుచుండును. కడు జాగ్రదవస్థనుండి, స్పష్టమగు అభిప్రాయములు, విశ్వాసములు ఏర్పడి మిక్కిలి విషయపరిజ్ఞానము, దృఢ విశ్వాసము గలిగి కర్త చేయు సూచనల ఖండించి, విమర్శింపగల వ్యక్తి భోక్తగా నుపయోగింపడు, అట్టి వాని మనస్సు ఏ మాత్రమును సూచితస్థితియందుండదు. ఈ దిగువ నుదాహరించిన పరిస్థితులలో, సూచితస్థితి (Suggestivity) అధిక ప్రమాణములో నుండును.

(1) శరీర మలసినప్పుడు, నిద్రయందు, హిస్టీరియా మున్నగు వ్యాధులచే మెదడు అస్వభావికస్థితి యందు దున్నప్పుడు;

(2) వ్యక్తికి, ఎక్కువ జ్ఞానసంపదగాని, సూచితమగు విషయమును గురించి స్పష్టమగు అభిప్రాయము లేనియప్పుడు;

(3) కర్త మిక్కిలి ఆకర్షణశక్తి కలవాడగునప్పుడు:

(4) సాధారణముగ భోక్త ఏ అభిప్రాయమునైనను అతి శీఘ్రముగా, స్వీకరించు తత్వము కలవాడగునప్పుడు.

''చచ్చినవారి శరీరములు, శ్మశానమునుండి మఱల సజీవములై లేచును'' అను ఒక ప్రతిపాదనము సూచింపబడిన దనుకొందము. విద్యావంతుడు, జ్ఞాని, విమర్శకుడు, స్పష్టమైన అభిప్రాయములు కల్గినవాడు, దీని నంగీకరింపడు. శవములు బుగ్గియై, మట్టితో కలియును కాన, నవి సజీవములై మఱల లేవజాలవను స్పష్టమైన అభిప్రాయము అతని కేర్పడియున్నది. ఈ ప్రతిపాదనమును అనుభవములేని చిన్న పిల్లవాడుకాని లోకజ్ఞానములేని కొండజాతివాడు కాని సులభముగా నమ్మును. అట్టివారు ఎట్టి అసందర్భ సూచనలైన స్వీకరింతురు.

చిన్నపిల్లవాడైనను తోటిబాలుడు ఈ అభిప్రాయమును వెలిబుచ్చినపుడు నమ్మడు. దానినే ఒక మత ప్రవక్తగాని, పాఠశాలలోని ఉపాధ్యాయుడుగాని, గంభీరముగా (Seriously) అనుపేక్ష్యముగా, ఉగ్గడించునప్పుడు నమ్మును, ఇట్టి సూచన అంగీకృతమగుట కర్తయొక్క ప్రతిష్ఠపై నాధారపడియుండును. దీనినే మాన్య సూచన (Prestige Suggestion) యందురు.

మాన్య సూచనయైనను, మనస్సు సూచితస్థితి యందున్నప్పుడే సఫలమగును.

అహంభావ నైచ్య సహజాతముల (The instinct of self assertion and abasement) బలా, బలములపై, మనస్సు సూచితస్థితి ఆధారపడి యుండును. కర్త తనకంటె అధికు డను నమ్మకము కలిగినప్పుడు, భోక్తయొక్క వినయ సహజాతము బలపడును. అందువలన మనస్సునందు సూచితస్థితి నెలకొనును. కర్త తనకంటె తక్కువవాడని, అభి

ప్రాయము కల్గినచో, అహంభావ సహజాతము బలపడి, కర్తచేయు ప్రబోధమును మనసున చొరనీయదు. ఈ రెండు సహజాతములు ఏక కాలమున ప్రేరితములైనచో రెంటికిని కలుగు సంఘర్షణమువలన, ఫలితము బడయము. పిల్లల మనస్సులు తరచుగా, సూచితస్థితి యందుండుటచే, సంఘములోని అభిప్రాయములు, ఆచారములు, విశ్వాసములు వారి మనస్సులలో తేలికగా నాటును.

యోగ నిద్రలో నున్నవాడు కర్త చేష్టల ననుకరించును. మాటలవలనగాని, చేష్టలవలనగాని కలుగు సూచనలు, గతివాహముల ప్రేరించగలవు. ఇందు జ్ఞానేంద్రియ ప్రేరణ, భావన లేవు. యోగ నిద్రయందు అనుకరింపబడు చేష్టలు, అభిప్రాయ జనిత చేష్టలు (Ideo-Neutral Actions) ఇందు కర్త భోక్తయందు శ్రద్ధకలిగించును. ఒకని చేష్టవలన, రెండవ వాని చైతన్యమున, దాని ప్రతిబింబమేర్పడి సంయోగ న్యాయమున నట్టి చేష్టను పురికొల్పును. కొన్ని క్రీడలయందును, లలితకళా విశేషములందును, ఒక చాతుర్యము కనబడినయెడల దాని ననుకరింప యత్నింతుము. చిన్నపిల్లల చేష్టలు చాలవర కిట్టి యనుకరణలే! ఇట్టి సమాధ్యవస్థకు మీరు అతీత చైతన్య శక్తి అంటగట్టితిరి. వారియందు అతీత చైతన్య శక్తి కాదుకదా మామూలు చైతన్యముకూడా లేదు అని నే చెప్పినప్పుడు గోపీచందుగారు ఆలోచనా నిమగ్నులైనారు. "వెంటనే నిర్వికల్ప సమాధిలో నున్నవారిని ఎవరినైనా చూచితివా?'' అని ప్రశ్నించిరి నేను ముమ్మిడివరము బాలయోగిని, పెనుమత్స మహాయోగినిని చూచితినని చెప్పితిని.

'వారిని గురించి నీ అభిప్రాయ మేమి?' అని అడిగిరి. బాలయోగిని గూర్చి ఒక గ్రంథకర్త మహాజ్ఞానిగాను, గొప్ప తేజోవంతునినిగాను సృష్టించినాడు. వానియందు జ్ఞానముగాని, తేజస్సుగాని నాకు గోచరించలేదు సరిగదా అతడు అంతర్ద్రావగ్రంథుల జబ్బుతో బాధపడుచున్నాడని నేను నిర్ధారణచేసి, సంఘమను పత్రికయందు ఒక వ్యాసము వ్రాసి ప్రచురించితిని. దానికి ఆ గ్రంథకర్త ప్రతి విమర్శగాని, ఆధ్యాత్మిక వాదుల ప్రతి విమర్శగాని జరిగియుండలేదు. ప్రతి శివరాత్రికి అతనికి పూజాపురస్కారములు జరుగును. కొన్ని లక్షల ప్రజలు దర్శించుటకు వెళ్లుదురు. ఈ విధముగ కొన్ని లక్షల ప్రజల శక్తి దుర్వినియోగము చేయుట దేశాభ్యుదయమునకు, జాతి కళ్యాణమునకు శ్రేయస్కరముకాదని నేను చెప్పినపుడు గోపీచంద్‌గారు చిరునవ్వు నవ్వి వెంటనే ఈ క్రింది విధముగా ప్రశ్నించినారు.

శరీర ధర్మశాస్త్రజ్ఞులు యిట్టి వారిని పరిశోధించిరా? పరిశోధించినచో వారి పరిశోధనా ఫలితములేమిటి ?

శరీర ధర్మ శాస్త్రజ్ఞులు సమాధ్యవస్థలో నున్న వారి మస్తిష్కముల నెన్నిటినో పరిశోధించి, అనైచ్ఛిక శ్రద్ధలో (అనగా సమాధ్యవస్థలో నున్న) కేంద్ర నాడీ మండలమున కలుగు మార్పులను ఈ క్రింది విధముగా వర్ణించి యున్నారు.

ఒక నాడీ కణము యింకొక నాడీ కణముయొక్క గుణమును హెచ్చు చేయగలదు. లేదా తగ్గించగలదు. శ్రద్ధలో ఈ రెండు పనులు జరుగును. శ్రద్ధ కొన్ని నాడీ కణముల గుణమును హెచ్చించి ఒక అభిప్రాయమును ఎక్కువ స్పష్టపరచును. కాని అనైచ్ఛిక శ్రద్ధ కొన్ని నాడీ కణముల గుణములను తగ్గించి యితర అభిప్రాయముల స్పష్టత తగ్గించును. నాడీ కణముల గుణములు తగ్గినప్పుడు అతీత చైతన్య శక్తి సాధ్యపడదు. కొన్ని అత్యద్భుత నాడీ కణములున్నప్పుడే గదా ఏదైన గొప్ప శక్తి ఉత్పన్నమగునది.

ఆధునిక శాస్త్రజ్ఞులు యింకను పరిశోధన చేసి (1) వల్కలములయందు (Cerebral Cortess) గాని, (2) ప్రత్యేక కేంద్ర స్థానములయందుకాని, (3) సంయోగ నాడీ తంతువులయందు గాని, (4) సూక్ష్మ నాడీ కణజాలము (Histology of Brain) నందుకాని, ఈ సమాధ్యవస్థయందున్న వారి మెదడులయందు గొప్ప మార్పు లేమియు లేవని ఈ అవస్థను పూర్తిగా నిరసించియున్నారు. పైగా యిట్టి మెదడులయందు వికాసమునకు బదులు క్షీణ దశయే యున్నదని వారు నిర్ధారణ జేసియున్నారు.

''హేతువాదము పరిష్కరింపలేని అనేక విషయములను సహజ జ్ఞానము పరిష్కరించగలదని వేదాంతుల అభిప్రాయము. దీనికి నీ సమాధాన మేమిటి'' అని వెంటనే ప్రశ్నించిరి.

మీరు సమగ్రముగా నిష్పక్షపాత బుద్ధితో పరిశీలించిన వేదాంతులు చెప్పిన విషయము తప్పని ఋజువు కాక మానదు.

శాబ్ది కాభిప్రాయముల పరం పరాగత సంయోగము హేతువాదము లేక ఉపపత్తి (Reason) (2) హేతువాదము ప్రత్యక్ష ప్రమాణమునకు నిలచును. (3) ఇతరులకు బోధించుటకు సాధ్యమగును (4) హేతువాదము వలన స్థిరపడిన నిర్ణయమును యితరులకు విప్పి చెప్పగలము (5) హేతువాదన వలన కల్గిన నిర్ణయమును అమలుపరచుటకు ముందు అది సరియైనదా కాదా అని పరిశీలించవచ్చును. (6) హేతువాద శక్తియందు, జ్ఞాపకశక్తి అభిప్రాయముల సమీకరణము యిమిడియున్నవి. కాని సహజ జ్ఞానము దీనికి విరుద్ధమైనది. సహజ జ్ఞానము ఎట్టిదో ఎవరు యిదమిద్ధముగ తేల్చలేదు. ఇది శరీరములో ఎక్కడ ఉంటుంది ? దీని స్వభావమేమిటి ? అని నేను ప్రశ్న పరంపరలు కురిపించినపుడు ''అది ఒక ఇన్‌స్టింక్ట్ వంటిది'' అని రస్సెల్ అన్నాడు అని గోపీచంద్‌గారు అన్నారు. అది మా శాస్త్రజ్ఞులు ఒప్పుకోరు. ఇన్‌స్టింక్ట్ (Instinct) అంటే వంశ పారంపర్యముగా సిద్ధించిన మానసిక శారీరక ప్రవృత్తి (Phycho-physical disposition) అని శాస్త్రజ్ఞుల నిర్వచనము, పైగా మానసిక భాగమున జ్ఞాన, భావ సంకల్పములు (Cognition, affection and Conation) అను మూడు అవస్థలు కలవు. సహజ ప్రవృత్తిగల వ్యక్తి ఒక విషయమును పరికించి, దానియందు శ్రద్ధ కల్గి, ఒక విలక్షణమగు భావోద్రేకము పొంది ఒక ప్రత్యేక విధమగు చేష్టనొనర్చును, లేదా అట్టిచేష్టను సంకల్పించును. కొన్ని సహజాతములు (Instincts) అనుకూలమగు కొన్ని శరీరావస్థలయందే ప్రేరితమగును. (ఉదా:- ఆకలి) అట్టి శరీరావస్థయే జ్ఞానేంద్రియముల ప్రేరించును. కాబట్టి సహజ జ్ఞానము వేరు సహజాతము వేరు.

''పిల్లలు తాము కోరిన మాట వచ్చేవరకు అనేక ధ్వనులు చేస్తారు. ఈ విధంగా ధ్వనులు చెయ్యకుండా మాటలు నేర్చుకోలేరు. ఈ ధ్వనులు సహజజ్ఞానము వల్ల జరుగుతుంది...'' అని గోపీచంద్‌గారు అన్నారు.

ఇది మెదడుకు సంబంధించిన విషయము. మెదడు వామభాగము నందు వాక్ కేంద్రము (Speech centre) కలదు. ఎడమచేతి వారికి ఈ కేంద్రము కుడి భాగమున కలదు. శైశవదశయందు ఇది బాగుగా అభివృద్ధి చెందక పోవుటచే పిల్లలు అనేక రకమైన ధ్వనులు చేయుదురు. పెద్దవారైన తరువాత అది బాగుగా అభివృద్ధి చెందుటచే వారు స్పష్టముగా మాట్లాడగలరు. కాని యిది సహజ జ్ఞానము వలన మాత్రము కాదు. శరీర ధర్మశాస్త్రవేత్తలు అనేక ప్రయోగములు పరిశోధనలుచేసి నిర్ధారణజేసిన విషయములు యివి.

డాక్టరు త్రిపురనేని వేంకటేశ్వరరావు

ఆధ్యాత్మిక వాదులు ఈ పరిశోధనలను అనుభవము లోనికి తెచ్చుకొనక, వారు ఈ విషయములను ఊహించుటవలన ఈవిమర్శలు రేకెత్తుచున్నవని నేను చెప్పినప్పుడు గోపీచంద్‌గారు నివ్వెరపడిపోయిరి.

కాబట్టి హేతువాదము ఆలోచించగలదు, విమర్శించ గలదు, వాఖ్యానించగలదు, నిత్యసత్యమును, హేతు వాదము ద్వారానే కనుగొనగలము. రెండవ మార్గ మున సత్యమును కనుగొనలేము. మానవుడు అజ్ఞాన ములో నున్నప్పుడు భూమిబల్లపరుపుగా నున్నదని అను కొనేవాడు. విజ్ఞానశాస్త్రము పరిశోధించి భూమి గుండ్ర ముగా నున్నదని సహేతుకముగా ఋజువు చేసినది. భూమిని అనేక రకములుగా వర్ణించి, భూమికి రెక్క లున్నవని వాదించెడి ఆధ్యాత్మిక వాదులు నేడు హేతు వాదము చెప్పిన దానిని శిరసావహించిరి. కావున అస్పష్టమైన సహజ జ్ఞాన నిర్ణయముకంటె, స్పష్టమైన హేతువాద నిర్ణయము ఉత్తమమైనది, నిజమైనది అని నా అభిప్రాయము. మీ అభిప్రాయము చెప్పవలసినది అని నేను అడిగితిని.

హేతువాదమును నిర్లక్ష్యము చేయమనిగాని, హేతువాదము పనికి మాలినదనిగాని, నేనెచ్చటను అన లేదు, వ్రాయలేదు. నాకు హేతువాదముమీద నమ్మ కము పోలేదు. నేను హేతువాదినే అని సంభాషణను గోపీచంద్‌గారు ముగించ...వెంటనే మీరు హేతు వాదముమీద పుస్తకము వ్రాయండి అని అడిగాను. ''తప్పక వ్రాస్తాను'' అని అన్నారు. కాని మనకు నేడు గోపీచందుగారు లేరు. ఇది మన ఆంధ్రదేశము నకు తీరని నష్టము. ప్రత్యేకముగా నాకు మానని పుండు, తీరని ఆపద. వారి కిదే నా శ్రద్ధాంజలి.

# ఎందుకు?

"జ్ఞానానికి పరిపూర్ణత్వం లేదని మీరంటారు?"

"లేదు, జ్ఞానం ఎప్పటి కప్పుడు పరిస్థితుల్ని బట్టి లిమిట్ అవుతూ వుంటుంది."

"అయితే ఇప్పుడు మనకున్న జ్ఞానాన్ని బట్టి నిజం అనుకున్న విషయాలు, రేపు 'కాదు' అని తేలవచ్చు?"

"ఆహా, సందేహం ఎందుకు?"

"అయితే ఎందుకండి ఈ శ్రమ? ఇప్పుడు ఇది నిజం అనుకుని, అహోరాత్రుళ్ళూ కష్టపడటంఎందుకు? రేపు మళ్ళీ కాదనుకొని, తేల గుడ్లు వెయ్యటం ఎందుకు?''

"అదే పొరపాటు. ఇవాళమనకున్న జ్ఞానం రేపు తప్పు అని తేలుతుం దనుకోవటంకంటే, సంపూర్ణం కాదని తెలుస్తుందనుకోవటం నిజం. ఇప్పుడున్న జ్ఞానాన్ని నమ్మి పని చెయ్యబట్టి ఈజ్ఞానం అసంపూర్ణం అనే జ్ఞానాన్ని పొందగలుగుతున్నాం. అసంపూర్ణంగా వున్న జ్ఞానాన్ని ఎప్పటికప్పుడు నింపుకోవటమే అభివృద్ధి. జ్ఞానం అసంపూర్ణం గదా దానిజోలి మన కెందుకనుకుంటే, జ్ఞానమూలేదు: అభివృద్ధీలేదు.''

గోపీచంద్

# మరణమూ - గోపీచంద్ - నేనూ

మరణానికి మరణంలేదు. మరణించినవాడు గోపీచంద్. మరణించ నున్నవాణ్ణి నేను. మా ముగ్గురికీ అవినాభావ సంబంధం వుంది. మూడూ మూడు శక్తులు. మూడు భావాలు అవునేమో. అనిత్యమైన యీ జగత్తులో అంతా మిధ్యే, అంతాభ్రమే. జగత్తే మిధ్య; గుణం మిధ్య; నిర్గుణం మిధ్య; ఆకారం మిధ్య; అనుభూతి మిధ్య; ద్వైతం మిధ్య; అద్వైతం మిధ్య. మిధ్యాతీతము, నిత్యము, సత్యమూ అయినది ఒక్కటే. అది మరణం. నీడమాదిరిగా, గాలిమాదిరిగా జీవిని వెన్నంటి, వెంటాడి, జీవి గుండెల్లో నిత్యం నిద్రించి నిలకడగా వుండేది యీ మరణమే. ఇదిమాత్రం శాశ్వతమైనది, స్థిరమైనది. భావాతీత, కాలాతీత, గుణాతీత నిర్గుణం యీ మరణం.

మరణానికీ గోపీచంద్‌కీ వున్న అనుబంధం ఏమిటి అసలు ? అదెవరూ గోపీచంద్ ఎవరు ? గతానుగతంగా యీ యిద్దరికీ, యీ రెండు శక్తులకూ ఏదైనా అవినాభావ సంబంధం వుందా ? గోపీచంద్ పై మరణానికి కోపమా, అభిమానమా, కరుణా ? తనకు గోపీచంద్ దగ్గరి బంధువా ? కాక మరేమిటి ? 'జాతస్య ధృవం మరణం' అంతే అంటారా ? అయితే గోపీచంద్ ఎందుకు మరణించాలి. నే నెందుకు మరణించలేదు. ఎవరెవరు ఎప్పుడెప్పుడు మరణించాలో అన్న వివరాలు వ్రాసిపెట్టే కార్యాలయం ఎక్కడ వుంది. కాకపోతే గోపీచంద్ పై మరణానికి అంత ప్రత్యేక శ్రద్ధా, ఆప్యాయతా ఎందుకు మరి ?

శ్రీ పి. వి. సుబ్బారావు

మరణం గోపీచంద్‌ను ఎక్కడకు తీసుకుపోయింది ? మననించీ ఎందుకు పీక్కుపోయింది. సోదరి శకుంతలను వుసూరు మనిపించి ఏమి పొవుకుంది మరణం. నా మాదిరిగా గోపీచంద్‌ను అభిమానించే వాళ్ళూ, పోట్లాడే వాళ్ళూ అక్కడ వున్నారో లేదో? ఉండరనే నా నమ్మకం. అయినా అక్కడ అంటే ఎక్కడ ? అది అంతు దొరకని 'అక్కడ'. అనంతమైన 'అక్కడ'. శూన్యంలాంటి 'అక్కడ'.

అనేక పరిభ్రమణల పర్యంతంగా జీవి నిర్వికల్పంగానూ, నిర్విరామంగానూ పయనిస్తూనే వుంది. దానికి శాంతి లేదు; విశ్రాంతి లేదు. లంపటత్వంలోనూ, లాలసత్వంలోనూ మునిగి తేలుతూనే వుంది. రాగద్వేషాలలో వూగిసలాడుతూనే వుంది. ఏ శరీరంలో ప్రవేశించినా జీవికి యీ సంకటావస్థ తప్పటం లేదు. అనుభూతులు వేరైనా సగుణాత్మక పరబ్రహ్మ స్వరూపమైన ఆనందమే అన్ని జీవుల ఏకైక లక్ష్యం. ఆ నిర్వికల్ప, నిర్గుణాత్మక నిత్యానందం కొరకు గోపీచంద్‌లోని జీవి వెదుకులాడింది. తహతహలాడింది; తపన చెందింది. అర్రులు చాచింది. ఈ వ్యావహారిక ప్రపంచంలో గోపీచంద్ నామధేయంతో తిరిగిన జీవి చాలా విచిత్ర జీవి. ఆ జీవి ఆశయాలకు, ఆవేశాలకు, అనుభూతులకు అశించినంతగా పనికిరాని పరిసరాల్లో తిరగవలసి వచ్చింది. ఈ శతాబ్దపు వాతావరణమే సరిపడలేదు. ఆ జీవి వూహలు విమానంకంటే వేగంగా పరుగులెత్తేవి. గాలికంటె సున్నితంగా సుళువుగా వుంటూ అంచలంచలుగా వువ్వెత్తుగా వురకలు వేస్తుండేవి. అసలు అంతగా పరవళ్ళు తొక్కే ఆ జీవికి ఆ శరీరమే బహుశా ప్రథమ ప్రతిబంధకమేమో.

గోపీచంద్ అన్వేషి; పృచ్ఛకుడు. నిర్విరామమైన అన్వేషణ అది; నివృత్తి దొరకని పృచ్ఛన అది. అందువల్లనే అందరి మధ్యా వుంటూ ఒంటరితనం అనుభవించేవాడు. గోపీచంద్ జాడ తెలియని, గమ్యస్థానం దొరకని నిత్యప్రవాసి. తానొక వ్యక్తినని ఏనాడూ అనుకోలేదు. తానొక వ్యవస్థ ననుకున్నాడు. తానే ఒక వుద్యమం అని వూహించాడు. అట్లాగే జీవించాడు. తన కొక ప్రత్యేకత వుందని గర్వపడేవాడు. ఉన్నదిగా మరి. సంఘంలో ప్రత్యేకత, సాహిత్యంలో ప్రత్యేకత, రాజకీయాల్లో ప్రత్యేకత–ఎటు ఆలోచించినా, ఏమి ఆలోచించినా ప్రత్యేకంగానే వుండేది. ఊపిరాడని ఆలోచనలు, వూరందరికీ రాని ఆలోచనలు. అందరూ ఆలోచిస్తున్నట్లే తనూ ఆలోచిస్తున్నాడని ఎవరన్నా భావిస్తే బాధపడేవాడు. అందరి రచనలవంటివే తన రచనలు అని అనుకొంటున్నారని తెలిస్తే వ్యథ చెందేవాడు. అందరి రాజకీయాలవంటివే తన రాజకీయాలు అని అనిపిస్తే నిద్ర పోగలిగేవాడుకాదు. అప్పుడు తాను గోపీచంద్‌ను ఎట్లా అవుతాను, పీపీచంద్‌ను మాత్రమేనని వేదన పొందేవాడు. ఈ సంఘంలో పీపీచంద్‌లు అసంఖ్యాకంగా వున్నారు, గోపీచంద్ మాత్రం ఒక్కడే అని గర్వపడేవాడు; తృప్తి చెందేవాడు. ఆ తృప్తి దొరకని రోజున ఆ జీవికి నిద్ర లేదు. మనశ్శాంతి లేదు. తపన చెందేవాడు. దొరకని దేనికోసమో వెదుకులాడేవాడు. ఎంతో ఆందోళన చెందేవాడు. అట్లాంటి సమయాల్లో అంతపాటి గోపీచంద్‌మీద గూడా ఎంతో జాలి, కరుణ కలిగేవి ఆంతరంగికులకు. గోపీచంద్ మేధావి. మేధావు లందరికీ వుండే జాడ్యం గోపీచంద్‌లోనూ వుంది. అయితే మోతాదు ఎక్కువ. 'అహంబ్రహ్మాస్మి' కనకనే మేధావులకు మాత్రమే అర్థమయ్యే రాజకీయాలు తన రాజకీయాలుగా చేసుకున్నాడు. ఆ రాజకీయాలతో అతి సామాన్యమైన పీడిత ప్రజను వుద్ధరించాలనుకున్నాడు. అవి తప్ప

యింక ఏ యితర రాజకీయాలూ వారిని వుద్ధరించ లేవనుకున్నాడు. అయితే పీడిత ప్రజానీకంతో ఏనాడూ తిరిగి ఎరుగడు. ఆయనలోని మేధస్సు, విజ్ఞత, ప్రత్యేకత అన్నీ అందుకు ఎదురు తిరిగేవి. తాను గోపీచంద్. తానొక పీపీచంద్ కాదు. కాలేడు. గోపీచంద్ కళా జీవి. వైజ్ఞానిక తృష్ణాపరుడు. అట్లాంటి తృష్ణాజీవి అయిన గోపీచంద్‌ను లౌకిక వాతావరణం అట్లా వుండనివ్వలేదు. కనకనే అప్పు డప్పుడు అతి సాదా మనిషిలాగా ప్రవర్తించేవాడు. ఆ అనుభూతి చైతన్యానికి వచ్చినప్పుడు మాత్రం త్రుళ్ళి పడేవాడు. తానూ పీపీచంద్‌ను అయిపోతున్నా నేమో నని భయపడిపోయేవాడు. అట్లాంటి సందర్భాల్లో తన్ను జూచి తాను జాలిపడేవాడు. విచిత్ర జీవి గోపీచంద్. అందరితో కలసి తిరుగుతూనే ఏ ఒక్కరితోనూ యిమడలేక పోయేవాడు. ప్రతి ఒక్కరూ తన్ను ప్రత్యేకంగా చూస్తున్నారో లేదోనని ఎంతో చైత న్యంతో పరిశీలిస్తుండేవాడు. గోపీచంద్ జీనియస్. కనకనే అన్ని చిక్కులు, అన్ని సమస్యలు. తాను సాదా మనిషిలాగా ప్రవర్తించే సమయాల్లో కూడా సాదా మనుష్యుల్లో కలిసి ఏ మాత్రమూ తిరగలేక పోయేవాడు. సాదా మనుష్యులకు తాను ఎల్లప్పుడు అతీతమేనని తృప్తిపడ్డాడు. ఎప్పుడూ ఎడంగానే వుండేవాడు.

ఏది వ్రాసినా నిర్భయంగా వ్రాసేవాడు. ఏది చేసినా అడుగడుక్కూ భయపడేవాడు. ప్రతి ఆలోచనా విచిత్రంగా వుండేది. రెటమతం ఒక సిద్ధాంతం అన్నాడు. సిద్ధాంతీకరించాడు. ప్రతి మేధావికీ అదే సిద్ధాంతం గనకనే మేధావులు సంఘాన్ని పురోగమనం చేయించగలిగా రన్నాడు. సంఘంలో ప్రభావిత మవు తున్న భావస్రవంతికి ఎదురీతయీదేవాడు. సంఘంలో ఒక్క మేధావి మాత్రమే ఆ ఎదురీత యీదగలడని సంతుష్టిపడేవాడు. తాను మేధావిగనుక ఎదురీత తన సహజలక్షణమని గర్వపడేవాడు. బూజుపట్టిన సాంఘికవ్యవస్థనూ, రాజకీయవ్యవస్థనూ కూల్చ టానికి అవసరమైన రచనలు నిర్భీకంగా చేసేవాడు. ఎంత నిర్భీకంగా వ్రాసేవాడో అంత నగిషీతనమూ చూపించేవాడు. విచిత్రమేమిటంటే గోపీచంద్ ఎంత ధైర్యవంతుడో అంత పిరికివాడు. కుళ్ళిన సమాజిక కట్టుబాట్లపై ఎంత తిరుగుబాటు చేసేవాడో, సమాజం లోని వ్యక్తుల్ని కలుసుకుంటానికి అంతగా పిరికిపడేవాడు.

ఒకసారి ఒక రాజకీయసభ జరిగింది. అది గోపీ చంద్ నేనూ కలసి పనిచేసే రాజకీయపక్షం ఏర్పాటు చేసినసభ. మా రాజకీయపక్షానికి గోపీచంద్ అప్పుడు రాష్ట్రకార్యదర్శి. గోపీచంద్‌కు అప్పట్లో సభలన్నా, సమావేశాలన్నా గిట్టదు. ఆ వాతావరణం కొత్తచేసినట్లుండేది. సభకు జనం వేల సంఖ్యలోనే హాజ రయ్యారు. గోపీచంద్ చమత్కార సంభాషణకు అలవాటు పడ్డవాళ్ళు, వాటి సంగతి విన్నవాళ్ళు చాలామంది వచ్చారు గోపీచంద్ వుపన్యాసం వింటా నికి. ''అంతమంది ప్రజలముందు నిలబడి మాట్లాట్టం నాకు అలవాటులేదు. ఉపన్యాసం వ్రాసి పంపుతాను మీరు చదవండి'' అన్నాడు గోపీచంద్. నేను సరే ఓరా అన్నాను. మేమెవ్వరమూ ఒప్పుకోలేదు. తప్పనిసరి అయి సభలో ప్రసంగించాడు. అంత సభలో ముందుకూచున్న నలుగురైదుగురు మాత్రమే కనుపించారు గోపీచంద్‌కు. ఆ నలుగురైదుగురితో సంభాషణలు జరిపినట్లుగా నాలుగైదు నిముషాలు ప్రసంగించాడు. ఉన్నట్లుండి "మా సిద్ధాంతాలన్నీ మీకు విపులంగా మా సుబ్బారావు విశదం చేస్తాడు వినండి. మా సుబ్బారావు బాగా వుపన్యసించగలడు" అని కూర్చున్నాడు. తరువాత గోపీచంద్ సభల్లో


బాగా వుపన్యాసిస్తున్నాడని విన్నాను. ఆ సభలో మాట్లాడిన నాలుగు నిమిషాల్లో కూడా ఎన్నో చమత్కారాలు వేసాడు. అదిగో గోపీచంద్ సహజ లక్షణం. ప్రతివారూ గోపీచంద్ చాలా చమత్కారంగా మాట్లాడతాడు అనేవాళ్ళు. అంటూ వినేవాళ్ళువింటూ, మైమరచిపోయేవాళ్ళు. తాను ఏది వ్రాసినా, ఏదిచేసినా గోపీచంద్ టచ్ వుండాలని వూహించేవాడు. ఉండేది కూడాను. మా మధ్య గోపీచంద్ వుంటే ఎంతో నిండుగా వుండేది. గోపీచంద్ వున్నచోట ఒక దర్బారు ఏర్పాటు అయ్యేది. తాను మాత్రం ముందుయుగంవాడినని అనవసరంగా యీ యుగంలో పడ్డానని బాధపడుతుండేవాడని నా నమ్మకం. నిజంగా గోపీచంద్ రాబోయే కాలంవాడు.

గోపీచంద్ ఎంతటి భౌతికవాదో అంతటి ఆధ్యాత్మికవాది కూడాను. ఎంత రియలిస్టో అంతటి ఐడియలిస్టు. కథారచనలో ఎంతటి విశిష్టత సంపాదించాడో అంతటి శాశ్వతత్వం సంపాదించుకున్నాడు. కనకనే పొరపాటు పడ్డాడు. జీవితాన్ని కూడా శాశ్వతం చేసుకుందామని శాశ్వత ఏర్పాట్లు చేసుకుంటానికి తంటాలు పడుతున్నవాడుగా గోచరించేవాడు. వేదాంతజ్ఞానం కూడా సమృద్ధిగా సంపాదించుకున్న అంతటి గోపీచంద్ కూడా భ్రమకు దాసుడయ్యాడు. కాని కాలం కలిసిరాలేదు. మరణం వెనకపోటు పొడిచింది. అయితే గోపీచంద్ మరణించినట్లేనా. నమ్మలేను. ఎట్లా నమ్మటం. జీవికి మరణం లేదంటారుగా. అయితే గోపీచంద్ అని పిలువబడ్డజీవి బ్రతికే వుండాలి. మరి ఎక్కడ వున్నట్లు ? ఏమి చేస్తున్నట్లు ? లేక పరమాత్మలో కలిసిపోయిందా? తిరిగి రాదా? వస్తే తిరిగి ఏ శరీరంలో ప్రవేశించబోతుందో ఎట్లా తెలుసుకొనేది. తెలుసుకోవాలని తాపత్రయం పడుతున్న నేనూ, నా కుతూహలం ఏమికావాలి ? అయితే జీవికి మరణమే లేదన్నమాట. గోపీచంద్ అనబడ్డజీవి బ్రతికేవుంటే ఎక్కడవున్నా నేను ఒక్కసారి కలుసుకోవాలి. ఎన్నో అవసరాలున్నాయి. గోపీచంద్ అనబడ్డ జీవి మరో శరీరంలో ప్రవేశించకమునుపే కలుసుకోవాలి. కలుసుకొని కొన్ని హెచ్చరికలు చేసిరావాలి. ఎట్లా కలుసుకొనేది? ఎక్కడ కలుసుకొనేది ?


మరి నేను యిక్కడ యీ శరీరంలో యిరుక్కుపోయివున్నానే ఎట్లామరి?

అయితే జీవికి మరణమే లేకపోతే యిక మరణానికి మిగిలింది మరణమే. శరణ్యమేలేదు.


అయితే నాకు మరణంలేదా ? హతోస్మి ''అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ''.



గోపీచంద్ గారి కుటుంబము



గోపీచంద్ స్మరంతి (11-11-1961) సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి శ్రీ ఆలపాటి వెంకట్రామయ్య,
కుడినుంచి ఎడమకు వరుసగా కూర్చున్నవారు నాటి సభాధ్యక్షులు, నేటి మా సంఘాధ్యక్షులు,
మంత్రి శ్రీ పి. వి. నరసింహారావు, న్యాయమూర్తి శ్రీ గోపాలరావు ఎక్బోటె, పూజ్యశ్రీ తాపీ ధర్మారావు.
వెనుకవరుసలో శ్రీ పోతుకూచి సాంబశివరావు, కుడి చివర నిలబడివున్నవారు శ్రీ నర్రా కోటయ్య.



గోపీచంద్ భౌతిక కాయానికి అంతిమక్రియలు జరిగేముందు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులు,

# గోపీచంద్‌తో కొంతకాలం

శ్రీ కె. సుబ్రహ్మణ్యం

1936-38 లో మా కాలేజి చదువులు. మాతోపాటు సీనియర్ క్లాసులు చదువుతున్న జి. వి. కృష్ణారావు, నాయుడు, ఎం. వెంకటేశ్వరరావు మొదలైనవారు ఉంటూ ఉండేవారు. వారితో ఉన్న స్నేహాన్ని పురస్కరించుకొని మిత్రుడు గోపీచంద్ తరచు గుంటూరు వస్తూపోతూ ఉండేవారు. అదే నేను ప్రథమంగా వారిని చూడడం. అప్పట్లో వారితో నా కంతగా పరిచయంలేదు. వచ్చినప్పుడు నాలుగైదు రోజులు నాయుడు ఆతిథ్యం పొందటం, కాలాన్ని పుస్తక పఠనానికో, వ్యాసరచనకో వినియోగిస్తుండటం చేసేవారు గోపీచంద్. ఆ సమయంలోనే తెలుగులో శాస్త్రీయంగా 'పట్టాభిగారి సోషలిజం' అనే ఉద్గ్రంథాన్ని రచించారు. ఆ విధంగా తెలుగులోకానికి సోషలిజంపట్ల సక్రమ దృక్పథాన్ని అందించిన ఘనత ఆయన పొందారు.

అంతకుముందు మద్రాసునుండి కీ. శే. గూడవల్లి రామబ్రహ్మంగారి సంపాదకత్వాన వెలువడుతున్న 'ప్రజామిత్ర'లో రాయ్ సాహిత్యానికి సంబంధించిన వ్యాసాలు తెలుగులో ప్రకటిస్తుండేవారు. అవి కేవలం తర్జుమాలు కావు. స్వతంత్ర రచనలనే చెప్పవలసి ఉంటుంది. ఆవిధంగా రాయ్‌కి న్యాయాన్ని చేకూర్చి పెట్టినవారిలో ప్రథములు గోపీచంద్‌గారే. దాదాపు అదేసమయంలో, 'నాలోనివాడు' అన్న శీర్షికక్రింద తన స్వీయగాథను వినిపించారు. ఆచరణాత్మైపుణ్యాన్ని, తండ్రికొడుకుల సంబంధాన్ని అంత సున్నితంగా, రమ్యంగా, హృదయానికి హత్తుకునేట్లు వ్రాయగలగ

టం నిజంగా అభినందనీయం, నేను తనివిదీర మూడు, నాల్గుసార్లు చదివాను. మిత్రులకు చదివి వినిపించాను. ఆలా ఆనాడు ఆయన ఆనందంలో పాలుపంచుకున్నాను. దానిలో ఆయన హృదయం ఎంతకోమలమో ద్యోతకమౌతుంది. ప్రతి చిన్న సంఘటనకు ఆయన రియాక్టు అయ్యేవారు. సీరియస్‌గా తీసుకునేవారు. అదే ఆయనకు కొంతవరకు ప్రయోజనకారి అయింది; కొంతవరకు ప్రతిబంధకమూ అయింది.

1940 లో నేను కారణాంతరాలవలన తెనాలిలో ఉండవలసివచ్చింది. అప్పటికి రాడికల్ కాంగ్రెస్ వాదులసమితి తరఫున 'ప్రపంచయుద్ధం—భారతదేశ కర్తవ్యం' మొదటగా తెలుగులోనికి తీసుకురాగలిగాం. ఆ సందర్భంలో ఆయన నైతికంగా చాల సహాయపడ్డారు. అప్పుడే ఆయనతో నా తొలి పరిచయం. ప్రతి దినం ప్రొద్దుట, సాయంత్రం ఆయనను కలుస్తుండేవాడిని. ఆయన పరిచయ భాగ్యం లభించినందుకు సంతోషించాను. నాజీవితంలో అదొక చరిత్రాత్మక ఘట్టంగానే భావించాను. నాపై ఆయన ప్రభావం పడసాగింది. పరిచయం ఎక్కువైనకొద్దీ "నీవు మా పార్టీలో ఉండదగినవాడివి కావు. నీవు మాపార్టీలో స్టాలిన్‌వు" అంటూ నవ్వుతుండేవారు. ఒకనాడు మేమిద్దరం సూతాశ్రమం నుంచి బజారుకువస్తున్నాం. కీ. శే. రామస్వామిచౌదరిగారు చూసి "దేశాన్ని మరమ్మతు చేయడానికి బయలుదేరారా?" అని నవ్వారు. మేమిద్దరంకూడా నవ్వాము.

1941 ఫిబ్రవరిలో ప్రథమ రాడికల్‌పార్టీ మహాసభ ఏర్పాటు కావలసిఉంది. రాయ్‌దంపతులు రానున్నారు. కాని, దురదృష్ట వశాత్తు గోపీచంద్‌గారు సినిమాలో అసిస్టెంట్ డైరెక్టరు పదవిని నిర్వహించడానికి వెళ్ళిపోవలసి వచ్చింది. ఆయన లేని కొరత కొరతగానేఉంది. మేమంతా బాధపడినవారమే. ఆయన వ్యక్తిత్వం అటువంటిది. అయినా ఆయన మద్రాసు నుండి ఎప్పటి కప్పుడు తమ అమూల్య సలహాలను జాబులద్వారా అందజేస్తుండేవారు. మా ఇతర ప్రచురణలకు కావల్సిన అడ్వర్టైయిజ్‌మెంట్లను పంపించారు. తరువాత రాయ్‌దంపతులు మద్రాసు వెళ్ళినప్పుడు వారికి స్టేషన్‌లో ఘనమైన స్వాగతాన్ని ఏర్పాటు చేయటమేగాక కీ. శే. గూడవల్లి రామబ్రహ్మంగారి ద్వారా బ్రహ్మాండమైన విందు ఏర్పాటుచేసి, రాయ్ ఉపన్యాసాలను నగరంలో పలువురు ప్రముఖులకు వినిపించారు.

తిరిగి కొన్నాళ్ళకు తెనాలి వచ్చారు. ఆసమయంలో 'రాడికల్' తెలుగు పత్రికకు సంపాదకులుగా ఉన్నారు. ఆయన సంపాదకత్వం క్రింద 'రాడికల్' ఒక విశిష్ట స్థానాన్ని ఆక్రమించింది. అందుకు మేమంతా గర్వించాం. ఆయన 'చిత్తజల్లు' శీర్షిక క్రింద విసరిన చెణుకులు నేటికీ ప్రతిధ్వనిస్తుంటాయి. ఆయన కథల్లోని ముఖ్యభాగాలు 'రాడికల్' వరుసగా ప్రకటిస్తుండేది. ఒకనాడు నన్నుపిలిచి 'రేపు వారానికి ఒక వ్యాసంపంపాలి సుమా!' అన్నారు. 'అలవాటులేదు' అన్నాను. 'మొదట అందరూ అంతే. రేపు పంపితీరా' లన్నారు. పట్టుపట్టారు. ఇంకతప్పలేదు. చేతైచేతగానట్లుగానే వ్రాసిపంపాను. ప్రకటించారు. తరువాత నేను కలిసినప్పుడు 'చేతకాదంటివే: ఎలా వ్రాశావు?' అని ప్రశ్నించారు. 'మీ ఆజ్ఞ సుగ్రీవాజ్ఞ' అన్నాను. ఆలా వారు నన్ను వ్యాసరచయితను చేశారు. ఇంకా ఎంతమంది నిలాచేశారో చెప్పలేను.

మరో సంఘటన. 'బండి సిద్ధంగాఉంది, బయలుదేర' మన్నారు. ఎక్కడికని ప్రశ్నించే ధైర్యంగాని, అలవాటుగానీ నాకులేదు. ఎక్కాను. నాతోపాటు మిత్రులు రాధాకృష్ణమూర్తి, సుబ్బారావు ఇత్యాదులు ఆ ఊరుచేరాం. బహిరంగసభకు కావలసిన ఆట్ట

హాసం ఎంతాఉంది. వెళ్ళగానే సభప్రారంభం. ఆయన అధ్యక్షులు. ఆయన అధ్యక్షస్థానాన్ని స్వీకరించగానే నాపేరు పిలిచారు. నేను దిగ్భ్రాంతి చెందాను. కారణం ఎంతవరకు నాకు బహిరంగసభల్లో మాట్లాడే అలవాటు లేకపోవటం. నాకు తెలియకుండా, వ్యవధిలేకుండా నేను వక్తనవడం, ఏదో అసంతృప్తి లేకుండా మాట్లాడేశాను. సభానంతరం 'భలే పనిచేశారే! నాకు కాస్త ముందుగా చెప్పకూడదా!' అన్నాను. "ఇప్పుడు మించుకు పోయిందేమిటి? ఇకనుంచి నీవు వక్తవు. ఎన్నాళ్లు మూలకూర్చుంటావు?" అన్నారు. ఆవిధంగా ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చి మిత్రులను ఏపనికైనా సిద్ధం చెయ్యగలశక్తి ఆయనలోఉంది. స్నేహానికి ప్రాణం సైతం యిచ్చేంత సాహసం ఆయనలో వుండేది. తనలాగే అందరూ ఉండాలని తలపోస్తూఉండేవారు.

వారు వరుసగా కథలు ప్రకటిస్తున్న సమయం— మేము రాయ్ సాహిత్యాన్ని తెలుగులో ప్రచురిస్తున్న సమయం. ముఖ్యంగా జి. వి. కె; కె. ఆర్. కె; ఎ. జి. కె; పి. వి. యస్. ఇందుకు బాధ్యులు. ఆయన సలహాలు లేకుండా దాదాపు ఏ ఒక్క ప్రచురణా అప్పట్లో వెలువడలేదు. "నీవుమాత్రం ఎందుకు పుస్తకం వ్రాయగూడ"దని ఒకనాడు ప్రశ్నించారు. 'పుస్తకమా!' అన్నాను ఆశ్చర్యంతో. "ఏం? అలా చూస్తావు? నీవు వ్రాసిన వ్యాసాలు చాలా ఉన్నాయ్. అందులో కొన్ని ఏరి కలిపి అచ్చు వేయించవచ్చు. నీవు ఆమోదిస్తే తక్కినది మేము చూసుకుంటాం" అన్నారు. దీనికి ఎ. జి. కె. వత్తాసు పలికారు. నేను 'సరే' అనక తప్పలేదు. అలా నా మొదటి పుస్తకం వెలువడింది. ఆ విధంగా గోపీచంద్‌గారు నన్ను పుస్తక రచయితను చేశారు. ఆ పుస్తకాన్ని మా నాన్నగారికి అంకిత మివ్వాలన్న కోరికను వారికి తెలియబరిచాను. అందుకు వారి సహాయం కావాలని కోరాను. ఆశ్చర్యంగా నావైపు చూశారు. "అందుకు నన్నేం చెయ్యమంటావ్?" అన్నారు. "మా నాన్నగారి ఫొటో ఒకటి సంపాదించాలి. అది లే"దన్నాను. 'ఆయన ఫొటో తీయించాలి అనేది పెద్ద సమస్య. ఎలా?' అన్నాను. "అది నాకు వదిలెయ్. మీ నాన్నను నేను రమ్మన్నానని కబురు అందించు. తక్కినది నేను చూసుకుంటా"నన్నారు. తరువాత రెండు రోజులకు అంత పనీ చేశారు. ఫొటో తీయించుకోవడమంటే యిష్టపడని మా నాన్నగారి ఫొటో తీయించారు. బ్లాకు చేయించారు. నా ఆనందానికి అంతులేదు. 'ధన్యోస్మి' అన్నాను. ఆయన నవ్వి, 'అవును లేవయ్యా! అంతా నేను చేసిపెట్టాలి' అన్నారు. పుస్తకంలో ఆయన ఫొటో వేసి అంకితం చేశాం. ఆయన ఆ విధంగా ఎంతో ఆత్మీయత, అభిమానం, స్నేహం ప్రదర్శిస్తూ ఉండేవారు. ఆయన సమక్షాన కొన్ని గంటలు ఇట్టే దొర్లి పోతుండేవి. తమాషాగా నవ్విస్తుండే వారు.

ఇంతలో కీ. శే. రామస్వామి చౌదరిగారి సన్మాన సంచిక వెలువడవలసి వచ్చింది. అందుకు దీక్ష వహించారు గోపీచంద్‌గారు. చాలా చక్కగా దాన్ని సంకలనం చేయడంతో పాటు, తండ్రిగారిని గురించి తన అభిప్రాయాన్ని యిచ్చారు. పూర్వ గ్రంథాలు చెప్పిన విషయాలన్నీ నిజమయితే, సూత పురాణాల్లో నివేదించినవీ యదార్థాలేనని వ్యాఖ్యానించారు. కవిరాజుగారి ఉద్దేశ్యం దేనినీ యథాతథంగా తీసుకోవద్దని మాత్రమేనని గ్రహించాలని పలికారు. అలా గ్రహిస్తే ఆయన కృషి ఫలించినట్లేనని అభిప్రాయ మిచ్చారు.

ఆటుతరువాత వారు పూర్తిగా సినిమా రంగంలో ప్రవేశించారు. ఆయన అభిలాష అందులో మిక్కుటమైంది. ప్రథమంగా స్క్రీన్‌ప్లేలు వ్రాశారు. అందులో సిద్ధహస్తు దనిపించుకున్నారు. కొంతకాలానికి దర్శకత్వం చేపట్టారు. ఆయన దర్శకత్వం వహించిన

వాటిలోకల్లా 'లక్ష్మమ్మ' రాణించింది. అందులో ఆయన దర్శకత్వ ప్రతిభ బహిర్గతమయింది. కాని ఆయనదర్శకునిగాకన్నా స్క్రీన్‌ప్లే రచయితగా ప్రసిద్ధిగాంచారు.

మరికొంత కాలానికి సినిమారంగాన్ని విడిచిపుచ్చి, 'ఆంధ్ర రాష్ట్ర సమాచారశాఖ డైరెక్టరు'గా కర్నూలు వచ్చేశారు. ఆ సమయంలో ఒకసారి వారియింటికి పోవడం తటస్థించింది. మా భోజనా లయిన తరువాత నేను మేను వాల్చాను. గోపీచంద్‌గారు భగవద్గీత శ్లోకాలు కంఠస్థంచేస్తూ పచార్లు చేస్తున్నారు వరండాలో. నేను నవ్వాపుకోలేక ఫక్కుమన్నాను. 'ఎందుకు నవ్వుతావు?' అన్నారు. నేను 'మీలో గతానికి, ఇప్పటికీ ఎంత మార్పు వచ్చిందని తలచుకుంటే నవ్వక తప్పటంలేదు' అన్నాను. "అవునులే. మీరు మారరు-మొండిఘటాలు" అన్నారు ముక్తసరిగా.

తిరిగి రాజధాని హైదరాబాదుకు మారిన కొన్నాళ్లకు అసిస్టెంటు డైరెక్టరుగా ఆయన పనిజేస్తున్న రోజుల్లో నేను ఆఖరుసారిగా వారిని కలవటం సాధ్యపడింది. ఆ సమయంలో నేను "రాడికల్ హ్యూమనిస్టు" పత్రికా సంపాదకునిగా పనిజేస్తున్నాను. అందుచేత వారి యందున్న చనువుతో 'దయచేసి మా పత్రికకు మీ ఇష్టం వచ్చిన వ్యాసమో, కథో ఏదో ఒకటి వ్రాసియివ్వ'మని కోరాను; వారందుకు సమ్మతించలేదు. వ్రాసి ఇవ్వనంటూ 'ఎందుకు? నాచేత వ్రాయించి మళ్లా నన్ను తిట్టడానికా?' అన్నారు. 'అలాటి అసభ్యపు పని మేము చేస్తామని అనుకోకండి. ఒకవేళ విమర్శించినా సభ్యతను దాటమని హామీ ఇస్తున్నాను' అన్నాను. "ఎందుకొచ్చిన గొడవలే: వ్రాయటం దేనికి, తిరిగి మీచేత వ్రాయించుకోవటం దేని"కని సంభాషణ ముగించారు. ఆనాటికే అరవిందుని ప్రభావం ఆయనమీద బాగా సోకిందని నాకు తెలుసు. అలా మారటానికి ఆయనకు స్వేచ్ఛఉంది. కాని, ఆయన అలా ఎందుకు మారారో అర్థంకాదు. హేతువాది, విమర్శనావాది, భౌతిక వాదాన్ని జీర్ణించుకొన్న వ్యక్తి ఆస్తిక వాదిగా మారటంలోని ఆంతర్యం అంతుబట్టలేదునాకు. ఆయన తనలోని మార్పు అభ్యుదయమని భావించారు. కాదు, తిరోగమనమని భావించాము మేము. ఆ విధంగా చివరి రోజుల్లో ఆయనకు మాకు మధ్య పెద్ద అగాధం ఏర్పడింది. అయినప్పటికీ ఆయనను వ్యక్తిగతంగా గౌరవించాం, గౌరవనీయుడుగానే భావించాం.

అకస్మాత్తుగా మన మధ్యనుంచి వీడిపోయినందుకు ఒక ఆప్తుణ్ని కోల్పోయినట్లే బాధపడ్డాను. ఆ విధంగానే ఆయన అభిప్రాయాలను, రచనలను చూడగలుగుతున్నాం. నా భావనలో-పూర్వదశలోనే ఆయన విప్లవాత్మక పాత్రను బాగా నిర్వహించారు. ఏది ఏమయినా ఆయన చిరస్మరణీయుడు.

# ప్రేరణాశక్తి

శ్రీమతి వి. యస్. రమాదేవి

"ఏ ఉద్యోగంలో వున్నా, ఏ పని చేస్తున్నా ముఖ్యంగా నేను రచయితను. అందులో మార్పుండదు" అనేవారు గోపీచంద్‌గారు సందర్భం వచ్చినప్పుడల్లా. అందుచేతనే ఆయనకు రచన, జీవించడం అనేవి ఒక దానితో ఒకటి పెనవేసుకుపోయి ఉండేవి.

"రచయితగా కాదండీ, మీరు మీరుగా చెప్పండి దీనికి సమాధానం" అని అప్పుడప్పుడూ ఎవరైనా అడుగుతూ ఉండేవారు.

"అదేమిటయ్యా అలా అడుగుతావ్. రచయితగా కాకుండా మరో నేను ఎక్కడున్నాను? నేను రచయితను కాకుండా గోపీ నెలా అవుతాను, 'పీపీని' అవుతాను కాని" అనేవారు. చుట్టూ నవ్వులు ప్రతిధ్వనించేవి. నవ్వులమాటున ఆలోచనలు రేకెత్తేవి అందరికీ. ఆయన భోరున ఏడ్పించినా, గొల్లున నవ్వించినా వాటి వెనుక ఆలోచననేది రేకెత్తకుండా ఉండేదికాదు. అది ఆయనలోని ప్రత్యేకత.

పెద్దపెద్ద సభలలో కానీయండి, పది మంది కూర్చునివున్న చిన్నచిన్న సమావేశాలలో కానీయండి ఆయ నెప్పుడూ బట్టీపట్టిన పాఠం వప్పజెప్పినట్టుగా గడగడ మాట్లాడేవారు కాదు. ఆయన ఆలో చిస్తున్నట్టుగా మాట్లాడేవారు. మనల్ని "ఆలోచించండి. ఊరికే విని తలలూపేసి మర్చిపోవడం కాదు" అన్నట్టుగా మధ్యమధ్య 'ఏమండీ, ఏమంటారు?... నేననేది సబబేగదా!' అనో లేదా మరో అలాంటి ప్రశ్నో వేస్తూ ఉండేవారు. స్తబ్దతని భరించలేకపోయే

వారాయన. ఆలోచన, పరిశ్రమా రెండూ నిరంతరం సాగాల్సిందే– ఉపన్యాసం వినేటప్పుడూ, ఉపన్యాసం ఇచ్చేటప్పుడూకూడా. ఆయనంటే గురుభావం వుండి 'మీరేది చెబితే అదే వేదం' అన్న ధోరణిలో ఎవరైనా కూర్చుంటే వూరుకునేవారు కాదాయన. ''మీ స్వంత బుద్ధి వుపయోగించి నేను చెబుతున్నది ఎంతవరకూ నిజమన్నది ఆలోచించి మరీ వప్పుకోండయ్యా'' అనే వారు. ఇక అక్కడికీ వాళ్ళు నోరు మెదపకపోతే, తిరిగి ఎదురు ప్రశ్నలు వేసేటట్టుగా వాళ్ళను రేకెత్తించ కుండా ఉండేవారుకాదు. చర్చలవల్ల, ఆలోచనవల్లే బుద్ధి సునిశిత మవుతుం దనేవారు.

వాదన విషయంలో ఆయనకాయనే సాటి. సాధార ణంగా ఆయన ఇలాంటి వాదనలు చేస్తూ ఉండేవారు. ఆ వాదన వినడానికి చుట్టూ పదిమంది చేరుకునేవారు. ఎవరమైనా ఎవరినైనా ఉద్దేశించి ''పాపం మంచి వాడండీ'' అంటామనుకోండి; ''పాపం అంటే, మంచి పాపం అనా'' అనేవారు గోపీచంద్‌గారు.

''అబ్బెబ్బే నేనా వుద్దేశంతో అనలేదండీ. మాట వరసకి పాపం మంచి వాడండీ అన్నాను'' అంటా మనుకోండి సమాధానంగా.

వెంటనే, ''అయితే మాటవరసకి అతనిని మంచి వాడేనండీ అన్నావు కాని, నిజంగా మంచివాడని అన లేదన్నమాట'' అనే వారాయన.

''అలా అనలేదండీ...పాపం అన్న మాటని మాటవరస కన్నానుగాని, మంచి వాడండీ అన్నది అబద్ధంకాదండీ'' అంటా మనుకోండి మనం, మన ఉద్దేశ్యాన్ని విప్పిచెబుతూ.

''మంచి వాడండీ అన్నది అబద్ధంకాదు. సరే. 'పాపం' అన్నమాట నిజంగా అన్నదేకదా!'' అనే వారాయన నవ్వును దాచుకొంటూ.

''అయ్యో నేను పొరపాటు నన్నాను ఆ మాట... ఇంక నన్ను పరీక్షకు పెట్టకండి, నిలవలేము'' అని మన మనడం–

''ఆహా! పరీక్షకు నిలవలేక పోవడమేమిటి? ఇంతవరకూ నెగ్గుకొచ్చారుగదా! పొరపాటున అతను పాపం మంచివాడండీ అన్నానని ఒప్పుకున్నారు. పోనీ రెండి పొరపాటున అతనినలా అన్నానని తెలుసు కున్నారు'' అని నవ్వుకుంటూ లేచేవారు.

''అతను మంచి వాడండీ అన్నమాట పొరపాటున నేనన్నానని అసలేదండీ'' అని మనం కళ్ళనీళ్ళ పర్యంతమయి గోలపెడుతూ ఉండాల్సిందే. ఆయన చల్లగా వెళ్ళిపోయేవారు అక్కడినుంచి.

ఇలాంటి తమాషాలు చాలా చేస్తూఉండేవారు. మనం అనని మాటని, మన చేతనే అన్నామని వప్పించే వారు. వప్పించడమే కాదు. ''నిజంగానే అన్నా ననుకుంటా నేనామాటను'' అని మనకు మనమే అను కునేటట్టు భ్రాంతిని కలిగించేవారు.

ఒకసారొకరు ఎవరితోనో ''గోపీచంద్‌గారు నిజమైన వ్యక్తులను, సంఘటనలను తీసుకుని కథలు వ్రాసేవారు" అని అన్నారట. అలా అన్న వ్యక్తి ఆ తరువాత రేడియో స్టేషనులో కలిశారు. ఆ కబుర్లూ ఈ కబుర్లూ అయ్యాక ''ఒక కథ చెబుతా, విను. ఇది మనిద్దరికీ సన్నిహితంగా తెలిసిన ఒక వ్యక్తిని గురించిందే" అంటూ చెప్పుకొచ్చారు. అంతా అయ్యాక ''ఇందులో వాస్తవం ఎక్కడో, నా కల్పితం ఎక్కడో'' చెప్పమన్నారు. ఆ పెద్దమనిషి ఫలానా చోట వాస్తవం అనీ, ఫలానాచోట కల్పితం అనీ విడ మర్చి చెప్పాడు. అప్పటి కప్పుడే, ఏ వ్యక్తిని గురించయితే ఆయన కథ అల్లాడో ఆ వ్యక్తిని అక్క డకు పిలిపిస్తే–ఆ పెద్దమనిషికి వాస్తవంగా తోచిన

దంతా కల్పితమని, కల్పితమని తోచినదానిలోనే ఏ కాస్తో నిజముందనీ తేలింది. అప్పుడు గోపీచంద్ గారన్నారు: "నేను వాస్తవసంఘటనలను కాగితంమీద పెట్టేయడానికి ఫొటోగ్రాఫర్‌ని కాను. ఎక్కడో ఎవరో ఎవరితోనో లేచిపోయారు- అన్నముక్క వింటాను, అంతే, అక్కడినుంచి ఆలోచనలు మొదలవుతాయి. ఎందుకు లేచిపోయి ఉండాలి? అలా జరుగడానికి గల అసలు కారణా లేమైవుంటాయి? గృహజీవితంలో తనకు తగిన వాతవరణం దొరకకనా లేక అంతకు మించిన బలీయమైన ఆకర్షణ మరేదైనా తననాపనికి ప్రోత్సహించిందా?... ఇలాంటి రకరకాల ఆలోచనలు పోయిపోయి, అది మనసులో నాని నాని చివరికొక కథగానో, నవలగానో రూపొందుతుంది. లేచిపోవడం అన్నదొక్కటే వాస్తవం. మిగతా దంతా కల్పన" అని వివరించుకొచ్చారు.

రాయిస్టుగా పని చేస్తున్నప్పుడు గోపీచంద్‌గారిని చూసినవారు, సినిమాలకు వ్రాస్తున్నప్పుడు చూసిన వారు, ఆయనని హైదరాబాద్‌లో చూసి, "ఆ గోపీచంద్‌గారేనా?... అదే త్రిపురనేని రామస్వామిగారి కొడుకు గోపీచంద్‌గారేనా" అని ఒకటికి నాలుగుసార్లు అడిగి మరీ నిర్ధారణ చేసుకునేవారు. "ఎంతగా మారిపోయారండీ మీరు. అప్పటికీ యిప్పటికీ పోలికేలేదు. ఈ క్రొత్త మార్పెలా వచ్చిందండీ" అని ఆశ్చర్యపడి అడిగేవారు.

"మార్పు వాస్తవమే. అయితే అది సరిక్రొత్తది కాదు. వాటికి బీజాలు మొదటినుంచీ ఉన్నాయి. ఇవన్నీ మలుపులు. రాయిస్టు గోపీచంద్, స్పిరిచ్యులిస్ట్ గోపీచంద్ ... యివన్నీ విభిన్నా లేమీకావు. ఇవన్నీ సత్యాలే ... ఇన్ని సత్యాలూ కలిసిన గోపీచంద్ సంపూర్ణ సత్యం. ఇన్ని మలుపులు తిరిగినా గోపీచంద్ రచనచేయడం అనేది మానలేదు, అంటే గోపీచంద్ రచయిత అన్నది సంపూర్ణ సత్యం" అని చెప్పేవారు. 'గతాన్ని విస్మరించం డనికాని, గతాన్ని వదిలేయం డనికాని' ఆయన అనేవారు కాదు. అయితే గతాన్నే పట్టుకుని వ్రేలాడుతూ, అంతటితో చైతన్యాన్ని వదిలేసుకుంటే అసలే వప్పుకునే వారుకాదు.

ఆయన జీవిత గమనంలో ఎన్ని మలుపులున్నాయో ఆయన రచనా పద్ధతిలో, ఇతివృత్తాలలోనూ ఆ మలుపుల ప్రభావం ప్రస్ఫుటంగా కనపడుతుంది. ఆయన చివర చివరి రోజుల్లో ప్రబంధా లెక్కువగా చదివేవారు. ప్రబంధాలమీద యిష్టం చాలా ఎక్కువవడం, అందువల్ల వాటిని చదవడంతో ఆగిపోయేది కాదది. ప్రబంధపు ధోరణిలో వర్ణనలు దొర్లుతాయి ఆయన చివరి రచనల్లో.

ఒక రోజున గోపీచంద్‌గారు "ఏమమ్మా, డిటెక్టివ్ నవలల్లో ఎవరు బాగా వ్రాస్తున్నారంటావ్" అన్నారు. ప్రక్కనే వున్న మరొకరు "మీరు డిటెక్టివ్‌లు చదువుతారా" అని ఆశ్చర్యంగా అడిగారు. "ఏం! ఎందుకు చదవను .. అన్నీ చదువుతాను. డిటెక్టివ్‌లు, చందమామలు, మాసపత్రికలు సర్వమూ చూస్తాను. అన్నింటి అవసరమూ ఉంది. కొన్ని పదికాలాల పాటు నిలుస్తాయి. కొన్ని మరుక్షణమే నశించి పోతాయి. తాత్కాలికమే కదా అని వాటిని అసలే వద్దంటే ఎలా ? మనిషి బ్రతుకుమాత్రం తాత్కాలికం కాదా ! అందుకని మనిషి పుట్టనే వద్దంటామా ?" అన్నారు. అలాగే వ్యక్తుల్నికూడా ... అన్ని వర్గాల వారికీ ఆయన విలువ యిచ్చేవారు.

ఒకసారి ఏదో మాటల సందర్భంలో "నిజం ఎప్పటికైనా బయటపడక మానదు. ఎవ రేం అనుకుంటే మాత్ర మేం" అన్నారు.

(శ్రీ)మతి రమాదేవి

"ఆ నినాదం సరే. ధర్మమే జయిస్తుందిలాంటి నినాదాలు నాకూ చాలావచ్చు. అదికాదు అసలు విషయం. పదేళ్లు ఒక అబద్ధం నిజంగా చెలామణీ అయినప్పుడు ఆ పదేళ్ళూ దానికి సత్యానికున్న విలువ వచ్చిందా లేదా? ఆ తర్వాత అది అబద్ధం అన్నది బయటపడవచ్చు. అంతమాత్రంచేత ఈ గడచిన పదేళ్లు పళ్ళూ గడవవుకదా! ఆ అనుభవం ఏమై పోతుంది" అన్నారు గోపీచంద్‌గారు. అలా అని ప్రయోగాత్మకంగా ఆయన ఒక అబద్ధాన్ని చెప్పి పది మందిని నమ్మించారు. అదే సత్యంగా చలామణీ అవుతోంది. ఇంతలో ఆయనకే ఒక సందేహం వచ్చింది. "ఇలా అసత్యాలే సత్యాలుగా ప్రచారం పొందితే ఎలా? దానిని ఎలా ప్రతిఘటించగలం" అని ఆలోచించడం మొదలు పెట్టారు. ఆయన ప్రచారం చేసిన అబద్ధాన్నే ఒక నవీన నాగరికత, సంస్కారం అంటూ లేని ఒక అతి సాధారణ వ్యక్తి ముందు పెట్టారు. "నేను నమ్మనండీ గోపీచంద్ గారూ...మీరంటే నాకెంతో గురి, భక్తి, అయినా ఈ విషయం మాత్రం నమ్మను." అన్నాడు ఖచ్చితంగా.

"అదేమిటయ్యా! నేను చెప్పినదాంట్లో నువ్వు నమ్మకపోవడాని కేమి కనిపిస్తోందో చెప్పు" అని అడిగారు గోపీచంద్‌గారు.


"నేను విడమర్చి చెప్పలేను. అది అబద్ధం అని నా నమ్మకం...నా మనసు అది అసత్యం అని చెబు తోంది" అన్నాడు అతను.

హేతువాదాన్ని, తెలివితేటల్ని చూసి అబ్బురపడే వాళ్ళని, అఖండుల మనుకునేవాళ్ళని నమ్మించ గలి గాను, కాని ఆర్ద్రతతో నిండిన హృదయాన్ని కలిగిన ఇతనిని మాత్రం ఏ విధంగానూ నేను నమ్మించలేక పోయాను. ఎంత చెప్పినా, "ఆ వ్యక్తి అలాంటి వారుకారు. వారిమీద నాకంతటి నమ్మకం...అంతే" అంటారు. సత్యాన్ని కనుగొనడానికి కావలసినవి ఆర్ద్రత విశ్వాసం. హేతువాదం ఒక్కొక్క తరు ణంలో సత్యాన్ని పెడదారిని కూడా తొక్కించే ప్రమాదంఉంది, అనే సత్యానికి వచ్చారు. ఆయన చివరి రోజుల్లో ఆర్ద్రత, నమ్మకాన్ని పెంపొందించే రచనలు చాలా చేశారు.


గోపీచంద్‌గారి వాదనా బలాన్ని, తెలివితేటల్ని చూసి ఎంతగా అందరూ అబ్బురపడే వారో, అంతగా భయపడే వారు కూడాను. ఆయనలో ఇది మంచి, ఇది చెడు అని ఖచ్చితంగా తేల్చిచెప్పలేని కొన్ని అపూర్వమైన లక్షణా లుండేవి. ఇష్టాయిష్టాలనేవి ఎప్పుడూ మోతాదులలో ఉండేవికావు. ఉప్పెన ఉధృతంలోను, ఉద్యమస్థాయిలోనూ ఉండేవి. తనకి చాలా యిష్టులు అనుకునే వాళ్ళను ఛడామడా తిట్టి దులిపేసేవారు. మళ్ళీ జన్మలో వాళ్ళు మాట్లాడుకునే అవకాశం ఉండదని అనుకోవలసిందే చూసిన వాళ్ళు...తిట్టిన మరుక్షణమే కలిసి హాయిగా కాఫీ తాగుతూ కబుర్లు చెప్పుతూ కూర్చునేవారు. ఏమిటని ఎవరైనా చనువు తీసుకొని అడిగితే "తిట్లు తిట్లే, ఇష్టం ఇష్టమే" అనేవారు నవ్వుతూ.

"మీకు ఫలానా వారంటే పరమ అసహ్యం అంటారు కదా; ఫలానా సాయం ఎందుకుచేశారు వారికీ?" అని ఎవరన్నా అడిగితే, "అసహ్యం అసహ్యమే, సాయం సాయమే. అంత మాత్రం చేత వాళ్ళమీద నాకేమీ యిష్టం పుట్టుకురాదు" అనేవారు.


ఎవరిలోనైనా వ్రాయగల శక్తివుందని పసి కడితే. ఏదోశీర్షిక యిచ్చి "యిది వెంటనే కావాలి. త్వరగా వ్రాసిచ్చెయ్...నాకు తెలియదు. నేను చెబు తున్నానుగా. బాగా వ్రాయగలవు. మొదలుపెట్టు. ఊఁ;" అని ప్రోత్సాహించి వ్రాయించేవారు.



" భావ వికాస కేంద్రం సూతాశ్రమం "



కవిరాజుగారి పేరున తెనాలిలో విరాజిల్లుతున్న ఉద్యానం.
మధ్య నిలచినవారు కవిరాజ భావ ప్రచారకులు శ్రీ కన్నెగంటి జగ్గయ్య.




గుడివాడ (కృష్ణాజిల్లా) ఆంధ్రసభలో, కవిరాజ సాహిత్య విహార్‌ల ఆధ్వర్యాన జరిగిన
కవిరాజ వర్ధంతి సభలో ముఖ్యవక్తగా గోపీచంద్.



ఆకాశవాణి ఢిల్లీ కేంద్రంలో ఒక సమాలోచనా సభలో హైదరాబాదు కేంద్ర ప్రతినిధిగా పాల్గొన్న గోపీచంద్.



" ప్రియురాలు " చిత్రం నిర్మాణ సందర్భంలో అసిస్టెంట్ కెమెరామన్ శ్రీ ప్రసాద్,
కెమెరామన్ శ్రీ బోళ్ళ సుబ్బారావు, మరొక సహాయకునితో రచయిత, దర్శకుడు గోపీచంద్.



విజయవాడ అరుణోదయ సంగీత నాట్య మండలి వార్షికోత్సవాల్లో అధ్యక్షోపన్యాసం చేస్తున్న గోపీచంద్.
ఈవల నిలచినవారు సంగీత దర్శకులు శ్రీ ఎస్. రాజేశ్వరరావు, నటులు శ్రీ కె. వి. యస్. శర్మ.



రేఖాచిత్రం : శ్రీ గోలి శేషయ్య

ఇలాగే గ్రామస్థుల కార్యక్రమాలకు అవసరమయ్యే విషయాలిచ్చి ప్రత్యేకంగా వారిచేతా వీరిచేతా చాలా వ్రాయిద్దామను కున్నారు రేడియో ఉద్యోగంలో చేరిన మొదట్లో. 'చీడపురుగు' మీద రూపకం వ్రాయమన్నారు ఒక రచయితని పిలిచి. ''చీడపురుగు మీద రూపకం ఏమిటండీ'' అని కొంత ఈసడింపుగా అన్నాడా రచయిత. ఆ మరుసటిరోజు ఆ చీడపురుగు మీదే బ్రహ్మాండమయిన రూపకం వ్రాసి ప్రసారం చేశారు గోపీచంద్ గారు. ఇలాగే దొంగగొడ్డు, మఱ్ఱిచెట్టు యిలా రకరకాల రూపకాలు వెలువడ్డాయి ఆయన కలంనుంచి ఆ రూపులో.

ఆయన స్తిమితంగా కూర్చుని ఉండేవారుకాదు. యింకొకరిని కూర్చోనిచ్చే వారు కాదు. ''ఏమయ్యా కూర్చున్నావ్ స్థిమితంగా'' అని పలకరించేవారు.

"ఏమీ లేదండి. ఊరికే" అనే వాడతను.

''ఊరికే ఏమిటి? కారణం ఏదో ఉండి ఉండాలి. ఏదో ఆలోచిస్తూ నయినా కూర్చునుండాలి, బద్ధకంతో నైనా కూర్చునుండాలి. ఏమన్నా వ్రాద్దామంటే విషయం దొరకకయినా కూర్చుని ఉండాలి." అని పొడిగించేవారు సంభాషణ.

''వ్రాయడానికి విషయం లేక కాదండి. మూడ్ లేదు'' అంటే అతను "మూడ్ వచ్చినప్పుడు వ్రాయడం సరే. విషయం మనసులో వున్నప్పుడు, మూడ్ తెచ్చుకొని వ్రాయగలగాలి. అలా కావాలనుకున్నప్పుడు మూడ్‌ని తెచ్చుకో గలగడం పెద్ద కష్టమేమీ కాదు. ప్రయత్నించు'' అని ప్రోత్సహించే వారాయన. సమర్థులు సోమరిగా వుండడాన్ని ఆయన చూస్తూ ఉండలేక పోయేవారు. చిన్నవాళ్ళని కేకలేసి, పెద్దవాళ్ళని హేళన చేసయినా సరే వాళ్ళచేత వ్రాయిద్దామనే ప్రయత్నంలో వుండేవా రాయన.

ఒకసారి ఆయన వ్రాసిన నాటకం ఒకటి వేయవలసి వచ్చింది రేడియోలో. దానిలో ఒక పాత్ర చచ్చిపోతుంది. అచావు అకస్మాత్తుగా కాదు. చనిపోతానని ఆ పాత్రకూ తెలుసు, కొద్ది రోజుల్లో ఆవిడ చచ్చిపోతుందని మిగతా వారికీ తెలుసు. అప్పగింతలు, రాబోయే చావుకు ముందు పడే బాధ యివన్నీ కలిపి అరగంట నాటకంలో పది నిముషాలు పట్టింది. ''ఈ పది నిముషాలపాటు యింత బాధ ఎలా బాబూపడేది. ఈ మూల్గడం, ఈ మాటలూ యివన్నీ ఎవరు నటిస్తారు ఓపికగా. అయినా చావుకు యింత గొడవ దేనికి ఠపీమని చంపేయక'' అనుకున్నాం. కొంత పైకిగునిశాంకూడా. గోపీచంద్‌గా రిదంతా కనిపెట్టి, "చిన్నపిల్లలు మీకేమీ తెలియదు. చావంటే ఆటలుగా ఉంది. యాక్సిడెంట్‌లు పెట్టి కథలు వ్రాస్తేనే బ్రహ్మాండమైన క్లయిమాక్స్ వచ్చేస్తుం దనుకుంటున్నారు. ఎంతసేపూ క్లయిమాక్స్, శైలి, టెక్నిక్కు-యివేగాని జీవితం, చావు ఎలా వుంటే తేలికగా భరించగలమో ఇవి ఆలోచించారా? మనకు కావలసిన ఒక ముఖ్యమైన మనిషి కులాసాగా నవ్వుతూ, మనందరితో మాట్లాడుతూ, హఠాత్తుగా చచ్చిపోయి మన ముందునుంచి మాయమయిపోతే కలిగే బాధను ఒక్కసారి ఆలోచించుకోండి...ఆ బాధను భరించగలమా అసలు? అట్లాకాకుండా అదే మనిషి పది రోజులు వంట్లో బావుండక, మనకూ త్వరలో చచ్చిపోతాడనే అనిపించి ఆ తరువాత చచ్చిపోతే, అప్పటి బాధను ఊహించండి...ఆ బాధను భరించడానికి మనకా పది రోజులలో కొంత శక్తి కూడుకుంటుంది, ఆ పది రోజుల్లో రాబోయే బాధను భరించడానికి మానసికంగా మనం తయారయివుంటాం'' అన్నారు ఎంతో అనుభవంతో. ఆయన హఠాత్తుగా మాయమయిన క్షణంలో ఆనాడు మా కాయన చెప్పిన మాటలు అనుభవంలోకి వచ్చాయి.

శ్రీమతి రమాదేవి

# అక్షరాభిషేకము

1. ధన మాసింపడు, కీర్తి కోర డెపుడున్ దర్పంబు దాబున్ ప్రద
ర్శన చేయండు, మహానురాగమున, భాషాదేవి శీర్షాన నూ
తన పుష్పమ్ము లలంకరించి, తనలో తా మ్రొక్కు విజ్ఞానినిన్
వినుతింతున్, గుణగణ్యు, ధీమణిని, గోపీచందు, విద్వన్మణిన్.

2. పండిత మండలీ హృదయ భాస్కరుడై, కవిరాజ వర్యుడై,
నిండు యశమ్ము, శ్రీ త్రిపురనేని కులాంబుధి సోము డిద్ధరా
మండలి రామసామి గనె; మాయురె, తండ్రికి తగ్గ బిడ్డవై
"పండిత పుత్రుడంచ" నెడిపల్కును చుల్కన జేసి తీ వహో!

3. వెన్ననుమించి మార్దవము పెంపున; చల్వదనంపు సొంపునన్
వెన్నెలమించి; తీయనగు బింకమునందున మించి జున్నునున్
క్రొన్ననమించి కోమలత; కోయిల పాటను మించి శ్రావ్యతన్
సున్నితమైన నీ పలుకు శోభిలు, తేటతెనుంగు ఊటయై.

4. త్రిపురనేని వంశమునకు, విపులకీర్తి
దెచ్చె, కవిరాజు నీతండ్రి తేటమాట;
తెలుగు జాతికే జూపించె వెలుగుబాట
నిశ్చయమ్ము గోపీచందు! నీదుమాట;

5. అరసి చరిత్ర హీనులయి ఆలన పాలన లేనివారి స
చ్చరితల, నెత్తివ్రాయు, గుణసాగర, వ్రాసిన కావ్యరత్న మా
దరమున పేదకిచ్చిన, సుధామధురామృత దివ్యమూర్తి నీ
పరమ పవిత్ర జీవితము, భవ్యము, దివ్యము, వర్ణనీయమున్.

శ్రీ కాకాని నరసింహారావు

# మద్రాసులో-

సనాతన ఆచారాలమీదా, సనాతన ఛాందసులమీదా, సాంఘిక దురాచారాలమీదా, తప్పుడు రచనలు చేసిన వారిమీదా, దుమారాన్ని లేవనెత్తి తనవాదనలను తగు ఆధారాలతో నిరూపించుకుని, తన వాదాని కొక బలాన్ని చేకూర్చుకుని, ఆంధ్రదేశంలో సాహిత్య రచనలో, సాంఘిక ఉద్యమంలో ఒక నూతన విప్లవాన్ని సృష్టించి, సూతపురాణం ద్వారా ఒక నూతన వికాసాన్ని కలిగించిన మహాపురుషుడు కవిరాజు, బారిష్టరు, త్రిపురనేని రామస్వామిగారు. ఆయన పుత్రుడే గోపీచంద్.

నేతిబీరకాయలో నెయ్యెంతవుందో; పెరుగుతోట కూరలో పెరుగెంత వుందో, పట్టాభిగారి సోషలిజంలో అంత నిజముందని 'పట్టాభిగారి' సోషలిజం పుస్తకాన్ని వ్రాసిన నాటినుండీ గోపీచంద్‌గారు నాకు తెలుసు.

ఆయన తండ్రిని మించిన కొడుకు. 52 సంవత్సరాలకే అసమాన ప్రతిభా సంపత్తులను సంపాదించుకున్న ప్రతిభాశాలి. ఆయన తత్వవేత్త, మేధావి, ఏ మాత్రం దాపరికంలేని ఖచ్చితమైన మనిషి. నిజాన్ని బ్రద్దలుకొట్టినట్లు మాట్లాడగల ధైర్యశాలి. నవ్వుతూ నవ్వుతూనే చురకలు అంటించగల మేధా సంపన్నుడు. చమత్కారాలు, వుదాహరణలు కోకొల్లలుగా గుమ్మరించే చతురుడు. మంచివక్త. ఆయన వుపన్యాసం కొంత మందికి కారం రాసుకున్న ట్లుండేది. లౌకికం అంటే ఏమిటో తెలియని పసిహృదయం.

శ్రీ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి

ఆయన చదివింది లా. లా ద్వారా ఎంత నిజం చెప్పించవచ్చో, అంత అబద్ధమూ అందించవచ్చు. అందుకే పాపం ఆయన నల్లకోట్లు ముసుగులో, తెల్ల పదాలు పలుకలేకా, ఆ న్యాయానికి పట్టాభిషేకం చెయ్య లేకా, న్యాయస్థానాల మెట్లెక్కి దిగలేకా, నిజం పలకాలన్న ముద్దాయితో అబద్ధం పలికించలేకా, అబద్ధాలు పలికే వారితో నిజం చెప్పించలేకా, ఆ మాయదారి కోర్టుల చుట్టూ తిరగలేకా, కడుపు నొప్పిలాంటి ఆ అలౌకిక వాతావరణం నచ్చకా, కృత్రిమ చట్టాల యంత్రాగారా లైన ఆ కోర్టుల వుద్యోగాన్ని వదిలేసిన స్వేచ్ఛాజీవి గోపీచంద్.

ఒకనాడు ఉజ్వలంగా ప్రకాశించిన పత్రికల్లో గూడవల్లి రామబ్రహ్మంగారు నిర్వహించిన ప్రజా మిత్ర పత్రిక ఒకటి. ఆ పత్రిక ద్వారా గోపీచంద్ గారు వ్రాసిన వ్యాసాలు, కథానికలు ఆంధ్రయువకుల్ని వుత్తేజ పర్చాయి. పాఠకలోకంలో ఒక యువ కథా రచయితగా వెలుగొందాడు. ఆయనను ఒక ఉత్తమ శ్రేణి రచయితగా నిలబెట్టింది ప్రజామిత్ర.

ప్రజామిత్రలో వ్యాసాలువ్రాసే రోజుల్లోనే మద్రాసు రేడియో కేంద్రంనుంచి 'ఉభయకుశలోపరి' ప్రసారమవుతూ వుండేది. ఆ ఉభయకుశలోపరి ఆ నాటి రేడియో కార్యక్రమాలకు ఒక అలంకారం. ఆధునిక నాగరికతా ముసుగుల్లో అనాది సాంప్ర దాయాలు ఎలా నాశన మౌతున్నాయో, ఒకనాటి గ్రామాలూ, ఆ గ్రామ ప్రజల నిరాడంబర జీవితం, ఒకరి కొకరు ఇచ్చిపుచ్చుకునే సహకార గుణం, ఆ అప్యాయత, తృప్తితో నిండిన ఆ నాటి పల్లె జీవితపు బ్రతుకులను కూర్చి, గ్రామ్య భాషలో మనం మఱచి పోతున్న అనేక విషయాలను కళ్ళకు కట్టినట్లు ఉభయ కుశలోపరి ద్వారా వెల్లడించినారు.

మద్రాసులో-

గోపీచంద్‌గారు కేవలం రచయితే కాదు. కళా పిపాసతో కూడుకున్న తహతహ ఆయనను ముందుకు నడిపింది. ఆధునిక యుగంలో ప్రజా విజ్ఞానానికి ప్రచా రానికి అన్నింటికంటే ప్రాముఖ్యం వహించేది సినిమా అని గ్రహించి, సినిమారంగంలో ప్రవేశించా లని వువ్విళ్ళూరారు. అందుకు ప్రాతిపదికగా, ఏ ప్రజామిత్ర ఆయన వ్యాసాలనూ కథలనూ ప్రచురిస్తూ వుందో దాని సంపాదకుడైన గూడవల్లి రామబ్రహ్మం గారు అప్పటికే సినిమా రంగంలో దక్షిణదేశంలో ఒక ప్రముఖ వ్యక్తిగా వెలుగొందాడు. అభ్యుదయ వాదులకూ, రచయితలకూ, కవులకూ, నటీనటులకూ ఆయన ఆశ్రయంలో స్థానం లభించేది. అది ఒక కళా సంస్థానంలా విరాజిల్లేది. అందరూ అక్కడే మకాం, భోజనాలుకూడా అక్కడే. గోపీచందుగారి అభిప్రాయా లను తెలుసుకున్న రామబ్రహ్మంగారు ఆయనకు స్థానాన్నిచ్చారు.

అప్పటికే రామబ్రహ్మంగారు జమిందారీ యుగపు బ్రతుకులను బట్టబయలుచేసే రైతుబిడ్డ చిత్ర నిర్మాణం జరుపుతూన్నారు. ఆ చిత్రానికి గోపీచంద్ రచయితగా సహాయ దర్శకుడుగా పనిచేశారు. ఒక ప్రక్క పనిచేస్తూనే ఆంధ్రప్రభ ద్వారా అసమర్థుని జీవ యాత్రను ప్రకటించి అశేష ప్రజల దృష్టిని ఆకర్షిం చారు. ఆంధ్ర యువరయితల కొక వుత్సాహా న్నిచ్చారు. అసమర్థుని జీవయాత్రతో ఆయన మేధా సంపత్తి ఎటువంటిదో అందరికీ వెల్లడైంది. ఆయన ఎప్పుడూ ఒకరి కట్టుబాటుల్లో వుండే మనిషికాడు. స్వేచ్ఛాజీవి, తార్కికుడు. వ్యక్తిత్వం, ఆత్మాభిమానం ఎక్కువ. అందువల్లనే ఎక్కువకాలం రామబ్రహ్మం గారి క్యాంపులో వుండలేక పోయాడు.

కొంతమంది స్నేహితులతో ఒక సంస్థను స్థాపించి 'పెంకిపిల్ల'అనే చిత్రాన్ని తీయాలనుకున్నారు.

అది ఆదిలోనే హంసపాదై ఎంతో కాలం సాగలేదు.

తరువాత ప్రగతి పిక్చర్సు పతాకంక్రింద లక్ష్మమ్మ కథ తీయాలని మరికొంతమంది మిత్రులతో మరో కంపెనీని స్థాపించారు. కాని పెట్టుబడి పెడతానన్న వారు ఏనాటికీ తగిన మొత్తం తీసుకురాలేకపోవడంతో ఈ కంపెనీకూడ మూలబడిపోయింది. ఆయన చేసిన రెండు ప్రయత్నాలకూ చుక్కెదురైంది. దానితో చాలా నిస్పృహలో పడిపోయారు. కాని ఈ పరిస్థితుల్లో కూడా పత్రికా వ్యాసంగం మానలేదు. ఎన్ని అపజయాలు కలిగినా ఆయన ఆత్మనిగ్రహంతో వాటిని జయించేవారు. అందులో సినిమారంగంలో రెండు కంపెనీలు స్థాపించి, ముందుకుపోలేని మనిషికి నిజంగా మంచినీళ్లుకూడా పుట్టనివ్వరు. కాని గోపీచందు గారు వీటన్నిటికీ తట్టుకున్నారు. చెప్పిందానికి తాళం వేసే తత్వంగాకపోవడంవల్లనే ఆయన మార్గానికి అవరోధాలు ఏర్పడ్డాయి. ఆయన తత్వం సరిపోని మనుషులు, ఆయన మేధాసంపత్తికి తట్టుకోలేని వ్యక్తులు, ఆయన అడిగినదానికి ఎదురు సమాధానం చెప్పలేని అనేక మంది పెద్ద మనుషులు ఆయన మీద దుమారాన్ని లేవదీశారు. కేవలం డబ్బుపెట్టి గోపీచంద్‌గారిమీద పెత్తనం చలాయించాలనుకున్న వారితో ఏమాత్రం ఆయనకు సరిపడలేదు.

ఇంతలో రామబ్రహ్మంగారు మాయాలోకం (కాంభోజరాజుకథ) చిత్రం తీయాలని గోపీచందు గారిని కథా రచయితగా ఎన్నుకున్నారు. ఆ చిత్రం విజయవంతమైంది. తరువాత సారథీ పతాకం క్రింద నిర్మించిన గృహప్రవేశం చిత్రానికి రచయితగా పని చేశారు. ఈ చిత్రంలో ఆయన కథకు తగిన సంభాషణలువాడి, ఆంధ్ర ప్రేక్షకులచే ఉత్తమశ్రేణి సినీ రచయితగాకూడ గుర్తింపబడ్డారు. ఈ నాటికి సినిమా లోకంలో ఆయనకు ఒక బలమైన స్థానంకాకపోయినా గుర్తింపదగిన స్థానంలోకి వచ్చారు.

కాని ఏ లక్ష్మమ్మ చిత్రం తీయాలనుకున్నారో, దానికథనూ, సంభాషణలనూ, చక్కగా వ్రాసుకొని ఏనాటికైనా తెలుగు జానపదగాథను తెరకెక్కించాలనే పట్టుదలతో వున్నారు. ఇంతలో ఆయన కన్న బంగారు కలలు నిజమయ్యేరోజు రానేవాచ్చింది, ఈ సమయంలో శోభనాచల స్టూడియో అధిపతి మీర్జాపురం రాజాగారికి లక్ష్మమ్మ కథను చిత్రంగా రూపొందించాలనే సంకల్పం కలిగింది. ఇందులో, కృష్ణవేణి కథానాయకి. మీర్జాపురం చిత్రించాలనుకున్న లక్ష్మమ్మ చిత్రాన్ని ఘంటసాల బాలరామయ్యగారు తీయాలనుకున్నారు. ఇందులో అంజలీదేవి కథానాయకి. ఇరువురూ ఒకేకథను చిత్రీకరించాలనుకున్నారు. ఇరువురూ హేమాహేమీలే, పట్టుదలలు యెక్కువయినాయి, శృతిమించి రెండు సంస్థలూ నిర్మాణం మొదలుపెట్టాయి. ఇంకేముంది, రాజాగారు గోపీచందుగారిని ఆహ్వానించారు. కథ సంభాషణలు ఆయనవద్ద అప్పటికే సిద్ధంగావున్నాయి, దర్శకత్వ బాధ్యతనుకూడా స్వీకరించమన్నారు. అహర్నిశలూ గోపీచంద్‌గారు ఇంటూరి సహాయం తీసుకొని 50 రోజుల్లో లక్ష్మమ్మ కథను పూర్తిచేశారు. అటు శ్రీలక్ష్మమ్మ కథకూడా ఒక రోజు వెనుకగా తయారయింది. అది చలనచిత్ర రంగంలో ఒక నూతన యుగాన్ని సృష్టించిన తరుణం. ఆ రెండు మాసాలూ పరిశ్రమ అంతా రెండు గుడారాలుగా చీలిపోయింది. ఏమైతేనేం, రెండు లక్ష్మమ్మలూ విడుదలైనాయి. గోపీచంద్‌గారి లక్ష్మమ్మ ఆబాలగోపాలాన్ని ఆకర్షించి ఆనందపర్చింది. కనకవర్షం కురిపించింది. గోపీచంద్‌కు రత్నకిరీటం ధరింపజేశారు. కథా రచయితగా, సంభాషణల రచయితగా, దర్శకుడుగా ఒకే చిత్రంలో

శ్రీ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి

అద్భుతమైన పేరుప్రతిష్టలు సంపాదించారు. లక్ష్మమ్మ చిత్రంతో గోపీచంద్‌గారిమీ దున్న దుమారం తగ్గి అభిమానం పెరిగింది. ఆప్యాయత పెరిగింది. అందరూ గొప్ప మేధావి అన్నారు. గొప్ప స్క్రీన్‌ప్లే రచయిత అన్నారు. పది చిత్రాలు నిర్మించిన దర్శకునికంటే ఒక చిత్రంలోనే అంత ప్రతిభనూ కనపర్చారన్నారు. ఎవరికివారికి గోపీచంద్‌గారిమీద అభిమానం పుట్టు కొచ్చింది. ఆ మనుషుల నైజమే లంత.

లక్ష్మమ్మ చిత్రం విజయవంతమైన తరువాత కృష్ణవేణి పేరంటాలు చిత్రం ప్రారంభించింది. ఈ సమయంలోనే ప్రియురాలుకూడా ప్రారంభమైనది. కాని ప్రియురాలు, పేరంటాలు చిత్రాలు విజయవంతం కాలేదు. తరువాత టి. కె. ప్రొడక్షన్సు పాలేరు చిత్ర నిర్మాణం మధ్యలో ఆగిపోయింది. ఈ విధంగా ఆయనకు చలన చిత్రరంగం దినదిన గండమై కూర్చుంది. ఇక ఈ తత్వాలతో ఈ మనుషులతో వేగలేకపోయారు. ఈ రోజుల్లో వెలువడించే ఆయన తత్వవేత్తల గ్రంథం. ''అసమర్ధుని జీవయాత్ర'' వ్రాసిన తరువాత మరో మైలురాయిగా నిలబడింది తత్వవేత్తల గ్రంథమే. ఈ నాటికి సినిమారంగంలో మార్పు ప్రారంభమైంది. ఆదర్శభావాలు గలవారికి. సృజనాత్మక శక్తితో కూడుకున్న విజ్ఞాన ప్రధానమైన చిత్రాలు తీసేవారికి అవకాశాలు తగ్గి, సినిమా ఒక వ్యాపార కళగా అభివృద్ధి కాసాగింది. డబ్బు పెట్టే వాని మాటలకు విలువెక్కువై, గోపీచందులాంటి మేధావులకు, ఆత్మాభిమానమున్న వ్యక్తులకు స్థానం లేదనే నిర్ణయానికొచ్చి, రచనలు చేస్తూ అలాగే కొంతకాలం మద్రాసులో వున్నారు.

తరువాత ఆంధ్రప్రదేశ్ ఏర్పడడంతో అందులో పబ్లిక్ రిలేషన్సు డైరెక్టరుగా పనిచేశారు. తరువాత హైదరాబాదు ఆకాశవాణి కేంద్రంలో గ్రామస్తుల కార్యక్రమాల ప్రొడ్యూసరుగా మంచి జీతంమీద నియమించబడ్డారు. గ్రామ సమస్యలకు సంబంధించిన అనేక సమాధానాలను రేడియోద్వారా ప్రసారం చేశారు. ఒకప్రక్క పత్రికలకు వ్యాసాలు వ్రాస్తూనే, యువ పత్రికలో చీకటి గదులు అనే శీర్షికను నిర్వహించారు. ఆయన హైద్రాబాదులో వుండి, ఇటీవల నవశక్తివారు నిర్మించిన కలిమిలేములు చిత్రానికి, అన్నపూర్ణా పిక్చర్సు చదువుకున్న అమ్మాయిలు చిత్రానికి సంభాషణలు వ్రాసియిచ్చారు.

# నా అనుభవం

శ్రీ కె. యల్. నరసింహారావు

చైనా దురాక్రమణను మనజాతి జాతంతా ఒక్కుమ్మడిగా ఎదుర్కొనే ధైర్యాన్నీ, అస్త్రాన్నీ ప్రసాదించమని భగవంతుని ప్రార్థిస్తూ-స్ఫూర్తి కోసం వివిధదేశాల్లో ఇలాంటి క్లిష్టపరిస్థితు లేర్పడప్పుడు అక్కడి రచయితలు తమ జాతి నుత్తేజపరచడంలో ఎలాంటి మహత్తర పాత్రను నిర్వహించారో అధ్యయనం చేయాలని తహతహలాడుతున్న ఈ తరుణంలో గురుదేవులూ, అత్యంత ఆప్తులూ అయిన శ్రీ గోపీచంద్‌గారు హఠాత్తుగా అస్తమించారన్న వార్త నన్నెంతో కలవరపరచింది.

ఒకప్పుడు మన కిలాంటి కొద్ది విపత్తు తటస్థించినప్పుడు ఏ మార్గ మవలంబించాలని నేను ఉక్కిరిబిక్కిరయ్యే సమయంలో రచయిత శ్రీ గోపీచంద్ నా కెలాంటి ఆత్మ విశ్వాసాన్నీ, ధైర్యాన్నీ పురికొల్పారో నేనెన్నడూ మరవలేను.

అది అభ్యుదయ రచనోద్యమం మంచి ఊపులో వున్న కాలం. అప్పుడే విపరీతంగా చదవాలి, తెలుసుకోవాలనే కుతూహలం జనిస్తున్న దశ నాకు. సహజంగా ఆ రచయితల రచనలు నన్ను ఎంతో ఆకర్షించాయి. అలా ఆకర్షించిన రచయితల్లో శ్రీ గోపీచంద్ ఒకరు.

అయితే ఇతర రచయితల రచనలు అద్భుతంగా, బ్రహ్మాండంగా ఉన్నట్లు కనిపిస్తే శ్రీ గోపీచంద్ రచనలు ఏవో ఆలోచనలు రేకెత్తించేవిగా కూడా తోచేవి. ఎక్కడో దూరంగా ఏదో తెలియని మన

ఆత్మీయమైన పదార్థాన్ని ఒక్కసారి కదిలించినట్టుతోచి అమితానందం కలిగేది.

కాని చిత్రమేమిటంటే శ్రీ గోపీచంద్ పేరెప్పుడూ ఇతర అభ్యుదయ రచయితల పేర్లలో అంతగాకనబడేది కాదు. అందరు అభ్యుదయ రచయితలతో పాటు వారి పేరుకూడా వుంటే బాగుండునని వుండేది. ఈ విషయం నేను అడిగి తెలుసుకోవటానికి దగ్గర్లో నాకు ఈ రంగంలో పరిచయమున్న వారెవరూ లభించే వారు కారు. చివరకు నేనే సరిపెట్టుకునేవాణ్ణి గుర్తు: బహుశా 'శరత్' లాగా గోపీచంద్ కూడా బెంగాలీ రచయితై వుంటాడు; అందుకే ఈ పేరు తరచు ఆ పేర్లతోపాటు కనబడడం లేదనిపించేది. దానికి తగ్గట్లు 'గోపీచంద్' అనే పేరుకూడా మన తెలుగువారి పేరులా కనబడక నా వూహకు అనుకూలంగా వున్నట్లు తోచేది. ఈ విధంగా అభ్యుదయరచనోద్యమం ముమ్మరంగా సాగేరోజుల్లో ఆ రచయితల రచనలతోపాటు శ్రీ గోపీచంద్ రచనలుకూడా నన్ను విపరీతంగా ఆకర్షించేవి. అయితే అభ్యుదయ రచయితలకూ గోపీచంద్‌గారికీ భేదం ఎక్కడుందో విడదీసి చూడడం నా కప్పట్లో స్పష్టంగా తెలిసేదికాదు.

పత్రికలు, పుస్తకాలు; సభలు, సమావేశాలు, నాటకాలు, ఇతర ప్రదర్శనల రూపాల్లో సాహిత్యాన్ని నేరుగా ప్రజల మనస్సుల్లోకి తీసుకెళ్ళే అభ్యుదయ వాదుల రీతులు—అప్పుడప్పుడే వూహ పెంపొందుతున్న నా మనస్సుకు బాగా నచ్చుతున్నట్టుతోచేవి. నేనూ అభ్యుదయ రచయిత ననిపించుకోవాలనే మోజు వుండేది.

ఈ స్థితిలో ''పోరాటం'', ''విప్లవం'' అనేపేరుతో ఒక ఉద్యమం ప్రారంభమైంది. దీనికి కొందరు ''అభ్యుదయ రచయితల'' అండదండలు సంపూర్ణంగా లభించాయి—దీనికన్నా కొందరు అభ్యుదయ రచయితల భావనా బలంతోటే పోరాటానికి రంగం ఆయత్తమైందేమోనని కూడా నావూహ. అయితే—ఆ పోరాటం ఎక్కడ దారి తప్పిందోగాని తమ పంథా ననుసరించలేదన్న కసితో తటస్థులనూ, తమ జాడ తెలుపుతారేమోనన్న భ్రమతో అమాయకులనూ—ఉత్తపుణ్యానికి తమ స్వంతప్రాణాలమీద తీపితో ఆడా మగా, పిన్నా పెద్దా అనే విచక్షణ లేకుండా అనవసరంగా హత్యలూ, ఆగడాలూ సాగించారు. ఈ సంగ్రామ కేంద్రంలో వున్న నాకు ఈపరిస్థితులను చూస్తూ సహించడం దుస్తరమై పోయింది. అంతులేని ఆవేదనకు లోనయ్యాను. ఒకవంక చాలాదూరంగా ఏదో ఉజ్వల భవిష్యత్ వుంటుందేమో ననే వూహామాత్రపు అస్పష్టపు భావన. మరోవంక ప్రతిక్షణం కళ్లెదుట జరుగుతున్న అర్థంలేని ఇరుపక్షాల మారణహోమం. ఇందులో ఏది అవసరం? ఈ చిక్కుసమస్యతో ముడిపడి ఉక్కిరి బిక్కిరవుతూ వూపిరి సలపని నా భావనను సరిదిద్దే మేధావి ఎవరు? ... చాలారోజులవరకు తేలలేదు.

ఏమైనా సరే—అర్థంలేని ఈ మారణహోమాన్ని ఆపడం—కనీసం లోకానికి తెలుపడం—రచయితగా నా విధ్యుక్త ధర్మమని లీలగా తోచింది. కాని అలా తెలుపడానికి ప్రయత్నించడం కూడా పోరాటాన్ని ఎదుర్కొనడమే. పోరాటాన్ని ఎదుర్కొడానికి నేనెంతవాణ్ణి? ఎదురుగా నిజమైన మారణాస్త్రాలు. వాటికండగా కొందరు ''అభ్యుదయ రచయితలు'' పుంఖానుపుంఖంగా చిత్ర విచిత్రరీతుల్లో ఈ పోరాటాన్ని ప్రేరేపిస్తూ ఉద్రేకపరుస్తూ వదులుతున్న సారస్వతాస్త్రాలు. నిజమైన అస్త్రాలకంటే రచయితల అస్త్రాలే నాకు మహా పదునుగా, భయంగా తోచేవి. అలాంటి అస్త్రాలను అందులోనూ ఒక్కుమ్మడిగా వచ్చే అన్ని అస్త్రాలను తట్టుకోవడానికి అటూఇటూ వూగుతున్న నా

బలం సరిపోయ్యేది కాదు. పైగా—ఎదురుగా వున్న వారంతా నావాళ్ళు, మహామహులు. అలాంటి 'నా' వాళ్లను ఎదుర్కోవడం ఎలా ? ఈ రకమైన మాన సికావస్థలో సతమతమవుతూ ఆందోళన పడుతున్న సమయంలో నాకు అందాయి మహాస్త్రాలు ; "పోస్టు చెయ్యని ఉత్తరాలు". అవి పోస్టుచెయ్యని ఉత్తరాలని అన్నారేగాని—అవి నాకొరకు పోస్టు చేసినవిగానే భావించాను. అవి నాపట్ల గీతోపన్యాసాలుగా పనిచేసి నా కర్తవ్యాన్ని ప్రబోధించి నాకు అంతులేని ధైర్యాన్నీ ఆత్మ స్థైర్యాన్నీ ఇచ్చాయి. ఆ భావబలంతో జోడించి "భవదీయుడు"గా "తెలుగు స్వతంత్ర"ను మాటుగా పెట్టుకొని నా అస్త్రాలను యుద్ధరంగంలో సంధించాను.

ఒక భావన—బలమైన భావన—వ్యక్తులు, దేశాల జీవిత పథంలో ఎలాంటి మార్పులను తేగలదో నా అనుభవాన్ని మనవి చేశాను. మార్క్స్, గాంధీ మొదలైన వారి భావనా బలంవల్ల ఏయే వ్యక్తులు, దేశాలు ఏ మార్గం అవలంబిస్తున్నదీ మనం చూస్తున్నాం. అలాంటి బలమే మానవతావాది శ్రీ గోపీచంద్‌గారి రచనల కుందని నా నమ్మకం.

ఈ క్లిష్ట పరిస్థితుల్లో—దేశంలో అనైక్యత, అంత శ్శత్రువులు, బయట బలమైన శత్రువులతో పోరాటం ఈ స్థితిలో డబ్బుదానం, రక్తదానం ఇస్తున్న వారితో పాటు రచయితలు "రచనాదానం" ఎలా చేసి జాతిని ఉత్తేజపరిచి, ముందుకు నడిపి విజయాన్ని సాధించాలో బహుశా గోపీచంద్ గారొక మార్గాన్ని సూచించే వారని నా విశ్వాసం. దాదాపు సంవత్సరం క్రిందటే ఇలాంటి పరిస్థితులనే దృష్టిలో వుంచుకొని మనమంతా ఒకటి అనే భావన బలంగా కలిగే నాటకాన్ని వ్రాయ మన్నారు. నే నా ఆలోచనలో వుండగా ముందు మతైక్యతకు పాటుబడ్డ 'అక్బర్' నాటకాన్ని వ్రాయ మన్నారు. నాకు—చారిత్రికపరిజ్ఞానం ఎంతమాత్రం లేదన్నా—వారొప్పుకోనందున ఎంతో అధ్యయనంచేసి వారి ఆదేశాన్ని నెరవేర్చాను. నిజంగా నేనా నాట కాన్ని వ్రాయడంద్వారా ఎన్నో కొత్త విషయాలను తెలుసుకొన్నాను. చారిత్రిక, పౌరాణిక విషయాలను నేటి మన పరిస్థితులకు ఎలా మలచాలో తెలుసు కొన్నాను. అందుకే నన్నలా వొత్తిడి చేసినట్టు తర్వాత వారు చెప్పారు.

ఈనాడు శ్రీ గోపీచంద్‌గారి భావనా బలంతో సాహిత్యపు అభిరుచుల్లో ఆశ్చర్యకరమైన, అవసర మైన మార్పులొచ్చినట్టుకూడా నా బుద్ధికి తోస్తున్నది. ఈనాడు రామాయణం, భారతం, భాగవతం మొద లైన ఉత్తమ గ్రంథాలన్నీ సామాన్య పాఠకుడికి కూడా అందుబాటులోవుండే పద్ధతుల్లో వస్తున్నా యంటే ప్రతిభగల గోపీచంద్ వంటి ఆధునిక రచ యిత మన భారతీయ సంస్కృతిని అర్థంచేసుకోవాలని ఉవ్విళ్ళూరి అధ్యయనంచేసి ఆనందించి ఆ సొగసులను తన రచనల్లో ప్రతిబింబించడమే కారణమనుకుంటాను. ఈ గ్రంథాలు నిజానికి మనకు ఎప్పుడూ గొప్పవే. కాని—ఒక దశలో ఆధునిక రచయితలు అనేకమంది ఈ రచనలపట్ల చాలా అయిష్టాన్ని వెలిబుచ్చి—కనీసం వాటివైపు చూడడానికికూడా అసహ్యపడ్డారు. వేలాది పాఠకుల మనస్సులను ఆకట్టుకొన్న ఆధునిక రచ యితలు త్రోసివేసే ఏ ఉత్తమ అభిరుచులనైనా ప్రజ లకు ఇష్టంగా మార్చడం బహుశా పండితులకూ, పత్రికలకూ కూడా చాలావరకు అసాధ్యమైన పనను కుంటా. అలాంటి అసాధ్యమైన పనిని శ్రీ గోపీచంద్ సుసాధ్యం చేశారని నాకనిపిస్తున్నది. పాతనంతా రోసి, కొత్తనే చేపట్టాలనే గుడ్డి నమ్మకాన్ని వీరు ఛేదించడంతో ఈనాడు వేలాది పాఠకులు ఆ గ్రంథా లనుకూడా చదివి మననం చేసుకోవాలనే కుతూ హలాన్ని కనపరుస్తున్నా రనుకుంటాను. ఈ విధంగా

శ్రీ కె. యస్. నరసింహారావు

సాహిత్యపు అభిరుచుల్లో పాతకొత్తల మేలుకలయికకు శ్రీ గోపీచంద్ రంగాన్ని సిద్ధపరచటంవల్లనే అనేక మంది పండితులూ, పత్రికలూ పాతకాలపు ఉత్తమ రచనలను పాఠకుల అందుబాటులోకి తెస్తున్నారు. ఎంతోమంది ఆధునిక యువరచయితలుకూడా ఆ గ్రంథాలను కొత్త దృక్పథంతో స్వయంగా వ్రాస్తున్నారు. ఏమైనా పాత సాహిత్యం, కొత్త సాహిత్యం అని కొన్నింటికి గోడలుపెట్టి బంధించి వుంచే ప్రమాదం తప్పింది. ఆ ప్రమాదాన్ని తప్పించిన ఘనత శ్రీ గోపీచంద్‌గారిది.

నియంతృత్వ పోకడలను సమర్థించే రచనలలోని లోటుపాట్లనూ, టెక్కుటిక్కునూ ఆమూలాగ్రంగా అర్థం చేసుకొని ఆ మార్గం ఎంత భయంకరమైనదో భావి తరానికి తెలిపిన ప్రజారచయిత శ్రీ గోపీచంద్.

# సంఘం: వర్గం

కాంగ్రెస్‌వారు ఐక్యతనుగురించి మాట్లాడుతూ సంఘంలో భిన్న వర్గాలు లేనట్లు మాట్లాడినట్లే, తీవ్రవాదులు వర్గాలసంగతి మాట్లాడుతూ వీటన్నిటినీ కూడగట్టుకొని అభివృద్ధి చెందుతున్న సంఘం అనేది లేనట్లు మాట్లాడుతున్నారు.

ఈమధ్య ఒక రచయిత తన పుస్తకంలో "ఇది మధ్యతరగతికి వ్రాసిన పుస్తకం" అని వ్రాశాడు.

ఒక తరగతికి వ్రాయటం ఏమిటి? ఆ తరగతి తప్ప మరెవ్వరూ చదవ గూడ దనా? చదివినా ప్రయోజంలేదనా? ఈ దృష్టి వర్గాలను తప్ప వాటిని ఇముడ్చుకొనివున్న సంఘాన్ని మరచిపోవటంవల్ల వొచ్చింది. ఆ సమస్య ప్రత్యేకం ఒక వర్గానికి చెందిందే గావచ్చు. కాని మొత్తం సంఘానికి సంబంధించిందికూడ! ఆ సమస్యలవల్ల ప్రత్యేకం ఒక తరగతి బాధపడుతూ వుండవచ్చు. కాని మొత్తం సంఘం కూడ దానివల్ల కలవరపడుతూనే వుంటుంది.

సంఘాన్ని ముక్కలుగానే కాక ఒకటిగాకూడా చూడలేకపోవటంవల్ల వొచ్చిన చిక్కు యిది.

# మాసిపోని రాత కాదా?

శ్రీ కాళోజీ నారాయణరావు

మెదడుమేత దేవు డెరుగు
ఎదనిండేవో కొరుకులు.
పోటీపడి కాటులాడ
పొట్టకూటికై ఉరుకులు.
సింగి మేను గాయపరచి
నిలచిన 'మెరుపుల మరకలు'.

'చీకటి గదుల'్లో వెలుగు
చిమ్ము పొద్దు పొడుపెప్పుడు?
'పరమేశ్వర శాస్త్రి విల్లు'
ఖరా రయ్యే తేదెప్పుడు?
అరవిందుని దర్శనాలు
అందరి కయ్యే దెప్పుడు?

మాటలమ్మ భక్తు డెపుడు
మూటలమ్మ దాసుడేన?
నోట్లకు బులెట్ల కెపుడు
వోట్లు లొంగి పోవుటేన?
తొక్క నింపుకొన తలలు
ముక్క తోక లగుటేనా?

'ప్లే బ్యాకూ' తాకీదుకు
పెదవులు కదిపే వక్తలు,
కనులు మూసికొని వినుచు
తనువుల తూలెడి భక్తులు,
చిత్తమొచ్చినట్లు ఎగురు
పెత్తందారీ శక్తులు.

దేశె మొగాలతో నిండిన
'దేశం ఏమయ్యేట్టు?'
'అసమర్థుని జీవయాత్ర'
కాత్మ హత్యేన గట్టు?
మాసిపోని రాతగాద
మా రాతేమైనట్టు?

# దివ్యస్మృతి

కమ్మనిగాథ వింటిమి పకాలున నవ్వుచు పొంగిపోయి, లే
రిమ్మహి గోపిచందునకు సాటిగ రాగలవా రటంచు, చో
ద్యమ్ముగ చెప్పుకొంటిమి కథానికలందున నీ చమత్కృతుల్
మమ్ముల ముగ్ధులన్ బఱచి మాకిట జెప్పక దూరమైతివా!

సంశయ మింతలేక వినసొంపగు హాస్యము చిందు నీ కథల్
విశ్వకథావిధానమున నపారముగా కృషిజేసినావు, నే
యంశమునందుగూడ జిగియన్నది తగ్గక నిల్చిపోయె, నీ
వంశమె ధన్యమైనదిగ విశ్వకథా మధుసారమందునన్

ఎన్నికథల్ రచించితివో! యన్నిట నీ ప్రతిభావిశేషముల్
కన్నుల గట్టినట్లు రసకల్పన శిల్పము పాత్రపోషణల్
ఎన్నెడివారు లేరనుచు ఎందరో జెప్పగ వింటిమయ్యా, నీ
వెన్నడు మాహృదిన్ దొలగిపోవవు స్వర్గపురంబుకేగినన్.

తాత్వికవేత్తవై భువిని ధార్మికవాదుల కీచులాట లో
తత్వమెరింగి వ్రాసిన యదార్థము లెన్నియొ జూచినాము, నీ
తత్వవిచారణంబు కడు తర్కపరంబని ఎందరెందరో
తాత్వికవాదులే నుడువ ధన్యతజెందెను నీదుజన్మమే.

మొన్నటిరోజు అందరితో ముచ్చటలాడిన యట్టులుండె, మే
మిన్నది సత్యమా యనుచు మామది శంకను పీడకుండె, నీ
వున్నది నిత్యసత్యమని వేయి నివాళులుపట్టినట్టి, మా
కన్నుల మూసిపోయితివ గుండెలు వ్రీలెను ఒక్కపెట్టునన్.

శ్రీ కొడాలి గోపాలరావు

# కథానికా రచన

గోపీచంద్ కథానికా రచననుగురించి నన్నువ్యాసం వ్రాయమన్నారు. వెనకెప్పుడో చదివానతని కథలు, కొన్నే. వివరాలేవీ గుర్తులేవు. అంచేత ఎన్నిదొరికితే అన్నీ సంపాదించి మళ్లీచదవడం మొదలుపెట్టాను. ఏడు చిన్నసంపుటాలు, అందులో ఒక సంపుటిలో మాత్రం పేరుకి కథలుగావు, వ్యాసాలనుకోండి, వ్యాఖ్యానాలనుకోండి. దాన్నికూడా కథలసంపుటాల్లో ఎందుకుచేర్చానంటే, చెపుతా. నేను చెప్పడమేమిటి? గోపీచందే చెప్పారు.

"నేను మొట్టమొదటసారిగా కథలు వ్రాయడం మొదలు పెట్టినప్పుడే నాకథలు కథలుకావనీ, స్కెచెస్ అనీ, వ్యాసాలేననీ కొంతమంది విమర్శకులు నిందిస్తూ వచ్చారు. ఇలాఅనుకోవటానికి, కథారచనలోని వివిధ రీతులను పరిశీలించక తమకు నచ్చిన ఏ ఒక రీతినో కొలబద్దగా తీసుకోవటమే కారణం ... ప్రతి కథకూ ఒకదానిమీద ఒకటి ఆధారపడిన కొన్నిలక్షణాలుంటయ్. అందులో ముఖ్యమైనవి ఇతివృత్తం, నిర్మాణం, పాత్రలు, దేశ కాలాలు. వీటిలో ఒకొక్క లక్షణం ప్రాధాన్యత వహించినప్పుడు, ఆకథ రూపం మారుతుంది. మారి మరొక సాహిత్యరూపానికి దగ్గరలో ఉన్నట్టు కనిపిస్తుంది. లేదా మరొకపేరును గడించుకొంటుంది. విషయానికో భావానికో ప్రాధాన్యత ఇచ్చిన కథ వ్యాసానికి దగ్గరగా నున్నట్లు కనిపిస్తుంది. ఒకపాత్ర పరిశీలనకు ప్రాధాన్యత ఇచ్చినకథను స్కెచ్ అని పిలువబుద్ధి లవుతుంది...

శ్రీ పాలగుమ్మి పద్మరాజు

ఇవన్నీ కథలే...''అని 'గోపీచంద్ కథలు' అనే పేరుగల పెద్ద సంపుటాల్లో రెండోభాగానికి 'చిత్త జల్లు' అనబడే పీఠిక వ్రాస్తూ, అందులో వివరించాడాయన అన్నట్టు ఈ రెండుభాగాలు పై ఏడూగాక, పైవాటిలోని కథలు కొన్ని ఈ రెండింటిలోనూ ఉన్నాయి. సరే చదవడం మొదలుపెట్టాను భయం వేసింది. ఎందుకంటారా ? చెప్తున్నా.

'భార్యల్లోనే ఉంది' అన్న కథతో ప్రారంభించాను. అందులో తాయారమ్మ లావుగా ఉందని భర్త పొమ్మంటాడు. పుట్టింటికి వెళ్ళడానికి బస్సుస్టాండు కొచ్చింది. అక్కడొక సన్నపాటి రివటలాంటి పిల్లనిచూసింది. ఆమెనూ భర్త వొదిలేశాడు, సన్నంగా ఉందని. వీళ్ళిద్దరూ గాక పిల్లలుకలుగలేదని పెళ్ళాన్ని వొదిలేసిన సుబ్బయ్య, పిల్లలెక్కువైనందున పెళ్ళాన్ని ఆత్మహత్యదాకా తరిమిన వెంకయ్య ఉన్నారు. చదువుతుంటే నేను తాయారమ్మ భర్తనా, సుబ్బయ్యనా, వెంకయ్యనా అన్న అనుమానం మనసులో కుమ్మరి పురుగులా తొలిచింది. వీళ్ళెవరూ నేను కాదని నాకు తెలుసు. అయినా భయంవేసింది ఎందుకంటే వీళ్ళలక్షణాలు నాలో ఏమన్నా ఉన్నాయేమో అన్న అనుమానం లోపల ఎక్కడో పీడిస్తూంది. కారణం ఏమంటే కొంచెం ఇంచుమించుగా ఆయనకథలన్నింటిలోనూ ఏదో నేరారోపణఉంటుంది ఆ నేరస్థుణ్ణి నేనేనేమో అన్న అనుమానం చదువరికి కలిగేటంత సూటిగా ఉంటుంది నేరారోపణ. అయితే ఎవరో ఒకనేరస్థుడైన వ్యక్తినో వర్గాన్నో ఎన్నుకుని నేరారోపణ చేసే చవకబారు కథకుడుకాదు గోపీచంద్. ఆయన వట్టి కథకుడేకాడు, భావుకుడు, తత్త్వవేత్త. అతనిలోని తత్త్వవేత్త కథకుణ్ణి కొంతకప్పిపుచ్చుతాడు. కథ ఒక్కచేచెప్పేసి ఊరుకోనివ్వడు. ఆ కథలో సంఘటనల తాత్వికార్థం తను అనుక్షణం నిర్వచిస్తూ ఉంటాడు. ఉదాహరణకి ఇందాకా చెప్పిన "భార్యల్లోనేవుంది'' అన్నకథలో తాయారమ్మ ఇంటికి తిరిగొచ్చింది వంటచేసుకోడానికి భర్త పడుతున్నపాట్లు కళ్ళారా చూసింది. "తాయారమ్మ హృదయం రెపరెపలాడింది. పురుషులంతా పసిపిల్లలే. ప్రవర్తించుటలో భేదంగాని, అంతా అమాయకులే.'' అనుకుంది. ఒంటితో కథాభాగం అయిపోయింది. అయితే గోపీచంద్‌లోని తత్త్వవేత్త ''అనాదిగా స్త్రీ జాతిలో జీర్ణించుకుపోయిన దానిసత్వం (కవిత్వ భాషలో మాతృ హృదయం) పైకి ఉబికింది,'' అని వివరిస్తాడు. నిజానికి కథలలో నేరస్థుడు భర్తకాదు అనాదిగా భార్యల్లో జీర్ణించుకుపోయిన ఈ దానిసత్వం.

ప్రతి వ్యక్తి నడవడికీ అడుగున ఒక ప్రేరణ ఉంటుంది. ఆ ప్రేరణ రక్తంలో జీర్ణించిపోయిన ఒక మతమో, చిత్తవృత్తో. ఆ వ్యక్తి తనకుతాను గాని, ఇతరులకు గాని హాని కలుగజెయ్యడానికి గాని అదే కారణం. గోపీచంద్ కథల్లో ఆ చిత్తవృత్తే నేరస్థుడు ధర్మవడ్డీలో నేరస్థుడు లోభం, పిరికివాడులో పిరికితనం.

గోపీచంద్ కథలు కథకుడుగానే చెప్పలేదు, తత్త్వవేత్తగా చెప్పాడు. కొందరు కళద్వారా నీతిబోధ చెయ్యడం కళకు అపచారం చేయడమంటారు. షా వంటి మహనీయుడు కళ నైతిక ప్రయోజనాన్ని సాధించక పోతే అది శుద్ధ నిరుపయోగమైనదంటాడు. అందుచేత ఈ వాద ప్రతివాదాల్లోకి పోకండా ఒక సంగతి ఒప్పుకుందాం. గోపీచంద్ తత్త్వవేత్త అయిన కథకుడు. మామ్‌లాగా 'The story is the thing,' అన్న పరిధిలో కథలను ఆయన బంధించలేదు. నిజానికి ఆయన కథల్లో కథాభాగం అంతముఖ్యమయినది కాదు. దాని తాత్పర్యం ముఖ్యమయినది.

ఎన్నోచోట్ల కథనీ పాత్రల్నీ మరింత సన్నిహితంగా వివరంగా తెలుసుకుందామన్న కుతూహలం మనకి కలుగుతుంది, ఆయన కథలు చదువుతుంటే. ఆయన మాత్రం తను వివరించ దలుచుకున్న తాత్విక సూత్రానికి ఆ కథా, ఆ పాత్ర, ఎంత అవసరమో అంత వరకే వర్ణిస్తారు.

"దేశం ఏమయ్యేటట్టు?" అన్నకథలో రామారావుకి పాత్రఅంటూ ఏమీలేదు రకరకాల తత్వ సంఘర్షణలు ప్రతిబింబం జెయ్యడానికి గోపీచంద్ ఏరుకున్న అద్దం మళ్లీ అది-నిర్జీవమైన అద్దమూకాదు యధార్థాన్ని మనకిచూపిస్తూ జీవచిహ్నమైన హృదయావేగాన్ని దానికి జతపరుస్తుంది. అందులో నిజానికి రామారావొక్కడే పాత్ర మిగతా కాంగ్రెసు, సోషలిస్టు, కమ్యూనిస్టు, రాయిస్టులంతా ఆయా సిద్ధాంతాలకీ పార్టీలకీ కనిష్ఠ సామాన్య గుణితాలు. అందరు కాంగ్రెసువాదులూ ఈకథలో ఆచార్యులవంటి వారుకారు నిజానికి. అయితే కాంగ్రెసు పార్టీవ్యక్తుల మనస్తత్వానికి ఆచార్యులు చిహ్నం. అలాగే కమ్యూనిస్టూ, సోషలిస్టు, కిసాన్ సభైటూ వగైరా. "దేశంఏమయ్యేటట్టు?" అన్నప్రశ్న బలంగా దేశం ముందుపెట్టడానికి గోపీచంద్ ఈ పద్ధతివలంబించారీ కథలో. రామారావు తత్వ యుద్ధాలలో మునిగిపోని, పార్టీలకు బయటఉన్న భారతదేశానికి ప్రతినిధి.

గోపీచంద్ కథల్లో పాత్రల్లో-అంటే ప్రధన పాత్రల్లో కొందరు రాజకీయమానవులు, కొందరు తాత్వికమానవులు. తాత్వికమానవుల్లో చిన్నపాలు రాజకీయమానవుడు కలసిఉండవచ్చు. ఆయనకథల్లో అయిదారింటిలో గోపీ పాత్రవస్తుంది. ఆ గోపీ-అసలు గోపీచందులో ఒకభాగం. పేరుకూడా అనుకోకండానే ఎన్నుకుని ఉంటాడాయన. 'వంక' అన్నకథలో 'ప్రజాసామాన్యం' అన్నపదానికి అర్థంవెతుకుతాడు గోపీ. ఈకథ ముందుభాగంలో గోపీ ఆలోచనలు-అతని చిత్తవృత్తిని మనకి స్పష్టీకరిస్తాయి. "పైత్యం ఎక్కువయితే మలేరియా వచ్చిందా? మలేరియా ఎక్కువయి పైత్యంవచ్చిందా?" "చెట్టుభూమిలోకి ఎందుకు పెరగదు? పైకి ఎందుకు పెరుగుతుంది? లోపలికి పెరిగితే ఏమౌతుంది?" వగైరా తర్క వితర్కాలూ, మీమాంసలూ అతనిమనస్సుని అల్లకల్లోలం చేస్తుంటాయి అయితే గోపీయే గోపీచంద్ ఎంతమాత్రం కాదు అసలు గోపీచంద్‌కి ఈ అనంతమైన ప్రశ్నలకి సమాధానాలు దొరికాయి. గోపీకిమాత్రం ఇంకాదొరకలేదు. గోపీ-గోపీచంద్‌లో ఒకభాగం అనడంకూడా సరియైనదికాదు గోపీకి-గోపీచంద్‌కున్న తాత్వికచింత ఉంది. జిజ్ఞాసమాత్రం పూర్తిగా అలవడలేదు గోపీ-ఇంకా పరిణతి పొందని గోపీచంద్, మనస్సింకా బాల్యావస్థలోనే ఉన్న గోపీచంద్. గోపీ జీవితాన్ని అవగాహన చేసుకుంటున్నాడు గోడదెబ్బలూ చెంపదెబ్బలూ తింటున్నాడు. "డబ్బు! డబ్బు! డబ్బు!!!" లోలాగ, తన్ను ప్రేమించిన పెదతండ్రిని అవసాన దశలో తప్పకుండా చూడాలని ఆత్రపడ్డాడు ఉన్న డబ్బుతో తన తండ్రిని పంపించాడు. డబ్బులేక తను వెళ్లలేకపోయాడు. తండ్రి తిరిగివచ్చి డబ్బుకి కక్కుర్తిపడి గోపీ పెదతండ్రిని చూడ్డానికి రాలేదని నిందించాడు. "ఇదేనా నువ్వు రాతల్లో ఏడ్చే ఆర్థిక దృక్పథం?" అన్నాడు. అయితే కథలో ప్రధానమైనది ఈ మానవ సంఘటన ఒకటే కాదు జరిగిన సంఘటనకు గోపీ హృదయం "రెపరెప" లాడింది, అతను "ఊగిపోయాడు." అయితే అతని మనస్సు కొత్త పాఠాన్ని నేర్చుకుంది తను "రాతల్లో ఏడ్చే ఆర్థిక దృక్పథం" యొక్క అంతరార్థాలు కొత్తగా అతనికి అవగాహన అవుతున్నాయి. అందులో గోపీ ఒక రచయిత అన్న

సూచన, కథతో నిమిత్తం లేకపోయినా, గోపీచంద్ కలంలోంచి దొర్లింది. బహుశా అనుకోకుండానే దొర్లిందేమో. ''అప్పుడతని కండ్లకు తన తండ్రి అర్భకుల్లో అర్భకుడుగా కనిపించాడు.'' అంటే గోపీ కొంచెంగా గోపీచంద్ అవుతున్నాడన్న మాట. అదే విధంగా ''సిగ్గు'' అన్న కథలో గోపీ ప్రేమశాస్త్రంలో మొదటి పాఠం నేర్చుకున్నాడు. ''హిందూ పాతివ్రత్యం,'' లో శాస్త్రీ, డాక్టరూ వాదోపవాదాలాడు కుంటుంటే, గోపీ తటస్థుడుగా ఉండి విన్నాడు. కళ్లారా ఒక భార్యను భర్త హింసించడం చూశాడు. పాతివ్రత్యాన్ని గురించి మానవతా దృష్ట్యా విలువలు కట్టుకున్నాడు. అయితే ఎక్కడా గోపీచంద్ ఈ తర్కవితర్కాలను హద్దుకుమించి పోనివ్వలేదు. కేవలం తాత్వికోపన్యాసాలుగా తన కథలను మార్చి వెయ్యలేదు. అదంతా చిత్రంగా కథలో ఇమిడేటట్టే జాగ్రత్తపడ్డారు. అసలీ తత్వ పరిశీలనమే ఆయనకు కథా వస్తువు.

అయితే పైనుదహరించిన కథలన్నీ ఒక తరానికీ ఒక తరహాకీ చెందినటువంటివి. కాలం మారింది. గోపీచందు మారారు. తన మొదటి కథల్లో పాత్ర చిత్రణను గురించి ఒక రకమైన విమర్శ ఉందని ఆయనకే తెలుసు. ఆ రోజుల్లో, అంటే ఆయన రాజకీయ, తాత్విక సిద్ధాంతాల మానదండాలతో మానవనైజాన్ని కొలవడానికి పూనుకున్న యౌవన దశలో ఈ విమర్శకొక సమాధానం ఆయనే వ్రాసారు—''నేనూ-నా పాత్ర'', అన్న కల్పికలో. ఒకనాటి రాత్రి ఆయనకు తన పాత్ర కలలో కనిపించింది. ''నన్ను సృష్టించి నా కథంతా రాయకుండా, మధ్యలో విడిచిపెట్టటం మీకు న్యాయం కాదు. మీరెప్పుడూ నన్నిట్లాగే చేస్తున్నారు,'' అంది. ఆయన సమాధానం ఇది.

''నేను వ్రాసేది నీ కథ కాదు. నేను రాసే కథల్లోకి కావలసిన హంశాలు నీ జీవితంలోంచి తీసుకున్నాను. మిగిలిన నీ జీవితం నా కనవసరం.''

అయితే మార్క్సువాదులమనుకునే 'అభ్యుదయ' రచయితల కథలకూ ఈయన కథలకూ ఏ విధమయిన పోలికాలేదు. 'సోషలిస్టురియలిజమ్'గా గడ్డకట్టుకు పోయిన 'అభ్యుదయ' రచనల్లో మానవులూ, వారి మనస్తత్వాలూ, 'వర్గ' విభజనకు లోనై, మనం ఎరిగున్న వాస్తవిక మానవ లోకాన్నించి తొలిగి పోయి ఒక కల్పిత ప్రపంచకంలో మసులుతూ ఉంటాయి. గోపీచంద్ లోకం, మనం ఎరిగున్న ఈ లోకమే. 'సోషలిస్టు వాస్తవికులు' మానవులను సిద్ధాంతాలకు బానిసలను చేస్తారు. వారి రచనలలో మంచి మనసుగల పెట్టుబడిదారూ, దుష్టుడైన కార్మికుడూ ఉండరు. గోపీచంద్ కథల్లో వాస్తవిక మానవులలో వైవిధ్యం మరుగుపడదు. సిద్ధాంతాలు మానవులను అర్థంచేసుకోడానికి ఆయన ఉపయోగించే కొలబద్దలు. అంతేకాదు, గోపీచంద్ రాజకీయ తాత్విక సిద్ధాంతాలు మానవలోకమంత విశాలమైనవి. అవి గడ్డకట్టుకుపోయి ఆయన దృష్టిని హ్రస్వపరచలేదు. అదీగాక, ఆయనతోపాటు ఆయన సిద్ధాంతాలూ మారాయి, ఆయన కథారచనా మారింది.

ఆయన కథల సంపుటాల్లో రెండో భాగానికి 'చిత్తజల్లు' అనే మున్నుడి వ్రాస్తూ, ఈ మార్పును ఆయనే ఎంతో చక్కగా నిర్వచించారు. ''నేనూ-నా పాత్ర'' అన్న చిన్న కథనుగురించి ప్రస్తావిస్తూ ఆయనిలా వ్రాశారు.

''ఏదో ఒక కథా విధానం మనస్సులో ఉంది, ఏదో ఒక ఆదర్శం మనస్సులో ఉంది, వాటిల్లో ఇమిడే అంశాలను మాత్రమే ఏరుకోవటం ఆనాటి నా స్వభావమనీ, నా కథాకథన విధానమనీ విదితమౌతూంది.

నా కిప్పుడలా చెయ్యా బుద్ధి కావటంలేదు. తప్పుకో టానికి ఎంత ప్రయత్నించినా, మానవ జీవితానికి వున్నట్లే రచనా విధానానికికూడా ఒక చట్రం వుండక తప్పదు. ఎప్పుడైతే మనం ఒక చట్రాన్ని నిర్మించు కున్నామో, అప్పుడే దానిలో ఇమడని జీవితం అంటూ ఒకటి వుండటంకూడా తప్పదు. అందుచేత మనం చెయ్యగలిగింది జీవితాన్ని సమగ్రంగా ప్రదర్శించ టానికి అనువైన చట్రాన్ని నిర్మించుకోటం''.

దీనివల్ల 'చట్రం' సడలుతుందని ఆయనకూ తెలుసు "అయితే నష్టమేముంది ? ముఖ్యంగా ఆ సడలింపు ఒక ప్రయోజనాన్ని సాధించడానికి జరిగినప్పుడు లాభమేగదా!'' అన్నారాయన "రచనా విధానంలోని ఈ రకమైన సడలింపు రచయితకు అనుభవం, వివేకం పెరగటంవల్ల వస్తుందని నేను అనుకుంటున్నాను... అప్పుడు మనం ఏదో ఒక అర్ధ సత్యాన్ని చదువరులమీద రుద్దలేం''

అయితే ఈ దృష్ట్యా వెనకటి రచనలను ఆయన విలువలేనివాటిగా జమకట్టారనిగాని, ఈ మార్పు వచ్చినతరువాత వ్రాసిన కథలే నిజమైన కథలుగా భావిస్తున్నారనిగాని అర్థంకాదు

గోపీచంద్ ఏ వయస్సులో, ఏ మనస్థితిలో ఏ కథ వ్రాసినా, అందులో ఒక కథనానికి సంబంధించిన ప్రత్యేకత ఉంది. జీవితాన్నీ, సంఘటనలనీ, అతి క్లుప్తంగా కుదించి కొద్దిమాటల్లో అపురూపమైన భావ చిత్రాల్ని నిర్మించగల శక్తి ఆయనకు ఉగ్గుపాలతో వచ్చి ఉండాలి ఆయన కథల సంపుటాల్లో ఏ పుట అయినా సరే తిప్పండి. మహా జిగి కలిగిన భావ చిత్రాలు సజీవంగా మెదులుతుంటాయి.

''నూతన దంపతులు సినిమా జూస్తున్నారు. నూతన దాంపత్యమే ఒక సినిమా. తామొక సినిమా– తమ ముందు నడిచే సినిమా ఒక సినిమా. కాబట్టి నూతన దంపతులు సినిమా చూస్తున్నారు అనటం కంటే ఒక సినిమా మరొక సినిమాను చూస్తూవుంది అనటం నిజం. నిజం అనటం నాకొక వ్యసనం '' ఇది 'కలల బరువు' అన్న కథలో మొదటి పేరా.

''అకస్మాత్తుగా సినిమాలో బొమ్మలాగా, పార్కులో పైకి లేచే జలధారలాగా రాధాకృష్ణమూర్తి వేదిక ఎక్కాడు.'' 'పీడకల' అన్న కథలో ఒక వాక్యం. ఇట్లాంటివి అనేకం

ముఖ్యంగా ఆయన కథల్లో – పాత వాటిల్లోనూ, కొత్త వాటిల్లోనూ కూడా–గమనవేగం చాలా ఎక్కువ. కథ మొదలు పెట్టినది మొదలు తుదికి చేరుకోవాలని తొందర పడు తున్నట్టు నడుస్తుంది ప్రకృతి వర్ణనలు గాని, పాత్రల వర్ణనగాని, సంభాషణలుగాని అవసర మైన మూడు మాటల్లో ముగిసిపోతాయి కథ తరువాతి ఘట్టానికి తరలి పోతుంది తత్వనిరూపణ కూడా అంత క్లుప్తంగానూ ముగుస్తుంది. కేవలం తత్వ విచారణ కోసమే వ్రాసిన కథలున్నాయి–అవి కథ లనండి, వ్యాసా లనండి, ఆఖ్యాయిక లనండి–దేవుని జీవితం వంటివి వాటిలో కూడా తత్వవిచారణ, భావ వ్యక్తీ కరణం, కథలాగే చకచక నడుస్తుంది.

అన్నిటికన్నా ఆయన కథల్లో నన్ను ఆకర్షించింది సంభాషణా చాతుర్యం, ''సరే కానివ్వండి'' అన్న కథ ఇంచుమించు సంభాషణతోనే నడిచింది. అందు లోనే పాత్రలూ, కథా రూపు దాలుస్తాయి కాని ఆ కథ నాటకం ఎంత మాత్రంకాదు మనల్ని ముందుకు లేపి కూర్చోబెట్టే ఆవేగపూరితమైన ఘట్టా లున్నాయి ఆ కథలో

''వాడు మనకి పుట్టలేదనుకో'' అన్నాడు వెంకయ్య.

''అనుకుంటే అప్పుడే'' అన్నది వెంకమ్మ.

''అవక్కొడుతుందా ?''

''కొట్టాలి ?'' అన్నది వెంకమ్మ

శ్రీ పాలగుమ్మి పద్మరాజు

"మరి ఎందుకు ఏడవాలి ?"

"కన్న కడుపుగా మరి" అన్నది వెంకమ్మ.

"దాని సిగ తరిగిరి," అన్నాడు వెంకయ్య.

"దేని సిగ ?" అన్నది వెంకమ్మ.

"దాని సిగే," అన్నాడు వెంకయ్య. —

మధ్యమధ్య ఒక్కొక్క చిన్న పేరాలో ఏదో వివరణ, తిరిగి సంభాషణ. ఈ కథ కొంచెం పెద్దది. అంటే పొడుగెక్కువ అయితే మనల్ని ఆత్రపెట్టే వేగంతో నడుస్తుంది. ఈ సంభాషణల్లో చిన్నచిన్న పాత్రోచితమైన చణుకులు. వాళ్లని మన కళ్లకి కట్టినట్టు చూపిస్తాయి. అసలు ఆయన కథల్లో మరీ గొప్ప కథల్లో ఒకటి ఈ 'సరే కానివ్వండి'. కథకుడు ఆవేశపడకుండా మనల్ని ఆవేశంలో ముంచెత్తుతాడు. చెప్పినదానికి వెనక, చెప్పకుండా దాగి ఉన్న ఎన్నో అంతరార్థాలు మన మనస్సుల్లోకి అనాయాసంగా ఎక్కిస్తాడు. ముఖ్యంగా ఈ కథలో ఆయన అసలు తత్వచింత దరిమేనా పోనేలేదు. ఉన్నదాన్ని కొండంతలు చేసి చూపే ప్రయత్నం అసలేలేదు అయితే కథ మనలో భయంకరమైన ఉద్వేగాలు రేకెత్తిస్తుంది. జీవితాన్ని కాచి వడబోసి మనకి సమర్పిస్తుంది.

'దేవుడి గది' ఒకటి నాకు నచ్చిన కథల్లోది. అందులోనూ తత్వ సూత్రం అంతర్గర్భితంగానే ఉంది వాచ్యంగా లేదు. అయినా స్పష్టంగా తెలిసేటట్టు మాత్రం కథకుడు జాగ్రత్తపడ్డాడు. సుశీల, క్రాంతి నాథుడు, అత్తగారు, ఇరుగుపొరుగు అమ్మలక్కల ప్రతినిధి సీతమ్మ, అందరూ తమతమ పాత్రలు మనకి పరిచయం చేస్తూ, కథలో కలిసిపోయి, కథకుని అంతిమ ప్రయోజనాన్ని నెరవేరుస్తారు. మనో దౌర్బల్యం మూలంగా, ఏదో అపద విరుచుకు పడుతుందని భయపడి, లేని రహస్యాన్ని దాచిపెట్టి, అదే ఆపదకు కారణభూతులైన తల్లీ కొడుకుల కథ ఇది. అంతేకాదు, ఈ కథలో అనాదిగా వస్తున్న మూఢ నమ్మకాల బలానికీ మనుగడకూ కారణాల పరిశీలన అతి సూక్ష్మంగా జరిగింది.

'కూపస్త మాండూక్యం' మహా మంచికథ. అది కాంతమ్మ విషాదగాథ అయినా, కాంతమ్మ బరువైన పాత్రకాదు. మంచి రంగూ రుచీ కలిగిన, తెలిసిన స్త్రీ. ఆమెకు ఎందరితోనో సంబంధముంది. మంచి నిద్రలో ఉండగా అరికాలు గీరతాడని మొగుణ్ణి వొదిలేసి పట్నం లేచొచ్చింది అయితే "ఏందో అనుకుంటాంగాని అబ్బాయి, ఈ మొగాళ్ళంతా వొక్కటే," అన్న పరమసత్యాన్ని అతి త్వరలో గ్రహించింది. పైకి అవాకులు చెవాకులు పేలుతుంది. లోపల మాత్రం బాధ ఉంది కథలో ఉన్న అందం ఏమంటే, ఆమె నిజంగా ప్రేమించిన పాపారావుతో మాత్రం ప్రణయ సంబంధం పెట్టుకోలేదు వాళ్లిద్దరి మధ్యా ఉన్న సున్నితమయిన సానుభూతినీ, అనురాగాన్నీ అతి చక్కగా పోషించాడు కథకుడు. ఆమె బిడ్డనిగని చచ్చిపోయింది వొదిలి వొచ్చిన మొగుడు దహనం చేశాడు. తనదికాని బిడ్డని పోషించే భారం పాపారావు భుజాన వేసుకున్నాడు.

గోపీచంద్ కథాకథన విధానాన్ని తీర్చిదిద్దిన ఇతర కథకుల ప్రభావాన్ని గురించి ఆయనే చెప్పుకున్నాడు.

"నా మట్టుకు నాకు మొదట్లో చెకోవ్ కథలూ, తరువాత బేట్స్ కథలూ, తరువాత సారోయాన్ కథలూ నచ్చుతూ వచ్చినై....మధ్యే మధ్యే నన్ను పుష్కిన్, గోర్కీ, మామ్, ఓ హెన్రీ మొదలయిన వాళ్లు వదలకండా కదలకండా పట్టుకుంటూ ఉండేవారు.

ఆయన కథాకథనం ఎవరికీ అనుకరణంకాదు. అధమం 'స్పష్టంగా ఈ కథకుని ఛాయలు ఈయనలో కనిపిస్తున్నాయి,' అని చెప్పడానికి కూడా ఎవరూ కనిపించరు. అన్ని దేశాల కథలకంటే ఆయనకు

సన్నిహితంగా ఉన్నవి రష్యన్, చైనా కథ లన్నా రాయన దానికి కారణం బహుశా మన జీవితానికీ వారి జీవితానికీ ఉన్న సన్నిహితత్వం అయిఉండ వచ్చు నన్నా రాయన

నాకు స్థూలంగా కనిపించే రెండు ప్రభావాలు ఆయన మీదున్నట్టుతోస్తుంది చెకోవ్ కథా ప్రారం భాలూ, అంతాలూ బేట్సు కథాకథనం ఈయన జీర్ణించుకున్నట్టు నాకు తోస్తుంది.

పాశ్చాత్య తత్వశాస్త్ర చింతనం ఈయన దృష్టిని నిశితంచేసి, మన పల్లె జీవితాన్ని ఆ దృష్టినించి పరిశీలించేటట్టు చేసింది. అయితే పల్లె జీవితం ఆయనకు ఆమూలం తెలుసు సమిష్టి కుటుంబం, యీనాందారీ మనస్తత్వం, వాటి అనుబంధాలూ, ఘర్షణలూ, పిచ్చి నమ్మకాలూ, అన్నీ ఆయన ఆ తత్వ నాళికలోపోసి పరిశీలించి తన ప్రయోగ ఫలితా లను కథలద్వారా నిర్వచించారు. మధ్యతరగతి జీవనం, పట్నవాసపు సంస్కారాలూ, ఆదర్శాలూ, యువకుల ఉద్రిక్త మనస్తత్వాలూ కూడా ఆ మూసలో పోసి కరిగి మిగిలిన నిగ్గును మన ఎదట ఉంచాడాయన.

మొదటి కథల్లో ఆయన ఏ అభిమానాలూ లేని వైజ్ఞానిక పరిశోధకుడు తరువాత కథల్లో సాను భూతితో ఈ అమాయక మానవలోకాన్ని పరిశీలించే సాధకుడు. ఆయన్నుగురించి ఇంతకంటే చెప్పడానికి ఇంకేమీ లేదనుకుంటాను

# సత్యాన్వేషణ

మొదట్లో ప్రపంచాన్ని అర్థం చేసుకోడానికని 'నేను' అంటేఏమిటో అర్థంచేసుడానికని ప్రయత్నించారు. దీనివల్ల బాహ్యపరిస్థితులకు అప్రాధాన్యత ఏర్పడింది. కొన్నాళ్ళకి వాటినిగురించి ఆలోచించటమే మానేశారు. పర్యవసానం, ప్రపంచాన్ని రోసి అరణ్యాలపా లవటం...

వెంటనే సత్యం తెలుసుకోటానికి మార్గం ఇదికాదు అనుకుని, బాహ్యపరిస్థితుల్ని అర్థంచేసుకోటానికి ప్రయత్నించారు. 'నేను'కు అప్రాధాన్యత ఏర్పడింది. కొన్నాళ్ళకి బాహ్యపరిస్థితుల్ని గురించి తప్ప నేనుని గురించి ఆలోచించటం మానేశారు. దీనితో మానవుడు పరిస్థితులకు బానిసగా, యంత్రంగా తయారయ్యాడు. 'నేను' నీ 'బాహ్య పరిస్థితుల్నీ' —ఈ రెంటినీ అర్థం చేసుకొని సమన్వయం చేసుకుంటే సత్యం తెలుసుకోగలుగుతాం.

గోపీచంద్

# కథా కథన చాతురి

శ్రీ ఆవుల సాంబశివరావు

గోపీచంద్ వ్రాసిన కథ చదువుతుంటే, రసభరితమైన ఒక నాటకాన్ని చూస్తున్నట్లు ఉంటుంది. చక్కని చలనచిత్రాన్ని చూస్తున్నట్లు ఉంటుంది వాస్తవిక జీవితాన్నే చూస్తున్నట్లు ఉంటుంది.

అద్దాలలో ప్రతిబింబాలు కనుపించినట్లు ఆయన కథలలో జీవితం ప్రతిబింబిస్తుంది. ఆయన పాత్రలు మనకళ్ళలో మెసలినట్లు, మనముందు ప్రవర్తిస్తున్నట్లు, మనకళ్ళముందే వారు జీవిస్తున్నట్లు అగుపిస్తారు ఆ కథా గమనంతో మనము కదలిపోతాము. ఆ పాత్రలతోపాటు మనము కష్టసుఖాలు, అనుభూతులు పంచుకొంటాము ఆయన సృష్టించిన సన్నివేశాలలో మనమూ భాగస్వాములమవుతాము ఆయన ప్రసరించే భావాలతో ఉత్తేజితు లవుతాము. పాఠకునకు అంతటి హృదయస్పందనాన్ని, అంతటి ఉనోద్వేగాన్ని, అంతటి ఆనందానుభూతిని కల్పించగల కథాకథనచాతురి కలవాడు గోపీచంద్. అందుచేతనే గోపీచంద్ ఉత్తమ కథారచయిత, ప్రథమ శ్రేణికి చెందినవాడు, విశ్వకథా సాహిత్యములోనే గోపీచంద్‌కు ప్రధానమైన స్థానమున్నది విశిష్టమైన అంతస్థున్నది.

గోపీచంద్ ఎన్నికథలో వ్రాశాడు. ఎన్నిరకాల కథలో వ్రాశాడు. చిన్నకథలు, పెద్దకథలు, నవలికలు, స్వగతాలు—ఇటువంటి ఎన్ని ఆకారాలతోనో అమోఘమైన ఆయన లేఖినినుండి కథాస్రవంతి ప్రవహించినది. ఆయన సిద్ధహస్తాలనుండి తెలుగు కథా రచన అనేక రూపాలను పొందినది. నిష్ణాతమైన

ఆయన శిల్పచాతుర్యమునుండి కథాకథనము క్రొత్త అలంకారాలను ఎన్నిటినో సంతరించుకున్నది.

గోపీచంద్ ప్రధానంగా కథకుడు. కథవ్రాయడంతో రచన ప్రారంభించి, కథవ్రాస్తూనే కన్నుమూశాడు. 35 ఏండ్లపాటు అవిచ్ఛిన్నంగా సాగింది గోపీచంద్ కథాకథనం.

విశ్వకథా సాహిత్యాన్ని పుక్కిటబట్టినవాడు గోపీచంద్. అనేకభాషల కథాసాహిత్యాలలోని అనుపానులు, లోతుపాతులు, మెలుకువలు ఆకళింపుచేసుకున్నవాడు ఆకళింపు చేసుకుని వాటికి క్రొత్తమెరుగులు దిద్దాడు. నూతనరూపకల్పన చేశాడు. పర్యవసానంలో తనదైన, విశిష్టమైన కథారచనాశిల్పాన్ని ఒకదాన్ని రూపొందించాడు.

గోపీచంద్ కథలకు జీవంపోసినవి ఆయన పాత్రలు, ఆయన భాష.

ఆయనపాత్రలు సజీవ ప్రతిమలు, జీవకళికలు. అవి జీవాన్ని పుణికిపుచ్చుకొని మనతోపాటు కదులుతాయి మన్ని కదిలిస్తయి. నవ్వుతై నవ్విస్తయి. ఉత్సాహంతో ఉరకలు వేస్తయి. మన్ని ఉత్సాహపరుస్తయి.

గోపీచంద్ పాత్రలు జీవితానికి ప్రతిబింబాలు, ప్రతినిధులు మనచుట్టూ కనుపించే మనుష్యులు, వాళ్ళ మనస్తత్వాలు, వాళ్ళ అవకతవకలు, వాళ్ళ మంచిచెడ్డలు అన్నీ ఆ పాత్రలలో ప్రతిబింబిస్తయి. అందుచేతనే గోపీచంద్ పుస్తకాలు చదువుతుంటే ఆ పాత్రలను ఎక్కడో చూచినట్లు ఉంటుంది. వాళ్ళను ఎరిగినట్లే ఉంటుంది. వాళ్ళను పోల్చుకోగలమనే అనిపిస్తుంది.

అయితే గోపీచంద్ పాత్రలు ఏమనిషికో, ఏ వ్యక్తికో నమూనాలు కావు. ఒక్కొక్కపాత్ర ఒక్కొక్క తత్వానికి, ఒక్కొక్క విధానానికి, ఒక్కొక్క వ్యవస్థకు ప్రతినిధి. ఆ పాత్రలలో ఆ తత్వాన్ని చూస్తాము ఆ తత్వాన్ని చూచినప్పుడు అట్టి మనుష్యులు దృగ్గోచరమవుతారు. ఆ కోవకు చెందినవాళ్ళందరూ మన మనస్సుల్లో కదులుతారు. ఒక తెగనే సూచించగల, ఒక తత్వాన్నే ప్రతిబింబించగల శక్తిమంతులు, గోపీచంద్ పాత్రలు, అందుకనే వాటికంతవాడి, అంతటి చేవ. 1668

క్రమంగా గోపీచంద్ పాత్రలుకూడా మారినయి. ఆయన తాత్వికదృష్టి వికసించినకొద్దీ, ఆయన దృక్పథం వైశాల్యతను పొందినకొద్దీ ఆయన పాత్రలు కూడా విస్తృత రూపాలను సాధించినవి. కథలు వ్రాస్తున్న మొదటి దినాలలో గోపీచంద్ వాస్తవికతకు యథాతథంగా రూపకల్పనలు చేసేవాడు ఆనాటి గోపీచంద్ పాత్రలు జీవితగమనానికి ఫక్తు ప్రతిబింబాలుగా వుండేవి మొదటినుండి చివరవరకు వాస్తవిక జగత్తును చూపెట్టేవి క్రమంగా ఆ పాత్రలు మారినయి ఆ మారిన పాత్రలు కూడా యథార్థ జీవితానికి ప్రతిబింబాలే. అయితే రాను రాను ఒక్కొక్కమెట్టు పైకిపోయినవి. ఆధ్యాత్మిక అంతస్సులను సాధించినాయి ఆత్మోన్నత్యాన్ని సిద్ధించుకున్నాయి. మానవుడు కోరికపడాలేగాని, ప్రయత్నించాలేగాని ఎట్టి స్థాయినైనా సాధించగలడని గోపీచంద్ తన పాత్రలద్వారా నిరూపించాడు గోపీచంద్ చివరిరచనలైన "గడియపడని తలుపులు," "మెరుపుల మరకలు" ఈ తరగతికి చెందినవి. మానవుని వికాసయానాన్ని చిత్రించినాయి,

శరత్చంద్రునివి వలెనే గోపీచంద్ స్త్రీ పాత్రలు విశిష్టమైనవి. మానవుని వికాసయాత్రను ఔన్నత్య సిద్ధిని శరత్చంద్రునివలె గోపీచంద్ కూడా స్త్రీ పాత్రలద్వారానే చిత్రించాడు. గోపీచంద్ వ్రాసిన

శ్రీ ఆవుల సాంబశివరావు

1668

'చీకటిగదులు.' 'మెరుపుల మరకలు,' 'గడియ పడని తలుపులు,' లోని స్త్రీ పాత్రలు ఈ రచనా విధానానికి మచ్చుతునకలు.

గ్రామీణ జీవితాన్ని గోపీచంద్ చిత్రించినట్లు మరే తెలుగు కథకుడూ చిత్రించలేదు గోపీచంద్ రచనల్లో రైతు హృదయం, రైతు తత్వం స్పందిస్తుంది కథా రచనకు గోపీచంద్ పూనుకునేవరకు, తెలుగు రచనల్లో, గ్రామజీవిత చిత్రణలు పంటకాలువకు, పచ్చని చేలకు, బర్రెపాలకు పరిమితమై వుండేవి గోపీచంద్ రైతు హృదయంలోకి దిగిచూచాడు, దానిని అర్థం చేసుకున్నాడు అందుచేత జీవం పోసుకున్న రైతు సాధక బాధకాలతో కూడిన అతని జీవితం గోపీచంద్ కథలలో చరితార్థమైనయి, పాఠకుల మనస్సును ఆకట్టుకున్నాయి.

తన పాత్రలను వాటి తత్వాలను ఇంతటి పాటవంతో చిత్రించడానికి గోపీచంద్‌కు భాష చాలా ఉపకరించింది గోపీచంద్ శైలి, కథ చెప్పడానికి చాలా అనువైనది, అనుకూలమైనది.

ఎంతటి క్లిష్టమైన విషయాన్నైనా గోపీచంద్ సునాయాసంగా చెప్పగలడు. సుతారంగా రాయగలడు పండు వలచి చేతిలో పెట్టినట్లు తేలిక చేయగలడు. చిన్న చిన్న వాక్యాలు, తేట తెలుగు పదాలు గోపీచంద్ పరికరాలు ఆ కమ్మని పదాలలో, ఆ చక్కని వాక్యాలలో చదువరి పయనిస్తూవుంటే, సరోవరంలో నావికాయానం చేసినట్లు హాయిగా ఉంటుంది. ఆ భాషలో తికమకలు లేవు. ఆ చెప్పే వైనంలో గడబిడలులేవు గోపీచంద్ పదజాలం పుష్పబాణాల్లాగా హృదయానికి హత్తుకుపోతయి, ఆయన భావాన్ని పాఠకునకు సూటిగా అందిస్తయి.

గోపీచంద్ పరిశీలనాశక్తి రచయితగా గోపీచంద్‌కు చాలా ఉపకరించింది జీవిత నగ్న సత్యాలను, సునిశితమైన తన దృక్పథంనుండి గోపీచంద్ పరిశీలించేవాడు వాటికి తిరిగి ప్రతిభావంతంగా తన రచనల్లో రూపకల్పన చేసేవాడు

గోపీచంద్ చేసిన తాత్త్విక, ఆధ్యాత్మిక రచనలు ఆయన కథాకథన చాతురికి గీటురాళ్ళు జటిలాలైన తాత్త్విక విషయాలనుకూడా గోపీచంద్ చక్కని కథలలాగా వ్రాసేవాడు ఆయన వ్రాసిన "తత్త్వవేత్తలు" చదువుతూంటే, ఒక్కొక్క తత్వవేత్త తిరిగి రూపం ధరించి, ప్రాణంపోసుకుని, మన ముందుకువచ్చి, తన కథ చెబుతున్నాడా, తన సిద్ధాంతం ప్రవచిస్తున్నాడా అనిపిస్తుంది అంతటి కఠినమైన సమస్యలను కూడా కమ్మని కథల్లాగా వ్రాయగల సామర్థ్యం గలవాడు గోపీచంద్.

గోపీచంద్ కథాకథనచాతుర్యం అమోఘమైనది, అమరమైనది అందుచేత గోపీచంద్ కూడా అమరుడే

[ఆకాశవాణి సౌజన్యంతో]

# అమర కథకుడు

శ్రీ పి. బాబుల్‌రెడ్డి

ఆంధ్రుల చిరకాల వాంఛితమైన ఆంధ్రప్రదేశ్ అవతరించిన రోజులవి హైదరాబాదు నగరం ఆంధ్ర సాహిత్య సంస్కృతులకు కేంద్రంగా మారుతున్నది. పెక్కుమంది సాహిత్యకులు ఒక్కొక్కరే రాజధానీ నగరం చేరుకుంటున్నారు అలా వచ్చిన వారిలో శ్రీ గోపీచంద్‌గా రొకరు. సాహితీ ప్రియులైన మిత్రులు కొందరు "కళానికేతనం" అను సాహిత్య సంస్థను స్థాపించి, దానికి నన్ను అధ్యక్షులుగా ఎన్నుకొన్నారు. ఆ సంస్థకు సలహాదారులలో ఒకరుగా ఉండవలసిందని శ్రీ గోపీచంద్‌గారిని కోరగా వారు అంగీకరించారు. అప్పటినుండి వారితో నాకు సన్నిహితత్వం ఏర్పడింది కళానికేతనం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన "నేను-నా కథలు" మొదలైన సాహిత్యగోష్ఠులు జయప్రదం కావడానికి వారు అమూల్యమైన సలహాలు ఇవ్వడమే కాకుండా, స్వయంగా పాల్గొని మాకందరికీ ఆనందాన్ని ప్రోత్సాహాన్ని కల్గించారు. ఆయనను అంతవరకు పేరుపడ్డ రచయితగానే నే నెరుగుదును. కాని న్యాయశాస్త్ర పట్టభద్రుడని తెలిసినప్పుడు నేను సంభ్రమాశ్చర్యాలకు గురి అయ్యాను. వారియందు నాకు ఆత్మీయత, వారి రచనలందు నాకు కుతూహలం ఎక్కువ కాజొచ్చినవి.

వారి రచన లన్నిటినీ కాకపోయినా కొన్నిటిని తీరిక లభించినపుడెల్లా చదివాను ఏ రచన ముట్టుకున్నా తుదివరకు చదువకుండా వదలలేం. ప్రతి రచనలోని వస్తువు ప్రగతిశీలంగా వర్తమాన సాంఘిక,

ఆర్థిక వ్యవస్థలలోని మురికి కూపాన్ని బహిరంగ పరుస్తూ ఉంటుంది. ప్రతి కథలోనూ మూఢాచారాలు హేతువాదానికి దూరమైన విషయాలు ఆయన వ్యంగ్య ధాటికి తట్టుకోలేక నుసి అయిపోతాయి. ప్రతి చిన్న కథ మానవజీవిత మహాంధకార ప్రాసాదానికి ఒక కిటికీలాంటిది. ఏ కిటికీ తెఱచి చూచినా ఏదో జీవిత రహస్యం మనకు కన్నుల గట్టుతుంది. ఇంత వయస్సులోనే ఇన్ని దృక్కోణాలనుండి, ఇంత సునిశితంగా సామాజిక జీవితాన్ని ఈ రచయిత ఎలా పరీక్షించ గలిగాడా అనే సందేహం ప్రతి పాఠకునికి కలుగుతుందనడంలో అతిశయోక్తి లేదు.

ఆంధ్రదేశ గ్రామీణ జీవితాన్నీ, మధ్య తరగతి సంఘాన్నీ యధాతధంగా చిత్రించిన రచయితలలో అగ్రగామి గోపీచంద్. తండ్రి కొడుకుల మధ్య, భార్యా భర్తల మధ్య, ప్రేయసీ ప్రియుల మధ్య, పాలక పాలితుల మధ్య, వేయేటికి-ప్రతి మానవునికి మానవునికిమధ్య వచ్చే పొరపొచ్చెములు, ప్రేమ బంధాలు, స్వార్ధంకోసం సంఘర్షణలు అన్నిటినీ ఈయన చిత్రించారు. దారిద్ర్యంలో విరిగిన మనసులు, ధర్మానుపత్రుల అధర్మాలు, పీడనతో వెతలతో సగం పిచ్చివాళ్ళయిపోయిన దీనుల స్థితులు, రామరాజ్య కాలంనుండి ఈనాటివరకు వస్తూ ఉన్న ధర్మవడ్డీలు, ఆస్తులపై మమకారాలు, పతితులు, ఆత్మద్రోహులు, విఫల జీవితాలు-ఇట్లా సంఘంలో తాను చూచిన వ్యక్తులను స్థితులను కథలుగా అల్లాడు. ఏ కథలోనూ ఇదీ యిందలి నీతి అని చెప్ప ప్రయత్నించలేదు. జీవితం విరజిమ్మే వివిధములైన రంగుల్నీ కుంచెతో మన మనస్సులపై హత్తుకొనేటట్టు చిత్రించడమే ఆయన విధానం అందలి ఉపదేశాన్ని పాఠకుడు ఊహించుకోవలసిందే.

"నాలోనివాడు" అనే కథలో గోపీచంద్ మన స్తత్వమేమిటో బోధపడుతుంది హైకోర్టులో అడ్వొకేటుగా ఎన్‌రోల్ అవ్వాల్సిన రోజు దగ్గరకు వస్తుంది. నల్ల కోటు వేసుకొని, వెయ్యి రూపాయలు జేబులో పెట్టుకొని హైకోర్టుకు బయలుదేరాడు. దారిలో తాను చూచిన దీనమానవుల్నిగూర్చి-వారి జీవితానికి తన జీవితానికి ఉన్న సంబంధాన్ని గూర్చి తలపోసుకుంటాడు. "ఆకలి" అని అల్లాడే బాలింతరాలికి తాను తెచ్చిన డబ్బు దానం చేయా లనుకొంటాడు. కాని చెయ్యలేడు. హృదయేశ్వరి జ్ఞాపకంవచ్చి "పిల్లలో" అంటుంది. నాన్నగారు కనిపించి "జన్మ వృధా" అంటాడు. తనలోనివాడు జాగ్రత్త అంటాడు. ఒక వూపులో హైకోర్టుకు తనువును చేరవేశాడు. ఈ సంఘర్షణ హృదయమున్న ప్రతివాడూ ఈనాడు అనుభవిస్తున్నదే. సంఘ పరిస్థితుల ధాటికి మానవత్వం ఓటమి యిందలి సారాంశం.

"భార్యల్లోనే ఉంది" అనే కథలో ఒక లావుపాటి భార్య, భర్త తన్ను ప్రేమించక పోవడానికి కారణం తన స్థూల శరీరమే అనుకొని బాధపడుతుంది. పుట్టింటికి బయలుదేరి - బస్సుస్టాండు దగ్గర - ఒక సన్నగా, అవ్వాయి చువ్వలాగా ఉండే అమ్మాయిని చూస్తుంది, తన భార్య సన్నంగా ఉండటం ఆ అమ్మాయి భర్తకు ఇష్టంలేదు అందువల్ల ఆ అమ్మాయి దిగులుతో పుట్టింటికి బయలుదేరింది ఈ వృత్తాంతంవిన్న లావుపాటి భార్య మనసు మార్చుకొని యింటికి తిరిగివస్తుంది. ఇందు వర్ణించినది ఒక చిన్న సంఘటన అయినా ఆ వర్ణించిన విధానం అద్భుతంగా ఉంది. జీవితపు లోతులు చూపిస్తుంది.

"అసమర్ధుని జీవయాత్ర", "మెరుపుల మరకలు" ఈయన వ్రాసిన నవలల్లో మకుటాయమానములైనవి. "అసమర్థుని జీవయాత్ర"లో కథానాయకుడు తానొక

ప్రత్యేకతగల మనిషి ననుకొంటాడు. సంఘంతోపాటు మారలేడు. జీవితంలో కష్టనిష్ఠురాలను ఎదుర్కోవలసి వచ్చేటప్పటికి బిత్తరపోయి, వెర్రివాడై తన్ను తానే అంతం చేసుకుంటాడు ప్రచండమైన నేటి జీవిత సంగ్రామంలో పిరికివాళ్ళకు, అసమర్థులకు చోటులేదని ఈ నవల యువజనానికి హెచ్చరిక చేస్తుంది. "మెరుపుల మరకలు"లో వివాహితయై కాపురం చేస్తున్న ఉషారాణికి ఒక వ్యక్తిని ప్రేమించి అతనితో జీవయాత్ర గడపటంలో నమ్మకంలేదు ఒకే కాలంలో అనేకుల్ని ప్రేమిస్తుంది. విచ్చలవిడిగా, ప్రమాదకరంగా సంచరిస్తుంది చివరికి సన్యసించి హిమాలయాల్లో అంతర్ధానమైపోతుంది. "కామిగాక మోక్షకామిగాడు" అన్న వేమనయోగి వాక్యానికి నిదర్శనప్రాయ మీ పాత్ర.

ఈ విధంగా ఉదహరిస్తూపోతే ప్రతి కథను ప్రతి నవలను ఉదహరించవలసి వస్తుంది తాను తాకిన అతి నీరస పదార్థాన్ని, తళతళలాడే బంగారుగా మార్చగలిగిన స్పర్శవేది యీయన కలం తెలుగు సాహిత్యంలో కథకుడుగా బయలుదేరి, గొప్ప నవలా రచయితగా వాసికెక్కి, ఎప్పటికప్పుడు ఏదో తత్త్వాన్ని అనుసరిస్తూ, చివరకు విభిన్న తత్త్వాల సమన్వయం చేయ దలపెట్టిన గోపీచంద్ ఇక మనకు లేడు ఈయన ఆకస్మిక మరణం యావదాంధ్ర సాహిత్యానికే తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి కలిగింపుగాకమని "కళానికేతనం" పక్షాన, అశేష మిత్రబృందం పక్షాన భగవంతుని ప్రార్థిస్తున్నాను.

# ఏం కావాలి? ఏలా తెచ్చుకోవాలి?

"రచనకు ప్రయోజనం ఉండాలి అంటారు?"

"లేకపోతే ఎందుకు రచనలు చెయ్యటం"

"అయితే మీరు మీ కథల్లో ఏదీ స్పష్టంగా తేల్చి చెప్పరేం?"

"చిన్న పిల్లల కథల్లోకిమల్లే ప్రతి కథలోనూ 'దురాశ దుఃఖానికి చేటు' అన్నట్లుగా నీతి తేలాలి అంటారు?"

"మరి తేలొద్దూ?"

"అక్కర్లేదు ఒక నీతిని తేల్చి చెప్పటానికంటే ఒక సంస్కారం, ఒక దృష్టి కలిగించటం ఉత్తమం, అప్పుడు చదువరి తనంతటానే చాలా తేల్చుకోగలుగుతాడు."

"సంస్కారం కలిగించి ఊరుకుంటే సరిపోయిందీ? ఏంచేస్తే ఆ సంస్కారం ఆచరణలోకి వొస్తుందో, ఏవిధానం అవలంబించాలో, అవన్నీ చెప్పొద్దూ?"

"ఆ పని వ్యాసం చేస్తుంది."

గోపీచంద్

# జోహార్

ఓ—ఓహో! రాలిపోయె నొకరత్నం
మృత్యువు మ్రింగిన ముత్యం
తెలుగు సాహితికి తెగువను జూపుచు
అజ్ఞానమ్మును అంతము జేయుచు
చిన్ననాటనే చిన్నం ముంచిన
హేతువాద ఘననీతిని బ్రోచిన
జవ సత్వమ్ముల యువక యోధుడై ॥ఓ॥

మధుర భావనం మదిలో నిడుకుని
ఉత్సాహము బర్ ఉరకలు వేయగ
క్షణ క్షణమ్ము రణమ్ము జేసిన
విలువగు రత్నము విడచి పోయెనా
అయ్యో! నేలకొరిగెనా ॥ఓ॥

నీ కలం బలమ్మే నీ స్మారక మోయ్
మరువ జాలమోయ్ మా గోపీ! నిను,
అఖిలాంధ్రులు నీ కీర్తింతు రిదే
యువక శ్రేష్ఠుడా! జోహార్
గోపీ చంద్రా జోహార్
త్రిపురనేనీ నీకు జోహార్ ॥ఓ॥

శ్రీ కొడాలి ఉమామహేశ్వరరావు

# భావపరిణామం

పరతంత్ర భారతదేశంలో గోపీచంద్ వైజ్ఞానిక జీవితం ప్రారంభమయ్యే నాటికి మూడు రకాల వుద్యమాలు ముమ్మరంగా పనిచేస్తూ వచ్చినై. సమాజంలో మంచి మార్పు రావాలంటే మనుషుల ఆలోచనా పద్ధతిలో హేతువాద దృష్టి పెంపొందాలని చాటిన భావ పునర్వికాస ఉద్యమం (Renaissance Movement) మొదటిది. మన మూటముల్లె అంతాపుక్కిట పురాణాలలోనూ, కులమత వ్యవస్థలలోనూ వున్న వన్న దృష్టిలోవున్న సామాజిక వ్యవస్థను పది బారలు వెనకకు నెట్టటానికి పూనుకొన్న మత పునరుద్ధరణ ఉద్యమం (Revivalist Movement) రెండోది, మూడవది రాజకీయ ఉద్యమం దీనిమీద పైరెండింటి ప్రభావం సమతూకంగా పడుతూ ఉండేది మొదట్లో. కాని స్వరాజ్య సమరసారధ్యం గాంధీజీ చేతులలో పడే సరికి, రాజకీయ ఉద్యమం మత పునరుద్ధరణ ఉద్యమ ప్రభావానికే లొంగిపోయిం దనవచ్చు అయినా అల్ప సంఖ్యాకులుగా వుండికూడా భావవిప్లవోద్యమాన్ని సమధి కోత్సాహంతో నడిపించిన, మహామహులు దేశవ్యాప్తంగా లేకపోలేదు. అలాంటి వారిలో ఆంధ్ర రాష్ట్రంలో కవిరాజు త్రిపురనేని రామస్వామిగారు ఒకరు. గోపీచంద్ వారి జ్యేష్ఠ పుత్రుడు కావడంవల్ల నేమో— ఆయన తండ్రిలోని విప్లవచైతన్యానికి సహజ వారసుడు అయ్యాడు.

కవిరాజు పురాణ ప్రపంచాన్ని కల్లోలపరచిన ధీశాలి. గోపీచంద్ సాంఘిక దురాచారాలను మన

శ్రీ ఎన్. వి. బ్రహ్మం

స్తత్వరీత్యా రూర్వారపట్టిన మేధావి కవిరాజు ప్రధానంగా నదురుబెదురులేని పద్యకవి గోపీచంద్ అనుపానులెరిగిన గద్యకవి. 'అల్పాక్షరముల అన ల్పార్థరచన' యే కవిత్వానికి గీటురాయి అనుకుంటే తండ్రి కొడుకులిద్దరూ వారివారి రంగాలలో సాటిలేని మేటికవులే వ్యంగ్య ధోరణిని రంగరించుకొన్న, విమర్శ్యాపటిమ యిద్దరికీ వెన్నతో పెట్టిన విద్యయే. అయితే కవిపుంగవులకాలంలోనివారు కవిరాజు ఆ రంగంలో తనకత్తికెదురు కత్తిలేదు. కథలు, నవల వంటి రచనలకు వాసివస్తున్న రోజులలోనివాడు గోపీచందు ఆ రంగంలో తనకత్తికెదురు లేకుండా రచనలు చేశాడు ఆయనకూడా. అలా గోపీచంద్ తండ్రికిదగ్గ కొడుకే అనిపించుకున్నాడు.

అయితే రవిరాజు భావవిప్లవ పంథాలలోనే పయ నించాడు. ఆంధ్రత్వం ఉట్టిపడే రచనను కొంత సాగించినా ఆయన రాజకీయాల రంగు పూసుకోలేదు తన భావవిప్లవపంథాలో. కుడికాలుమూని రాజకీయ రంగంలో యెడమకాలు పెట్టాడు. భారతరాజకీయ రంగంలోకి ఎమ్ ఎన్. రాయ్ ప్రవేశించడంతో యీ అవకాశం ఆయనకు లభ్చింది రాజకీయమే జీవిత సర్వస్వమైనట్లు తప్పుడుదృష్టితో నడిచే రాజకీయ వాదులకోవలో పయనించక బహుముఖమైన మానవ జీవిత విధానంతో రాజకీయ జీవితాన్ని సమన్వయ పరిచాడు రాయ్. సాంఘిక చైతన్యానికి భావచై తన్యాన్ని ప్రధాన ప్రాతిపదికగా గుర్తించిన రాయ్ ప్రజాస్వామ్య విధానం గోపీచంద్‌ను ఆకర్షించింది. గోపీచంద్ రాయ్ శిష్యుడయ్యాడు. ఆంధ్రరాడికల్ డెమోక్రాటిక్‌పార్టీకి ప్రధాన కార్యదర్శిగా కొంతకాలం పనిచేశాడు అప్పుడైనా పాక్షికమైనరాజకీయ దృష్టి కంటే సర్వతోముఖమైన వైజ్ఞానికదృష్టి ఆయనలో ఎక్కువగా ప్రతిబింబిస్తూ వుండేదని తెలుస్తుంది.

చివరకు గోపీచంద్ రాడికల్ రాజకీయాలనుంచికూడ తప్పుకున్నాడు. అందుకు ఏవో రకరకాలైన కథలు వినిపిస్తుంటై. వాటిలో కొన్ని చిలవలుపలువలు కూడా ఉండవచ్చు ననుకోండి.

ఏమైనా రాడికల్ డెమోక్రాటిక్ పార్టీకి దూర మైన గోపీచంద్ యే యితర రాజకీయ పార్టీనికాని కావిలించుకోకుండా జీవితాంతం పార్టీరహితంగానే వుండిపోవడం గమనించదగ్గ విషయం. రాడికల్ డెమోక్రాటిక్‌పార్టీ 1948లో రద్దయి, రాడికల్ హ్యూమనిస్టు ఉద్యమస్వరూపాన్ని ధరించి,పార్టీరహిత రాజకీయవిధానాన్ని చేపట్టి, ఒక రకంగా గోపీచంద్ ఆచరణతో శ్రుతికలపడం తమాషాగానే తోస్తుంది. ఈ సందర్భంలో గోపీచంద్ ఆచరణ అవ్యక్తం, అనాలోచితం అనవచ్చు కొందరు అది పూర్ణసత్యం మట్టుకు కాదు.

రాయ్ పరిధినుంచి దూరమవుతూ వచ్చిన గోపీ చంద్‌ను కొంతకాలం ఒకరకమైన నిస్తబ్ధత ఆవ రించినా—ఆయన క్రమేణా అరవిందునివైపు మొగ్గుతూ వచ్చాడు. చివరకు అరవిందుని శిష్యుడయ్యాడు.

అరవిందుని అడుగుజాడల్లో—గోపీచంద్ ఊహా ప్రధానమైన తత్త్వజ్ఞుడు (Speculative Philoso pher) గా ప్రాచీన భారతీయ వేదాంతులకోవలోపడ్డాడు. తన ఊహలను సమర్థించుకోడానికి ఆధునిక విజ్ఞా నాన్ని కొంతవరకు ఉపయోగించుకునేవాడు జీవపరి ణామ సిద్ధాంతాన్ని చాలావరకు ఒప్పుకునేవాడు. అయితే ఈ పరిణామం యే మెట్టువరకువచ్చి ఆగి పోయిందని శాస్త్రజ్ఞులు భావిస్తున్నారో, ఆ మెట్టును మట్టుకు ఆయన ఒప్పుకునేవాడుకాదు, ఆమెట్టు దాటిందనేవాడు. మానవుని బుద్ధిలో పరిణామం ఆగి పోలేదనీ, అతనిలో అతీతమానసిక ప్రవృత్తి

(Super-conscious State) ప్రాదుర్భవించిందనీ, అలాంటి అతీతబుద్ధిని కొన్నిసాధనలద్వారా క్రమేణ వికసింప చేసుకోవచ్చుననీ, గోపీచంద్ విశ్వ సించేవాడు

మనకు గోచరించే భిన్నరూపకమైన ప్రకృతి వెనక ఏకత్వం ఉన్నదని నమ్మలేకపోవడం గోపీ చందుకు వింతగా తోచేది. భిన్నత్వంతో ప్రకాశించే ప్రకృతి యావత్తూ ఏ 92 మూలకాలతోనో నిర్మాణ మయిందంటే నమ్మాం ఇవ్వాళ ఎలెక్ట్రాన్, ప్రోటాన్ లాంటి కొన్ని అంశాలతోటే ఈ మూలకాలుకూడా తయారవుతున్నాయంటే నమ్ముతున్నాం. రేపు ఈ అంశాలుకూడా ఒకే ఒక అంశమూలంనుంచి నిర్మాణ మైనవేనని శాస్త్రజ్ఞులు కనిపెట్టకూడదని నమ్మకమా? జ్ఞానార్జనకు వినియోగపడుతూ వచ్చిన పలుపద్ధతులలో శాస్త్రపద్ధతి ఒకటి. విభజించిచూచి శాస్త్రపద్ధతికి భిన్నమైన యోగపద్ధతితో ప్రాచీన మహర్షులు భిన్న త్వంలో ఏకత్వాన్ని దర్శించారంటే యెందుకునమ్మరు? ఇలా వాదించేవారు గోపీచందు

శాస్త్ర పద్ధతికన్నా యోగపద్ధతి పరిపూర్ణమైనదైతే నేటి భౌతిక జీవశాస్త్రాదులు వెలువరించిన చిన్నచిన్న ప్రకృతి రహస్యాలుకూడా ఒక్క యోగికైనా ఎందుకు తట్టలేదని ప్రశ్నిస్తే గోపీచంద్ కొంచెం బాధపడే వారు. అవ్యక్తం, ఉపబుద్ధి, బుద్ధి-వీటిలో పై మెట్టును గ్రహించగలదేమోకాని, క్రిందిమెట్టు, పైమెట్టును పసికట్టటం సాధ్యమా? మరి క్రిందిమెట్టు అయిన బుద్ధితో పైమెట్టయిన అతీత మానసిక ప్రవృత్తిని యెలా తెలుసుకోగలుగుతున్నారని ప్రశ్నిస్తే కొంచెం గాబరాపడేవారు. ఉపబుద్ధికి వాసన (Instincts) లుంటై, అవి సంకేతాల (Symbols) రూపంలో ప్రకటితమవుతాయి. బుద్ధికి భావాలుంటై, అవి మాటల రూపంలో ప్రకటితమవుతాయి. మరి అతీత బుద్ధికి ఏమివుంటాయి? అవి యెలా ప్రకటిత మవుతాయి అని ప్రశ్నిస్తే కంగారుపడేవారు.

గోపీచంద్ తన వాదాన్ని భౌతికవాద భావ వాదాల సమన్వయ దృక్పథంగా చెప్పేవారు దాన్ని సమర్థించుకోవడానికి తర్కాన్ని, యుక్తిని సమయో చితంగా ప్రయోగించేవారు అయితే వాదనలో మరీ మొండితనం చూపేవారుకాదు, ఎదుటివాదం బలంగా వుండే సందర్భాలలో- "ఆ విషయంలో నేనింకా ఒక నిర్ణయానికి రాకుండా ఆలోచిస్తాను మీరుకూడా ఆలోచించడానికి ప్రయత్నించండి" అనేవారు, అంతే కాని వాదననుంచి తప్పుకోడానికి చూచేవారేకాదు. ఎన్ని గంటలైనాసరే చర్చలలో యెదటివారికి తగి నంత అవకాశమిస్తూ జిజ్ఞాసా దృష్టితో ఉత్సాహంగా వాదించేవారు

గోపీచంద్ ఆలోచనాక్రమం, అకాల మరణంతో ఆగిపోయింది. కొంతకాలంపాటు ఆలోచించే అవ కాశమున్న మనం ఉన్నాం ఆలోచనపట్ల ఆయన చూపుతూవచ్చిన కుతూహలాన్ని మనంకూడా అందు కుంటే నష్టమేముంది? నష్టంలేదు సరికదా, ఈనాడు ప్రప్రథమంగా అవసరమైన భావప్రసర్వికాస ఉద్య మానికి కొంత చేయూత యిచ్చినవాళ్ళం కాగలుగుతాం. హృదయపూర్వకంగా గోపీచందును గౌరవించిన వాళ్ళమూ అవుతాం.

# భావోపజీవి

**శ్రీ జాస్తి జవహర్‌లాల్**

గోపీచంద్ భావుకుడు. ఆలోచనాపరుడు. అతని రచనలు చదివినవారి కెవరికయినా తెలుస్తుంది— "గోపీకి ఆలోచన లెక్కువనీ, ఆలోచనలు ఎక్కువై చెడిపోతున్నాడని తండ్రి అన్నాడనీ" అలాగే ఆలోచించటం ఎప్పుడూ మానలేదు మానివేస్తే పీ పీ అయ్యేవాడుగదా మరి! చనిపోయేవరకూ గోపీగానే ఉన్నాడుగాని పీపీకాలేదు. అందుకే ఆయన రచన లెప్పుడూ నిత్యనూతనంగానే ఉండేవి. చెప్పిందే చెప్ప టం ఆయన కలవాటులేదు. అసలు చెప్పేదే, చెప్పి చెప్పనట్లు చెప్పుతాడు అందువల్ల అత్యుక్తి దోషం లేకుండా రమ్యంగా ఉంటుంది ఆయన చెప్పదలచు కున్నది అక్షరాల్లో కళ్లముందు కనుపించకపోయినా కళ్లవెనుక మెదడులో మాత్రం కనబడుతుంది. తన రచనల్లో అంతవరకు ఏ రచయితా చూపని నిశితదృష్టి చూపించారు గోపీచంద్ ఎవరికీ స్ఫురించని ఆలోచ నలు, ఎవరికీ కనుపించని సత్యాలు ఆయన రచనల్లో కనుపిస్తాయి

గోపీచంద్ రచనలను భావాల దృష్ట్యా మూడు విధాలుగా విభజించవచ్చు. ఆయా కథల్లో చిత్రించ బడిన జీవితాన్ని బట్టిగాని లేక వివరించబడిన సమస్యని బట్టిగాని. అవి—(1) సంసారికలు (2) సాంఘి కాలు (3) రాజకీయ రచనలు అని మూడు రకాలుగా ఉన్నాయి.

గోపీచంద్‌కి సంసార జీవితం మీద శ్రద్ధ ఎక్కువ, ఏ వ్యక్తికయినా తన పరిసరాల్లో మొదటిది

(Immediate environment) కుటుంబం. దాని ప్రభావం ఉండక తప్పదు. రైతు బిడ్డగా ఆయన దృష్టి ఆ సినిమాలోనేగాక జోగయ్యమామ కథలో గూడా కనబడుతుంది. రైతన్నవాడికి పొలంమీద ఎంత 'మమకారం' ఉంటుందో తెలియని వాళ్లు ఆ కథ చదవటం అవసరం. రైతుపట్ల ఆపాటి సానుభూతి ఉంటే రాజ్యాంగానికి 17వ సారి చెయ్యబోయే సవరణ ఇప్పుడున్న విధంగా ఉండేదికాదు.

బఱ్ఱెకి మేత వెయ్యటం దగ్గర్నుంచి, మామా మేనమామల కలయికదాక గార్హస్థ్య జీవితం కనబడుతుంది ఆయన రచనల్లో

భార్యాభర్తల సంబంధం కుటుంబ జీవితానికి పునాది. అలాంటి సంబంధాన్ని గురించి నేటి సంఘంలో ఎలాంటి నియమాలు ఉన్నాయి. కుటుంబ జీవితం సరిగా లేకపోవటమంటే మగవాడికి సంతృప్తి లేకపోవటమే స్త్రీ సంతోషం లెక్కలోకిరాదు ఏ కారణమయినాగానీ 'భార్యల్లోనే వుంది' అంటారు భర్తకనుగుణంగా భార్య చచ్చినట్లు మారాలి. భార్య భర్తని మారమని చెప్పకపోగా కనీసం తన పురోగమనంలో భార్యని గూడా తనతోపాటు తీసుకు వెళ్ల వలసిన బాధ్యతగూడా భర్తకి లేకుండా చేసింది సంఘం తనతోపాటు రాలేదు గనుక, తాను పురోగమించాలి గనుక ఈ భార్య అనేది తనకొక బరువయిందనటం పరిపాటి ఇదంతా 'స్వయంకృతం' అనుకుని పశ్చాత్తాపపడటం అలవాటు. ఇన్నీచేసి భార్యకి విశిష్టస్థానం ఉందని ఉబక వేస్తారు. "కన్నీటిచుక్క ఊరేస్థలాన్నుంచి పడే ప్రదేశం వరకూ వర్ణిస్తారు." భార్య లేచిపోతే ఏడవటం బ్రతకలేక గాదు—పరువు పోయిందని. ఆడదాని అవసరం అంతవరకే!

ప్రేమించి పెళ్లిచేసుకోవటం తప్పుకాక పోవచ్చు. కాని అది ఒక్కొక్కసారి సుఖవంతం కాక పోవచ్చు'. ఒక ఉద్రేకంలో ఉన్నప్పుడు ఏదో ఒక విషయంలో నచ్చటాన్ని ప్రేమగా భ్రమించటమే ఇందుకు కారణం. ఆ ఉద్రేకం తగ్గగానే అసలు రంగు కనపడి, నిరుత్సాహం పెరిగి, అసహ్యంగా మారుతుంది ఒకవేళ ఆ ప్రేమించినవాడు ఏ కారణం చేతనయినా అందకపోతే, ఖర్మకాలి ఇంకొకణ్ణి చేసుకోవలసివస్తే దొరకని ప్రియుణ్ణి నిత్యమూ తలుచుకుంటూ, కట్టుకున్న మొగుణ్ణి నిర్లక్ష్యం చెయ్యటం అలవాటు. అది నిజమైన ప్రేమకి నిదర్శనం గనుక గర్వకారణంగూడా అవుతుంది. ఆ కట్టుకున్నవాడు కార్యశూరుడయితే ఆ ప్రియుణ్ణి ఒక్కసారితెచ్చి అసలురంగు చూపించి వదిలివేస్తాడు సమస్య తీరిపోతుంది

సంఘం దైవత్వంగా భావించి ఆరాధించే వాటిని గురించి విమర్శ రాయటానికి కొంతసాహసంగూడా కావాలి. 'మాతృప్రేమ' లోని అవివేకాన్ని 'పతివ్రత అంతరంగికా'న్ని చిత్రించటానికి అదిముఖ్యం.

స్త్రీవిద్య, స్త్రీ స్వాతంత్ర్యము తక్కువగనుక 'భార్యాభర్త'ల మధ్య మానసిక పరిణామంలో భేదం కనబడుతుంది భావోద్రేకం పెరిగి ఒకరికొకరికి పడకపోతే ఏంజరుగుతుంది? భర్త విడిచిపెట్టి వెళ్తాడు. భార్య ఏం చేయగలుగుతుంది? 'త్యాగం' అంతకంటె ఇంకేం చెయ్యలేదు ప్రేమించి పెళ్ళిచేసుకున్న భార్య, తనను విడిచిపోయిన భర్త ఇంకొక స్త్రీతో కాపురం చేస్తుంటే, అనగలిగిందేమిటి? "మీకెప్పుడయినా ఏదయినా సహాయం కావలసివస్తే—ఇతరులనుంచి తీసుకునే బదులు నానుంచే తీసుకోండి"అని

"ఇంగ్లండు వ్యాపారానికి ప్రసిద్ధి.
ఫ్రాన్సు విలాసవతులకు ప్రసిద్ధి.
జర్మనీ సైన్యాలకు ప్రసిద్ధి.
భారతదేశం పతివ్రతలకు ప్రసిద్ధి..."

శ్రీ జాస్తి జవహర్‌లాల్

ఇంతాచేస్తే పాతివ్రత్యం ఒక గొప్పతనం అని ఒప్పుకుంటే అది ఆడవాళ్లది — అందులోనూ పెళ్లయిన ఆడవాళ్లది। మరి మగవాళ్ల గొప్పతన మేమిటి? — "పాతివ్రత్యాన్ని కాపాడటం।" (హిందూ పాతివ్రత్యం) ఈ బాధ్యత తన భార్యపట్లనే గాదు కనపడిన ప్రతి స్త్రీ పాతివ్రత్యాన్నీ కాపాడ వలసిందే. స్త్రీ వచ్చి, సినిమాకి తీసికెళ్లి 'సంపెంగ పువ్వు' చేతికిచ్చినా అర్థం చేసుకోలేని అరసికులు

ఈ లోపం పురుషుల్లోనే ఉన్న దనుకోవటానికీ వీల్లేదు. స్త్రీలుగూడా అంతే। తమపట్ల పురుషులకేదో బాధ్యత ఉన్నట్లు మాట్లాడతారు తమ మానం కాపాడ టం పురుషుల పనే నన్నట్లు ప్రవర్తిస్తారు "చంక చేతుల జాకెట్లు, కంటి మెడల జాకెట్లు" వేసుకుని నవ నాగరికులమనుకునేవాళ్ళయినా ఇంతే। రైల్లోకి పుస్తకాలమ్మేవాడు వచ్చి ఏదో పాటలుపాడుకుంటే, అవి తనను గురించేననీ, ఏమగవాడూవచ్చి వాణ్ణినోరు మూయించలేదనీ నిందిస్తారు. ఆ అనేదేమిటో ఇత రుల్నినే బదులు ఆపాదేవాడినే ఎందు కనలేరు? తమ కవసరమయినచోట మగవాళ్లమీద ఆధారపడటమూ, అవసరంలేనిచోట నిందించటమూ స్త్రీల స్వతంత్రతకీ, అభివృద్ధికీ గుర్తులయినవి

మనసంఘం మగసంఘం గనుకగానీ ఆడసంఘం అయితే ఇప్పుడు స్త్రీలు పడేబాధ అప్పుడు పురుషులు పడవలసి వచ్చేదని కందుకూరి వీరేశలింగంపంతులు గారెప్పుడో చెప్పారు. కాని ఒక సంఖ్యాబలంతోనే గాక, తాత్త్విక దృష్టితో చెప్పాడు గోపీచంద్. ఇప్పుడు స్త్రీలు అందమంతా తమదే నను కున్నట్లు అప్పుడు పురుషులు అలా అనుకుంటారు

"స్త్రీలకు సౌందర్యం ఉంటుందా। అదిప్రకృతి విరుద్ధం. స్త్రీలల్లో సౌకుమార్యపు నీడలుచూచి సౌందర్యమని భ్రమపడుతారు కొందరు. అసలు సౌందర్యం పురుషులదే" అన్నాడు పురుష పుంగవుడు

"పోనీలెండి పురుషులకంతవరకయినా తెలిసింది అసలు సౌందర్యమనేది ప్రపంచంలో లేదని వాళ్లకింకా తెలియదు. నిన్నగాక మొన్ననేగా వాళ్లు కళ్లుతెరి చింది" అంది అందమయిన ఒకఅమ్మాయి 'ఆడ మగయాళం'లో 'సౌందర్యం' అంతేనేమో।

బిచ్చగాళ్లు సంఘానికీ ప్రభుత్వానికీగూడ ఇప్పుడొక సమస్య అయ్యారు ప్రతివాళ్లూ ఎప్పుడో ఒకసారి బిచ్చ గాడి సంబోధనలకు గురిఅయిన వాళ్లే। ఒక్కొక్కసారి జాలికలుగవచ్చు విసుగుపుట్టవచ్చు. లేదా అసహ్యం కూడా కలుగవచ్చు వాళ్లకేదో పారేసి 'పీడవిరగ డయిం'దని సంతృప్తిపడటమో, లేక 'దానంచేశా' మనుకుని గర్వపడటమో చాలామందిమి చేసేఉంటాం. కాని ఈ 'భూతదయ' ఒక్కొక్కప్పుడు ఎంత అనర్థాలకు దారితీస్తుందో చూపటానికి బిచ్చగాళ్లే నిదర్శనం అడుక్కుని సంపాదించిన దానితో కల్లు తాగి ఆనందించటం అసామాన్య విషయంకాదు కన్న బిడ్డల కళ్లు పొడిచి, అడుక్కురావటం ఒక విద్యగా నేర్పింపే వాళ్ళుగూడా ఉన్నారనటం అతిశయోక్తి గాదు అంటే అడుక్కు తినటం అనేది ఒక వృత్తిగా మారినట్లేగా? "వృత్తిగా ఎందుకయింది? తనలాంటి మూర్ఖులున్నారు. ఆత్మ సంతృప్తికోసం ఈ కులాన్ని సృష్టించారు ఆత్మానందాన్ని పోషిస్తున్నారు" ఇది అన్ని సందర్భాలలోను సరికాకపోవచ్చు. కాని ఒక సాంఘిక సత్యం పాతివ్రత్యాన్ని పోషించినట్లుగానే, అడుక్కు తినటాన్నిగూడా పోషిస్తుంది సంఘం।

'గీతాపారాయణం' చేస్తూ భగవద్భక్తుల మనుకుని సంతృప్తిపడే వారిలో ఉన్న పిరికితనమూ, కాఠిన్యమూ, ఇంద్రియాలను నిగ్రహించుకుని 'స్వయం పాకం'తో కృత్రిమ జీవితం గడిపేవారి చిత్త

చాంచల్యమూ గోపీచంద్ రచనల్లో నగ్నంగా కనపడతాయ్.

సంఘంలో సంక్రమణ (Heredity) అనే ఒక వ్యవస్థ ఉంది తలిదండ్రులనుంచి ఆస్తిపాస్తులు, చదువు సంస్కారాలు మాత్రమేగాక సంఘంలో ఒక స్థానంగూడా బిడ్డలకి సంక్రమిస్తుంది. ఇవన్నీ మొదటినుంచీ లేకపోయినా, ఇవిలేకపోతే బ్రతకటం ఎలాగో నాగరికుడికి తెలియదు. ఆస లా స్థితిని ఊహించుకుంటేనే 'భయం' కలుగుతుంది అవేమీ లేకుండానే బ్రతికేవాళ్ళుగూడా ఉన్నారంటేనూ, వాళ్ల జీవితంలోగూడా సంతోషమూ, సంతృప్తీ ఉన్నా యంటేనూ ఆశ్చర్యమూ, అసూయా కలుగుతాయి.

గోపీచంద్ తన రచనల్లో మానసిక భావాల కిచ్చిన ప్రాధాన్యత, ఆర్థిక దుస్థితుల కివ్వలేదని అనటానికి వీలులేదు "దారిద్ర్యం అనేక అనర్థాలకు పుట్టినిల్లు అసుర ప్రవృత్తికి ఆకరం. మనస్సుని చిందరవందర చేసి మానవునిలో ఉన్న నీచత్వాన్ని బయలుపరచి వేస్తుంది. జ్ఞానం కలిగితే దృష్టి మారుతుందనీ, విశాలమయిన భావాలు కలిగి జీవితం బాగుపడుతుందనీ కొందరు చెపుతారు. కాని గర్భదరిద్రులకు జ్ఞానం కలిగేది ఎలా?'' అన్నాడు గోపీచంద్. ఆర్థిక పరిస్థితుల్నీ, ఆ పరిస్థితుల్లో 'విరిగిన మనసు'ల్నీ గోపీచంద్ గుర్తించకపోలేదు. ఇప్పుడు సంఘాన్ని ఉన్నవాళ్లు, లేనివాళ్ల అని రెండుగా విభజించి చూడటం కొందరికి అలవాటు ఈ భేదాన్ని మొదటగా కనిపెట్టి చెప్పినవాడు గూడా, ఆ సిద్ధాంతంవల్ల మానవుడి దృష్టి ఇంత కుంచించుకుపోతుందని అనుకుని ఉండడు. 'పీడిత హృదయా'లకు 'ఉన్నవాళ్లు, లేనివాళ్లు' అనే సిద్ధాంతం ఎంత ఆకర్షణీయంగా ఉంటుందో అందరికీ తెలుసు. ఉన్నవాళ్ళమీద ద్వేషం సిద్ధాంతంగా మారి స్వంత ఆస్తు లుండగూడదన్నదాకా వచ్చింది. తనేదో సిద్ధాంతంకోసం త్యాగం చేస్తున్నాననుకుని 'పిత్రార్జితం' విసర్జించటం, భార్యా బిడ్డల్ని గాలికి వదలటందాకా వచ్చింది తన విప్లవానికి అదేదో ఒక 'అడ్డు' అయి నట్లు, తన తండ్రి తనకేమీ ఇచ్చి ఉండకపోతే ఇంకా తాను పొడిచేసి ఉండేవాణ్ణని చెపుతాడు అస లేమీ లేకపోతే ఈ సిద్ధాంతాలు, రాద్ధాంతాలు ఉండవు. దొరికింది తిని, దొరకని దానికోసం వెదకటంతోనే సరిపోతుంది. ఏ తండ్రీ, ఏ కొడుక్కీ ఏమీ ఇవ్వ కుండా ఉంటే-ప్రతి ఒకడూ ఒక విప్లవ వీరుడవుతా డన్న మాట! అప్పుడు విప్లవానికి అర్థము, ఆదర్శము గూడా మారిపోతయ్యేమో తెలియదుమరి బ్రహ్మచారి తండ్రి బ్రహ్మచర్యం అవలంబిస్తే ఏమవుతుంది? ఆర్థిక రంగంలోగూడా జరిగేది అంతేనేమో!

కార్మికులచేత పని చేయించుకుంటున్నారు గనుక కామందులు వాళ్లని పీడించుకుతిన్నట్లయింది. కార్మి కులు ఆకలితోమాడి పోతున్నారు గనుక వాళ్లు అధి కారంలోకి రావాలంటారు. ఆకలితో ఉన్నవాడికి అధి కారం ఎందుకు? అన్నం దొరికే మార్గం వెదకరాదూ? అడుక్కునే వాడికి సూక్తిముక్తావళి వినిపించి వెళ్ల మనరాదూ? "ఆకలి అర్హత నిస్తే అందరికీ అన్నం కావాలనటం ఎందుకూ?'' అన్నాడు 'అసమర్థుడు' సీతారామారావు గూడాను. ''అసమర్థుడు గనుకనే ఆ ప్రశ్న వేశా''డనే సమర్థులు ఆ ప్రశ్నకి సమాధానం చెప్పుకోవటం అవసరం.

ఈ రాజకీయాల్లో ఇంకొక విచిత్రం ఉంది. అందరూ అన్ని సిద్ధాంతాలూ చెప్తారు వాళ్లల్లోవాళ్లకి భేదం ఎక్కడో వాళ్లకే తెలియదు. ఒకటి 'వాయు దేవుడి గాలిపటం' అయితే ఇంకొకటి 'గాలిదేవుడి వాయుపటం' అంతే తేడా! ఎవరేది చేసినా ఎవరేది చెయ్యకపోయినా 'ప్రజాసామాన్యం' కోసమేనంటారు. ఉపన్యాసం ఇచ్చినా, ఊకదంపుడు దంచినా ప్రజా

శ్రీ జాస్తి జవహర్‌లాల్

సామాన్యం కోసమే నంటారు. ప్రతివాడూ ప్రజా సామాన్యం కోసమే పాటుపడుతున్నట్లు మాట్లాడుతాడు 'ప్రజా సామాన్యం'లో ఎక్కడుంది ఈ ఆకర్షణ? ''అదేం అప్సరసా?...డబ్బున్న వితంతువా?'' అసలీ 'ప్రజాసామాన్యం' ఎక్కడుంది? అదొక అద్దాలమేడ అన్నాడు గోపీచంద్...

—''అన్నీ అద్దాలే!''

''అదే ప్రజా సామాన్యం''

''బొమ్మలన్నీ నాలో లీనమయినయ్''

''నువ్వే ప్రజాసామాన్యం''

''మ రంతా అలా అంటారేం?''

''వాళ్లే ప్రజాసామాన్యం''—

మరి తాను తప్ప తక్కిన వాళ్లంతా 'ప్రజా సామాన్యం' అయినట్లు మాట్లాడతాడేం ప్రతివాడూ? అదొక ''వంక''. అంతే' మరి 'దేశం ఏమయ్యేట్టు?'

రాజకీయాలని, పార్టీలనీ ఇలా ఏకాడు గనుక 'మార్పు' అంటేనూ, విప్లవంలంటేనూ గోపీచంద్‌కి ఇష్టం లేదని అనగూడదు దినగండంగా గడిచే బ్రతుకుల్ని ఉద్ధరిస్తానంటే ఎవరు కాదంటారు? చెమటోడ్చి పనిచేసినవారికి ప్రతిఫలం దక్కాలని ఎవరనరు కాని ఎలా చేయటం? ఏదో విప్లవంలేపాలని శ్రమజీవుల్నంతా పోగుజేసి, రక్తం ఉడికించి నూతన వ్యవస్థ అనే ఆశ చూపించి కామందుమీదికి పంపితే ఏమయింది? 'అది నా దగ్గర లే'దన్న ఒక్కమాటతో అంతా తుస్సుమంది. ''ఇలా జరిగేను!'' అని భయపడ్డాడు గోపీచంద్ ''బీదవాళ్లంతా ఒకటి!'' కాని ఏంలాభం? పోలీసు రామయ్య తుపాకి కాల్చక తప్పుతుందా? ఆదిశేషు ప్రెస్సులో పనిచేయక తప్పుతుందా! ''ఏరోజు పనికివెళ్లకపోతే అరోజు పస్తే.'' సమ్మె లెన్నాళ్లు సాగుతాయ్?

''కూలివాళ్లు తిండిలేక చస్తున్నారు'' అన్నాడొక కామ్రేడ్.

''ఉపన్యాసాలిద్దాం...మీటింగు పెట్టించు.''

''...ఇంకానయం...భావ కవిత్వం రాస్తాననా''

''ఏం చేద్దామంటావ్?'' ''......''

''వారంరోజులు గడిస్తేచాలు ...అప్పటికి యజమానులు లొంగుతారు...''

''లొంగకపోతే?''

''మనం లొంగాలి''—అదీ సమ్మెల తరహా.

రాజకీయ సిద్ధాంతాలనూ, తత్వశాస్త్రాన్నీ కూలంకషంగా చదివినవాడు గోపీచంద్. ఆయన రచనలు ముఖ్యంగా మొదటి రోజుల్లోవి—ఏదో రచయిత కావటం కోసం రాసినవికావు. ఒక సమస్యని చిత్రించటం కోసమో, దృక్పథాన్ని వివరించటంకోసమో రాసినవి మురికి పేటలవాళ్లు తీరనికోర్కెలని తిట్లుగా మార్చి ఇతరులమీద రుద్ది సంతృప్తిపడటంలోనూ, భర్త చనిపోయాడని వినగానే స్మృతితప్పి పడిపోయిన పతివ్రత మనస్సులో అణిగిన కోర్కెలు విజృంభించటంలోనూ ఫ్రాయిడ్ సిద్ధాంతాల ఛాయలు కనబడతాయి

గోపీచంద్ చెప్పిన విషయమే ఇతరులు చెపితే అంత రమ్యంగా ఉండకపోవచ్చు ఆయన మాటల్లో జీవముంది సంభాషణల్లో చతురత్వం ఉంది. అవి ఉదహరించాలంటే ప్రతి కథలోనుంచీ కొంతరాయాలి. పతివ్రత కథలోని ప్రతి దృశ్యంలోనూ మాటలతో ఆట లాడించాడు. గోడమీది బల్లితోనూ, కోడిపెట్టలతోనూ సంభాషణలు నడిపించాడు ''కద్రంత్రొక్కే తురంగాల్లా'' నడిచినవి గోపీచంద్ సంభాషణలు. ఆయనకలం కత్తికన్నా పదును. ఆయనమాట ములుకుకన్నా వాడి.

ఆయన రచనలన్నీ ఒకఎత్తు. ''అసమర్థుని జీవయాత్ర'' ఒకటీ ఒకఎత్తు. తెలుగు సాహిత్యంలో అది సాటిలేని రచన, ఇతర సాహిత్యాల సంగతి నాకు తెలీదు. మొదటినుంచి చివరిదాకా అది ఒక ఝరీ ప్రవాహం (అందులో వర్ణించబడిన జీవితం ఒక నదీ ప్రవాహం) అసలా ప్రత్యేకత తండ్రిగారి కంకితమివ్వటంలోనే ఉంది. ''ఎందు'' కంటే ''ఎందుకనే ప్రశ్ననేర్పి నందుకు" అన్నాడు. ఆ 'ఎందుకు' లేకపోతే ఆ పుస్తకమేలేదు. అసలు తత్త్వశాస్త్రమేలేదు ఆ ప్రశ్న మీదనే అసమర్థుణ్ని గూడా నడిపించాడు. అన్నిటికీ ఎందుకు? అని ప్రశ్నించుకో మన్నాడు

...''విజ్ఞానంకోసం"

"విజ్ఞానం ఎందుకు?"

''ఆనందంకోసం''

''ఆనందం ఎందుకు?''

"సమాధానంలేదుగా నా తండ్రీ! ఈ ఎందుకు ఎక్కడోఒకచోట ఆగవలసిందే'' నన్నాడు అసమర్థుడు. కాని అది ఎక్కడ ఆగిందో, దాన్నిబట్టి మానవుని పురోగమనాన్ని కొలవవచ్చు.

''అసమర్థుని జీవయాత్ర" నవల కాదంటారు కొందరు. అంటే అది రచించటానికి అనుసరించబడిన విధానం, కథ నడచిన తీరు మామూలు నవలల్లో ఉన్నట్లు లేదని. ఒక్కొక్క అధ్యాయాన్ని విడదీసి వేస్తే అది కథగాదని ఎవరూ అనలేరు అది నవల కాదని అనే వారు గూడా అది ఉత్తమ రచన అని ఒప్పుకుంటారు గోపీచంద్ రచనల్లోనే గాదు. తెలుగు సాహిత్యంలోనే అది అత్యుత్తమ రచన! అది చదువుతున్నంతసేపూ హాస్యంగా కనబడుతుంది. కాని అది ఒకసారి నవ్వించి ఊరుకోదు కవ్విస్తుంది. మనసులో దూరుతుంది. ఆలోచనలు రేకెత్తిస్తుంది. సీతారామారావు ఏం చేశాడు? ఎందుకు చేశాడు? అతనిలో లోపం ఎక్కడుంది? అసమర్థుడెందు కయ్యాడు? అనే ప్రశ్నలకి సమాధానం చివరి అధ్యాయంలోగాని దొరకదు. రామయ్యతాత శ్రీ కృష్ణావతారంఎత్తి 'గీత' చెప్పాడు...కాదు...కాదు. శ్రీ కృష్ణుడే రామయ్య తాతగా అవతరించాడు చివరికి సీతారామారావు తనతో తానే యుద్ధం చేసుకుని, తనగొంతు తానే పిసుక్కుని, అర్ధరాత్రివేళ స్మశానంలో దిక్కులేని చావుచచ్చాడు. డొరియన్ గ్రే గూడా అలాగే తనతో తాను యుద్ధం చేసుకుని చచ్చాడు. అయితే అది అనుకరణంగాదు. ప్రేరేపణాగాదు. అతనిలా జీవించిన వాళ్ళు అతనిలా చావవలసిందే' సీతారామారావు తన జీవితంలో చేసిన ఏదో ఒక పని, ప్రతివాడూ కనీసం ఎప్పుడో ఒక్కసారయినా చేసి ఉంటాడు. కాని అన్నీ అలాగే చేయలేదు. అందుకే బ్రతికిపోయారు. ప్రతి మనిషిలోనూ భగవదంశ కొంత ఉన్నదనీ, ప్రతి పురుషుడిలోనూ స్త్రీత్వం గూడా కొంత ఉన్నదనీ అంటుంటారు. సీతారామారావు అంశ గూడా కొంత ఉన్నదనే అంటాను. తప్పేమిటి?

రచనల దృష్ట్యా చూసినప్పుడు గోపీచంద్ జీవితాన్ని రెండు దశలుగా చూడవచ్చు రాయిస్టుగా ఉన్నంత వరకు మొదటి దశ. తరువాతి కాలమంతా రెండవ దశ మొదటి దశలో ముఖ్యంగా కథలు రాశాడు. 'పరివర్తన' 'అసమర్థుని జీవయాత్ర' అనేవి రెండు మాత్రం నవలలు. రెండవ దశలోగూడా కథలు రాశారు గాని ముఖ్యంగా నవలల మీద దృష్టి కేంద్రీకరించటం జరిగింది. రచనా విధానంలో రెండు దశల్లోనూ తేడా స్పష్టంగా కనపడుతుంది. మొదటి దశలో కథావస్తువుకంటే భావానికి ప్రాధాన్యత ఎక్కువ. సస్పెన్సూ, క్లయిమాక్సువంటి వాటిని గురించి లక్ష్యం చెయ్యలేదు. రెండవ దశలో కథా

శ్రీ జాస్తి జవహర్‌లాల్

వస్తువుమీద, పాత్ర చిత్రణమీద ప్రాధాన్యత ఎక్కువయింది అంటే ఒక దశలోని రచనలు, ఇంకొక దశలోని రచనలకంటె ఉత్తమమయినవని నా ఉద్దేశ్యం గాదు. రెంటికీ ఉన్న తేడా నేను గమనించినంత వరకూ చెపుతున్నాను, అంతే. మొదటి రచనల్లో సంభాషణల కున్నంత ప్రాధాన్యత తరువాతి వాటిల్లోలేదు.

మొదటినుంచి, రెండవ దశకి గోపీచంద్ మారటం అనేది ఒక చిత్రమయిన మార్పు. మొదట నాస్తికుడు. తరువాత ఆస్తికుడు. ఇలా నాస్తికత్వంనుంచి ఆస్తికత్వంలోకి మారినవారు చాలా అరుదు "గోపీచంద్ తిరోగమిస్తున్నాడు" అన్నారు నాస్తికులు. "కాదు గోపీచంద్ పురోగమిస్తున్నాడు ఇప్పటికయినా నిజం తెలుసుకున్నాడు" అన్నారు ఆస్తికులు. ఎవరి ఉద్దేశ్యం వారిది గోపీచంద్‌లో ఈ మార్పు ఎందుకు జరిగిందనే విషయం చర్చించదలచుకోలేదు. అది వ్యక్తిగత విషయం. ఎవరికుండే నమ్మకాలు. కారణాలు వారికున్నవి. కాని ఆ మార్పువల్ల ఆయన రచనావిధానంలోగూడా మార్పు వచ్చిందనిమాత్రం గమనించాలి మొదటి రచనల్లో వున్నంత వాడి, తరువాతి రచనల్లో లేదు మొదటివి విమర్శనా దృష్టి కలిగించేవి. తరువాతివి. వివరణా దృష్టి కలిగించేవి. మొదటివి నిర్వివాదంగా ఉత్తమ రచనలు. కాని తరువాత రచనలగురించీ, పాత్రలగురించీ, నైతిక విలువలుగురించీ కొన్ని వివాదాలు బయలుదేరాయి అంటే అంతమాత్రాన అవి ఉత్తమరచనలు కాదనటంకాదు కాని విభిన్న వాదాలకు తావునిచ్చిన వాటికంటే, నిర్వివాదంగా అంగీకరించబడినవి ఉత్తమ రచనలు కావా ?

'అసమర్దుని జీవయాత్ర'లో అడుగడుగునా తాత్త్విక దృక్పథం కనపడుతుంది. కాని, అందులో దేవుడనేమాటలేదు. అదే 'మెఱుపుల మఱకలు'లో చూడండి. కథానాయికలో చలనం ఉంది అదిచపల చిత్తం అనుకోండి మరేమయినా అనుకోండి. స్థాణువుగాదు. జీవం ఉంది. Dynamism అంటారే- అదిఉంది ఆమెలో. నీతి, అవినీతి అనే నియమాలను విస్మరించి కలిగిన కోర్కె-తీర్చుకుంది. అలాంటి వ్యక్తి హిమాలయాలను చూడగానే సర్వసంగ పరిత్యాగినియై ఆశ్రమంలో చేరా లనుకుంటుంది. చేరిపోతుంది ఎందుకని? ఆమెనీతిగానే జీవించాలనుకున్నది గాని సంఘంలోని ఆకర్షణలవల్ల వీలుపడలేదనీ, హిమాలయాల్లోని ఆశ్రమంలో ఆమె తనకు సరిపడిన వాతావరణాన్ని పొందిందనీ అనటం-ఆ పాత్రకూ రచయితకూ కూడా అన్యాయం చేసినట్లవుతుంది. మరి ఎందుకు మారిపోయింది ? 'కొందరు అంతే'నంటారు అది సరయిన సమాధానం కాదు అలా చెప్పటంలో వాళ్లఉద్దేశ్యం కొందరు extremes లోనే ఉంటారని కాని ఆ చివరినుంచి ఈచివరికి గెంతటానికి ఏదో ఒకకారణం ఉండాలి కారణంలేకుండా జరగదు. ఈ కథానాయికలాంటి Passionate పాత్రలలో అసలు జరగదు. 'చలం'లాటి వ్యక్తులను ఉదాహరణగా చూపించవచ్చు కొందరు-అంటే అలాంటి మార్పులో సహజత్వం ఉన్నదని చెప్పటంకోసం. కాని 'చలం' తనగత జీవితాన్ని మరిచిపోయి, వేరే జీవితం గడపాలనీ, ఆధ్యాత్మిక చింతనలో జీవితంగడపాలనీ నిర్ణయించుకున్న తరువాత రమణాశ్రమంలో చేరటం జరిగిందిగాని, రమణాశ్రమాన్ని చూడటం వల్ల అలా మారిపోయా డనటం సబబుకాదు. ఒకవేళ 'నే నందుకే మారా'నని చలంచెప్పినా నమ్మగూడని విషయం అది. అంతకుముందు మాత్రం ఆశ్రమాలున్నాయనీ, దేవుడున్నాడనీ నమ్మి ఆరాధించే వాళ్ళున్నారనీ తెలియదా చలానికి? తెలుసు. తాను ప్రచారం

చేస్తున్న సిద్ధాంతంలో, జీవిస్తున్న విధానంలో నమ్మకం సడలింది. ఏ కారణంచేత ననేది వేరు విషయం. పునరాలోచన కలిగింది. అలాగే ఈ కథానాయికలో గూడా గత జీవితంమీద విరక్తి కలిగిందనిగాని, తన అవినీతికి పశ్చాత్తాపపడుతున్నదనిగానీ రచయిత చెప్పలేదు. ప్రశాంతత కోసమే అయితే ఆశ్రమంలో చేరి భజనలు చేయటం జరగదు. భజనలు చెయ్యటం ప్రశాంతతకు చిహ్నంకాదు. మరెందుకు మారింది? ప్రశాంతమైన, గంభీరమైన హిమాలయాలను చూస్తే దేవుడెందుకు గుర్తురావాలి? అలాంటివి చూస్తే మనలో కలిగేది Aesthetic sense అప్పుడు దేవుడు గాని, మనుషులుగాని, మన మనసుల్లో ఉండరు. మనసులో ఉదాత్తభావం కలుగుతుంది. ఆ భావం కలిగినప్పుడు ఆధ్యాత్మిక చింతనారాదు, భౌతిక చింతనారాదు సజీవమయిన ఒక పాత్రను ఈ కథా నాయికలో చూపించారు గోపీచంద్. కాని ఈ మార్పుకి తగినంత బలమైన కారణం నవలలో కను పించదు. ఇదంతా ఎందుకు చెపుతున్నానంటే రచయిత లోని మార్పు, రచనల మీద ఎలాంటి ప్రభావం కలి గిస్తుందో చూపించటానికి తన భావాన్ని పాత్రల ద్వారా చెపుతాడు రచయిత. తన సిద్ధాంతాన్ని రచనల ద్వారా నిరూపించటానికి ప్రయత్నిస్తాడు.

రెండవ దశలో వచ్చిన రచనల్లో ''మెఱుపుల మఱకలు''కి ఒక విశిష్ట స్థానంవుంది. కాని జనానా, గడియపడని తలుపులు మొదలైన వాటిలో గోపీచంద్ రచన పక్వంచెందినట్లు అనిపిస్తుంది. కథా వస్తువుతో పాటు, కథ నడిపిన తీరుగూడా, సస్పెన్సు క్లయిమాక్సు లతోసహా చదువరిని ఆకట్టి వేస్తాయి. రచయితగా గోపీ చంద్ తన కథల్లో కనుపించినంతగా తన నవలల్లో కనుపించడు. అందుకే ఆయన రచనల్లో కథలకున్న ప్రాధాన్యత నవలలకు లేదేమో ననిపిస్తుంది

చివరికి గోపీచంద్ పాత్రలనుగురించి కొంత చెప్పాలి. "నేనూ-నాపాత్ర'' అని గోపీచంద్ ఒక చిన్నపిట్ట కథచెప్పారు. "నా కథ మొదలుపెట్టి సాంతం రాయకుండా మధ్యలో వదలిపెట్టటం అన్యాయం'' అని ఫిర్యాదు చేసిందిపాత్ర. ''నేను నీ కథ రాయటం లేదు నీ జీవితంలోంచి నాకు కావలసిన సంఘటనల్ని తీసుకుంటున్నాను. అంతే. నీ కథ రాయించుకోవా లనుకుంటే చాలామంది ఉన్నారు వెళ్ళు'' అన్నాడు గోపీ బహుశా ఆయన పాత్రలనన్నిటినీ అర్థం చేసుకోవటానికి ఇవొక మూల సూత్రంగా ఉపయోగ పడవచ్చు ననిపిస్తుంది. కాని దానికి చాలా హద్దు లున్నాయి.

ఈ సూత్రం కథలకు వర్తించినంతగా నవలలకు వర్తించదు ఏవో కొన్ని సంఘటనలు తీసుకుని చెప్పేదికథ. నవలలో జీవితం చిత్రించవలసివస్తుంది, కనీసం జీవితంలో ఎక్కువ భాగం చిత్రించవలసి వస్తుంది చెప్పదలుచుకున్న విషయానికి ఏదో ఒక సంఘటన, లేక దృశ్యం ఆధారంగా తీసుకుంటే కథ అవసరం తీరిపోతుంది

నవలలో ప్రతి పాత్రకూ పాధాన్యం ఇచ్చి ఒక్కొక్క పాత్ర ఆధారంతో ఒక్కొక్క విషయం చెప్పవచ్చు లేదా ముఖ్యమైన ఒకపాత్ర జీవితాన్ని చిత్రించటానికి తక్కిన అన్ని పాత్రలనూ ఉపయో గించవచ్చు. అంటే ప్రతిపాత్రకూ ఒక వ్యక్తిత్వం ఉండవచ్చు లేదా ఒకేపాత్ర వ్యక్తిత్వాన్ని నిరూ పించటానికి తక్కినపాత్రలను వాడుకోవచ్చు తన పాత్ర లెలా ఉండాలనేది పూర్తిగా రచయిత ఇష్టమే. అయినా ఒక్కొక్కసారి చదువరికి "ఈ పాత్ర కన్యాయం జరిగింది" అని అనిపిస్తుంది అలా అనిపించే రచనకంటే, అనిపించని రచన మెఱుగై ఉండాలి. అలా అన్యాయం జరిగిందనిపించటానికి

శ్రీ జాస్తి జవహర్‌లాల్

కారణం అసహజమైన ఒక అసూయనో, జుగుప్సనో ఆ పాత్రకంటగట్టటం కావచ్చు లేదా ఆ పాత్ర వ్యక్తిత్వాన్ని పూర్తిగా చిత్రించక ఏదో అవసరమయిన ఒకటి రెండు సంఘటనలనో, మాటలనో చెప్పి ఊరుకోవటం కావచ్చు. 'సగం నిజం' చెపితే, సగం అబద్ధం చెప్పినట్లేననే విషయం ఇలాంటిచోట్ల స్పష్టంగా కనపడుతుంది.

అసలు జరిగిన సంఘటనలనీ, వాస్తవ అనుభవాలనూ (తనవిగానీ, ఇతరులవిగానీ) ఆధారంగా చేసుకుని రాయటం ఎంతవరకూ సమంజసం అనే విషయం గోపీచంద్ ఎక్కడో-'పోష్టు చెయ్యని ఉత్తరాల్లో' ననుకుంటాను-చర్చించినట్లు గుర్తు. రచనలో ఉటంకించబడిన సంఘటన రచయితకి తెలియకుండానే ఎవరి జీవితంలోనో జరిగిందంటే, దానికి రచయితని తప్పుబట్టలేము. పైగా రచనలోని సహజత్వానికి అదొక నిదర్శనంగూడా కావచ్చు. అలా కాక రచయిత తన అనుభవాలనుగానీ, తనకు తెలిసిన ఇతరుల అనుభవాలనుగానీ తీసుకుని రాయటంగూడా జరగవచ్చు. ఎలా తీసుకున్నా, రచయిత తన సృజనాశక్తిని చూపించటం అవసరం. లేకపోతే పుస్తకాల నుంచి కాపీగొట్టటం ఎలాగో, జీవితాలనుంచి కాపీగొట్టటంగూడా అంతే అవుతుంది. రచయితకి తన రచనలమీద 'కాపీరైటు' హక్కులన్నా ఉన్నాయిగాని, వ్యక్తికి తన భావాలమీద అలాంటి హక్కులేమీలేవు. (ఏదో దురుద్దేశంతో తనను గురించి రాశాడని నిరూపించగలిగితే తప్ప). అందువల్ల రచయితమీద నైతిక బాధ్యతలు ఎక్కువ. ఏ సంఘటనలనైనా తాను ఉపయోగించుకోవచ్చుగాని, అందుకు సంబంధించిన వ్యక్తుల నిజస్వరూపాన్ని నిజవ్యక్తిత్వాన్ని ప్రదర్శించాలి. తన కవసరమైన ఒక్క సంఘటనా అందుకు చాలకపోతే, ఇంకొక సంఘటనను కలపాలి. లేదా ఆవ్యక్తిని, ఆసంఘటన నుంచి వేరుచేయగలగాలి. వీటివల్ల రచనదెబ్బతినవచ్చు, పెరగవచ్చు కాని ఇది రచయిత నైతిక బాధ్యత గనుక తప్పించుకో గూడదు కాని ఏరచనలోనయినా ఈ బాధ్యత నిర్వహించబడిందో లేదో తెలుసుకోవటం ఏలాగు? రచయిత మనసే సాక్షి, లేదా ఆ అనుభవాలకు సంబంధించిన వ్యక్తులే సాక్షి.

ఒకవిధంగా చూస్తే పాత్రలజీవితంనుంచి తనకు కావలసినవి తీసుకోవటంవల్ల రచయిత పాత్రలకు ఋణపడిపోతాడు అలాకాక పాత్రలే తమనుసృష్టించినందుకు రచయితకు ఋణపడిఉంటే అది ఇంకా ఉత్తమ రచన కాగలుగుతుంది.

తెలుగు రచనల్లో గోపీచంద్ చాలా క్రొత్తదారులు చూపించాడు ''ఛందస్సుల సర్పపరిష్వంగం" వదిలిన కవిత్వం శ్రీ శ్రీ రాసినట్లు, సస్పెన్సులూ, క్లయిమాక్సులూ లేని కథలు రాసి అవిగూడా కథలేననీ, అందులోనూ ఉత్తమ కథలు కాగలవనీ నిరూపించాడు గోపీచంద్ కథ ఎక్కడ మొదలవుతుందో, ఎటు నడుస్తుందో, ఎక్కడ ఆగిపోతుందో ఎవరికీతెలియదు. తాను చెప్పదలుచుకున్నది అరటిపండు వొలిచినట్లుగా కాక, స్ఫురింపచేసి పాఠకులచేత ఆలోచింపచేయటం ఆయనపద్ధతి. అందువల్ల ఎక్కడో ఒకచోట చెప్పకుండా ఆగిపోతుంది కథ.

ఆయన జీవితంకూడా అలాగే ఆగిపోయింది...
'యమపాశం' మధ్యలోనే ఆయన్ని చుట్టివేసింది...

# లేఖలు

శ్రీ దోనేపూడి రాజారావు

గోపీచంద్ స్మారకోత్సవ సంఘం నిర్దేశానుసారం ఒక పరిధిలో నిలబడి ఈ రచన కుపక్రమించాను. 'లేఖలు-గోపీచంద్' ఇదీ నా విషయం. ఈ విషయాంతర్గతంగా అవటానికి రెండేరెండు పుస్తకాలు, ఆ రెంటివీ రెండు దారులు. ఒక దారి సమాజ సాపేక్షం, మరోది ఆత్మ సాపేక్షం. 'ఉభయ కుశలోపరి' లేఖలు సమాజ సాపేక్షంక్రిందకి వస్తాయి. ఇవి 1941 వ సంవత్సరం నాటి లేఖలు ఆనాటి దృష్టికోణం అదోతరకం సమాజ చైతన్యం, స్వాతంత్ర్యకాంక్ష, ఇవి రెండూ ఆనాటి భారతీయుల్ని వెంటేసుకొని కర్మ సిద్ధాంతానికే ఎదురు తిరిగాయి-జైళ్ళకే తీసుకుపోయాయి. స్వాతంత్ర్య కాంక్షతో జైళ్ళ నలంకరించిన వాళ్ళు ఎక్కువగా రాజకీయవాదులు. స్వాతంత్ర్య దృష్టికోణంతో ప్రాక్టికల్ వర్కు చేసింది నిజానికి రాజకీయవాదులు సమాజ చైతన్యాన్ని తత్కాలానికి ఉపేక్షించి, స్వాతంత్ర్య ధ్యేయానికే కట్టుబడి చివరకు కార్యసిద్ధి పొందిందీ వారే.

మొదటినుండీ సమాజ చైతన్యమే ప్రధానంగా సాహిత్య సృష్టి చేసుకుంటూ వచ్చింది రచయితల వర్గం. రచయితల వర్గానికి గోపీచంద్ ప్రతినిధిలాంటివాడు. 1941 నాటికే గోపీచంద్ మహా కథాస్రష్టగా-సమాజద్రష్టగా ప్రసిద్ధికెక్కాడు. ఆయన సమగ్ర అద్వైత-సత్యాన్వేషి కావడంవల్ల ఆయన సృష్టి-దృష్టులు, కర్మ సిద్ధాంతానికి దాసులమై బానిస సంస్కారం, బానిస నాగరికతల కలవాటుపడి ఉన్న మనమే శిక్షించు

కుంటున్న రోజుల్లో మన్ని సమాజ చైతన్యం-భావ సంశుద్ధికోసం పదేపదే హెచ్చరించారు ఆయన హెచ్చరిక ఎనాలిసిస్ లాంటిది-ఆయన మస్తిష్కం ఒక ఆకలిష్టు. ఆయన సమాజాన్ని దోచుకునే స్వార్ధ పరులు-పెత్తందారుల జీవిత రహస్యాలను సూక్ష్మాతి సూక్ష్మంగా అభివర్ణిస్తూ గ్రామజీవన పునరుద్ధరణకు తపనపడుతూ పునఃసహకారానికి సౌభ్రాతృత్వానికి తగినన్ని సూచనలు చేశాడు. ఈ సూచనలు ఉభయ కుశలోపరి పత్రశైలిలో తొలుత రేడియో ప్రసంగాల రూపంలో సాక్షాత్కరించాయి. అవి మొత్తం ఏడు ప్రసంగాలు. వీటి వస్తువు గ్రామ పరిస్థితులు. పరిస్థితుల్ని వ్యాసం-ఉపన్యాసం రూపంలో అభివ్యక్తీకరణ చేయవచ్చు. ఆ రూపంతో చూపెడితే ఈ రోజుల్లో చదివేదెవరు. వినేదెవరు? విషయాన్ని ఎలా చెప్పాలో ఎలా చెపితే లోకం మనోజ్ఞంగా వింటుందో-అది ఎంత కొత్తగా వుండాలో, గోపీచంద్‌కు బాగా తెలుసు.

జీవితంలో ఉత్తరాలకున్న స్థానం మరి ఏ యితర ప్రక్రియకు లేదనే చెప్పాలి ఉత్తరం మానవుణ్ణి కథ కంటే మిక్కుటంగా నమ్మించి హృదయానికి హత్తుకుంటుంది కథలో కొంత కల్పన వుంటుందని కొంత వరకే దాన్ని నమ్ముతాము. ఉత్తరం విషయంలో నమ్మరాని అంశం అంటూ వుండదు అది వొక హృదయంనుండి సుఖదుఃఖాలను రెండో హృదయానికి అందించే అనాసక్త దూత. ఉత్తరంయెడ చూపెట్టే ఆత్మీయత - గౌరవ - మర్యాదల్లో కొంత మర్యాద ఉత్తరాన్ని పంచిపెట్టే పోష్టుమాన్‌కూడా చూపెడతాము. అతనికోసం ఎదురుచూస్తూ ఉత్తరం రానినాడు విసుగుపడుతుంటాము. ఆత్మీయుణ్ణించి పరిస్థితులు తెలిసిన్నాడు విసుగునుండి బయట పడుతాం. ఉత్తరం వొక యథార్థం అందుకనే అదంటేమనకు అభిమానం. ఆ యథార్థం పత్రికల్లోని సంగ్రహ ప్రకటనల్లాంటిది. అది 'పాలసీపోయినది' 'ఉపాధ్యాయులు కావలెను' 'కనబడటంలేదు' 'టెండర్ నోటీసు' లాంటి యథార్థం ఇవన్నీ నమ్మే విషయాలు. ఉత్తరానికున్న సాక్ష్య బలం మనకు తెలిసిందే. ఇది అంత నమ్మదగ్గవస్తువు ఆ నమ్మకను రచయితలు సాహిత్యంలోకూడా ప్రవేశపెట్టారు.

పరిస్థితుల్ని కథారూపంలో చిత్రించడమనేది ప్రాచీన ప్రక్రియే తాను చెప్పదలచుకున్న విషయాన్ని మనోజ్ఞంగా చెప్పాలి-అది సూటిగా హృదయాన్ని స్పర్శించాలి. బాగా నమ్మకం కలిగించాలి. ఇది రచయితకు కావలసినవిజయం. పాఠకుడ్ని బాగా నమ్మించి దగ్గరగా చెప్పేటందుకు పత్రశైలిని రచయితలు వాడుతుంటారు వెన కెప్పుడో ముఫైనలభై ఏళ్ళక్రితం జవహర్‌లాల్ నెహ్రూ "చరిత్ర, నాగరికత, మతం, భాష, వ్యాపారం, పౌరసంబంధాల"లాంటి అరుచికరమైన విషయాలను ఉత్తరం రూపంలో రుచికరంగా-హృద్యంగా అభివర్ణించి, పుత్రిక ఇందిరకు అల్పకాలంలో విషయపరిజ్ఞానం కలుగజేసి, ప్రతిపాదిత విషయం యెడ అభిమానం జనింపజేశాడు. విషయాన్ని చరిత్రకారుని మాదిరిగా వ్రాసిపెడితే అది తలనొప్పిగానే వుంటుంది విషయాన్ని పత్ర విధంలో ప్రవేశపెట్టడంతో మరింత మనోజ్ఞత - ఆత్మీయతలు వచ్చి, రచయిత పాఠకుణ్ని నమ్మించి వశంచేసుకుంటాడు. లోకాన్ని ఎంతగా నమ్మించి వొప్పించేటట్లుగా వ్రాయగలిగితే రచయిత అంత ఆత్మీయుడై నిలచిపోయి అహర్నిశలు మనసులో మెదులుతుంటాడు. అందుకని రచయితలు అడుగడుక్కీ ఆశ్చర్యం - ఆనందం ప్రసాదించే శిల్పాన్ని ప్రవేశపెడుతూంటారు.

వస్తు సంస్కారం చైతన్యాలతోపాటు శిల్ప సంస్కారంలో సైతం చిత్రవిచిత్ర ప్రక్రియల్ని గోపీచంద్ ప్రవేశపెట్టాడు. గద్యశిల్పంలో ఆయనకు ఆయనేసాటి. ఎన్ని రకాలుగా కథా విన్యాసం చెయ్యొచ్చో అన్ని రకాలుగా గరిడీ తిప్పినట్టుగా వ్రాసి పెట్టాడు. కథను ఒక ద్రష్టగా – రిపోర్టరుగానే వ్రాశాడు, మరోచోట కేవలం సంభాషణలతోనే నడిపాడు ఇంకోచోట తాను కన్నట్టుగా ఆత్మకథనంగా చెప్పాడు. మరో పద్ధతి లేఖశైలిలో నిగూఢ విషయాల్ని సవిస్తారంగా చర్చించాడు. లేఖపద్ధతి కథాగమనానికి, విషయ ప్రతిపాదనకు అంత సులువైన మార్గం.

గోపీచంద్ వృత్త కథామూర్తే కాదు, జీవిత ఉత్తరార్ధంలో వేదమూర్తి కూడా అయ్యాడు. ఆధ్యాత్మంతో ప్రకాశించాడు. 'ఇరవయ్యో శతాబ్దపు రచయితలు చివరకు తత్వవేత్తలుగా మారవలసి వస్తుంది. జీవితాన్ని సంపూర్ణంగా చూచే స్థితికి వస్తారు' అన్న బెర్నార్డుషా మాటలు గోపీచంద్ విషయంలో అక్షరాలా ఋజువయ్యాయి. చివరి రోజుల్లో ఆత్మచైతన్య ప్రధాన రచనలుచేసి సాహిత్య వనంలో కొత్త పువ్వులు పూయించాడు. మెరుపుల మరకలు, పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా, తత్వమసి లాంటి ఆత్మచైతన్య సృష్టులు గావించేముందు 'పోస్టుచెయ్యని ఉత్తరాలు' లాంటి భౌతిక–ఆధ్యాత్మిక సమన్వయం ప్రధానంగాగల సైద్ధాంతిక రచనలు చేశాడు. గోపీచంద్‌ను సిద్ధాంతం–ప్రయోగం రెండూ తెలిసిన గుప్తవిద్యావేత్త అనడంలో ఆశ్చర్యంలేదు. ఎప్పటికప్పుడు లోకంలో సంభవించే నవోదిత విషయాల్తో ఘర్షణపడి నలిగి, శుష్కించి అందలి శ్రేయ–అశ్రేయాలు, అంతర్నాటకాలు, చీకటి తెరలు అవగతం చేసుకొని సమాజానికి తగిన హెచ్చరికలు చేశాడు. 'ఉభయ కుశలోపరి', 'పోస్టుచెయ్యని ఉత్తరా'ల్లో సమయోచితమైన సమాజ చైతన్యం – ఆత్మ చైతన్యాలకోసం బలమైన హెచ్చరికలు చేశాడు. ఉభయకుశలోపరి 1941 నాటి రచన. ఆనాటికే అనసూయలాంటి పల్లెటూళ్ళు అసూయ, అమర్యాద, అసహనం, స్వార్థం, అబద్ధాలతో ఎంత దారి తప్పిపోయాయో బౌద్ధికంగా పరిశీలించాడు ఈ ఉత్తరాల్లో నానాటికీ పతనోన్ముఖం అవుతున్న గ్రామీణ జీవితాన్ని కథకాని కథా శిల్పంలో పడివడిగా నడిపాడు. కోటేశ్వరరావు, సుబ్బారావు, వెంకయ్య, కృష్ణయ్య వీళ్ళంతా ప్రధాన పాత్రలు. కోటేశ్వరరావుగారు దైన్యాన్ని చూచి జాలిపడుతున్న ధీర లలితుడు. తన బాధను ఊరు విడచిపోయి నగరంలో వుంటున్న బాల్యమిత్రుడు గోపీకి చెప్పుకుంటున్నాడు–'సుబ్బారావులాంటి ఈర్ష్యాపరులు పెరిగిపోతున్నారని వాళ్ళమూలంగా ఊళ్ళో తగాదాలు, స్వార్థాలు పెరిగిపోతున్నవని, అమాయకుణ్ణి–దిగువవాణ్ణి దొంగ–దోషిగా నిరూపించి శిక్షిస్తున్నారని–సమాజంకూడా జోక్యం కలుగజేసుకోనిదై పోతున్నదని' మనస్తాపాన్ని తెలియజేశాడు.

ఉభయ కుశలోపరిలోని ఈర్ష్యాపాత్ర సుబ్బారావు–పిల్లిమీద ఎలికనీ, ఎలికమీద పిల్లినీపెట్టి ఊరంతా రొచ్చురొచ్చు చేస్తున్నాడు. అసూయా హృదయంతో వాడూ సుఖపడ్డం లేదు–ఎదుటవాణ్ణీ సుఖపడనీడం లేదు. గ్రామంలో పార్టీలు లేవదీశాడు. ఊరందరికీ మంచిగా వుంటున్న రంగయ్య మనసుకూడా మార్చి ఒకపార్టీకి అతికించి వేశాడు. సుబ్బారావు మాటల్లో పడిపోయి రంగయ్య ఎలక్షనులో పాల్గొని తగాదాలు తెచ్చుకొని కోర్టులచుట్టూ తిరుగుతున్నాడు. అవతల పార్టీవాళ్ళు రంగయ్య వాము తగలబెట్టడంకూడాజరిగింది. ఇలాంటివన్నీ సుబ్బారావు నాయకత్వం క్రింద జరుగుతున్నాయి.

శ్రీ దోనేపూడి రాజారావు

సుబ్బారావు పాత్రద్వారా గ్రామంలో పెచ్చుపెరిగి పోతున్న గ్రామకజ్జీలను వర్ణించాడు. కజ్జీల కారణంగా నలుగురికి నీడనిచ్చే చెరువుగట్టుమీది రావి చెట్లను కొట్టివేయడం, కచ్చేరీపాకల్ని తగలబెట్టడం, రామాలయంలోని పురాణకాలక్షేపాన్ని కాదని ఆ స్థానంలో పార్టీ మీటింగులు జరుపుకోడం, శిధిలావస్థలోవున్న దేవాలయాల్ని పడగొట్టి పాఠశాలలు చేయడం, బాటసార్లకు విడిదిగా వుంటున్న సత్త్రాలను గ్రంథాలయాలుగా మార్చి బాటసార్ల-బిచ్చగాళ్ళకు మధుకరం చేసుకొని తలదాచుకొనే ఆస్కారంలేకుండా చెయ్యడం, మొగుడూ పెళ్ళాలు కలిసివుంటే చూడలేక పోవడం, రోజూ గడ్డం చేసుకునేవాణ్ణిచూచి ఓర్వలేక పోవడం లాంటి క్రొత్త క్రొత్త ఈర్ష్యాకృత్యాలను రచయిత యథాతథంగా అభివర్ణించి పాడైపోయిన పల్లెటూరి మనస్తత్వాన్ని మనముందు పెట్టాడు.

గ్రామాల్లో మెజారిటీగా వుంటున్న రైతు ఆర్థిక స్థితి గతుల్ని అర్థశాస్త్ర వేత్తగా వివరించాడు. రైతు అప్పుల బాధితుడైపోయి ప్రాణప్రదంగా చూచుకొంటున్న పొలాలు అమ్మివేస్తున్నాడు ఖర్చులు పూడని పంట, ఆపలేని అలవాట్లు-వారానికి ఒకటి రెండుసార్లు పనిలేకపోయినా బస్తీకిపోడం, బోర్డుస్కూళ్ళలో చదువురాక ప్రయివేట్లు చెప్పించుకోడం, పైకివస్తున్న పిల్లలకి పెళ్ళిళ్ళు, పడిపోతున్న యిళ్ళకు బదులుగా కొత్త యిళ్ళు శక్తిలేకపోయినా కట్టుకోడం లాంటి ఖర్చులు మితిమీరి రైతుని నానాటికి అప్పు బాధితుడ్ని చేస్తున్నాయి.

రైతు నానాటికీ కూలీగా మారుతున్నాడు. ఎద్దుల వ్యవసాయంనుండి దున్నల వ్యవసాయం, జతెడ్ల నుండి ఒకెద్దుకు దిగజారిపోయి, సహకార స్వభావాలు సన్నగిలి, తనకుతానుగా హింసించుకుపోతున్న రైతు జీవితాన్ని హృదయ స్పర్శంగా చిత్రించాడు.

గ్రామ ఆచారాల్లో వచ్చిన మార్పుల్ని సైతం సినిమా చూపించినట్లుగా స్పష్టంగా చూపెట్టాడు. పురాణ కాలక్షేపాల స్థానంలో రాజకీయ ప్రసంగాలు, పెద్దల నెదురించే కుర్రాళ్ళు, పాత పేర్లుపోయి కొత్త పేర్లు. గ్రామాల్లో కాఫీహోటళ్ళు, పల్లెనుండి బస్తీకి పాలు వెన్నకోడిగుడ్ల వ్యాపారం, దీపావళి-సంక్రాతి వేడుకలుపోయి ఆ పైకంతో గ్రంథాలు కొనడం, పది నిమిషాల్లో పది రూపాయల్లో అయిపోతున్న రాజకీయ పెళ్ళిళ్ళు, కొత్తరకం బుర్రకథలు-తోలు బొమ్మలు. అవీ రాజకీయ యువకులు ప్రాక్టీసు చేసినవి-ఇంకా మిన్నుముట్టుతున్న వరకట్నాలు వగైరా ఆచారాంతరాల్ని చూపెడుతూ చితికిపోతున్న గ్రామ్య జీవితాన్ని మనముందు హాజరుపెట్టాడు.

ఇక గ్రామ చైతన్యంకోసం తప్త హృదయంతో కొన్ని ముఖ్య సూచనలు చేశాడు కొత్త పద్ధతుల్లోని చెడుని వెనక్కినెట్టి శ్రేయస్సుని పరస్పరం చెయ్యి చేసుకొని ముందుకు నెట్టమంటూ, అవసరాన్నిబట్టి రైతాంగానికి యంత్రసహాయాన్ని సిఫార్సుచేస్తూ, కాంపిటిషన్‌లాంటి నష్టం సంభవించకుండా చూచుకోమన్నాడు, గ్రామ పరిశ్రమలను ప్రోత్సహిస్తూ వ్యక్తి స్వార్థాన్ని సమష్టి స్వార్థంతో ముడిపెట్టి తద్వారా సమాజ శ్రేయస్సు కోరాడు. ఈ చైతన్య భావాలను ముడి మాటల్లో చెప్పకుండా హృదయాన్ని స్పర్శించే ఉత్తరాల్లో వ్యక్తంచేశాడు. అవి కోటేశ్వరరావు గోపీకి వ్రాసిన ఉత్తరాలు. ఇవి గున్నేరు నుండి తారీఖులతో సహావేసి వ్రాసిన ఉత్తరాలు. పాఠకుల్ని నమ్మించేటందుకు రచయితలు ఊహా ఉత్తరాలను కూడా ఇలాగే వ్రాసి నమ్మిస్తుంటారు. లేకపోతే అవి మన మనసుకు ఎలా పడతవి: తారీఖు లేందే-ఊరి పేరు లేందే అవి ఉత్తరాలుగా మనం తీసుకోము, నమ్మించేటట్టుగా వ్రాయగలగటట్టే రచయిత

పాఠకుణ్ణి నిలబెట్టగలుగుతున్నాడు. వాస్తవానికి ఇవి ఉత్తరాలే అయినా కథకు మించిన వడి-వేగంగా నడచి రచయితకు వ్రాతపనంటే ఎంత చులకనై పోయిందో ద్యోతకమౌతోంది.

మరో రకమైన ఉత్తరాలు పోష్టుచెయ్యనివికూడా వ్రాసాడు. అవి ఆత్మ చైతన్య ప్రతీకాలు. సమాజానికి ఎప్పుడు ఎలాంటి చైతన్యం కావాలో ముందుకు ముందుగానే సమాజం అర్థం చేసుకునే స్థితిలోవున్నా లేక పోయినా చెప్పుకుపోయాడు సామాజిక చైతన్యం-సమష్టి చైతన్యం కావాలని-ఉభయ కుశలోపరి వ్రాసిన పది పదిహేనేళ్ళకు-యుగానుకూలమైన అద్వైతన ఆత్మ చైతన్యం కావాలంటూ, భౌతిక సుఖ సంపత్తితో ఊహం పెంచుకొని చివరకు భస్మాసుర హస్తాలుగా తయారైన లోకానికి విరుగుడుగా ఆధ్యాత్మిక చైతన్యం ఉపాధేయమంటూ, భౌతిక - ఆధ్యాత్మిక సమన్వయానికి తెలుగు సాహిత్య రంగంలో తొలి కోడిలా కూశాడు. అది కొందరికి అసంభవ మనిపించినా కాలక్రమేణా సంభవమే నసే భావం చివరికు తట్టింది.

సమన్వయ సిద్ధాంతాన్ని కథాగమనంలో గాక, కథలుగా వ్రాస్తే అది కల్పనగా మన మూహించవచ్చు, అందుకని చిరకాల మిత్రునకు మర్మంవిడచి చెప్పు కుంటున్న పరిశుద్ధాత్మలా, లేఖల రూపంలో నివేదించుకుపోయాడు పన్నెండు ఉత్తరాల్లో. ఈ పన్నెండూ పన్నెండు రకాల చైతన్య ప్రవృత్తుల్ని పరిశీలించాయి. ఇంకా చిత్తజల్లు + తుది పలుకుల్లో శేషాంశాలను చర్చిస్తూ మొత్తంగా భౌతిక-ఆధ్యాత్మికమైన అధునాతన సంస్కారాలను లోకానికి కావలసిన మేరకు పొందుపర్చి, సామంజస్య-సమన్వయ సిద్ధాంతానికొక పార్శ్యపుస్తకంగా అందించాడు. ఆయన వ్రాస్తున్న సమయాన ఈ ఉత్తరాలు, వివిధ పత్రికల్లో ప్రథమ దర్శనమిస్తూ ఆంధ్ర దేశంలో 1952 మొదలు 1955 వరకూ ఎంత అలజడి లేపాయో సాహిత్య-ఆధ్యాత్మిక లోకానికి అంతా తెలిసిందే.

ఆరంభంనుండీ ఆయనలో వచ్చిన మార్పల్లా అంతర్జాతీయంగానే వచ్చింది తెలుగు కథారచన కానివ్వండి, భావజగత్తు కానివ్వండి, గోపీచంద్ రూపంగానే ఆనాడు భౌతికోన్నతి, తిరిగి ఇటీవల భౌతిక - ఆధ్యాత్మికాల సమన్వయోన్నతి మనకు సంప్రాప్తించినదంటే ఆ శ్రేయస్సు రచయితగా ఆయనకే దక్కింది. ఆయన రచనలు తెలుగు సాహిత్య సంస్కారానికి సంజె దీపాల్లాంటివి

ఆయన ఏదీ 'గాలి'గా చెప్పలేదు స్వానుభవాన్నో లేక సాక్ష్యంలాంటి పరానుభవాన్నో తీసుకొని ప్రయోగాత్మకంగా చెప్పాడు. వ్యక్తిమీద-వ్యక్తి అనుభవం మీద ఆయనకు నమ్మకం జాస్తి ప్రతివాడూ ఏదో వొకటి అయివుంటాడనే విశాలభావం ఆయనకుంది వ్యక్తికి తగిన స్వేచ్ఛా-పోషణ వుంటే తానొక ప్రత్యేకదీపంగా వెలుగొందుతూ ఎదుటివాని కింత వెలుతురు-చల్లదనం ప్రసాదిస్తాడని ఆయన మహా విశ్వాసం. అందుకని యంత్రానికి లొంగిపోయిన సమాజం వద్దంటూ, యంత్రానికి అతీతంగా ఆలోచించే మేధ కావాలన్నాడు వర్గకలహం స్థానంలో వర్గసామరస్యం అభిలషించాడు అదే వరుసలో సైద్ధాంతిక సమన్వయంచేసి సాధారణ ధర్మాలను చూపెట్టాడు. ఆయన సమన్వయం ఆషామాషీదికాదు సైన్సు, ఆధ్యాత్మిక విషయాలను పుక్కిలింతలుపట్టి మరీ వ్రాశాడు. 1956 నుండి 1962 వరకు ఆకాశవాణి గ్రామీణ ప్రసంగాల ద్వారాను, ఇంకా యువ పత్రికలోని ప్రత్యేక శీర్షికల ద్వారాను సమన్వయోన్ముఖమౌతున్న భౌతిక-ఆత్మవిషయాలు చిన్నచిన్న కథల ద్వారాను-ప్రశ్నోత్తరాల ద్వారాను ఆంధ్రదేశానికి

శ్రీ దోనేపూడి రాజారావు

అవగతం చేశాడు ఆ ప్రసంగాలు పాఠకుల్ని సమ్మోహితుల్ని చేశాయిగాని ప్రశ్నావాచకంగా వదిలెయ్యలేదు

గోపీచంద్ చక్కని వ్యాఖ్యాత, సందేహంలేదు. తనకు తెలిసిన మేరకు హృదయంస్పందించేలా చెప్ప గలడు ఆయన ఆస్తిక-నాస్తికఘర్షణ యుగంలోనుండి పుట్టుకొచ్చాడు. కనకనే రెండుకాల సంస్కారాల వాతావరణం ఆయన్ని పెంచింది. దేవుడుంటే చూపించు అనే అతివాస్తవిక రోజుల్లో ఆయన పెరిగాడు. ఆర్థికపరిస్థితే మానవస్వభావాన్ని నిర్ణయి స్తుంది. దేవుడుగాని, ఏ యితర శక్తిగాని,బయటనుండి మనలను నడపడం లేదనే భౌతికవాదం ఆయన చెవిదగ్గర గణగణాగంటలు కొట్టింది వినకుండా ఎలా వుపేక్షిస్తాడు ? అదేవాతావరణంలో పెరిగాడు-ప్రతి దాన్నీ హేతుబద్ధంగా చూశాడు. కాని హేతువాదం ఎంతో కాలం ఆయనకు సంతృప్తినివ్వలేదు. తిరిగి ప్రతిదాన్నీ భావాత్మకంగా చూడసాగాడు Moments of pure intuitions and moments of pure logic అన్న క్రోచే కథనాన్నిమానవుని పరిజ్ఞాన ప్రక్రియగా తీసుకున్నాడు

ఈ లోకంలో ప్రతిదీ ఋజువైతేనే తప్ప పది కాలాలపాటు నిలవదు, నేడొస్తున్న పరిణామాల్లో మానవుడొక అధ్యాయం అంటూ మానవుని సత్యా న్వేషణకు ప్రాధాన్యం యిచ్చాడు అదిసైన్సుఅయినా-అధ్యాత్మం అయినా అనుభవానికి అందవలసిందే. ఏది వదలుకున్నా తిరోగమనమే శరణ్య మంటూ సమగ్రదృష్టి - విశాలదృక్పథం పరిగ్రహించాడు All change is not a miracle అంటూ మార్పును వరంగా స్వీకరించాడు. అది పురోభివృద్ధికిContinuity నిస్తుందంటూ స్వీయ తాత్విక దృష్టిని పెంచుకున్నాడు. కథకుడుగా బయలుదేరినా రానురాను తత్వవేత్తగా మారుతూ, భావసంపత్తిని-ఆలోచనా శక్తినీ వృద్ధి చేసు కున్నాడు. ఈవృద్ధులన్నీ మనకు పోష్టుచెయ్యని ఉత్తరాల్లో దర్శనమిచ్చాయి.

గోపీచంద్ సూక్ష్మదర్శన ప్రతిభతోపాటు పరిభూ-స్వయంభూ ప్రతిభలు వున్నవ్యక్తి కావడంతో, ఎదుటి కొచ్చిన ప్రతివిషయాన్నీ తరచిచూచి, అందలి చైతన్య భావాన్ని భోజ్యం చేసుకొని, దినదిన ప్రవర్ధమాను డయ్యాడు. సృష్టి పరిశీలన చేస్తున్న సైంటిస్టులు, అటు ఆత్మపరిశీలన చేస్తున్న ఋషులు ప్రత్యక్షంగా కనిపించారు. శాస్త్రజ్ఞులు పరిశోధనా ఫలితాలను ఎప్పటికప్పుడు ప్రమాణాలతో లోకాని కందిస్తూ, అందు యూనివర్సల్ అనే సమాశ్రయ భావాన్ని నిబిడీకృతంగా వున్నట్లు తేల్చిచెప్పారు. అది ఏక వచనంనుండి బహువచనం వేపుకు పయనిస్తున్నట్లుగా ఋజువుచేశారు. ఐన్‌స్టీన్, ఓపెన్‌హోవర్‌లు తమ సృష్టి పరిశీలనల్లో ఆత్మోన్ముఖం అవుతున్న సమాశ్రయ భావాన్నే ప్రకటించారు ప్రతివొక్కడూ అందరికోసంగానూ పయనిస్తున్న సైన్సు, అందరూ ఒకనికోసంగాను పయనిస్తున్న అధ్యాత్మం చివరకు ఒకే రకమైన యూనివర్సల్ అనే సమాశ్రయ భావానికి చేరుకోడంతో, గతంలో సైన్సు-అధ్యాత్మాల మధ్య వుంటూవచ్చిన అగాధం తొలగిపోయి రెంటిలో సామంజస్యం-సమన్వయం ఏర్పడ్డాయి ఋషులు-శాస్త్రజ్ఞులు మిత్రులయ్యారు. ఏభై సంవత్సరాల అనంతరం మానవుడు సృష్టి పరిశీలనలతో విసుగెత్తి పోయి చివరకు ఆత్మ పరిశీలనలో నిమగ్నుడౌతాడని, ఆధ్యాత్మోన్ముఖమౌతున్న సైన్సునుగురించి విలియం ఫాక్‌నర్ ఇదివరకే చెప్పాడు.

'అణుశక్తిని కనిపెట్టిన సైన్సుకు మూడవ ప్రపంచ యుద్ధంవస్తే అది అగ్నిపరీక్షలాంటి'దని శాస్త్రజ్ఞులను హెచ్చరిస్తూ ఆర్నాల్డు టాయన్‌బీ-ఆత్మ

''వినాశనాన్ని చూస్తారో లేక మానవైక్యాన్ని చూస్తారో చూడాలి'' అని అన్నాడు.

గోపీచంద్ లోకంలో జరుగుతున్న సైన్సు గొడవలు చూశాడు. అటు అరవిందాశ్రమం ప్రవేశించి ఆత్మ పరిశోధనలు చేస్తున్న అరవిందునీ దర్శించాడు. సమ్మోహితుడై తన్ను తాను ఆపుకోలేక అరవింద ఫిలాసఫీని సమర్థిస్తూ పత్రికల్లో అనేకంగా వ్యాసాలు వ్రాశాడు. అరవిందుని ఇంద్రియాతీతమైన జ్ఞాన పరిశోధనల్ని నిస్సంకోచంగా వొప్పుకుంటూ భౌతికం నుండి ఇంద్రియాతీతోన్ముఖం అవుతున్న విలియం జేమ్సు, ప్రొఫెసర్ రైన్, మాక్‌డవల్, ఎడ్డింగ్టన్‌లను సైతం అభినందించాడు. మనసుకు నరాల ద్వారానే కాకుండా మరో విధంగా కూడా జ్ఞానాన్ని ప్రోగుచేసుకునే శక్తివుందని, శరీరాన్ని విడచి మనసు విడిగా ఉండొచ్చని చెప్పిన శాస్త్రజ్ఞులు-ఋషులు ఒకే తత్వాన్వేషకులనే మనోనిశ్చయాని కొచ్చి యిద్దరి సమన్వయాన్ని కోరుతూ ఘోషచెయ్యాని ఉత్తరాలు ప్రకటించాడు. ఏ యితర సాధనాలూ లేకుండా వొక్క ఏకాగ్రతలో జ్ఞానాన్ని పొందొచ్చని ఋజువు చేసిన పతంజలిముని కూడా గోపీచంద్‌కి అధ్యయన విషయం అయ్యాడు. ఇంద్రియాతీతమైన జ్ఞానాన్ని గురించి తొమ్మిదవ ఉత్తరంలో విపులంగా వ్రాశాడు. ఆధ్యాత్మిక విలువలు గుర్తించినంత మాత్రాన నేను భౌతిక విలువల్ని నిరసించడం లేదంటూ పేర్కొన్నాడు.

గోపీచంద్ మనస్తత్వరచయిత కావడంచేత ధ్యానంవల్ల ఏకాగ్రత ఏర్పడుతుందనే విషయాన్ని శీఘ్రంగా గుర్తించగలిగాడు. జీవితాన్ని విడివిడిగా కాక మొత్తంగా చూడ్డానికి ధ్యానావస్థను ఒప్పుకున్నాడు. మనసులోని ప్రేరణల సమన్వయానికి-తద్వారా మనశ్శాంతి, ఆనందంపొందటానికి ధ్యానావస్థ అవుసరం అంటాడు.

పరిణామవాదాన్ని ఆధ్యాత్మవాది అరవిందులు సైతం నిర్వివాదంగా వొప్పుకోడంతో తన సమన్వయ వాదానికి మరీ బలం చేకూరిందని సంతసించాడు. పరిణామం భౌతిక దశతోనే ఆగిపోదని అందు మరోదశ 'అతీతమానసికశక్తి' రాబోతున్నదన్న అరవిందుని ఉక్తితో పూర్ణంగా ఏకీభవించాడు. మహర్షుల్లో నమ్మకాన్ని వెలిబుచ్చుతూ యిలా వ్రాశాడు-''వైర్‌లెస్, టెలివిజన్‌లాంటివి చూచినమీదట మెస్మరిజం, Thought reading, గోడమీద నడిచేబల్లిని చూపు మాత్రంతో నిలిపివేయడంలో కొంత యథార్థంవుండక పోదనిపిస్తుంది''.

ఇటీవల శాస్త్రజ్ఞులు మానవుని మెదడు పని చెయ్యడం ఆగిపోయిందన్న విషయాన్ని అంగీకరిస్తూ, అది మరొక శక్తిని తెచ్చుకోవలసిన అవుసరాన్ని సూచిస్తున్నదంటాడు.

శాస్త్రజ్ఞులు-ఋషులు ఇద్దర్నీ బుద్ధి పరాయణులుగా వొప్పుకుంటూ ఇద్దరూ తమతమ బుద్ధిబలంతో స్వీయ క్షేత్రాల్లో సత్యాన్వేషణలుసల్పి స్వానుభవాలను వ్యక్తం చేసి కాలానుగుణ్యమైన సిద్ధాంతాలను అందించారంటాడు. రచయితకు ఇద్దరూ వంద్యులు-పూజ్యులు అయ్యారు. ఆధ్యాత్మాన్ని పరిగ్రహించడంతో భారతదేశం రచయితకు ఆధ్యాత్మిక జననిగా భాసిల్లింది. అంతిమ దినాల్లో తత్వమసి - విశ్వరూపసందర్శనం లాంటి నాటికలు వ్రాసి భారతీయ తత్వచింతనను స్వీయ భావాల్లో సగర్వంగా ప్రకటించుకున్నాడు. భారతీయ తాత్విక చింతనలో మారని తత్వంలాంటి-అవ్యయ తత్వాన్ని, త్రికాల సత్యాన్ని సాక్షాత్కరించాడు.

ఎప్పటికప్పుడు తాను నమ్మిన సిద్ధాంతాన్ని విమర్శించుకుంటూ, ఎదుటి సిద్ధాంతంతో కొంత ఏకీభవిస్తూ చివరకు తానుకాని ఎదుటి సిద్ధాంతం-ఆధ్యాత్మం అయి

కూర్చున్నాడు. అదే ఆయన పూర్ణత్వం. రచయిత గానూ-తాత్విక సమన్వయవాదిగాను గోపీచంద్ పరిపూర్ణమానవు డనడంలో సందేహంలేదు. ''ఉభయకుశలోపరి'' ద్వారా రచయితలోని సమాజ సాక్షాత్కారం, 'పోష్టుచెయ్యని ఉత్తరాల' ద్వారా రచయితలోని భౌతిక-ఆధ్యాత్మిక సమన్వయ సాక్షాత్కారం. ఈ రెండూ రచయితలో అదొక పవిత్ర సంస్కారంగా మనకు ప్రత్యక్షమయ్యాయి.

# మాలపల్లి, కన్యాశుల్కం

ఈ శతాబ్దంలో తెలుగు సాహిత్యంలో ప్రచురించబడిన రెండు గ్రంథాలు చదువరుల దృష్టినీ, మేధావులదృష్టినీ, ప్రబలంగా ఆకర్షించినయి. అవి ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులుగారి 'మాలపల్లి', గురజాడ అప్పారావుగారి 'కన్యాశుల్కమూ.' నేడు ఈ రెండు గ్రంథాలూ ఉత్తమ గ్రంథాలుగా పరిగణించబడుతున్నాయి ఈ రెండు గ్రంథాలు కూడా జీవితాన్ని బహుభంగుల ప్రదర్శించాలనే తహతహకొద్దీ సడలింపబడిన రచనావిధానంగలవే. మాలపల్లిలో చాలా అధ్యాయాలు అనవసరమనీ, కన్యాశుల్కంలో చాలా రంగాలు అనవసరమనీ అనే వారిని నేను అనేకమందిని ఎరుగుదును. కాని వారే అవి ఉత్తమ గ్రంథాలు అనటం కూడా నేను ఎరుగుదును. ఇన్ని అధ్యాయాలు, రంగాలు అనవసరంగా జొప్పించబడిన ఆ గ్రంథాలు ఉత్తమ గ్రంథాలు ఎలా అయినాయి? మనం అనుకునేవాటిని మించిన ఆకర్షణ ఏదో ఆ గ్రంథాలలో వుండివుండాలి అదే జీవితాన్ని ప్రదర్శించటంలో వున్న ఆకర్షణ ఈ ఆకర్షణ అన్నిటినీ మించింది, రసవత్తరమైంది, సాహిత్యానికి ముఖ్యమైందీ అవటంవల్ల ఆ గ్రంథాలు కొన్ని నియమాలను అతిక్రమించి హర్షనీయమైనాయి. ఈ ధోరణిలో ఆలోచనాక్రమం వొకటి వుండటంవల్ల ఆ సంఘటనలు దేనికీ అడ్డుగా నిలబడిపోయి కథా గమనానికి తీరని నష్టాన్ని చేకూర్చవు. వస్తువుకి పుష్టిని కలిగిస్తాయి

ఈ గ్రంథాల ప్రస్తావన వచ్చినప్పుడు వొక మిత్రుడు ''ఈ గ్రంథాలను ఒక్కొక్కదాన్నీ ఒక వంద పేజీలలోకి కుదించవచ్చు'' నన్నాడు. ఆ లెక్కలో దేనినైనా కుందించవచ్చు. నా మిత్రుని వాక్యాన్ని కూడా కుదించవచ్చు. కాని అలా కుదించినప్పుడు కండతరిగి వొట్టి అస్థిపంజరం మిగులుతుంది. పుస్తకాన్నే కాక జీవితాన్నే సంక్షిప్తం చేసిన వాళ్ళం అవుతాం దానిలో ఆ రచయిత వ్యక్తిత్వం కుంటుపడుతుంది. జీవన స్పర్శను ఆ మేరకు చదువరులు కోల్పోతారు.

గోపీచంద్

# సంస్కృతి

జనకుని మించినతనయుఁడ
వని నిన్ను నెఱిఁగినవార లందఱును గడున్
గొనియాడఁగ గోపీచంద్ !
వినినాఁడవుగావె? నీవు విశ్వమునందుఁ

వినుతింగాంచిన వంశం
బునఁ బుట్టి పెరిగి వివేకముం బొంది కడున్
దెనుఁగున నభిమానంబును
గనఁబఱిచినవాడ వీవు కవిపుత్రుఁడవై॥

సూతాశ్రమంబు జూడఁగ
నేతెంచినవారితోడ నింపెసలారఁ
హేతుసహిత వాదంబుల
నాతఱిఁజేసితివి తండ్రి యాజ్ఞాపింపన్

కూర్చితి మోదము తండ్రికిఁ
గూర్చితి మోదంబు నాంధ్ర కోవిదతతికిన్
గూర్చితి మోదం బాంధ్రకుఁ
గూర్చితి మోదము సఖులకు గురుగణ్యుఁడవై॥

రచియించి తీవు కథలను
రచియించితి నవలలెన్నో రమ్యంబుగ నీ
రచనములోని విశిష్టత
వచియించుచునున్నవారు పండితవర్యుల్॥

విద్వాన్ కోగంటి దుర్గామల్లికార్జునరావు

# రేడియో రచయితగా -


నా ప్రియమిత్రుడు గోపీచంద్ ఈ లోకాన్ని వదిలేసి తేజోలోకానికి వెళ్ళిపోయి అప్పుడే సంవత్సరమైందంటే మనస్సు జల్లుమంటుంది. మాట్లాడుతూ, అంతలో శాశ్వతంగా కన్ను మూసిన ఆ మహానుభావుడు అమరజీవి ''అనాయాసేన మరణం, వినాదైన్యేన జీవనం'' అన్న సూక్తి అతనియెడ సార్థకము. ఒకనికి తలవంచలేదు. స్వతంత్రుడుగా జీవించాడు. పెద్దపెద్దవాళ్ళ నెదిరించాడు ఉన్నత పదవుల్లో ఉన్నవాళ్లు వస్తున్నారని తెలిసేసరికి, తప్పుకునేవాడు దీనత్వం అతనిలో అణుమాత్రం లేదు పులిలా బతికాడు. అనాయాస మరణం పొందాడు. అది అందరికీ వచ్చేదికాదు ''తానీషా'' ఓడిపోగా ఔరంగజేబు సైనికులు అతన్ని చంపడానికి వచ్చారట. ''నన్ను చంపడానికి కత్తులు కటార్లు ఎందుకు? నా ముందునుండి ఒక అపరిశుభ్రంగావుండే స్త్రీని నడచి పొమ్మనండి ఆ వాసనకు ప్రాణం విడుస్తాను'' అన్నాడట. అలాగే చనిపోయాడట తానీషా అంత సున్నితమైన వాడతను పన్నీటి కొలనిలో స్నానం చేసేవాడట. అందులో ఒక చిన్న ఎలుకపడి చనిపోయిందట. అంత పన్నీటిలో ఆ ఎలుక వాసనను పసికట్టి ఎలుకను బయటికి తీయించాడట తానీషా.

గోపీచంద్ మనస్సు అట్టిది. మనస్సులో దాపరికం లేనివాడు, కుండ బద్దలుకొట్టినట్టు చెబుతాడు. అతడు ఎంతో ప్రసిద్ధుడైన తరువాతనే రేడియోలో చేరాడు.


శ్రీ దాశరథి




రేఖాచిత్రం: శ్రీ జనార్దన్



ఆంధ్రరాష్ట్రావతరణోత్సవ సందర్భంలో గవర్నర్ శ్రీ త్రివేది ప్రసంగాన్ని అనువదిస్తున్న గోపీచంద్.
గవర్నర్ వెనుకనున్నవారు నాటిప్రభుత్వ ప్రధానకార్యదర్శి శ్రీ ఓ. పుల్లారెడ్డి.



గోపీచంద్ ఆంధ్రరాష్ట్ర సమాచారశాఖ డైరెక్టర్‌గా వున్నప్పుడు ఒక సమావేశంలో
కీ. శే. అల్లూరి సత్యనారాయణ రాజు. శ్రీమతి రాజ్యంసిన్హా. శ్రీ సిన్హా, గోపీచంద్, శ్రీ నార్ల వెంకటేశ్వర రావు

అప్పటికే అతడు ప్రముఖ కథకుడు, నవలా రచయిత, నాటకకర్త, గల్పికా కారుడు, సుప్రసిద్ధ ఆలోచకుడు, తత్వచింత కలవాడు. 1957 లో రేడియోలో చేరాడు. రేడియోలో చేరకముందు కూడా అతనికి రేడియోతో సంబంధం వుంది. రేడియోకోసం చాలా రాశాడు. రేడియోలో కొన్ని నాటకాలకు నిర్వాహకుడుగా పని చేశాడు. అతని కెప్పుడూ పల్లెలు, పల్లె ప్రజలు అంటే ఎక్కడలేని మక్కువ అంత విద్యావంతుడై కూడా, మేధావులను, మేల్కొల్పేట్టు రాయగలిగి కూడా, నోరులేని, చదువురాని, నిఘంటువు లెరుగని, విజ్ఞానంలేని పల్లీయులకోసం రాయాలనే తహతహ ఎప్పుడూ వుండేది. కనుకనే అతడు రేడియోలో గ్రామస్థుల కార్యక్రమాలు నిర్వహించడంలో గౌర వాన్నీ, గర్వాన్నీ అనుభవించేవాడు. అనతికాలంలో అతడు రేడియో అనే మహాయుధాన్ని స్వాధీనం చేసు కున్నాడు. రేడియో, రెక్కలగుఱ్ఱం వంటిది. అది వెళ్ల లేని చోటులేదు వినడానికి చెవి ఉండాలేగాని అవలీలగా వినిపిస్తుంది. ఈ మాధ్యమాన్ని గురించి సంపూర్ణంగా తెలుసుకుని, దీన్ని క్రమబద్ధంగా వాడుకోడం చాలా కష్ట సాధ్యమైన పని. ''రేడియోకి రాయడ మేమంత పని. ఇదుగో! రాశేస్తాను క్షణంలో''. అని కొంద రనవచ్చు ''రేడియోలో ఉన్న ప్రత్యేకతేమిటి' రంగ స్థలానికి బోలెడు నాటికలు రాశాను. ఇదీ అలాగే'' అని మరికొంద రనుకుంటారు. కాని తీరా రాయడానికి పూనుకున్నప్పుడు "రేడియో కొరకరాని కొయ్య బాబో! దీన్ని లొంగదీయడం ఐరావతాన్ని ఆరో హించడం లాంటి'' దని తెలుసుకుంటారు. పుస్తకంలా మళ్లీ వెనుక పేజీలు తిప్పి చదువుకోడానికి వీల్లేదు. రంగస్థలంవలె వేషాలు, అలంకరణలు చూచి అర్థం చేసుకుందామంటే ఇక్కడ ''కంటికి'' పనిలేదు. శ్రవోనయనం ద్వారానే అంతా చూడాలి. అది మనో నయనానికి అందాలి. రేడియో రచన విజయవంతంగా సాగాలంటే పుస్తక రచనలో ఉండగూడని కొన్ని ''దోషాలు'' ఇందులో వుండాలి. ఆ ''దోషాలు'' ఇందులో ''గుణాలు''. పునరుక్తి పుస్తకంలో ఉండ గూడదు. రేడియో రచనలో పునరుక్తి సహాయపడు తుంది. వినేవారికి సుబోధకంగా ఉండడానికి — పుస్తకంలో అనవసరమైన వివరణలు — కొన్ని అవసరం అవుతాయి. శబ్దం ద్వారానే రూపకల్పన చేయాలి గనుక కొన్ని సందర్భాలలో అర్థం స్ఫురిం చని శబ్దాలు వినిపించాలి. ఇదో ప్రత్యేకమైన కళ.

ఈ కళను గోపీచంద్ సంపూర్ణంగా సాధించాడా ? అంటే సంపూర్ణత్వం అంటే ఏమిటో ? ఒకటిమాత్రం చెప్పవచ్చు. అతను చేసిన కొన్ని ప్రయోగాలు విజయవంతమైనాయి. వాటినిబట్టి అతను ఈ కళను బాగా అలవరుచుకున్నా డనవచ్చు. దీన్ని అలవరుచు కోడానికి ఎంతో సమయం పట్టలేదుకూడా. అందుకు అతని సునిశిత భావనాశక్తియేగాక అతనికి సామాన్య శ్రోత యెడగల సానుభూతి, సామాన్యునికిగల సంస్కారం ఎలాటిదో తెలుసుకోగల శక్తి ఎక్కువ తోడ్పడ్డాయి. ఎంత గంభీరమై, ఉదాత్తమై, జటిలమై, దుర్గమమై, దుర్బోధకమైన విషయాన్నైనా సులభంగా, సుగమంగా, సున్నితంగా, చిన్నచిన్న మాటల్తో, సూటిగా, సురభిళంగా, సుఖంగా చెప్పడం అతనికివచ్చు. విశ్వరూప సందర్శనం వద్దనుండి విత్తనాలు చల్లడందాకా అన్ని విషయాలూ సుగ మంగా చెప్పగలడు జటిలమైన వేదాంత విషయాలను, రామయ్య, సీతమ్మ-ఈ యిద్దరు రైతుబిడ్డలతో పిచ్చాపాటీగా మాట్లాడించి మనకు బోధచేస్తాడు. గోపీచంద్ రకరకాలైన ప్రక్రియలను ఆకళించుకున్న వాడు. ఏకపాత్రాభినయానికి కావలసిన "భాణం" (Monologue) లాంటి రచనలు, ఇద్దరు పాత్రలనే

"సంభాషణలు," అనేకులు పాల్గొనే రూపకాలు, నాటికలు, నాటకాలు, చర్చలు, గోష్ఠికార్యక్రమాలు, ప్రశ్నోత్తరాలు, పరిచయ ప్రసంగాలు, వ్యాఖ్యలు, సోదాహరణ ప్రసంగాలు ఎన్నో రాశాడు సమయ స్ఫూర్తి, సకాలంలో రచన ముగించడం, మైక్రో ఫోన్‌ను మచ్చిక చేసుకోడం, కాలానికి కిశ్లెం వేయడం, ఉన్న సమయంలో ఒదగడం, క్లుప్తత, స్పష్టత- ఇవన్నీ అతనిలో వుండేవి. కనుక ఎంతటెంతటి క్లిష్టమైన అంశాన్నైనా, సమస్యనైనా ఇట్టే విడమరిచి విద్యుల్ ధ్వని తరంగాలు పవరీలగా వంధల మైళ్ళు మోసుకెళ్లడానికి వీలుగా తయారు చేసేవాడు

అతని రేడియో రచనల్లో చిరకాలం చెప్పుకోదగ్గది "మాలపల్లి"కి రేడియో నాటకీకరణ. మహాభారతాన్నంతటినీ, ఉపాఖ్యానాలు మినహాయించి ఒక చిన్న కావ్యంగా రాయడం ఎంతకష్టమో అంత కష్టమైన పని ఇది అంత కష్టమైన పనినిచేసి చూపించాడు గోపీచంద్ రేడియోలో ఈ నాటిక ఎన్నోసార్లు ప్రసారమైంది విన్నప్పుడల్లా కొత్తగావుండేది. "మాలపల్లి"ని నాటకీకరించడానికి పూనుకోవడం గొప్పసాహసకృత్యం అయితే ఉన్నవ లక్ష్మీ నారాయణ గారిలో మా గోపీచంద్‌లోనూ వున్న కొన్ని సమాన భావాలు ఈ పనిని సులభ సాధ్యం చేశాయి వస్తుతః గోపీచంద్ ఉన్నవ వారిపలెనే పల్లెప్రజల యెడ సానుభూతి కలవాడు వారి జీవితాలు, వారి పరిసరాలు, వారి మనస్సులు ఈ ఇరువురిలోను బాగా జీర్ణించుకుని వున్నాయి.

ఇంతదేశం వుండగా ఉన్నవవారు "మాలపల్లి"నే తమకు నవలా వస్తువుగా ఎందుకుతీసుకున్నారు? ఇన్ని నవలలుండగా గోపీచంద్ "మాలపల్లి" నే ఎందుకు నాటకీకరించారు? ఎందుకంటే "మాలపల్లి" లోనే కేవలకల్పనలను అధిగమించిన వాస్తవ కళా స్వరూపం గోచరిస్తున్నది. భారతదేశ వాస్తవ స్వరూపం "మాలపల్లి"లో కనపడినంతగా మరో నవలలో కనపడ దనేవాడు గోపీచంద్. కొడవటిగంటి కుటుంబరావుగారు అన్నట్టు "పరపాలనలో ఉన్న భారతదేశపుకుళ్ళు యావత్తూ మాలపల్లెలు చూస్తే భూతద్దంలో చూసినట్టుగా కనిపిస్తుంది. ఎందుచేత నంటే మాలమాదిగలు బాధితులచేత బాధితులు." బాధితులచేత బాధితుల గాథ "మాలపల్లి".

కొందరు ఉద్రేకపరులు "అస్పృశ్యత నశించాలి, నశించాలి" అని అరిచినట్లు కాకుండా అస్పృశ్యత ఏనాడూ భగవత్సాక్షాత్కారానికి ఆటంకము కాలేదని వాదించారు ఉన్నవ వారు. భగవత్ సంబంధమునకు జన్మవృత్తాది నియమములులేవు. భక్తుల జన్మ నిరూపణము భాగవతాపచారము. జాత్యాధిక్యత అహంకారమునకు హేతువగుటచే సవర్ణులు భగవంతునకు దూరమగుచున్నారు కడజాతి వారికి మే మెక్కువను అభిమానముండదు గనుక వారికి ముక్తి సమీపము. సవర్ణులకు అహంకారము ఆజన్మసిద్ధము, కడవారికి అనహంకారము జన్మసిద్ధము." ఈ భావాలు గోపీచంద్‌ను కదిలించినవి. దిగువ జాతుల అభివృద్ధికి కేంద్రస్థానమైన "విజయ కళాశాల" సత్యమై లోకాన ఎప్పుడు వెలుస్తుంది? అది ఉన్నవవారి పుస్తకంలోనే ఉండిపోతుందా? ఇలా తర్కించడం గోపీచంద్‌కు దినచర్య ఏమైనా, ఆదర్శాలు ఆచరణలోకి వచ్చి నిలిస్తేగాని వాటికి శాశ్వతత్వం ఏర్పడదు

నాలుగువందల యాభై యెనిమిది పేజీల "మాలపల్లి" నవలను సుమారు గంటన్నర నాటకంగా రూపొందించాడు గోపీచంద్ పరిసరాలను, పాత్రల మనస్తత్వాలనూ పాఠకునికి తెలియపరిచడానికి ఉన్నవవారికి నవలలో సుదీర్ఘమైన వర్ణనలు, దానికి వ్యాఖలు తోడ్పడ్డాయి. గోపీచంద్‌కు ఈ

శ్రవ్య నాటికలో అవిలేవు. రంగస్థలనాటకాలకు ఉన్న సెట్టింగ్సు మొదలైన హంగులు సూచించడానికీ వీలులేదు. నవలలోని సంభాషణలను వీలైనంతవరకు యథాతథంగా వాడాలనే పట్టుదల గోపీచంద్‌కు ఉంది. కనుక ఈ శ్రవ్య నాటికలో ముప్పాతిక ముప్వీసం, ఉన్నవవారి సంభాషణలే. ఒక్క "సూత్రధారుడు" తప్ప కథాకథనంలో గోపీచంద్‌కు మరొకరి సహాయంలేదు. అతడూ నాటకానికి భంగం రాకుండా అక్కడక్కడా కొద్దికొద్దిగా నిమిషం నిమిషన్నరకు మించకుండా వచ్చి వెళ్లిపోతాడు కమల, మోహనరావు ప్రణయ ఘట్టం పూర్తిగా ఎత్తివేశాడు గోపీచంద్.

చౌదరిగారి కుమారుడు రామానాయుడు, కమల రామానాయుడు భార్య, మోహనరావు రామానాయుడికి వరసకు తమ్ముడు. అన్నదమ్ముల పిల్లలనుకుందాం రామానాయుడు దేశభక్తి పరాయణుడు. అస్పృశ్యతకు వ్యతిరేకి, కార్మికుల యెడ సానుభూతికలవాడు తండ్రి చౌదరి లోభి. కార్మికులను హింసించడమే అతని పని తండ్రికీ కొడుక్కీ ఇంత తేడా. రామదాసు కొడుకు సంగదాసు హరిజనుడు. వ్యవసాయ కూలీల హక్కులకోసం పోరాడే మనిషి. సంగదాసు చౌదరిగారివద్ద పాలికాపు అయితే రామానాయుడు అతన్ని తన సోదరునిలా చూచుకునేవాడు. ఇది తండ్రి చౌదరికి గిట్టదు. సంగదాసుతోపాటు రామానాయుడు గ్రామగ్రామాలకు వెళ్ళడం, కూలీ సంఘాలు ఏర్పాటు చేయడం, భజన సమాజాలు పెట్టడం, సర్వసమానత్వ ప్రచారం చేయడం పరిపాటి. భార్య కమలకు భర్తయెడ అనురాగం లేకపోలేదుగాని మోహనరావువంటి షోకిల్లా, శృంగార పురుషుడు కనపడగానే అతనిచేత ఆకర్షించబడుతుంది రామానాయుడు వూళ్లో లేనప్పుడు కమల తన కుమారుణ్ణి కూడా వదిలేసి మోహనరావుతో పారిపోతుంది. మద్రాసులో మకాంపెడతారు ఇద్దరూ. తరువాత కమల ఒక పసివాణ్ణి కంటుంది. మశూచివల్ల ఆ పసివాడు చనిపోతాడు. కమల వికృత రూపంతో తయారవుతుంది మోహనరావు కమలను నిరాకరిస్తాడు. కమల శాంతమ్మ అనే పేరుతో తన కుఱ్ఱవాణ్ణి చూడ్డానికి చౌదరి ఇంటికి వస్తుంది. శాంతమ్మ రావడం దగ్గరనుంచి గోపీచంద్ మళ్లీ నాటకంలో చేర్చాడు.

ఇంచుమించు ఇలాటి మరోఘట్టం "జ్యోతి," "పాలు"కు సంబంధించింది జ్యోతి రామదాసు కూతురు చౌదరి, ప్రభుత్వంలో కలిసి చేసిన కుట్ర ఫలితంగా అమాయకులైన రామదాసు కుటుంబం వారంతా చెల్లాచెదరౌతారు రామదాసు, అతని భార్య, కూతురు జ్యోతి "సెటిల్మెంటుకు" తరలించబడతారు. అక్కడగూడా వారిని కలిసి ఉండనీయకుండా పోలీసులు రామదాసును, అతని భార్యను జైల్లోవేస్తారు. జ్యోతి ఒంటరిగా వుంటుంది. జ్యోతిని ప్రేమించిన అప్పదాసు స్వగ్రామంలోనే ఉండి గ్రామసేవ చేస్తుంటాడు. ఇరువురూ విరహంతో బాధపడుతుంటారు. ఈ పరిస్థితుల్లో సెటిల్మెంటులోని "పాలు" అనేవాడు జ్యోతిమీద కన్నువేస్తాడు కుట్రచేసి జ్యోతిని కృష్ణానది ఒడ్డుకు రప్పిస్తాడు అక్కడ ఆమెను బలాత్కరించబోతాడు. జ్యోతి అతనినుండి తప్పించుకోడానికి పరుగెత్తి కృష్ణలోబడి మరణిస్తుంది. జ్యోతి శవం కొట్టుకువచ్చి అప్పదాసుకు దొరుకుతుంది. అతడు పిచ్చివాడైపోయి శవంతోసహా కృష్ణలోదూకి మరణిస్తాడు. ఈ గాథను గోపీచంద్ చక్కగా నాటకీకరించాడు.

చౌదరి రాగోలతో సంగదాసును కొట్టిచంపడం, డబ్బు కుమ్మరించి కేసునుండి తప్పించుకోడం వంటి

ఘట్టాలు ఎంతో చక్కగా నాటకీకరించ బడ్డాయి.

చౌదరి - ఏరా. నా ఉప్పుతింటూ నాకే ఎసరు పెడుతున్నావా? మాపిల్లవాణ్ణి (రామానాయుడు) అమాయకుణ్ణి చేసి, ఇంట్లో ముసలం పెడదామనుకున్నావా? ఏమీ ఎరగనట్టు వాడిని పక్కకు తీసికెళ్లి ఇక్కడ కూలి వాళ్లను నామీదకు ఎగదోస్తావా?

సంగదాసు - నేనింతవరకూ ఏ ఒక్క తప్పూ చేయలేదు వాళ్లకు ముట్టవలసిన కూలీ ముడితే కూలీలు తప్పకుండా పనిలోకి వస్తారు.

చౌదరి .- లేకపోతే?

సంగదాసు - రారు.

చౌదరి - రారూ?

సంగదాసు - రారు.

చౌదరి - నన్నే ఎదిరిస్తున్నావట్రా—మాలవెధవా (రాగోల పైకెత్తి నెత్తిమీద కొడతాడు)

సంగదాసు - అమ్మా............

మాలపల్లి నవలలో

ఈ ఘట్టమంతా నవలలో ఇలావుంది -

''చౌదరయ్యకు పండ్లు పటపట మంటున్నవి. దేహం స్వాధీనంలోలేదు శరీరం కట్టెవారింది. ముఖమంతా ముడతలుబడ్డది. కండ్లు బెత్తులై పైకుబికినవి. పెదవులు బిగిసి వుఛ్వాస మాగిపోయింది మొహంజేవురించింది. చెమర్చింది, మనసు క్రోధపూరితమై ఘూర్ణిల్లింది. వేళ్ల అరవడిబడేటట్లుగా రాగోల బిగబట్టి తలమీద గొట్టాడు, సంగదాసు అల్లు దీసిన తీగెవలె చతికెలబడి నేలకొరిగాడు. తల దానిమ్మ పండువలె బద్దలైంది. లోకంలో అక్రమాలను జూచి ఆక్రోశించిన రక్తం, వున్నత భావాలను వుద్రేకించిన రక్తం, పరులసేవలలో పొలిపోయిన రక్తం, పవిత్ర భావాలచేత పావనమైన రక్తం, గొట్టాన జిమ్మినట్లు ప్రవహిస్తున్నది. భూమిపావనమైంది...''

రామదాసు కుమారులలో వెంకటదాసు తీవ్రవాది. ఇతడే తక్కెళ్ల జగ్గడనే పేరుతో ఎన్నో దౌర్జన్య చర్యలు జరిపి ప్రభుత్వానికి చిక్కకుండా చాలకాలం తిరిగాడు. అతను నిరీశ్వరవాది. ధనికులకు వ్యతిరేకి అహింసలో నమ్మకంలేదు. దౌర్జన్యాన్ని దౌర్జన్యంతోనే ఎదిరించా లంటాడు. అతని వాదం చిత్రంగా వుంటుంది. మచ్చుకి అతని మాటలు పరిశీలించండి:

''పూర్వంభగవంతుడు అవతారమెత్తి లోక కంటకులైన రాక్షసులను సంహరించాడని పురాణాలు చెబుతున్నవి. యేదా శ్రీరాముడు? యీ యుగపు ధన పిశాచాలను సంహరించమను! వీటికి వెరచిగాబోలె, భగవంతుడు అవతారాలు యెత్తడం మానివేశాడు...లోకాన్ని పీల్చి పిప్పిచేస్తున్న ధన పిశాచాలను సంహరించవలెనంటే ధర్మశాస్త్రాలు చాలా తిరిగి వ్రాయవలసి వస్తవి. యీ ధర్మశాస్త్రాల ఫలితమే యీ ధన పిశాచాలు మరివొకవిధంగా కూడా చెప్పవచ్చు. యీ లోభుడే తన ప్రభుత్వాన్ని నిరంకుశంగా చెలాయిస్తూ తన కనుకూలమైన ధర్మశాస్త్రాలను వ్రాయించాడు. వీడి సైన్య మపారం. రాజాధిరాజులూ, కోటీశ్వరులూ వీడి పక్షన్నే వుంటారు. యీ పోరు రోజులలో, నెలలలో, సంవత్సరాలలో గూడా తెమిలేదికాదు, శతాబ్దాలు కూడా పట్టవచ్చు. వీడు జనాన్ని అంధకారంలో వుంచవలెనని చూస్తున్నాడు. కాని తెల్లవారింది. జనులు ప్రబోధితులవుతున్నారు. యిక యీ నిరంకుశుని ఆట సాగదు. మీ దేవుడు, యీ పిశాచాలు దేవాలయాలు కట్టిస్తున్నవనీ, ఉత్సవాలు చేయిస్తున్నవనీ వాటి అధికారం చెల్లవలెనని కోరుతాడేమో! మీ దేవుడు లంచ

రేడియో రచయితగా-

గొండి. ఆయన కొంత కాలముండదలచుకుంటే ఫలాపేక్షారహితుడు గావాలె. మీ దేవుడు ప్రతిఫలం అపేక్షించకుండా ధర్మం చేయవలసిందని బోధిస్తాడు, తాను మట్టుకు పూర్వ కర్మలననుసరించే ఫలమిస్తాడట. అట్లయితే మీ రెక్కువా? మీ దేవుడెక్కువా? ధన పిశాచాల చేతుల్లోంచి మీ దేవు డివతల పడాలె. మీ దేవుడికి ముందు వైరాగ్యం బోధించండి. దౌర్భాగ్యులైన యీ బీదల కందరికీ ఉపకారం చేయమనండి. భాగ్యవంతుల పక్షం విడువమనండి. ముందెప్పుడో భాగ్యవంతులకూ బీదలకూ గూడా తరుణోపాయం ఉన్నదంటారు. మీ వుపన్యాసానికి భాగ్యవంతులకేమీ ఆక్షేపణ వుండదు. చచ్చిపోయిన తరువాత సంగతులు చచ్చిన తరువాతనే ఆలోచించుకుందాం మీ భాగ్యవంతులలో యెవడైనా చచ్చిన తర్వాత తీర్చుకునే షరతుమీద ఒక రూపాయి బదులిస్తాడా?...మన కర్మల ప్రకారం మనం అనుభవించే కాడికి, మధ్య దేవుడి ప్రాజాపత్యమెందుకు? ఆయన చూచేవాడూ, చేసేవాడూకూడా కాడట? అసమర్థుడు వున్నా, వూడినా వొక్కటే. నేను లేనివాడికిందనే లెక్క కడతాను. ప్రాప్తంలేనిదిరాదు ఆ సిద్ధాంతం చాలా భాగం నేనూ వొప్పుకుంటాను. యీ రాత్రి గడ్డపారలు తీసుకొని బయలు దేరుదాం ధర్మకన్నాల మూలంగా యెవరికి ప్రాప్తమున్నది వాళ్లు తెచ్చుకుందాం ''

విప్లవకారుడైన వెంకటదాసు వాదం కన్నపు దొంగ వాదం అని కొంద రనుకోవచ్చు. కాని ''ఇది కొత్తజాతీయ, అంతర్జాతీయ భావ చైతన్యం నుంచి పుట్టినది'' అన్నారు కొడవటిగంటి కుటుంబరావుగారు. ఈ వెంకటదాసు తక్కెళ్ల జగ్గని పేరుతో తన సహచరులవెంట అరణ్యాలలో చేరి పోరాటం సాగించాడు. ప్రభుత్వాన్నీ, ధనికులనూ మట్టుపెట్టడమే అతని పనిగా పెట్టుకున్నాడు. కాని అతి బలిష్ఠమైన సుశిక్షిత ప్రభుత్వ పటాలాలకు అతడు పట్టుబడతాడు. తుదకు తండ్రి రామదాసు ఉన్న జైలుకే వెంకటదాసూ వస్తాడు. పోరాటంలో తీవ్రంగా గాయపడి ప్రమాద స్థితిలో ఉంటాడు. తండ్రీ కొడుకులు (రామదాసు-వెంకటదాసు) జైల్లో కలుసుకుంటారు.

"మాలపల్లి" నవలలోని తొమ్మిదవ అధ్యాయంలోని ఈ క్రింది ఘట్టం పరిశీలించండి :

రామదాసు - (గడ్డంపుణికి) నాన్నా! యెట్లావుంది?

వెంకటదాసు - క్రమంగా క్షీణించుకొని వస్తున్నది.

రామదాసు - బాబూ! నా మాట విని వొక్కమాటు నారాయణా ! అనుకో

వెంకటదాసు - యెవ రాతడు ?

రామదాసు - దయామయుడైన భగవంతుడు. తుస్కారంగా మాట్లాడగూడదు.

వెంకటదాసు - భగవంతుడేమోగాని దయామయుడు మాత్రంగాడు. ఈ దయామయుడు లోకమంతా పంచమహాపాతకపట్నం చేశాడు ఈ దేవుడనే ఆయన వొకడుంటే జనమంతా ఆయన మీద తిరుగబడి సన్మార్గవర్తిని చేయడమవసరం, యెన్నాళ్లని యీ వూరుకోవడం? దీనివల్ల మనకు చాలా అగౌరవం.

రామదాసు - యెట్లా అగౌరవం?

వెంకటదాసు - మీ దేవుడు ఆలనా పాలనా లేని పరరాజువలె వున్నాడు గాని జనుల కష్టనిష్ఠురాలు యోచించే స్వదేశీ ప్రభువుగాలేడు. యెక్కడో స్వర్గంలో వున్నాడంటారు. చేత గాని వాడు అక్కడవుండి యీ ప్రపంచపాలన యెందుకు నెత్తిన పెట్టుకోవాలె? దేశంలో దుర్మార్గమింత యెందుకు ప్రబలాలె? మంచి చట్టమొకటీ కనపడదు. దుర్మార్గ చట్టాలకు

బుద్ధిహీనులుగాని లోబడరు. యెన్నాళ్లని వూరుకోవడం ?

రామదాసు· ఆస్తిక్య విషయంలో నీ కభిప్రాయ భేద మున్నదనుకో. ఆ పవిత్రనామం స్మరించి నందువల్ల నీకు నష్టమేమున్నది ?

వెంకటదాసు· నష్టమా? అది ఆత్మవంచన మవుతుంది. "బహుధావిభజ్య మప్యేవం, ననమేయంతు కస్యచిత్'' చేయి విరిగింది. కాలు తెగింది. మిగిలిన మొండాన్ని వేయిగా విభజించినా, యెప్పుడూ నా శిరస్సు వంచను: ఆ చీలి కలుగూడా వంగవు"

వెంకటదాసుకు వుద్రేకంచేత ముఖం గాదరించి జేవురుగ్రమ్మింది, నొసట వుబికి రక్తనాళాలు చెమర్చినవి.

రామదాసు. (ముఖాన చెయిబెట్టి తుడిచి) పిచ్చి తండ్రీ! కొంచం స్వస్తపడు. నీ నమ్మక ప్రకారమే వుండు భగవంతుని యందు నమ్మకం కలుగకపోతే నీ తప్పేమీలేదు. నీకు వున్నంత ధర్మనిష్ఠ నాకులేదు. వూరికే నమస్కారాలుపెట్టి యేమి ప్రయోజనం? ఆత్మశుద్ధి వుండాలి.

[మళ్ళీ తెరవచ్చింది క్రిందటిసారి కంటెత్వరగా గూడా వచ్చింది. చాలా సేపున్నది. తగ్గిపోంగనే కండ్లు తెరిచాడు.]

రామదాసు· నాన్నా! యిందాకా పరిస్థితులు మారుతున్నట్లు కనపడ్డ వన్నావే. ఇప్పుడెట్లా వున్నది?

వెంకటదాసు. రంగమంతా మారిపోతున్నది. ఆఖరు రంగంకూడా ముగింపుకు వచ్చింది. తెరపడబోతున్నది. నాటకం పూర్తి అవుతున్నది గదా! నేనెట్లా ఆడానో చెప్పు? నీవు నిజం చెప్పే వాడివని ఆత్మ తృప్తికొరకై అడిగాను.

(రామదాసు దీర్ఘాలోచన చేసి)

రామదాసు. నీది చాలా కొత్త నాటకం. నీ నాటక నియమాలు గూడా వేరే కొత్త పంథా తొక్కావు. నేను మామూలు దారిన పోయిన వాణ్ణి. నీది మార్గం కాదని చెప్పలేనుగాని, అంతా అవలంబిస్తే యెట్లా వుంటుందో చూడాలి. నీ మార్గ నియమబద్ధం మట్టుకు అవును. ఆ నియమాలు చాలా వుత్కృష్ట మైనవనీ, అమలులో పెట్టడం కష్టమేమోననీ చాలా మందికి అనుమానం.

వెంకటదాసు ధర్మాచరణం ఎప్పుడూ కష్టమే...

ఇక్కడ వెంకటదాసు డైలాగు అచ్చులో దెభై అయిదు పంక్తులుంది జైలు పద్ధతులు ఏయే దేశాల్లో ఎలావున్నాయో వివరంగా చర్చించాడు.

ఇదేఘట్టాన్ని గోపీచంద్ తనశ్రవ్య నాటికలోని ఆరవభాగంలో ఇలా క్లుప్తీకరించాడు

సూత్రధారి – జైల్లో రామదాసు భార్య మాలక్ష్మి మరణించింది. అతని పెద్దకొడుకు వెంకటదాసు మరణశయ్య మీద ఉన్నాడు.

రామదాసు – ఎట్లావుంది నాయనా!

వెంకటదాసు – ఎట్లా ఏమున్నది! సమీపిస్తున్నది అయ్యా? నా కొక్క వ్యధవున్నది...నన్ను సృష్టించి అష్ట కష్టాలు పడ్డ అమ్మా నాన్నల ఋణంతీర్చుకోలేకపోతినే ___ మీకు బాకీ దారుడై వచ్చి మిమ్ము బాధించి వెళ్లిపోతున్నా.

రామదాసు – నాన్నా! నీ వట్లాఅనవద్దు ... పిత పుత్రుల సంబంధంలో ఋణసంబంధం లేద నాయనా! నామాటవిని ఒక్క మాటు నారయణా అనుకో.

రేడియో రచయితగా-

వెంకటదాసు - ఎవ రాతడు !

రామదాసు - దయామయుడైన భగవంతుడు తుస్టా రంగా మాట్లాడ కూడదు.

వెంకటదాసు - భగవంతుడే నేమోగాని. దయామ యుడు మాత్రం కాదు. ఈదయామయుడు లోక మంతా పంచమహాపాతక పట్నం చేశాడు. దేవుడనేవాడొకడుంటే జనమంతా ఆయనమీద తిరుగబడి సన్మార్గప్రవర్తిని చేయడం అవసరం.

రామదాసు - పిచ్చితండ్రి! కొంచెం స్వస్థపడు నీ నమ్మకం ప్రకారమే ఉండు. భగవంతుని యందు నీకు నమ్మకం గలగకపోతే నీ తప్పే మీలేదు. ఊరికే నమస్కారాలు పెట్టియేం ప్రయోజనం. ఆత్మశుద్ధికావాలి.

వెంకటదాసు రంగమంతా మారిపోతున్నది. ముగిం పుకు వచ్చింది తెరపడ బోతున్నది నాటకం పూర్తి అవుతున్నదికదా నేనెట్టా ఆడానో చెప్పు నీవు నిజం చెప్పే వాడివని ఆత్మ తృప్తికై అడుగుతున్నాను.

రామదాసు నీది చాలకొత్తనాటకం, నీ నాటకి నియ మాలు కూడా వేరే కొత్తపంథా తొక్కావు. నేను మామూలు దారిన పోయినవాణ్ణి. నీది మార్గం కాదని చెప్పలేను. గాని అంతా అవలంబిస్తే ఎట్లా ఉంటుందో చూడాలి. నీ మార్గం నియమబద్ధం మట్టుకు అవును. ఆ నియమాలు చాలా ఉత్కృష్టమైనవి కూడా నాన్నా! నీ జీవితం విచిత్ర నాటకం

వెంకటదాసు అట్లాగా, నీ అభిప్రాయం నేను శిరసా వహిస్తాను. నాకు మరణ మాసన్న మవు తున్నది. తెర పడబోతున్నది. రంగాలన్నీ మరుపుకు వస్తున్నవి సూర్య, చంద్ర, తారకా మండలాలు దృష్టికి మరుగవుతున్నవి మన మాలకొండ, వూరగొండా, కొండవీటికొండా, గన్నేర్లవాగూ, పల్నాడడవులూ, నల్లమల వనాంతరాలూ నాకు ప్రియులయిన సనా తనులూ, తెరలోకి పోతున్నారు. ఆహా, అమ్మా! నీవు తప్ప నా కితర ప్రపంచమేమీ గోచరం కావడంలేదు. ఈ లోకం యొక్క పొలిమేర గట్టుమీద నుంచున్నాను....... అక్కడా...మీ ... రిద్ద . . (మరణించాడు)

రామదాసు నాన్నా! నే పెంచిన శరీరం నా యెదాన పారేసి వెళ్ళిపోయావా?

మరణ శయ్యమీద వున్న వెంకటదాసుతో ఇంత కంటే యెక్కువ మాట్లాడించడం కృత్రిమంగా తోస్తుందని గోపీచంద్-నవలలోని డైబ్బై అయిదు పంక్తులదైలాగు తీసేశాడు అది నాటకం నడకకు అడ్డువస్తున్నది కూడా. గోపీచంద్ శ్రవ్యనాటికా రచ నలో సిద్ధహస్తు డనడానికి ఈ పైఘట్టాలు మచ్చు తునకలు మాలపల్లిని నాటకీకరించి మా కందరికీ మార్గదర్శకు డైనాడు

సజీవమైన పాత్రలతో శోభిల్లే గోపీచంద్ మరొక నాటిక "మాంచాల" వీరరసం, కరుణరసం ఒక దానితో ఒకటి పోటీపడతాయి ఈ నాటికలో. ఉత్సాహం వీరరసానికి స్థాయి. శోకం కరుణకు స్థాయి వీటిని ఎంతో జాగ్రత్తతో పోషించాడు గోపీ చంద్ అతను కలం పుచ్చుకుని రచన చేస్తుంటే అతను రాయబోయేదంతా కళ్ళముందు రూపం దిద్దుకుని కనిపిస్తుంది గామాలు ! అందుకే అంత సజీవంగా పాత్రచిత్రణ చేస్తా డతను నేలవిడిచి సాము చేసే ఘటం కా దతనిది మట్టిలోంచి మణుల్ని గుట్టలుగుట్ట లుగా త్రవ్విపోయగలవాడు, ఈనాటి మనసమాజంలో రేడియోకి ఏర్పడిన బలమైన స్థానాన్ని గుర్తెరిగి, దాన్ని ఏవిధంగా మానవ హృదయాలమీద శాశ్వత ముద్ర వేయడానికి ఉపయోగించాలో గ్రహించి, ఆచరించి చూపిన వాడతడు. అతని హఠాన్మరణం ఈ రచనా ప్రక్రియకు గొడ్డలిపెట్టయింది.

శ్రీ దాశరథి

# గోపీచంద్ పాత్రలు

శ్రీ టి. యస్. కృష్ణానందమ్

కథలు రాసిన కథక చక్రవర్తు లున్నారు. కవన మల్లిన కవీశ్వరు లున్నారు. కథల్లో కవనాన్ని నింపి, కథల్లో జీవితాన్ని జొనిపి, కథలను కమనీయ గాథ లుగా జేసిన ఘనత గోపీచంద్‌ది.

రాజకీయాలను గురించి ఆలోచించిన వార లనేకు లున్నారు. రాజకీయాలనుగూర్చి ప్రవచించనవారూ మిక్కిలిగా ఉన్నారు. కథల్లో రాజకీయాలను ఇమిడ్చి రాజకీయ రచనలకు సుస్థిరత్వం కల్గించిన విశిష్టత గోపీచంద్‌ది

మానసిక శాస్త్రవేత్తలు పలువు రున్నారు. వారి పరిశ్రమా విపులంగానే ఉంది మానసిక శాస్త్రంలోని పలుభావాల కనుగుణ్యంగా పాత్రచిత్రణ గావించి రచనలకు పరిణతి సాధించిన ప్రత్యేకత గోపీచంద్‌ది.

తాత్త్వక జిజ్ఞాసువులు అనేకు లున్నారు. సత్యాన్వేషకులు పదుగు రున్నారు. తాత్త్వక చింతనలనూ, వాద వివాదములనూ, మామూలు పాత్రలచేత అతి మామూలుగా పలికించి, విషయాన్ని అత్యంత సౌలభ్యపరచిన ప్రతిభ గోపీచంద్‌ది.

భౌతిక వాదాన్ని వివరిస్తూ కొందరు రచనలు చేశారు. ఆధ్యాత్మిక వికాసాన్ని నెమరేస్తూ ఇంకొందరు రచనలు సాగించారు. భౌతికవాదాన్ని, ఆధ్యాత్మిక చింతనతో సమన్వయించి ఆలోచనల చరిత్రకు వినూత్న పరిధులను సృష్టించి రచనలు సాగించిన శేముషి గోపీచంద్‌ది.

సర్వత్రా సిద్ధహస్తుడు గోపీచంద్.

ఆ సిద్ధహస్తం మలచిన అపురూప పాత్రలే సీతారామారావు (అసమర్థుని జీవయాత్ర), ఉషారాణి (మెరుపుల మరకలు) కేశవమూర్తి (పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా) వినూత్న జిగీషలతో రూపొందించబడ్డ ఈ పాత్రలకు తెలుగు సాహిత్య ప్రపంచంలో భద్రమైన, ఒక ప్రత్యేక స్థానం అమరి ఉంది.

## సీతారామారావు :

"ఏమిట్రా నువ్వుచేసింది ?" అని తన్నుతాను ప్రశ్నించుకున్నాడు సీతారామారావు

అసమర్థుని జీవయాత్ర చదువుతూన్న అసంఖ్యాక పాఠకలోకం తనను తాను ప్రశ్నించుకుంది "ఏమిటి నేను చదువుతూంది ?" అని.

'చదువుతూంది సీతారామారావు జీవితమా, లేక రచయిత స్వీయ కథనమా!' అని అనుమానం పాఠకలోకానికి గల్గింది.

'ఏమిట్రా నువ్వు చేసిం'దని తననుతాను ప్రశ్నించుకున్న సీతారామారావు, ప్రశ్నకు సమాధానం చెప్పుకుంటానికి, ఆలోచించటానికి భయపడి కళ్లు మూసుకున్నాడు

'ఏమిటి నేను చదువుతూందని' ప్రశ్నించుకున్న పాఠకలోకం తన ప్రశ్నకు సమాధానం చెప్పుకుంటానికీ, సమాధానంకోసం ఆలోచించటానికీ భయపడి కండ్లు మూసుకుంది. కండ్లు మూసుకుంటానికి భయపడి కండ్లు తెరచింది ఏమీచేయటానికీ తోచక, కంటి రెప్పలు గబగబ పైకి క్రిందికి అల్లాడించింది.

గుండెల్లో ఏదో బరువుగా ఉన్న ట్లనిపించింది పాఠక లోకానికి !

మనస్సులో ఏదో గుబులుగుబులుగా ఉన్న ట్లనిపించింది పాఠకలోకానికి !

సీతారామారావులో తనను చూచుకుంది పాఠక లోకం !!

తనలో సీతారామారావును పోల్చుకుంది పాఠక లోకం !!!

గుండెల్లో బరువూ, మనస్సులో గుబులూ పెరిగి నట్లు భావించింది పాఠకలోకం !!

సీతారామారావు ఆలోచిస్తున్నాడు. ఒక పద్ధతి ప్రకారం జీవించటానికి చేతకానివాళ్ల ఆలోచనలకు కూడా ఒక పద్ధతనేది ఉంటుంది. పద్ధతికి కట్టుబడని ఆలోచనలు వుండవు. 'ఇష్టంవచ్చినట్లు ఆలోచించవచ్చు' అనుకుంటారు కొందరు. ఎంత అజ్ఞానం ! తమ ఇష్టం తమచేతుల్లో ఉందా ? తమ ఇష్టానికి మాత్రం ఒక పద్ధతిలేదూ ?

మధ్యాహ్నం పాపను కొట్టాడు దెబ్బమీద దెబ్బ కొట్టాడు దెబ్బలకు హడలిపోయి, గుడ్లు ఒప్పజెప్పి, చైతన్యాన్ని కోల్పోయిందాకా కొట్టాడు కూతుర్ని. కూతురు చేసిన తప్పుకై కొట్టడంకాక, ఎదురుకలదాని నోటికి భయపడి కొడుతున్నానని తెలిసి కొట్టాడు. "కొట్టకు నాన్నా" అని పాప ప్రాధేయపడనందుకు, తనలోని జాలిని జ్వలితం చేయనందుకు కొట్టాడు. కొట్టడం తప్పని గ్రహిస్తూనే, తన కూతురిని కొట్టింపజేసిన పశుత్వాన్ని తనలో గల్గించింది తన కూతురే అని కసితో గొట్టాడు.

"ఏమిట్రా నువ్వు చేసింది ?'' అద్దంలో తన ప్రతిమను తాను ప్రశ్నించుకున్నాడు సీతారామారావు.

"ఏమిటి నేను చదువుతూంది ?'' అసంఖ్యాక పాఠక లోకం తన్ను తాను ప్రశ్నించుకుంది.

ఉదయం భార్య కాఫీకి లేపింది. మొన్న భార్య కాఫీకి లేపనందుకు కోపగించుకున్నాడు ఇవ్వాళ భార్య కాఫీకి లేపినందుకు కోపగించుకున్నాడు కాఫీ తాగటం అతని కిష్టమే అవసరమే అయినా కోప

శ్రీ టి యస్ కృష్ణానందమ్

గించుకున్నాడు భార్యను. ఆ కోపంలో 'ఒకప్పుడు దీన్ని ఎలా ప్రేమించానా?' అని ఆలోచిస్తూ లేచాడు.

లేచి "ఏం?" అన్నాడు.

"కాఫీ" అన్నది భార్య.

"మొహం కడుక్కోనిస్తావా?" అన్నాడు.

"మీకు బెడ్‌కాఫీ అలవాటేగా!" అన్నది భార్య.

"అది నా యిష్టం ముఖం కడుక్కొని కాఫీ తాగాలని దేవుడు రాసిపెట్టాడా ఏం? కాఫీ త్రాగి మొగం కడుక్కుంటే ఏం? మొగం కడిగి కాఫీ త్రాగితే ఏం?" అన్నాడు.

"అందుకే ఈ బెడ్‌కాఫీ త్రాగండి. మళ్లీ త్రాగుదురుగాని మొఖం కడుక్కొని" అన్నది భార్య.

"బెడ్‌కాఫీయా, గాడిదగుడ్డు కాఫీయా?" అని భార్య చేతుల్లోని గాజుగ్లాసు తీసుకున్నాడు. వెంటనే వద్దని తీసుకున్నట్టు స్ఫురించింది గ్లాసు గోడకేసి తీసికొడదామనుకొని, గడ గడ కాఫీ త్రాగేశాడు.

"ఏమిట్రా నువ్వు చేసింది?" అని సీతారామారావు తనను తను ప్రశ్నించుకున్నాడు. కిటికీలోంచి బయటకు చూస్తూ ప్రశ్నించుకున్నాడు

"ఏమిట్రా నీవు చదువుతూంది?" అని పారక లోకం తన్ను తాను ప్రశ్నించుకుంది

రాత్రి—భోజనం చేసే సమయంలో సీతారామారావు తన భార్యమీద తనకున్న ప్రేమను బహిర్గతం చేయాలని వాంఛించాడు పగలల్లా తనను చూచి తాను యమయాతనపడ్డాడు. ప్రపంచమంతా ఏకమై తనను హింసిస్తున్నట్లు బాధపడ్డాడు, లోకపు బరువు క్రింద తాను నలిగిపోతున్నట్లు భావించాడు భావాల బరువు తనను అతలాకుతలం చేస్తూంది. పాతాళానికి క్రుంగదీస్తూంది. ఒక్కసారి తన అర్ధాంగి అంకంలో తల పెట్టి, తల్లి ఒడిలోని పసివాడు పొందే ఆదరం లాంటిది పొందాలనీ, ఊరట చెందాలనీ ఉబలాట పడ్డాడు

అందుకే భార్య వడ్డించిన బీరకాయ కూరను పొగిడాడు

భార్య ధరించిన ఇస్త్రీ చీరెను మెచ్చుకొన్నాడు.

'వంట్లో బాగాలేదా?' అని పరామర్శించాడు.

ఆమె ముక్తసరిగా మాట్లాడింది. అవసరమయినంతవరకే జవాబు యిచ్చింది. అది అతనికి కోప కారణమైంది. బాగా ఉందని పొగిడిన బీరకాయకూర మరి కొంచెం వడ్డిస్తానన్నందుకు అతనికి కోపం వచ్చింది. ఆ వచ్చిన కోపం ఈసారి ఆమెతండ్రి మీదగూడా ప్రసరించింది. "ఆయన విషయం ఇప్పుడెందుకులెండి" అన్నందుకు మరీ ఆగ్రహంవచ్చింది. ఎదురుగా ఉంటే ఇంకా తగాదా ముదురుతుందేమోనని, ఆమె అవతలకు వెళితే మరీ విజృంభించింది కోపం ఆ కోపంలో తినే పళ్లాన్ని నెట్టివేసి లేచాడు. ఈ ప్రవర్తనకు భార్య నిర్విణ్ణురాలైతే "నేను దయ్యాన్నా, భూతాన్నా, అట్లా చూస్తావేం?" అని బయటకు వెళ్లాడు

దారిలో గోడమీద ప్రాకే బల్లి కనపడింది. బల్లిని పలకరించాడు. 'బల్లీ' ఓ బల్లీ!' అని పిలిచాడు. బల్లి ఆగింది. బల్లి యోగక్షేమాలు అడిగాడు బల్లి వెళ్లిపోయింది బల్లిలో తన ఏకాకితనాన్ని చూచుకున్నాడు తనలో బల్లి ఏకాకితనాన్ని చూచుకున్నాడు

అయినా కడుపులో ఆకలిబల్లి అటూయిటూ కదిలింది. అర్ధాంగి మీది కోపంతో ఆకలి ఇంకా ప్రజ్వరిల్లింది భార్య పిలిస్తే పోయి యీ తఫా అయినా మర్యాదగా తిందా మనుకున్నాడు భార్య పిలవక పోయినా తనంత తాను వంటగదిలో ప్రవేశించాడు ఆమె అడగకుండానే తనకుగా తాను "తిననంటే తిననని" మారాం చేశాడు. తిరిగి "వడ్డించావా?" అని ప్రశ్నించాడు. ఆమె వడ్డించింది. ఇతను నాలుగు ముద్దలు తిన్నాడు. మళ్లీకోపం వచ్చింది, ఆమెకు

లోబడి పోయానే అని కోపం వచ్చింది. ఆమె జయించిందే అని కోపం వచ్చింది. ఆమెపంతమే నెగ్గింది గదా అని కోపంవచ్చింది. చెయ్యికడుక్కుని విసురుగా బయటకువచ్చాడు.

బయటకువచ్చిన తనను తాను ప్రశ్నించుకున్నాడు

"ఏమిత్రా నువుచేసింది?''—అని

"ఎంత నీచుడవురా! నీవు'' అని తనకుతాను ఆశ్చర్యపడ్డాడు.

పొరకిలోరం, ఒకసారి అటుయిటూచూచి, తనను ఎవరూ గమనించటంలేదని గ్రహించి ''నిజాలు ఎంత నిజంగా చెబుతున్నాడురా, గోపీచంద్,'' అని తనకు తాను ఆశ్చర్యపడింది.

* * *

ఏమీ తెలియని శీనయ్యలు సుఖపడుతున్నారు సంఘంలో.

అన్నీ తెలిసిన రామయ్య తాతలు సుఖపడుతున్నారు సంఘంలో.

మధ్య ఈ సీతారామారావులకే వచ్చింది బాధంతా సంఘంలో. సీతారామారావు అటు శీనయ్య కాడు, ఇటు రామయ్య తాత కాలేడు. అందుకనే, అన్నం కోసం తాపత్రయపడటం నీచం అనుకున్నాడు తాను అది తనకన్న తక్కువస్థాయివాళ్ళు చేసేపనని అతని కెందుకో తట్టింది అసలు అన్నంకోసం జరిగే అంతర్జాతీయ సమావేశాలంటేనే అతనికి బహు ఏవగింపు. ప్రపంచపెద్దలంతా పది కుర్చీల్లో కూచొని, మా కిన్ని టన్నుల ఆహారం కావాలంటే. మా కిన్ని టన్నుల ఆహారం కావా లనుకుంటం, చిరిగిన విస్తరాకువద్దచేరి, కుక్కలుచేసే రొదను జ్ఞాపకం చేస్తుంది తనకు. ఛ! అనుకున్నాడు. పాశ్చాత్యులకు మల్లే ఆకలిని తీర్చటానికి గాకుండా, ఆకలిని జయించటానికి మన పూర్వ ఋషులు చేసిన కృషిని మెచ్చుకున్నాడు. పొగత్రాగి బ్రతికే పద్ధతి లాంటిది ఒకటుంటే బాగుంటుం దనుకున్నాడు.

కాని ఇంతలోకే మరొక ఆలోచన వచ్చింది సీతారామారావుకు జీవితం బుద్బుదప్రాయమన్నారు గదా! ఏక్షణాన్నయినా మరణించవచ్చు గదా! చచ్చిపోయేవారికి, ఈ ఆరాటం ఎందుకు అనిపించింది. ఇదిగో ఇన్ని సంవత్సరాలు, కనీసం ఒక్కవంద సంవత్సరాలన్నా బ్రతుకుతామనే గ్యారంటీ లేకపోతే ఏ తెలివిగలవాడు చేస్తాడు ఏపనైనా.

ఏ పనీ చేయక్కర్లేదని నిర్ణయించుకున్నాడు. తను తెలివిగలవాడని అతని కెప్పుడో తెలుసు. ఏ ప్రయత్నం లేకనే, సుఖాలు తనను ముసురుకోవాలి. కష్టాలు తనవద్దకు రాగూడదు ప్రయత్నించి పనిని నెరవేర్చుకుంటం, మూలనున్న ముసలమ్మలు చేసే పని ఏ ప్రయత్నం, కష్టం లేకుండానే సీతారామారావు కూడా కొన్ని పనులు చేశాడు.

తండ్రి శ్రాద్ధానికి పదివేలు ఖర్చుపెట్టి ఘనంగా క్రతువు జరిపించాడు లోకం జేజేలు పలికింది

మేనమామ యివ్వవలసిన నలభై వేల రూపాయిల బాకీని, పదివేలకు తగ్గించి తీసుకున్నాడు చుట్టుప్రక్కల ప్రజలు అతని గొప్పతనాన్ని పొగిడారు.

తన వంశ గౌరవాన్ని గురించి, తన వంశీయుల ప్రత్యేకతను గురించి ఘన గౌరవాభిప్రాయాలను మెదడు నిండా నింపుకున్నాడు.

తన అర్ధాంగిని భార్యగా చేసుకున్నాడు.

ఇంకా ఇలాంటివే చేశాడు కొన్ని.

* * *

ఒక తెల్లవారగట్ల సీతారామారావుకు ఒక కల వచ్చింది. సీతారామారావు మాత్రమే కనగల కల అది మేల్కొని ఉండడం భరించలేక సీతారామారావు నిద్రపోవాలని చూస్తున్నాడు. నిద్రలో ఎపుడు

శ్రీ టి. యస్. కృష్ణానందమ్

మెలుకువ వస్తుందోనని భయపడుతున్నాడు. పాప వచ్చి 'అమ్మ లెమ్మంటూంది. లే నాన్నా!' అంటుంది. ఇక భార్య కనపడుతుంది. వరుస పెడుతుంది. ''ఇంట్లో బియ్యంలేవు ఉప్పులేదు. పప్పులేదు కూరల్లేవు''అని. పోనీ ఇంటి సరకులు తెద్దామని బజారు కెళితే తను తెచ్చిన సరుకులు భార్యకు నచ్చవాయె, తాను చేసిన బేరం భార్యకు నచ్చదాయె. తాను తెచ్చిన కూరగాయలు పుచ్చులవుతాయాయె అందుకే అతనికి త్వరగా నిద్ర లేవటం ఇష్టం ఉండదు కనకనే తెల్లవారగట్ల ఒక కల గన్నాడు, ఆనాటి అతని మానసిక స్థితికి ప్రతిరూపం ఆ కల

చీమలు దూరని చిట్టడవిలో, కాకులు దూరని కార డవిలో, సమాధి నిష్ఠాగరిష్ఠుడై, ఘోర తపంబాచరిస్తు న్నాడు సీతారామారావు సింహాలు గాండ్రుమంటు న్నాయి ఏనుగులు ఘీంకరిస్తున్నాయి. సర్వ జంతు వులు చైతన్యయుతములై ఉన్నాయి.

'బాణ్'–ఒక మెరుపు మెరిసింది ఆకాశం నుంచి, అతని ముందుకు తళ తళ మెరిసే ఒక బాట ఏర్పడింది అరణ్యంలోని మృగాలన్నీ చేతనారహితంగా నిర్వీర్య పోయినాయి పార్వతీ పరమేశ్వరులు అతని ఎదుట ప్రత్యక్షమయ్యారు. పార్వతీ పరమేశ్వరులు నిజానికి ఒకమనిషే గదా అని అనుకున్నాడు తాను చిన్నప్పుడు పగటి వేషగాళ్లు ఈ అర్ధనారీశ్వరుని వేషం వేసు కుంటం జ్ఞాపకం వచ్చి ఉంటుంది అందుకే కలల్లో గూడా సీతారామారావుకు, శివునకూ పార్వతికి ఒక నల్లని ముసుగు పార్టీషన్‌గా ఉండడం జ్ఞాపకం వచ్చి ఉంటుంది. ఆలోచించి సీతారామారావు శివుణ్ణి "అన్నంగావా"లని కోరుకున్నాడు.

''నీ కసలే ఆకలిలేకుండా చేస్తా"నన్నాడు పరమ శివుడు.

"అదెట్లా దేవా! నాకు ఆకలీగావాలి, ఆకలితీరే అన్నమూగావాలి'' అన్నాడు సీతారామారావు. సరే అన్నాడు శివుడు. అంతర్ధానమయ్యాడు అర్ధనారీ శ్వరుడు.

ఆ ఒక్క కోరికతోనే తృప్తిపడ్డాడు సీతారామా రావు సీతారామారావు గనకనే తృప్తిపడ్డాడు, మరొకరైతే మేడలూ మిద్దెలూ కోరుకు నుండేవారు. ధనరాసుల నర్థించి ఉండేవారు. సంఘాధిపత్యాన్ని వాంఛించి ఉండేవారు. సీతారామారావు అన్నాన్ని కోరుకున్న తర్వాత అతని ఆకలి విపరీతంగా దహించుకు పోయింది రంభోర్వశీ తిలోత్తమలు తలా ఒకపళ్లెరం పట్టుకొచ్చి యితనికి తినిపించ సాగారు. దురదృష్టవశాత్తూ కలకరిగింది నిద్ర చెది రింది. మనోగత మనోజ్ఞదృశ్యం అదృశ్యమయింది. కలలో శివుడు ప్రత్యక్షమైనా, మెలకువరాగానే జీవితం ప్రత్యక్షమైంది. మొండి గోడలాగా జీవితం ఎదురు నిలిచింది ఏమాత్రం మార్పులేకుండా తనజీవితం ఆనాడుగూడా తన కెదురైంది

పాప ''నాన్నా, నాన్నా,'' అంటూ నిద్ర లేప సాగింది. సీతారామారావు జీవితాన్ని, ఎవరో గుప్పిట్లో పట్టుకొని పిండుతున్నారు అతను ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడు. గుప్పిటనుండి వదల్చుకోనూ లేడు, గుప్పిటలో ఇమడనూలేడు

* * *

''ప్రాణం ఒక ప్రయోజనాన్ని సాధించటానికి పుట్టిందా?'' అని ప్రశ్నించాడు సీతారామారావు "లేదు'' అని జవాబిచ్చాడు స్నేహితుడు. "మరెందుకు పుట్టిందంటా?'' అన్నాడు తాను. ''నిర్నిమిత్తం" అన్నాడు స్నేహితుడు.

''అసలు ప్రాణానికే ప్రయోజనం లేనప్పుడు, మన జీవితానికి ప్రయోజనం ఎక్కడ్నించి వస్తుందంటా!''

అన్నాడు సీతారామారావు. ''నిర్నిమిత్తంగా పుట్టాం'' అని చప్పరించాడు గూడా.

''కాదు మానవునకు ఆలోచించుకునే శక్తి, ముందుకు చూచేశక్తి ఉంది. కనుక జీవితానికొక ఆదర్శాన్నుంచుకొని ప్రయోజన యుక్తంగా చేసుకోవచ్చునుగా" అన్నాడు స్నేహితుడు

"ఎందుకు ?" అన్నాడు సీతారామారావు.

''అంతా సుఖపడటానికి'' అన్నాడు స్నేహితుడు.

"సుఖం అంటే ఏమిటి ?'' అన్నాడు సీతారామారావు. సుఖించటమైనా, దుఃఖించటమైనా మానవ కల్పితాలేగా ' ఉద్రేకాలు చెప్పేపనేగా? మన ఉద్రేకాలకు మనం ఇంత ఆర్భాటంచెందటం ఎందుకు ?'' అని గూడా అన్నాడు సీతారామారావు

" అయితే ఏం చెయ్యాలంటావు ?'' అన్నాడు స్నేహితుడు

''ఏమన్నా చేయాలని ఎక్కడైనావుందా ఏమిటి?" అన్నాడు సీతారామారావు.

'' ఏమీ చెయ్యక్కర్లేదని మాత్రం ఎక్కడ వుంది ?'' అన్నాడు స్నేహితుడు తిరిగి.

''ఎక్కడలేదు?'' అన్నాడు సీతారామారావు.

"లేనప్పుడు, ఏమీ చేయక్కర్లేదని ఎందుకు చెప్పటం'' అన్నాడు స్నేహితుడు.

''మనిషి ఏదో చేయాలని దురభిప్రాయ పడుతున్నాడు కనుక,'' అన్నాడు సీతారామారావు.

''ఇంతకీ తేలిందేమిటి?'' అని ప్రశ్నించాడు స్నేహితుడు.

'' తేలడానికేముంది, మనం నిర్నిమిత్తంగా పుట్టాం. నిర్నిమిత్తంగా బ్రతకటానికి వీలుంటే బ్రతకడం, లేకుంటే చావటం.'' అని తేల్చివేశాడు సీతారామారావు.

ఎంతో ఉత్సుకతతో ఈ స్నేహితుల తత్త్వ మీమాంసను వింటూన్న పాఠకలోకం ''అమ్మయ్యా'' అని గాలి పీల్చింది. తమకు తెలియంది సీతారామారావు తేల్చివేశాడు.

ఎవరో ఒకాయన ఇది నిరాశావాదమని అన్నాడు అయితే సీతారామారావు ఇందుకూ జంకలేదు. తన వాదాన్ని కొనసాగిస్తూ అన్నాడు, ''అవును. మనిషికీ పశువుకూ అదే భేదం. పశువుకు ఆశలేదు నిరాశలేదు. కాని మనిషికి రెండూ ఉన్నాయి మరి." సింపుల్‌గా ముగించాడు వాదనను.

దేనితోనో ఒక దానితో తృప్తికోసం రాజీపడితే తప్ప, సీతారామారావు తేల్చిన సారాంశంకన్నా, ఈ నాటికి మానవుడు మించి తేల్చిన గొప్ప సారాంశం ఏమిటి ? ఇక రాజీపడటం అవసరంగా, అనివార్యమైనపుడూ అది అనేక రూపాలలో ప్రత్యక్షమౌతుంది. ఏ రూపంలో కావాలనుకుంటే ఆ రూపంలోనే ఆ ప్రత్యక్షం జరుగుతుంది జీవితమైనా అంతే, ఆదర్శమైనా అంతే. దేవుడయినా అంతే. ఏ రూపమూవద్దు కేవలం శూన్యమేనని తలచే శూన్యవాదికి శూన్యరూపంలోనే సమాధానం సాక్షాత్కారమౌతుంది.

సీతారామారావూ! నీవు నిజంగా మేధావివి. అనుమానం లేదు. అయితే ఆ మేధస్సు నీకుగానీ, నీ కుటుంబానికిగాని బొత్తిగా వినియోగపడలేదు కాగా కష్టాలకు కారణమైంది నీ పతనానికి కారణమైంది.

'ఎందుకు?' అని ప్రశ్నించుకున్న ప్రతి ప్రశ్నకు నీకు సమాధానం వచ్చింది. ఆఖరి "ఎందుకు ?"కు సమాధానం లేదన్నదీ ఒక సమాధానమే. ఈ సమాధానాలన్నీ సహేతుకమైనవనే నీవు నమ్మావు. నీ మేధస్సునే నీవు నమ్మావు. ఫలితంగా నిన్ను నీవు మోసంచేసుకున్నావు. నీ ఆప్తులనుకున్నవారు మోసం

శ్రీ టి యస్. కృష్ణానందమ్

చేశారు. సంఘం మోసం చేసింది. వాళ్లెందుకు మోసంచేస్తారులే అనీ, పలికేదంతా యదార్ధమనీ నమ్మి నీవు మోసపోయావయ్యా!

*   *   *

లౌకిక ప్రపంచాన్ని కాచివడపోసిన వృద్ధు రామయ్యతాత ఒకరోజున సీతారామారావుకు ఒక సలహా యిచ్చాడు. "జీవితంలో నీవు మంచివనుకొని చేసిన పనులకు పశ్చాత్తాపపడవలసివస్తే హృదయంలో తేళ్ళూ, జెర్రులూ నివాసమేర్పరచుకుంటాయి. నీ మంచే నీ పతనానికి కారణమౌతుంది" అని.

ఆ రోజున సీతారామారావు "నేను ప్రతిఫలం కోరి చేయటంలేదు తాతా," అన్నాడు అని తన వ్యక్తిత్వాన్ని తాను నిలుపుకున్నాను గదా అని అనుకున్నాడు. కాగా మామూలు సంఘానికన్నా తనలోని ప్రత్యేకత, తన కార్యకలాపాల్లో ప్రస్ఫుటమౌతూంది గదా అని అనుకున్నాడు కాని ఇన్నాళ్లకు తాను ఆర్థికంగా చితికిపోయిన స్థితిలో, ఎంతో ఉదారంగా తనచేత ఆర్థిక సహాయంపొందిన తన మేనమామ ఒక్క వందరూపాయలు పంపమని ఉత్తరం వ్రాస్తే, అందుకు జవాబుగా వచ్చిన ఉత్తరం చదివింతర్వాత, రామయ్యతాత చెప్పినట్లు, అతని హృదయంలో తేళ్లూ, జర్రులూ నివాస మేర్పరచుకుంటమే గాదు, అవి అమందానందంతో తమ శక్తి కొలదీ వివిధ భంగిమలలో నాట్యం చేయటం మొదలు పెట్టాయి. అనేక కాలసర్పాలు పడగలెత్తి భయావహంగా బుసలుకొట్టాయి. ప్రతి అక్షరం బాకైంది. అతని మంచితనం, అతని హృదయంలో విష భాండమైంది.

ఆ ఉత్తరంలో మేనమామ తన మంచితనాన్ని పరిహాసం చేశాడు. తనది మంచితనమే కాదన్నాడు. చేతకానితన మన్నాడు. కుటుంబ గౌరవాన్ని నిలుపుకుంటానికి పెట్టిన పెట్టుబడి మాత్రమే నన్నాడు. తనలోని దుర్గుణాలను బహిర్గతం చేయడంతోపాటు తన తండ్రి తాతల లోపాలను బయటకులాగి నిరూపించాడు తనవాళ్లందరకూ పదిమందిచేత పొగిడించుకోవాలనే దురద ఉందని రుజూచేశాడు ఆ డబ్బును తానుగనుక తెలివిగా దక్కించుకొని ఉండకపోతే, అది మరొక విధంగా దుర్వినియోగ మయ్యేదని వాపొయ్యాడు. తనుగాకపోతే ఆ అవకాశాన్ని మరొకరు ఉపయోగించుకొని ఉండేవారని తన అసమర్థతను మరొకసారి జ్ఞాపకం చేశాడు. కాగా అయోగ్యుడైన తనకు, ఒక గొప్ప యిల్లాలు భార్యగావడం సృష్టివైచిత్ర్య మన్నాడు.

ఎట్టకేలకు సీతారామారావుకు తన నిజస్థితి కండ్లకు కట్టినట్లయింది. టిక్కెట్లిచ్చే కిటికీదగ్గర త్రొక్కిసలాడే జనం క్రిక్కిరిసి ఉంటారు. ఒరుసుకుంటూ ఉంటారు ఒకానొకడు ఇనుప పాదాలతో వస్తాడు. జనాన్ని కసాపిసా త్రొక్కుతాడు కిటికీని సమీపిస్తాడు. తన టిక్కెట్టు తాను తెచ్చుకుంటాడు. సంఘర్షణలోకి దిగలేని అసమర్థులు ఆ యినప పాదాల మనిషిని నీచుడు, స్వార్థపరుడు, అని విమర్శిస్తూ తృప్తిపడతారు. అయినా టైముకు రైలు రానూవస్తుంది, టిక్కెట్టు కొనుక్కున్న ఇనప పాదాల మనిషికి రైలుప్రయాణం నిరాటంకంగా జరుగనూ జరుగుతుంది

తానెవరు? అసమర్థుడా? భీరువా? జీవితసంగ్రామంలో తలమార్చ చేతకాని, ఉన్న తాదర్శాలను వల్లెవేసే కేవలం అసమర్థుడేనా? ఈ అసమర్థతకు కారణంఏమిటి? తన స్నేహితులేమో ననుకున్నాడు సీతారామారావు. అలా ఎందు కనుకోవాలి, తనే తన స్నేహితులు చెడిపోవటానికి కారణం ఎందుకు కాకూడదు అనికూడా అనుకున్నాడు

అతని స్నేహితులుకూడా అసమర్థులుగానే కన బడ్డారు సీతారామారావుకు. ఒక స్నేహితుడి కేమో, అతని నామధేయంకూడా అతనికి బొత్తిగా జ్ఞాపకం ఉండనట్లుంది తన తండ్రిపేరు ముందు చెప్పిగాని,అత నే వాక్యమూ మాట్లాడడు సర్వచరాచర జగతినిగూర్చీ అతని తండ్రి సర్వవిషయాలూ ఎప్పుడో చెప్పినట్లు ఎలుకుతుండేవాడు. అనునిత్యం తనతండ్రి గొప్పతనాన్ని బానిసలాగా పొగడే ఈ ముద్దుల కొడుకు, తన వ్యక్తిత్వం తన తండ్రి పొగడ్తలక్రింద ప్రారంభవాక్యంలోనే హరించుకుపోయిందన్న వాస్త వాన్ని గుర్తించలేదు.

కడుపుమండి ఒకరోజు సీతారామారావు అడిగాడు "మీ తండ్రి గొప్పవాడా, మా తండ్రి గొప్పవాడా" అని. ఆ స్నేహితునకు గుక్కతిరగలా నోటిమాట రాలా అయితే రోడ్డుమీద కొచ్చినాక మాత్రం స్నేహితులతో అన్నాడు "అదేమిటోయ్! సీతారామా రావు వాళ్లనాన్నను అట్లా పొగుడుకుంటాడు'' అని. అంత అర్భకుడు ఆ స్నేహితుడు.

ఇడ్లీమీద క్కారపొడీ, అన్నంలోకి కొబ్బరి పచ్చడీ కనపడకపోతే కొట్లాడే మరో అనార్కిస్టు స్నేహితుడు నందనవన సదృశమైన ప్రపంచాన్ని, ముళ్లతొడుగుగా భావించి కవిత్వం రాస్తాడు. కేళీ గృహంలో విరిపాన్పు అందించు సుఖాన్ని కాలాహి విషాదవిషజ్వాలలతో నింపుతాడు. ఇలాంటి శుష్క స్నేహితులూ, ఓడియిడి జ్ఞానసంపన్నులూ ఇంకా కొంద రున్నారు

ఒకతను, తననుగూర్చి, 'ఆడవాళ్లు పడిచస్తారు' అని ఎప్పుడూ అబద్ధాలాడుతూంటాడు. మరొకతనేమో కథలూ, వ్యాసాలూవ్రాయట మారంభించి, చేతగాక, ఇతర రచయితలకు ఏమేమి చేతకాలేదో నిరుపిస్తూం టాడు. వీళ్లందరివల్లా తనుచెడిపోయాననుకున్నాడు సీతారామారావు.

కాదు కాదు. చెడేకలిశాం; కలిశేచెడ్డాం అను కున్నాడు. మొత్తానికి చెడటంమాత్రం ఖాయ మను కున్నాడు.

* * *

సీతారామారావుకు ఇక పనంటూ ఏమీలేకుండా పోయింది. ఆలోచనలు, ఆలోచనలు, ఒకటే ఆలో చనలు. అవీ హద్దులు దాటుతున్నాయి. ఈ సంఘంలో నియమాలూ, ఆచారాలూ, న్యాయచట్టాలూ, ఏమీలేకుండా ఉండటం ఎంతో వాగుంటుందని ఆలోచించాడు.

అరణ్యాల్లో దొంగలనాయకుడై వచ్చేపోయే వారిని కొల్లగొట్టటంలోవుండే ఆనందా న్నూహించాడు. ఒంట రిగా చిక్కి, బిక్కుబిక్కుమంటూ ఒణకుతూన్న ఒక అమాయిక ఆడపిల్ల తనకు బందీగాచిక్కిన ట్లూహించుకుని, ఆ ఆడపిల్లకు ఏమీ అపకారం చేయ కండా "జావ్" అనే తనలోని గొప్పతనాన్ని స్మరించుకొని మురుసుకున్నాడు. ఈ ఆలోచనల కవధంటూ లేనట్లుంది.

రామయ్యతాత అకారణంగానో, సకారణంగానో కాని సీతారామారావును "నీవు పిచ్చివాడివిరా అన్నాడు.''

ఆ క్షణంలో ఆ ఒక్కవాక్యం సీతారామారావు జీవితగమనాన్ని ఎటునడుపుతుందో తెలియకపోవచ్చు ఆ వృద్ధునకు సీతారామారావు క్షేమాన్ని సదా కాంక్షించే ఆ ముసలితాత – ఆలోచనల మహాప్రవాహంలో అడుగుచిక్కక, దారితెలియక, సుడిగుండంలో ప్రవే శించి, తనచుట్టూ తాను నిస్సహాయస్థితిలో, మహా క్రందనలతో, తిరుగుతూన్న సీతారామారావుకు, ప్రపంచంలో పిచ్చి అనే దొక టుంటుందని గుర్తు చేశాడు. అదిగూడా ఒక జీవిత మార్గమే నని తెలిపాడు.

శ్రీ టి యస్ కృష్ణానందమ్

అది ఇదేనని స్ఫురింపజేశాడు. నీవే పిచ్చివాడవని ముద్రవేశాడు.

నిరాశ్రయంగా కొట్టుమిట్టాడుతున్న సీతారామారావు మెదడుకు ఈ కొత్తదారి గమ్మత్తుగా కనిపించింది తన గమనానికి ఉపయుక్తంగా ఉన్నట్లే కనిపించింది. తన బాధామయ జీవితానికి పరిష్కార మిదేనన్న ట్లని పించింది దానితో తెలివికీ, పిచ్చికీ మధ్యన ఉండే అతి సున్నితమైన, ఉల్లిపొరలాంటి తెర పుటుక్కున తెగిపోయింది అంతటితో సీతారామారావు పిచ్చి వాండ్ల ప్రపంచంలోకి మకుటంలేని మహారాజుగా ప్రవేశించాడు. పిచ్చిదైన ప్రపంచం తన తీర్పుకు వేచి ఉన్నదని భావించాడు. పిచ్చిప్రపంచాన్ని బాగు చేయడం తన కర్తవ్యమని తలచాడు. ఇహ అతనికి ఇప్పటిదాకా ఉన్న విలువలులేవు. ఆలోచనలులేవు, ఒడాంతరాలూ లేవు అతని కున్నదంతా ముందుచూపే ఎదురుగా కన్పట్టేదే అంతనిమార్గం. అతని అవయ వాలకు సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చింది మెదడు తనకు తను ఆలోచిస్తూంది. చేతుల దారిన చేతులు ఊగు తున్నాయి కాళ్ళు తమ యిష్టంవచ్చినట్లు నడుస్తు న్నాయి. తన ప్రమేయం ఇసుమంతయినా లేకుండా తన అవయవాలు ఈ విధంగా పనిచేసుకుంటూ పోవటం సీతారామారావుకు చాలా హాయిగా ఉంది.

క్రొత్తగా స్వరాజ్యం సంపాయించిన దేశంపొందే ఆనందం లాంటిదిలది అన్ని హక్కులూ అందరకూ, బాధ్యతలు అసలు ఎవరికీలేవు అనే నినాదాన్ని అవ లంబించిన సమాజం పొందే పరిస్థితి అతనిది.

"ఎక్కడికి?" అని ఒకతను అడిగాడు.

"కాళ్ల నడుగుడు" అన్నాడు సీతారామారావు

"ఎక్కడా కన్పట్టంలేదే'' మని ఇంకోఆయన అడిగాడు.

''బ్రేకులులేవు. నన్నేం చేయమంటా" వన్నాడు సీతారామారావు.

'' మున్నాంచి '' అని బిల్లంగోడు ఆడేపిల్లలు అన్నారు

''ఎన్నాంచి'' అని నడిరోడ్డుమీద నడుస్తూ కేక వేశాడు సీతారామారావు.

చేతికి తగిలిన బొగ్గుతో, తెల్లగా ఉన్న గోడలపై బొమ్మలు గీశాడు. అతని మానసిక స్థితికి అనుగుణ్యా మైన చిత్రకళే అది.

జరీ పంచలు ధరించి ఎదురైన పెద్దమనిషిని ''నీవు ఎందుకు పుట్టావో నీకు తెలుసునటయ్యా!'' అని బంగారు తినిపించాడు

కాఫీ హోటల్లో తిని, ప్రొప్రయిటరుతో, ''అయిద ణాలకు బదులు నాలుగణాలు యిస్తే ఏమవుతుం దంటా '" అని, బిత్తిర పోయేట్టు చేశాడు.

నాలుగు రోడ్ల కూడలిలో నిలబడి తత్త్వాలు పాడాడు హరికథ చెబుదామా, బుర్రకథ చెబుదామా అని ఆలోచించి ఉపన్యాసం చెప్పాడు. అయితే ఆ ఉపన్యాసం పిచ్చివాని ఉపన్యాసంగాదు పిచ్చిలేని వాని ఉపన్యాసం అంతకన్నాగాదు. సంఘీయుల తెలివి తేటలను అంత నైపుణ్యంగా నిర్వహించ గలిగినవాడు మేధావి అవుతాడు. బహుశా మేధావి అలౌకికుడే గాక, పిచ్చివాడుకూడా నేమో

దేవుడు మనల్ని పుట్టించా డన్నారు పెద్దలు. మనం నిజ మనుకున్నాము.

దేవుడులో మనం ఐక్య మవ్వా లన్నారు పెద్దలు. మనం నిజ మనుకున్నాము. అందుకు ప్రయత్నం చేశాము మనం.

దేవుడనేవాడు బైటలేడు, మనిషిలో ఉన్నాడన్నారు పెద్దలు మనం నిజం అనుకున్నాము.

కాబట్టి మానవసేవే మాధవసేవ అన్నారు పెద్దలు. మనం నిజం అనుకున్నాము. అందుకు ప్రయత్నం చేశాము మనం. దైవభక్తుల్ని దూషించాం మనం. నోటికొచ్చినట్లల్లా దూషించాం మనం. వయన వయనాలుగా విమర్శించాం మనం.

మానవులంతా ఒకటిగాదు అన్నారు పెద్దలు
మానవుల్లో వర్గాలున్నాయి అన్నారు పెద్దలు.

ఆఖరి వర్గాన్ని వెనకేసుకొని తతిమ్మా వర్గాలతో పోరాడాలన్నారు పెద్దలు. అదీ నిజమనుకున్నాము మనం పోట్లాడుకున్నాం మనలో మనం. కాట్లాడుకున్నాం మనలో మనం. ప్రపంచం కసాయి దుకాణం అయింది. మనుషుల్లో సేవాదృష్టి ఇగిరిపోయింది. ఇది గమనించిన కొందరు హేతువాదులు జ్ఞాన దృష్టి అలవరచుకొమ్మంటున్నారు. "ఎందుకు?" అని ప్రశ్నించుకొమ్మంటున్నారు. ఉన్న సమస్యలకు వాళ్ల జ్ఞానాన్నిబట్టి వాళ్లు జవాబులు చెబుతారు మన జ్ఞానాన్నిబట్టి మనం నమ్ముతుంటాము

కాని ఈ ఎందుకు అనే దానికిగూడా ఆఖరికి ఎందుకనే ప్రశ్న వుంటుంది దానికి సమాధానంలేదు ఎక్కడో ఒకచోట ఈ 'ఎందుకు' ఆగిపోవలసిందే.

ఈ పైని చెప్పినవన్నీ అబద్ధాలే. ఈ పైని చెప్పిన పెద్దలవన్నీ అబద్ధాలే నిజం అనేది నిజంగా ఒకటి ఉంటే, మనిషి మనిషికీ అది మారుతుందా? క్షణక్షణానికీ అది మారుతుందా? అని సీతారామారావు తన ఉపన్యాసంలో జనాన్ని ప్రశ్నించాడు. చివరకు అతనే ఒక నిజాన్ని వెలిబుచ్చాడు "మనం పుట్టటం నిజం. చావటం నిజం. మధ్యన బ్రతకటం నిజం పుట్టటం చావటం మన చేతుల్లోలేదు. ఇక బ్రతకటం ఒక్కటే మనకు మిగిలింది. అందుకు కావలసింది అన్నం అన్నంకోసరం ఇన్ని గొడవలు పడటం అనవసరం. ఈ ప్రపంచంలో ఏమోవుందని మధ్యపెట్టి దానికనేక పేర్లుపెట్టి, దానికోసం పోట్లాడుకునేట్టు చేస్తున్నారు వాటిని నమ్మవద్దు మనం కొన్నాళ్ల యిక్కడ బ్రతకాలి ఎన్నాళ్లో ఎవరికీ తెలియదు దానికోసం పోట్లాటలూ, కలహాలూ, రక్తపాతాలూ ఎందుకు? బ్రతకండయ్యా! చచ్చేదాకా బ్రతకండి!!" అని ఉపన్యాసం ముగించాడు.

* * *

సీతారామారావు నడుస్తూనే ఉన్నాడు. విటునితో మాట్లాడుతూ ఒక భోగంది గుమ్మంలో నిలబడి ఉంది ఆ పతిత స్త్రీని చూసి అతని హృదయం, జాలితో ప్రేమతో నిండిపోయింది ఊళ్లో మురికినంతా ప్రోగుచేసుకొని నెమ్మదిగా, నిశ్శబ్దంగా, గర్భిణీ స్త్రీకి పల్లె పారే మురుగు కాలువ జ్ఞాపకం వచ్చింది. ఆమెకు మనస్సులోనే నమస్కరించాడు.

ఆ వేశ్య సీతారామారావుకు అనేక రూపాల్లో కన్పించింది. అనేక ముఖాలను ప్రతిబింబించింది.

ఒక ఏనాదివాడు తప్పత్రాగి తూలుతూ నడుస్తున్నాడు వాని భార్య వానిని రెక్కపట్టుకొని తీసుకెళ్తావుంది తప్పతాగిన తన మొగుడు ఏ క్షణంలోనయినా, నడివీధిలో సయితం ఎనను తంతాడని తెలిసిన ఏనాదివాని భార్య, సీతారామారావు జాలితో వేసిన "తాగావుటరా?" అన్న ప్రశ్నకు, "నీకేందయ్యా త్రాగితే!" అని, మొగుడుకు వత్తాసు వచ్చింది.

సీతారామారావుకు ఈ సంఘాన్ని తిన్న బుద్ధయింది కాని తలెక్కడో తోక ఎక్కడో అంతు చిక్కలేదు

చివరకు ఏ సంఘాన్నయితే తందామనుకున్నాడో, ఆ సంఘం, ఒక బహిరంగసభ రూపంలో ఎదురైంది వేదికమీద ఐదుగురు పెద్దలు సంఘంలోని మురికికి, అవినీతికి, మూర్తీభవించిన ప్రతిరూపాలుగా, పోత

శ్రీ టి. యస్. కృపానందమ్

పోసిన విగ్రహాలుగా కూర్చున్నారు. ఒంటెడు పూలమాలలతో అలంకరించుకొని కూర్చున్నారు. ఉపన్యాసా లిస్తున్నారు.

వారిని చూడంగానే సీతారామారావుకు కంపరం పుట్టింది. వాళ్ల ప్రవర్తనను చక్కబెట్టుకోలేని వీళ్లు, ప్రజలకు చెప్పే నీతేమిటని విస్తుపోయాడు. పెద్దరికాలంటే ఇవేనా అని ఆశ్చర్యపోయాడు. చివరకు పండ్లు నూరాడు. ఉడికి ఉడికి పోయాడు. వేదిక మీది కెక్కాడు. పెద్దలైన ఆ ఉపన్యాసకులను పేరు పేరునా పిలిచాడు. పెద్దలలోని వ్యక్తిగత లోపాలను, వికృత చేష్టలను బహిరంగ సభలో బహిర్గతంచేశాడు. లోకకళ్యాణార్థం ధర్మోపన్యాసాలు చేసి, త్యాగమూర్తులుగా పరిగణించబడుతూన్న ఆ పెద్దలు కిక్కురుమనకండా ఉండేటంతవరకు, వాళ్లను గూర్చిన రహస్యాలను బహిర్గతం చేశాడు. చివరకు జనాన్ని గూర్చి సమీక్షచేస్తూ జనానికి బుద్ధిలేదన్నాడు. గొర్రెల్లాంటి వారని అన్నాడు.

జనం ఉలికిపడింది. నాయకులను గురించి చెబుతూంటే నోరు తెరుచుకొని, కుతుకుతున నవ్వుకుంటూ విన్న జనం, తమనుగురించి చెప్పేటప్పటికి, "సీతారామారావుకి పిచ్చెక్కింది" అన్నారు. మదం ఎక్కిందన్నారు. మదం దించాలన్నారు.

అవకాశం చూచుకొని వేదికమీదివారూ, వేదిక క్రిందివారూ, పాఠం చెప్పి సీతారామారావుకు మదం దించారు. నోటికొచ్చిన బూతులు కూశారు. తలో తన్నూ తన్నారు. కసితీరిందాకా తన్నారు.

* * *

ప్రఖ్యాత తత్త్వవేత్త స్వర్గీయ మానవేంద్రనాథ్ రాయ్ అన్నారుగదా "మానవుడు సృష్టించిన ఉత్పత్తి సాధనాలన్నిటికన్నా మెదడు బలమైనదీ, గొప్పదైనదీనూ" అని.

ఈ మెదడనేది బహు విచిత్రమైనది. భావాలను సృష్టిస్తుంది. భావజగత్తునే నిర్మిస్తుంది. ఈ భావాలనేవి ఏలాంటి పనినైనా చేయగలవు. పరిణామశీలమైన ప్రపంచంలో, మానవుడు వ్యక్తిగతంగా గానీ, సంఘపరంగాగానీ ఈ భావాల స్వభావాన్నీ, వాటిశక్తినీ ఈ భావాల పుట్టుకకున్న పరిస్థితులనూ గ్రహించి, సమన్వయించుకొని ఒక నిర్మాణాత్మక పద్ధతిలో ఉంచలేపోతే, సర్వనాశనం తప్పదు. మానవునిచరిత్ర భూమిమీద విషాదాంతక మవక తప్పదు.

అందుకు తార్కాణం సీతారామరావు జీవితమే. ఒకచక్కని యువకుడు. మంచికుటుంబానికి వారసుడు. చదువూ సంస్కారం ఉన్నవాడు. హృదయముండి ప్రేమించే ధర్మపత్ని ఉంది. ప్రేమించగల బిడ్డలున్నారు. అయినా సీతారామారావు సాహిత్య ప్రపంచంలో కనీవినీ ఎరుగనట్టి అతివిషాదకర పాత్రగా జీవించి, అత్యంత దారుణంగా మరణించాడు. ఆధునిక యుగానికి సీతారామారావు పాత్ర ఒక కనువిప్పు. నిగూఢమైన ఆలోచన. ఒక ప్రగాఢమైన హెచ్చరిక.

కొంచెం నిశితంగా ఆలోచిస్తే, ప్రతిమానవుడూ ఎప్పుడో ఒకప్పుడు అసమర్థుడు గాకపోడు. సీతారామారావులోని ఛాయలన్నీగాని, కొన్నిగాని ప్రతివానిలో ఏదో ఒకసారి ప్రతిబింబించక పోవు. కాని ఆ అసమర్థత కున్న కారణాలను తొలగించుకొని, క్రొత్తపరిస్థితులను సృష్టించుకొని, ముందుకు సాగడం ద్వారానే మనగలిగిన ప్రతివాడూ మనగలుగు తున్నాడు. కాక అసమర్థతకు చిలవలు పలవలు ఊహించుకొని, అనిశ్చితభావాలను పెంపుచేసుకొని, జీవితంలో కావలసినదానిని విస్మరించి, కాలాన్ని వ్యయించి, ఇంకా అసమర్థుడై, సంఘంలో అసమర్థుడుగా ముద్రవేయించుకొని, జీవితంలో అసమర్థపు ఆలోచనలకు అల

వాటుపడి, సాలీడు గూటిలో చిక్కిన ఈగపగిది కొట్టుకుంటమే మిగులుతుంది.

అదే సీతారామారావుకూ జరిగింది.

ఏమీతెలియని శీనయ్య సుఖంగా బ్రతికితే, ఎన్నో తెలిసిన సీతారామారావు దారుణంగా బ్రతికాడు.

జ్ఞానం శీనయ్య కుందను కుందామా ?

జ్ఞానం సీతారామారావుకు లేదనుకుందామా ?

శీనయ్యకన్నా సీతరామారావుకు మిక్కిలిగానే జ్ఞానముందన్న విషయం నిర్వివాదాంశం అయితే అతనికన్నా ఇతను మిక్కుటమైన బాధామయ జీవితం గడిపాడన్నది గూడా నిర్వివాదాంశమే. కనక తేలిం దేమిటి ?

జ్ఞానం ఒక్కటే జీవిత పురోగమనానికి చాలదు. జ్ఞానం జీవితవికాసానికి, శాంతి సౌఖ్యాలకు పరమావ సరమే అయితే జ్ఞానం కత్తిలాంటిది ఉపయోగించు కోగల శక్తి ఉంటే ఆత్మరక్షణ చేస్తుంది. దుర్వినియో గం చేసుకుంటే ఆత్మహత్య కక్కురకొస్తుంది.

*　*　*

మోసాలు, ఘోరాలు, కుట్రలు, తాపత్రయాలు ఉన్నసంఘం సీతారామారావుని బైటికినెట్టింది నిద్ర గన్నేరు చెట్టుక్రింద రామయ్య తాతచేసిన కడసారి జ్ఞానబోధ విని విని ''అంతామిధ్య – మిధ్య గనకనే ఎటు త్రిప్పి చెప్పటానికయినా వీలవుతుంది'' అన్నాడు నిశ్శబ్దం బ్రద్దలయ్యేట్టు అరిచాడు.

ఆ బ్రద్దలయిన నిశ్శబ్దం యుగయుగాలకూ, తర తరాలకూ అందించే అపురసందేశం అదేనేమో !

నిజంగా అంతా మిధ్యేనేమో ''

కాకుంటే ప్రపంచం ఆవిర్భవించినదాది, మాన వుడు మాటనేర్చినదాది, ఈనాటికి ఎందరెందరు, ఎన్నెన్ని విధాల చెప్పలేదు ? పరస్పర విరుద్ధంగా ప్రవచించలేదు-?! వాస్తవానికి లక్కడేమన్నా ఉంటే, ఉద్వేగాకుంటే, ఇంతవిడ్డూరప్రసంగాలకూ, వికృత అన్వేషణలకూ, తావెక్కడఉంది.

ఒకడు వస్తాడు. ప్రపంచనాటక రంగాన్ని ఒక సారి పరికిస్తాడు తన్నుతాను చూచుకుంటాడు. తాను ఒక పాత్ర అని అనుకుంటాడు. తనపాత్ర కున్న రంగులూ రుచులూ నెమరు వేసుకుంటాడు, తెరలో మరుగైన పాత్రలతో ప్రాంటింగు' అందుకుంటాడు. తనవచనం తానుపలుకుతాడు. నిర్గమిస్తాడు.

ఇదేగా ఇన్నాళ్ళనుంచీ, తెలివిగల మానవులు చేస్తున్నపని '

వీళ్లలో ఏ ఒక్కడికన్నా సత్యసందర్శనం ప్రాప్తిస్తే, అసలు సత్యమనేది ఒకటుంటే, ఇన్ని అవక తవకల ప్రభోదాలకు తావెక్కడుంది' ఇందరు పాత్రల ప్రమేయమేముంది'!

అందుకే ఆ గన్నేరు చెట్టుక్రింద, ప్రపంచంలోని నిశ్శబ్దాన్నంతా, (అదే బహుశా చిరశాశ్వతమైన దేమో') తనలోనికి తీసుకొని, తనలోని విశ్వాసాన్ని, ఆ నిశ్శబ్దం బ్రద్దలయ్యేట్టు వదిలాడు సీతారామరావు. కొద్ది దూరంలోనే ఉన్న స్మశానంలో తానూ బ్రద్దలయ్యాడు

చదువరీ ' స్వర్గీయ గోపీచంద్, ''అసమర్థుని జీవయాత్ర'' విరచించిన రోజుల్లోనేగాదు, అంతకు మునుపూ సంఘంలో సీతారామారావు లున్నారు. ఇకముందూ సీతారామారావు లుంటారు నీకెక్కడన్నా ఒక సీతారామారావు యాదృచ్ఛికంగానైనా సరే, ఎదురైనప్పుడు, అతన్ని ఈసడించుకోబోకు. అవహేళనా చేయబోకు. అతనికి సానుభూతి చూపించు. వీలుంటే అతని మానసిక వ్యధలు విని, అతని ఆలోచనలను క్రమబద్ధం చేయప్రయత్నించు. జీవిత వికాసాని కనుగుణ్యంగా మలచుకునేట్టు చేయ ప్రయత్నించు రామయ్యతాతమాట విన్నాడు కన

శ్రీ టి. యస్ కృష్ణానందమ్

కనా అని అనుకోబోకు, వినిఉన్నట్లయితే సీతారామా రావు అయిఉండేవాడుగాదు బ్రతుకుపాటలో విజయం వైపు, తృప్తి నింపుకొని ప్రయాణించే పలువురిలో ఒకడుగానే ఉండిఉండేవాడు.

వాళ్ల మామమాట విన్నాడు కనుకనా అని అనుకో బోకు. విని ఉన్నట్లయితే, మామల ఆశీర్వాదాలతో, మెరుగైన జీవితాలను బ్రతుకుతూన్న పలువురిలో ఒకడుగానే ఉండిఉండేవాడు.

వాళ్ల అధికారిమాట విన్నాడు కనుకనా అని అనుకోబోకు వినిఉన్నట్లయితే, అధికారుల ప్రాప కంతో అంతస్తుల భవనాలపై బ్రతుకుతూన్న పలు వురిలో ఒకడుగానే ఉండిఉండేవాడు

ఎవరిమాటా విననందువల్లనే, అతను చిరస్మర ణీయుడైన సీతారామారా వయ్యాడు. అందుకే వివేచన గల నీ మేదస్సు నుపయోగించి, అమృతపూర్ణమైన నీ హృదయాన్ని మథించి, అతనిపై సానుభూతిని చిలికి, వాని జీవితసేదను తీర్చు.

## ఉషారాణి

మనుష్యులు వివిధ రకాలు వారి అనుభూతులు పరిపరి విధాలు. అనుభవాలు భిన్న చిత్రాలు. ఒకో మనిషికి ఒకో స్థాయి ఉంటుంది ఆ స్థాయి దాటి పై స్థాయికి పోవుటకు నూతన శక్తిని సంతరించుకొని ముందుకు సాగిపోవటం సృష్టి పరిణామములో సహజ క్రమం. ఒక రకము స్థాయికి చెందిన మనిషి, ఆ స్థాయిలో కొంత అనుభవం పొందిన అనంతరం, అనేక కారణాలతో తనపైన, తన స్థాయిపైన అసం తృప్తిని పెంచుకుంటాడు. తన దొక స్థాయి అని తెలుసుగాని, తనదేస్థాయో తెలియదు, ఉన్న స్థాయి తీవ్ర అసంతృప్తిని గలిగిస్తుంది. విసుగు వస్తుంది తన స్థాయికన్నా తన మేధస్సు పెరిగింది. అను భూతులు పెరిగినయ్. తాను ఎదిగాడు. కాని పరి సరాలు, బంధనాలు పాతవిగానే ఉంటాయి. తన మనస్సు మరెక్కడికో రెక్కల గుర్రాల వగిది పరు గెడుతుంది నూతనత్వంకోసం అర్రులు చాచుతుంది తనలో తాను కొట్టు మిట్టాడుతుంది. దారీ తెన్నూలేక ప్రయాణిస్తుంది. దారి తెలియక, తెలిపే దిక్కులేక, తిరిగి ప్రయాణం ప్రారంభించిన చోటికే వస్తుంది విసుగు ఎక్కువవుతుంది. అసంతృప్తి ఎక్కువవుతుంది. శూన్యత ఎక్కువవుతుంది, కాళ్ళు చేతులు కట్టివేసిన వాని వగిది అల్లాడుతుంది. మనస్సుకు ఉక్కబోస్తుంది.

మేధావిగా రూపొందిన మానవుడు తనదానికి తరు వాతిదయిన ఆధ్యాత్మిక స్థాయిని అందుకున్నప్పుడు తన జీవితానికి ప్రశాంతతను సాధించుకుంటాడు కొట్టుమిట్టాడుకుంటం సమసిపోతుంది. రెక్కల గుర్రాలపైని ప్రయాణించిన మేధస్సుకు గమ్యం కనపడు తుంది. హిమాలయ పర్వతాల్లోని పవిత్ర సరోవరాల నిర్మల జలాలలాగా స్వచ్ఛందతను పొందుతాడు. సేదతీరుతాడు తన చుట్టుప్రక్కల వారి సేదను పోగొడతాడు

ఉషారాణి జీవితం గూడా తన మేధస్సును గుర్తించి, దానినే నమ్ముకున్నంత వరకు దారి తెలి యని పాంధురాలయింది. ఎక్కడెక్కడో తిరిగింది. ఎందరెందరినో అనుభవించింది ఎంత దూరమో వెదకింది. జీవితాన్ని ఒక ఆటగా ఆడింది. పాటగా పాడింది, కావాలనుకున్న తృప్తిదొరకలేదు. రామాను జం, చక్రవర్తి, శ్రీకాంత, కమలాకరం, వీళ్లందరూ రూపాలలో మార్పు వినా అనుభవంలో ఈమెకు అందించిన దొకటే శారీరక సు ఖానుభూతులలోని తరతమ భేదాలు తప్ప, చౌకబారు ఆనందం మినహా ఈమె పొందగలిగిందేమీలేదు. మనుష్యులు మారిన కొద్దీ తనలోని అసంతృప్తీ పెరిగింది, తృప్తికోసం

చేసిన ప్రతి పనిలోనూ, అసంతృప్తి పెంచిన మోతా దులో ఎదురయింది.

వాసనలు బలిశాయి కోరికలు విజృంభించాయి. జీవితాన్ని చెరకుగడను పిల్చినట్లు పీల్చాలని అనుకొంది. గోపీచంద్‌గారి అనర్గళ రచనలో అతిరూప సౌందర్యవతిగా మలచబడ్డ ఈ సౌభాగ్యవతి ఇంతై, ఇంతింతై, ఉన్నట్లుండి ఆంధ్ర సాహిత్య ప్రపంచంలో సర్వశోభాయమానమైన కాంతులు విరజల్లి, హైందవ స్త్రీ అతిలోక సౌందర్య చిత్తరువుకు దివ్య ప్రకాశక మయిన మణితిలకముగా భాసించింది చదువరులమ ఉర్రూతల లూగించింది దివ్య మంగళ విగ్రహంలా పాఠకులను వెన్నాడింది మూసుకున్న ఆమె కన్నులు, ముకుళించిన పద్మంలాగా కనిపించినయ్. చెదరిన ఆమె సోగకురులు ఇంద్ర నీలమణి కాంతుల వలె మురిపించినయ్ వసివాడిన ఆమె మోము ప్రశాంతతకు నిలయమయింది సడలిన ఆమె శరీరం దూది పింజ మెత్తదనాన్ని స్ఫురింపజేసింది. నునుపుదేరి, ఛాయలీనిన ఆమె కాలిపిక్కలు, పాశ్చాత్య ప్రాచీన వాఙ్మయంలోని అలోని రూపలావణ్యరాశి డెర్రైలా కాలి పిక్కలను జ్ఞాపకం చేసినాయ్. సృష్టికర్త అందాల పోటీ పరీక్షకు పంపిన అత్యద్భుత శిల్పంలా ఖండం ప్రాణం పోసుకొని, విభవించింది. శ్రీ కాంత లాంటి నవ యువకుణ్ణేగాక, చక్రవర్తిలాంటి కుటుంబీకుడ్నేగాక, వయో వృద్ధులైన చంద్రపడనుల వారిని సయితం ఆకర్షించింది మాటలో మత్తు ఎక్కించింది చూపుతో స్పృహ పోయేంతపని జేసింది మనిషిని నిలువెల్లా లోపరోప జేసింది. తెలుగు పాఠక ప్రపంచాన్ని నిర్మలాకాశం, తెరపి వెన్నెల ఆకర్షించినట్లు ఆకర్షించింది.

సమస్యలను నిర్లక్ష్యంతో జయించింది. తెలివిని సంతోషంకోసం వ్యయించింది. చక్రవర్తితోడి తన సాంగత్యం, రామానుజంగారికి అనుమానం కలుగకుండా ఉండేట్లు ప్రవర్తించింది. కాగా 'ఉష ఎంత అమాయకురాలూ' అని రామానుజంగారు మనస్సులో అనుకునేట్టు చేసింది.

శ్రీకాంతతోడి తన సాహచర్యం, చక్రవర్తికి, రామానుజంగార్లిరువురకు అనుమానం కలుగకుండా ఉండే విధంగా నటించింది. కాగా 'ఉషకు నాపైని ఎంతప్రేమ' అని చక్రవర్తి మనస్సులో అనుకునేట్టు చేసింది.

"నిన్ను గురించి నేను చెడు తలపులు తలపగలనా ఉషారాణీ"అని శ్రీకాంత్ అనేట్టు చేసింది. అని అతనిలోని ఆప్యాయతనంతా ముద్దచేసి, తమల పాకులవంటి ఆమె కరపల్లవాలను ముద్దుపెట్టుకొనేట్టు చేసింది

ఎప్పుడైనా తాను చేస్తున్న పని తప్పేమోనని స్ఫురించినపుడు, అవినీతిదాయకమని లీలగా ద్యోతక మయినపుడు, తాను అవలంబించుతూన్న కార్య సరళికి అనుకూల భావాలకోసం, ఫ్రెంచి రచయితలను జ్ఞాపకం తెచ్చుకుంది. వారి వాదనలను తనకు అనుకూలంగా త్రిప్పుకుంది. సంఘ దృష్టిలో తాను అనిందార్హురాలుగా ఉండటానికేగాకపోయినా, తన ఆత్మతృప్తికి ప్రసిద్ధ రచయితల భావాలను స్ఫురింపచింది.

కాని తృప్తి దొరకలేదు. జీవిత గమ్యం అంతు పట్టలేదు చెరకుగడలను మొత్తంగా తిని హరాయించుకొందామనుకున్న ఉషారాణికి, ఏ కొద్ది రసమో అందిందిగాని, గిడలుమాత్రం పిప్పి రూపంలో మిగిలి నిరుపయోగమయ్యాయి. అసంతృప్తి అసంతృప్తిగానే మిగిలింది. రసకుతానై మీటిన వీణాతంత్రి నినదిస్తూ, రసవాహినియై, అమృత ఝరులను ఒలికిస్తూ సాగిన ఉషారాణీ జీవిత

శ్రీ టి యస్ కృష్ణానందమ్

ప్రయాణంలో, మొదటినుంచీ ఎక్కడో ఒక అపశృతి చూచాయగా విన్పిస్తూనే ఉంది. అసంతృప్తి వెంటాడుతూనే ఉంది. ఆమెలోని శూన్యత శూన్యంగానే ఉండిపోయింది రామానుజంగారు, చక్రవర్తి, శ్రీకాంత, కమలాకరం—వారు నలుగురి జీవిత అధ్యాయాలలో ఉషారాణి ప్రముఖపాత్ర వహించింది. కాని ఈమె జీవిత ప్రకరణాలలో వారు నలుగురూ ఉపపాత్రలు మాత్రమే. ఈమె ఈమే. ఈమె ప్రకరణంలోగూడా ప్రముఖ భూమిక ధరించింది. జీవితపు నాలుగు స్తంభాలాటలో, ఈ నలుగురను, నాలుగు స్తంభాలుగా ఉపయోగించుకొంది. ఇంకా ఆటలాడేదేకాని ఢిల్లీ ప్రయాణం తన జీవిత దృక్పథాన్నే మార్చివేసింది.

హైద్రాబాద్‌లోని తన అసంతృప్తిని కొంతమేరకయినా తగ్గించుకుంటానికి ఢిల్లీ పోయింది. ఆగ్రా దర్శించింది.

జీవితంలో మొదటిసారిగా, ఆగ్రాలోని మహమ్మదీయుల అపురూప శిల్ప సంపదనూ, యమునా నదీ సైకతస్థలి సౌందర్యశోభలనూ చూచినపుడూ, చారిత్రక లోతులలోని హస్తిపురి, ఇంద్రప్రస్థ, కురుక్షేత్రం, బృందావనం, రేపల్లెవాడలాంటి పునీత ప్రదేశాలూ, వాటి గతకాలపు ఔన్నత్యం, ఆమె మనఃఫలకంపై దోతకమైనపుడూ, తన జీవితం, తన జీవిత సరళి జ్ఞాపకంవచ్చి, తనను దారితప్పిన పాంథురాలిగా గుర్తించుకొంది. తాను సాగిస్తూన్న నడక, నడుస్తూన్న బాట చాలా యిరుకున పెడుతూన్నాయని గమనించింది తన జీవితంలోని అసంతృప్తికి నిస్సహాయతను జోడించి, ఒక రూపకల్పన జేసుకుంది. ఈ రూపంలోని అంగాలన్నీ తాను ఎరిగినవే. కాని మొత్తం రూపంమాత్రం సరిక్రొత్తది.

ఢిల్లీలో శ్రీకాంత్ ఒకరాత్రి, ఉషారాణిపై అతి క్రూరంగా చేయిచేసుకుంటాడు. చెంప ఛెళ్లుమంటుంది. కండ్లు బయర్లుకమ్ముతాయి. కాని వాస్తవానికి ఆ ఛెళ్లుమన్నది అతికోమలమయిన ఉషారాణి చెంపగాదు. ఆ దెబ్బ ఆమె దేహానికీగాదు : అతి సున్నితమైన ఆమె మనస్సుకు ఫెళ్ళున తగులుతుంది. ఆ దెబ్బలు ఆమె హృదయానికి తగులుతాయి. ఆ మొరటు గ్రుద్దులు ఆమె మలిన జీవితాన్ని బ్రద్దలుచేస్తాయి. చెంపన మరకపడుతుంది. కాని తనజీవిత మాలిన్యపు మరకలన్నింటినీ కడిగివేసే మెరుపుమరకగా ఆ సంఘటనను స్వీకరిస్తుంది.

ఆగ్రా పరిసరాలలో జరిగిన నూతన మానసిక రూపకల్పన ఈ సంఘటనతో జీవంపోసుకుంది మరుక్షణాన్నే హిమగిరులకు ప్రయాణం.

హిమాలయాల పరిచయంతో, పాతపరిచయాల ప్రసక్తి పోతుంది ఉషారాణికి. నూతనానుభూతులను అనుభవిస్తుంది. ఏనాడూ తనకందక, అగమ్యదూర తీరాలలో నిక్షేపించబడిన శాంతిపాత్ర లభ్యమయింది. కరుణానంద స్వాములవారి దివ్యతేజము, వెన్నెల కన్నులు, గంభీరధ్యానముద్ర, కాంతి వలయము, ఆశ్రమవాసుల యోగనిరతి, ఉషారాణిని సంపూర్తిగా మార్చివేశాయి. ఆమె గమియింపవలసిన మార్గాన్ని సుద్యోతకంచేశాయి. ఇక ఈ బాటలో మలుపులు లేవు. వంకరలూ లేవు సూటిగా ఎదురుగా వెలుగులతో నిండి ఉంది.

పది సంవత్సరాలక్రిందట అనేక ఆకర్షణలతో తెలుగు పాఠకలోకాన్ని ఉర్రూతలూగించిన పూర్వాశ్రమంలోని ఉషారాణి, తన జీవితపు చరమాధ్యాయంలో తెలుగు పఠితలోకానికి దేవదారువృక్షం క్రింద అరుగుమీద పులిచర్మాసనంపై పద్మాసనధారియై, విరిసిన తామరలవలె ప్రకాశిస్తూన్న చేతులు

ఒడిలో వెల్లకిలావుండి, నిశ్చలతతో నాసాగ్రంపై దృష్టినిలిపిన అర్ధ నిమీలిత నేత్రాలలో, గర్జనభర్జనలు లేని శరత్కాల మేఘంవలె, అలలులేని సరో వరంవలె, కదలక వెలిగే దీపశిఖవలె మహాయోగినిగా ప్రత్యక్షమయింది.

ఆనాడు ఉషారాణికి పరపురుష సాంగత్యంతో వొళ్ళుపులకరించేది జవజవలాడేది. నరాలు జివ్వున లాగేవి. కొనలు బలవంతంగా విచ్చుకున్నవయ్యేవి ఈ లోకాన్నే మరచేది అనిర్వచనీయ ఆనంద డోలికలలో తేలిపోతూ ఉండేది పవన వీచికల తాకిడికి వొణికిన లతవలె ప్రియుల కౌగిట్లో వొదిగి వొణికేది సుదూర గగనతలంలోకి ఎగురనుంకించు పక్షి, రెక్కలు అల్లార్చు పగిది రెపరెపలాడేది ఉచ్ఛ్వాస నిశ్వాసాలు వడిగా, వేడిగా, తియ్యగా రగిలి ప్రియులను ఉన్మత్తులను చేసేవి

ఈనాడు ఉషారాణికి గంగోత్రి సందర్శనంతో వొళ్ళు పులకరించింది గంగాభవాని మీదుగా వీచిన శీతల పవనాల తాకిడికి జవజవ జవజవ లాడింది. నరాలు క్రొత్తమార్పుకు లోనయినాయి. ఊర్పులు ఎక్కువైనాయి. శరీరపు ఎడో భాగం, అమె అధీనంతప్పింది. నవజవ్వనివలె ఉత్సాహతరంగాలతో పొంగిపొరలుయున్న గంగా మాయికి ప్రజలుచేయు భజనలు, పూజలు తిలకించి ఈ లోకాన్నే మరచింది అనిర్వచనీయ ఆనంద డోలికలలో మునిగిపోయింది. భరించలేని తియ్యదనంతో హృదయం బ్రద్దలవుతుందేమో ననిపించింది. ఉచ్ఛ్వాస నిశ్వాసాలలో వడిలేదు, వేడిలేదు, సమస్థాయిలో శాంతంగా, శీతలంగా ఉన్నాయి

ఆనాటి జీవితపు తీపిలో అడుగున చేదు పేరుకొని ఉంది. ఈ నాటి జీవితపు తీపి స్వచ్ఛమయినది అతి మధురమైనది. ఆనాటి జీవితం క్షణంక్షణం అశాంతికి నిలయం ఈనాటి జీవితం అనుక్షణం ప్రశాంత వికసితం.

పూర్వాశ్రమంలోని ఉషారాణి తేజస్సు, ప్రతిభ, మేధస్సు, చైతన్యం, ఎంతగా పాఠకులను ఆకర్షించి, ఉత్తేజం గల్గించాయో, కడకు ఈ మహాయోగిని సందర్శనంకూడా, అంతకుమించిన ఆకర్షణను, ఉత్తే జాన్ని, మత్తునూ గల్గించాయి.

తెలుగు సాహిత్యాకాశంలో ఈ ఉషారాణి ధ్రువ తారగా వెలుగొందుతుంది. ఉషారాణి పాత్ర చిత్ర ణ, పాత్రపోషణలలో గోపీచంద్ ప్రతిభ సర్వత్రా ద్యోతకమౌతుంది. ఈ నవలంతటా వారు పద్యరచన సాగించారా, గద్యరచన సాగించారా అని చాలసార్లు అనుమానమొస్తుంది. భావానికి భాష దానిసగా లాస్యం చేయటానికి ఈ నవల ఒక మచ్చుతునక. శ్రీ గోపీ చంద్ ప్రతిభా ప్రకర్షకు ఈ నవల ఒక ఉదాహరణ

బాహ్యసౌందర్యాన్ని వర్ణించేప్పుడు మహాకవుల ప్రబంధ సుందరీమణుల శిల్పకల్పనలను, కొనగోటి మీటతో మించిన అపురూప సౌందర్య శోభలను మల చిన వారి కలం, అంతసునాయాసంగానే, మానసిక అలజడులను, మనస్తత్వశాస్త్రపు లోతులను వాటి కాధారామైన అత్యంత భయావహమైనవి, మిక్కిలి ఆహ్లాద కరమైనవి అయిన స్వప్నసీమలను చిత్రిం చింది మరి అంత ప్రజ్ఞాపాటవంతోనే తాత్త్విక దృష్టినీ, తపో నిరతనీ, ఆధ్యాత్మిక చింతననూ అభి వర్ణించింది.

సజీవరూపకల్పనను చేయుటలో ఏ నాడో ఒక ప్రత్యేకతను సంతరించుకొన్న గోపీచంద్ సిద్ధహస్తం రానురాను అత్యున్నత కళాంతస్థుల నందుకొని, వెలువరించిన ప్రతి రచనను ఒక అపురూప కళా ఖండంగా తయారుచేసింది.

శ్రీ టి యస్ కృష్ణానందమ్

# "... ... విలునామా"

శ్రీ త్రిపురనేని గోపీచంద్‌గారిని గురించి ఈనాడు కొత్తగా తెలుగువారికి పరిచయం చేయవలసిన అవసరంలేదు కథకుడుగా, నవలాకర్తగా నాటికా రయితగా, వ్యాసరచయితగా, దర్శకుడుగా, ఆయన మనందరికీ తెలుసు. ఈ అన్నిశాఖలలోనూ వారు సమగ్రమైన, శక్తిమంతమైన ప్రతిభను కనపరచా రనడంలో సందేహంలేదు. బహుముఖ ప్రజ్ఞాశాలియైన శ్రీ గోపీచంద్‌గారి ఇటీవలి రచనల్లో, ఒక నూత నాంశం వెల్లివిరుస్తూ ఉంది. ఈ అంశాన్ని అందు కోవడానికి కొంత వివరణ కూడా అవసరమనిపిస్తూ ఉంది నాకు.

గోపీచంద్‌గారి రచనలను పరిశీలిస్తే ఆయన భౌతికవాదిగా రచనావ్యాసంగాన్ని ప్రారంభించారని ఇట్టే తెలిసిపోతుంది. ఆనాటి 'భార్యల్లోనే ఉంది'— 'గీతా పారాయణం'—'సరే కానివ్వండి' — 'ధర్మాసుపత్రి' — 'దేవుని జీవితం' — మొదలైన పుస్తకాలే ఇందుకు నిదర్శనాలు.

'ఉభయకుశలోపరి' అన్న ప్రసంగ సంపుటంలో కూడా మనకు భౌతిక వాదచ్ఛాయలే కనిపిస్తాయి. అటువంటి మనిషి 'తత్త్వవేత్తలు' ఎలా రాయగలిగాడు? 'పోస్టుచెయ్యని ఉత్తరాలు' ఎలా రాయగలిగాడు? పచ్చి భౌతికవాదిగా ఉండే గోపీచంద్‌లో అధ్యాత్మికవాద స్పృహ ఎలా కలిగింది?' ఎందుకు కలిగింది? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పుకొంటే తప్ప, ఇటీవలి రచనల్లోని పరిణామం మనం అర్థం

శ్రీ రావూరి భరద్వాజ

చేసుకోలేము, 'పోస్టుచెయ్యని ఉత్తరాలు' అన్న పుస్తకంలో రచయిత ఇలా చెప్పుకొంటాడు.

''ఏదో ఒక సిద్ధాంతంతో తృప్తిపడే రోజులుగా కనపడటంలేదు ఈ రోజులు, అన్ని సిద్ధాంతాలలోని మంచినీ ఏరుకొని, పోగుచేసుకొని, ప్రయాణం చెయ్యవలసిన రోజులుగా కనపడుతున్నాయి ఇవి." అంటారు రచయిత

మరోచోట—

''భౌతిక, ఆధ్యాత్మిక సిద్ధాంతాలు అనాదినుంచీ ఉన్నవి రెండు సిద్ధాంతాలలోనూ మహాపురుషులు జన్మించారు. ప్రచారం చేసారు. కానీ, ఏసిద్ధాంతమూ రెండో సిద్ధాంతాన్ని జయించినట్లు కనిపించదు. ఒక్కొక్క సిద్ధాంతానికి ఒక్కొక్క పరిస్థితిలో ప్రాముఖ్యం వొస్తూఉంది అంతే' వెంటనే రెండవ సిద్ధాంతం తన 'పగ' తీర్చుకొంటూ ఉంది. ఇలా జరిగి పోతూనే ఉంది. అంతేగానీ, ఏ సిద్ధాంతం, రెండో సిద్ధాంతాన్ని జయించేటట్లు కనపడదు...ఈ రెండూ సామాన్య నిర్వచనప్రకారం అసంపూర్ణ సత్యాలే! అయితే రెండింటిలోనూ కొంతవరకూ సత్యం ఉంది. అందువల్ల రెండు సిద్ధాంతాలూ కొంతకొంత మందిని సంతృప్తి పరుస్తున్నాయి ... అలా అనిపించటంతో ఈ రెంటినీ సమన్వయపరచటం యొక్క ఆవుసరం తెలిసింది'' అంటారు శ్రీ గోపీచంద్

ఆధ్యాత్మిక, భౌతిక వాదాల సమన్వయ సిద్ధాంతం, వ్యక్తివికాసానికి చాలా అవసరమన్న విశ్వాసం, 'పోస్టుచెయ్యని ఉత్తరాల'లో రచయిత వెలిబుచ్చారు. పండిత జవహర్లాల్‌నెహ్రూ కూడా ఇదే అభిప్రాయాన్ని తన 'భారత దర్శనం' అన్న గ్రంథంలో వెలిబుచ్చుతున్నారు. ''నేను, ఉపనిషత్తుల పఠనం, వేదాంత చర్చలూ విరివిగా ఉండే కుటుంబంలో పుట్టటం చేతకాబోలు, నాకు కార్యకారణవాదంతో కూడిన కర్మసిద్ధాంతాన్నీ, పునర్జన్మనీ, శరీరానికి స్వతంత్రంగా చైతన్యం ఉండటానికి వీలవుతుందనే భావాన్నీ నమ్మబుద్ధి అవుతుంది'', అంటారు శ్రీ నెహ్రూ అంతేకాదు, రాష్ట్రపతి శ్రీ రాధాకృష్ణ పండితులు, ఎందరో ప్రముఖ శాస్త్రవేత్తలూ కూడా ఈనాడు ఈరెండు వాదాల సమన్వయావసరాన్ని పలుమార్లు చెబుతూ వస్తున్నారు.

'' గోపీచంద్‌గారు మారిపోయారు '' అనడం తరుచుగా వింటూంటాను. మారిపోవడం గొప్ప అపరాధమని వారెందు కనుకొంటారో నాకు బోధ పడకుండా ఉంది. చైతన్యమున్న ప్రతిప్రాణీ మారుతూనే ఉంటుంది కానీ మార్పనేది 'మాయ' కానే కాదు. సహజమైన ఒకప్రవృత్తి. గోపీచంద్‌గారు అన్నట్లు "ఎవ్వరికి వారు తమ గతాన్నిబట్టే మారుతారు. కాబట్టి మార్పులో ఎప్పటికప్పుడు ఒక పద్ధతి కనిపిస్తుంది మార్పు మిరకిల్ కాదు'',

భౌతికవాదిగా జీవితం ప్రారంభించిన శ్రీ గోపీచంద్, ఈనాడు అతీత మానసిక వ్యవస్థను గురించి ఆలోచించే దశకు వచ్చారంటే, భౌతికవాదంలో నిక్షిప్తమయి ఉన్న ఆధ్యాత్మిక వాదనాంశాలు ఇప్పటికి వెలికి వస్తున్నాయని అర్థం.

ఈ దృష్టితో ఇటీవలి వారి రచనలు కొన్నింటిని పరిశీలించి చూదాం.

భావాలలో రెండు రకాలున్నాయి ఒక రకం భావాలు పెద్దగా వినిపిస్తాయి. అందరికీ ఇట్టే అర్థమయిపోయినట్లుగా ఉంటాయి. రక్తాన్ని ఉడుకు లెత్తిస్తాయి. వ్యక్తిలోని ఉద్రేకాలను మేలుకొలిపి, తీవ్రంగా రెచ్చగొడుతాయి. మనిషిని ఆవేశంలో వివశుణ్ణి చేస్తాయి. ఫలితానికి మాత్రం తాము జవాబు దారీ తీసుకోవు. సద్యఃఫలం కోరే రాజకీయ నాయకులలో ఈ రకం భావాలను మనం చూస్తూ ఉంటాం.

శ్రీ రావూరి భరద్వాజ

రెండోరకం భావాలు. వీటికి పూర్తిగా భిన్నమైన మార్గంలో ఉంటాయి. ఇవి గొడవ చెయ్యవు. అల్లరి పెట్టవు. ఉద్రేకాలను రెచ్చగొట్టవు. ఉండీలేనట్లుగా ఉంటాయి. సద్యః ఫలితాలను కూడా ఇవ్వలేవు. కానీ ఈ రకమైన భావాలు మధురమైన సంగీతం వంటివి. సహజమైన సుగంధం వంటివి. వీటిరూపం చాలా సున్నితంగా ఉంటుంది చటుక్కున వీటి ఉనికిని పోల్చుకోవడం కూడా కష్టమే. కానీ, వ్యక్తిలో పరివర్తనను తీసుకురావడానికి, అతన్ని ఆలోచనోన్ముఖుణ్ణి చేయడానికి, ఆతనిలోని మానవతను-దేవతాంశాన్ని కూడాను-మేలుకొలపడానికి, తన పరిసరాలను అవగాహన చేసుకోవడానికి - చదీచప్పుడు చెయ్యని ఈ భావాలే ఉపకరిస్తాయి ఇవి నరాలమీద పని చెయ్యవు మనస్సుమీద మాత్రమే పనిచేస్తాయి. త్రిపురనేని గోపీచంద్ ఇటీవలి రచనల్లోని భావ వాహిని ఈ కోవకు చెందిందే

రమారమిగా పది, పన్నెండు సంవత్సరాల్క్రిందట ఆంధ్రపత్రిక సారస్వతానుబంధంలో వారి "పోస్టు చెయ్యని ఉత్తరాలు" ప్రకటింపబడినపుడు, పాఠక లోకంలో కలిగిన సంచలనం ఇప్పటికీ నాకు జ్ఞాపకముంది గోపీచంద్‌గారి కథలను హస్తార్పితంగా చదివిన వారిలో నేనూ ఒకణ్ణి. ఆనాడు జరిగిన సంచలనంలో నాకూ, అంతో ఇంతో భాగం ఉంది. అప్పట్లో నామీద గుడిపాటి వెంకటచలం, త్రిపురనేని రామస్వామి చౌదరి, గోపరాజు రామచంద్రరావు గారల ప్రభావం - కొంత ముమ్మరంగానే ఉండేది. వీరు చెప్పిందే సత్యమనుకొంటూ ఉండేవాణ్ణి. అంతే కాదు - ఇంతకు మించిన సత్యాలు ఉండవని, ఉండటానికి వీలులేదని కూడా నేను అనుకొంటూ ఉండేవాణ్ణి. ఒకవేళ ఎవరన్నా ఉన్నాయనిచెప్పినా, నాకు నమ్మబుద్ధయ్యేదికాదు.

ఇన్ని సంవత్సరాలు గడిచాక, అటు జీవితం నుండి, ఇటు ఉద్గ్రంథాలనుండీ అనుభవాలు తీసుకొన్నాక, ఆనాటి నా ఆలోచనలు తలచుకుంటే, నవ్వు వస్తూ ఉంటుంది. ఇప్పటికీ, ఈ ముగ్గురి వ్యక్తిత్వాలనుగానీ, వీరు వెలుబుచ్చిన భావాలనుగానీ, నేను పూర్తిగా కాదనడంలేదు. వీరు చెప్పిందీ, వ్రాసిందీ కూడా నిజమే. కాని అది సమగ్రం కాదనుకొంటాను. సమగ్రమైన సత్యస్వరూపాన్ని, తలా వొక మూల నుండీ దర్శించి, తాము దర్శించిన భాగాలను మాత్రమే అందంగా, శక్తిమంతంగా చిత్రించా రనుకొంటున్నాను ఒక మహాభవనంలో కిటికీలు, దర్వాజాలు. గోడలు, మెట్లు, ఉండేమాట నిజమే. కాని, ఇవి మాత్రమే భవనం అనిపించుకోవు వేటివ్యక్తిత్వం వాటికున్నప్పటికీ, అన్నింటిని సమన్వయీకరించు కొంటే తప్ప మనకు సంపూర్ణ భవన చిత్రం కనిపించదు.

ఆనాడు నేనిలా అనుకొనేవాణ్ణి కాదని ఇంతకు ముందే మనవిచేశాను భౌతికవాదం ధోరణి భౌతిక వాదానిదేననీ, ఆధ్యాత్మికవాదం ధోరణి ఆధ్యాత్మిక వాదానిదేననీ, నేననుకొంటూ ఉండేవాణ్ణి. ఈ రెంటికీ సంబంధం ఉంటుందనిగానీ, ఉండే అవకాశం ఉన్నదనిగానీ, నేను అనుకోలేదు. అలాంటిస్థితిలో చదివాను "పోస్టుచేయని ఉత్తరాలు."

'అపస్వరాలు' నవల చదివినవారు 'శారద' పేరు మరిచిపోరు. ఆ రోజుల్లో 'శారద' కూడ మాతో పాటు ఉండేవాడు. చదివిన పుస్తకాలను గురించీ, వ్రాసిన కథలను గురించీ, వ్రాయాలనుకొన్న వాటిని గురించీ, చర్చలు జరుపుకొంటూ ఉండేవాళ్లం. ఇంచుమించుగా అతనూ నాలాంటి వాడే. నా అభిప్రాయాలకు, అతని అభిప్రాయాలకు స్పష్టమైన తేడా లున్నప్పటికీ చలం, కవిరాజు, గోరాల విషయంలో

". వీలునామా"

మాత్రం, ఏకీభవిస్తూ ఉండేవాళ్లం. కాబట్టే 'పోస్టు చెయ్యని ఉత్తరాలు' మా చర్చకు 'ముడివస్తువు'గా ఉపకరించాయి

"జీవితంలో వోడిపోయిన వారంతా వేదాంతు లౌతారు. రక్తంలో జవచచ్చినవారూ, దరిద్రులూ, సంసారంలో సుఖంలేనివారూ, ఆర్జన తెలీనివారూ, రోగిష్టులూ ఆధ్యాత్మికవాదం చెబుతుంటారు" అనే వాడు శారద.

అతని వాదన అప్పట్లో నాకు నచ్చినప్పటికీ, అంతకు మించిన శక్తి ఏదో ఉండాలన్న అనుమానం కలుగుతూ ఉండేది రక్తంలో జవచచ్చిపోవడమూ, దరిద్రమూ, సంసారంలో సుఖం లేకపోవడమూ, సంపాదన తెలీకపోవడమూ మాత్రమే మనిషిలో ఆధ్యాత్మిక స్పృహ కలిగిస్తుందంటే, నాకు నమ్మకం లేదు ఇదే నిజమయితే ప్రపంచమంతటా చాలా మంది ఆధ్యాత్మిక వాదులు ఉండి ఉండాలి మరి కానీ అలాలేరు అదీగాక-బాగా ఉన్నవారుకూడా, ఆధ్యాత్మిక వాదులవుతున్నారు. జనక మహారాజు సంగతేమిటి ? ఆయన బ్రహ్మాండమైన ఒక రాజ్యాన్ని పరిపాలించాడు రాజ్యాంగ యంత్రాంగాన్ని నిర్వహిస్తూనే ఆధ్యాత్మికంగా, తనను తాను పెంచుకొన్నాడు, 'ఋషి' అనిపించుకొన్నాడు జనకమహారాజు ఆధ్యాత్మిక చింతనకు అతని రాజ్యంగానీ, బంధువులుగానీ, సిరిసంపదలుగానీ అడ్డంకాలేదు అంటే - భౌతిక, ఆధ్యాత్మిక వాదాలకు-వైరుధ్యం లేదనీ, అవి రెండూ సహజీవనం చేయగలవనీ అనుకోవలసి ఉంటుంది.

ఐనా, ఈ రెండింటి సమన్వయం నాకు చిత్రంగా కనిపించేది పదేపదే చదివి మననం చేసుకొని, బోధపరచుకోవడానికి ప్రయత్నించాను.

ఒక పుస్తకమే కానివ్వండి, అందులోని భాగం కానివ్వండి, అర్థంచేసుకోవడం అన్నది, ఆయా వ్యక్తుల స్థాయిమీదా, సంస్కారం మీదా ఆధారపడి ఉంటుందనుకొంటాను. పోతన భాగవతంలోని అనేక పద్యాలు-ముఖ్యంగా "ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై___" అన్న పద్యమూ, "ఇందు గల డందులేడను సందేహము వలదు" అన్న పద్యమూ చిన్నతనంలోనే చదివాను. అప్పట్లో ఆ పద్యాలు, ఉత్తమపద్యాలుగా మాత్రమే నాకు-కనిపించేవి, ఈనాడు వాటిని చదివి నేను విస్తుపోతున్నాను, తన్మయుణ్ణవుతున్నాను. అప్పటికీ, ఇప్పటికీ ఆ పద్యాలలో వచ్చినమార్పంటూ ఏమీలేదు ఉన్న మార్పల్లా పఠితలోనే. ఈమార్పు ఏవిధంగా జరిగిం దన్నది వేరు విషయం.

''పోస్టుచెయ్యని ఉత్తరాలు'' అప్పుడు చదివిన దానికీ, ఇప్పుడు చదివినదానికీ చాలా భేదం ఉన్నది, సైన్సు, ఫిలాసఫీ, ఇవిరెండూ భిన్నమైనవి కావనీ, సత్యస్వరూపం యొక్క భిన్నస్వరూపాలనీ, ఈ లేఖలలో గోపీచంద్‌గారు సహేతుకంగా నిరూపించారు. ''పోస్టుచెయ్యని ఉత్తరాలు'' ప్రవేశిక అనుకొంటే 'పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా' అసలు గ్రంథం అనుకోవచ్చు

ఒకభావాన్ని వ్యాసరూపంలో అభివ్యక్తీకరించినప్పటి కన్నా 'కథ' రూపంలో చెప్పినప్పుడు, పాఠకుడు సులభంగా గ్రహించడానికి వీలవుతుంది, 'భౌతిక, ఆధ్యాత్మిక వాదసమన్వయం కథీకరించి చెప్పినప్పుడెలా ఉంటుంది' అన్న ప్రశ్నకు 'వీలునామా' ప్రత్యుత్తరం వంటిది.

పరిచయంలో గోపీచంద్‌గారు ఇలా అంటున్నారు· ''నీతిమంతుల్లో ఎక్కువమంది వలయాలు చుట్టుకు తిరుగుతున్నారు, రంగులరాట్నంలో గుర్రం ఎక్కి తిరిగే పిల్లవానికిమల్లే తిరుగుతున్నారు. గుర్రం ఎక్కామనే సంతోషం, అతివేగంగా ప్రయాణం చేస్తున్నా

శ్రీ రావూరి భరద్వాజ

మన్న సంతోషం వారికిఉంటే ఉండవచ్చు కానీ ఎంత వేగంగా తిరిగితే, అంతత్వరగా బయలుదేరిన స్థలానికి రావటమేగదా జరిగేపని".

ఇలా జరగడానికి గల కారణాలను కూడా గోపీచంద్‌గారు వివరించారు ఈనాటి •విద్యావిధానం, ప్రత్యేకమైన నిపుణులను తయారుచేయడమే ఇందుకు కారణం అంటున్నారు. ఇందువల్ల మానవుడు ఏదో ఒక విషయంలో మాత్రమే ప్రవీణుడు అవుతున్నాడు, మిగతా విషయాలపట్ల అంధుడవుకున్నాడు అతని దృష్టి పరిమితమయి పోయిందన్నమాట. బండికి కట్టే గుర్రానికి, ముఖంమీద ఒక తొడుగు ఉంచుతారు. ఆ తొడుగు గుర్రపు కళ్లను కప్పేస్తుంది. దాని చూపును అరికడుతుంది. ముం దే ముందో తప్ప, ప్రక్క ఏమి జరుగుతుందో దానికి తెలీదు. ఈనాటి మనిషి కూడా అలానే తయారవుతున్నాడు. గుర్రానికి అటువంటి తొడుగు అవసరమయితే కావచ్చుగానీ, మనిషిని గుర్రాన్ని చేయబూనడం సహించరాని విషయం,

మనిషికి అన్ని అవయవాలూ, ఆయాభాగాల్లో పొందికగా అమరి ఉండటం అవసరం అలా కాకుండా, ఒకరికి చేతులు మాత్రమే పొడవుగా ఎది గాయనుకోండి చూడటానికి చాలా వికృతంగా ఉంటుంది. అలాగే మిగతా అవయవాలన్నీ గిడసబారి పోయి ముక్కు బాగా పెరిగి ఉన్నదనుకోండి-అప్పుడే మనుకొంటాం॰ సమర్థుడైన వ్యంగ్య చిత్రకారుడు చిత్రించిన బొమ్మల్లా హాస్యాస్పదంగా మనుషులుండటం జరుగుతుంది. అలా ఉండకూడదనీ, అన్ని అవయవాలు పొందికగా ఉన్నప్పుడే మానవాకారం చూడ నిండుగా ఉంటుందనీ రచయిత అంటారు.

'వీలునామా,'లోని కథానాయకుని పేరు కేశవమూర్తి. అతని భార్యపేరు సుజాత, సంఘటనలన్నీ వీరిచుట్టూ జరుగుతాయి, కథానాయకుని జీవితం, ఝరీవేగంతో ప్రారంభమవుతుంది. ప్రశాంతంగా గడిచిపోతుంది. ఒక జాతి జీవితంలోని విభిన్న దశలు, కేశవమూర్తిలో మనం చూడగలుగుతాం. అంటే-కేశవమూర్తి ఒక వ్యక్తికాదు, ఒక తరానికి ప్రతినిధి.

అతను రాజకీయవాది, రచయిత, ఆర్ద్రహృదయుడు, మానవతావాది, ఆధ్యాత్మిక భావసంపన్నుడు. అతను రాజకీయాలను మనస్ఫూర్తిగా విశ్వసించాడు తను ప్రచారం చేసిన రాజకీయాలు అసమగ్రమైనవనుకొన్నప్పుడు, వాటిని సంస్కరించడానికి ప్రయత్నించాడు. అతని ప్రయత్నాలు ఫలించలేదు.

మార్పు రావాలని అందరూ అంటారు. కాని ఎంతవరకు॰ అన్న దగ్గరే భేదాభిప్రాయాలు వస్తున్నాయి ప్రతివారికీ తాము నమ్మిందే సత్యమన్న పట్టుదల ఉండటం వల్లనే అభిప్రాయభేదాలు వస్తున్నాయి, ఎదటివారు చెప్పేదిగూడా సత్యమనిగానీ, కనీసం వారు సత్యం చెప్పే అవకాశం ఉన్నదనిగానీ అనుకోవడంలేదు అలా అనుకొంటున్నవారిని తిరోగమన వాదులు అంటున్నారు. ఏదో ఒక సిద్ధాంతానికి కరుచుకు పోవడమే వ్యక్తియొక్క నిజాయితీకి చిహ్నంగా చలామణీ అయిపోతూ ఉంది ఈ దృష్ట్యా చూసినప్పుడు, కేశవమూర్తి 'తిరోగమనవాది' నిజానికతను పరిణామవాది. తను గాఢంగా విశ్వసించిన సిద్ధాంతాధారంతో, తన దృష్టిని విశాలం చేసుకొంటున్నాడు. ఆ విస్తీర్ణంలో నూతనాంశాలను దర్శిస్తున్నాడు. ఆ అంశాలను ఆకళింపు చేసుకుంటున్నాడు ఆ కాంతిలో కనుపించిన బాటలో ముందుకు నడిచిపోతున్నాడు. ఆ గమనంలో, లోగడ తను చేసిన పొరబాట్లను తెలుసుకొంటున్నాడు. అటువంటివి మరో సారి జరగకుండా జాగ్రత్తపడుతున్నాడు. కేశవ

వీలునామా"

మూర్తి నిత్య పథికుడు. అతని గమ్యస్థానం సత్య దర్శనం. అందుకోసం అతను నడిచిపోతూనే ఉంటాడు. గమ్యస్థానం చేరుకోవడానికి తోడుపడు తుందనుకొన్న ప్రతి వస్తువునూ అతను సేకరించాడు. అవన్నీ అతనికి ఉపకరించనూవచ్చు, ఉపకరించక పోనూవచ్చు.

అనుయాయులు అలాకాదు–వారికి కొన్ని నమ్మకా లున్నాయి, వారిదృష్టిలో అవే సత్యాలు అంతకుమించి మరోసత్యం ఉంటుందని వారనుకోరు. ఉండే అవ కాశాన్ని కూడా వారు ఊహించరు వారో రంగు కళ్లద్దాలు పెట్టుకొన్నారు వారికి ప్రపంచమంతా ఆ రంగుగానే కనబడుతుంది అలాగే మరొక సిద్ధాం తంతో నమ్మకం ఉన్నవారు, ఇంకోరంగు కళ్లద్దాలు పెట్టుకొన్నారనుకోండి, వారి కళ్లకు ప్రపంచమంతా, ఇంకోరంగులో కనిపిస్తుంది. ఇలా ప్రతివారూ, ఒక్కొక్కరంగుజోడుగుండా చూస్తూ, తాము చూసిందే సత్యమంటూ కూచుంటే, అసలు సత్యస్వరూపం ఎప్పటికి తేలుతుందంటాడు కేశవమూర్తి సిద్ధాంత మనేది, జీవితాన్ని ప్రభావితం చేయాలంటా డతను

ప్రాణవాయువులా వ్యక్తిలోని జిజ్ఞాసను చైతన్య వంతం చేయాలని అంటాడు, సంకెళ్లలాగా గుదిబండ లాగా తయారు కాగూడదంటాడు ఈ 'పాపం' చేసి నందుకే అతన్ని 'అవకాశవాది' అంటారందరూ

కేశవమూర్తి జీవితంలోని ప్రమాదభూయిష్టమైన ఘట్టం ఇదే. అతను మారుతున్నాడు, కానీ ఆ మార్పు ఎటుకేసి సాగుతున్నదన్నదే ముఖ్యం అతని మిత్రులు 'దిగజారిపోతున్నాడు' అంటారు. కానీ మనకలా అనిపించదు. అందరితో కలిసి కేశవమూర్తి కొంత దూరం ప్రయాణం చేశాడు ఆ ప్రయాణ కాలంలో కేశవమూర్తి మిగతావారికి ఆరాధ్యుడయి నాడు. అతను అలా ప్రయాణం సాగిస్తూనే ఉన్నాడు. మిగతావారు ఆగిపోయారు. చిత్రమేమిటంటే తాము ఆగిపోయినట్లు వారెవ్వరూ ఒప్పుకోరు. ఒప్పుకోక పోగా కేశవమూర్తిని 'తిరుగుబోతు' అంటారు.

'వీలునామా'లో రకరకాల మనుషులు మనకు తగులుతారు సంఘంలోని వర్గాలకూ, విభిన్న సిద్ధాం తాలకూ విభిన్న ఆలోచనా విధానాలకూ వీరు ప్రాతి నిధ్యం వహిస్తున్నారు. ఆయా వర్గాల, సిద్ధాంతాల, ఆలోచనా విధానాల అంతరిక, బాహిరిక రూపాలెలా ఉంటాయో, ఈ ప్రతినిధులద్వారా మనం తెలుసుకో వచ్చు

సిద్ధాంతాలను స్వార్థంకోసం ఉపయోగించుకొనే వారూ, నాగరికత పేరిట అమానుష కార్యాలు చేసే వారూ సంఘంలో ఉన్నట్లే, ఈ నవలలోనూ ఉన్నారు సంఘంలో ఉన్నవారిని మనం చప్పున గుర్తించలేకపోవచ్చు, ఇందులో అలాకాదు.

అరవిందుడే ననుకొంటాను ఒకచోట "మానవుని మనస్సు, ఒక పరిమితివరకే ఆలోచిస్తుంది. ఒక దూరందాకానే, అతని ఆలోచనలు వెడతాయి ఆ తరువాత అతని ఆలోచనలు ముందుకెళ్లలేవు. తమ చుట్టూతామే తిరుగుతుంటాయి'' అంటారు.

రచయిత తన పరిచయంలో –

"ఇప్పుడున్న పరిస్థితి ఇది. ఈ పరిస్థితి మారాలి. మతిమంతులు తమతమ వలయాలను అధిగమించి, అన్ని వలయాలనూ, అన్ని పరిస్థితులనూ సమన్వయ పరచుకొని, పురోగమనానికి దోహదం చెయ్యగలిగిన శక్తిని పెంపొందించుకోవాలి ఈ శక్తి మనస్సుకు లేదు ఇందుకు మానవుడు మనస్సుపైన ఉన్న అంతస్థులను చేరుకోవాలని అంటారు.

ఇదెలా సాధ్యమవుతుంది ? దీనికి కేశవమూర్తి జీవితమే సమాధానం, అతనూ రకరకాల వలయా లలో దూరినవాడే, ఐతే వాటికే అతుక్కుపోలేదు.

అన్ని వలయాలనూ, అన్ని పరిస్థితులనూ సమన్వయ పరుచుకొని, పురోగమనానికి దోహం చెయ్యగలిగిన శక్తిని పెంపొందించుకొన్నాడు. ఈశక్తి అతనిలోని మాలిన్యాన్ని క్షాళితం చేసింది. అతన్ని మానవుడుగా నిలబెట్టింది.

కానీ కేశవమూర్తి అతీత మానవుడు కాడు. అతీత మానసిక వ్యవస్థను చేరుకోగల మజిలీలో ఉన్నాడు. అతను వెలువరించిన అభిప్రాయాలు మనకీ విష యాన్ని స్పష్టం చేస్తున్నాయి.

''జన్మ అనేది ప్రపంచ రంగంమీదకు అడుగు పెట్టడంతో 'జన్మకు పూర్వం ఏమిటి ? జన్మతరువాత ఏమిటి ?' అనే ప్రశ్నలు ఉదయించినై. జన్మకు ముందుసంగతి నిర్ధారణగా తెలియటంలేదు. తరువాత సంగతీ తేలియటంలేదు, కానీ ముందు అనేదీ తరువాత అనేదీ ఉండిఉంటాయని అనుకోబుద్ధీ అవుతుంది.

''పునర్జన్మను నమ్మనివారు వొకరకంగా ముం దును అంగీకరిస్తున్నా తరువాతను అంగీకరించరు. అదేలా? ముందు అనేది ఉంటే, తరువాతా ఉంటుంది. వరుణదేవుని కుమారుడు భృగుమహర్షి తన అన్వే షణలో ప్రథమదశలో 'పదార్థమే అనంతమైనది. పదార్థంలోనుండే అన్నీ పుట్టుకువస్తున్నాయి పదార్థం వల్లనే నిలబడుతున్నాయి. పదార్థంలోకే నిష్క్రి మించి తిరిగి వస్తున్నాయి' అన్నాడు. అలా అనుకొంటే ఇక ప్రశ్నకే తావులేదు. 'అణుసంధానంవల్ల ఈ శరీరాలు పుడుతున్నవి. అణువిచ్ఛిత్తివల్ల విడిపో తున్నయి' అనుకొంటే సరిపోతుంది కానీ ఉన్నది పదార్థమే అనుకోవటానికి కొన్ని చిక్కులు ఉన్నాయి. 'మనస్సు పదార్థంలోనుంచి ఉద్భవించింది' అని అను కొని తృప్తిపడాదామంటే ఏకారణంవల్ల పుట్టిందో తృప్తిగా చెప్పుకోటానికి వలనుపడటంలేదు. పదార్థం స్వయంభువు అని చెప్పుకోడానికి కుదరకుండా ఉంది. అందువల్ల ఈ సిద్ధాంతానికి-చెప్పుకోటానికి తేలికగా ఉన్నా-ఉద్వాసన చెప్పుకోవలసివస్తూ ఉంది. మరో ప్రాతిపదికను అన్వేషించవలసి వస్తూంది

''భగవంతుడు తననుంచే ఎప్పటికప్పుడు ఆత్మలను సృష్టిస్తూ ఉంటాడనీ, లేకపోతే ప్రకృతిలోకి తన శక్తిని ఊది దానిని చైతన్యవంతం చేశాడనీ, కట్టు కథలు కొన్ని ప్రచారంలో ఉన్నాయి. వీటిని మనం నమ్మలేం. ఎందుకంటే భగవంతుడు ఆత్మలను సృష్టించటానికి ఆది అనేది ఒకటి ఉండి, అంత మనేది ఉండదుగనుక, శరీరంతో పుట్టి శరీరం నశిం చటంతో అంతంకావు గనుక, తమలో ఉన్న లోటు పాట్లన్నింటికీ, భగవంతుడే కారణమయినా, వాటి బాధ్యత జీవకోటిమీద ఉంటుంది గనుక

''ఇటీవలి పరిశోధనలు మనస్సు పూర్తిగా శరీరం మీదే ఆధారపడి ఉన్నట్లు కనపడటం లేదని చెపు తున్నాయి. ఒకవేళ మనస్సు శరీరంమీద ఆధారపడి లేకుండా, విడిగా ఉండటానికి వీలున్నట్టయితే, శరీరం నశించినా మనస్సునకు అస్తిత్వం ఉంటుంది. అప్పుడు ఈ మనస్సు వివిధ లోకాల్లో ప్రయాణంచేస్తూ ఉంటుంది అని చెప్పే సిద్ధాంతానికి అవకాశం ఏర్పడు తుంది. అంతేకాదు, తనకు తగిన మరొకరూపం ధరించే అవకాశంకూడా ఏర్పడుతుంది అంటే పునర్జన్మ సిద్ధాం తాన్ని నమ్మటానికి అవకాశం ఏర్పడుతుంది. అప్పుడు ఆధ్యాత్మిక వాదులు చెప్పే సూక్ష్మశరీర సిద్ధాంతం నిజమవుతుంది. అప్పుడు మనస్సుకు ఈ సూక్ష్మ శరీరం, ముందునుంచీ ఉన్నదనిగాని, ఈ ప్రపంచం లోకి జీవితంవల్ల కలిగిందనిగాని, చెప్పుకోవల్సి వస్తుంది. ఏ విధంగా చెప్పుకొన్నా మనస్సు శరీరాన్ని విడిచి ఉండగలదనే విషయం అంగీకరిస్తే పునర్జన్మకు అవకాశం ఏర్పడుతుంది.

వీలునామా"

''ఆధ్యాత్మిక జ్ఞానసంపన్నులు మనలో అన్నమయ ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశాలు ఉన్నాయని చెపుతారు జీవి శరీరాన్ని విడిచి పెట్టటంలో మిగిలిన కోశాలతో ఉంటుంది. ఆ కోశాలను ఆయా లోకాలలో విడిచిపెడుతుంది. అలా విడిచిపెట్టినప్పటికీ వాటికి సంబంధించిన వాసనలు జీవిని పట్టుకునే ఉంటాయి. కొన్నాళ్లు ఆ వాసనలను జీర్ణించుకోటానికిగాను, వొకచోట పొదుగుతూ స్థిరంగా ఉండి, ఆ పని పూర్తయిన పిదప, తనకు అర్హమైన మరొక తొడుగును పొందుతుంది జీవి. దీనినే పునర్జన్మ అంటున్నాం. ప్రాతిపదికను మనం అంగీకరిస్తే మిగిలినవన్నీ దానినుంచి సహజంగా ఉద్భవించినవిగానే కనుపిస్తవి...ఈ నాడు వివిధ సిద్ధాంతాలను పరిశీలించిచూస్తే శరీరానికి విడిగా నిలవగలిగిన సూక్ష్మ శరీరం ఒకటి ఉన్నదనే అనుకోవలసివస్తుంది. అలా ఉన్ననాడు పునర్జన్మ ఊర్ధ్వలోకాలు మొదలైనవి నిజమేకావచ్చు...''

ఇలా చెప్పుకు పోతుంటాడు కేశవమూర్తి. అసలీ పునర్జన్మ గొడవలను తెచ్చిపెట్టుకోవటమెందుకన్న ప్రశ్నలకు అతనిలా జవాబు చెబుతాడు

"ఒక దశలో జీవి పొందిన అనుభవాలవల్ల తరువాతి దశ లాభపడటానికీ, ఈ విధంగా పరిణామం నిర్విఘ్నంగా కొనసాగిపోవటానికి పునర్జన్మ అవసరమైంది" అంటాడు కేశవమూర్తి ''పునర్జన్మ లేకపోతే యీ సృష్టి పరిణామానికిగాని, అసలు యీ సృష్టికిగాని, ఆదర్శం కుదరదు పైగా ఈ జన్మ పరంపర అంతా వృధా అవుతుంది. లేకపోతే తల్లి దండ్రుల వద్దనుంచి పుట్టుకతోవచ్చే స్వభావం మిగులుతుంది. మానవ దశకు రావటానికి చావు పుట్టుకలు ఏ విధంగా అవసరం అయ్యాయో, అదేవిధంగా మానవదశనుంచి పైదశలకు వెళ్లటానికికూడా వాటి అవసరం ఉంది. మానవరూపం ధరించినంతమాత్రాన జీవి నిర్వహించవలసిన పాత్ర పూర్తయినట్లుకాదు అది ఇంకా పైఅంతస్తులను చేరుకోవలసి ఉంది. ఇందుకు అనువైన అనుభవాలను పొందవలసి ఉంది. రూపాలను ధరించవలసి ఉంది. ఎప్పటికప్పుడు తనకుతగిన రూపాలను ధరించటానికి పాతవాటిని వొదిలి, కొత్తవాటిని చేపట్టవలసివస్తూంది. దీనినే మనం చావు, పుట్టువు అంటున్నాం, పునర్జన్మ అంటున్నాం. మానవ పరిణామంలో ప్లేటో, శంకరులు మొదలైన మహా వ్యక్తులుసైతం ఆదర్శ పురుషులు కాకపోవచ్చు. మూలచైతన్యానికి మనిషిలో ఇంతకంటే శక్తిమంతులను సృష్టించాలనే సంకల్పం ఉండవచ్చు. దాని ఆదర్శం మానవుని పరిపూర్ణతను కూడా అధిగమించి ఉండవచ్చు'' నంటాడు కేశవమూర్తి.

'దీనికి జననమరణాల అవసరం ఏముంది' పునర్జన్మ అనేది ఒకే రూపంలో జరగవచ్చుకదా. అదేరూపంలో నూతన శక్తులను ఆవిర్భవింపజేసుకోవచ్చు ఆ నూతన శక్తులకు సరిపోయేటట్లు అదే రూపాన్ని మార్చుకొంటూ ఉండవచ్చు-గదా-''అన్న ప్రశ్నకు కేశవమూర్తి జవాబిది-

''మానవదశ వచ్చేవరకూ మనస్సు అనేది అభివృద్ధి చెందలేదు గనుక అవకాశంలేదు. మానవునికి ఆ అవకాశం ఉంది. మానవునికి ఆత్మ పరిశీలనాజ్ఞానం ఉంది అతను ముందుకు చూచి ఆదర్శాలను సృష్టించుకోగలడు, తుదకు గుణంగా తన్నుతాను మార్చుకోగలడు. ఈ అవకాశాన్ని మానవుడు వినియోగించుకోవాలి భవిష్యత్తుకు భయపడి, ఉన్న దానిని వదులుకోవాలని, అతను సంకల్పించుకోకపోతే మాత్రం పరిణామం అతనికోసం ఆగదు. మానవుని విడిచి క్రొత్త రూపాలను సృష్టించుకొని

వాటిద్వారా తన ఆదర్శనాన్ని సాధించుకోగలదు'' అంటాడు కేశవమూర్తి.

ఈ ఘట్టం నామట్టుకునాకు అమృతప్రాయమైన ఘట్టం ఇందులో కేశవమూర్తి వెలిబుచ్చిన భావాలు, మనకళ్లను చెదరగొట్టవు, మనస్సును సున్నితంగా మేలుకొలుపుతాయి. ఇటువంటిదే మరొకఘట్టం. రామామోహనశాస్త్రి అరవిందాశ్రమంలో అతీత మానసిక వ్యవస్థను గురించి చెప్పింది. రామమోహనశాస్త్రి, ఆ వ్యవస్థను చేరుకోవడానికి మనస్సు ఎన్ని మజిలీలను దాటాలో. ఆయా మజిలీలలో మనస్సుపొందే చిదానందమేమిటో చెబుతాడు.

ఈ రెండు ఘట్టాలూ కేశమూర్తిని మనం అర్థం చేసుకోవటానికి బాగా ఉపకరిస్తాయి అతనిలోని పరిణామాలను అవగాహన చేసుకొనేందుకు ఈ ఘట్టాలు తోడుపడుతాయి.

కేశవమూర్తి వేదాంతం చెప్పడమే కాదు, వేదాంతం జీవించాడు, పురుగుగా జీవితాన్ని ప్రారంభించి సీతాకోకచిలుకగా మార్పుచెందాడు ఈ పరిణామం లోని వివిధ దశలే 'వీలునామా' నవల కేశవమూర్తి పాత్ర, సజీవుడైన మానవునికి ప్రాతినిధ్యం వహిస్తుందని మనమనుకొంటే, రేపు మానవుడు పొందనున్న మార్పులను సులభంగా అవగహనంచేసుకోగలం. ఈ మార్పులకు మనం ఇష్టపడవచ్చు, పడకపోవచ్చు కాని మార్పురాక తప్పదు అణు రూపంలో ప్రాదుర్భవించిన చైతన్యశక్తి, కోటాను కోట్ల రూపాలను ధరిస్తూ వచ్చింది. ఈ మహాపరిణామ క్రమంలో, అది ఎన్నోదశలను అధిగమించింది ఆ శక్తి ఇంతటితో ఆగిపోతుందనుకోవడమంటే, మనం గతంనుండి ఏమీ నేర్చుకోవడం లేదన్నమాట

మహాత్ములు 'రేపు'ను యీనాడే దర్శించి చెబుతుంటారు రేపటి జీవితాన్ని ఈనాడే జీవిస్తుంటారు. సామాన్యులు నిన్నటి బ్రతుకును ఈ రోజు బ్రతుకంటారు. కేశవమూర్తి మొదటికోవకు చెందిన మనిషి.

ఆలోచిస్తూఉంటే, వీలునామాకు—అసమర్థుని జీవయాత్రకు చాలా దగ్గర సంబంధాలున్నా యనిపించింది నాకు అసమర్థుని జీవయాత్రలోని కథానాయకుడు సీతారామారావు దృష్టిలో సమగ్రతలేదు సమన్వయం లేదు. అతను జీవితాన్ని తుంపులు తుంపులుగా చూశాడు తన జీవితాన్ని కూడా తుంపులు చేసుకొన్నాడు సీతారామారావు బ్రతుకులో సుఖపడిందేమీ లేదు అతను సుఖపడకపోగా, తనచుట్టూ ఉన్నవారి బ్రతుకులను కూడా దుఃఖమయిష్టం చేశాడు. దిక్కులేని చావు చచ్చాడు

ఇలా జరగడానికి కారణం, అతను జీవితాన్ని సమన్వయించుకో లేకపోవడమే అనుకొంటాను బాహిర అంతరిక పరిస్థితులను కలగలిపి, జీవిత మార్గాన్ని ఏర్పాటు చేసుకోవడం సీతారామారావుకు తెలీదు ఆ పని కేశవమూర్తికి తెలుసు కాబట్టి సీతారామారావు హృదయ విదారకంగా బ్రతికితే, కేశవమూర్తి ప్రకాశిస్తూ బ్రతికాడు

అసమర్థుని జీవయాత్ర వ్రాస్తున్న నాటికే గోపీచంద్‌గారిలో యీ చర్చ ప్రారంభమయిందను కొంటున్నాను ఆ నవలలోని రామయ్యతాత పాత్ర, మనకీ విషయాన్ని తెలియపరుస్తుంది అయితే, అప్పటికీ సమన్వయవాదం రచయితలో ఒక సిద్ధాంతంగా రూపొందలేదు బీజమాత్రంగానే ఉండిపోయింది. దాని విశ్వరూపం పోస్టుచెయ్యని ఉత్తరాలలో కనిపిస్తే, ఆ రూపానికి సచిత్రవివరణ వీలునామాలో కనిపిస్తుంది.

వీలునామా"

నవలను పూర్తిచేశాక, భగవద్గీతలోని ఈ శ్లోకం మనస్సులో మెదిలింది. అర్జును డిలా అంటాడు—

శ్లో॥ నష్టో మోహః, స్మృతి ర్లబ్ధా
త్వత్ప్రసాదాన్మ యాచ్యుత
స్థితోస్మి గత సందేహః
కరిష్యే వచనం తప.

గీతా బోధనంతో అర్జునుని సందేహాలు తీరినట్ల గానే, ఆధ్యాత్మిక, భౌతికవాద సమన్వయ సిద్ధాంత పట్లగల సందేహాలు, 'పీలునామా'తో తీరిపోతాయ నా విశ్వాసం.

---

# సానుభూతి

ఒక కవి తన స్నేహితుడైన ధనవంతుని దగ్గరకు వెళ్ళి ఇలా అడిగాడు—"ఒక అయి రూపాయిలుంటే బదులివ్వండి. ఇంట్లో బియ్యంలేవు. గోలగావుంది" అడగలేక త బడుతూ అడిగాడు.

"నా దగ్గర దమ్మిడీలేదు. డబ్బెక్కడనుంచి వొస్తుంది॰ నా దొడ్లో పండుతూవుంద అదీకాక నే నిన్నిసా ర్లివ్వలేను" అన్నాడు ధనవంతుడు.

"నా కెప్పు డిచ్చారు॰"

"నువ్వు మరణించిన తర్వాత శిలావిగ్రహానికి ఇవ్వొద్దూ? ఇప్పుడూ ఇచ్చి, అప్పుడ ఇచ్చి నా కిదేపనా?" అన్నాడు ధనవంతుడు.

కవికి ఆరోజు రాత్రి కలలో కనిపించినై తన భార్యాపిల్లలు తిండిలేక ఒక పక్క ఏడుస్తూవుంటే, ఒక పక్కన తన శిలావిగ్రహం తయారవుతూ వుంటుంది. ఆ శి విగ్రహానికి డబ్బిచ్చిన ధనవంతుని దాతృత్వాన్నీ, రసహృదయాన్నీ ప్రజలు వేనో కొనియాడుతూ వుంటారు.

గోపీచంద్

# ఒక ప్రశంస

నిరతాంతఃకరణుండనై చదివితిన్ నీ 'వీలునామా' పరం
పరగా మానసబుద్ధి చిత్తము లహం భావమ్ము నజ్ఞాన క
ర్బురమాయావలి తాంధవాసనల నిర్మోకమ్ము చాలించి వి
స్తరదివ్యత్వ వికాసవీచికల సంతానమ్మునై తేలగన్.

బ్రహ్మత్వ ప్రతిభావిభాసిత మహా భావోదయుల్ కొంద రీ
బ్రహ్మారణ్యము దివ్యమానవ సదారామమ్ము కాగోర యం
బ్రహ్మల్ కొందరు క్రోధ మోద మద లోభ క్షోభి తాశావసీ
జిహ్వోద్యమ్ము చరింతుర్రి సర్వజగతీ చ్ఛేద క్రియారంభులై.

గమ్యమ్మందరి కొక్కటే యయిన తద్గంతవ్యమార్గీయ వై
షమ్యాభీలఘనాంధకార నిబిడచ్ఛాయోద్ధతిన్ లేశమున్
రమ్యాలోకము పొందలేని నరులన్ రక్షించు విశ్వాత్మ తా
సమ్యగ్దర్శన భాగ్యశాలురు బుధుల్ చర్చింప సామాన్యులే,

ఒక మార్గమ్ము పటిష్ఠసుందరముగా నూర్జస్వలాదర్శ కా
ముకుడై తీరిచి దిద్దె నీ జనకు డా ముష్యాయణుం డీవు దు
ర్వికలత్వమ్ముల గొందియైన రచనా వీధిన్ ప్రతిష్ఠింతువో
సకలత్వ స్పృహనైకమార్గ రచనా సంధాన ధీశాలితన్.

నళినీపత్రిముమీది వానచిను కీ నీ 'వీలునామా' సువ
ర్ణలసత్కాంతి నిషేవితాంచదుపదా రత్నమ్ము గైకొమ్ము ని
స్తులితాధ్యాత్మిక భావసంపదల పాతుల్ విశ్వకళ్యాణ ని
ర్మల శోభల్ విరజిమ్ముగాత జన సన్మాన్యమ్ములై నీ కృతుల్.

శ్రీ నాయని సుబ్బారావు

# గడియపడని తలుపులు

శ్రీ సి. హెచ్. ఆచార్య

ఆంధ్రి కధకులలో గోపీచంద్‌గారికున్న విశిష్ట స్థానాన్ని గురించిగానీ, కధారచనలో వారు వాడుకొన్న వివిధ శిల్పాలను గురించిగానీ, వివరించడం ఈ వ్యాసం ఉద్దేశంకాదు. ఆపని మరో నాటికి వాయిదా వేస్తున్నాను.

గోపీచంద్‌గారి సాహిత్యంతో సన్నిహిత పరిచయం ఉన్నవారికి, వారిలో వచ్చిన పరిణామాలు అవగాహన అవుతాయి. నూటికి నూరుపాళ్ళ భౌతిక వాదిగా తన ప్రయాణాన్ని వారు ప్రారంభించారు. ఆధ్యాత్మిక సంపదను సంతరించుకొంటూ, తన గమ్య స్థానంకేసి విపరీతమైన వేగంతో చేరుకుంటున్నారు. కొంతకాలంపాటు, వారి ప్రయాణం అందరికీ ఆహ్లాద కరంగానే ఉంది అందరికీ వారు అర్ధమవుతూనే ఉన్నారు. మనకు తెలియని కొత్తమార్గాలలో, మనం ఊహించని నూతన లక్ష్యాలకేసి, మనం అందుకోలేని వేగంతో పోతున్నప్పుడు "ఏమిటీ గోపీచంద్‌గారి వ్యవహారం? ఏమంటున్నారీయన? ఎక్కడికి పోతున్నారు? ఏమిటి సాధిస్తున్నానంటున్నారు" అనిపిస్తూ ఉంటుంది. వీటికి సమాధానాలు చెప్పుకోవాలనుకొన్నప్పుడు వారి ఇటీవలి రచనలు పరిశీలించడం అవసరం.

ఏ రచయిత అయినాసరే, తన రచనలనుండి, తన వ్యక్తిత్వాన్ని పూర్తిగా దాచుకోలేడు. అయితే ఇక్కడో విషయాన్ని మనం గమనించవలసి ఉంటుంది. భూతదయను గురించి హృదయంగమంగా

వ్రాసిన ఓ రచయిత వ్యక్తిగత జీవితం, "నిర్దయ"గా ఉండవచ్చు పరోపకారం గురించి అందంగా రాసే వాడి హృదయంలో స్వార్థపరత్వం తప్ప మరేమీ లేకపోవచ్చు. కానీ, భూతదయను గురించీ పరోప కారాన్ని గురించీ వ్రాసిన రచనలను జాగ్రత్తగా పరిశీలిస్తే, అందులో రచయిత వ్యక్తిత్వం స్పష్టంగా కనిపించి తీరుతుంది.

ఏ మార్పయినా హఠాత్తుగా వస్తుందనుకోను, పదిహేనుసంవత్సరాలక్రిందట, చలంగారు, పూర్తిగా సన్యాసులవుతారని ఎవరన్నా అంటే వారిని దుయ్య బడుతుండేవారు చలంగారి భక్తులు. కానీ, ఇక ముందుముందు చలంగారు, ఎలామార్పు చెందబో తున్నారో, ఆనాటి వారి రచనలు చూసి చెప్పవచ్చు. ఈనాటి చలంగారి సమగ్రస్వరూపానికి సంబంధించిన ఛాయలు 15, 20 సంవత్సరాల క్రిందటనే, వారి రచనలలో లీలామాత్రంగా ఉండేవి.

''గడియపడని తలుపులు'' గోపీచంద్‌గారు ఈ మధ్యనే వ్రాసిన పెద్దకథ. ఇందులోని రంజు అర్థము చేసుకుందుకు, రాజధానిలోని రాజకీయ వాతావరణము తెలిసి ఉండటము అవసరము. లప్పుడుగాని, ఈ కథనుండి పూర్తి ఆనందాన్ని అనుభవించడము సాధ్యముకాదు.

''ప్రజాస్వామ్యం'' అన్నముక్కకు రకరకాలుగా నిర్వచనాలు చెప్పబడుతూ ఉన్నాయి. ప్రపంచ రాజ కీయ రంగములో ప్రధానపాత్రవహిస్తున్న మూడు వర్గాలవారు తమతమ దేశాలలో ప్రజాస్వామిక ప్రభుత్వా లున్నా యంటున్నారు. ఏది ప్రజాస్వామిక మన్న విషయాన్ని గురించి వాదోప వాదాలు జరుగు తూనే ఉన్నాయి.

మన దేశములోకూడా ప్రజలు ఎన్నుకొన్న మంత్రులు పరిపాలనచేస్తూ ఉన్నారు. ఈ ఎన్నికలలో విజయము పొందడము కోసం, చెయ్యరానిపనులు చేస్తూ ఉన్నారు. డబ్బు విచ్చలవిడిగా ఖర్చు చేయ బడుతూ ఉంది. కులాలు, మతాలు, బంధుప్రీతి, వత్తిడి, బెదరింపులు, వాగ్దానాలు, నిర్బంధాలు, ప్రధానమైన పాత్ర వహిస్తున్నాయి. ఇటువంటి కల్మష వాతావరణాన్ని ఉపయోగించుకొని డబ్బు చేసుకునే వారు కొందరున్నారు ఈ వ్యక్తులకు, రాజకీయాలతో —నిజముగా నిమిత్తములేదు, అధికారములోకి వచ్చిన వారిచుట్టూ చేరతారు. వారికి భజన చేస్తూ ఉంటారు. వారి ఆదరాన్ని సంపాదిస్తారు. వారిచేత పనులు చేయించుకొంటూ ఉంటారు. ఈ విధముగా ఎవరికి కావలసిన పనులు వారు చేయించుకొనే వారు కొంద రైతే, ఇతరుల కోసం పనులు చేసిపెట్టేవారు మరి కొందరు. ఇందువల్ల వారు నాలుగు డబ్బులు సంపా దించుకొంటారు. అధికారవర్గములో వారికి మంచి పలుకుబడి ఉంటుంది. చట్టము ఒప్పుకొన్నా, ఒప్పు కోకపోయినా, ఇష్టమున్నా లేకపోయినా, అధి కారులు ఈ వ్యక్తులు చెప్పిన పనులు విధిలేక చేస్తూ ఉంటారు. అలా చెయ్యకపోతే, పైవారి నుండి '' మాట '' వస్తుందేమోనని వారి భయం, అందుకని అధికారులుకూడా వీరంటే భయభక్తులతోనే మసులుకొంటూ ఉంటారు గౌరవించుతున్నట్లు నటి స్తారు, అభిమానము ప్రదర్శిస్తారు, అణకువను చూపెడతారు. వీలుంటే ఒక మంచిమాట, పైవారికి చెప్పవలసిందిగా ఈదళారీలను కోరుతారు కూడాను.

ఈ రకమైన వాతావరణం మంచిదా కాదా అన్నది ఇప్పుడు ముఖ్యముకాదు. ఎల్లకాలము పరిస్థితులు ఇలాగే ఉంటాయా అన్నదికూడా ముఖ్యముకాదు. కానీ ప్రస్తుతము మాత్రము ఇటువంటి కల్మష పరిస్థితులు ఉన్నాయి, వీటిని ఉపయోగించుకొని డబ్బు చేసు కొంటున్నవారుకూడా ఉన్నారు.

"గడియపడని తలుపులు" కథలోని కోటేశ్వరమ్మగారు, ఇప్పుడు మనము చెప్పుకొన్న దళారీ వర్గములోకి చేరుతుంది. ఈ మెకు ఉన్నతాధికారవర్గముతోనూ, పాలకవర్గముతోనూ చాలా సన్నిహితమైన సంబంధాలున్నాయి. దాదాపు పేదరాలుగా ఇక్కడి కొచ్చింది. లక్షల రూపాయలు ఆర్జించింది. అధికారులలోనూ, అనధి కారులలోనూ, బాగా పలుకుబడి సంపాదించింది. అసాధ్యమనుకొన్న ఎన్నో పనులను సాధించింది. ఈ విజయాలకోసము ఆవిడ చెల్లించిన మూల్యం, చాలా గొప్పది.

ప్రభుత్వములో పనులు కావలసిన వారు, ఆమెను ఆశ్రయిస్తారు. అంతో ఇంతో ఆమెకు ముట్టచెబుతారు. పనులు చేయించుకొని వెళ్ళిపోతారు. పని అయిందాకా, ఆమెను పొగుడుతూ ఉంటారు. నీవంటి స్త్రీ తెలుగు దేశము మొత్తము మీదనే లేదంటారు. వారిపని పూర్తికాగానే తిట్లకు లంకించుకుంటారు. ఆమె వ్యక్తిగత జీవితాన్ని రకరకాలుగా చిత్రించి కుతులు తీర్చుకొంటూ ఉంటారు.

"(కోటేశ్వరమ్మ భర్తను) విడిచి పెట్టిందంటే తప్పక విడిచిపెట్టింది. అతను ఆమెను చాలా కష్ట పెట్టేవాడు, అయినా ఆమె వోర్చుకుని కాపురం చేసింది. తరువాత అతను మరొక స్త్రీని ప్రేమించాడు-ఆమెను ప్రేమించడము మొదలు పెట్టినాక, అతనిలో చాలా మంచి మార్పు వచ్చింది. ఆమెను హృదయ పూర్వకముగా ప్రేమించడమువల్ల తన భర్తలో ఈ మార్పు వచ్చిందనీ, ఆకొత్త మనిషి నిష్కళంక ప్రేమే తన భర్తలో వచ్చిన ఈ మార్పుకు కారణమనీ కోటేశ్వరమ్మ గ్రహించింది. వెంటనే తన ప్రేమలో ఏమూలనో ఎంతో కొంత మలినము దాగి ఉండబట్టే, తన భర్త ఇన్నాళ్ళూ అలా ప్రవర్తించాడని వూహించుకొంది. ఇక వారిద్దరికీ ఆటంకంగా నిలబడటం తగదనుకొంది. వారిద్దరూ వివాహము చేసుకొని సుఖంగా జీవయాత్ర చెయ్యటానికి తోడ్పడటమే తన విధ్యుక్త ధర్మమనుకొంది. భర్తనుండి బలవంతంగా తెంచుకొంది. భర్తసుఖంకోరి అత్యద్భుతమైన త్యాగం చేసింది", అంటాడు శ్రీనివాసరావు.

ఇతనిది గుంటూరు. పొగాకు వ్యాపారం చేసి లాభాలు తీద్దామనుకొన్నాడు అందులో నష్టం వొచ్చింది. ఆ నష్టాన్ని పూడ్చుకోవడంకోసం పుస్తకాల వ్యాపారం ప్రారంభించాడు పుస్తకాల వ్యాపారం సజావుగా సాగితే మంచి లాభాలనిస్తుంది. స్కూలు పుస్తకాల ప్రచురణ ప్రారంభించి లక్షలు సంపాదించినవారున్నారు. అయితే ఇదంత సులభంకాదు. పుస్తకాల సెలెక్షన్ బోర్డువారి దయాధర్మాలమీద ఈ వ్యాపారంలోని లాభ నష్టాలుంటాయి. ఈ బోర్డు సభ్యులను ఆకట్టుకొంటేతప్ప, పుస్తకాలు ఎన్నిక కావు. పుస్తకాలు ఎన్నికయితే తప్ప లాభాలురావు.

సెలెక్షన్ బోర్డువారిని ఆకట్టుకునే పనిమీదనే శ్రీనివాసరావు ఇక్కడికొచ్చాడు. ఆ పనిలో అతను కోటేశ్వరమ్మగారి సహాయం అడుగుదా మనుకొన్నాడు. వారిద్దరికీ లోగడ కొంత పరిచయం ఉంది. అతను కోటేశ్వరమ్మగారింట్లో మకాం పెట్టాడు.

"కొంత మందితో పరిచయమే ఎడ్యుకేషన్. అనేక గ్రంథాలు చదివినట్లు అనేక పుణ్యక్షేత్రాలు దర్శించినట్లు, ఈ రెండురోజులలో జీవితానికి సంబంధించిన విషయాలు ఆమెవల్ల నేను ఎన్నో నేర్చుకొన్నాను తామరాకుమీద నీటిబొట్టువలె ఆమెజీవితాన్ని నడుపగలదు ... ఆమె పనులు చేసిపెట్టడంలో బహు నేర్పరి. పెద్దపెద్ద ధనవంతులు, సంఘంలో పలుకుబడిగలవారు, ఉన్నత పదవులలో ఉన్నవారు ఎంతోమంది ఆమెకోసం రోజూ వొచ్చి పోతూవుంటారు. పెద్దపెద్ద కార్లువేసుకొని, నౌకర్లను

శ్రీ సి. హెచ్. ఆచార్య

వెంట బెట్టుకొని వచ్చేవారు కూడా ఉన్నారు. వాళ్ళను కోటేశ్వరమ్మ డీల్‌చేసే విధం నువ్వు చూచివుంటే అక్కడే మూర్ఛపోయివుందువు.. వొచ్చేపోయే మనుష్యులకు అంతేవుండదు. అడిగిన కోర్కెలను అడిగినట్లు తీర్చే వొక స్వాములవారిని, అడిగిన వరాలను అడిగినట్లు ఇచ్చే వొక దేవతను దర్శించుకోవటానికి వచ్చినట్లు వస్తారు." అంటాడు శ్రీనివాసరావు.

వీరందరికీ కోటేశ్వరమ్మ పనులు చేసిపెడుతుందా మరి? దీనికి శ్రీనివాసరావు ఇలా అంటాడు:

"చేసిపెట్టేవారికి చేసిపెడుతుంది. లేనివారికి ముఖం ఎదుటే కుండ బద్దలు గొట్టినట్లు నేను చేసి పెట్టనని చెప్పుతుంది...ఆమె చాలా నిఖార్సయిన మనిషి. అందులో సందేహం లేదు పెద్దపెద్ద వాళ్ళందరూ ఆమె ఎదురుగా కూర్చోవటానికే జంకుతారు పోనీ ఆమెకేమన్నా- పెద్ద పొజిషన్ వుందా అంటే అదీలేదు-ఆ మహత్వం, ఆమె పర్సనాలిటీలో ఉంది - స్నేహానికి ప్రాణమిచ్చే మనిషి ఆమె" అంటాడు శ్రీనివాసరావు-

ఆమె పనులు చేసిపెట్టి డబ్బు తీసుకొంటూ ఉంటుందా ?

"వొట్టిది. ఆమాట వొట్టిది" అంటాడు శ్రీనివాసరావు. "తన డబ్బు ఖర్చుపెట్టి ఇతరులకు పనులు చేసిపెడుతూ వుంటుంది. తన కారులో తన పెట్రోలుతోనే తిరుగుతూ వుంటుంది ఆమె ఇంట్లో, నిత్యం నలుగురైదుగురు బీద విద్యార్థులు భోజనము చేస్తూ ఉంటారు. కొంతమందికి జీతాలుకూడా కడుతుంది... పైగా డబ్బంటే ఆమెకు లెక్కలేదు. నీళ్ళ ప్రవాహం లాగున ఖర్చుపెడుతుంది" అంటాడు శ్రీనివాసరావు.

ఈ విధంగా శ్రీనివాసరావును మనకు పరిచయం చేస్తాడు రచయిత. కోటేశ్వరమ్మ పట్ల అందరికీ ఉన్నట్లుగా అతనికి ఏహ్యాభావం లేదు. ఆదరణవుంది. సానుభూతి ఉంది. ఆమెశక్తికి అతను చకితుడవుతున్నాడు. ఆమె స్వభావాన్ని అతను అభినందిస్తున్నాడు. కోటేశ్వరమ్మ పట్ల అతనిలో గాఢానురాగం ఉన్నది. దీని పర్యవసానమే ఆ తరువాతి కథ.

వ్యాపారం నిమిత్తం వచ్చిన శ్రీనివాసరావు, దాని మానాన దాన్నొదిలేసి, యాదగిరిగుట్ట వెళ్ళిపోయాడు. అతడు సర్వసంగ పరిత్యాగి కాకపోవచ్చు గానీ, భౌతిక వాసనలకు చాలా దూరంగా ఉన్నవాడనడంలో సందేహంలేదు. అతనలా ఎందుకు చేయవలసి వచ్చిందో ఉత్తర భాగములో తెలుస్తుంది. చిత్రమేమిటంటే, కోటేశ్వరమ్మకూడా అతనికోసం తపనపడుతుంది. ఆ తపనలో భౌతిక ప్రేరణలు లేవు. అంతకు మించిన వాసన లేవో ఆమెలో అటువంటి సంక్షోభాన్ని కలుగజేశాయి. ఒకప్పుడు అధికార, అనధికార వర్గాలను, చండప్రచండంగా శాసించిన కోటేశ్వరమ్మకు ఆ జీవితం మీద అసహ్యం పుట్టింది, తనుకూడా ఆ తొడుగును విసర్జించింది యాదగిరి గుట్టలోని స్వాములవారిని సందర్శించి, అక్కడ చిత్తశాంతిని పొందింది. శ్రీనివాసరావును ఆమె ప్రేమించింది. ఆ ప్రేమ శరీర సంబంధమైనది కాదు మనస్సంబంధమైనది, ఆ ప్రేమ ఆశించేది ఇంద్రియ సుఖాన్ని కాదు, ఆత్మానందాన్ని. ఆ సమున్నత స్థాయిని అందుకోవడానికి, శరీరం కేవలం వొక సాధనం మాత్రమే.

శ్రీనివాసరావును చూస్తే మనకు జాలి కలుగుతుంది. అతను ప్రతి విషయాన్నీ తన స్థాయినుండే చూస్తాడు. తనకు నచ్చిన వాటిని మంచివంటాడు. నచ్చనివి చెడ్డవంటాడు-మొదట్లో కోటేశ్వరమ్మపట్ల ఎంతో ఆదరము చూపించినవాడల్లా, చివరికి ఆమెను ఘాతంగా భావించుకొంటాడు. తనను వెంటాడుతున్న

దనీ, తనకు మనశ్శాంతి లేకుండా చేస్తున్నదనీ వాపోతాడు శ్రీనివాసరావు.

కానీ, కోటేశ్వరమ్మ మాటేమిటి? ఆవిడ తన సర్వస్వాన్నీ త్యజిస్తుంది. చివరి ఘడియలను భగవత్ ధ్యానములో గడుపుతుంది. డబ్బు, అధికారము, హోదా పొగడ్తలు మొదలయినవన్నీ ఆమెకు తుచ్ఛంగా కనిపిస్తాయి ఇలా కావడానికి కారణమేమిటి?

ఎంత నల్లని మబ్బుకైనా తెల్లని అంచు ఉంటుంది. ఎంత దుష్టహృదయంలోనయినా ఏదో ఓ మూల సద్గుణరేఖ ఉండనే ఉంటుంది. కోటేశ్వరమ్మకు ఈ జీవితం పట్ల మోజు ఉంటుందనుకోవడం న్యాయమనిపించదు. అనివార్య కారణాలవలన ఆమె దళారీ వర్గంలో చేరినప్పటికీ, అక్కడ ఇమడలేక పోయింది ఆవిడ స్థానం ఆధ్యాత్మిక ప్రపంచమే!

ఈ ప్రపంచంలో ఉన్న కోటేశ్వరమ్మ అభిప్రాయాలు మన మనస్సును చాలా సున్నితంగా తట్టి లేపుతాయి

"ఈ ప్రాణాలు నిలుపుకోటానికి ప్రయత్నించటం కూడా తప్పేనేమో అనిపిస్తూ ఉంది ... పోవలసిన రోజు వచ్చేటప్పటికి ఈప్రాణాలను పోనివ్వటమే మంచిది బలవంతంగా అట్టిపెట్టటం పక్షిని పంజరంలో బంధించినట్లే అవుతుంది. ప్రస్తుతం నామనస్సు ఈ శరీరంతో బంధింపబడి, అలాగే కొట్టుకొంటూవుంది. దానికి రెక్కలు వచ్చినయ్. దానికి ఎగిరిపోవాలని వుంది కాని ఈశరీరం మీద మమకారము పోగొట్టుకోలేని నేను, దానిని పట్టి బంధిస్తున్నాను. దాని రెక్కల సవ్వడి నాకు వినిపిస్తూనే వుంది. ఎందుకు వదలిపెట్టగూడదు దానిని? దానికి ఎందుకు స్వాతంత్ర్యం యివ్వగూడదు? దాని స్వాతంత్ర్యాన్ని ఆరి కట్టేహక్కు నాకు ఎక్కడనుంచి వచ్చింది? యెవ రిచ్చారు?'' అంటుంది కోటేశ్వరమ్మ

పూర్వ జీవితంలోనూ, ఉత్తర జీవితంలోనూ కోటేశ్వరమ్మకు భర్తంటే ఎంతో గౌరవం ఉంది భౌతిక వాతావరణంలో ఉక్కిరిబిక్కిరయిన ఆవిడ, ఆధ్యాత్మిక వాతావరణంలో ఊపిరి పీల్చుకోగలిగింది.

అద్భుతమైన ఈ పుస్తకములోని ముఖ్యఘట్టం, శ్రీనివాసరావు- కోటేశ్వరమ్మల మనస్తత్వ చిత్రణము. ఇద్దరికీ, ఒకరిపట్ల మరొకరికి గాఢమైన అనురాగం ఉంది-సహృదయతాపూర్వకమైన సానుభూతి ఉంది కానీ మనస్సులోని అనుభూతులను శ్రీనివాసరావు సమన్వయ పరుచుకోలేకపోయాడు. కోటేశ్వరమ్మ ఆ పనిని జయప్రదంగా సాధించింది- ఇందులో ఎవరు గెలిచారన్న ప్రశ్నకు కోటేశ్వరమ్మ గెలిచిందని మనం సమాధానం చెప్పుకోవాలి.

ఈ పుస్తకం చదువుతున్నంత సేపూ గోపీచంద్ గారి ''మెరుపుల మరకలు'' పదేపదే జ్ఞాపకం వస్తూ ఉంటుంది. అందులోని ఉషారాణి, ఇందులోని కోటేశ్వరమ్మలు అక్కా చెల్లెళ్ళేమో ననిపిస్తుంది-అక్క చెల్లెళ్ళ మధ్య పోలికలున్నట్లే వీరిమధ్యా పోలికలున్నాయి-అయితే ఎవరి వ్యక్తిత్వం వారికి ఉంది-ఉషారాణి జీవిత లక్ష్యం, బ్రతుకునుండి వీలైనంత ఎక్కువగా సుఖాన్ని పిండుకోవడం-అందుకోసము ఆవిడ పురుషులను మెట్లుగా వాడుకొంది-పై మెట్టు మీదికి ఎక్కగానే కిందిమెట్టును సులభంగా మరచిపోయేది-మరి కోటేశ్వరమ్మ జీవిత లక్ష్యమేమిటి? ఆవిడకు ధనాకాంక్ష ఉన్నదా? శారీరక సుఖమా? పరోపకార చింతనా? అధికార దాహమా? ఆమెలో ఇవన్నీ కలగలిపి ఉన్నాయి-అన్ని శక్తులూ ఆమె బ్రతుకును ఊపిఊపి వదిలి పెట్టాయి-ఉషారాణి, హిమాలయ పర్వతసానువుల్లో ప్రశాంతతను

పొందితే, కోటేశ్వరమ్మ భాగవత పఠనంలో అమే యానందాన్ని పొందింది-ఇద్దరూ ఒొక్కచోటినుండే బయలు దేరారు-విడివిడిగా పెరిగారు-తిరిగి ఒొకే వాతావరణంలోకొచ్చారు-

సున్నితమైన మనస్తత్వ వివరణం మనలను చకితులను చేస్తుంది-ఈ పుస్తకం వెలువడినప్పుడు, రాజధానీ నగరంలోని పాఠకులెందరో ఇందులోని పాత్రలను, తమకు తెలిసినవారితో పోల్చుకోవటం జరిగింది-కొందరు స్వయంగా నన్ను అడిగారు కూడానూ-కోటేశ్వరమ్మను ఒొక వ్యక్తిగా చూడటం కన్నా, ఒొక వర్గానికి ప్రతినిధిగా చూడటం న్యాయ మని వారికి నేను సలహానిచ్చాను-సజీవమైన రచనకు ఇంతకన్నా మంచి ఉదాహరణలేదు.

*　　*　　*

# అహం

ఒక కవి ఒక సభలో ఈ విధంగా ఉపన్యసిస్తున్నాడు—

"మీరు కనిపెట్టారో లేదోగాని నేను తిక్కన కంటే గొప్ప వాణ్ణి, నా కవిత్వంలో తిక్కన కవిత్వంలో వున్న గుణాలకంటే గొప్ప గుణాలున్నవి. ఇంతవరకు భారత దేశంలో పుట్టినవాళ్ళలో తిక్కన కంటే గొప్ప కవిని నే నే..."

ఒక సభికుడు చివాలున లేచి—"తిక్కన కంటే మీరు గొప్ప కవులనుకోటానికి దృష్టాంతరం ఏమిటి?"

"దృష్టాంతరమా?...దృష్టాంతరమా," అని నట్లు కొట్టటం మొదలుపెట్టాడు కవి.

ఇంకొక సభికుడు లేచి ఈ విధంగా జవాబు చెప్పాడు—"దృష్టాంతరాలకేం! కావలసినన్ని వున్నాయ్. తిక్కనా కవిత్వం రాశాడు వీరూ కవిత్వం రాశారు. తిక్కన్నా పుట్టాడు వీరూ పుట్టారు. వీటినిబట్టి తిక్కనకూ వీరికీ చాలా పోలిక ఉన్నవని విశదం అవుతూ వుంది. ఇక తిక్కనకంటే ఈయన గొప్పవాడేలాగంటారా? తిక్కన చచ్చాడు; ఈయన చావలేదు..." అని కూర్చున్నాడు.

కవి తెల్లమొహం వేశాడు.

గోపీచంద్

# శిథిలాలయం

నవలలు ఎందుకు ?

"చదివినంతసేపూ వుత్సాహంగావుండి కాలం సరదాగా గడపడానికి''—ఇది ఒకనాటి జవాబు. కాలక్రమేణా నవలల పరమార్థం మారింది ''నవలలు విజ్ఞానవికాసాలకు''—ఇది ఈనాటి జవాబు.

కొంతకాలం నవలలద్వారా నీతినిచెప్ప జూచారు, కొంతకాలం సాహసోపేత సంఘటనలకు ప్రాధాన్యమిచ్చారు. కొంతకాలం సంఘంలోని కొన్ని ముఖ్య సమస్యలను పరిష్కరింప ప్రయత్నించారు నవలాకారులు. ఈ విధంగా కాలానుగుణంగా నవలలు వ్రాయబడ్డాయి.

నవలలు ఈనాడు ఎలావుండాలి?

మనిషినిగురించి, మనిషికి కావలసిన వాని గురించి ఆలోచించి, ఆలోచింపజేసేవిగా వుండాలి. జీవితాలను సుఖంగా, శాంతియుతంగా చేసుకోడానికి తాత్విక దృష్టికావాలి· రక్షణకు సుస్థిరప్రభుత్వం, అందుకు కావలసిన రాజకీయ పరిజ్ఞానం కావాలి. కొన్ని అవసరాలకు సంఘంకావాలి. ఇలాగే ఇంకెన్నో సమస్యలు మనిషికున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించి, మనిషిని హేతువాదిని చేసేవిగా వుండాలి నవలలు.

నవలాకారునికి లోకవృత్త పరిశీలన అవసరం. పై విషయాలను గురించి కొన్ని ఆదర్శాలను ఏర్పరచుకోవాలి నవలాకారుడు. ఆ ఆదర్శాలను నవలద్వారా చెబుతూ ప్రజలను ఆకర్షించి, వాటిని అనుసరించేటట్టు చెయ్యాలి. ఈ విధంగా ప్రజలను

శ్రీ టి. రమేష్

ఆకర్షించిన తెలుగు రచయితలు చలం, గోపీచంద్. చలం లైంగికసమస్యలకే ప్రాధాన్యమిచ్చారు. గోపీచంద్ అన్ని విషయాలూ ఆలోచించారు, ఆలోచింప జేసారు

తత్వవేత్తలలో—''ఇది ఒక సంస్థచేయవలసిన పని దీనిని నేను ఒక్కడినీ చేయబూనడం సాహసమే...'' అని గోపీచంద్ ఒకచోట వ్రాసారు. ఆయన నిజంగా ఒకసంస్థే. 'ఒకసంస్థ' అనడం కూడా ఆయనకు అన్యాయం చేయడమే. ఆయన అనేక సంస్థలకలయిక—ఒక అంతర్జాతీయ సంస్థ.

పరిణామం మానవసహజం జీవితంలో ప్రవేశించి, ప్రయాణంచేయడం మొదలుపెట్టిన తరువాత అనేక క్రొత్త విషయాలు పరిచయ మౌతాయి. అప్పుడు అంతకుపూర్వం ఏర్పరుచుకున్న ఆదర్శాలను కొన్నింటిని మార్చుకోక తప్పదు. ఈ పరిణామ దశలన్నీ స్పష్టంగా వీరి రచనల్లో కనుపిస్తాయి వీరి పరిణామ అంతిమదశ ''శిథిలాలయం''

వీరు గుండె పోటుతో వాధపడుతూ, వైద్యులు వలదన్నను వినక ఈ నవలను పూర్తిచేసారు. ఈ నవలలోని ఒక్కొక్క అక్షరానికి ఒక్కొక్క బొట్టు రక్తం ధారవోసారు. ఈ నవల ఆయనగుండెనుండి రక్తాన్నిపీల్చి ఆయన కలాన్ని ఆపివేసింది—ఎంత కృతఘ్నత.

ఈ నవల వారి అంతిమ సందేశం.

ప్రతి నవలాకారునికీ ఒక శైలివుంటుంది. ఆ శైలిలోనే వారి నవలలన్నీ వ్రాయబడతాయి. కాని గోపీచంద్ తను వ్రాయాలనుకున్న నవలకు కావలసిన విధంగా శైలిని మలుచుకుంటారు. ఈ విధంగా ఏ ఇతర నవలాకారుడూ చెయ్యలేకపొయ్యాడు. శిథిలాలయం సుకుమారంగా, గంభీరంగా నడుస్తుంది. తను చెప్పాలనుకున్నది సూటిగా చెపుతూ, విసుగనేది పుట్టకుండా చకచకా పరిగెత్తించారు

ఈనవల క్లుప్తంగా ఇది—

పీతాంబరం అతిసామాన్యమైన ఒక గుమస్తా. పాతకాలపు భావాలతో జీవితం ప్రారంభిస్తాడు అతడి భార్య నిర్మలాదేవి పాతకాలపు పతివ్రతలను వూహించుకొని, వారిలాగే నిర్మలంగా వుండాలని కాబోలు ఆమెకు ఆపేరుపెట్టుకున్నాడు పీతాంబరం—పాపం!

నిర్మలాదేవి (సుభద్ర) పల్లెటూరి పిల్ల భయపడుతూ సిగ్గుపడుతూ అందరు ఆడవాళ్ళలాగే జీవితాన్ని ప్రారంభించింది కాని కాలక్రమేణా ఆమె మారింది—

'ఆమెకు చీరలు, జాకెట్లు, భోజనాలు, చదువుల మీద వుండేదికాదు మనసు. ఎక్కడికో ఎగిరిపోవాలని అనిపిస్తూవుండేది. ఆమెకు ఏమి అక్కరలేదో, వేటిని చూస్తే బంధింపబడినట్లు బాధపడుతుందో అవే చేసేవాడు పీతాంబరం. మానసిక వాధకు తట్టుకోలేక ఒకటి రెండుసార్లు ఆత్మహత్య చేసుకోవోయింది...

తనకు ఏం కావాలో, తనుఏమిచెయ్యాలో తెలీక తికమక పడింది. ఒక దారంటూ ఏర్పరచుకోలేక పోయింది. ఫలితంగా పీతాంబరాన్ని వొదిలేస్తుంది నారాయణుడి దగ్గరా వుండలేక పోతుంది తరువాత తను ఏమిచెయ్యాలో తెలుసుకుంది ఉన్నత ఆశయాలను ఏర్పరుచుకుంది. అందరకూ ఆదర్శవంతురా లయింది.

తను వివాహం అనే బంధనానికి కట్టుబడి వుండలేకపోయినా, అది జీవితానికి అవసరం అని తేల్చుకుంది. నారాయణుడికి పెళ్ళిచేసింది. పీతాంబరానికి పెళ్ళిచేసుకోమని సలహా ఇచ్చింది.

సుశీల ప్రవర్తన, సుశీల జీవితం అతడిలో చాలా మార్పుతెస్తుంది, పూర్వంలా ముడుచుకు ముడుచుకు

బ్రతకకూడదనుకుంటాడు. "మానవ జన్మఎత్తిన తరువాత హాయిగా బ్రతకడం ధర్మం తను ఇన్నాళ్ళూ చేసింది పిశాచకృత్యం'' అనుకుంటాడు. ఫలితంగా పాతివ్రత్యాన్ని పవిత్రంగా భావించిన అతడు ఒక వెలయాలిని (సీనా) వివాహమాడ్తాడు.

ఈ నవల ద్వారా గోపీచంద్ చెప్పదలుచుకున్న ఆదర్శం వేరుగా వ్రాయవలసిన అవసరం లేదనుకుంటాను.

ఈ నవల్లో పాత్రపోషణ, సంఘటనలు, సంభాషణలు కడు రమ్యంగా వుంటాయి.

కొన్ని సంఘటనలు—

తను నారాయణుడి దగ్గరకు వెళ్ళిపోతానని ఏ బెదురూ లేకుండా పీతాంబరానికి చెపుతుంది నిర్మల.

పీతాంబరం నిర్విణ్ణుడవుతాడు

''నీకు సిగ్గులేదా దరిద్రప్పదానా !" అనిమట్టుకు అనగలుగుతాడు.

''మీ ఇష్టం. మీరేమనుకున్నా సరే.'' అన్నది నవ్వటానికి ప్రయత్నిస్తూ !

ఆమె చేయబోయే పనికన్నా, ఆమె ప్రదర్శిస్తున్న తృణీకార బుద్ధికి అతనికి వొళ్ళు మండింది. చడామడా తిట్టాడు. చెంపలు వాయించాడు. అన్నిటినీ ఇష్టే భరించింది—కాదు క్షమించింది.

''ఇంకా నుంచున్నావేం, వెళ్ళక ?''

"మీ స్థితి చూసి జాలిపడి.'' అని చెప్పి ఆమె వెళ్ళిపోతుంది.

తరువాత కూడా విశాల భావాలుగల ఆమె అతణ్ణి చూసి జాలిపడుతుంది ప్రేమిస్తుంది. కుత్సితుడుగా వుండి, ఆమెను బాధపెడుతూనే వుంటాడు పీతాంబరం. వీరిరువురి మధ్యా ఇలాగే భారంగా జరిగిపోతుంది.

తరువాత అతడి జీవితంలో సీనా (విటులకు ఆకర్షణీయంగా వుంటానికి ఆమె ఆ పేరు పెట్టుకుందట !) ప్రవేశిస్తుంది

ఒకనాడు ఆమెతో ఇలా అంటాడు ''మనం ఇద్దరం కలుసుకున్న మొదటిరాత్రి నువ్వేమన్నావంటే''—తరువాత చెప్పడు.

''చెప్పు'' ప్రాధేయపడుతుంది. చెప్పడు.

''చెప్పకపోతే బూతులు కూస్తా." బెదిరింపు అయినా చెప్పడు.

బూతులు కూస్తుంది. అతడు బాధపడలేదు. అటువంటి బూతులు ఆడదాని నోటినుండి వింటున్నందుకు ఆనందిస్తాడు కూడా. కాసేపటికి బూతులు వెగటేసినియ్ అతడికి.

"ఆగలేనురా నాతండ్రీ. ఆగలేను" అంటూ జుట్టుపట్టుకొని వొళ్ళోకి లాక్కుంటుంది. అప్పుడుగానీ చెప్పడు ఆమె ఏమన్నదో. ఇటువంటి హాస్యపు సన్నివేశాలు ఎన్నోవున్నాయి

క్రమేణా సీనాకు అతడిమీద ప్రేమవృద్ధి చెందుతుంది. ఒకసారి "ఎప్పుడన్నా పెద్ద జబ్బువచ్చి, సెలవులన్నీ అయిపోయి, నీకు జీతంరాకపోతే అప్పుడు నా డబ్బుతో నిన్ను సాకాలనివుంది. నువ్వు నడవలేకపోతే సహాయంపట్టి నేనే నడిపిస్తాను. నువ్వు పడుకుంటే విసురుతూ నీ ప్రక్కన కూర్చుంటాను," అన్నది. వెలయాలుకు పాపం ఎంతపెద్ద కోరిక !

''అయితే నీకోసం నాకు జబ్బు రావాలంటావా?''

''అని కాదు దానంతట అదివస్తే''

ఇటువంటి గంభీరమైన, రసవత్తరమైన సంఘటనలు అనేకం వున్నాయి ఈ నవలలో మూడు విభిన్న మనస్తత్వాల మధ్య సంఘర్షణను అతి సహజంగా, మనోహరంగా చిత్రించారు. 'శిధిలాలయం'లో గోపీచంద్ తను చెప్పాలనుకున్న ఆదర్శాలను ఒక క్రొత్తపోకడలో వ్రాసారు. తన ఆదర్శాలను తనుగాని, తను సృష్టించిన పాత్రల ద్వారాగాని ఎక్కడా చెప్పరు. పాత్రల నడవడిక, పాత్రల

శ్రీ టి. రమేష్

ప్రవర్తన, పాత్రల జీవితాలద్వారా ఆదర్శాలను చెప్పారు. అందువల్ల ఆదర్శాలను ఒక సిద్ధాంతంలాగా కాక, ఒక జీవితాన్ని చూసి ప్రజలు తమ జీవితాలు దిద్దుకునేటట్లు చేయడానికి ప్రయత్నించారు.

ప్రఖ్యాత తత్త్వవేత్త శ్రీ యమ్. యన్ రాయ్ తత్త్వగ్రంధాలద్వారా ప్రజలను హేతువాదులుగా చెయ్యాలనుకున్నారు. ఆ పనిని గోపీచంద్ నవలల ద్వారా చెయ్యడానికి పూనుకున్నారు ఈ నవల చదివిన తరువాత ఆయన తర్కానికి కట్టుబడిపోతాడు. హేతువాద దృష్టితో ఆలోచించడం మొదల్లుపెడ్తాడు ఉదాహరణకు నిర్మలాదేవి జీవితం చదివిన తరువాత స్త్రీల గురించి ప్రతివారూ ఆలోచిస్తారు. ఏమిటి? స్త్రీకీ పురుషునితోపాటు సమానహక్కులు కావాలా? పురుషులకున్నంత తెలివితేటలు స్త్రీకి లేవా? స్త్రీ నేడీ స్థితిలో వుండటానికి కారణమేమిటి? స్త్రీ స్వాతంత్ర్యాన్ని అరికట్టింది సంఘమేనా? సమానత్వం వచ్చిన తరువాత సంఘంలో ఎటువంటి మార్పులు వస్తయ్యి? ఇలా ఆలోచించడం మొదలుపెడ్తారు. ఒక ఆదర్శాన్ని ఏర్పరుచుకుంటారు.

'శిధిలాలయం' ఏకబిగువున నడుస్తుంది. మనం వూపిరిబిగబట్టి చదువుతాం, కడుపుబ్బ నవ్వుతాం, బాధపడతాం, పశ్చాత్తాపపడతాం. ఇంత బాధకు గురి చేసిన గోపీచంద్‌మీద కోపం తెచ్చుకుంటాం, అలుగుతాం, నవ్వుతాం, ఆయన చెప్పింది అవునని వొప్పుకుంటాం!

ఉత్తమ నవలకు వుండదగ్గ అన్ని లక్షణాలూ ఈ నవలకున్నాయి. ఇంతకూ ఇది డెబ్భై పేజీల చిన్న నవల. ఇంత చిన్న నవలలో ఇన్ని విషయాలను ఇంత చక్కగా ఇంకోనవలాకారుడు వ్రాయలేదంటే అతిశయోక్తికాదు. ఈ నవల ఆంధ్ర సాహిత్య రంగంలో చిరస్థాయిగా నిలిచి పోతుందన్నా అతిశయోక్తి కాదేమో!

---

# కులతత్వం - జాతీయవాదం

బానిసవర్గం తన ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకోటానికి చేసే ప్రయత్నం కులతత్వం. అధికారంలో వున్నవర్గం మిగిలిన వర్గాలమీద తన పెత్తనం సుస్థిరం చేసుకోటానికి చేసే ప్రయత్నం జాతీయవాదం.

గోపీచంద్

# సినీసీమలో-

శ్రీ బొమ్మకంటి సుబ్బారావు

సినిమా రంగంలో సాధారణంగా యిటు గంభీర రచనకుగానీ, అటు హాస్య రచనకుగానీ-రెండింటిలో ఏదో వక్క- దానిలోనే కవులు ప్రసిద్ధి చెందటం కద్దు. చిరకాలం చలనచిత్ర రంగంలో లేకపోయినా, చుట్టం చూపుగా అప్పుడప్పుడు సినిమా రంగానికి వచ్చినా, వచ్చినప్పుడు ఒకసారి సంభాషణల కర్తగా, మరొక సారి దర్శకుడుగా పలుకరించి పోయినా, గోపీచంద్‌ను కళాభిమానులు ఒకందుకు మరచిపోలేరు, అటు హాస్య రస పోషణలోనూ. ఇటు భావోద్రేకసన్నివేశ(ఎమోష నల్ సీన్స్) నిర్వహణలోను సవ్యసాచి ఆయన.

"గృహ ప్రవేశం''లో గోపీచంద్‌సృష్టి ''తుల సమ్మక్క'' తరతరాలకూ మరువలేరు శ్రీ ఎల్ వి. ప్రసాద్ దర్శకత్వం వహించిన తొలిచిత్రం. ప్రతి సంభాషణలోనూ సునిశిత హాస్యం, వ్యంగ్యం ఇమిడి వున్నవి అంతేకాక సాహిత్యపు గుబాళింపులను కూడా వెదజల్లినవి. వెగటుతనం కానీ మొరటుతనం కానీ లేదు సునిశిత సినిమా హాస్యానికి ఒరవడి పెట్టినది గోపీచంద్ అనడం సాహసం కాదేమో!

రచయిత రచయితగానే వుంటే గోపీచంద్ పుణ్యాన తెలుగు సినీ ఉద్యానవనంలో అనేక పారి జాతాలు పూసి వుండేవి. రచయిత దర్శకుడు అయ్యే ప్పటికి కొన్ని చిక్కులు వస్తవి. రచయిత దర్శకుడి క్రింద ఉన్నంతకాలం యిబ్బందిలేదు. రచయిత దర్శ కుని మ్రింగివేస్తే రాణింపుపోయి కొంత ఏవగింపు వస్తుంది దర్శకునిలోని రచయిత దర్శకుని పడవేసే

సినీమాకు కళారూపం కంటె సాహితీరూపం వస్తుంది. రచయిత ఎప్పటికీ తన భావాలను ఇతరులకు నిర్భయంగా చెప్పే వ్యక్తి. సమాజాన్నికాని, ప్రేక్షకులను కాని లెక్కచెయ్యరు. పైగా వారిని సంస్కరింప ప్రయత్నిస్తారు. దర్శకుని వైఖరి తద్భిన్నం. దర్శకుడు సమాజానికీ, ప్రేక్షకులకూ లొంగి ఉంటారు. వారిని మెప్పించి, ఆర్థికపు కుప్పలు సృష్టించుకోవడమే అతని ఆశయము. ఆ రచయితా దర్శకుడూ వక్కడే అయినప్పుడు, రచయిత దర్శకుని అప్రధానం చేసినప్పుడు, ఆయన చిత్ర సృష్టిలో ఎక్కువగా కన్పించేది- సంస్కరణభావం, ఉత్తేజం, హెచ్చరికలు. అవి వుంటే చిత్రం ఆర్థిక విజయమొందుతుందా అనేది సందేహమే !

రచయిత గోపీచంద్ చిత్ర దర్శకుడు అయినప్పుడు ఆ చిత్రాన్ని ఆయన దర్శకునిగా కంటే రచయితగానే "డామినేట్" చేశారు. తత్ఫలితంగా పదిపన్నెండేళ్ళ క్రితం ఆయన చిత్రాలలో జాలిపుట్టించే వేశ్యలు కన్పించారు. వ్యాంపులుగా సినిమా కళకు కనపడే వారికి రచయిత నీరాజన మర్పించే సరికి ఏదో ఎబ్బెట్టుగా తోచింది. గోపీచంద్ డైరెక్టు చేసిన చిత్రాలలో కొన్ని రాణించక పోవటానికి ఒక కారణం—రచయితగా ఆయనకు కల అద్భుతభావాలు "అనువుపడనిచోట" యిరికించడమే! బాధలు, గాయాలవంటి వాటిని రచయిత జుగుప్సాకరంగా వర్ణించినా చదువుకొనేటప్పుడు అంత పట్టించుకోరు. ఆ వర్ణనకు తగ్గట్టు వెండితెరపై వాటిని చూపితే సహించలేరు. సినిమా కంటికి ఆనందమివ్వాలి, బాధించరాదు. రచయిత గోపీచంద్ దర్శకుడుగా యీ బాధ్యతను పాటించనందువల్ల "ప్రియురాలు" వంటి చిత్రాలు దెబ్బతిన్నవి. కళానికి, సినీకళాగమనానికి పొంతన కుదరచ్ఛలేక పోవడం గోపీచంద్ దురదృష్టం. "గృహప్రవేశం"లో ఆద్యంతం గిలిగింతలు పెట్టించిన గోపీచంద్ "లక్ష్మమ్మ"లో కన్నీటికాల్వలు ప్రవహింప చేశారు. అదే ఆయన కలంలోని ఘనత. ఏ రసాన్నయినా సమప్రజ్ఞతో సమ పాళంగా ఒలికించగలరు

"లక్ష్మమ్మ"కు జరిగినగాథ ఒకటి ఆధారం కాబట్టి రచయిత తన కలాన్ని హద్దుమించి పోనివ్వ వీలులేదు. అయినా గోపీచంద్ కాబట్టి వేశ్యపాత్ర సృష్టిలో తనవ్యక్తిత్వం తనస్వతంత్రమైన ఆలోచన, తన కల్పన చూపనేచూపాడు. ఎటువంటిస్త్రీ అయినా సినీ గోపీచంద్ జాలి పొందవలసినదే!

అత్తరికంపై చిత్రాలకు గోపీచంద్ ఒక ఒరవడి పెట్టారని చెప్పవచ్చు. ఎందుచేత నంటే ఆయన "లక్ష్మమ్మ"కు పిమ్మట కోడళ్ళ బాధలపై తెలుగులో కొల్లలుగా చిత్రాలువచ్చినవి.

శ్రీ గోపీచంద్‌కు సమయస్ఫూర్తి హెచ్చు. ఆయన సూక్ష్మగ్రాహి ఆయన మేధ మహానిశితం. దేనిని గురించీ బుర్ర బ్రద్దలు చేసుకోరు. చాలా సినిమా డైలాగులు అక్కడికక్కడ సెట్టుపై వ్రాసినట్టివి ఐనా వాటి అందం వాటిదే!

ఒక ఘట్టం గగుర్పాటుకలిగించేటట్టుగా రావాలి అంటే అదిజరిగే వరకూ ఆయన ఊరుకొనేవాడు కాదు. చాలా శ్రమపడేవారు. సాహసించి ఏ పని అయినా చేసేవారు! "లక్ష్మమ్మ"కు నాయిక కృష్ణవేణి దాదాపు యజమానురాలు వంటిది. నారాయణరావు ఆమెను చెంపదెబ్బ వేసేఘట్టంలో ఆమె ఎక్స్‌ప్రెషన్ సరిగా రావటంలేదు. గోపీచంద్ చాలా బాధపడ్డారు. ఎందుచేత నంటే—అది బరువైన ఘట్టం ముఖ్యమన్నివేశం.

దర్శకుడు ఆమెతో ఏమైనా కటువుగా మాట్లాడితే ఉద్యోగానికి ఉద్వాసన రావచ్చు. అట్టి విషమ పరి

స్థితిలో గోపీచంద్ తన ఉద్యోగాన్నీ, తనకర్త వ్యాన్నీ త్రాసులోపెట్టి చూశారు. కర్తవ్యమే బరువుగా కన్పించింది. ఉద్యోగం తేలిపోయింది. అంతట నాయకుడు నారాయణరావును ప్రక్కకు పిలిచి రహస్యంగా "ఆమె ఎక్స్‌ప్రెషన్ సరిగా రావడంలేదు. జడవకు, దవడపైలాగి నిజంగా కొట్టు" అని ఆదేశించారు. కృష్ణవేణికి ఆ సంగతి తెలియదు. ఫోర్తుటేక్...రెడీ అన్నారు గోపీచంద్. నారాయణరావు అంతకుముందు మూడు టేక్‌లలోనూ చెంపవరకూ చేయిరానిచ్చి, చెంపతగిలేసరికి చెయ్యి చప్పగా ఉంచేవారు. నాల్గవ టేక్‌లో డైరెక్టర్ గోపీచంద్ ఆదేశానుసారం ఫెడేల్ మని చెంపలేశారు. దద్దరిల్లిన లక్ష్మమ్మ అతి సహజమైన ఎక్స్‌ప్రెషన్ ఇచ్చింది 'షాట్' అయిన మీదట దర్శకుడు గోపీచంద్ కృష్ణవేణి చెంతకు వెళ్ళి అద్భుతంగా నటించినందులకు ఆమెను అభినందించి, "చేసినపాపం" చెప్పేశారు. చెంపదెబ్బ బాధ యింకా తగ్గని కృష్ణవేణి "నా మేలుకేగా!" అని చెప్పేసరికి ధన్యుడనయ్యానని అనుకొన్నారు.

నూటికి నూరుపాళ్ళు తెలుగుదనం కన్పించిన అతి కొద్ది చిత్రాలలో "లక్ష్మమ్మ" ఒకటి అతిర వేగంగా-బహుశా రెండు నెలలలోపు కాలంలో తయారైన భారత చిత్రాలలో యిది ఒకటి. శ్రీ ఘంటసాల బలరామయ్యగారితో పోటాపోటీగా రోజుకి 23 ½ గంటలు పనిచేసి, గోపీచంద్ కార్యదీక్షకు గొప్ప నిదర్శనం చూపినారు. నారాయణరావు, కృష్ణవేణి, శేషమాంబ, చదలవాడ "లక్ష్మమ్మ"లో నటించినంత ఉత్తమంగా నటించిన ఇతర చిత్రాలు చాలాకొద్ది. కొత్తతరహా పాత్రలనేకాక క్రొత్త తారలను పరిచయం చేసేందుకుకూడా గోపీచంద్ కృషిచేశారు. ఆలిండియా రేడియోలో వార్తలు చదువుతున్న జగ్గయ్యను మద్రాసుకు రప్పించి ఒకటికి రెండుసార్లు టెస్టులు చేసిచేసి, తుదకు యెరా ఎకిన హీరోగా తీసుకొన్నారు. వెండితెరకు గోపీచంద్ కానుక జగ్గయ్య.

పోనుపోను గోపీచంద్ రచనకంటే, దర్శకత్వానికి ప్రాధాన్యమిచ్చారు. దర్శకునికంటె రచయితగా ఆయన సమర్థుడు. రచన తనపైనే ఆధారపడేది. దర్శకత్వం ఇంకెందరి పైనో ఆధారపడి ఉన్నది. స్వతంత్ర రచయిత పరాధీన దర్శకుడయ్యేటప్పటికి గోపీచంద్‌కు పురోగమనంకంటే, తిరోగమనమే హెచ్చింది. అయినా ఆయన కలం మెరుపువంటిది. అందుచేతనే ఆయన సినిమారంగంవీడి కర్నూలు, హైదరాబాద్ వెళ్ళినా ఆయన కలం మద్రాసుకే వెన్నుపట్టి త్రోస్తూవచ్చింది మొన్న "కలిమిలేములు"లో ఆయన బలిమి చూశాము. నిన్న అన్నపూర్ణావారి "చదువుకున్న అమ్మాయిలు"లో వారి పాళీ పండుగచేసింది. చివరిచిత్రం రుచులు అందరితో అనుభవించే అదృష్టం గోపీచంద్‌కు లేకపోయినది విధిబలీయం

# గ్రామీణ జీవితము

ఇంకను పది కాలాలపాటు బ్రతికి, తన కుశాగ్రమైన బుద్ధి తీవ్రతచేత మానవ మనోవీధిలోని బహుముఖమైనవైవిధ్య కిర్మీరపు టగాధములను వెదకి, వాఙ్మఖమున వెలార్చి, ఆంధ్ర భారతి కింకను క్రొత్తయలంకారములు కైసేయవలసిన గోపీచందు నడివయస్సులోని మరణము సాహిత్య ప్రియుల కెల్లరకును ఆశాభంగము కలిగించినది ఆయన పేరు స్మరించుకొనుట కాయన వ్రాసిపోయిన గ్రంథములు చాలును. కాని ఆయన బ్రతికియుండినచో మరేమి వ్రాసెడివాడో? ఇంతవరకు వ్రాసిన వానికంటెను లోకోత్తరమైన యొకరచన వచ్చియుండుట కవకాశములేదా? యను ప్రశ్న ఇపుడు ప్రశ్నగానే నిలబడి పోవుస్థితి యేర్పడినది.

గోపీచందు రచన లనేకములు స్థూలముగానవి జీవితములు, నవలలు, కథలు, నాటికలు, గల్పికలు. అవి గోపీచందు ఊహాశక్తికి, ఆయన సాంఘికజీవన సంబంధి హేతుభావసంపదకు, ఆయన మానవమనోవిజ్ఞానమునకు, ఆయన సూక్ష్మపరిశీలన పటువైన బుద్ధివైలక్షణ్యమునకు నిదర్శనములుగా నున్నవి. ఆయన రచనలం దెక్కువ భాగము కథలు. వానిని కథలని ఊరక యనుటయేగాని అందధిక భాగమాయన పెద్దగా వెలికి చేసిన యాలోచనలు అవి యట్టివని ఆయనకు తెలియును. చేసిన ప్రతిపనియు తెలిసిచేయు రచయితను అంచనావేయుట అంత తేలికకాదు.

డాక్టరు బి. రామరాజు

ఈనాడు ప్రపంచభాషా వాఙ్మయము లన్నింటిలోను నవల-కథ ఇవిరెండును ప్రధానమైన సాహిత్య ప్రక్రియలు. వీనిలో మానవ మనోవీధిని ప్రదర్శించు ప్రయత్నమెక్కువగా నున్నది అట్టిరచనలే రచనములుగాను ఆ రచయితలే రచయితలుగాను, నేటి సాహిత్య ప్రమాణజ్ఞులు గుర్తించుచున్నారు. ఒక్కమాటలో చెప్పుటకు మానవమనోవీధి యన్నది బాగుగనే యున్నది కాని దాని యసలుస్వరూపము, లక్షణము తెలియుటకు జీవితము చాలదు. అందుకే మానవజాతి సృష్టిజరిగిన నాటినుండి నేటివరకును తద్వైచిత్రి అన్వేష్యము. ఏతదన్వేషణమే తనజీవిత పరమావధిగా తాను కనుగొన్న వైచిత్రియొక్క విచ్ఛిత్తి లక్షణమును నవలలుగా, కథలుగా, గల్పికలుగా మరియు నింక ననేకవిధములుగా గోపీచందు వెలువరించినాడు

మానవమనోవైచిత్రి యెన్నియో విషయములను చుట్టుకొని యుండును. మానవుడు తాను పుట్టి పెరిగిన దేశకాలరూప పరిసర వాతావరణము — తన తల్లిదండ్రుల జీవిత విధానము— తాను లోకము నర్థము చేసికొన్న విధము—ఇత్యాదులను చుట్టుకొని యుండునని స్థూలముగా చెప్పుకొనవచ్చును. పైన చెప్పిన పద్ధతిలోని విషయాలను చుట్టుకొని రూపుకట్టుకొన్న మానవ మనోవీధియొక్క తాను దర్శించిన వైలక్షణ్యమును గోపీచందు చిత్రించినాడు.

దేశమనగానేమి? ఇంతకన్న దేశపు సూక్ష్మ రూపమేమన్నచో బాగుండును. గ్రామమే దేశపు సూక్ష్మరూపము. ప్రపంచమందలి యే దేశము విషయమైనను ఇంతే. విశేషముగా మన దేశమంతయు గ్రామమయము గ్రామములందుండు జనులు గ్రామీణులు. వారి జీవితమనగా వారి భౌతిక కాయముల యొక్కయు మనస్సుల యొక్కయు ప్రవృత్తి లక్షణమన్నమాట. మన గ్రామము లందలి జనులెట్టివారు? వారి దైనందిన జీవిత మెట్టిది? మన గ్రామములు కాలప్రవాహపు మార్పుల కనుగుణముగా మారినవా? యను బహు విషయము లవగతమైనగాని గ్రామీణ జీవితమన్న దాని యర్థము తెలియదు.

గోపీచంద్ పుట్టి పెరిగినది గ్రామమగుటనుబట్టియు తానొక రైతుబిడ్డ కాబట్టియు, దేశముయొక్క జాతీయాభ్యుదయ పథమున గ్రామము ప్రధాన భూతమగుటను బట్టియు, ఆయన బాధ్యతగల రచయితగా రాజకీయ చైతన్యము నిముడ్చుకొన్న తాత్త్విక దృక్పథముగల మేధావిగా, తదభ్యుదయమును సంభావించి, వాస్తవమును యధాతథముగా చిత్రించుచున్నట్లు కనుపించుచునే తన విశ్వకల్యాణపుటూహలను స్ఫురింపజేసినారు తచ్చిత్రణమును పర్యాలోచించినచో ఆయన బుద్ధియొక్క సూక్ష్మాతిసూక్ష్మ విషయావగాహన లక్షణము కొట్టవచ్చినట్లు కనిపించును గోపీచందు మన దేశము దాస్యమనుభవించుచున్న కాలమున బుట్టి, జాతీయోద్యమము తీవ్రదశలో పెరిగి, స్వాతంత్ర్యము వచ్చిన తరువాత రెండు ప్రణాళికల కాలము బ్రతికి సర్వ విషయముల పురోగతిని తిరోగతిని చూచి, తూచి, అంచనా వేసికొని రచనలు గావించిన రచయిత. అందువలన నాతని రచనలపై నాయా పరిస్థితుల యనుకూల ప్రతికూల ప్రభావము లుండుట కనిపించును.

మన దేశపు గ్రామముల స్థూల స్వరూప మిది- అందలి ప్రజలు భూకామందులైన రైతులుగాను, కామందులుకాని రైతులుగాను ఉన్నారు. ఇంకను వృత్తులవారు కొందరు కూలినాలి చేసికొనువారు కొందరున్నారు. గ్రామీణ జీవితమనగా నట్టివారి జీవితమనియే యర్థము. కొన్ని పరిస్థితులలోని కొందరి ప్రవృత్తి గ్రామీణులందున్నట్లే పట్టణములలోని వారియందును ఉండును. పేదరికము, స్త్రీ పురుష సంబంధ విషయములు, అంతః కలహ

ములు, ప్రేమఅసూయలు, పట్టుదలలు మున్నగు వానికి సంబంధించిన మానవ ప్రవృత్తి గ్రామములం దున్నట్లే పట్టణములందును ఉండును. అందువలన అట్టి జీవితచిత్రణమును గ్రామీణముగా నిట సంభా వించుటలేదు ఉదాహరణకు — "విరిగినమనస్సులు'' కథలో రామప్పభార్య, వెంకటేశ్వర్లు భార్య, రాజమ్మ ఈ ముగ్గురు బహిరంగముగా పోట్లాడుట గ్రామీణులగు తక్కువకులాల వారి పోట్లాటవలెనున్నది ''ఆడవాళ్ళు అంతకుముందు ఎంతబాగా ఉంటున్నా కజ్జారాగానే పుటికి పుటిక్కిన రంకుల్ని అంటకట్టడం వాళ్ళకు ఆచారం వర్ణించి వర్ణించి తిడతారు ఆ తిట్టటంలో వాళ్ళకు విచిత్రమైన ఆనందం వాళ్ళలో తీరని కోర్కెలను వేటినో ఆ తిట్లు తీరుస్తుంటై. అవ్యక్తంగా ఉన్న అపేక్షలను నోటిద్వారా తీర్చుకుంటున్నారు అనిపిస్తుంది''—పల్లెలందు ఇట్టి మనస్తత్వాల కలహ ములు మననిత్యానుభవములోనివే కాని "విరిగిన మనస్సులు" కథమాత్రము పట్టణములోనిదే ఇట్టి చోట్ల కథలోని పాత్రలు ఎక్కడ నివసించుచున్నారని కాక, వారి మానసికస్థాయి యెట్టిదనియే చూచుకొన వలెను "సీతారామారావు'' కథ గ్రామమందలిదే వంశ మర్యాదలు నిలువబెట్టుటకై చితికిపోయినవాని వంశ కథ, వానికథ—గ్రామ జీవిత విధానములోని యొక యంశమే ఐనను అట్టివి కేవలము గ్రామము లందే సంభవములని చెప్పుటకు వీలులేదు అందు వలన నట్టివికూడ గ్రామీణజీవిత చిత్రణములోనికి గ్రహింపనక్కరలేదు ''షరా'' కథలో కోటిరెడ్డి మామ పల్లెటూరి పిసినిగొట్టైనను అట్టివారు పట్టణము లందును కలరు.

రైతులు, పొలములు, పశువులు, చెరువులు, కాలువలు, బీళ్ళు, చెట్లుచేమలు, గ్రామీణ వృత్తులు, వ్యవసాయపు కూలీలు—వీని పరస్పర సన్నికర్ష లక్షణ చిత్రణమే ప్రస్తుతము గ్రామజీవిత చిత్రణము ఇట్టి గ్రామ జీవితమును గోపీచందు రెండు మూడు విధములుగా చిత్రించినాడు. గ్రామములందు జీవితము గడువక పట్టణాలుచేరి ఆపని ఈపని చేసి బ్రతుకువారు, ఉద్యోగాలకై పల్లెపట్టులువిడిచి పట్టణములకు వచ్చిన వారు — పూర్వస్మృతులుగా — సందర్భము ననుసరించి మధ్యమధ్యన గ్రామీణ జీవితము నెమరువేసికొను చున్నట్లు చిత్రించుట—ఒకపద్ధతి. గ్రామ జీవిత మాధారముగా నితివృత్తమును కల్పించి చిత్రించుట రెండవపద్ధతి. గ్రామీణుల దైనందిన జీవితముతో పెనవేసికొనిపోయిన యమహత్తులకు చైతన్య కల్పన మొనర్చి అవి స్వయముగా తమ్ముతాము స్పష్టము చేసికొనుచున్నట్లుగా చిత్రించుట మూడవ పద్ధతి.

మొదటి పద్ధతి రచనలో రచయిత పోలిక శిల్ప మర్యాద మీద గ్రామీణ జీవితపు యదార్థ స్వరూప మును చిత్రించుట గమనింపదగినది, ఇది రెండు ప్రయోజనముల నాశించి చేసిన శిల్పము ఈ శిల్ప మర్యాద ననుసరించి గోపీచందు ఆయా రచనము లందు జాతీయాభ్యుదయ విధమున ప్రధానమైన గ్రామ పునరుద్ధరణ విధానములను స్ఫురింపజేయ గలిగినాడు. ఈ పరమ ప్రయోజనము నాశించియే లతడట్టి శిల్ప మవలంబించుట. ప్రజలు పల్లెలనుండి పట్టణములకు తరలుచున్నారు ఇది నేటి మన ప్రభుత్వమునకొక సమస్య. గ్రామములోని వారి నచటనే యుంచుటెట్లు? వా రసలు పట్టణములకేల యెగబడుచున్నారు? గ్రామ ములు వర్షములపై నాధారపడిన పొలములు గలవి. సకాలములో వర్షము పడనిచో రైతు దెబ్బతినును. రెండుమూడు సంవత్సరములు వరుసగా రైతు దెబ్బ తిన్నచో నెట్లుండును? వ్యవసాయపు కూలీలకు, గ్రామీణవృత్తుల వారికి సంవత్సరమంతయు పని యుండదుకదా! అందును పై పరిస్థితులలో వీరిగతి

యేమి? పల్లెటూరి జనము పట్టణముల కెగబ్రాకక మరేమి చేయుదురు? ఆ పరిస్థితులను తొలగించినచో గ్రామీణులు గ్రామములు వదలరు. ఏల వదలరన వారు తమ జన్మభూమి నంతగా ప్రేమించు లక్షణము గలవారు. సామాన్యపు టిబ్బందులకు పల్లీయులు స్వస్థలములను విడువరు. అది వారి సహజ లక్షణము. గ్రామస్థుల సహజలక్షణ మెరిగి గ్రామ పరిస్థితులను చక్కబరచవలె.

గోపీచందు తన రచనలందీ విషయములన్నింటిని స్ఫురింపచేసినారు. ''కూపస్థ మాండూక్యం''లో పాపారావు పైపరిస్థితులలో గ్రామము వదలివచ్చినవాడే. అట్లే "రిక్షావాడు'' కూడ. వానికి గ్రామములో నాల్గెకరాల పొలమున్నది. వ్యవసాయముచేసి సంసారమును పోషించుకొనువాడు. నాలుగు సంవత్సరాలు వరుసగా వానలేదు. పొట్టగడవలేదు, ఐనను వాని తల్లి వానిని పట్టణమునకు పోనీయలేదు. దానికి కారణము జానపదుల సహజ లక్షణమే. 'చావాల్సివస్తే పుట్టినూరూ-మెట్టినూరూ ఇక్కడే చద్దాం. చావక ఎవరైతే మాత్రం ఎల్లకాలం బ్రతుకుతార్రా.'' ఉన్నదామె. ఆ తరువాత వాడెవ్వరికిని చెప్పక చేయక పట్టణము చేరుకొన్నాడు. ఉండివచ్చిన గ్రామానికి ఉండటానికి వచ్చినపట్టణానికి భేద మవగతము కాజొచ్చినది వానికి. ఇదియే యదనని గోపీచందు గ్రామ జీవితపు టుదాత్తతను వాని ముఖముగా వెలువరించినాడు గ్రామీణ రైతునందొక సాధారణ గుణమున్నది పొరుగు వారాకలితో నుండగా వాని యెదుట తాము తినరు. ధర్మశాస్త్రము లా విధముగా తినరాదనియే చెప్పును. శాస్త్ర విషయము వారికి తెలియకపోయినను వారిలో నా సదాచారమున్నది. రైతు పొలము దున్నుచునో మోట గొట్టుచునో యుండగా ఇంటినుండి దుత్తలోవచ్చిన గంజి యన్నము తినుచుండ త్రోవనబోవు బాటసారిని కూడ "అన్నా గంజిబువ్వ తినిపోదువు రా'' యని యనకుండ ఉండలేడు. ఆ ప్రవృత్తి యెంత మానవతా భావము నిముడ్చు కొన్నది! పట్టణము లందటులకాదు. తినుబండారముల ప్రదర్శనముండును. డబ్బున్నవాడు తినుచుండును. ఆకలితో చేయి చాచువాని నాతడు చూడడు. పిలిచిపెట్టకపోయిన మానెగాని చేయిచాచినప్పుడైన పెట్టవలదా! ''ఇదేమి యన్యాయ''మని ఆ "రిక్షా"వాని కనిపించినది. గోపీచంద్ వ్రాయున దింతయ. గ్రామీణజీవిత విధానమందున్న మానవత పట్టణములందు కనుపించకపోవుట నాత డట్లు చిత్రించినాడు. మరొకసారి వానికి (రిక్షావాడు) "అంతకు ముందున్నదీ_తప్పకుండా వుండవలసిందీ _ ఏదో పోయినట్టు'' లనిపించినదట ఆ పోయిన దేమిటి? మనిషిని మనిషిగా చూడకపోవుటే. వాని కట్లెందుకు అనిపించినదో ఆ కథలో నున్నది. ఏది మానవజాతి మనుగడకు పరమమైన మూల సూత్రమో అది గ్రామీణులలో పేరుకొన్నుకొని నిల్చియున్నదన్న విషయమును గోపీచంద్ పోలిక శిల్పమర్యాద మీద మరింత దీప్తి మంతముచేసినాడు. ఈ పోలిక శిల్పము వలన తారతమ్య నిరూపణము జరిగి ఉద్దిష్ట విషయమునకు దీప్తి యెక్కువగును. ఆ శిల్పమందలి రహస్య మదియే. గోపీచంద్ మరికొన్ని కథలం దీ శిల్పమును చూడవచ్చును.

గ్రామీణ జీవితమునే యితివృత్తగా రచించుట రెండవ పద్ధతి. ఈ పద్ధతి రచనములందు ముఖ్యముగా పేర్కొన దగినది 'మమకారం' కథ. జోగయ్యమామ జీవిత మంతయు పొలము పనికి ధారవోసిన, వయసు మళ్ళిన రైతు. అతనికి పొలముపై నేర్పడిన మమకార లక్షణమును గోపీచందు ఆ కథలో చిత్రించినాడు. బిడ్డలుకొడుకులకన్నను, భార్యకన్నను, తన ప్రాణము కన్నను అతనికి పొలముపై మమకార

డాక్టరు బి రామరాజు

మెక్కువ. పెంచిన తుమ్మలు నాగండ్లకై కొట్టినప్పటి బోసి స్థలమును చూచి "చేతి కెదిగొచ్చిన కొడుకులు తన్ను విడచి వెళ్ళినట్లు బాధపడుతుంటాడు''. "బాగా నెఱ్ఱగొట్టిన తన చేను నీటిని గుటగుటా తాగుతుంటే పసివానికి స్తన్యాన్నిస్తూ పరవశత్వంతో కూర్చునే తల్లిలా నుంచునేవాడు. అతని భార్యకూడా అట్టిదే. బొందిలో ప్రాణి పోయేవరకు సంసారంమీద మమకారమే యామెకు జోగయ్యమామకూడ పొలము దగ్గర కూర్చొని గుప్పిటిలో మన్నుపట్టుకొని వాసన చూచుచు హాయిగా ప్రాణము వదిలినాడు (ఈ భావములో కొంత పాశ్చాత్య ప్రభావం నాకు స్ఫురించినది.) ఇంత తీవ్రమైన యనుబంధముగల రైతుజాతి నేటి రాజకీయార్థిక వికృతపరిణామమున నెట్లు మారిపోవు చున్నదోకదా! దేశీయ సామాజి కార్థిక వ్యవస్థకు సంబంధించిన నిశ్చయాభిప్రాయములుగల రాజకీయ విజ్ఞానవేత్తగా ఆలోచించి, దర్శించి, అవగాహన చేసి కొన్నదానిని శిల్పరహస్యమెరిగి, ప్రతిరచనమున నొక ప్రయోజనము నుద్దేశించి వివిధరీతులందు శిల్పమును తీర్చి దిద్దినవాడు గోపీచంద్.

సాధారణముగా గోపీచందు రచనలు చదువునప్పు డాతదేదియో మనస్సులో పెట్టుకొని ఈ రచన చేయు చున్నా డనిపించును. ప్రతి వాక్యమున కేదో యుద్దేశ ముండును నిశితముగా - దీర్ఘముగా-లోతుగా పరిశీలించినచో నాతని యాంతర్యము తెలియును. ఒక్కొక సారి గోపీచందు ప్రాతకాలపు టూహలకు రూపకల్పన చేయుచున్న ట్లనిపించును. సామాన్యుల కట్లే యని పించును. నిజముగా ఉత్తమ రచయితలకు ప్రాత క్రొత్తలుండవు. ఏది మానవాభ్యుదయమునకు దోహద కారియో అది తెలిసికొనుట యుత్తమ రచయిత లక్షణము. గోపీచందు రచనములం దట్టివి కనుపించు చోట కొంచె మాగి యాలోచింపవలెను. "మొక్కలు పీకితే కళ్ళుపోతై'' "పచ్చని చెట్టును విరిస్తే పాపం'' వంటి వాక్యాలు అత్యంతాధునికులకు గిట్టవు. కాని గోపీచందు ఆధునికులకంటె ఆధునికుడు. ప్రతి వాక్యము వెనుకనున్న యాంతర్యమాతనికి తెలియును.

ఈ గ్రామీణ జీవిత చిత్రణములో గోపీచందనుస రించిన మూడవపద్ధతి మరియు చిత్రమైనది. కొన్ని కథలలో అమహత్తులు చైతన్యవంతములై తమ్ము తాము అభివ్యక్తము చేసికొన్నట్లున్నవి. ఇట్టి రచనము లందు తుమ్మచెట్టు, మఱ్ఱిచెట్టు, అట్టు కడిగిన యెద్దు- మూడును ముఖ్యమైన కథలు.

తుమ్మచెట్లు రైతుల కనేక విధములుగా నుపయోగించును. చేనులోనున్న చేనుకు సత్తువ ఓళ్ళ యందలి యున్నచోట గడ్డి యెక్కువగా పెరుగును. పశువులకు తుమ్మకాయ మంచి బల మిచ్చును. అది యొక పశు గ్రాసము. చేవగల తుమ్మ వ్యవసాయపు పనిము ట్లన్నిటికిని ఉపయోగము. దీని యుపయోగ మింతగా నుండుటచేతనే రైతు దైనందిన జీవితముతో నది ప్రగాఢముగా పెనవేసికొన్నది. తుమ్మచెట్టు స్వగతములో గోపీచందు ఆయా యంశము లన్నింటిని స్పృశించినాడు. అటులే మఱ్ఱిచెట్టుకూడ, దానినీడయే గ్రామీణులకొక పెన్నిధి. దానిక్రిందనే పులిజూదములు, దానిక్రిందనే గ్రామ వ్యవహారము లాలోచించుట. ఇట్టది గ్రామస్థుల జీవితములో కలిసిపోయినది. ఈ నాటి గ్రామములు పూర్వమువలె లేవు. ఎన్నియో కొంగ్రొత్త మార్పులు వచ్చినవి. కొన్ని మార్పు లభ్యుదయపథమున సాగుచున్నవి మరికొన్ని వెఱ్ఱి తలలు వేయుచున్నవి. ఇట్టిపట్టులందు గోపీచందు ఈ వెఱ్ఱితలలను తన వ్యంగ్య నిస్త్రింశముతో ఛేదించును. ఆ మఱ్ఱిచెట్టున్న గ్రామమున పంచాయతీ బోర్డున్నది. అంతవరకు బాగుగనే యున్నది. దానికి నరసింహులు క్రొత్తగా ప్రెసిడెంటయినాడు. వాడా చెట్టును నరికించి

నాడు. తానధికారములోనికి వచ్చినందుకొక పని చేయించి కీర్తిపొందుటకు వాడాపని చేయించినాడు. అప్పుడు మఱ్ఱిచెట్టు ''మానవులు ప్రకృతిలో సహజంగా జీవిస్తున్న ప్రాణికోటి అభిప్రాయాలను అర్థం చేసుకోలేని స్థితికి దిగజారి వున్నారు. ఇక వాళ్ళకు చెప్పుకునేది యెట్లా!'' యని యనుచున్నది. మానవతకు ప్రాణభూతమైన నాడి కనుపట్టి గోపీచందు ఏ తీరుగా చిచుక్క మనిపించుచున్నది తెలిసికొనుటకు ఈ వాక్య మొక్కటి చాలును. చివరకు మొండెమైన మఱ్ఱిచెట్టు "కొన ఊపిరితో వున్నదానికి చిగిర్చటానికి ప్రయత్నించటమే నా ధర్మం. విచారిస్తూ వూరికే కూర్చొనటం ఎందుకని నేను చిగర్చటానికి ప్రయత్నిస్తున్నాను" అని యనును. అత్యంతము తీవ్రమైన వ్యంగ్యరచనా స్వరూప మిది. రచయిత బుద్ధితీవ్రతకిట్టి కల్పన లుదాహరణములు. "అట్టుకడిగిన యెద్దు'' కూడ ఇట్టి రచనమే. వ్యవసాయము చేసి చేసి పెద్దదై ఇకపనికిరాక విడిచిపెట్టినదానిని అట్టుకడిగిన దందురు. అట్టి యెద్దు స్వగతమును గోపీచందు ఎంతో రమణీయముగా రచించినారు. అట్టుకడిగిన తరువాత దానిపరిస్థితి యత్యంతము దయనీయముగా చిత్రితము. పనిపాటలు చేసెడునట్టి యెద్లు, సవారి యెడ్లు, పందెపుటెడ్లు మున్నగువాని విషయమై, వానిమేతవిషయమై. గ్రామమందు అందరికన్న తనయెడ్లే మేల్తరములని గౌరవమందుటకై గ్రామీణరైతున కుండెడు మనఃప్రవృత్తియు,ఇంటివద్ద తానెంతగోముగా పెంచినను బరిమీద పదిమందిలో తనగౌరవమునకు భంగముకలుగ నున్నప్పు డా యెద్దులయెడ నెంత క్రూరముగా రైతుప్రవర్తించునో గోపీచందు ఈ యట్టుకడిగిన యెద్దు స్వగతములో వాస్తవముగా చిత్రించి రక్తికట్టించినాడు.

ఈవిధముగా గోపీచందు రచన లన్నింటిని ప్రత్యేకముగా నధ్యయనము చేయగలిగినచో ఆయన బహుముఖ ప్రజ్ఞావిశేషస్వరూపము గోచరమగును. ఆయన రచనల ప్రయోజనములను ఆయన కున్న రాజకీయ వైజ్ఞానిక తాత్త్విక దృక్పథముల యాంతర్యము నెరిగి నిర్ణయింపవలెను. మానవ మనః ప్రపంచపు వైచిత్రియే ఆయన రచనము లన్నింటికి నితివృత్తమని స్థూలముగా చెప్పుకొనవచ్చును. అందులో ఎవరికి వలసినవివారు — రాజకీయములు కావలసినవారు రాజకీయములు — సంఘసంస్కరణము కావలసినవారు సంఘసంస్కరణము — గ్రామీణ జీవితము కావలసినవారు గ్రామీణ జీవితము — ఇత్యాదిగా చూచుకొనవచ్చును. ఈ యన్నింటి సమాహార స్వరూపమే గోపీచందు.

# “......స్వగతాలు”

ఈనాడు మనకువస్తున్న పుస్తకాలలో ఉదాత్తమైన విషయాన్ని స్వీకరించి పేలవంగా వ్రాయబడినవి ఎన్నో వుంటున్నాయి. దీనికి కారణం రచనా సంవిధానములోని లోపము. సామాన్య విషయాలను వస్తువుగా స్వీకరించి అసామాన్యమైన ప్రతిభతో చిత్రించబడ్డ పుస్తకాలు కూడా వున్నాయి. ప్రాచీన సాహిత్య సాగరాన్ని మధిస్తే సామాన్యవస్తువును గైకొని ఉదాత్తంగా రచించబడ్డ కావ్యరత్నములు కోకొల్లలు.

మహాకవి కాళిదాసు మేఘమాలికను వస్తువుగా స్వీకరించి మహోదాత్తమైన కావ్యాన్ని రచించాడు. పాశ్చాత్యరసజ్ఞలోకముసైతము ఆ మేఘసందేశము చదివి, మైమరచి, జోహారులర్పించింది. మబ్బు తునకలోనే ఎన్నో సొగసులను, సొబగులను చూపగల్గటం కాళిదాసుకే చెల్లినది. అలాగే అతిచిన్నచిన్న దృశ్యాలను, సంఘటనలను స్వీకరించి హాల కవి మధురమైన రూపకల్పనలు చేశాడు. మహాకవి భట్టుమూర్తి పర్వతాన్ని, నదిని రచనావస్తువుగా తీసుకొని అద్వితీయమైన వసుచరిత్ర ప్రబంధాన్ని సారస్వత లోకాని కందించాడు.

అందుచేత ఆధునిక సాహిత్యంలో వెన్నెల, పూలతోట, చల్లగాలి, మెరుపులు, ప్రేమ, త్యాగము యిత్యాదులే కావ్యవస్తువులు కానవసరంలేదు. పరిశీలనాశక్తి, నవనవోన్మేషణమైన ప్రతిభ వుంటే ప్రతివిషయములోను ఉదాత్తతను చూడవచ్చు. అత్య

శ్రీ నర్రా కోటయ్య

ద్భుతంగా చిత్రించనూవచ్చు. అది చిత్రించే విధానాన్నిబట్టి, ఆ చిత్రకారుని సంస్కారమునుబట్టి వుంటుంది. రచయితలో ఋషిత్వమున్నప్పుడు ఏ విషయాన్ని గురించి వ్రాసినా అది మనసును ఆకట్టి వేస్తుంది, హృదయములో అమృతపుజల్లులు వర్షిస్తాయి, ఆలోచనలు రేకెత్తుతాయి. రచయిత బహుముఖ ప్రజ్ఞాశాలి అయితే కుక్క, కోడి, ఆవు, రైలు, చెట్టు, ఒకటేమిటి సృష్టిలోని ప్రతి పదార్థమును వస్తువుగా స్వీకరించి బహుభంగుల చిత్రించవచ్చు. సాహిత్యానికి విలువ చేకూర్చవచ్చు, సంఘాన్ని ఉత్తేజపరచనూవచ్చు. అయితే యీ పని అందరి వలనాకాదు ప్రతిభాశాలి అయిన గోపీచంద్‌గారి వంటి రచయితలకు మాత్రమే యిది సాధ్యపడుతుంది. ప్రతి చిన్న వస్తువును ఒక కళాఖండముగా, విజ్ఞాన కేంద్రముగా సృష్టించి సాహితీ ప్రియులకు అందించినారు మహాభావుకులు గోపీచంద్‌గారు

గోపీచంద్‌గారి "మాకూ వున్నాయి స్వగతాలు" అనే గ్రంధములోని విషయాలు అతి సామాన్యమైనవి. సామాన్య విషయాలను స్వీకరించి అసామాన్యముగా చిత్రించినారు సిద్ధహస్తులైన గోపీచంద్‌గారు ఇందులో పనిపిల్ల, రిక్షావాడు, గోమాత, చెప్పులు కుట్టేవాడు, చిన్నకారు డ్రైవరు, తుమ్మచెట్టు, అనాధ బాలుడు, బిచ్చగాడు, మర్రిచెట్టు, అరుగ్రికడిగిన ఎద్దు, ప్రఖ్యాతుని భార్య-తమతమ కధలను వినిపించడం జరిగింది.

మధ్య తరగతి కుటుంబాలు, ఉన్నత దశలో వున్న కుటుంబాలు మాత్రమే పని మనుషులను పెట్టుకొనగలుగుతున్నాయి. మధ్య తరగతి వారి మనస్తత్వము చాలా చిత్రంగా వుంటుంది. దిగువ తరగతి వారి గుణాలు, ఎగువ తరగతివారి ఆశయాలు వీరిలో కలగలిసి వుంటాయి అందువల్ల సామెత చెప్పినట్లు వీరెప్పుడూ "మెయ్యబోతే ఎద్దులలోను, దున్నబోతే దూడలలోను'' వుంటూ వుంటారు. పని మనుషులను కుదుర్చుకునేటప్పుడు పనులు చాలా వరకు తగ్గించి చెపుతారు. క్రమ క్రమంగా రోజుకొక పనిచొప్పున పెంచుకుంటూపోయి పోయి, కొసకు పనిమనిషి కాలూ, చెయ్యీ కూడదీసుకొనే వెసులుబాటు లేకుండా పనులు పురమాయిస్తారు. మరో గతిలేదు కనుక పనిమనుష్యులు కూడా కిమ్మనకుండా పనిజేస్తుంటారు. అలా చేస్తారని మనకూ తెలుసు గనుక పనిమీద పని పురమాయిస్తుంటాము. అయితే మనల్ని గూర్చి వారేమనుకుంటున్నారో మనము ఆలోచించము. అలా ఆలోచించవలసిన అవుసరం లేనట్లే ప్రవర్తిస్తాము. మనకున్నట్లే వారికీ ఆత్మాభిమానం, మాన మర్యాదలున్న సంగతి తరచుగా మరచి పోతూంటాము. మనకూ వారికి మధ్యగల ఆర్ధిక సంబంధాలు మనల్ని ఆలోచించుకోనీయవు

కొందరు బీదతల్లులు నెలలులెక్కన యితరుల పిల్లలకు పాలిస్తూవుంటారు. ఆడబ్బుతో వారు సంసారాలు గడుపుకుంటూ వుంటారు. పాలుచాలక వారి స్వంత బిడ్డలు ఈసురోమంటూ ఉండడం మన మెరుగుదుము

సాంఘికంగానూ ఆర్ధికంగానూ దేశంలో ఎన్నో మార్పులు వచ్చాయి. వ్యవసాయదారులు క్రమ క్రమంగా వ్యవసాయ కూలీలుగా మారిపోతున్నారు. ఏడెల్లకాలమూ పొలము పను లుండవు గనుక పొట్ట చేతబట్టుకొని, పట్టణాలకూ, నగరాలకూ ఎగబ్రాకుతున్నారు. వీరిలో చాలమంది మరోపనేదీ దొరక్క రిక్షాలు లాగి పొట్టగడుపుకుంటూ వుంటారు. ఒక మనిషిని మరోమనిషి మోయడమన్న మధ్యయుగాల విధానం యినాటికీ అమలులో వుండటం దారుణం. పశువులు చేయవలసినపని మనిషిచేస్తుంటే మనకేమీ

శ్రీ నర్రా కోటయ్య

పట్టనట్లు వూరుకో గలుగుతుంది మన నాగరికత! ''రిక్షా ఎక్కేవా ళ్లెవరూ నన్నుమనిషిగా లెక్క కట్టడం లేదు ... పల్లెటూళ్లో యీబాధలేదు. ఎన్ని కష్టాలువున్నా, ఏపరిస్థితుల్లో వున్నా, మనిషిని మనిషిగా చూస్తారు. యిక్కడ యిదేమిటి?'' అని రిక్షావానిచేత అనిపిస్తారుశ్రీ గోపీచంద్. దీనికి మననాగరికత ఏమని సమాధానమిస్తుందో తెలియదు అతను రిక్షా లాగుతున్నా, మరేం చేస్తున్నా మనస్సంతా స్వగ్రామం మీదనేవుండేది. అందుకనే, ''నడవ్వేరా తొందరగా'' అన్నాడు రిక్షాలోకూర్చున్నాయన. నాకు ''ఛో ఛో! అహ హై'' అన్నట్టువినిపించింది ''వీళ్ళకు నెమ్మదిగా చెబితే అర్ధంకాదు'' అన్నాడు స్నేహితుడు ''నాకు దీన్ని కోసుకు తినా'' అన్నట్టు వినిపించింది. '' ఊః నడవ్వేం ... '' ''నాకు చెంద్రకోలతో కొట్టిన ట్లయింది...'' అనిపిస్తారు రచయిత, జన్మతా వచ్చిన సంస్కారాన్ని ఇతను వదులుకోలేడు, బస్తీ నాగరికతతో రాజీపడలేడు. ఈ రెండింటి సంఘర్షణ యిందులో చిత్రించబడింది.

చెప్పులు కుట్టేవాడి స్వగతం పూర్తిగా చదివాక-గుండె ఓ క్షణం ఆగిన ట్లనిపిస్తుంది. హోటళ్ల ముందు, రోడ్లప్రక్కన, సినీమాహాల్సు దగ్గర, తోళ్ల ముక్కల మధ్య కూర్చున్న వందలాది చెప్పులు కుట్టేవారు కళ్లముందు మెసిలి మనసును కుదిల్చి వేస్తారు.

జీవించడంకోసం మృత్యువుతో పెనుగులాడే జీవి ఆవేదన, నిస్పృహా యిందులో మనం చూడగల్గుతాం. కారణం ఫలానా అని తెలిసికూడా దానిని నివారించు కొనలేని అశక్తత, తిరిగి ఆదే పరిస్థితిలోనికి వెళ్లితీర వలసిన అగత్యము ఎదురైన మనిషి ఎలావుంటా డన్న ప్రశ్నకు యీరచన చదువవలసిందని మాత్రమే సమాధానము. చెప్పులు కుట్టేవానిచేత ఒకచోట గోపీచంద్‌గా రిలా అనిపిస్తారు. ''నాతో పనిచేయించు కొనే వారితో నాకు మాట్లాడబుద్ధి అవుతుంది. వారి కష్టసుఖాలు కనుక్కోబుద్ధి అవుతుంది. నాకూ వారికీ తెగని సంబంధం ఏదో వున్న ట్లనిపిస్తుంది. కాని, వారు పడనిస్తేనా!'' మరోచోట ''పోలీసు... పొమ్మంటాడు. అక్కడినుంచి! ఎంత తేలిగ్గా అన్నాడు? కాని ఎక్కడకుపోను? ఎక్కడకుపోయినా ఏ స్థలమూ నాదికాదాయె!''

అతిగా దుమ్ము పీల్చడంవల్ల, విశ్రాంతిలేకుండా పనిచేయడంవల్ల అతని భార్యకు క్షయరోగంవచ్చి చనిపోయింది. ''గుడిసెది కాలంచేసింది. దాని జబ్బుకు వున్నదంతా ఖర్చుపెట్టాను. నేను పిల్లలం మిగిలాం ఇక కొట్టు పెట్టాలనే ఆశలేదు నాకిప్పుడు. చచ్చేదాకా బ్రతుకడం ఒక్కటే మిగిలింది అక్కడే కూర్చొని చెప్పులు కుడుతున్నా. పెద్దపిల్లవచ్చి కూర్చొని, నాకు తోడ్పడుతూ వుంటుంది. అది అచ్చంగా వాళ్ళమ్మలాగే పాలిష్ చేస్తుంది. అప్పు డప్పుడు రోడ్డుమీద రేగేదుమ్ము జ్ఞాపకంవచ్చి గుండె గుభేల్‌మంటుంది! కాని, ఏంచెయ్యను ? దుమ్మును దాటి ఎక్కడికి పోయేటట్టు ? దుమ్ములో పుట్టాం, దుమ్ములో పెరిగాం, దుమ్ములోనే చస్తాం!''

అనాధ బాలుడు, బిచ్చగాడు అన్న రెండు రచనలూ ఆధునిక సమాజంమీద రచయిత విసిరిన రెండు అస్త్రాలనవచ్చు. మానవత్వాన్ని రూపాయణా పైసలలోకి మార్చుకోగలిగిన సమాజాన్ని మనము అనాధ బాలుడులో చూడగల్గుతాం. అతని తండ్రి రాళ్లుకొట్టే కూలీ. తల్లికి మేస్త్రీతో సంబంధం వున్న దన్న అనుమానంతో తండ్రి చచ్చేలాగా కొడ్తాడు. యిది జరిగిన నాలుగు రోజులకే తండ్రి శవం బావిలో కనిపిస్తుంది. కొనకా బాలుడు అనాధశరణాలయంలో చేరుతాడు.

"ప్రతిరోజూ మేము స్నానం చేస్తే చేసేవాళ్లం, లేకపోతే లేదు. మాకు రెండు జతల బట్టలుండేవి. ఒకటి కట్టుకొని ఒకటి వుతుక్కుంటూ వుండేవాళ్ళం. చిరిగితే మేమే అతుకులువేసి కుట్టుకునే వాళ్ళం. ఎవరో గొప్పవాళ్లు బడి చూడ్డానికి వచ్చినప్పుడుతప్ప మా సంగతి ఎవ్వరూ పట్టించుకొనేవారుకారు; ఎవరైనా వచ్చినప్పుడు మాత్రం అంతా సందడే!" యిది అక్కడి అసలు పరిస్థితి! కాని పెద్దదొర మాత్రం — "వీళ్ళందరూ దిక్కులేనివాళ్లే! చెడు జీవితాలకు అలవాటుపడ్డవాళ్లే. తాము చేస్తున్న నేరాలకు వాళ్లను పోలీసువారు పట్టుకుంటే, మేము తీసుకువచ్చి, చదువు చెప్తున్నాం. వీళ్ల జీవితాలు యిప్పుడు పూర్తిగా మారిపోయినయ్. యిక్కడ చేరకముందు వాళ్ల జీవితాలు ఎట్లావుండేవో వాళ్లే చెబుతారు వినండి!" అంటూవుంటాడు.

దిక్కూ మొక్కూలేని ఆ అనాథులందరూ అధికారులు చెప్పమన్నట్లల్లా చెపుతారు. చూడవచ్చిన వారు "ఓహో" అని సంతోషించి శరణాలయ నిర్వాహకులు చేస్తున్న అమోఘ కృషిని ప్రశంసించి వెడతారు. యిది రివాజుగా జరిగేపని.

మన అనాథ బాలుడు తన కథను చెప్పేందుకు నిరాకరించాడు. అతని ఆత్మాభిమానం అందుకు అడ్డు పడింది. చివరకు అత నిలా అనుకుంటాడు. "ఇక పెద్దదొర నన్ను బళ్లో వుండనివ్వడు నేను బజారు కెక్కవలసిందే-ఎక్కుతాను. తప్పేదేముంది? అడుక్కు తినవలసిందే. తింటాను. తప్పేదేముంది? జేబులు కొట్టవలసిందే, కొడతాను, తప్పేదేముంది? అప్పుడు నాకు తెలిసి వచ్చింది-మా అయ్యలో ఏమన్నా చెడూ, మా అమ్మలో ఏమైనా చెడూవుంటే దానికి కారణం ఎవరో! కారణం వీళ్లే-యిటువంటి వాళ్లే!"

బిచ్చగాడు అన్న రచన కూడా యిదే కోవకు చెందింది. అతను మొదట్లో రైతు. "మొదట్లో మాకు కాస్త పొలంకూడా వుండేది. నా చిన్నతనంలో మా వూరి జమీందారు మా పొలం అన్యాయంగా ఆక్రమించుకొని మమ్మల్ని ఆ గ్రామంనుంచి వెళ్ల గొట్టాడు." అలా ప్రారంభమైన అతను చివరకు బిచ్చగాడుగా మారిపోతాడు.

"...నేరుగా ఆకలవుతుందని చెప్తే ఎవరూ డబ్బు లివ్వరు. వేషాలు వేస్తేనే డబ్బు యిచ్చేది. ఏ కుంటి వాడిగానో, ఏ గుడ్డివాడిగానో, ఏ కుష్టువాడిగానో కన పడాలి. అప్పుడుగాని డబ్బివ్వరు. అందుకని మేమంతా తలొక వేషం వేస్తాము......యిది మోసం కాదా అని మీరు అడుగవచ్చు. మోసమేనేమో! కాని యీ మాత్రం మోసం చెయ్యందెవ్వరు? మీలో ఒక్కరైనా మోసం చెయ్యకుండా బ్రతుకుతున్నారా? క్షణాని కొక్కసారైనా మోసం చెయ్యకుండా వుంటున్నారా?" అని నిలవేసి అడుగుతున్నాడు బిచ్చగాడు. "లే" దని సమాధానం చెప్పగలవారెంత మందుంటారు?

గోమాత, అట్టుకడిగిన ఎద్దు, తుమ్మచెట్టు, మర్రి చెట్టు మరోకోవకు చెందినవి. స్వలాభం మాత్రమే చూసుకోవడానికి అలవాటుపడిన మానవుని ప్రవర్తనను యీ రచనల్లో నిశితంగా విమర్శించారు గోపీచంద్‌గారు. సర్వ సామాన్యమైన విషయాన్ని అసామాన్యంగా చిత్రించడమంటే ఏమిటో యీ పుస్తకం చదివి తెలుసుకోవచ్చు.

ఇదివరకు రోజుల్లో మానవుడు తనకోసమే యీ సృష్టియావత్తూ వున్నదనుకొనేవాడు. భగవంతుడే కాని, ప్రకృతేగాని, మానవుని సుఖసౌఖ్యాల కోసమే యీ ప్రపంచాన్ని ఏర్పాటు చెయ్యడం జరిగిందన్న భావం ప్రచారంలో వుండేది. మానవుడే దీనికంతకూ 'కేంద్రం' అని అనుకుంటూ వుండేవాడు. కాని, యిది

శ్రీ నర్రా కోటయ్య

నిజంకాదని ప్రస్తుత అనుభవాలు చెబుతూవున్నాయి. ఈ సృష్టిలో ఏది లోపించినా ఆ లోపంవల్ల మానవ జీవితం యిబ్బందులు పడుతూనేవుంది, దాన్ని తీర్చుకోవడానికి మనిషి పడలేని పాట్లుపడుతూ వున్నాడు. దీనికి ఎన్నో ఉదాహరణలు మనం గమనిస్తూనేవున్నాం.

చెట్లు తమకోసమే వున్నాయనుకొన్నప్పుడు, విచక్షణారహితంగా వాటిని తమ అవుసరాలకు మానవుడు వాడుకొన్నాడు, అందువల్ల దేశంలో వుండవలసిన శాతంలో చెట్లులేవు. ఇది కారణంగానే వాతావరణంలో కూడా మార్పులువచ్చి, ఋతు పవనాలలో కూడా మార్పులు వచ్చాయి. అరణ్యాల వైశాల్యం తగ్గిపోవడంవల్ల, నదీ ప్రవాహాల వేగాన్ని అదుపులో పెట్టడం కష్టసాధ్య మౌతుంది. అడవులనుంచి లభించిన వస్తువుల పరిమాణం తగ్గిపోయి, వాటికి హెచ్చుధర చెల్లించవలసి వస్తుంది. మేఘాలను చల్లబరచడానికి తగినన్ని అడవులు లేకపోవడంవల్ల వర్షపాతం తగ్గిపోతూవుంది. అలాగే కొండలు, నదులు, పశువులు, పక్షులు, క్రిమి కీటకాదులు కూడా ప్రకృతి కర్మాగారంలో తమవంతు పనిని తాముచేస్తూవున్నాయి. అందువల్ల సృష్టిలోని ప్రతిప్రాణీ, ప్రతి వస్తువూ, సృష్టియొక్క సమగ్రత్వానికి సహాయభూతంగా వున్నవని మన కనిపిస్తూ వుంటుంది.

ఈ జగత్తంతా చైతన్యమేనన్నారు మన పూర్వులు. జడత్వమన్నది చైతన్యం ఒక దశలో వెలువరించే చేష్ట అన్నారు. అంతకుముందు యీ సత్యాన్ని మనం నమ్మలేకపోయాం. ఆధునిక శాస్త్రం దీనిని ప్రయోగ రీత్యా ఋజువు చేసింది. ఈ చరాచర జగత్తులోని ద్రవ్యమంతా కొన్ని అణువులయొక్క కూడికతో ఏర్పడియున్నది, యీ అణువులు నిత్య చలనాత్మకాలని శాస్త్రకారులంటున్నారు. సాధారణంగా మనం ''అచేతనాలు'' అనుకునే వస్తువులు నిత్య చలనాత్మకమైన అణు సంయోగం వల్లనే ఏర్పడుతూ వున్నప్పుడు వీటిని ''అచేతనాలు'' అని ఎలా అనగలం ?

''ఈ ప్రపంచమొక నాటకరంగం'' అని హిందూ వేదాంతులంటున్నారు. యీ నాటకంలోని పాత్రలే మనం, మనచుట్టూవున్న ప్రకృతీని. ఏదో ఒక్క పాత్రకోసమే నాటకం ప్రదర్శించబడుతూందనుకోటం పొరపాటు. నాటకం రక్తికట్టడానికి ప్రతి పాత్రా అవుసరమే ! ప్రతి సంఘటనా అవుసరమే !

గోపీచంద్‌గారి యీ పుస్తకంలో మన కీ దృక్పథమే కనిపిస్తుంది. ఒక ఆవు, మర్రిచెట్టు, తుమ్మచెట్టు, ఒళ్ళు కడిగిన ఎద్దు, ఈ సత్యాన్నే చాటి చెపుతూవున్నాయి. చరాచర జగత్తులోని ప్రతి పదార్థమునూ అన్ని కోణములనుండీ పరిశీలించడంలో గోపీచంద్‌గారు ''నిష్ణాతులు'' అన్న మన అభిప్రాయానికి ''మాకూ వున్నాయి స్వగతాలు'' అన్న యీ చిన్న పుస్తకం ఒక మచ్చుతునక.

# వచనరచన

శ్రీ పోతుకూచి సాంబశివరావు

ఇరవైయో శతాబ్దం ప్రథమార్ధ భాగంలో తెలుగు వచన రచనకు తీరుతెన్నులు దిద్ది, ప్రత్యేకశైలి, భావసంపద సమకూర్చిన ఆధునిక రచయితలలో గోపీచంద్ అగ్రగణ్యులు. సాహిత్య సంస్కారం కల్గిన కుటుంబంనుంచి ప్రభవించిన గోపీచంద్ సమగ్ర సాహిత్య రసపిపాసులై తనజీవితం కొనసాగించారు. పద్యం గత శతాబ్దందాకా, ఇరవైయో శతాబ్దంలో మొదటి రెండు మూడు దశాబ్దాలదాకా, ప్రతిభావంతంగా, ఏకధాటిగా, ఔన్నత్య పథం ఆక్రమించుకుంది పాశ్చాత్య నాగరిక ప్రభావం వల్ల, ఆధునికత స్పందన ద్వారా, వచన రచనకు ప్రాధాన్యత పెరిగింది—అదే తెలుగులోకూడా కనిపిస్తుంది. సాహిత్య ప్రక్రియల్లోని కథ, నవల, వచననాటకం మొదలైన వాటితో వచనరచన విస్తృతమై తన ప్రభావం సాహిత్యరంగంలో ఎక్కువగా యినుమడింప చేసుకుంది. తెలుగు వచన రచన పరిపుష్టమై, భావసమన్వయముతో, ఉత్తమసాహిత్య సృష్టిప్రదమై విరాజిల్లడానికి గోపీచంద్ చేసిన సాహిత్య కృషిలో విశిష్టత ఉందని నిరభ్యంతరంగా చెప్పవచ్చు గోపీచంద్ వచన రచన విలువపెరిగి కనిపించటానికి ముఖ్యకారణం, అతనిసిద్ధాంతాలు సూటిగా, వాడిగా, వేడిగా చెప్పగల అతని స్వభావం. పదాల కలయికలో భావం ఉత్తేజంగా కనిపించకపోతే అది వచన రచన కాకుండా సామాన్య సంభాషణ అయిపోతుంది. కాని గోపీచంద్ రచనల్లో వచనం పాఠకుడి మనస్సుని

హత్తుకునేలా చెప్పగలిగే సొంపులు, ఒంపులు, బలం ఉన్నట్లు అనేక దృష్టాంతాలున్నాయి.

గోపీచంద్ నవలా రచయితగా ప్రసిద్ధియిచ్చిన గ్రంథం అసమర్థుని జీవయాత్ర. తెలుగు నవలల్లో యీ పుస్తకానికి ప్రత్యేక స్థాన ముంది. ఇందలి వచనంలో గోపీచంద్ సునిశితమైన భావాలతో సంఘంలో కనిపించే అసమర్థుని జీవిత తత్వాలన్నీ పొదిగించారు. పాత్రసృష్టి రచయిత భావుకత ఎంత నిదర్శనమో, రచనా పాటవం, శైలికూడా రచయిత సాహిత్యగమనానికి చక్కటి నిదర్శనం. ఇతివృత్తం బట్టి, సృష్టించే పాత్రల ననుసరించి, వ్యక్తంచేసే సిద్ధాంతాల విలువలబట్టి, వచనం మార్గంకూడా నిర్దేశించబడాలి మధ్యలో సంఘర్షణ ఉండి, పొందిక లేకుంటే రచయితలక్ష్యం నెరవేరదు. గోపీచంద్ యిది సూక్ష్మంగా అర్థం చేసుకున్న రచయిత. తన భావాలు లక్ష్యం చేరేలా తన వచనరచన స్వరూపం, శైలి చక్కదిద్దుకునే వ్యక్తి. అందుకే ఆయన వ్రాసిన పుస్తకాల్లో ఆయనే మాట్లాడుతున్నట్లు అనిపిస్తుంది.

గోపీచంద్ వచనంలో పదాల ఎంపిక ఒక తూకం కలిగివుంటుంది జాతీయాలు విరివిగా వాడి సామాన్యుని హృదయం ఆకట్టుకోగలశక్తి ఆయన కుంది గ్రామీణ వాతావరణం క్షుణ్ణంగా అర్థంచేసుకున్న ఆసక్తి అతని వచనరచనల్లో ప్రతిబింబిస్తుంది నిర్మొగమాటంగా, కచ్చితంగా విషయం విశదీకరించే ధైర్యంలో ఆయనకు సాటిలేరు. నేటి ప్రజాస్వామ్యయుగంలో రచయిత పరభాగ్యోపజీవిగామారి, వ్యక్తిత్వం చంపుకుంటున్న దుస్థితిని గ్రహించి, నిగ్రహించి, ఎదిరించి స్వతంత్రతా వాదంతో పురోగమించిన పోకడ ఆయన రచనల్లో అనేక చోట్ల ప్రతిబింబిస్తుంది. రచన థీసిస్‌గా వ్రాసిన రచయితలున్నారు తర్వాత ఎంటీథీసిస్‌ను సమర్పించిన వారున్నారు. మరోఅడుగు ముందుకువేసి, రచనను సింథెసిస్‌గా మలిచిన ప్రత్యేకత గోపీచంద్ పొందారు. సర్రియలిజంనుండి ఆధ్యాత్మిక ఔన్నత్యంపొంది, తెలుగు సాహిత్యంలో ఉన్నతశిఖరంమీద తన భావాల గోపురం నిర్మించుకున్న రచయిత గోపీచందే. ఇటువంటి ఔన్నత్య మార్గాలు ఆయన 'మెరుపుల మరకలు' నవలలో కనిపిస్తాయి.

గోపీచంద్ అనేక కథలు, వ్యాసాలు, నవలలు, నాటికలు వ్రాశారు ఇదంతా వారి సంపూర్ణ వచన రచన. భావాలు, దృక్పథాలు, సిద్ధాంతాలు అడుగడుగునా పొదిగి ఉన్న యీయన వచనరచన పరిపూర్ణత్వం పొంది ఉందనడంలో అతిశయోక్తిలేదు ఇతివృత్తమేదైనా, పాత్ర చిత్రణ ఎటువంటిదైనా, యీయన వచనధోరణి, వాటికి నగిషీ చెక్కుతుంది ఈయన వచనంలోని పటుత్వం, శక్తి, గోపీచంద్ రచనల విలువలు పెంచాయి. వచనం అందరూ వ్రాయగలరు, కాని ఉత్తమవచనం వ్రాయడంకష్టం వచనానికి గౌరవం యినుమడింపచేయాలని దాన్ని, కవిత్వంగా మార్చే ప్రబుద్ధులుకూడా ఉన్నారు కాని సులువైన మార్గంలో, సామాన్యుడిని గట్టిగా ఉద్ఘోషించే ధోరణిలో భావానికున్న బలమంతా మాటలో యిమిడ్చి స్ఫటికంలా వచనం మెరుగుపెట్టగల వ్యక్తిత్వం అందరికీ అరుదు కాని అది గోపీచంద్ ప్రత్యేకత.

గోపీచంద్ వచన రచన నూత్నత్వంఉన్న స్వీయ సృష్టా, లేదా పాశ్చాత్య ప్రభావంతోకూడి రూపొందిన ప్రత్యేకత కలదా అన్నప్రశ్న అందరికీ వస్తుంది పాశ్చాత్య పోకడల్లోని కొంగ్రొత్తదనం, భారతీయ సంప్రదాయ భావాలలోని ఉదాత్తత జోడించి, తన వచన రచన స్వరూపం సరిదిద్దుకున్నారు గోపీచంద్. గోపీచంద్ వచన రచన

ఆధునిక రచయితలపై ఎంతవరకువుంది అన్నది మరొక ప్రశ్న. కొడవటిగంటి, గోపీచంద్, చలం, చింతా దీక్షితులు, మునిమాణిక్యం, కథకుల కోవలో ఒకే వరుసకు చెందినా, ఎవరిపంథా వారిదే. ఎవరి వ్యక్తిత్వం వారిదే. కాని తక్కిన రచయితలు, చలంతప్ప, గోపీచంద్‌లా ప్రత్యేక వన్నెలు సంపాదించుకోలేదు. ఇతివృత్తాల వైవిధ్యంలో, హాస్యంలో, క్రొత్తపోకడల్లో, అనేకమంది తెలుగు రచయితలు తమ ప్రతిభ చూపించిన మాట వాస్తవం. కాని గోపీచంద్ యీ ప్రతిభను చూపిస్తూ ఒక గమ్యం ఆధారంగా తన వచనరచన తీర్చిదిద్దుకున్నారు. చలం వచన రచన చాలా బలవత్తరమైనదైనా గమ్యం దుష్ట మార్గంలో నడిచి, విలువలు ఒక సమాజ విభాగంలో పోగొట్టుకుంది. కానీ గోపీచంద్ విషయ వైవిధ్యం, దృక్పథం, సిద్ధాంతం, అందరికీ హర్షం కలిగించాలని, కొందరికి అది అందని ప్రమానిపండులా సుందరంగా దూరంగా ఆకర్షణీయంగానే వుండిపోయింది. అందుకే గోపీచంద్ వచనరచనకు ఆకర్షణ వుంది కాని అది అవలంబించగల శక్తి, వ్యక్తిత్వం ఎక్కువమంది రచయితలు అలవర్చుకోలేకపోయారు. అనేకమంది రచయితలలో తెలుగు సాహిత్యరంగంలో శ్రీ శ్రీ శైలి, దృక్పథం, సిద్ధాంతం, అవలంబించి నడిచిన వారున్నారు. ఆ విధంగా గోపీచంద్ సాహిత్య బలగం సృష్టించుకోలేకపోయినా, ఆయన వచన రచన ముద్రలు అనుకోకుండానే ఆధునిక రచయితల వచనరచన మార్గాల్లో కనిపిస్తాయి. ఆధునిక రచయితల్లో వచనంద్వారా ఏది ఆధునిక యుగంలో చెప్పాలో, అది అన్ని స్థాయిలలోనూ గోపీచంద్ చెప్పేశారు. మిగిలిన రచయితలు ఆయన్ను అవలంబించినా, లేకపోయినా, ఆయన పోకడలే తిరిగి వల్లె వేసుకుంటున్నట్లు, నేటికీ, తెలుగు సాహిత్య వచన రచన తీరుతెన్నుల్లో స్పష్టమౌతుంది. గోపీచంద్ రచనలో మరొక వైశిష్ట్యం గోచరిస్తుంది. పాశ్చాత్య నాగరిక ప్రభావం ఆయన దృక్పథం, ఆలోచనల్లో, కనిపించినా, భాష నడకలో చాలావరకు తెలుగుతనం యినుమడింప చేసే వాడుక భాషకు ఆయన ప్రాధాన్యత యిచ్చారు.

ఎటువంటి పాశ్చాత్య భావం వెలిబుచ్చినా దాన్ని భారతీయ సంప్రదాయ సంస్కృతితో మెరుగుపెట్టి సహజత్వం ఆపాదించి రచించేవారు వచన రచనలో పాశ్చాత్య దృక్పథం అవలంబించే కొందరు రచయితలు ఆంధ్రేతర పదజాలం వాడనిదే సంతృప్తి చెందరు. గోపీచంద్ రచనల్లో ఆంగ్లభాషా ప్రయోగం చాలా తక్కువ. వీలైనంతవరకు ఆ పదాలు విడిచేసేవాడు.

గోపీచంద్ రచనల్లో ఒక క్రమ పరిణామం గోచరిస్తుంది. వ్యక్తిత్వం ఏ విధంగా వికసించి, విజృంభించి, తుది స్వరూపం మలుచుకుందో, ఆ లక్షణాలన్నీ ఉన్నట్లు వారి రచనలు విమర్శనా దృష్టితో పరిశీలిస్తే అర్థమవుతుంది. బాల్యంలో పాశ్చాత్య సంస్కృతి ప్రభావం, తరువాత మానవతావాదం, ఆ పైన సన్నిహిత వాతావరణంలో సమత్వం, గోపీచంద్ రచనలోని అంశాలు క్రమంగా భౌతిక తాత్విక భావాల సంఘర్షణ ఆయనలో చాలాకాలం విజృంభించింది. ఆ సంఘర్షణ ఒక తుది స్వరూపం పొంది తాత్విక చింతన ఆయనలో ప్రవేశ్యనాటుకుంది ఆయన విమర్శనా దృక్పథంలో యీ తాత్విక దృష్టితో కూడిన సాహిత్య సృష్టికై పరితపించారు. జీవితం–సాహిత్యం కలిపి, మలిచి, నిర్దిష్ట సారస్వత సంపద సృష్టించారు. జీవితంలోని ప్రతీ సంఘటన, ప్రతీ ఆలోచన, ప్రతీ సిద్ధాంతం–సాహిత్యంగా రూపొందింది, ఆయన భావ క్రమపరిణామంలో అసందిగ్ధత

శ్రీ పోతుకూచి సాంబశివరావు

కాక, సంఘర్షణ మాత్రమే కనిపిస్తుంది. గమ్యం అన్వేషించేమేధావులు జీవితంలో భావ సంఘర్షణకు బలికాక మానరు గోపీచంద్ కూడ అంతే. అయితే ఒకగమ్యం చేరాననుకునే సమయానికి ఆయన జీవితం అంతం అయింది. పరిపక్వదశ పొందిన మేధ, మనస్సు లభించిన వ్యక్తి జీవితకాలం పొడిగించివుంటే, ముఖ్యంగా అట్టి పరిపక్వదశ నొందిన ఉత్తమ సాహిత్యవేత్త జీవితం ఎక్కువ కాలం జరిగితే, ఆఖరి దశలో ఆ జీవితం అపురూప ఫలసంపద అందించవచ్చు. తాత్వికభావ హృదయంతో జీవితంలోని నూత్న దృక్కోణాలు అన్వేషిస్తున్న గోపీచంద్ కొద్దిసాహిత్యం మాత్రమే రుచి చూపి చనిపోయారేకాని, యింకా ఎంతో ఆయన యివ్వదలచుకున్న, చేయదల్చుకున్న, సాహిత్య సృష్టి ప్రభవించలేకపోయింది.

గోపీచంద్ ప్రతీదీ సత్యాన్వేషణతో చూసేవాడు. భౌతిక సంఘాతాల్లోనుండి నిఃసృతమైన ఆధ్యాత్మం ఆది భౌతికంతో సమన్వయపడింది. ప్రతీ సిద్ధాంతం లోనూ కొంత భిన్నత్వం సమన్వయమై ఉంటుంది. పూర్వంనుండీ భౌతికంలో ఆధ్యాత్మం, ఆధ్యాత్మంలో భౌతికం, భిన్నరూపంలో సహస్రాంశమైనా కలుస్తూనే వుంటుంది. పారంపర్యంగా ఆ భిన్నత్వరూపంలో వస్తున్న మరొక సిద్ధాంతాన్ని సమపాళంలో ప్రవేశపెట్టి సమన్వయవాదమొకటి సృష్టించారు ఆధునిక తత్వవేత్తలు. అదేకాకుండా, యీ సమన్వయ వాదానికి ప్రత్యేక విషయంగా వృద్ధిచెందిన సైకాలజీ బాగా తోడ్పడుతోంది. అది జడ చేతనాలిని కలుపుతుంది భారతీయ అద్వైత సిద్ధాంతంకూడా జడచేతనాల్ని ఎప్పుడో కలిపి చూపెట్టింది. పాశ్చాత్యులు ఈ మధ్య ప్రచారంచేస్తున్న మానవ వాదం కూడా జడచేతనాల్ని జోడించి అద్వైతం మార్గాననే నడిచింది. ఇది పాశ్చాత్య తత్వవేత్తలకు, రచయితలకు ఉపాధేయమైంది. ఆ వరవడినే గోపీచంద్ సమన్వయ వాది అయ్యాడు. ఈ భావం, దృక్పథం పోకడలెన్నో మరణంముందు వెలువడిన ఆయన రచనల్లో ప్రతిబింబిస్తోంది.

ఆధునిక తాత్వికవేత్తలు సంఘాన్ని వదలక, దాన్ని అంటిపెట్టుకునే, లోకాన్నిగురించి ఆలోచించే వారు. ఆలోచనకు సాయంగా, సంఘ సాన్నిహిత్యం లోని అనుభూతుల ఆధారంగా లోకంగురించి నిష్పాక్షికంగా ఆలోచించేవారు. జాన్‌డ్యూయి, విలియం జేమ్స్, జీన్‌పాల్‌సార్త్రే, బెర్ట్రండ్ రసెల్, యిత్యాది తాత్వికులు యీ కోవకు చెందినవారే. గోపీచంద్ తెలుగుదేశంలో వీరిప్రభావంతో ఉత్తేజితులై అంత ఔన్నత్యం సంపాదించుకొన్న తాత్వికవేత్త అనడంలో సందేహంలేదు.

గోపీచంద్ జీవితంలో ఎన్నో మలుపు లున్నాయి, సంఘటనల్లోనేకాక, భావసంఘర్షణలోనేగాక, ఆయన చుట్టూవున్న వాతావరణంలోకూడా మార్పులున్నాయి. ఈ వాతావరణం మార్పులు, ఆయాసమయాలలో వెలువడిన రచనల్లో స్పష్టంగా ద్యోతక మవుతాయి, పాశ్చాత్య రచయితలు హెమింగ్‌వే, సోమర్‌సెట్ మాఘమ్ మున్నగువారు తమవాతావరణంలో నిత్యం మార్పురావాలని వాంఛించే వారు. తదనుగుణంగా, పరిసితులు తమ స్వీయకృషిచే మార్చుకుని, క్రొత్త సమాజంలోతులు పరిశీలించుకునే పరిస్థితులు కల్పించుకునేవారు. పాశ్చాత్య రచయితల సమాజ జీవితం ఇటువంటి పరిసితుల మార్పుకు అవకాశా లిస్తుంది. కాని భారతీయవాతావరణంలో, యిటువంటి మార్పులు కాలం విధివల్లనే ఎక్కువ జరుగుతాయి కాని రచయిత యిష్టాయిష్టాల ననుసరించి జరగవు కాలక్రమంలో జీవితంలో సహజంగా వచ్చిన మార్పులు.

వాతావరణం, సంపూర్ణంగా సాహిత్య ప్రయోజనంగా మార్చుకున్న ఉత్తమ కల్పనాశక్తి గోపీచంద్ వచన రచనలలోని విశిష్టత.

గోపీచంద్ గ్రంధాలన్నీ ఎక్కువగా వచనంలోనే సాగాయి. వచన రచన స్వరూపాలుగా ఆయన వ్రాసిన గ్రంధాలు వరుసగా ఉటంకించవచ్చు, కాని ఆయన వచనరచనలో విశిష్టత ఏది అంటే, అది ఒక శైలికి, భాషకుమాత్రమే పరిమితం కాదు. ఆయన వచనరచనలో అంతర్వ్యూతంగా ఉన్న అన్ని లక్షణాలు, పోకడలు, ఆయన వచనరచనకు ఆభరణాలే. రచయిత రచనల్లో సంఘటన పాఠకుడికి ప్రధానం. విమర్శకునికి అందలి దృక్పథం, సిద్ధాంతం ప్రధానం, రెండవది సాహిత్యరంగంలో రచయిత స్థానం నిర్ణయిస్తుంది. మొదటిది సాహిత్యరంగంలో రచయిత ఆకర్షణ, ప్రభావం నిర్ణయిస్తుంది. ఈ రెంటిని సమ పాళ్ళల్లో వచనరచనలో సమన్వయపరిచి తెలుగు వచన రచయితల్లో అగ్రశ్రేణికి చెందిన వారిలో గోపీచంద్ చిరస్మరణీయు డంటే అతిశయోక్తి కాబోదు.

# మానవ జీవితం

ఒకరోజు పొద్దున్నే దేవుడులేచి మొహంకడుక్కొని జవాన్ని పిలిచాడు. రెండుమూడు సార్లు పిలిచినా, ఎవ్వరూ జవాబివ్వలేదు. అప్పుడు దేవునికి, డబ్బులేకపోవటంవల్ల ఎస్టాబ్లిష్మెంటు తగ్గించినసంగతి జ్ఞాపకంవచ్చి, విచారంగా కూర్చున్నాడు. కొంత సేపయింతర్వాత ఒక జవాను ప్రవేశించాడు. ఒతన్ని చూచి దేవు డిలా ప్రశ్నించాడు—

"మర్త్యలోకం నుంచేనా?"

"చిత్తం"

''ఏమిటి సంగతులు?''

''అంతా అనుకూలంగానే ఉందండీ! మానవుడు సగం జీవితం నేర్చుకోవటంతోనూ, మిగిలిన సగం తాను నేర్చుకుంది తప్పని తెలుసుకోవటంతోనూ గడుపుతున్నాడు——'' అన్నాడు జవాను.

''మంచిది. కనక ఇప్పట్లో మనకేమీ పరవాలేదన్నమాట, ఇంకా కొన్నాళ్లవరకూ మనభుక్తికి లోటులేదన్నమాట—'' అని కులికాడు దేవుడు.

గోపీచంద్

# తండ్రీ కొడుకులు

ఇంకా బ్రాహ్మణేతరోద్యమం పుట్టకముందటి మాట: పట్టణాల టోల్‌గేటులు దాటి బయల్వెడలని బ్రాహ్మమతం దివ్వె సనాతనుల దాడికి చమురందక కొడిగట్టి గుడ్డివెలుగు లీనుతున్న యీ శతాబ్దపు తొలిదశాబ్దము నాటిమాట. వింశతివత్సరాల కళాశాలవిద్యార్థి ఒకడు—శూద్రుడు. కాకుంటే "సచ్ఛూద్రుడు." పంచమవేదం ధర్మపక్షముగా వ్యవస్థీకరించిన పాండవులకు రాజ్యభాగస్వత్వము లేదని స్థాపిస్తూ "కురుక్షేత్ర సంగ్రామం" వ్రాశాడు. "పాండవోద్యోగవిజయాల"కు కర్త అయిన చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిలవారి వద్దకు నేరుగా ఆ పుస్తకం తెచ్చాడు. గురువుగారికి విరుద్ధంగా వ్రాసిన ఆనాటకాన్ని గురుదక్షిణగా వినిపించాడు. గురువుగారు తప్పుపట్టలేదు. ఇంకేముంది ఆ యువకుడు లోకాన్నే గెల్చాడు.

అతఃపూర్వ మా భావసరళిలేదు. ఆ భావసరళికతడే ఆద్యుడు. వేమన్నలు భారతంగూర్చి విమర్శించి వుండవచ్చు. భారతం బొంకన్న సామెత పుట్టివుండవచ్చు దాయభాగం వివాదగ్రస్తం కాలేదు. భాసుడు పునరుద్ధరించబడలేదు. ఆ కుర్రవాడెంతవాడో అంచనాకట్టండి.

అతడు స్వతంత్రుడు, స్వచ్ఛందుడు, ధైర్యశాలి అంటే చాలదు. అతడు సాక్షాత్తు మూర్తీభవించిన ప్రతిభ—జీనియస్ కావాలి. అతడు...గోపీచంద్‌గారి తండ్రి; రామస్వామి.

శ్రీ త్రిపురనేని వెంకటేశ్వరరావు
(విజయవాడ)

అటడాపై యిరవై యేండ్లు ఆంధ్రదేశంలో హేతువాదంతో సాంఘికకళారంగాలలో బ్రహ్మాండంగా ఎదిగి ఎదిగి కవిరాజై ఛాందసవ్యవస్థను మోళీకట్టించి కూర్చోబెట్టగల్గుతున్న సమయానికి, ఆ తండ్రివద్ద ''ఎందుకు'' అన్నప్రశ్న అడుగనేర్చుకొని కలమూన గలిగిన అదృష్టవంతుడు గోపీచంద్. వివేచకుడుగా, సాహితీ వ్యావసాయకుడుగా ఆరంభం కావటానికి దండిగా ఉపాధి గల గొప్ప ''జాతకుడు''.

తండ్రీ కొడుకులిద్దరూ తత్త్వాన్ని గవేషించినవారు ఇరువురూ సాహితీస్రష్టలు. ఇరువురూ లబ్ధప్రతిష్ఠులు. అందుకే యీ తండ్రీకొడుకులను తులాభారం చేయ మంటున్నారు.

* * *

హేతుబుద్ధి యిద్దరికీ సమాన గుణం. ఇద్దరి భావ జీవితంలోను పరిణామం ఉన్నది. ఆ పరిణామం విరుద్ధ దిశలలో సాగింది ఎలా సాగినా, ఎవరెలా పర్యవసించినా, ప్రపంచ చరిత్రలో హేతువాదు లనిపించుకో గలిగిన వారిని బట్టి చూస్తే వీరిద్దరూ హేతువాదులనుపించుకోడానికి ఏమీ యిబ్బందిలేదు.

నాస్తికులు మాత్రమే హేతువాదు లనిపించుకొన్నా రనుకొంటారు. కాని పలువురు ఆస్తికులు హేతువాదుల జాబితాలో చదువుకోవలసి వచ్చింది. స్టోయిక్ జీనో, స్పినోజా, ఆల్బర్ట్ మాగ్నస్...మన షడ్దర్శనాలలో న్యాయదార్శనికులు (గౌతముని తరువాతి వారు) తర్కంతో దేవుని ఉనికిని సాధించబోయారు. గుర్తు తెచ్చుకోండి. హేతువాదులంటే భౌతికవాదులు, నిరీశ్వరవాదులు మాత్రమేకాదు. అందుచేత ఆస్తికులుగా, భగవద్భక్తులుగా మారిన గోపీచంద్‌గారిని యింకా హేతువాదిగా చెప్పడానికి అవకాశంలేదనుకోవద్దు.

పుట్టుకతో ఎవ్వరం నాస్తికులంకాదు. కవిరాజూ అంతే. కురుక్షేత్రం వ్రాసిన కవిరాజు ఆస్తికుడు. అయితే హేతువాది. హేతుబుద్ధిని ఎలా ప్రయోగించి విషయాన్ని అర్థంచేసుకోవాలో కురుక్షేత్రం చెప్తుతుంది. దాని ప్రాధాన్యంకూడా అంత వరకే. తక్కినది చరిత్ర ఆయన సూతపురాణాంతముదాక ఆస్తికులే ''ఏది మునీశ్వర ప్రతతికేని యగోచరమైన దొడ్డవెల్గు, ఏతాదృశనిత్య సత్యపరతత్వ మహత్వము నాశ్రయించెదన్'' అని అంటూనేవున్నారు. పౌరాణికార్థాలను విరగమోదే కవిరాజు హేతువాది అయ్యా, పరతత్వంలో నమ్మికంవున్న కవిరాజు హేతువాదికాక పోతాడనగలరా? పురాణాలమీద దాడి, పరత్వంలో నమ్మకం ఆయన రథానికి రెండు గుర్రాలు. మరచిపోవద్దు

ఆయన పరతత్వవిశ్వాసం కూడ విలక్షణమైనదే. ఆ పరతత్వాన్ని ఎవరూ సాక్షాత్కరింప జేసుకున్నవారు చరిత్రలో లేరన్నారు. 'మునీశ్వర ప్రతతికేని అగోచరమైన దొడ్డవెల్గు' అనడంలో అంతర్యం ఏమిటి? [అది 'అజ్ఞాతవ్యము' అనికూడానేమో] అయినా అదివున్నదే అనుకొన్నారు. అవతారములు, పునర్జన్మము, ఈశ్వరత్వము, ఈశ్వరుని ప్రపంచ నిత్య పరిపాలనము వంటి ఆస్తిత్యాంగములను వర్జించిన ఆస్తికత్వము. కేవలపరతత్వవాది Transcendentailst. 'ఖూనీ' నాటక కర్తత్వమునుండి ఆమరణాంతము నిరీశ్వరవాదము.

గోపీచంద్‌గారు మాత్రం పుట్టుకతో నాస్తికులేమో! నిరీశ్వరవాదిగా వారి భావజీవితం ఆరంభమయింది. ఆపైని మానవేంద్రనాథరాయల హేతువాదం, భౌతికవాదం తలకెక్కించు కొన్నవారు. మానవేంద్రనాథరాయలు బోధిస్తే మార్క్సిజాన్ని నమ్మి, ఆయన అదితప్పు, వర్జించవలసిందే అని నిరూపించేసరికి తెల్లబోయారు. స్వతంత్ర విచారానికి పూనుకున్నారు. ఆంధ్రదేశపు రాయిస్టుల్లో గోపీచంద్, జి. వి. కృష్ణ

శ్రీ త్రిపురనేని వెంకటేశ్వరరావు (విజయవాడ)

రావులే స్వతంత్రంగా తత్త్వసమాలోచన చేయగల వారు. ఇందులో ఒకరు ఆధ్యాత్మిక భౌతికవాద సమన్వయం అనే మధ్యమజిలీతో అరవిందుని సాయుజ్యం పొందారు విస్మృతమైన నాగార్జునులవారి మాధ్యమకాన్ని త్రవ్వితలకెత్తిన వారొకరు.

ఇటీవలి కాలంలో వివిధదేశాలలో ఆధ్యాత్మ, భౌతిక వాదాలకు సమన్వయం కనుగొన వలెననే అన్వేషణ విశిష్ట లక్షణమయింది. అలా యత్నించిన వారిలో గోపీచంద్‌గారొకరు. పోస్టుచెయ్యని వుత్తరాలతో యీమధ్యమజిలీ దేరాకుట్టుకున్నారు. తనది 'న్యూట్రల్ మానిజమ్' అనమన్నాడు అది భౌతిక వాదమూకాదు, ఆధ్యాత్మవాదమూకాదు. అలారెండూ కాకపోనూలేదు. రెండింటికి ఉపాధి భూతమైన ఉదాసీన ఏకత్వము అది కాని, రసెల్‌కు అరవిందునికి మధ్య కొట్లాడు కొంటున్న స్థితి మాత్రమవును.

'పరమేశ్వరశాస్త్రి వీల్నామా' ప్రకారం అరవిందుల వారి 'పూర్ణాద్వైతం' (Integral Monism) గోపీచంద్‌గారికి సంక్రమించింది. 'తత్వవేత్తల' ముగింపు అట్టిదే అరవిందులు మన సంప్రదాయానుసారియైన ఆధ్యాత్మవాదికాడు. ఆయన యోగి (Mystic). అద్వైతశాఖ లిట్టివికావు గౌడపాద శంకరులు బ్రహ్మానుభవము విషయమున శ్రుతిప్రామాణ్యమును పిడివేసుకోవడం తప్పవిడిస్తే, యుక్తివాదులు, తార్కికులు అటువంటప్పుడు గోపీచంద్‌వంటి నాస్తిక హేతువాది, అరవిందుని తంత్రదృష్టితో తేలికగా యిముడగిల వారా అన్నది యోచించ దగ్గమాట.

అరవిందుని యోగ సాధనకు గోపీచంద్‌గారు హేతు వివరణం చెయాదల్చుకొన్న వారుగానే కనిపిస్తున్నారు. యోగసాధన ఇంద్రియాతీత జ్ఞానం కోసమని గోపీచంద్‌గారు అంటున్నారు. అందుచేతనే శాస్త్రసరణిలో డాక్టర్ రైన్ పరిశోధనచేసి, సామాన్య మానవుల్లో 'ఇంద్రియేతర జ్ఞానం' కానవస్తోందని వ్రాసిన రచనని ఉదాహరిస్తారు. రైన్ చెప్పే 'ఇంద్రియేతర జ్ఞానం' యోగులను పరిశోధించినట్టిదేమీకాదు. ఇద్దరు వ్యక్తులు ఒకరికొక్కరు ఎదురు బదురుగా లేకుండా, కొన్ని మైళ్ళదూరాన వున్నా ఒకరి మనోగతమైన ఆలోచనలను మరొకరు తెలుసుకోగలిగే శక్తి కొందరిలోవుంది అప్పుడు ఆపదకు గురియైతేనో, చనిపోతేనో ఎక్కడో దూరానవున్న తనకు ప్రత్యక్ష దృశ్యంగా వచ్చి కనబడుతాడు. ఇట్టి వాటినన్నింటినీ అరవిందులవారు చెప్పే అతీతమానసిక శక్తులుగా చెప్పారు.

మన దేశంలో దూరదృష్టి, దూరశ్రవణం అనే సిద్ధులు వున్నవన్నాము. అయితే వాటిని బ్రహ్మానుభవానికి మెట్లుగా అంగాలుగా మన దార్శనికులు మహర్షులు చెప్పలేదు. యోగసాధన లేకుండా బ్రహ్మానుభవం పొందగలగడం మన మహర్షులు చెప్పారు. సిద్ధులు అన్నవి క్షుద్రవిద్యలుగా మనవాళ్ళు గణించారు. తరచు ఇవి ముక్తికి ప్రతిబంధకాలన్నారు. అరవిందుల వారి దృష్టి కూడా అట్టిదే.

యోగానుభవానికి, రసానుభూతికి కొంత సంబంధం ఉన్నదని మనదేశంలో ప్రతీతివుంది కళావివేచనతో అలంకార శాస్త్రంతో యించుక పరిచయమున్న వారికిది తెలుస్తుంది. కళానుభూతిని, కావ్యానందాన్ని 'బ్రహ్మానంద సబ్రహ్మచారి' అని మన ఆలంకారికుల మతం. మన ఆలంకారకులు గొప్పవేదాంతులు. మధుసూదన సరస్వతివంటి అద్వైత మహర్షి కావ్యానందానికి, బ్రహ్మానందానికి అభేదం చెప్పాడు. Alexis Caroll ను చదువుతున్న (గోపీచంద్‌గారు తరచు ఉదహరించే రచయిత) ''యోగి అనుభూతి (Mystic experience) కళానుభూతిని పోలినదే.''

"సౌందర్యాన్వేషణము యోగతత్వానికి దారితీస్తుంది" అని తెలుసుకోవల్సివస్తోంది.

ఇందుచేతనే అరవిందమాతను ఒకరు ప్రశ్నిస్తే, యోగులు కవులు, గాయకులు, చిత్రకారులు, నాట్యకారులు కాగలరని, అలా తన అనుభవంలో స్వత హాగ ఆ కళలులేనివారు యోగం అనంతరం కళాకారులైనవారున్నారని, "(Art is not very different from yoga)" అని చెప్పుతోంది కాగా, "విజ్ఞానశాస్త్ర పరిశోధనలో యోగియొక్క సర్వజ్ఞత్వం ఉపకరిస్తుందా? సాపేక్షసిద్ధాంతానికి సంబంధించిన సమస్యల్ని పరిష్కరించగలదా" అని అడిగే సరికి ఆమె ఏమి చెప్తోందో నాకు అర్థం కావటంలేదు. చాలా తికమక పడింది. రామానుజం, అయిన్‌స్టీన్‌వంటి గణితవేత్తలు సర్వసాధారణమైన శాస్త్రవిధానం—తర్కోపపత్తి(Deduction) —వల్లగాక, ఇంట్యూషన్ వల్ల సమస్యల్ని పరిష్కరించిన వారు. అట్టి Intuition యీ "అతీత మనస్సు"కు లేదు. ఈ 'అతీత మనస్సు'కు యీ (Intuition) భౌమము (Earthy), న్యూనము. దూరస్థుల ఆలోచనలు తెలుసుకోవడం, దూరదృశ్యాలను చూడడంవంటి శక్తులు తక్కువరకంవి. ఆధ్యాత్మ విద్యలో వాటికి స్థానం తక్కువ. ఈ ప్రపంచాన్ని గురించి ఇంద్రియాలతోనూ, ఇంద్రియేతరమైన మనస్సుయొక్క యీ శక్తులతోనూ తెలుసుకోవలసిందే. మార్గాంతరంలేదు. అతీతచైతన్యావస్థకు యీయీశక్తులు సోపానపంక్తి అవుతాయనడమంటే, ఆ అవస్థను రేషనలైజ్ చేయడమవుతుందనుకొంటాను. ఈ సిద్ధులూ, ఇంట్యూషనూ మనమనస్సుకు చెందినవే. మనస్సుయొక్క పరిధిని అధిగమించిపోయి నట్టివికావు అరవిందుల వారి అతీతచైతన్యానికి సజాతీయాలు కావు. పతంజలి యోగసూత్రాన్ని వివరిస్తూ వివేకానందుడు యోగపద్ధతిని ఒక శాస్త్రపద్ధతిగా చెప్పాడు. ఆస్తికుడైనా, నాస్తికుడైనా, ఉభయము కాకపోయిన వాడైనా యోగం అవలంబిస్తే ఒకే అనుభవంరాక తప్పదు అలాకాకపోతే అదిపనికిమాలినది అన్నారు రాజయోగంలో, అరవిందుని యోగం విశ్వాసంతో, ఈశ్వరార్పితబుద్ధితోనే ఆరంభిస్తుంది. అట్టిదానిలోకి శాస్త్రవేత్తల ఇన్‌ట్యూషనును, ఇంద్రియాపేక్ష్యము కాని భావప్రసారాలను తేవడం హేతుబుద్ధికి కట్టుబడి వుండడమే అవుతుంది. నిత్యజీవితంలోని కొన్ని కొన్ని ఘటనలను మనస్సుమీద యౌగికప్రయోగాలుగా వివరణచేస్తూ వుండేవారుకూడా.

గ్రీకుతత్త్వవేత్తలలో హిరాక్లిటస్, పార్మినైడ్సులు యథార్థాన్ని గ్రహించడానికి తర్కం చాలదన్నవారే. ఇంద్రియాలను కాదన్నవారే. అలాగయికూడా మూల సత్యం శుద్ధచైతన్యమనో, ఆనందమనో, పరమేశ్వరుడనో చెప్పలేదు. భౌతికల్పంలోనే మిగిలిపోయారు. అందాకా ఎందుకు? మన బుద్ధుడు యోగిఅపును. పరమేశ్వరుణ్ణిచెప్పలేదు. జినుడూ అంతే. రామకృష్ణుడు వచ్చి ద్వైతాద్వైత విశిష్టాద్వైత అనుభవాలు యోగానుభవంలో మూడూ మూడు మెట్లు, అందులో అద్వైతం ఆఖరిమెట్టు అన్నాడు. అరవిందయోగి వచ్చాడు ఆ మూడూనిజమే, ఆపైన నాలుగోమెట్టు, తన "పూర్ణాద్వైత" అతీతచైతన్యం అన్నాడు. ఈ సమన్వయం ఇటువంటిది ఈ అవ్యవస్థే గోపీచంద్‌గారిని రేషనలిజాన్ని త్యజించనివ్వడంలేదు.

గోపీచంద్‌గారు ఆస్తికులు కావడమంటే నాన్నగారికి అపచారం చేసినట్లుగా లోకం భావించడంకద్దు. అందుకాయన యిలా ఎదురు అడిగేవారు. "మానాన్న వాళ్ళనాన్నగారికి భిన్నంగా నాస్తికులు అయ్యారు. ఆ స్వాతంత్ర్యం నాకివ్వరా?" అని.

శ్రీ త్రిపురనేని వెంకటేశ్వరరావు (విజయవాడ)

అరవిందులతో ఏకీభవించి పూర్వమిత్రులతో దూరమయ్యారు. విభేదించారు. విచారించరు. పైగా వారిని గిల్లి ఏడ్పించగలరు.

* * *

## సాహిత్య రంగములో

సాహిత్యంలో తండ్రీకొడుకులు ఇద్దరూ వాస్తవిక వాదులు (Realists). కళ కేవలం ఆనందం కొరకు మాత్రమే కాదు, ధార్మిక ప్రయోజనాన్ని తీర్చగల గాలి; జీవితంలో విలువల్ని సృష్టించడానికి వుద్దిష్టం కావాలి అన్న భావంతో రచన సాగించినవారు.

సాహిత్యం ప్రచార స్థాయికి పడిపోరాదనుకునే వారు. ఇటు అభ్యుదయ కవితా రచనా రీతివలె, వైదిక ధర్మోద్ధరణ వాదులవలె తమ ధార్మిక లక్ష్యాన్ని మోటుగా చెప్పకపోవడం వీరిద్దరిలోను దొడ్డగుణం. కళా ప్రమాణాలకు వెలితిరాకుండ సున్నితమైన ఉప దేశం చెయ్యజాలినవాళ్ళు.

ఇక శైలి మాట కళాపూర్ణోదయంలో శాలీనుడు అపేక్షించే నిరాభరణ సుందరియైన సుగాత్రివంటి అకృతకమైన నిసర్గ లాలిత్యముతో, అన్వయక్లేశము లేని, అలంకార భారంలేని సరళశైలి ఇద్దరికీ తుల్య లక్షణం.

కవిరాజుగారు భావనలో నవ్యులకు నవ్యులు, కళాప్రక్రియలో ఛాందసులకు ఛాందసులు; పరమ లాక్షణికులు. గోపీచంద్‌గారు భావనలో, ప్రక్రియలో రెండింటా నూతనులు.

కవిరాజుగారు గ్రాంధికాన్ని, లాక్షణికతను సడలించి జనానికి తేలికగా పట్టువడే గేయాన్ని వ్రాయగలరు. పునర్జన్మ, యోగం, ఆత్మవంటి గాఢ విషయాలు చెప్పేపట్ల వలసిన భాష, శైలి ఏర్పరచుకో లేక పోయారనుకుంటాను.

కవిరాజుగారి ఇతివృత్తమంతా గతకాల సంబంధి. ఈ దేశపు భావ జీవితాన్ని, వర్తమానాన్ని, గతం శాసించడమే జరుగుతోంది. వర్తమానాన్ని గతం యొక్క మూసలతో పోసి అచ్చు పొయ్యాలంటారు. అందుకే భాష్య సాహిత్యం అధికం. ఈ కీలకం దెలిసి జీవితపు విలువల్ని నిబంధించిన భారత, రామాయణాది వృత్తాంతాలనే వస్తువుగా గ్రహించారు కవి రాజుగారు. సమకాలీన సమాజంనుండి, వ్యక్తుల నుండి, ఘటనలనుండి, ప్రవృత్తులనుండి వస్తువును ఎన్నుకొన్నవారు గోపీచంద్. ఇలా గ్రహించడంలో యాథాతథ్యం బాగా హెచ్చు.

కవిరాజు పండితుడు. చారిత్రకుడు. భాషాశాస్త్ర వేత్త. తత్త్వవేత్త. నాటకము, కావ్యము, గేయము ఆయన కళాప్రక్రియలు. విమర్శతో నిండిన గొప్ప వచనం వ్రాశారు. కథ, నవల, నాటకం గోపీచంద్ గారి ప్రక్రియలు, తత్త్వాన్వేషకుడు.

సాంఘిక సంస్కరణ ప్రధానంగా రాజకీయాలతో సంబంధం కల్గించుకొన్నవారు కవిరాజుగారు. ఆయనకు కాంగ్రెస్, జస్టిస్ పార్టీ, హిందూ మహా సభలు ఏకకాలంలో కావలసినవే. అన్నీ అన్ని హంశలు తనకు. త్యాగము రాజకీయాలలోగాక, భావ విప్లవం కొరకు, సాహిత్యం కొరకు, పరిశోధన కొరకు చేసినవారు కవిరాజు.

ప్రధానము కాదుగాని రాజకీయాలు గోపీచంద్ గారికున్నవి. ఆచరణ, త్యాగములేని రాయిస్టు రాజకీయాలు త్వరలో ముగించుకుని రచయితగా మిగిలి పోయారు.

'లుక్రీషియస్' తర్వాత ప్రపంచ సాహిత్యంలో ఎన్నిక చేయదగిన నాస్తిక దృశ్యకావ్యాన్ని 'ఖూనీ'ని యిచ్చారు కవిరాజుగారు. నార్లవారన్నట్లు ప్రపంచ

కథానికా సాహిత్యంలో స్థానంచేసుకొనే కొన్నికథల్ని యిచ్చారు గోపీచంద్‌గారు.

వక్తృత్వం ఇద్దరికీలేదు. ఛలోక్తులు, చమత్కారం, యుక్తి, సమయస్ఫూర్తి, వ్యంగ్యం కవిరాజు సొత్తు, వాదంలో, సంభాషణలలో ప్రతిపక్షిని మొగ మెత్త నివ్వకుండా కొట్టగల సంపత్తియిది. అనుయాయులను కడుపుబ్బనవ్వించే, కలకాలం శిలాక్షరాలుగా గుర్తుచేసుకోవలసి వచ్చే వైచిత్రియిది. గోపీచంద్‌గారు కూడ మాటలో గడుసరి. చమత్కారంగల వారు. సంభాషణలో వాదంలో పైచెయ్యివారిదే. తండ్రిగారి వారసత్వం అంతవరకువుంది.

ఏదేమైనా గోపీచంద్‌గారు 'ఆ తండ్రికొడుకే'అని పించారు. గోపీచంద్‌గారితో యీ వంశం రెండు తరాలు తెలుఁగు దేశానికి ముద్దుముచ్చటలు చెల్లించింది. మరి మూడోతరం మాట ...

* * *

# ఆత్మ విశ్వాసం

ఈమధ్య భాషాభిషక్కుల్లో చాలా అహంకారం బలిసినట్లు కనిపిస్తుంది. దీనికికారణం ఏమిటా అని నేను చాలా ఆలోచించాను. నాకు ఒక్కటే తట్టింది. చాలామంది పెద్దవాళ్ళు ఆత్మవిశ్వాసం మనిషికి అవసరమనిచెప్పారు. ఈ అభిప్రాయమే భాషాభిషక్కుల్లో అహంకారాన్ని పెంచిందని నా అనుమానం.

కాని ఈ భాషాభిషక్కులు ఒక సంగతిమాత్రం మరచిపోకూడదు. ఆత్మవిశ్వాసం రెండు రకాలుగా కలుగుతుంది. ఒకటి జ్ఞానం వల్లా. రెండు అజ్ఞానంవల్లా.

సర్వమూ తెలుసుకొని, అందరికంటే నాకు ఎక్కువ తెలుసని ఒక రనుకుంటారు, బాహ్య ప్రపంచమే తెలియకపోవటంవల్ల అందరికంటే నాకు ఎక్కువ తెలుసని ఒకరనుకుంటారు. మన భాషాభిషక్కులు ఈ రెండోరకానికి చెందుతారేమో నని నా భయం.

ఈమాట అన్నానని కోప్పడవద్దు. మార్చుకోవటం మంచిది. లేకపోతే ఆత్మవిశ్వాసాన్ని పొందేటంత జ్ఞానాన్ని సంపాదించటం మంచిది.

గోపీచంద్

# మానసిక పరిణామం

శ్రీ వేలూరి సహజానంద

ఈ ఇరవయ్యవ శతాబ్దం అన్ని విధాలా సృష్టిలోనూ, మానవ పరిణామంలోనూ విశిష్టమైన ఒక నవయుగానికి ప్రారంభం. అవతల తారామండలం లోనూ, తదతీతమైన మండలాల్లోనూకూడా ఏదో కొత్త స్పందం, కొత్త చలనం ఆరంభమైనట్టుంది. ఆకాశంలో ఎక్కడో కొత్త సూర్యుడు ఉదయించాడు. నేటిసూర్యుడు ఆ సూర్యునికి ఉషస్సులాంటి వాడు. ఎక్కడో చీకటి చారలేని పూర్ణచంద్రుడూ ఉదయించి వుంటాడు. అసలు మొత్తం సృష్టివిన్యాసంలోనే ఏదో ఒక కొత్తముద్ర. కొత్తభంగిమ. బ్రహ్మ మరొక నాట్యవేదాన్ని వ్రాస్తున్నాడేమో.

ఈ యావద్విశ్వవ్యాప్త సృజనాత్మక సంచలనం ఎక్కడో ఆకాశపు అంచుల్లోనే ఆగిపోలేదు. అలాగే ఎక్కడో భూమి అంచులవరకే వచ్చి నిలచిపోలేదు. అలాగే సాక్షాత్తూ మానవ–హృదయాన్నే తాకింది. అతని స్వరూప–స్వభావాల్లోకే ప్రవేశించింది. రక్త కణాలనే కదలిస్తోంది. అందుకే మానవజాతి అనాది నుంచి నేటివరకూ అనుసరిస్తున్న నానావిధ సిద్ధాంత రాద్ధాంతాలు, క్రియా విధానాలు అన్నీ అనివార్యకల్లో లానికి గురి అవుతున్నయ్. ఇది ఒకానొక అంతః ప్రళయం లాంటిది. పాతదాన్ని మార్చాలనుకొనే కొత్త ధోరణులు సైతం ఇట్టేపాతబడిపోయి పాతలో కలిసిపోయి కాలప్రవాహంలో సుళ్ళు తిరుగుతున్నై. అంతరంగికంగా గాఢాతి గాఢంగా అవలోకిస్తే, క్షీర సాగరంలో కొత్త అమృత మధనం ఆరంభమైంది.

విశ్వస్థాయిలో ఉత్పన్నమయ్యే ఈ సృజనాత్మక సంచలనంచేత ప్రభావితమై, దానిస్ఫూహపొంది, ఆ ప్రకారం స్పందించి, ఆలోచించి, భావించి, ప్రవర్తించటానికి ప్రయత్నించే మానవుడు నూతనయుగానికి చెందుతాడు. ప్రళయకాల మృత్యువును అతిక్రమించి, నూతన సృష్టిమహోత్సవంలో పాల్గొంటాడు. కాని ఇలాంటివ్యక్తుల సంఖ్య ప్రస్తుతంమాత్రం స్వల్పంగానేఉంటుంది.

ఈ కొత్తమనుష్యుల కోవకు చెందినట్టివ్యక్తి గోపీచంద్.

తీవ్రమైన భౌతికవాదాన్ని, హేతువాదాన్ని అనుసరించటంతో ప్రారంభమైన గోపీచంద్ మానసిక యాత్ర సమగ్ర-ఆధ్యాత్మిక దర్శనాన్నిచేరి, సార్థకమైంది. సత్య జిజ్ఞాసే ప్రధాన ప్రేరణగా, మూలతత్త్వంగా ఉన్నంతవరకు, ఎవరే విధంగా, ఎక్కడనుంచి బయలుదేరినా, చేరవలసిన చోటుకే చేరుతారు అనే పరమ సత్యాన్ని నిరూపించిన టాల్‌స్టాయ్‌ల్లాంటి వారిలో గోపీచంద్ ఒకరు.

కొందరికి భౌతికవాదంగాని, ఆధ్యాత్మికవాదంగాని ఇంచుమించు "Fashion" లాంటిది ఆస్తిపాస్తుల్లో ఒక అంశం, శరీరానికి దుస్తుల్లాగానే, మనస్సుకు ఈ వాదాలు కొందరికి ముస్తాబుల్లాంటివి. ఇలాంటి "సజ్జు"ను వదిలివేస్తే అసలు నిగ్గు తేలుతుంది, సమకాలికులైన తెలుగు మేధావుల్లో ఒకానొక పరిణతికి, సమగ్ర స్థాయికి చేరినవారు బహుకొద్దిమంది. వారిలో ముఖ్యులు గోపీచంద్.

చిత్రం, ఒకడినిచూసి, మనం వాడిని ఎదుగూ బొదుగూలేక వుంటున్నాడని అంటూవుంటాం. చాలామంది మేధావులు అంతే. 20వ ఏట ఎంతవరకూ పెరిగారో, 60 ఏటకూడా అంతే. ఆనాటి విరహగీతాన్నో, ట్రిక్కుల కథనో, ఉపన్యాస పరంపరల్లాంటి నవలనో, ఆర్థిక విషయచర్చగా ఉపయోగపడే కథానికనో, ఎవరికైనా వ్రాసే ఉత్తరంలో చమత్కారంగా కనిపించే వాక్యాల్లాంటి కవిత్వాన్ని ఈ నాటికి కూడా అదొక తప్పనిసరి సారస్వత బాధ్యతగా పాపం, వ్రాస్తూనేవున్న మహాకవులు, రచయితలు చాలామంది ఉన్నారు. అదే విరహావస్థ. అదే కృత్రిమ చమత్కారం అందులోంచి పరిణామం ఉండదు. పెరుగుదల ఉండదు. దీనికి కారణం ఏమిటి? వీరువర్ణించే విరహాది అవస్థలు కేవలం కృత్రిమాలు అత్యంతం అసహజమైనట్టివి. నిజమైన విరహావస్థనే భావించగలిగి అనుభవిస్తే, ఆ అనుభవం మనుష్యుడిని మరొకస్థాయికి తీసుకువెళ్తుంది. ప్రతి అనుభవం కూడా, అదికనుక సహజమైనది, నిజమైనది అయితే, అది దాని కతీతమైన అనుభవానికి తలుపులను తెరుస్తుంది. అందుకే ఒక్కొక్కప్పుడు అనిపిస్తుంది — ఇదంతా కాగితపు సాహిత్యం, జీవితపుసాహిత్యం కాదేమో నని జీవితానికి అక్షరాలు అనుభవాలు మనకు అక్షరాలు అచ్చులు.

గోపీచంద్‌లో ఈ కృత్రిమం, ఈ అసహజం కన్పించవు. తనకే నిజంకాని విషయాలను నిజం అన్పించేట్టు పాఠకులకు భ్రమకొల్పాలనే దారుణభ్రమలో అతను చిక్కుకోలేదు భౌతిక వాదాన్ని అనుసరించినప్పుడు, అది అతనికి నరనరాన వేరు తన్నుకున్నది. అందుకే ఆ వాదపు బాగోగులను చర్చావేదికలోంచి దిగిరాగానే విస్మరించి వేయక, తన అనుభవంలో, ఇతరుల అనుభవాల్లో జీవితపు సహజ గమనంలో పసికట్టటానికి ప్రయత్నించాడు. ఇది గోపీచంద్‌కున్న విశిష్టత. అందుకే అతనికి భౌతికవాదం పిడివాదం కాలేదు. హేతువాదం నిర్హేతుక వాదంకాలేదు. భౌతిక వాదపరిమితుల్లోనే జీవితాన్ని, అనుభవాలను అర్థం

చేసుకొనటం, తదనుగుణంగా ప్రవర్తించటం అసాధ్యం అని గ్రహించి, అనుభవించినప్పుడు, అతను భౌతికవాద పరిమితులను అతిక్రమించి జీవితపు అపరిమిత అనంతాన్ని తాకాడు. అదే గోపీచంద్ మానసిక యాత్రలలోని రెండవ దశకు, పారమార్థిక దశకు ప్రారంభం.

భౌతికవాదంతో విసుగెత్తి, అమాంతం తీవ్రవైరాగ్యంలోపడటం మామూలురివాజు. ఇది అనాదినుంచి వస్తోంది భోగి జోగిఅవుతాడు. ఈ ధోరణిలోని ప్రత్యేకత ''అతి''. పూర్వయుగాలన్నీ సృష్టినీ, జీవితాన్నీ రెండు వ్యతిరేకభాగాలుగా విచ్ఛిన్నపరచటంలోనే గడచిపోయినై దైవం సత్యం. సృష్టి అసత్యం. భౌతికం సత్యం ఆధ్యాత్మికం అసత్యం. ఇలా ద్వైత ధోరణి ప్రధాన దృష్టిదోషంగా ఉంటూ వచ్చింది కాని మనం మొదట్లో చెప్పినట్లు, ఈ నవయుగ లక్షణం సమగ్రత్వం, సంపూర్ణత్వం. మనస్సును పంచభూతాలను పరస్పర విరుద్ధాలుగాకాక, ఆ రెండిటికీ అతీతమైన ఒకానొక సృజనాత్మక-సంపూర్ణశక్తిలోని అంశాలుగా, లక్షణాలుగా పరిగణించటం, ఆ విధంగా జీవితంలో నిర్జీవ భౌతిక వాదానికి, శుష్క వైరాగ్యానికి అతీతమైన అనుభవ-స్థాయిని అందుకోటం ఈ యుగలక్షణం. రోదసీ మండలంతో భూమండలానికి భౌతిక-బాంధవ్యాన్ని కలుపుకోవాలని వైజ్ఞానిక ద్రష్టలు తహతహ లాడుతున్నట్లే, నిష్కళంకమై, స్వయం సంపూర్ణమైన సృజనాత్మక చేతనతో మనస్సుకూ, ఇంద్రియాలకూ చుట్టరికాన్ని కలుపుకోవాలని ఆధ్యాత్మిక ద్రష్టలు తపస్సు చేస్తున్నారు. ఈ సమగ్ర దర్శనాన్ని సుస్పష్టంచేసిన మహాయోగి శ్రీ అరవిందులు. శుష్క-వైరాగ్యంలోంచి, మానసిక వైపరీత్యంగా మారిపోతున్న మాయావాదంలోంచి ఆధ్యాత్మిక సాధనను ఉద్ధరించి, యావత్తు-అనుభూతిని, సకల-సృష్టినీ మాయగా, భ్రాంతిగా కాక, సత్యపరంగా ఇముడ్చుకోగలిగిన సమగ్ర నిర్వచనాన్ని అందివ్వ గలిగారు శ్రీ అరవిందులు.

పూర్వంలో మానసిక ప్రపంచాన్ని భౌతికవాదం వదలివేసింది. అలాగే భౌతిక ప్రపంచాన్ని ఆధ్యాత్మిక వాదం వదలివేసింది. ఆయావాదాల పాక్షిక సంకుచిత దృష్టి, బహుళ దౌర్బల్యం అట్టివి కాని శ్రీ అరవిందుల పూర్ణయోగం ఉభయప్రపంచాలను, భౌతిక మానసిక ప్రపంచాలను కేవలం ఏదో పై పైన సహజీవనానికి ఉపయోగపడేట్టుగా సమన్వయ పరచటంతో ఆగక, అనంత సృజనాత్మక శక్తియొక్క సృష్టితోని అంతర్లీన అంశాలుగా, పరిణామ-స్థాయిలుగా, సత్యపు ఆవిష్కృతికి అనుగుణమైన రంగస్థలాలుగా సమ్మేళన పరచింది భౌతికాన్ని, మానసికాన్ని ఏకానుభూతిలో ఇముడ్చుకోకలిగిన సమగ్రదృక్పథాన్ని, అందుకు తగిన క్రియావిధానాన్ని సాధనామార్గాన్ని శ్రీ అరవిందులు నిర్దేశించారు భగవానే శ్రీ కృష్ణుని భగవద్గీతలో మనోహరమైన ఆలాపనగా విన్పించిన ఈ సంపూర్ణ-రాగ-మాలిక క్రమేపీ రాద్ధాంతసిద్ధాంతాల రొదలో మూగవడిపోయింది. శ్రీ అరవిందులు మళ్లీ దానిని పునరుద్ఘాటించటమే కాక, ఈ యుగపు చారిత్రక పరిస్థితులకు, భావిపరిణామానికి దీటుగా సరిపోయేట్టుగా గీతా దర్శనాన్ని తీర్చిదిద్దారు. భౌతిక పదార్థం, మానసిక భావన ఈ రెంటినీ పరిపూర్ణచేతనే ఆవిర్భవించుకొని, తన అనంత విస్తృతికి సాధనాలుగా రూపొందించుకొంటున్నదని, దీనిని మానవాతీత-విశ్వాసంగా మాత్రమే ఎంచనక్కర్లేదని, మానవుని చింతా-శక్తిని పాక్షికతనుంచి తప్పించి, పరిపూర్ణం చేసుకుంటే, భౌతికమైన ఆ పరిపూర్ణచేతన మానవునిలో కూడా అవతరించగలదని, ఆ నవ-సమగ్ర-చేతన

మనిషికి మనస్సు స్థానే లభించినప్పుడు, భౌతికాన్ని మానసికాన్ని రెండింటినీ తన సంపూర్ణ-సృజనాత్మక-సంకల్పానికి సాధనాలుగా మానవుడు ఏకోన్ముఖం చేసుకోగలడని శ్రీ అరవిందుల సందేశం.

ఇరవయ్యవ శతాబ్దపు ఉన్నత ఉత్తమ ఆశయాలన్నిటికీ పరిపూర్ణమైన స్వరూపం శ్రీ అరవిందుల దర్శనంలో మనకు దర్శితమౌతుంది.

భౌతికవాదం పరిమితులను ఛేదించుకొని, మరొక మజిలీకి బయలుదేరినప్పుడు, మార్గదర్శకులుగా అరవిందుడు ప్రత్యక్షమవటం గోపీచంద్ అదృష్టమేకాక, అది జరుగనున్న మానవపరిణామానికి అనుగుణమైనట్టిది. అందుకే గోపీచంద్‌లో నేటి సంకులమానవ మనస్సుకు ప్రాతినిధ్యం వహించగలిగిన పరిణామ-దశ కనబడుతుంది.

యావత్ సృష్టితోదాత్మ్యం పొంది, దాని బాధక సాధకాలతో అట్టిట్టై, దాని నిత్యనూతన నవోదయ మహోత్సవంలో పాల్గొనటమే పరమార్థమనే స్పృహపొందటం, అదే మానవుని అమర-భవితవ్యానికి ప్రాతిపదిక, కేవల విశ్వాసం ఎంత చేటో, కేవల సందేహం కూడా అంతే. ఈ రెంటికి లోనవని గోపీచంద్ సృష్టిజాలును పసిపట్టగలిగాడు. ఆ అంతరంగిక అనుభూతిని గురించి చెప్పే మాటలు ఎవరెవరికి ఏ విధంగా తోచినా, మృత్యువు ఆర్పివేయజాలని అమర చైతన్య-అఖండజ్యోతి కాంతిని అతను తన కావ్యార్తిలో వెలిగించుకున్నాడు. సాహిత్యాన్ని వ్యసనంగాకాక చైతన్య-విస్తృతికి పదునైన సాధనంగా సద్వినియోగం చేసుకోగలిగిన ధన్యుడు.

* * *

# బోల్తాకొట్టిన రిక్షా

రిక్షా తల్లక్రిందయింది. వ్యాపారస్తుడు బోర్లబొక్కలా పడ్డాడు. రిక్షా విరిగింది రిక్షావాడు కూలబడ్డాడు. వ్యాపారస్తుడు తన దెబ్బలు చూచుకొని కన్నీరు పెట్టుకుంటున్నాడు. రిక్షావాడికి తన సంగతి పట్టలేదు. "అయ్యో, నా రిక్షో" అని విలపిస్తున్నాడు— విరిగిన రిక్షాని తడువుతూ!

వాళ్ళని చూస్తుంటే, మూర్తీభవించిన దారిద్ర్యం భారతదేశానికి నష్టం కలిగించదని విలపిస్తున్నట్టూ, కేంద్రీకరించిన రౌఖ్యం, తనకు ఇబ్బంది కలిగిందని కన్నీరు పెటుకుంటున్నట్టూ అనిపించింది నాకు.

గోపీచంద్

# అమరుడైన-

శ్రీ గొట్టిపాటి సుబ్బరాయలు

చావలేదాతడు చావరెన్నటికి
చేవగల రీవియగు జీవురెప్పటికి
అమరు డాతడు తెలుంగది వెల్గుదాక
కమలావనమె తెల్గుగడ్డ కొనదాక.

ఈతకొద్దీ లోతు మోతకొద్దీ బరువు
హేతువాద మ్మెరు నీతి యాదరువు
సుతిమెత్తన మనస్సు సుత్తిదెబ్బ వచస్సు
అతుకు గతుకులులేని బ్రతుకు వర్చస్సు
కతిసెప్పు ఊపులో గల దొక్క మోపు
కతీపయంబగు త్రోపు కలకండ తీపు.

డొంక తిరుగుడులేదు జంకుగొంకు ల్లేవు
బింకములు బీరములు మంకు లతనివిగావు
ముక్కుకు సూటిగా ఒక్కటే ధాటిగా
ప్రక్కదారులులేని బ్రతుకు బాటతనిది.

టక్కులనూ రమారాల—డొక్కజీల్చి డోలుగట్టి
వెక్కిరింపు గాళ్లనడ్డి—వీపుదుమ్ము రేగగొట్టి
చక్కని చిక్కని నవ్వుల-సంస్కృతికే సానబట్టి
మొక్కబోని గుండెదిటవు—మొనగా మనగలిగిన
మా—గోపీచందుకు చావా ?
ఈపని గాదెన్నటికీ.

ఆబాల గోపాల మాహ్లాదమంద
వేబోక నుదయ సంధ్యల రాత్రులంద
అన్ని వేళలకును అన్ని మూలలకు
అన్ని వర్గాలకు అన్ని శాఖలకు
తగుమైన నవలలు సొగసైన కథలు
లగువైన నాటికల్ లలిత వ్యాసాలు
సుగమమౌ తత్వాలు సూటి సూత్రాలు
స్వగతాలు లేఖలు బిగువు బింకములు
అనుభవ సంపన్నమైన యోగ్యతల
తనువెల్ల నిండిన దండి యోచనల
కళలలో కలలలో జెలువు వహించు
మెళకువల్ రచనల మెదిపి రహించు
చావలేదాతడు చావడాతండు
చేపగల రీవిగల జీవి యాతండు.

# నా స్నేహితుడు

శ్రీ ఆచంట జానకిరామ్

నేను మొదటిసారి గోపీచంద్‌ను చూచినప్పుడు, చేష్టలుడిగి, ప్రతిమలా నిలచిపోయాను.

అవి ఆల్ ఇండియా రేడియో మద్రాస్ కేంద్రపు తొలిరోజులు. ఆప్త స్నేహితుడైన గూడవల్లి రామబ్రహ్మాన్ని పలుకరించడానికి వెళ్ళిన నేను, అతనితో ఇష్టా గోష్ఠిలో ఉన్న యువకుని చూచి, అట్టే నిలచిపోయాను సుకుమార గాత్రుడు. అతని నేత్రముల నుండి వెలువడే తీక్షణమైన చూపులు నా చూపులను అరికట్టాయి. అతనికేసే అలా విడువకుండాచూస్తున్న నన్ను మేల్కొలుపుతూ మిత్రుడు రామబ్రహ్మం అన్నాడు ఆశ్చర్యపడుతూ· "ఏమిటీ! అలా ఏకదీక్షగా, అలా చూస్తున్నావు? గోపీచంద్‌ను ఎరుగవానువ్వు? ......ఇతను 'గాలిమనిషి' జానకిరామ్'' అని.

అలా జరిగిన మా తొలి పరిచయము అతి శీఘ్ర కాలంలో స్నేహంగా పరిణమించి, కొన్ని రోజుల లోనే మేమిద్దరమూ ప్రాణ స్నేహితుల మయ్యాము. కొన్నాళ్ళ తర్వాత రోజూ ఉదయమూ, సాయంత్రమూ ఒకరినొకరు ఎక్కడో ఒకచోట కలుసుకోక పోతే మాకు తోచేదికాదు తరుచు అతను నా బసకు వచ్చి నా సరసను భోంచేసి, ఆ రాత్రికి అక్కడే పరుండేవాడు. ఏ తెల్లవారుఝామునోగాని నిద్రపోయేవారము కాము. ఏవేవో కబుర్లు, ఏవేవో విమర్శలు—మనుష్యులను గురించీ, వారి చేష్టలను గురించీ కాదు మా ప్రసక్తి; వారి భావాలను గురించీ, వారి నైజములను గురించిన్నీ. "ఆ స్థితిలో మీరేమి చేసి

ఉండేవారు?'' అని తరుచు అతను అడిగేవాడు నన్ను: నేను అడిగేవాడను, అతనిని. దానిపైన ఇంకాఇంకా చర్చలూ విమర్శలూ ప్రతి విమర్శలూను. ఇటువంటి సహవాసమువల్ల, అతిత్వరలోనే, నన్ను గురించి నేను ఏమీ దాపరికం లేకుండా అన్ని విషయాలూ చెప్పడం జరిగింది. అతనిని గురించి అతను అంత ఎక్కువగా చెప్పేవాడు కాదు అనుకుంటాను. కాని, నేను అడిగిన విషయాలను గురించి మాత్రం వివరంగా చెప్పేవాడు. ఐతే, అల్లాంటప్పుడు అతను, తనను గురించి గాకుండా ''గోపీచంద్'' అనే మరెవరో వ్యక్తిని గురించి అతను నాతో చెపుతున్నాడు అనిపించేది నాకు. మా ఇద్దరి దృక్పథంలో గొప్ప వ్యత్యాసము ఇదే నను కుంటాను. నేను సర్వమూ నా కళ్ళతోనే చూస్తాను-ఏ విషయాన్ని గురించి ఆలోచించినా అది నాకు సంబంధించిన విషయంగానే పాటిస్తాను. అతనలా కాదు; అతనికి సంబంధించిన విషయమైనా, తాను విడిగా దూరంగా ఉండిపోయి, ఒక రీతి నిర్మమతతో చూడకలిగేవాడు.

కాని, నన్నుగురించి విపరీతమైన సానుభూతి ప్రకటించేవాడు, గోపీచంద్. ఆరోజులలో నన్ను ఒకానొక తీవ్రమైన సమస్య బాధిస్తూండడమును గుర్తించి, నాకోసము ఎంతైనా బాధపడేవాడు అతను. ఐతే, చిత్రమేమిటంటే, నన్నుగురించిన ఏదో ఒక సంఘటనను నేను మరీ వివరంగా చెపుతూంటే, అతను, అప్పుడప్పుడు, చిరునవ్వు నవ్వేవాడు. నేను నాకథ ఆపి అతని చిరునవ్వుకు కారణము అడిగేసరికి అతను అనేవాడు· ''మీరు వర్ణిస్తున్న సమస్య నిజంగా అంత క్లిష్టమైనదికాదు. చూస్తుండండి-త్వరలోనే అతి సులభంగా పరిష్కార మవుతుంది.'' అటువంటి విశ్వాసము లేకపోయింది నాకు, ఆ పరిస్థితులలో, కాని, చివరకు అతను చెప్పినట్టే జరిగింది. ఆరోజులలో మేము ఒకరు రచించాలని ఉద్దేశించిన కథానికను గురించో వ్యాసమును గురించో ఇంకొకరితో వివరంగా చెపుతూఉండే వాళ్ళము. ఇంతగా కలిసిమెలిసి ఉంటూ ఉండడము వల్లా, మా దృక్పథములున్నూ చాలవరకు సన్నిహితంగా ఉండడము వల్లా, మా రచనా పద్ధతిలో ఒకరి ప్రభావము ఒకరిపై ప్రసరించడములో ఆశ్చర్యంలేదు. నాతో పరిచయంవల్ల, అతను ఇదివరకు తానుగా ఆలోచింపని ఎన్నో విషయాలను గురించి ఆలోచించడమూ వ్రాయడమూ మొదలుపెట్టాడు-రేడియో ప్రసారముకోసము కొంతా, పత్రికలలో ప్రచురణకోసము కొంతా. అంతే గాక, అతను నా ప్రోత్సాహంవల్ల రచించన ''పరివర్తన'' అటువంటి కథానికలలో, ఇదివరకు అతని రచనలలో అంతగా ప్రత్యక్షముగాని మార్దవమూ సున్నితత్వమూ కనుపింప సాగినది, అనుకుంటాను. అతని రచనాశైలి నాశైలికి ఒరవడి దిద్దినది, అనేక సార్లు,అనికూడా చెప్పవచ్చు. ఇది అప్రయత్నంగా, కేవలమూ మా ఇద్దరిమధ్యఉండే స్నేహభావము వల్లనే జరిగింది అనుకుంటాను, నేను. ఆరోజులలో మా ఇద్దరి రచనా అంత దగ్గరగా ఉండడము ఒక సందర్భంలో చాలా ఉపయోగపడిందికూడాను. రేడియోకోసం ''పశ్చిమవాహిని'' అనే నాటిక వ్రాస్తున్నాడు గోపీచంద్. దక్షిణభారతంలో పుణ్యనదులన్నీ పడమటనుంచి తూర్పుకే ప్రవహిస్తున్నాయి కదా. అలాంటిది మైసూర్‌లో శ్రీరంగపట్టణానికి సమీపాన మాత్రము కావేరీనది ఒకచోట తూర్పు నుండి పడమటకు ప్రవహిస్తుంది. ఇది చాలా పవిత్ర ప్రదేశము, మానవజీవితాన్ని జీవనదితో పోల్చడము పరిపాటి. ఆదర్శజీవియైన ఒక కళాశీలి జీవితాన్ని నాటకంగా రచిస్తూ ఒక విశేషసందర్భంలో అతనిజీవి

తము ఒకవిధంగా మరలడమువల్ల అతని జీవితంలో మిక్కిలి మంగళకరమైన మార్పురావడమును చిత్రించాడు గోపీచంద్. కాని ఆరు అంకముల నాటకములో ఏదో అనుకోని కారణమువల్ల ఒక అంకము నేను వ్రాయవలసివచ్చింది. నేనలా వ్రాయకపోతే ప్రసారమే భంగమయ్యేది. ఐతే, ఈ సంగతి ఇంతవరకూ ఎవ్వరికీ తెలియదు. నాటకము దిగ్విజయముగా జరిగింది. రెండుసార్లు ప్రసారమైనదో ఏమోకూడా రేడియోలో! కాని, ఇప్పుడు నాకు ఆ నాటకపు వ్రాత ప్రతిని ఇచ్చి నేను వ్రాసిన భాగాన్ని వేరే ఎత్తిచూపమంటే నేను చటుక్కున చూపలేనేమో! మా ఇద్దరి భావాలలోనూ, మా ఇద్దరి రచనా విధానంలోనూ మేము వాడే పదజాలంలోనూ అంతటి ఏకత్వము ఏర్పడింది అన్నమాట!

గత విషయాలను జ్ఞాపకము చేసుకుంటూ, మిత్రుని జీవితంలో కొన్ని సంఘటనలు జరిగి ఉండకపోతే అతని మనుగడ ఏ విధంగా పరిణమించేదో అని ఊహించడము నిరుపయోగమైనా అతి సహజము. ఇలా, గోపీచంద్‌ను గురించి నేను అనుకుంటూ ఉంటాను చాలాసార్లు. అతనే గనుక, ''సినీమాల్లోజేరి ఉండకపోతే'' మనిషిగానూ రచయితగానూ అతను ఎలా పరిణమించేవాడోనని. నా ఉద్దేశంలో, ఆనాటి సినిమావారితో, అతను అప్పుడు కల్పించుకున్న సంబంధమూ, అప్పుడు తటస్థించిన పరిస్థితుల ప్రభావమూ అతనిని కృంగదీసినవే అనాలి. ఒక్కమాటలో చెప్పాలీ అంటే: ఈ సినిమా సంబంధంవల్ల ఆకాశంలో ఎగురడానికే అలవాటుపడ్డ పక్షి నేలపైన జీరాడవలసి వచ్చింది. ఇతర విషయాల మాట అటుండగా, ఒక నియమిత విషయాన్ని గురించి, ఒక నియమిత విధానంగా, ఒక నియమిత వ్యవధిలో చెయ్యవలసి రావడము ప్రతిభావంతునికి కఠినశిక్ష అన్నమాట. ఆ శిక్షను అనుభవింపక తప్పినదికాదు అతనికి. ఇందుకుతోడు, ఆ క్రొత్త ప్రపంచకంలో అతను ఎదుర్కొన వలసి వచ్చిన చిత్రవిచిత్ర మానవ నైజముల పరస్పర సంఘర్షణ. ఇది అతనిలో ఎంతో ఆశాభంగమూ ఆశయ భంగమూ కలిగించినదని నేనెరుగుదును. కొంతకాలము తర్వాత ఇటువంటి పరిస్థితుల నుండి అతను బయటపడినా, వీని ప్రభావము మాత్రము అతని తదుపరిజీవితాన్నే క్రమ్మివేసి, అతనిలో కలిగిన మానసిక సంబంధమైన, భౌతిక సంబంధమైన అనారోగ్యానికి కారణమైంది అనుకోడానికి తగిన కారణాలు ఉన్నవి. మా ఇద్దరి సహవాసపు తొలిరోజులలో, ఎంతో ఆసక్తితో ''ఏమండి! ఫలానా అంశము ఆధారంగా కథ వ్రాస్తారా; మీరు బాగా వ్రాస్తారు'' అని అడుగుతూన్న నాతో ''ఏమోనండి; మీరు సూచించిన కథావస్తువు చాలాబాగున్నా, ఇప్పుడు నేను ఆవిషయాన్నిగురించి వ్రాసే 'మూడ్'లో లేను. క్షమించండి!!'' అనే అతను, ఒకపదిహేనేళ్ళతర్వాత, ''మాకు ప్రచురణకు ఏదైనా నవల నిస్తారా'' అని కోరిన ఒక పుస్తక ప్రకాశకునితో ''మీకు మూడు వందల పేజీలనవల కావాలా, ఆరువందల పేజీల నవలకావాలా'' అని అనడము, ఈ పదిహేను ఏళ్ళలోనూ అతనిలో వచ్చినమార్పును సూచిస్తుంది. నాఉద్దేశంలో ఈ మార్పుకు ప్రాతిపదిక గోపీచంద్ సినిమాల్లోజేరిన నిమిషాన స్థాపితమైంది. అది విధిలీల అనాలి. కాని, నేను బాగా ఎరిగిన గోపీచంద్ గొప్ప ఆదర్శజీవి, ఆశావాది. అతను మనుష్యులలోని మంచితనాన్నే గుర్తించేవాడు; వారిమంచితనాన్ని గురించే ప్రస్తావించేవాడు. అతను దైవత్వానికి ఎంత విలువ నిచ్చేవాడో మానవత్వానికీ అంతేవిలువ నిచ్చేవాడు. గొప్ప స్నేహశీలి.

శ్రీ ఆచంట జానకిరామ్

# బహుముఖ ప్రజ్ఞాశాలి

శ్రీ దేశపతిరావు

సుప్రసిద్ధ రచయిత శ్రీ త్రిపురనేని గోపీచంద్‌గారి ఆకస్మిక మరణవార్త సాహిత్యాభిమానులకు పిడుగుపాటుగా వినిపించింది.

కొన్ని రోజులపాటు ఆయనను పీడించిన ఫ్లూ ఆయన శాశ్వతంగా కన్నుమూయడానికి నాలుగు రోజులు ముందు మాత్రమే విడిచిపెట్టింది. ఆఫీసుకు వెళ్తూ నీరసంగా కనిపించిన ఆయనకు ఒక మిత్రుడు "మరి కొన్నాళ్ళు విశ్రాంతి తీసుకుంటే మంచిది" అన్నాడట. ''అలాగే'' అని ఆయన మాటవరసకు ఇచ్చిన సమాధానం, కాని ఆయన ఆఫీసుకు వెళ్ళడం మానలేదు ఆయన తత్వం ఎటువంటిదో ఈ సంఘటనే స్పష్టపరుస్తుంది.

ఆయన కర్మరుడు. శరీరంలో ఓపిక ఉన్నంత వరకు విధ్యుక్త ధర్మాన్ని నిర్వర్తించవలసిందేనని శ్రీ గోపీచంద్ అభిప్రాయం. ఆఫీసులో వుంటే ఆఫీసుపని, ఇంటివద్ద వుంటే చదవడమో, వ్రాయడమో చేయవలసిందే. ఊరక కబుర్లు చెప్పడం ఆయన స్వభావానికే విరుద్ధం. ఎవరైనా వెళ్ళి ఆయనను మాటలలోకి దింపితే ఆ సంభాషణ సాహిత్య చర్చగానో, తత్వశాస్త్ర మీమాంసగానో పర్యవసించవలసిందే.

ఆధునిక సామాజిక సిద్ధాంతాలను-ముఖ్యంగా మార్క్సిజాన్ని ఆకళించుకొన్న కొద్దిమంది తెలుగు రచయితలలో ఆయన ఒకరు. కొంతకాలం ఆయన మార్క్సిజం ప్రభావంలోకూడా వున్నారు. దాని

ఫలితమే ఆయన రచించిన మార్క్సిజం అంటే ఏమిటి అనే గ్రంథం కాని నిరంతర జిజ్ఞాసి అయిన ఆయనపై మార్క్సిజం ఎంతకాలమో ప్రభావం చూపలేక పోయింది. ఎం. ఎన్. రాయ్ రచనలు ఆయనకు నూతన మార్గాలను చూపించాయి. ప్లేటో మొదలు డ్యూయీ వరకు పాశ్చాత్య తత్వవేత్తల సిద్ధాంతాలను అధ్యయనం చేశారు ఆయన. ఈ అధ్యయన సమయంలోనే "తత్వవేత్తలు" అనే ఉద్గ్రంథం రచించారు. కాని ఇవేవీ ఆయనకు సంతృప్తి నివ్వలేదు. క్రమంగా అరవింద యోగి సిద్ధాంతాలు ఆకర్షించాయి. ఒకప్పుడు భౌతికవాదం, నాస్తికవాదం ప్రచారం చేసిన ఆయన ఆస్తిక వాదిగా మారిపొయ్యాడు "ఆస్తికుడుగా మారిపొయ్యారేమిటి గోపీచంద్ గారు ?" అని ఎవరైనా ప్రశ్నించి వుండవచ్చు అందుకు ఆయన ఒకసారి రేడియోలో ప్రసంగిస్తూ సమాధానం చెప్పారు

"నాస్తికవాదం (భౌతికవాదం) ఆధారంగా నిర్మించిన కమ్యూనిస్టు రష్యాలో స్టాలిన్ మరణించినప్పుడు ఆయన ఆత్మకు శాంతి కలుగుగాక అంటూ చర్చిలలో ప్రార్థనలు జరిపారు. దేవునికి విజ్ఞప్తి చేశారు. దీనిని బట్టి నాస్తికవాదం అర్థంలేనిది కావడంలేదా? అర్థం లేని దీనిని ఎందుకు విశ్వసించాలి?" అని శ్రీ గోపీచంద్ ప్రశ్న రూపంలో సమాధానం చెప్పారు.

ఆయన ఏదివిశ్వసించినా అరమరికలు ఉంచుకోరు. తాను ఫలానా సిద్ధాంతాన్ని విశ్వసిస్తున్నానని కుండ బద్దలు కొట్టినట్టు చెప్పివేస్తారు. అందుకే ఆయన రచనలలో ఆయన పరిణామం స్పష్టంగా గోచరిస్తుంది. "అసమర్థుని జీవతయాత్ర" వ్రాసిన కాలంలో ఎలా రాయ్ ప్రభావం క్రింద వున్నారో "పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా" నాటికి ఎలా అరవిందుని సిద్ధాంతాలను ఆమోదించారో తెలుస్తుంది.

ఆయన ఎన్ని రంగాలలోనికి మారినా సాహిత్య కృషిని మాత్రం విడనాడలేదు. రెండువందలకు పైగా కథలు, అసమర్థుని జీవయాత్ర, పరివర్తన, మెరుపుల మరకలు, పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా మొదలైన నవలలు, తత్వవేత్తలు, పోస్టుచెయ్యని ఉత్తరాలు మొదలైన గ్రంథాలు, అనేక వ్యాసాలు. "చీకటి గదులు" అనే మహత్తర నవలను ప్రారంభించారు. కాని అది అసంపూర్తిగానే మిగిలిపోయింది.

శ్రీ గోపీచంద్ ప్రతిరచన నిర్దిష్టప్రయోజనం కలిగివుటుంది. ఆయనచేసిన అనేక రచనలలో దేనిని పరికించినా ఈ అభిప్రాయం రుజువౌతుంది. ఆయన అభిప్రాయాలతో మనం ఏకీభవించకపోవచ్చు. కాని ఆయన ప్రతిభను, మేధాశక్తిని ప్రశంసించకుండా వుండలేము. ఆయన తెలుగులో మహాపండితుడు కాకపోవచ్చు కాని ఆయనశైలిలో తెలుగుతనం ఉట్టిపడుతూంది.

శ్రీ గోపీచంద్‌గారి శైలి ఎంత నిరాడంబరమైనదో ఆయన అంత నిరాడంబరుడు. పండితుని ఇంటపుట్టినా, లాచదివినా, ఆయన రైతువలె చొక్కా, పంచకట్టి నిరాడంబరంగా వుండేవారు. ఆయన ఎంత నిరాడంబరుడో అంత మేధావి, ప్రతిభాశాలి ఆయన మరికొన్నేళ్ళు బ్రతికివుంటే తెలుగు సాహిత్యం, ముఖ్యంగా నవలా సాహిత్యం మరింత పరిపుష్టమయ్యేది.

శ్రీ దేశపతిరావు

# "యమపాశం"

శ్రీ మండవ శ్రీరామమూర్తి

సాహిత్య రంగంలో నవలదొక విశిష్ట స్థానం. కథానికలోకంటె పాత్రలు మరింత సజీవ వంతంగా, సామాజిక ప్రతిబింబాలుగా రూపొందించ టానికి నవలాప్రక్రియలో అవకాశం ఎక్కువ వాస్త వికతను పుణికిపుచ్చుకున్న రచన శాశ్వతస్థానాన్ని సంపాదించుకొంటుంది. అలాంటి రచనే—గోపీచంద్ గారి 'యమపాశం'

ఈ నవల చుట్టూ పరిభ్రమించే ముఖ్యమైన పాత్ర నారాయణరావు—సెక్రటేరియట్‌లో గుమాస్తా. అత నిది ఫైళ్ల ప్రపంచం, మానవ ప్రపంచం కాదు. సూపరింటెండెంటుగా ప్రమోషన్ కాగలదని పగటి కలలు కంటూన్న ఒక గుమాస్తా దైనందిన జీవితాన్ని, అతని బాధలను యితివృత్తంగా చేపట్టారు—గోపీచంద్. నవలంతటా నారాయణరావు కనుపిస్తాడు. ఈ పాత్ర ఎంతో విశిష్టమైన సామాజిక ప్రయోజనాన్ని సాధిం చింది. మనము నిత్యమూ చూచే లక్షలాది గుమాస్తాల జీవితమే—నారాయణరావు పాత్ర సృష్టిలోని ఆంతర్యం.

నారాయణరావు రాజమ్మలకు ప్రేమవివాహం జరి గింది చాలీచాలని జీతంలో ఏడుగురు పిల్లలతో సతమత మవుతూవుంటాడు. ఆఫీసులోను, బయటా కూడా ఫైళ్లు అతని వెంటపడి తరుముతూ వుంటాయి. ప్రభుత్వోద్యోగం అనేది కబంధుని వంటిది. తన ఇనుప కౌగిలిలోకి తీసుకొని కబళించి తీరుతుంది. దాని చేజిక్కి విడిపించుకొని ఎవ్వరూ బయట పడరు——అలాంటి వ్యక్తి నారాయణరావు.

కాలేజీలో వుండగా రాజమ్మ (రాజకుమారి) నారాయణరావుపై మోజుకలిగి, తన తండ్రికి ఇష్టం లేకపోయినా వివాహంచేసుకొంది. అతనితోబాటు సంసారబాధ్యతలు, బాధలు పంచుకున్నది. తన వల్లనే కాపురం అలాగైనా నడుస్తున్నదని భ్రమ పడేది. కుటుంబనియంత్రణ అవసరాన్ని ఎనిమిదో కాన్పుకుగాని గుర్తించలేదు. భర్తతో చెప్పకుండానే, నర్సింగ్‌హోమ్‌లో చేరింది.

నారాయణతో అక్రమసంబంధ మున్నదనుకొన్న శారద, లోకానికి ప్రతినిధులుగా సృష్టించిన ఆతని ముగ్గురు మిత్రులూ (భాస్కర్‌రావు, షణ్ముగం, లక్ష్మణకోటిశాస్త్రి) యీ నవలలో మనకు సజీవులుగా కనుపిస్తూ, వాస్తవాన్ని ఎప్పటికప్పుడు చాటుతూ వుంటారు. ఒక శుభముహూర్తాన యం.యల్.ఏ.గా ఎన్నికైన చలమయ్య, ప్రభుత్వంలో పలుకుబడిగల వ్యక్తిగా పరిగణించబడిన సంధ్యారాణి లాంటి పాత్రలు—మనకు నిత్యజీవితంలో కనుపిస్తూనే వుంటాయి.

గోపీచంద్ సృష్టించిన ప్రతిరంగము, ప్రతి సన్నివేశము వెనుకా ఎంతో అర్థం యిమిడి వుంటుంది. ఆవుల సాంబశివరావుగా రన్నట్లు "గోపీచంద్ పాత్రలు జీవితానికి ప్రతిబింబాలు, ప్రతినిధులు. మన చుట్టూ కనుపించే మనుష్యులు. వాళ్ల మనస్తత్వాలు వాళ్ల ఆవక తవకలు, వాళ్ల మంచిచెడ్డలు అన్నీ ఆ పాత్రలలో ప్రతిబింబిస్తాయి అందుచేతనే గోపీచంద్ పుస్తకాలు చదువుతూంటే ఆ పాత్రను ఎక్కడో చూచి నట్లు ఉంటుంది, వాళ్లను ఎరిగినట్లే ఉంటుంది. వాళ్లను పోల్చుకోగలమనే లనిపిస్తుంది."

కథంతా ఒక్క పగలు, రెండు రాత్రులలో ముగిసిపోతుంది. ఒక గుమాస్తా దైనందిన జీవితాన్ని అతని ఆశలను, సమాజంయొక్క పోకడలను, గంభీర సాగరంతో పోటీపడుతున్న సంసారాన్ని చిత్రించటమే కథకుని లక్ష్యం. లక్ష్యసిద్ధి జరిగింది కూడా. పాత్రలను విమర్శనాత్మకంగా పరిచయం చేసి, పాఠకుల మేధాశక్తికి పని కల్పించి, నిష్క్రమిస్తాడు—రచయిత.

గోపాలరెడ్డిగా రన్నట్టు గోపీచంద్ వేదనాజీవి. అతని రచనల్లో ఆవేదనా, ఉద్వేగమూ గోచరిస్తాయి. ప్రజలలోని ఆక్రందనలు ప్రతిధ్వనిస్తాయి. 'శైలి ఆ వ్యక్తియొక్క గుర్తు' అన్నదానికి గోపీచంద్ సాక్ష్యం—ప్రమాణం గూడాను. అదే ఆయన రచన లోని విశిష్టత—ప్రత్యేకత.

# జ్ఞాపకాలు

శ్రీ సి. ప్రసాద్

గొప్పవారితో పరిచయం పెరగాలంటే ఎప్పుడూ వారిని పొగుడుతూ వుండాలి. కాని గోపీచంద్ గారితో పరిచయం పోట్లాటతోనే పెంపొందేది. ఆయన మాట్లాడుతుంటే మధువులొలకవు, మనకు నోరూరదు, చవులుపుట్టవు– కాని మొత్తం మన పుట్టకీళ్ళు కదిలిపోయినట్టు ఫీలవుతాం. ఇక వారితో పోట్లాడుతుంటే మన ఉనికినే మర్చిపోవటం కూడా కద్దు. గోపీచంద్‌గారి ప్రవృత్తి, వ్యక్తిత్వం అలాంటివి. చాలమంది చిరునవ్వుతో స్వాగతమిస్తే, ఆయన చిరాకుతో మనలను పలకరిస్తారు. వారు చిరాకు పడ్డం నిజంగా చూసితీరాలి. అందులో ఎంతయినా సొగసుంది.

'58లో అనుకుంటా, 'అభ్యుదయ' చందాకోసం వెళ్ళాం. ''నేను కమ్యూనిష్టును కాదు. అయినా నా పుస్తకాలు వాళ్ళే ఎక్కువగా చదువుతారు'' అంటూ చందా చెల్లించారాయన. అదేవారితో తొలిపరిచయం. అప్పటినుంచి హైదరాబాద్‌లో వున్నంతకాలం చాలా ఎక్కువగా కలుసుకునేవాళ్ళం. కుర్రవాడినని, కష్టపడి పనిచేస్తానని నేనంటే చాలా ఆప్యాయంగా వుండేవారు. వారితో ఏర్పడిన చనువుకు పొంగిపోయేవాడిని.

ఉన్నట్టుండి '' మీరుచాలా మారిపోయారే ? '' అన్నానొకనాడు. "ఏం? మారకూడదా ?"

''ఎందుకు మారారో తెలుసుకుందామని''

"మూడుముక్కల్లో చెప్పాలంటే విజ్ఞానతరంగాలు, జీవితం ప్రసాదించిన ఆటుపోటులు, వయసుమళ్ళడం, ఇంతే."

''ఆ మార్పు వివరించి చెప్పగలరా?''

''అదివరకు 'షాముందు టాగోర్ ఎంత ?' అను కునేవాడిని. అలాంటిది 'ఇద్దరూ గొప్పవారే. కాని టాగోర్ పూర్ణపురుషుడు' అంటానిప్పుడు.''

''టాగోర్‌ను చిన్నచూపెందుకు చూశేవారు ? ఆ కవిత్వంలోని ప్రతి పద రసోదయాన్ని ఆనందించ లేదా ?''

''ఆనందించా, కాని హర్షించలేకపోయా. అప్పట్లో నన్నది ఆకట్టుకుని అలరించలేకపోయింది.''

''ఈలోపం ఎవరిది ?''

''ఆనాటి నా దృక్పథంలోనే వుందేమో !''

''అయితే ఇప్పుడు ఆధ్యాత్మికవాదం వేపు మొగ్గడం కూడ సరయిందేనా ?''

''అనే నాగట్టినమ్మకం. నేను భౌతికవాదాన్ని కాదనడంలేదు. కాని మానవుడి జ్ఞానతృష్ణకు విజ్ఞాన పిపాసకు భౌతికవాదం చాలదని నానమ్మకం.''

''మీకు మతంమీద, గతంమీద మమకారం ఎందుకు పెరిగింది ?''

''అవి లోపరహితమని కాదు నేననేది. కాని మతం లోని మంచిని, గతంలోని గొప్పని గుర్తించి స్వాయత్తం చేసుకుందాం.''

''గతంలోని గొప్పేమిటి ?''

''మనపూర్వీకులు మనం కనివిని ఎరుగనివి అనేకం సాధించారు, ఉద్గ్రంథాలు రచించారు, ఉత్తమ కళలు సృష్టించారు. మహోన్నతమైన తాత్విక చింతనతో ఎన్నింటినో తరిచిచూశారు. అంతఎత్తుకు యీనాడు మనం ఎగరలేము. అందుకే వాళ్ళముందు చేతులు జోడించి నిలబడతా.''

''మనపూర్వీకుల తాత్త్వికచింతనలో మీరుమెచ్చు కునేదేమిటి ?''

''మనకు అంతుపట్టని దేదో ఒక ఆధారం వారికి వుంది. ఆ దేమిటో శోధించి తెలుసుకోవాలి. ఏ ఆధారంలేకుండా ఇన్నిరకాలుగా ఎలా ఊహిస్తారు ?''

''ఏమిటా ఊహలు ?''

''క్షీరసాగర మథనం, శ్రీకృష్ణుని లీలావిలాసం, శ్రీరాముడి తేజస్సు, పంచపాండవుల శక్తి సంపద, వీటన్నిటికీ మూలాధారం ఏమిటా అని నా యోచన.''

ఇలా గంటల తరబడి వాదిస్తూ కూర్చున్నాం ఆనాడు. ఆ తరవాత కొద్దిరోజులకే 'తత్వవేత్తలు' పూర్తిచేశారాయన.

ఈ తాత్విక మీమాంసతో తలదిమ్మెక్కి ''ఏమండీ. మీరు మళ్ళీ కథలు, నవలలు ఎందుకు రాయగూడదు?'' అన్నానొక రాత్రిపూట. ''ఎవరి కథో ఎందుకు ? మనకథ మనమే రాసుకుందాం'' అంటూ అప్పటికప్పుడే 'చీకటిగదులు' మొదలుపెట్టి ఒక్క బిగిని 50 పేజీలు రాసేశారు. తెలుగు సాహిత్యంలో ఒక బృహద్గ్రంథం ఆరంభమవడానికి నిమిత్త మాత్రంగానయినా నేను కారణమయ్యానని చాలా ఆనందపడేవాడిని.

'చీకటిగదులు' ఇలా కొనసాగిస్తూనే ఒకనాడు 'ప్రఖ్యాతుని భార్య' కథరాసి నన్ను చూడమని వ్రాతప్రతి చేతికిచ్చారు. ''అందరి కథలుకూడా రాద్దామని కలిగిందా?'' అంటే చిరాకు పడ్డారు. 'యువ'లో పుంఖాను పుంఖంగా వెలువడ్డ ఆయన కథలకు నాంది 'ప్రఖ్యాతుని భార్య'. అదిలగాయతు ఆయన లెఖ్ఖలేనన్ని కథలు రాశారు. వాటిని గురించిన వాదోపవాదాల జోలికి నేను పోను. ''ఏమండీ, ఈ వజాన మీరు నా మీద కూడా కథరాసేటట్టున్నారే?'' అన్నా, ''తప్పకుండా రాస్తా. వద్దంటావా?'' అన్నారు, ''నేనొద్దంటే మాత్రం మీరు ఆగుతారు కనకనా? సరే కానివ్వండి'' అంటూ సరిపెట్టా.

శ్రీ సి. ప్రసాద్

అప్పుడే 'జయంతి' పత్రికలో అందరినీ తిట్టిదిగ పారపోయడం మొదలెట్టారు—కవిసామ్రాట్ గారిని తప్ప. ఆ 'జయంతి' శైలి, వారిఫక్కీ, ఆధోరణి అంతా చెబితే గోపీచంద్‌గారు కడుపుబ్బనవ్వి వారికి 'మూర్ఖులమురా' అని ముద్దుగా నామకరణం చేశారు.

రష్యన్ రచయిత పాస్టర్‌నాక్ రాసిన 'డాక్టర్ జివాగో' నవల మేధావులను బాగా ఆకట్టుకుంది. అతి కష్టంమీద ఒక కాపీ ఆయనకు తెచ్చిచ్చా. అది చదివి ''దీనికింత పేరెందుకొచ్చిందో'' అంటూ అబ్బురపడ్డారాయన.

కేరళలో విమోచన సమరం అప్పట్లో జోరుగా జరుగుతోంది. మంత్రివర్గాన్ని నిలబెట్టాలని, శ్రీ నంబూద్రిపాద్ రాజ్యాంగరీత్యా విశ్వప్రయత్నం చేశారు. ''నంబూద్రిపాద్‌లాంటి వాళ్ళు ఇంకా పది మంది వుంటే ఇండియాలో కమ్యూనిస్టు పార్టీ ఎప్పుడో బాగుపడేది'' అన్నా రాయన. తీరా మంత్రి వర్గాన్ని బర్తరఫ్ చేశాక వారి ఉద్దేశ్యం 'అన్యాయమే' నన్నారు. ''మరి నడమంత్రపు ఎన్నికల్లో ఎవరు గెలుస్తారో'' అని నేను సంశయం వెలిబుచ్చితే ''కమ్యూనిష్టులు గెలుస్తా రనుకోవడం దింపుడు కళ్ళాం ఆశ'' అంటూ తెగేసి చెప్పారు. గోపీ చంద్‌గారి దూరదృష్టికి ఇవి మంచి నిదర్శనాలు.

ఎందుకో ఒకరోజున 'స్రియలిజమ్' గురించి చర్చించుకున్నాం. దాన్నే Stream of consciousness అని కూడా అంటారు. ''నా ప్రవృత్తికి ఇది చాలా దగ్గర. ఒక రకంగా 'పతివ్రత అంతరంగం' అనే కథలో నేను ఈ పద్ధతినే అవలంబించా'' నన్నా రాయన.

"శ్రీశ్రీ గురించి మీ ఉద్దేశం ఏమి''టని అడిగా నొకనాడు. ''శ్రీ శ్రీ గొప్ప Genius. కవుల్లో అలాంటి వాళ్ళు అరుదు" అన్నారు గోపీచంద్.

కొద్దిరోజుల తర్వాత నేను హైదరాబాద్ నుంచి మద్రాస్ వెళ్ళిపోయా. కొంత కాలానికి నవశక్తివారి 'కలిమిలేములు' చిత్రానికి వారితోపాటు కలిసి పనిచేసే అదృష్టం కలిగింది. జీవితంలో అదొక అపూర్వ అనుభవం. గోపీచంద్‌గారికి బద్ధకం అనేది ఏకోశానా లేదు. పనుంటే తాను చేయడమేగాక ఎదుటివారిని కూడా ఊపిరాడనివ్వరు. సంభాషణల్లో యతిప్రాసల కోసం ప్రాకులాడడం ఆయనకు సుతరామూ గిట్టేది కాదు. తెలుగు నుడికారపు సొంపులను ఎక్కువగా యిమిడ్చేవారు. సంభాషణలు తనలో తను మననం చేసుకుంటూ మరీ రాసే వా రాయన.

గోపీచంద్‌గారిలోని గొప్ప గుణం చిన్నవాళ్ళను ప్రోత్సహించి వారిచేత రాయించడం "మంచి, చెడు అని మీనమేషాలు లెఖ్కపెడుతూ కూచుంటే యింకా నువ్వు రాసేదెప్పుడు? అయిన కాడికి రాస్తే వాటికి విలువలు కట్టేవారు వేరే వుంటారు. కాబట్టి నిర్విరామంగా రాస్తూండు'' అనేవారాయన. 'యువ' లో కొత్త కొత్తవాళ్ళ రచనలు ఎక్కువగా ప్రచురించ డానికి ఇదే కారణం. అందువల్ల గోపీచంద్‌గారి మీద పేరుపొందిన రచయితలకు గుబ్బు వుండేదని వినికిడి.

కడసారి వారిని అక్టోబర్ 31న కలుసుకున్నా. చాలా నలతగా కనిపించారు. ఏదో మార్పువున్నట్టు అనిపించింది నాకు. చాలా ఆదుర్దాపడ్డా. ''విశ్రాంతి తీసుకోండి'' అంటే "అదే ఆలోచిస్తున్నా''నన్నారు.

''ఈ చైనాగొడవ ఏమిటండీ?'' అని మెల్లగా కదిలించా. ''కప్పలను తినేవారికి Culture ఏమిటి?'' అంటూ యీసడించారు. ''ఇప్పుడు వెనక్కుతగ్గినా మనసైన్యం ముందుముందు తప్పకుండా దెబ్బకు దెబ్బ తీస్తుంది'' అని చెదరని ఆత్మవిశ్వాసం ప్రకటించా రాయన. కాని దురదృష్టవశాత్తు మన విజయలక్ష్మిని కళ్ళారా చూడకుండానే ఆయన శాశ్వతంగా కన్ను

మూశారు. తెలుగుదేశం ఒకగొప్ప దేశభక్తుడిని, మహామేధావిని, మేటిరచయితను కోల్పోయింది.

గోపీచంద్‌గారికి నిక్కునమలడం చేత కాదు. ఏదయినాసరే కుండబద్దలుకొట్టినబాపతుగా చెప్పే వారు. శాఖా చంక్రమణం ఆయనకు సరిపడనిసంగతి. ఏదిరాసినా స్పష్టంగా, స్వచ్ఛంగా రాసేవారు.

తెలుగులో గిడుగువారు భాషాపిడుగయితే గోపీ చంద్‌గారు భావాలపిడుగు. ఎప్పుడూ కొత్త కొత్త భావాలతో వాయువేగ, మనోవేగాలతో ప్రసరిస్తూ వుండే వారాయన. తెలుగుదేశానికి తేజస్సును ప్రసాదించి ఆయన తనువు చాలించారు. వారిని కలుసు కోవాలంటే ఏచుక్కల సీమలోకో వెళ్ళివెతకాలి.

---

# పాండిత్యం

"అయ్యా,

మీ విమర్శ చూశాను, నేను పండితుణ్ణికాదనీ, తండ్రి అంతటివాణ్ణి అవలేదనీ మీరు వ్రాశారు.

రైట్, బాగానేవుంది.

కాని మీ రే యే పుస్తకాలు చదివారు? తెలుగులో ఇరవై పుస్తకాలూ, సంస్కృతంలో పది పుస్తకాలేగా! అంటే ఆరు నెల్ల చదువన్నమాట!

తెలుగులో మీరు చదివినన్ని పుస్తకాలు నేనూ చదివాను. అయితే మీరేమో మీటింగుల్లో పద్యాలు కోట్ చేసే ధృష్టితో చదివారు; నేనేమో భావం గ్రహించాలనే ఉద్దేశంతో చదివాను. ఇక సంస్కృతం అంటారా?

సంస్కృతం నేను చదవనిమాటనిజమే! కాని పరభాషఅయిన సంస్కృతంలో మీరు పది చదివితే, పరభాష అయిన ఇంగ్లీషులో నేను నాలుగు వందల పుస్తకాలు చదివాను, నాకింకా ఇంగ్లీషులో కొన్నివందల పుస్తకాలు చదివే అవకాశంవుంది. మీకు సంస్కృతంలో ఆ అవకాశంలేదు.

కనక చూడగా మీకంటే నే నే పెద్దపండితుణ్ణి...

శలవు.

రామారావు."

గోపీచంద్

# విశిష్టవ్యక్తిత్వం

శ్రీ బాసాని సుదర్శన్‌రెడ్డి

గోపీచంద్‌గారు కాలధర్మం చెందారట!

నిజమేనా......?

నేను నమ్మలేక పోతున్నాను......ఆయన్ని ఎరిగినవాళ్ళెవరూ నమ్మలేరేమో!

ఆయన అస్తమించలేదు. అస్తమించరు.

ఆచంద్రార్కం ఆయన అమరుడే. ఆంధ్ర సాహితీమతల్లికే కాదు—విశ్వసాహిత్య మాతకే ఆయన అస్తమయ వార్త అశనిపాతంలాంటి దంటే అత్యుక్తి అణుమాత్రం కాదు. ఆయన లేని లోటును మరెవ్వరూ పూరించలేరు...ఇలా అనటం సహజమేమోకాని అందరియెడలా వాస్తవంకాదు.

విశ్వసాహిత్యాన్ని, తాత్త్విక విషయాలని మధించి, జీర్ణించుకొని, రచనలలో తమ వ్యక్తిత్వాన్ని మేళవించి జీవితాన్ని అతి నిశితంగా పరిశీలించి,' తదనుగుణ్యంగా రచనలు సాగించి, ఆశించిన లక్ష్యాన్ని సాధించి, సాహితీ రంగంలో సుస్థిర స్థానాన్ని ప్రతిష్ఠతం చేసుకొన్న మనీషి శ్రీ గోపీచంద్.

ఆయనతో మాట్లాడటం ఒక మధురానందానుభూతియే కాదు, విజ్ఞాన సముపార్జన. ప్రపంచ విజ్ఞానాన్ని మధించి, పుష్టిగా జీర్ణించుకొని, అందులోని మీగడలను ఎదుటివారికి అరటిపండు వలచి చేతపెట్టినట్లు వివరిస్తారు.

ఏదిమాట్లాడినా ఒక్కొక్కమాట త్రాసులోపెట్టి తూచినట్లు మాట్లాడుతారు. నిరర్థకమైన మాట ఆయన నోటివెంట నేనువినలేదు, నాకొద్దిపాటి పరిచయంలో.

ఇటుతెలుగు_అటుఇంగ్లీషు భాషలలో నిష్ణాతులు. గంభీరమైన స్వరూపం, కంచులా మ్రోగేకంఠస్వరం, ఎదుటివార్ని ఇట్టే ఆకట్టి ముగ్ధులనుచేసే సంభాషణా చాతుర్యం ఆయనసొత్తు.

విజ్ఞానం, సంస్కృతీ మూర్తీభవించిన కుటుంబంలో జన్మించి, వాటిని పుణికిపుచ్చుకొని తమ వ్యక్తిత్వాన్ని మేళవించి, జీవితాన్ని అతి నిశితంగా పరిశీలించి, రచనలు సాగించిన మహనీయుడు శ్రీ గోపీచంద్.

ఆయన రచనలే ఆయనకీర్తి ప్రదీపికలు. తెలుగు సాహిత్యం జీవించినంత కాలం అవికూడా నిలుస్తాయి. అంతెందుకు, కాలమే దానికి కొలతబద్ద.

ఆయన కథకుడు, నవలాకారుడు, రాడికల్ హ్యూమనిష్టు, స్క్రిప్టురచయిత, డైరెక్టరు, గొప్ప వక్త....

ఒక్కటికాదు, అన్నీనూ. అన్నిట్లోనూ తన ముద్ర వేసి వెళ్ళారు.

ఆధునిక జీవితంలోని లోటుపాట్లను వాస్తవంగా నగ్నంగా వివరించారు పరిష్కార మార్గాలను చూపించారు. ఇప్పుడేకాదు. ఆయన ఎప్పుడూ అంతే......!

ఈమధ్యన ఆయనొక మిత్రులగోష్టిలో మాట్లాడుతూ రచయితల కొక హితవు చెప్పారు.

నేడు కేవలం రచనలలో గుణమేప్రధానం కాదనీ, రాసికూడా ముఖ్యమని అన్నారు. అధికసంఖ్యలో పుస్తకాలు బయటికి రాకపోతే రచయిత అంతగా రాణించలేడన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తపర్చారు. గుణప్రధానమైన రాసిసాధనాల లక్ష్యంతో ఆయన ఈమధ్యన విరివిగా రచనలుచేసి, ప్రచురించి, లక్ష్యాన్ని సాధించారు. అవి ఆంధ్రుల అభిమానాన్ని చూరగొన్నాయి.

రాజకీయ వాతావరణాన్ని తీసుకొని కథలు రాయటంలో ఆయనకు ఆయనేసాటి. ప్రపంచ ప్రముఖ తత్వవేత్తల రచనలను, భావాలను క్షుణ్ణంగా అర్థం చేసుకొని, వాటిని ఆంధ్రులకు అందచేశారు సరళమైన భాషలో. అవి నిజంగా తెలుగుసాహిత్యానికి పూలదండలు.

ఆయన రచనలన్నింటిలోను ఏదో ఒక ఉద్దేశ్యం, ఒక లక్ష్యం ఇమిడి వుంటుంది. ఉద్దేశ్య రహితమైన రచన లేవీ ఆయన చేయలే దనిపిస్తుంది.

ఆంధ్ర సాహితీ రంగానికి ఆయనచేసిన సేవ నిరుపమానం. తనజీవితంలోనే అఖండకీర్తిని, అజరామరఖ్యాతిని ఆర్జించిన మనీషి, రచయిత, తెలుగు సాహిత్యంలోని సుప్రసిద్ధ నవలాకారులలో అగ్రేసరుడు. చలంతో సమానంగా చెప్పుకోదగ్గవారాయన. శైలిలోనేమీ, ధాసిలోనేమీ, గుణప్రధానంలోనేమీ, భావాలలోనేమీ,విజ్ఞానంలోనేమీ ఒండొరులూ తీసిపోరు.

ఆయన వ్రాసిన "అసమర్థుని జీవయాత్ర" ఒక్కటిచాలు రచయితగా ఆయనసాహిత్యం సువర్ణాక్షరాల్లో లిఖింపబడేందుకు. విశ్వసాహితిలో ఆయన్ని ప్రతిష్ఠించేందుకు ఆయనరచనలలోని కొన్ని ఉత్తమమైనవాటిని ఇంగ్లీషులోనికి అనువదించి ప్రచురించాలని ఆయన అభిమానులందరికీ, నవ్యసాహితీ సమితులకీ నా విజ్ఞప్తి. అంతేకాదు...ఆయన ఆత్మకి శాంతికలగాలంటే ఆయన రచనల్ని క్షుణ్ణంగా అర్థంచేసుకోవాలి. అప్పుడే ఆయన సజీవంగా నిలుస్తారు మన ఎదుట. అందుకే అన్నాను ఆయన అస్తమించలేదనీ, అస్తమించరనీ.

శ్రీ జాసాని సుదర్శన్ రెడ్డి

# అసమర్థుని జీవయాత్ర

శ్రీ అద్దేపల్లి పూర్ణచంద్రరావు

కొన్ని అంతే. కలకాలం మనగలిగే నవలలు సాహితీ లోకాన హఠాత్తుగా ఆవిర్భవిస్తాయి. సంఘంలో విపరీత సంచలనాన్ని కలిగిస్తాయి.

ఉన్నవవారి 'మాలపల్లి' ఆ కోవలోనిదే, గోపీ చంద్ 'అసమర్థుని జీవయాత్ర' అటువంటిదే.

'అసమర్థుని జీవయాత్ర'గోపీచంద్ మొదటినవల.

ఈ నవల చదివిన ప్రతి పాఠకుడూ తనూ ఒక అసమర్థుడు కాదుకదా అని తడిమి చూచుకొంటాడు. ఆ చిన్న నవల అట్లా హృదయాన్ని పట్టి కదుపు తుంది. మనసును కలచివేస్తుంది.

ఆ రోజులలో ఈ నవల ఆంధ్రప్రభలో వారం వారం ప్రచురిత మయేప్పుడు ఆంధ్ర పాఠకలోకంలో ఎంతో సంచలనాన్ని కలిగించింది. సంభ్రమాశ్చర్యా లలో ముంచెత్తింది.

శక్తిమంతమయిన రచనా విన్నాణంలో సజీవమైన అసమర్థుడు సీతారామారావును సృష్టించిన గోపీచంద్ తెలుగు నవలా సాహిత్యాన్నే మహోన్నత స్థాయిన నిల్పారు.

కథానాయకుడు సీతారామారావు మూర్ఖుడు. వట్టి మూర్ఖుడు కాదు, చదువుకొన్న మూర్ఖుడు.

అతనికి అంతా తెలుసు. తెలియకపోయినా తెలిసి నట్టు నటించడం కూడా తెలుసు. జీవితంలో తను వేస్తున్న ప్రతిదీ తప్పటడుగేనని అప్పుడప్పుడూ అని పిస్తూవున్నా, 'తెలిసినతనం'తో మొండిగా తనను తనే వంచించుకోవడం కూడ అతనికి తెలుసు.

మూర్ఖత అతనిలో అహంభావంగా మూర్తీభవిస్తుంది. తన తాత ముత్తాతలు నేతులు తాగారు గనుక తను మూచూడాలి అనే తత్వం అతని నరనరాన జీర్ణించుకుపోయివుంటుంది.

సీతారామారావు మూడు తరాలకు ప్రతినిధి. శిధిలమైన పెత్తందారీ వ్యవస్థలో పుట్టి పెరిగాడు. తన చదువు సంధ్యలతోపాటు సహజంగా వున్న తాత్విక దృష్టితో భవిష్యాన్ని చూడగలిగాడు. కాని, తను వున్నది సనాతనాధునాతన వ్యవస్థల మధ్యగల సంధ్య దశలో అని గుర్తించలేకపోయాడు.

సీతారామారావు ఆలోచనాపరుడు, విజ్ఞానే అయినా కులసంస్కారాన్ని ఆశ్రయించిన కారణంగా నాశనం అయాడు.

సాంఘిక వ్యవస్థ మారుతున్నంత త్వరత్వరగా ఆతను మారలేదు మారినా, మనసు పెరగలేదు. పెరిగినా, మునగ మొక్కవలె పెళుసుబారిపోయింది. అదిగాక, గిడసబారిన వంశ పారంపర్యాహంభావం అతనిలో వుండనే వుంది!

అహంభావమే అతని కొంప ముంచుతుంది. సీతారామారావు తన వంశం తరతరాల నుంచి 'రీవిగా,' 'హుందాగా' పెత్తందారీతనంతో బ్రదుకుతూ వచ్చిందని, ఇవాళ తనూ అట్లాగే బ్రతకాలని, చచ్చిన తాత ముత్తాతల 'ప్రతిష్ఠ'ను ఇనుమడింపజేయాలని, తన ద్వారా తన 'వంశ గౌరవం' ఉద్ధరించబడాలని అనుకొని అందుకై యత్నిస్తాడు. కాని_

తను చితికిపోయినట్టు, చింతతోపాటు చేవకూడా చచ్చినట్లు, తను ప్రస్తుతంలో_మారే ఆర్థిక వ్యవస్థలో ఉన్నట్టు గుర్తించడు.

తనను తను తెలుసుకొనేప్పటికి అంతా తల్లక్రిందులవుతుంది. ఆత్మహత్యే శరణ్యమవుతుంది.

జడత్వం నుంచి చేతనావస్థకు చేరే స్థితిలో కలిగే మానవ పరిణామం ప్రతిరూపంగా సీతారామారావు జీవితాన్ని పోతపోశారు గోపీచంద్. తెలుగులో ఈ విధమైన జీవిత చిత్రణా నవలలలో ఇదే మొదటిదీ, చివరిదీను.

అందరినీ మించిన అతీత వ్యక్తిగా తనను తనే పోల్చుకొంటూ, తను ఆలోచించుకొంటున్నట్టే ప్రపంచం పరివర్తనం చెందుతున్న దనుకొంటాడు అసమర్ధుడు సీతారామారావు.

నిత్య జీవితంలో అట్లా జరగదు సరికదా, సామాజిక నీతికి, న్యాయానికి తను చాలా దూరమైనట్టు, సమాజ పరివర్తనం దశలో తన స్వీయపాత్ర గుర్తించబడనట్టు తెలుసుకొని కుంగిపోతాడు.

నిరాశ జనిస్తుంది. విసుగు చెందుతాడు. విరక్తు డవుతాడు.

ఆశావాది తన హేతువాద దృక్పథాన్ని విరమించుకొని ఒక్కసారిగా నిరాశావాదిగా మారాడో_ఇహ అతనికి జీవితం వుండదు.

అసమర్ధుని ఆలోచనలు తాజావే కావచ్చును కాని వాటికి పునాదులు లేవు. ఉన్నా, అవి శిధిలమైనవే. తన ఆలోచనలను హేతువాద పూర్వకంగా పూర్వపక్షం చేసుకొని జీవితానికి భౌతికంగా సమన్వయించుకోలేనినాడు అతని జీవితం మృగప్రాయమే అవుతుంది.

కొన్ని సిద్ధాంత ప్రతిపాదనలు చేయవచ్చు. లేదా కొన్ని సిద్ధాంతాలను నమ్ముకొనవచ్చు. కాని, ఆ సిద్ధాంతాలపై స్థిర విశ్వాసాలుగలవాడు, వాటిని నిత్య జీవితంలో హేతు పూర్వకంగా అన్వయించుకోలేనివాడు సీతారామారావువలె అసమర్ధుడై తన జీవితాన్ని విషాదావృతం చేసుకొని కుక్కచావు చావడం తధ్యం,

నవలలోని రామయ్యతాత కొన్ని లక్ష్యాలతో జీవ యాత్ర కొనసాగిస్తున్నవాడు. అసమర్థుడు సీతారామా రావు విలక్షణ పాత్ర సృష్టిపై గోపీచంద్ అభిప్రాయం ఈ పాత్ర ద్వారా తెలుసుకోవచ్చు.

నవలలో ఈ పాత్ర అంత ప్రాముఖ్యం వహించి నట్టు కనుపించదేమో కానీ, కీలకమైనది, ముగింపును స్పష్టపరచేదీ రామయ్యతాతే.

అసమర్ధుని భార్య సమర్థురాలు. అయితే, ఆమె సామర్థ్యాన్నిగాని, సహనాన్నిగాని, సహృదయతను గాని అసమర్ధుడు గుర్తించడు.

భర్త సీతారామారావు లసలే అసమర్ధుడు, ఆపైన ఈమెకు 'అణకువ', 'నమ్రత'లు అధికం. ఈ మంచి తనం ఆమెను రాచి రంపాన పెట్టడానికి భర్తకే అవకాశం కల్పిస్తుంది.

తన తండ్రి పోలీసు ఉద్యోగి అయినప్పుడు సహ జంగా ఆమె గడుసరి అయివుండాలని సిద్ధాంతీకరించు కోడానికి ఆమె నడవడికలో ఎక్కడా వీలు కుదురలేదు.

ఆంధ్రదేశంలో నూటికి తొంభైమందికి పైగా వున్న–ఏం జరిగినా, ఏం చేసినా భర్తను పల్లెత్తుమాట అనలేని, తమ అభిప్రాయాలను తమలోనే దిగమింగు కొనే–'అణకువ'తో తలవంచుకుపోయే గృహిణులలో ఆమె ఒకర్తె.

ఉన్నా లేకపోయినా, తినినా తినకపోయినా, ఇంటి గుట్టు రచ్చకెక్కకుండా, తన ప్రారబ్ధ మింతేనని సరి పెట్టుకొంటూ గుడ్డ నీరు గుడ్డ కక్కుకునే మధ్య తరగతి ఆంధ్ర గృహిణికి నమూనాగా ఈమె మూర్తిని పోతపోశారు గోపీచంద్.

అసమర్దుని తల్లికూడా అంతే. ఆస్తిపాస్తుల దృష్ట్యా తన పుట్టినింటి వారి కంటే మెట్టినింట వారిది పైచేయి కాగా, తనను తనవాళ్లను హేళనచేస్తూ ఈసడిస్తూ అవమానిస్తున్న భర్తను ఏమీ అనలేని, అదేమని అడగలేని ''ఉత్తమా ఇల్లాలు'' ఆమె.

భర్త అహంకారానికి, దెప్పుళ్ళకు, ఆయన 'వంశ గౌరవోద్ధతికి' క్రమేణా అహుతై పోతుంది ఈయమ. ఆమె పేదది కావచ్చు కాని ఆమె గుణం పేదది కాదు!

అసమర్దుని తండ్రి ముమ్మూర్తులా అహంకారి. సీతారామారావు అసమర్థు డవటానికి ఆయన పెత్తం దారీతనపు పెంపకమే ముఖ్య కారణం. తన మూస లోనే కొడుకును తయారుచేశాడు.

సీతారామారావు పెడసరిగా, పెళుసుగా రూపొంద డానికి కొంతవరకు మామ, మేనమామలు కూడా కారకులే.

అతని మిత్రులలో ఊబిలోకి దించేవారే కాని, చేయి అందించి ఒడ్డుకు లాగేవారు ఒక్కరూ కనుపించరు.

ఈ వ్యక్తులు, ఈ పరిస్థితులు అన్నీ కలిసి వంశ గౌరవం అనే శిథిల చూరును పట్టుకు వ్రేలాడే అహం భావి సీతారామారావును–చేతగాని సీతారామారావును–అసమర్థుణ్ణి చేసి ఆడించి, కవ్వించి, ఎందుకూ కొర గాని వానిగా చేసి, చివరకు చంపివేశాయి.

పాత్ర చిత్రణంలో – ముఖ్యంగా అసమర్థుడుగా సీతారామారావును మలచడంలో–అత్యున్నత స్థాయి శిల్పాన్ని, సంయమతను కనబరిచారు గోపీచంద్.

అసమర్థుణ్ణి కాకి తన్నడం నుంచి, గోడమీది బల్లి అతని మాటను వినిపించుకోనంత వరకు అసమ ర్దుని మనఃస్థితిని చూపించడంలో గోపీచంద్ తీసు కున్న శ్రద్ధ అమోఘం.

నవల పతాకస్థాయి, కథానాయకుని చరమాంకం జరిగిన స్మశాన దృశ్యం సీతారామారావు తన గొంతు తనే పిసుక్కొని తన అసమర్థ జీవయాత్రను విషా

దాంతం చేసుకొన్న ఘట్టం చదువుతుంటే వళ్ళు గగుర్పొడుస్తుంది. అటువంటి చావు తనకు వద్దని, అసమర్థుడుగా తన జీవయాత్ర సాగగూడదని ప్రతి పాఠకుడూ అనుకొంటాడు. అటువంటి భావం కలిగించే ఈ ట్రాజికల్ నావెల్ ఈ శతాబ్దంలో గొప్ప విజయంతమైన సృష్టి. ప్రభావం యుగయుగాలదీ.

ఈ మొదటి నవల 'అసమర్థుని జీవయాత్ర' ఒక్కటి చాలు గోపీచంద్‌ను ఉత్తమ భావనా బలం గల భారతీయ రచయితలలో ఒకరిగా, ప్రపంచ నవలాకారులలో ఒకరుగా చూపడానికి.

ఆంధ్ర ప్రభుత్వంకాని, కేంద్ర సాహిత్య అకాడమీలవారు కాని, మరేదయినా సాహిత్య సంస్థకాని వారి సన్నిహిత మిత్రులు శ్రీ అవుల సాంబశివరావు వంటివారు కాని పూనుకొని గోపీచంద్ రచనలను ముఖ్యంగా ఈ నవలను–అన్ని భారతీయ భాషలలోకి ఆంగ్లంలోకి అనువదించవలసిన అవసరం ఎంతయినా వుంది.

ఆ విధంగా చేస్తే గోపీచంద్‌కాక ఆంధ్రదేశపే ప్రపంచంలో అత్యున్నత స్థాయిలో గుర్తింపబడుతుంది

# యథార్థవాది

శ్రీ గోపీచంద్ ఆజానుబాహువు. ఆయన మాటల్లోనూ, వస్త్ర ధారణలోనూ పదప రణాల తెలుగుతనం తొణికిసలాడుతుంటుంది. జీవితమంతా నిరాడంబరంగా గడిపారు ఆయన రచనల్లో తెనుగు నుడికారం, తాత్త్విక చింతనం ప్రతిఫలిస్తుంటుంది. ఇటీవ ప్రచురితమైన ఆయన నవలలు, కథాసంపుటాలు పాఠకుడిలో జిజ్ఞాసను రేకెత్తించేవిగా ఉన్నాయి. నిరంతర అధ్యయనం ఆయన హాబీ. సోమరితనం ఆయనను చూసి పరుగెత్తుతుంది. నిరంతర శ్రామికు డాయన.

ప్రతి వ్యక్తిలోనూ ఏదో ఓ బలహీనత ఉంటుంది. శ్రీ గోపీచంద్‌గారిలో నలుగురి కూడగట్టుకోడం, శిష్యగణాన్ని పెంచుకోడం, ముఖస్తుతి, భట్రాజు పొగడ్తలు చేయ పోవడమే నిజంగా లోపా లనుకుంటే నవ్వుకోవలసిఉంటుంది. 'యథార్థవాదీ లోకవిరోధీ' అన్నారు. ఈ కారణంగా శ్రీ గోపీచంద్ అంటే కొందరికి పడకపోవచ్చు.

శ్రీ సింగరాజు లింగమూర్తి

# నాకు నచ్చిన నవల

గోపీచంద్ గారి 'అసమర్థుని జీవయాత్ర' అనే నవలను చదివాను. ఒకసారికాదు, అనేకసార్లు చదివాను, ఎన్నిసార్లు చదివినా విసుగుపుట్టలేదుమరి.

సాహిత్యంలో—"ఫలానాది నీకుబాగా నచ్చడానికి కారణములు వివరింపుము" అని ఎవరన్నా ప్రశ్నిస్తే సమగ్రమైన సమాధానం చెప్పడం సాధ్యం కాకపోవచ్చు. ఒకవిషయం నచ్చడానికీ, నచ్చకపోవడానికీ నాకూనీకూ సమానమైన కొలబద్దలు లేవుగదా! ఇలాంటి వ్యాసాలు వ్రాసేటప్పుడు పుస్తకంలోని పేరాగ్రాఫులను కోట్ చేసే అలవాటొకటి మామూలుగా ఉంది గనుక కోట్ చెయ్యడానికి వీలైనవాక్యాలను పెన్సిలుతో కోట్ చేసుకుంటూ చదివాను. పుస్తకం ముగించి చూద్దునుగదా—ప్రతిపేజీమీద పెన్సిలుగీతలున్నాయి ఏ వాక్యాల్ని కోట్ చేసేది, దేనిని చెయ్యకుండా మానేది?

తెలుగు రచయితల్లో బాగాపేరున్న ఒకాయన 300పేజీలకు తక్కువగా వున్న నవల నవలేమిటి? అని ఒక సందర్భంలో పెదవి విరచారుట పుటల్నీ—పుస్తకం లావునుబట్టి దానిగొప్పతనాన్ని నిర్ణయించుకునేవాళ్ళకి ఈనవల నిరుత్సాహాన్ని కల్గించకమానదు. ఇందులో పుటలసంఖ్య 300లకు లోపే.

''నవలయనగానేమి? దానిలక్షణములను(బేర్కొనుడు'' వంటిప్రశ్నలు వేసుకుని, వానికి సమాధానాలు వ్రాసుకుని, ఆసమాధానాలకు ఆ నవల సరిపోయిందా లేదా అని చూసుకొని, దానిగొప్పతనాన్ని నిర్ణయించు

శ్రీ సురమౌళి

కునే పద్ధతికూడా ఉంది. అయితే పై ప్రశ్నలకు లభించే సమాధానం అందరికీ ఆమోద యోగ్యం కావాలనిలేదు. పైగా నాకునచ్చిన ఒకనవలలో ఉన్న లక్షణాలనే 'నవలా లక్షణములు'గా నేను పేర్కొన వచ్చు.

నామట్టుకునేను నవల చేయవలసినది ఈమూడు పనులు అని అనుకుంటూవుంటాను .

1. తత్కాల సామాజిక జీవితాన్ని ప్రతిబింబించటం;

2. ఆ జీవితాన్ని, దానితత్వాన్ని సమగ్రంగా ప్రతిబింబించటం ద్వారా అందులోని మంచిచెడుల్ని ఏరుకోవడానికి పాఠకునికి వీలుకల్పించడం—

3 ఆ జీవితాన్నుంచి ఒకమెట్టు పైకిలేచి అంతకన్నా ఉత్తమజీవితం వైపుకు ప్రగమించాలన్న ఉత్కంఠను పాఠకునికి కలుగజేయడం—

''అసమర్ధునిజీవయాత్ర'' అన్ననవల పైమూడు విధులనూ సమగ్రంగా నిర్వర్తించిందని చెప్పవచ్చు. ఈనవలలో కధ తత్కాల జీవితాన్ని ప్రతిబింబించేది. పాత్రలన్నీ నిత్యం మనమధ్య తిరుగుతూ ఉండేవే; నీకూనాకూ చిరపరిచితములైనవి. ఇక తాత్విక చర్చ అనేది ఈనవలయొక్క ప్రత్యేకత. ఈ 256పుటల చిన్ననవలలో ప్రపంచంలోని వివిధ తాత్విక దృష్టులకు సంబంధించిన వ్యాఖ్యానం ముక్తసరిగాలభిస్తుంది. ఈవ్యాఖ్యానమే మానవుని మరొకమెట్టు ప్రగమింప చేస్తుంది

ఈనవలను శ్రీ గోపీచంద్‌గారు వారి నాన్నగారికి ''ఎందుకు — అన్నప్రశ్న నేర్పినందుకు'' అంకితం చేశారు. అంకితంచేస్తూ ఆయన "ఎందుకు అన్న ప్రశ్న నేర్పినందుకు'', అని చెప్పడంవల్ల ఈవాక్యానికి కూడా నవలతో అవినాభావ సంబంధం వుంది.

ఈ ఎందుకు అన్నప్రశ్న ఈనవలలో అనేక చోట్ల చర్చించ బడింది.

ఈ నవల మొత్తం ఆరుప్రకరణాలు. ప్రతి ప్రకరణానికీ వేరే ఒకప్రత్యేక శీర్షిక ఉన్నది.

1. అసమర్ధుడు
2. అసమర్ధుని భార్య
3. అసమర్ధుని ఆదర్శం
4. అసమర్ధుని మేనమామ
5. అసమర్ధుని ప్రతాపం
6. అసమర్ధుని అంతం

ఈ ఆరుప్రకరణాలూ దేనికది సమగ్రంగా ఉన్నట్టుగానేఉండి, "అసమర్ధుని జీవయాత్ర'' అనేసమగ్ర జీవిత చిత్రణకు ఉపాంగాలవలె కూడా ఉంటాయి. శ్రీ గోపీచంద్ రచనలోని గొప్పతనమే అది. ఆయన రాసే ప్రతివాక్యమూ దేనికది సమగ్రంగానూ ఉంటుంది, మరొకదానికి భాగంగానూ ఉంటుంది.

పై ఆరు ప్రకరణాలూ చిన్నచిన్న భాగాలుగా మళ్లీ విభజితమైనాయి. ప్రతిప్రకరణంలోనూ ముందు కొన్ని సంఘటనలను చెప్పడం—ఆసంఘటనల వెనుక వుండే తాత్వికదృష్టిని స్పృశించడం, తర్వాత దానికి భిన్నమైన సంఘటనలు—వాని వెనుకవుండే తాత్విక దృష్టి, ఈరెండు తాత్విక దృష్టులమధ్యా సంఘర్షణ— అనేవి సామాన్యంగా ఉంటాయి. ప్రతిప్రకరణంలోనూ ప్రారంభం అయిన ఈతాత్త్విక సంఘర్షణలన్నీ ఆఖరుప్రకరణం (అసమర్ధుని అంతం)లో సమగ్రంగా చర్చించబడి ఒకదారీ తెన్నూ — సంఘర్షణా రహితమైన తాత్వికదృష్టి సూచించబడేసరికి చకచకా విచ్చుకు పోతాయి.

నవల మొదటి వాక్యాలు ఇలా ప్రారంభం అవుతాయి:

శ్రీ సురమౌళి

"సీతారామారావు జీవితం విచిత్రమైంది. ఉన్నత శిఖరాగ్రంనుండి స్వచ్ఛమైన జలంతో భూమిమీదపడి మలినాన్ని కలుపుకుని మురికి కూపం లోకి ప్రవహించే సెలయేటిని జ్ఞప్తికి తెలుస్తుంది. తనలో వచ్చిన ఈమార్పు ఆ సెలయేటికి తెలుసో తెలియదో మనకు తెలియదు. ఒకవేళ తెలిస్తే తనలో వొచ్చినమార్పుకి ఆసెలయేరు బాధపడుతూ వుందో, గర్వపడుతూవుందో మనకు తెలియదు.''

''చూచేవాళ్లు మాత్రం దానిపతనానికి జాలి పడుతూ వుంటారు. దానికి ఆ జ్ఞానం వుందోలేదో మాత్రం ఎవ్వరూ చెప్పలేరు. పైగా పర్వతాల్లో ప్రవహిస్తూ వున్నప్పుడున్న వొడుదొడుకులులేవు అని సంతోషిస్తూ వుందేమో అనిపిస్తుంది అప్పుడప్పుడూ''—

ఈ విధంగా నవల ప్రారంభంలోనే ఛాయా మాత్రంగా మొత్తం కథను సూచిస్తారు పైగా తొలి వాక్యంతోనే చర్చను ప్రారంభిస్తారు తాత్వికచర్చ. నిజానికి పైపేరాలో నేను అండర్‌లైను చేసిన వాక్యాన్ని మినహాయిస్తే మిగతావాక్యాలన్నీ తాత్విక చర్చ. ఈధోరణే మొత్తం నవల అంతటా కాన వస్తుంది.

ఈనవల కథానాయకుడు సీతారామారావు. ఉన్నత వంశంలో పుట్టాడు. 'ఉన్నత వంశంలో పుట్టాను' అనే దురభిమానం కలవాడు. 'వంశం — మర్యాద' మొదలైన అభిప్రాయలకు దాసుడు. బాగాచదువు కున్నవాడే. తనతండ్రి చనిపోతున్నప్పుడు ''బాబూ మనవంశంపేరు నిలబెట్టు — అంతకన్నా నే చెప్పేదే మీలేదు" అనిచెప్పి కన్నుమూశాడు. తండ్రిచెప్పినట్టు-వంశం ఖ్యాతిని రెట్టింపు చెయ్యడానికి కృషిచేశాడు సీతారామారావు. కాని ఆస్తి హరించుకు పోయింది, పరిస్థితులు మారినాయి. సీతారామారావు ఎందుకూ పనికి రాని వాడైనాడు. విజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం సీతారామారావుకు చేతకాలేదు. జీవితంతో, సమాజంతో సంఘర్షణలోపడ్డాడు—ఓడిపోయాడు.

మొదటి ప్రకరణములో సీతారామారావును గురించిన పరిచయంతోబాటు ఈ నవలలో వచ్చే పాత్రలన్నింటి పరిచయమూ అవుతుంది. పైగా సీతారామారావు వంశంయొక్క గొప్పతనమూ అర్థం అవుతుంది.

తండ్రి గతించిం తర్వాత, సీతారామారావు అప్పులు ఇవ్వవలసిన వాళ్లతో చాలా ఉదారంగా ప్రవర్తించాడు. అడుగని వాళ్లదే పాపం. ఒకటే మాట చెప్పాడు—'నేను కోర్టుకు ఎక్కను'—అని. ఈ నవలలో అతి ముఖ్యమైనదీ నాకు బాగా నచ్చినదీ రామయ్యతాత పాత్ర. మొదట్నుంచీ రామయ్యతాత సీతారామారావుకు మార్గం చూపిస్తూనే వున్నాడు. హెచ్చరికలు చేస్తూనే వున్నాడు. సీతారామారావు దేన్నీ చెవినపెట్టక చెడిపోతూనేవున్నాడు. ఈ నవల పదవపుటలో రామయ్యతాత పాత్ర మొదటిసారి మనకు పరిచితం అవుతుంది.

"బాబూ కుర్రవాడివి. ప్రపంచానుభవంతక్కువ. కొంచెం తెలిసి మెలగాలి'' అని సలహా చెబుతుండేవాడు.

''నేను తెలిసే చేస్తున్నా తాతా'' అనేవాడు సీతారామారావు.

''చేతుల్లో నాలుగు రాళ్లుంటే అంతా మూగుతారు తరువాత మన మొగం చూసే వాళ్లుండరు బాబూ."

"మళ్లీ మొఖం చూస్తారనే అపేక్షతో నేనీ పనులు చెయ్యడంలేదు తాతా—చెయ్యడం కోసమే చేస్తున్నాను.''

''పశ్చాత్తాపపడవలసిన పనులేవీ చెయ్యకు బాబూ. పశ్చాత్తపపడవలసివస్తే హృదయంలో తేళ్లు, జెర్రులూ నివాసం ఏర్పరచుకుంటాయి. నువ్విప్పుడు మంచి పనులనుకునేవన్నీ ఎదురు తిరుగుతాయి. ఇప్పుడు నీవల్ల సహాయం పొందే వాళ్లనే విరోధం చేసుకుంటావు. నీ మంచే నీ పతనానికి కారణమౌతుంది.''

''నేను ప్రతిఫలము కోరడం లేదు తాతా.''

''అది వొక్కటే చాలదు బాబూ'' అనేవాడు రామయ్యతాత.

తన జీవితంలో సీతారామారావు చేసిన పనులన్నీ పశ్చాత్తాప పడవలసినవే. ఉదారుడు అని పొగడ్తలందుకోవాలని దానధర్మాలు చేశాడు. బీదరికం వచ్చింది. అయితే పశ్చాత్తాప పడవలసిన పనులు చేసినా పశ్చాత్తాప పడటం అనేది జరిగితే మనిషి పతనం కాకుండా వుండవచ్చు; కాని సీతారామారావు వివిధ సిద్ధాంతాలను తన అసమర్థత చుట్టూ కప్పుకోవడం ప్రారంభించాడు. తాను తప్పు చెయ్యడనే గట్టి నమ్మకం తనకు.—ఉదాహరణకు సీతారామారావు తన భార్యను కొట్టాడు. కొట్టినందుకు తనలో తాను పశ్చాత్తాప పడ్డాడు. కాని తన తప్పును ఒప్పుకోవడం అతనికి చేతగానిపని. (నిజానికి ఈపని మనలో ఎంతమందికి చేతనౌతుంది?) అందుకని తన పనికి సిద్ధాంతపు ముసుగుకప్పి దాన్ని 'గ్లోరిఫై' చేసుకున్నాడు. శ్రీరామచంద్రమూర్తి అవతార పురుషుడే. అన్నీ తెలిసినవాడే. అయినా మానవ మాత్రుడుగా ప్రవర్తించాడు. సీతకు అగ్నిపరీక్ష పెట్టాడు...... అలాగే మానవ మాత్రునివలె ప్రవర్తించడం కోసం రామచంద్రమూర్తి అడుగుజాడల్లో నడవడం కోసం తన భార్యను తాను కొట్టినట్లు సిద్ధాంతీకరించుకోవడం—ఇలాగా సీతారామారావు తన అసమర్థతను కప్పిపుచ్చుకోవడం తన స్వరూపాన్ని పెంచుకుంటూ తన గొప్పతనాన్ని చాటుకుంటూవుంటే తొలిసారిగా అతనికి తాకిన తాకిడి మేనమామ - ఉత్తరం. జీవితంలో కష్టాలు పడుతున్న రోజుల్లో ఒకవంద రూపాయలు పంపమని . మేనమామ ఉత్తరం రాశాడు. అంతకుముందు మేనమామకు తనకివ్వవలసిన నలభై వేలకు పదెకరాలు మాత్రం రాయించుకున్నాడు. ఆనాటి తన దాతృత్వానికి మేనమామ కృతజ్ఞుడై ఉండాలని సీతారామారావు కోరిక. కాని ఆయన డబ్బు పంపలేదు, సీతారామారావును తిడుతూ ఉత్తరం రాశాడు. దానికి రాసిన సమాధానమే మేనమామ ఉత్తరం. నాలుగో ప్రకరణమంతా ఆ ఉత్తరాలే.

ప్రతిప్రకరణంలో 'ఎందుకు?' అన్నప్రశ్న, దాన్ని వినియోగించడమూ, తద్వారా తాత్వికచర్చ ఈనవలలో కొల్లలు. ఉదాహరణకు కొన్నింటిని ఇక్కడ పేర్కొంటాను.

''ప్రపంచానికి ఒక ఆదర్శంలేదు గనుక, ఏపనికీ ప్రయోజనం లేదుగనుక. అన్నిపనులూ మంచే, అన్ని పనులూ చెడే...''

.. .. ..

''పరిస్థితులవల్ల భావాలు మారుతాయి. పరిస్థితులు మార్చుకో అనిసలహా చెపుతారు కొందరు. పరిస్థితుల వల్ల, పరిస్థితులు మార్చుకునేశక్తిలేక తానుపడివుంటే ఇక పరిస్థితులను మార్చేదెవరు?''—

''చూసేదాన్ని చూడు అంటారు వేదాంతులు. చూచేదే తానైనప్పుడు, చూసేదాన్ని తానెట్లా చూస్తాడు?'' (—మొదటిప్రకరణం)

.... .... ....

'మాపొట్టలకు అన్నంలేదు. మలమలమాడి చస్తున్నాం, 'మీరుప్రసాదించండి — మీరు ప్రసాదించండి' అని ఇతరదేశానుల అర్థించడం ఎంతనీచం..''

.... .... ....

శ్రీ సురమౌళి

"అధికారంలోకి రావడానికి. ప్రజలు సుఖపడేటట్టు చెయ్యడానికి అన్నం లేకపోవడం అర్హత అవడంలో అర్థంలేదు .."

"అన్నం లేకపోవడంవల్ల విప్లవంచేసే శక్తి-తర్వాత ప్రజల్ని సుఖపెట్టే ఉదారత్వమూ కలిగి— అన్నం ఉండటంవల్ల కీర్తిదాహము హెచ్చి ప్రజల్ని మోసం చెయ్యడం జరిగితే అందరికీ, అన్నీ కావాలని కోరుకోవడం ఎందుకు? — అన్నం లేకపోవడమే మంచిదేమో!"

"నిర్నిమిత్తంగా పుట్టి పరిణామం చెందే దాని ఫలితం మన జీవితం అసలు దానికే ప్రయోజనం లేనప్పుడు, మన జీవితానికి ఆదర్శం అనీ, ప్రయోజన మనీ ఎక్కడనుంచి వొస్తుంది? నిర్నిమిత్తంగా పుట్టాం నిర్నిమిత్తంగా చావాల్సిందే "

... .. ...

'అయితే ఏం చెయ్యమంటావు?'

'ఏదో ఒకటి చెయ్యమనాలనిగాని, చెయ్యాలనిగాని ఎక్కడుంది?'

'ఏం చెయ్యనక్కరలేదని మాత్రం ఎక్కడుంది?'

—(మూడో ప్రకరణం)

... ... ...

"ఒక ప్రక్కన మంచిదికాదని అనుకుంటూనే వుంటాడు. ఒక ప్రక్కన చేస్తూనే వుంటాడు తను చేస్తూవున్నది మంచిది అనుకోలేడు తాను మంచిది అనుకుంది చెయ్యలేడు ఎందుకని? ఏమిటీ విచిత్రం? దీనికి కారణం ఏమిటి? పదార్థానికీ ఆత్మకీ ఉన్న సంఘర్షణా? తానెవ్వరు? పదార్థమా? ఆత్మా? భిన్న మార్గాల్లో ఆలోచించే రెండూనా!"

.. ... ...

"ఇష్టంవచ్చినట్లు ఆలోచించవచ్చు ననుకుంటారు కొందరు?—ఎంత అజ్ఞానులు తమఇష్టం తమచేతుల్లో వుందా? తమ ఇష్టానికిమాత్రం ఒక పద్ధతిలేదూ?"

సీతారామారావుకు పిచ్చెక్కుతుంది.

"ఒరేయ్ నామాట వినండ్రా? మనకు అర్థంకాని వాళ్లందరికీ పెచ్చెత్తిందనుకుంటే ఎట్లాగురా?"

"—ఎందుకు? ఎందుకు? ఎందుకు? అనిప్రశ్నించు కోమని చెబుతాౘా — అన్ని 'ఎందుకు'లకి వాళ్ల జ్ఞానాన్నిబట్టి జవాబులు చెబుతారు, మనకున్న జ్ఞానాన్నిబట్టి నమ్ముతాం".

'కాని ఆఖరి 'ఎందుకు'కి జవాబులేదురా నాతండ్రీ'

'జ్ఞానం ఎందుకు? జవాబులేదు. లేకపోతే ఆనందానికి అని అంటారు.

'ఆనందం ఎందుకు?' జవాబులేదురా నాతండ్రి. ఎక్కడో ఒకచోట ఈ 'ఎందుకు?' ఆగవలసిందేరా తండ్రుల్లారా.

సీతారామారావుకు సంఘాన్ని తన్నబుద్ధి అయింది. .. కానిఎట్లా? ఈసంఘానికి తలెక్కడ? తోక ఎక్కడ? ఉదరం ఎక్కడ? ఎట్లా తన్నేటట్లూ?

(ఆరవ ప్రకరణం)

ముందే చెప్పానుగదా, కొటేషన్సు ఇవ్వటం ప్రారంభిస్తే మొత్తంగ్రంథాన్నే మళ్ళీ వ్రాయవలసి ఉంటుందని

ఒక రచన కళాత్మకము అవునా కాదా అనే ప్రశ్నకు చాలామంది దాని శాశ్వతత్వాన్ని ఆధారంగా తీసుకుని సమాధానం చెబుతారు ఈ విషయంలో నాకు వేరే అభిప్రాయాలున్నాయి పైగా సజీవమైంది శాశ్వత మైంది ఒకటికాదని-నిర్జీవమైనవే శాశ్వతాలని నా

అభిప్రాయం. దాన్నలావుంచు. శాశ్వతం కోసం ప్రాకులాడే రచయితలు వాస్తవానికి దూరంగా పరుగెడుతున్న విషయాన్ని నువ్వు గమనిస్తున్నావనుకుంటాను. వాస్తవికత శాశ్వతం కాదనే అభిప్రాయం కొందరికి ఉన్నది. అందుకే ఏ తులసిచెట్టుమీదో, శిల్పంమీదో కావ్యాలు వ్రాసి శాశ్వతత్వాన్ని పొందడానికి కొందరు అర్భక రచయితలు ప్రాకులాడటం, తీరా వాస్తవికత లోపించడంవల్ల ఆ రచనలు నిర్జీవాలై పోవడం మనకు సాహిత్యంలో కనిపిస్తున్న నేటి ధోరణి. "అసమర్ధుని జీవయాత్ర" అందుకు పూర్తిగా భిన్నం. ఇందులో వాస్తవిక జీవిత చిత్రణ వుంది కనుక ఇది సజీవమైంది. జీవితపు తత్వం చర్చించబడింది కనుక ఇది శాశ్వతమైంది. అందుకే ఈ నవలను ఎన్నిసార్లు చదివినా పాతదనిపించదు ప్రతిసారీ చదివేవాని సంస్కారాన్నిబట్టి క్రొత్త అర్థాన్ని స్ఫురింపజేస్తుంది అసలు నవలా రచనకుగాని, కథా రచనకుగాని ఉండవలసిన ముఖ్యలక్షణమే అది. వాస్తవిక జీవిత చిత్రణమూ కావాలి, పైగా అందులో నుంచి శాశ్వత సత్యాలను కొన్నింటిని చర్చించాలి.

సీతారామారావు తన అసమర్థతలకు సిద్ధాంతాల రంగులు పూసుకుని తిరుగుచున్న సమయంలో అతడు బోధించే తత్వం నిష్క్రియావాదం. "ఏమీ చెయ్యనక్కర్లే" అనేది. ఈ నిష్క్రియా వాదాన్ని సమర్థించుకోవడానికి అతను ప్రపంచంలో ఉన్న తాత్విక ధోరణు లన్నింటినీ వాడుకుంటాడు. మార్క్సిజం, హేతువాదం, వేదాంతం అన్నీ అతనికి తన వాదాన్ని బలపరచుకోవడానికి ఉపయోగపడతాయి. సీతారామారావు పిచ్చివాడైన తర్వాత అతడు గోడలనిండా గీసిన బొమ్మలు, అతను చౌరాస్తాలో తిన్నెమీద మంచొని ఇచ్చిన ఉపన్యాసమూ, అతనొక సభలో చొరబడి గల్లంతుచేసి సభానాయకులను విమర్శించిన తీరు, అన్నీ తన తాత్విక ధోరణిని సమర్థించుకునేవే. ఆ తరువాత ... రామయ్యతాత సీతారామారావును గన్నేరు చెట్టుక్రింద కూర్చోబెట్టి ధర్మోపదేశం చేస్తాడు. ఈ నవలను మహాభారతంతో పోలిస్తే, రామయ్యతాత గన్నేరుచెట్టు క్రింద చేసిన బోధనను "గీత"తో పోల్చవచ్చు ఆ దృశ్యమం సమగ్రమైన తాత్విక చర్చ

చర్చలు మాత్రమే సందేహాలను తీర్చవు. కేవలం చర్చలవల్ల నిష్క్రియావాదులు క్రియాశీలురుకారు. సీతారామారావు అసమర్థతను రామయ్యతాత తుడిచి వెయ్యలేక పొయ్యాడు. సీతారామారావు ఆరాత్రే తన తండ్రి కాష్టం దగ్గర తనతో తానే పోట్లాడుకొని కంఠం మెలివేసుకుని, ఆత్మహత్యచేసుకుని చనిపోతాడు.

సీతారామారావు పాత్రను సంఘంలోని 'ఆవేశం'తో పోల్చుకుంటే రామయ్యతాత పాత్రను 'అనుభవం'తో పోల్చవచ్చు ఈ రెండు ముఖ్య పాత్రలతోబాటు ఈ నవలలో సంఘపు సమగ్ర జీవిత చిత్రాన్ని చిత్రించడానికి ఉపయోగపడేందుకు క్రమంగా సీతారామారావు మేనమామ, ఆయనమామ, భార్య, ఇందిర, పాప, శీనయ్య, సీతారామారావు మిత్రులు సూర్యారావు, శాతవాహనుడు, బాలకృష్ణుడు, శివరావు మొదలైన వాళ్లు సంఘంలోని ఒక్కొక్క రంగానికి ఒక్కొక్క ధోరణికి ప్రతీకాలు. ఈ మిత్రుల్లో కొందరు మన తెలుగు దేశపు రచయితలు ఛాయామాత్రంగా కనపడతారు. వీరుకాక దేశనాయకులు, సంఘ సంస్కర్తలు, సానివీధిలో సాని, ఇవన్నీ ఒక్కొక్కటి ఒక్కొక్క వాస్తవాన్ని బయట పెడుతాయి

సీతారామారావు కలలో శివపార్వతులు దర్శనం ఇవ్వటం చాలాచిత్రంగానూ, కన్నులకు కట్టినట్లు

ఉంటుంది. శివపార్వతులు అర్ధనారీశ్వరునివలె మధ్యన పార్టీషను కర్టెనుతోసహా. దర్శనమిస్తారు. అలాగే తాను అడవుల్లో వీరోచిత పోరాటాలు సలుపుతున్నట్లు సీతారామారావు కన్నకల. సానివీధిలో సానిలో సీతారామారావు ఆంధ్రమాతను దర్శించుకోవడం. ఒక బహిరంగసభలో సీతారామారావు తన విరాట స్వరూపాన్ని ప్రదర్శించడం. అన్నీ ఒక్కొక్కటి ఒక్కొక్క వ్యాసంగా వ్రాయవలసిన విషయాలు.

గోపీచంద్‌గారు ఈవిధంగా సమాజంలోని వివిధ వాస్తవ దృశ్యాల్ని ఒకవేపు హాస్యరసం పోషిస్తూ మరోవైపు ఆలోచనలను రేకెత్తిస్తూ భాషను వాడుకుంటారు. ఇందాక నేనుచెప్పిన వాస్తవానికీ, కళాత్మకానికీ అంతరమే హాస్యరస పోషణకు, ఆలోచనలను రేకెత్తించే రచనలకూ వుంటుంది. హాస్యరసంలోనుంచి ఆలోచనలను రేకెత్తించేపని మహారచయితలకు కాని సాధ్యపడదు. అది గోపీచంద్‌గారికి సాధ్యపడింది.

గోపీచంద్‌గారి భావనాపద్ధతి సూటిగా వున్నట్టు తోచదు. సూటిగాచూస్తే వస్తువుయొక్క ఏదోఒక వైపు మాత్రమే కనపడుతుంది. గోపీచంద్‌గారు అలాకాక ఎప్పుడూ కొంచెం వంకరగా వలయదృష్టితో చూస్తారేమో ననిపిస్తుంది. ప్రతిదాన్నీ నాలుగువైపుల నుంచీ పాఠకునికి దర్శనం కలుగజేస్తారు. నేనీ వ్యాసం మొదట్లో పేర్కొన్న ''అసమర్థుని జీవయాత్ర''లోని తొలి పేరా ఇందుకు నిదర్శనం

కేవలం కథ మాత్రమే చదువుకునే వారికి ఈ నవలలో విశేషం ఏమీ కనిపించదు. నవలా రచయిత విషయాల్ని చర్చించకూడదు. కేవలం పాత్రల్ని సృష్టించి చర్చించుకునేందుకు పాఠకునికే వదలివెయ్యాలనే అభిప్రాయం ఒకటున్నది. తన అభిప్రాయాల్ని అదే పనిగా పాత్రలచేత ఉపన్యాసాల రూపంలో కుమ్మరించే రచయితలను చూసి పై అభిప్రాయము చెప్పబడి ఉండవచ్చు కాని గోపీచంద్‌గారు స్వయంగా తమ అభిప్రాయాలను చెప్పరు. చర్చ అంతా సీతారామారావు మేధస్సులో రేగే ప్రశ్న పరంపరల ద్వారాను, నవలలో జరిగే సంఘటనల ద్వారాను సాగుతుంది. కనుక పాఠకునికి తాను స్వయంగా ఆలోచించుకోనే అవకాశం విపరీతంగా ఉంటుంది. అభిప్రాయాలు చాలావరకు ప్రశ్నల రూపంలో వున్నాయి.

కొంతమంది రచయితలు సృష్టించిన పాత్రలు రచయిత అభిప్రాయానికి భిన్నంగా ప్రవర్తించి రచయితనే అధిగమిస్తాయి. కథా ప్రధానమైన నవలల్లో అది తప్పదేమో కాని "అసమర్థుని జీవయాత్ర'' లోని పాత్రలు రచయిత చెప్పదలచుకున్న విషయాన్ని ప్రతిపాదింపడం కోసం వస్తాయి. వాటి పని ముగించుకుని అవి జాడ లేకుండా మాయమౌతాయి. గోపీచంద్‌గారే ఆయన పాత్రల్ని ఇబ్బందిపెడితే పెడతారేమో గాని ఆయన్ని ఆయన పాత్రలు ఎప్పుడూ ఇబ్బందిపెట్టవు.

కొందరు నవలలో అనేక విషయాల్ని చెబుతారు. ఆ విషయాల్ని చెప్పేటప్పుడు, ఆవిషయాలు తమకు తెలుసుననే విషయాన్ని ఎస్టాబ్లిష్ చెయ్యడానికి మాత్రమే రాస్తారు గాని విషయాలను పాఠకులకు చెప్పడానికికాదు. వీరుతరచుగా అంతర్జాతీయ ప్రముఖుల పేర్లురాస్తూ వుంటారు. కాని గోపీచంద్ గారు ఈనవలలో ప్రపంచంలోని ముఖ్య తాత్విక ధోరణులను ప్రతిబింబించినా ఎక్కడా ఒక్క తత్వవేత్త పేరును పేర్కొన్నట్టులేదు. తనగొప్పతనాన్ని నిరూపించుకోవడం కంటే చెప్పేవిషయాన్ని పాఠకుడికి సులభ గ్రాహ్యంగా చెప్పాలనే ఆవేదన గోపీచంద్‌గారి కెంతగావుందో ఈవిషయం స్పష్టం చేస్తుంది.

# మాట్లాడే మౌని

"కన్నీళ్లు నా హృదయాన్ని కడిగి శుభ్రం చేస్తాయి
నవ్వులు నన్ను సహచరులకు సన్నిహితుణ్ణి చేస్తాయి
అన్నాడు ఖలీల్ జిబ్రాన్ కవి ఆనాడు
అన్నా! నీవు దాన్ని సార్థకం చేశావు నేడు

కృతుల్ని కన్నీటిలో అద్ది తీశావు
బ్రతుక్కి నవ్వుల రవ్వల హారం వేశావు
ఊహకంటె ఉత్తాలంగా, భావనకంటె విశాలంగా
ఉండడ మెలాగో అక్షరాలా రుజువు చేశావు

నక్షత్రాల కళ్లు మిలమిలా మెరుస్తున్నప్పుడు
నంద వర్ధనం పూలు గలగలా నవ్వుతున్నప్పుడు
నాకు స్ఫురిస్తుంది నీ మూర్తి

క్రిడిమి తరగతి సమాజం నడక తెగిపోయినప్పుడు
జడివట్టిన జీవితాలు ముడుచుక పోయినప్పుడు
నాలో ధ్వనిస్తుంది నీ ఆర్తి

మాట్లాడే మౌనివిగా మాతో కొన్నాళ్లు తిరిగావు
మళ్లీ బోధివృక్షం కిందికే చల్లగా వెళ్లిపోయావు

శ్రీ సి. నారాయణరెడ్డి

# మనస్తత్వవేత్త

శ్రీ దుర్గానంద్

ఆ కుటుంబం అతని చరాస్తి, అతని స్థిరాస్తి
అందులో ఉషారాణి, అందులో రామానుజం
అతడు పరమేశ్వరశాస్త్రి, ఆమె కోటేశ్వరమ్మ,
అతడు సీతారామారావు, ఆమె కళ్యాణ కింకిణి
అందరూ ఆ యింటిలో అన్ని సందర్భాల్లో పుట్టారు
ఆ పెద్ద రచనా కుటుంబం, మనశ్శిల్పి గోపీచంద్‌ది
స్వైర విహారిణి ఉషారాణి, సొగసులాడి కళ్యాణి
దిటవరి పరమేశ్వరశాస్త్రి, ధీరురాలు కోటేశ్వరమ్మ
అసమర్థుడు రామారావు, ఆశయాల కేశవమూర్తి
అందరూ అవియన్నీ అతని మనస్సు క్రీడాపుత్తలికలు.
పురుషులనే బంతులతో ఆడియాడి ఉషారాణి
హరిద్వారం వెళ్లిపోయింది
పురుషులనే ముక్కల్తో ఆడియాడి పేకఆట
జోగుల గుంపుల్లో కలిసింది
కామం, యోగం, పలాయనం
అన్నీ కలిపిన కలగూరగంప ఉషారాణి
దీనుడు రామానుజం, అసమర్థుడు రామారావు
దైన్యంతో, అసమర్థతతో, పిరికితనంతో, అధైర్యంతో
నైచ్యంతో, అల్పంతో గోపీచంద్ ఉషారాణై, కోటే
శ్వరమ్మై, పరమేశ్వరశాస్త్రై, కేశవమూర్తై పోరా
డాడు పరిహసించాడు, పాపమన్నాడు
ఇల్లుభీతి, ఇల్లాలిభీతి, మామభీతి, సంఘభీతి,
ఉద్యోగం, విత్తం, సాంగత్యం ఏమన్నా భీతిభీతి
ఆ భీతి ఒక ఆకారంలో అసమర్థుడిగా జీవయాత్రలో
భయగ్రస్తుని బ్రతుకుపాటు బ్రద్దలైన కంకాళం ఆ

కథ అంతా పీడకల. అది సృష్టించిన రచయిత అంత పెద్ద స్వప్నద్రష్ట

ఆరచనా సామ్రాజ్యంలో స్త్రీ పురుషుల సంబంధాలు, ఇల్లూ, వాకిలి, సంతానంగా తునగవు స్త్రీ ముందు పురుషుడు మోకరిల్లుతాడు స్త్రీ గయ్యాళి అయినందుకు కాదు, గడసరి అయినందుకుకాదు, పురుష సృష్టిని స్త్రీ సృష్టిని, పురుష దేహాన్ని స్త్రీ దేహాన్ని, పురుష పరిధినీ స్త్రీ పరిధినీ తరచిచూచి తెలుసుకున్న సమ మనస్కురాలు–దేహంతో, మనస్సుతో, కాంక్షతో, కౌగిలితో ఏమీభేదం లేదని తేల్చుకున్న పరిశోధిక అందుకు పురుషుడు ఆమె ముందు బానిస.

అక్కడి స్త్రీ పురుషున కొకసవాలు అక్కడి స్త్రీ పురుషున కొకసమస్య అక్కడి స్త్రీ పురుషుణ్ణి సిగలో రిబ్బనులా తురుము కుంటుంది, తీసివేస్తుంది ఆస్త్రీత్వం, ఆపురుషత్వం అవిరెండూ హృదయాలు, అవి రెండుదేహాలు. వాటిమధ్య ఏదో లోభం దానికోసం పంతం, పోటీపడడం ఒకర్నొకరు లోబరుచుకోవడం, అందుకు వాళ్ళిద్దరు మిత్రులు, శత్రువులు

అదియేదో వింతప్రపంచం అక్కడ భార్యలులేరు, భర్తలు లేరు పతివ్రతలు లేరు, ఇల్లాండ్రు లేరు, సీమంతినులులేరు అక్కడ ఉన్నవన్నీ - స్త్రీలు, చర్మం, మాంసం, హృదయం, స్వేచ్ఛ, ఆకాంక్ష, సోషలిజం, కృతజ్ఞత ఉన్న స్త్రీలు వాళ్లు తమవద్దఉన్న దైహికులను చారిత్రకంగా నైతికంగా వాడుకోరు రీజనుతో, నేచరుతో, దేహం దేహంకోస మయినట్టు వాడుకుంటారు స్త్రీ పురుషుణ్ణి ప్రేమించడం, పురుషుడు స్త్రీని ప్రేమించడం–వాళ్లు అణిగి మణిగి ప్రేమించుకోరు, ఒకర్నొకరు పడద్రోసుకుంటూ– ఈరసపడుతూ, పోటీపడుతూ, రాళ్లు రువ్వుకుంటూ ప్రేమించుకుంటారు అది మనస్సూ మనస్సుల ప్రేమ మనస్సును ఇచ్చిపుచ్చుకునే ప్రేమకాదు, మనశ్శక్తుల్ని రెచ్చింపుకున్న హెచ్చించుకున్న కూడి తీసివేసి మళ్ళీకలుపుకున్న 'గణితం' లాంటిప్రేమ ఆ భర్తకు స్త్రీ అంటేభయం ఆమెభార్య అయినందుకు ఆ స్త్రీకి పురుషుడి మీదజాలి అతడు భర్తఅయినందుకు, కాని ఆమె అతణ్ణి విడిచేసి తెగించిపోదు, అతని ముందు నిలుచుని అతణ్ణి ఓడించుతుంది వాళ్ళిద్దరి ప్రేమా బద్ధవైరంలా వాళ్లను వేధించుతుంది, మథ్య పెడుతుంది

ఆమె ఆధునిక అభిసారిక ఎన్నోకోర్కెల మీద వాలినా పుప్పొడి అంటదు నైతిక సామాజిక బంధనాలు తామరాకులు తాను నీటిబిందువులా జరిగి పోవచ్చు ఆమె కామిని, అయినా యోగినిలా గొప్పది, యోగంలాంటి కామం, కామంలోని అగ్ని—దాని వెలుతురులో అనగా కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలను ఒకప్రయోగశాలలోకితెచ్చి ఒకరకం ద్రావకం వాటిమీదవేస్తే అవి మంచి ధాతువులన్న నిర్ణయానికి వచ్చినట్టు—మనస్సు తెలివిడితో, మనశ్శోధనతో మనిషికున్న మూఢ సంబంధాలు త్రెంచి వేయబడ్డాయి స్త్రీకి గతంనించీ పెరిగున్న చరిత్ర చిందరవందర చేయబడింది

పాతస్త్రీ శుభ్రంగా ఉతకబడి వెనుకటి రంగు మాపుచేయబడినట్టు అప్పుడు అంతా క్రొత్తదనం, కొత్తవన్నె కొత్తకాంతి పాతపురుషులు అబ్బో భరించలేము ఘోరమన్నారు మరి అది అంత ఎబ్బెట్టుగా ఉండేంత క్రొత్తదనమాయె ఔను మరి స్త్రీగా మనడంలో క్రొత్త పురుషుడికి వినియోగ పడటంలో క్రొత్త కొత్త అంటే అంతా కొత్త ఈ జన్మలోనే ఇంకోజన్మ ఎత్తింది స్త్రీ

సంఘం కాలికిందనలిగి సంఘాన్ని కాలదన్నే చలంకంటే, ఈ స్త్రీ అడుగు ముందు సంఘం ఈమె ముందు ఒకఅవ్వ, అవ్వజుత్తులోనించి వ్రేళ్లుపోనిచ్చి

శ్రీ దుర్గానంద్

పకపకా నవ్వుతుంది. కాదంటే తన్ని వెలివేస్తుంది ఆ పండుటాకుల పందిరిమీద ఎప్పుడూ ప్రాకించదు తన నునువలపు పరువంపుటాకు మొత్తాలజంపు

గోపీచంద్ గొప్ప మనస్తత్వవేత్త ఆయన పతివ్రతల నవ్వుకూ పడుపు గత్తెల నవ్వుకూ భేదం కనిపెట్టగలిగిన ధీశాలి. ఒక కథలో భార్యా భర్త లిద్దరూ పోట్లాడుకున్నారు. ఛీ ఛా అనుకున్నారు సహజంగా ఆమెకు అతనంటే ఈసడింపు ఉతని రక్తిని ఆమె ఏనాడూ అంగీకరించలేదు. కాని అతడు వంటయింట్లో చేతులు కాల్చుకుంటున్నాడు. చూచి జాలివేసింది. వచ్చి వంట వండి పోయింది. అతనంటే అసహ్యం అలానేఉంది అయినా ఒంటరిగా ఉన్నాడు ఆయన కోర్కెలు ఏమైపోతున్నాయోఅని మళ్లీ జాలి వేసింది నడీచప్పుడు లేకుండావచ్చి దీపం ఆర్పివేసి ఆయన పక్కలో పడుకుంది. ఓహో ఎంతజాలి! తనదేహంతో తనకృతజ్ఞతను ఎంత హుందాగా తెలిపింది! మనస్తత్వంలోని మానవత్వం అంటే ఏమిటో చవిచూపించాడు గోపీచంద్

కోపం, తాపం, సహనం, ప్రేమా ఎన్నిరోజుల నుంచో ఘనీభవించి ఉన్నాయి వ్యక్తులుగా భావాలు. కోపానికి దుర్వాసుడు, తాపానికి విశ్వామిత్రుడు, నిలకడకు హరిశ్చంద్రుడు, నీతికి ధర్మరాజు, ప్రేమకు రాధ, పంతానికి సత్యభామ – ఒకభావానికి ఒకటే బొమ్మ ఆ బొమ్మల్లో ప్రాణం లేదన్నాడు మనోవేత్త

కోపిష్ఠికి సహనం, తాపసికి వియోగం, దుర్వాసుడిలో శాంతి, ధర్మరాజులో ఉద్రేకం ఎన్ని వికృతులులేవు? అవన్నీ ఒక్కనిలో ఎందుకురావు? కోపిష్ఠి దుర్వాసుడు కోపం తీరాక ఏమౌతాడు? కలహించిన కైకేయి కలహం తీరిన మరునాడు? పంతగించిన సత్యభామ పారిజాతం పొందినాక? ఇంకా వీళ్లందరిలో ఎన్నెన్ని చిక్కులులేవు. మనస్సు చిక్కుల్నిబట్టి మానవపాత్రను నిర్మించు మొండి బొమ్మను నిలబెట్టి మోరల్ బండిని లోలకు ఎక్కడ మేఘముందో అక్కడ పచ్చదనం ఉంది ఎక్కడ మనస్సు ఉందో అక్కడ నాయకిఉంది మానవపాత్రలు శిశిరాలైతే మనస్సు గడ్డకట్టిపోను కరిగిన మైనంలా కదలాలవి కారణపాత్రలు అయితే అట్టి పాత్రలు అసంఖ్యాకంగా ఆ నవలల్లో ఆ కథల్లో ఉన్నాయి అంతరాంతరాల్లో నినదించే అంతర్యుద్ధపు మేఘాలు అవి ఆమేఘాలు కొన్నిపురుషులు. మరి కొన్ని స్త్రీలు ఆకాశం లాంటి కళలో అవి బందమైన మట్టిపనులు కత్తివంటి రీజనుతో కథ నడిపాడు గోపీచంద్

# ప్రగతిశీలి

శ్రీమతి నాయని కృష్ణకుమారి

స్మారక సంచికలకు రచనలు చేయడం జీవితంలో ఒక విచిత్రమయిన అనుభూతి మనం బాగా చదివి మనకు నచ్చిన రచయితను ఆయన జీవిత కాలంలో మౌనంగా అభినందిస్తూ ఆనందించడం వేరు ఆ రచయితే కాలపు తెరల మరుగున భౌతిక రూపాన్ని అదృశ్యం చేసిన తరువాత ఆయన రచనాత్మకమైన కీర్తి స్వరూపాన్ని మళ్ళీమళ్ళీ అవలోకనం చేస్తూ, బాధతో ఆయన గొప్పతనాన్ని అభినందించడం వేరు

గోపీచంద్‌గార్ని రచయితగానేకాక వ్యక్తిగా కూడా నే నెరుగుదును ఆయన గొప్పవాడే కాక మంచివాడు కల్మషం లేని మనస్సుతో నిర్మొహమాటంగా, కుండబద్దలు కొట్టినట్లుగా తనకు నచ్చిన అభిప్రాయాన్ని ఎదుటివాడితో పెళుసుగా అనగల ధీరాత్ముడు హృదయ వినిర్గతమైన ప్రతి చిన్న భావనకూ, అనుభవాల తరిమెణలు పట్టి, ఆధ్యాత్మిక తత్త్వం వైపు మళ్ళించడం నేర్చుకున్న జిజ్ఞాసువు- రచన ఆయన కోరి కల్పించుకున్న అనేక వ్యాసంగాలలో ఒక వ్యాసంగం నే నెప్పుడు కనిపించినా ఆయన ఒకమాట అడుగుతూ ఉండేవారు "ఏమీ రాయటం లేదేమ్మా యీ మధ్య?" నేను "తీరిక లేదండీ!" అంటూండే దాన్ని తీరిక మాట యెట్లా ఉన్నా ఒక్క- ఆర్టికల్ వ్రాయడానికి నాకు స్వల్ప వ్యవధి చాలదు- దానికి సంబంధించిన పుస్తకాలన్నీ ముందు పెట్టుకుని వాటితో పది పదిహేను రోజులు కుస్తీ పడితేకాని నా

కలం కాగితం మీద నడవదు ఇంత శ్రమ ఎవరు పడాలి'— ఆ మాటే ఎప్పుడో ఒకప్పు డాయనతో అన్నాను — ''నీకు లౌక్యం తెలీదు వ్రాయడమనేది నిద్రపోవడం, అన్నం తినడంలాంటి అతి సామాన్యమైన అలవాటుగా మారాలి అప్పుడే లోకం ఆ వ్రాసిన వాళ్ళను గుర్తిస్తుంది'' అన్నారు నిజమేమరి! కాని నేనా పద్ధతికి ఇమడలేక పోవడం నా జీవన లక్షణం కాబోలు? ''మరి మీరు వ్రాసిన పుస్తకాలలో మరీ అవ్యవధిగా వ్రాసిన పుస్తకాలు ఉన్నాయా?'' అని మళ్ళీ ప్రశ్న వేశాను ''ఎందుకుండవు? నా రచనలు కావలసిన పత్రికల వాళ్ళు ప్రతి విడతా నా దగ్గర కూర్చుని నేను చెప్తూంటే వ్రాసుకు పోతారు'' అని జవాబిచ్చారు అది నిజమే ఆ దూకుడు లక్షణం ఆయన రచనల్లో కనిపించక దాగదు కూడాను

ఆయన అసంఖ్యాక రచనల్లో ఎన్నో విషయాలు కథా వస్తువులుగా నిలిచాయి ఈ కథలన్నీ సాంఘిక వాతావరణాన్నీ, ఆ వాతావరణానికి ఊపిరిపోసి కళకళలాడించే స్త్రీ పురుష బాంధవ్యాన్నీ చిత్రించేవి కావ్యాలూ, నీతీ, చట్టాలూ, నిత్య జీవితమూ, ఇన్నీ కలిసి, మన కర్థమయ్యేట్లు చెప్ప ప్రయత్నించే స్త్రీ పురుషుల అనురాగ బంధం ఈయన పుస్తకాల్లో మనకు కొత్తగా కనిపిస్తుంది అందుకు కారణం, ఆయన సంతరించుకున్న మనస్తత్వ విజ్ఞానం కావచ్చు మనుష్యుల మనస్సుల లోపలి పొరల్లో అణగారి ఉన్న కోరికలు, విశృంఖలతనే పొందేట్లయితే ఎటువంటి పరిణామాలు కలుగుతాయో ఈయన సూచిస్తారు కాని మరుక్షణమే ఆ విశృంఖలతను సహించనివాడికిమల్లే, అది లేకుండానే, ఉత్పన్నమవుతున్న సమస్యలకు పరిష్కార మార్గాన్ని ఆలోచించి పెడతారు అందుకనే ఈయన రచనల్లో విశృంఖలతా అంతలోనే సమస్యలతో రాజీపడే ధోరణీ రెండూ చెట్టా పట్టాలు వేసుకుని నడుస్తున్నట్లు కనిపిస్తాయి. అందువల్లనే సాహిత్య ప్రక్రియలో ఈయన సాధించిన ప్రయోజనానికీ, చలం సాధించిన ప్రయోజనానికీ చాలా తేడా ఉంది—చలం సంఘంలోని లోటుపాట్లని ఎన్నడూ క్షమించలేదు వాటితో రాజీపడాలని చూడలేదు వాటిమీద కోపంకొద్దీ, ఆ సంఘంలోనే స్థిరంగా ఉండి మానవుల మనుగడకు భద్రతను సంపాదించిపెట్టే మంచి విషయాలను కూడా గుర్తించలేదు. మంచీ చెడూ, ఈ రెంటితో అల్లుకుపోయిన సంఘాన్ని మొత్తంగా నాశనమయి పొమ్మని శపించారు ఆ కోపావేగంలో, మనిషి జీవితావసరాలను నెరవేర్చే శక్తి సంఘం చేతుల్లోనే ఉన్నదన్న సూక్ష్మ సత్యాన్ని విస్మరించారు గోపీచంద్ స్వయంగా, 'వెంకటచలం పాత్ర' అనే ఒక గల్పికలో చలంమీదా, చలం సృష్టించిన పాత్రల మీదా తనకున్న అభిప్రాయాలను వ్యక్తం చేశారు—ఈయనకు ఆ రకమైన అరాజకత్వం నచ్చదు గోపీచంద్ నేలవిడిచి సాముచేసే మనిషికాదు

తాను ఆశించే ప్రపంచంలో ఆర్థిక సమానత్వం ఉండాలి, స్త్రీ పురుషలోకం ఒకరిమీద ఒకరు ధిమాకీ చలాయించే హక్కులు మానుకుని ఒకరినొకరు అర్థం చేసుకునే స్థితికిరావాలి మూఢాచారాలూ, గుడ్డి నమ్మకాలూ సమసిపోయి, వాటిస్థానంలో సహేతుక శాస్త్రీయ దృక్పథం క్రమవికాసం చెందాలి ప్రతి వ్యక్తీ కష్టసుఖాల్ని కలగలుపుగా ఎన్నిదశల్లో అనుభవిస్తున్నా అతడు జీవిస్తున్నంతకాలం భవిష్యత్తువైపు ఆశగా నవ్వుతూ చూడగలిగిన శక్తిని సంతరించుకోవాలి ఈరకంగా గోపీచంద్ మూఢనమ్మకాలనూ, అర్థంలేని ఆచారాలనూ విమర్శించి, ఆ స్థానంలో తానుకోరే సాంఘిక స్వరూపాన్ని

గురించి కలలు కంటారుకాని పళ్ళుబిగించి, ఒళ్ళెరుగని ఆవమెత్తించుకుని, ఆ సంఘం సర్వనాశనమయి పోవాలని దుమ్మెత్తి పొయ్యరు సంఘంనుండి వ్యక్తులు విడివడి సంఘంతో ప్రమేయంలేని స్వేచ్ఛా జీవులుగా, కేవలం రెక్కలువచ్చి విహాయసపథంలో పైపైయెత్తున విహరించే విహంగ సముదాయంలా మారిపోవాలని ఆశించరు ఎంత ఎత్తున ఎగిరే పక్షులయినా అస్తమానమూ అలా ఎగురుతూ ఉండలేవుకదా! వాటికీ కాలు నిలపడానికి ఒకగూడూ, అన్నం సంపాదించుకోవడానికి చుట్టూఉన్న ప్రపంచమూ కావాలి' ఆ యెఱుక గోపీచంద్ రచనల్లో పూర్ణంగా ఉన్నట్లు కనిపిస్తుంది మనకు,

మంచితనంమీద మనుష్యుల్ని, తద్వారా సంఘాన్ని మార్చాలనే రాజీపద్ధతి యీయన ధ్యేయం ఆ ధ్యేయానికి అనుగుణమైన సంఘటనలూ పాత్రలూ అభిప్రాయ పరంపరా ఈయన కల్పించుకుంటారు. తన రచనా శక్తిని ఈ ధ్యేయాన్ని పొందడానికే ఉపయోగించుకోవాలని తహతహపడతారు కళ కేవలం కళకోసం కాదే' అది మనుష్యుల కోసమే అని గోపీచంద్‌గారి స్థిరనిశ్చయం

కాని యిక్కడ నాకు అనేక సంశయాలు ఈ నిశ్చయంవల్ల ఆయన ఉద్దేశించిన మార్పులు సంఘంలో వచ్చాయా? సంఘంలో సంచలనం కలిగిందా? అక్షరం చదవనేర్చిన ప్రతివ్యక్తీ ఆయన రచనలవైపు ఆశగా, పరిష్కార మార్గాలు కోరి చూస్తున్నారా?—ఈ సంశయాలు పరిష్కరించుకోవడమూ కష్టమే ఆమాట కొస్తే ఈనాడు సంఘాన్ని సాహిత్య వేత్తలు మార్చగలరా? ఈ సంఘాన్ని మార్చి గలవాళ్ళు రాజకీయ వేత్తలుకాని, సాహిత్య వేత్తలు కారే!

కాని సాహిత్యమనేది మహా సముద్రమై, అందులో గోపీచంద్ భావ పరంపర నిర్విరామ తరంగ సందోహమే అయితే, అవి ఉవ్వెత్తున విరిగి ఒడ్డును పెటిల్లు పెటిల్లున కొడుతూనే వుంటాయి ఆఒడ్డున నిలువెత్తు చేపలు తేరిన నల్లరాతి బండేఉంటే'- అలలు దాన్ని ముంచి యెత్తి పాచిపట్టిస్తాయి లొంగలేదని అలిగి తీరాన్ని దూరంగా కోస్తాయి ఇసక మేటులు వేసి కొన్నాళ్ళు కనపడకుండా కమ్మివేస్తాయి ఆ రాతికి చలనం లేనట్లే ఈ తరంగాలకూ విరామముండదు పరాజయశంక లేకుండా, ఆపివేయాలన్న నిస్పృహ ఆవరించకుండా, నిర్విరామంగా తాను లోకానికి పనికివస్తాయనుకొన్న భావ పరంపరను నలువైపులా వెదజల్లడమే రచయితకు అవశ్యమూ ఉండవలసిన గుణం ఈ గుణం గోపీచంద్ రచనల్లో పరిపూర్ణంగా ఉన్నట్లనిపిస్తుంది — ఈ లక్షణాలను తన రచనల్లో నిక్షిప్తంచేసి, భౌతిక శరీరాన్ని వదిలి కీర్తి శరీరాన్ని సంతరించుకున్న గోపీచంద్‌గార్ని గురించి ఇంతకంటే నేనేం చెప్పగలను ?

# కథావీధి

అనంతమైన విశ్వంలో ఏనాడు మానవజాతి ఉద్భవించిందో, ఆనాటినుండి 'కథ' సాహిత్య స్రవంతిలో ప్రధానపాయగా ఉంటూనేవచ్చింది అనాది మానవుడు కాలక్షేపానికిగాను కథలు చెప్పుకొని తద్వారా నీతిని గ్రహించేవాడు కాని కాలగతిననుసరించిన్ని, మానవుని అభిరుచుల కనుగుణంగాను కథ అనేక పరిణామాలను పొంది ఒక ప్రత్యేక సౌందర్యంతో, దినదిన ప్రవర్ధమానమై, నేడు సాహిత్యంలో ఉన్నత స్థానాన్ని పొందినదనుట అత్యుక్తి కదు నేడు ప్రచురించబడుతున్న పత్రికలన్నీ కథలకే ఎక్కువ ప్రాముఖ్యతను జూపుచున్నాయి కథ కింతగా ప్రాముఖ్యము రావడానికి ఈనాటి సమాజిక జీవితమే కారణంగా కనిపిస్తున్నది జమీందారీ యుగం అంతరించడంతో విలాసాలతో కాలం వెళ్ళబుచ్చే రోజులు గతించాయి కేవలం జీవయాత్ర కొనసాగడానికి ప్రతివారూ కష్టించి పనిచేయవలసిన కాలం ఇది, కాబట్టి మానసికాహ్లాదమును పొందడానికి అవకాశం తగ్గిపోయింది అయినప్పటికీ మానవుడు తన జీవితసమస్యలను ఎప్పటి కప్పుడు ఎదుర్కొంటూనే తీరికసమయంలో హృదయాహ్లాదమును, ఆనందమును పొందడానికి ప్రయత్నం జేస్తుంటాడు ఈ వాంఛ మానవుని మనః ప్రవృత్తిని బట్టి మారుతుంది మానవుడు విసుగు విరామమూ లేకుండా శ్రమించిన పిమ్మట అనతికాలంలోనే ఆనందమును పొందుటకు ప్రయత్నిస్తాడు ఆ

శ్రీమతి టి. జయప్రదాదేవి

కోరిక కొంత వరకు ఈ కథా సాహిత్య పఠనంవల్ల సఫలీకృత మౌతుంది ఈ రోజుల్లో రామాయణ, భారత, భాగవతముల వంటి ఉద్గ్రంధములు చదవ డానికి ఎక్కువమందికి వ్యవధిలేదు అందుచేత ప్రతి వారు 'చిన్నకథలు' చదువుచున్నారు కథలు చిన్న విగా వుండుటచేత అతి స్వల్పకాలంలోనే ముగించి, హృదయాహ్లాదమును, ఆనందమును పొందవచ్చును. ఈ విధంగా జూస్తే సాహిత్యమునకు 'చిన్నకథ' చేస్తున్న సేవ అపారమైనదిగా కనిపిస్తుంది 'చిన్న కథ' అనేదిలేకపోతే సంఘంలో జరిగే అనేక సంఘ టనలకు, మానవమనస్తత్వంలోని కొన్ని పట్టులకూ, జీవితంలోనికొన్ని విడుపులకూ సాహిత్యంలో చోటుండేది కాదు అవన్నీ పుట్టినట్లే గిట్టివుండేవి. సాహిత్యాన్ని ఈ అపాయంనుండి రక్షించింది 'చిన్నకథ'

ఆంధ్రదేశంలో "చిన్నకథలు" రచించుటలో త్రిపురనేని గోపీచంద్‌గారు సిద్ధహస్తులు శతావధాని, కవిరాజు, విప్లవకవి కీ। శే। త్రిపురనేని రామస్వామి చౌదరిగారి జేష్టపుత్రులు భావాల్లోనూ, ఆదర్శాల్లోనూ తండ్రికి మించిన చేయి ఆంధ్రాంగ్ల సాహిత్యాలను క్షుణ్ణంగా అధ్యయనంజేసి ఆకళింపు జేసుకొన్నారు కొందరు ప్రఖ్యాత పాశ్చాత్య కథకులు వారిని కద లించి ప్రభావితం చేశారు ఆ విషయాన్ని గోపీచంద్ గారు స్వయంగా ఇలా చెప్పుకొన్నారు "నాకు మొదట్లో చెకోవ్ కథలు, తరువాత బేట్సు కథలు, ఆ తరువాత సారోయిన్ కథలు నచ్చుతూ వచ్చినై మధ్యమధ్య నన్ను పుష్కిన్, గోర్కీ, మామ్, ఓహెన్రీ మొదలైన వాళ్ళు వదలకుండా కదలనివ్వ కుండా పట్టుకుంటూనే వుండేవారు ప్రఖ్యాత కథకు లందరూ వొక్కొక్కరు ఒక్కొక్కందుకు రుచిస్తు న్నారు పుష్కిన్ కథచెప్పే రీతిలోని స్వాభావికతకు నచ్చుతున్నాడు చెకోవ్ కథ మొదలు పెట్టడంలోను, ఆపడంలోను వున్న చమత్కృతికి నచ్చుతున్నాడు గోర్కి ఆతనిలో ప్రతి అక్షర అక్షరానికీ కనుపించే 'సిన్సియారిటీ'కి నచ్చుతున్నాడు మామ్ జీవితాన్ని చిత్రిస్తున్నట్లు కనపడుతూ, కథను చెప్పుకుపోగలుగు తున్నందుకు నచ్చుతున్నాడు బేట్సు 'ప్లాట్' లేకుండా వాతావరణాన్ని సృష్టించి మనస్సుని జివ్వున లాగ గలుగుతున్నందుకు, సారోయిన్ ప్లాటులేకుండా కథను చతుర సంభాషణలతో నడుపుకు పోతున్నందుకూ నచ్చుతున్నారు ఓహెన్రీ తన నైపుణ్యాన్నంతా కిద యొక్క చివరి వాక్యంలోకి ప్రవేశపెట్ట గలిగినందుకు నచ్చుతున్నాడు ఇటీవల నన్ను పెరల్‌బక్ కథలు అమితంగా ఆకర్షిస్తున్నాయి దీనికి కారణం ఆమె ఆర్ద్ర హృదయం"

20వ శతాబ్దంలో ఇంగ్లీషు కథ వృద్ధిలోకి వచ్చింది ఆ ప్రభావం మన దేశ రచయితలమీదకూడా ప్రసరించింది గుడిపాటి వెంకటచలంగారి కంటే ముందు కథలు వ్రాసినవారు వున్నప్పటికీ, చలం గారితో మనదేశంలో కథ ఒక విశిష్ట స్థానాన్ని సంపా దించుకుంది కాని ఈ అభివృద్ధి వారితోనే ఆగి పోలేదు గోపీచంద్‌గారి వంటి కథకుల చేతిలో 'చిన్నకథ' మూడు పువ్వులూ – ఆరు కాయలుగా అభివృద్ధి చెందింది ప్రతి ఇంట్లోనూ ప్రవేశించింది ప్రతి యువకుని హృదయాన్నీ వికసింప జేసింది మహత్తరమైన శక్తిగా విజృంభించి తెలుగునాడంతా దిగ్విజయ యాత్ర చేసింది

గోపీచంద్‌గారు చాలా కథలు వ్రాశారు ధర్మవడ్డీ కథ నాకు బాగా నచ్చింది అందలి కథ క్లుప్తంగా ఇది

"రాములవారి కాలంనుండీ ధర్మవడ్డీ – నెలకు నూటికి రూపాయిన్నర వున్నదండీ" అని చెపుతూ రైతులను పీల్చి పిప్పి చేసి, అతి స్వల్పకాలంలోనే

శ్రీమతి టి జయప్రదాదేవి

షాహుకారుగా తయారవుతాడు సూరయ్య బాకీదార్లను ఎన్ని కష్టాలు పెట్టాలో అన్ని కష్టాలూ పెట్టి దయా దాక్షిణ్యాలు లేకుండా డబ్బు గుంజుకోవడం సాగిస్తాడు కొంపలు కూలినా, సంసారాలు సమూలంగా నాశన మైనా అతని కఠిన హృదయం కరిగేదికాదు అందు చేత అతనిపై ఆ గ్రామంలో అసూయ, అసహ్యం పెరిగి ప్రతి ఒక్క వ్యక్తికి అయిష్టత ఏర్పడుతుంది ఆ గ్రామంలోనే అవతలి వీధిలో చంద్రయ్య అనే రైతు ఉంటాడు ఆతడు అవసరం వచ్చినప్పుడు షాహుకారు సూరయ్య దగ్గర అప్పు తీసుకుంటూ వుంటాడు కొంత కాలానికి ఆ బాకీ రెండువందల రూపాయలవుతుంది తన అవసరానికి డబ్బు ఇచ్చా డనే విశ్వాసం లేకుండా ధర్మవడ్డీతో తనను దోపిడి చేస్తున్నాడనే భావం గలిగిన చంద్రయ్య మురా, సూరయ్యను ఊరిడొంకలో పడవేసి బాదు తారు సూరయ్యను కొట్టారనేవార్త దావానంలా వ్యాపిస్తుంది కాని జాలితలచినవాడు ఒక్కడూ కను పించడు సూరయ్య భార్యా, కూతురు. మాత్రం భోరున ఏడుస్తారు సూరయ్యకు మతిచెడేటట్లు చేస్తాడు చంద్రయ్య తరువాత ఆగ్రామంలోని పెద్దల నుండీ పిన్నలవరకూ సూరయ్యను ఆటలుపట్టించడం మొదలుపెట్టారు, ఇల్లుకదిలితే చాలు "సూరయ్య వడ్డీ – చంద్రయ్యలారీ" అని కేకలువేసుకొంటూ పిల్లలు వెంటపడేవారు ఆ అవమానాలను భరింపలేక సూరయ్య భార్యా, కూతురూ ఆత్మహత్యలు చేసు కొంటారు అదేసమయంలో సూరయ్య ఇవ్వవలసిన బాకీలను అతని విరోధులు ట్రాన్స్‌ఫర్ చేయించుకొని ఇల్లువేలం వేయిస్తారు చిట్టచివరకు పిచ్చివాడై పోయిన సూరయ్య బావిలోదూకి మరణిస్తాడు

ఈ కథ పాఠకులను పరిపరి విధాలుగా ఆలోచింప జేసిన తరువాత ఉభయ పక్షాలలోనూ నీతిమృగ్య మయిందనే నిర్ణయానికి తీసుకొస్తుంది ఈ కథను చదవడం వల్ల పాఠకునిలో ఒకవిధమైన నైతిక దృక్పథం గలుగుతుంది సమాజంలోని నైతికవిలువల ఆవశ్యకతను గుర్తిస్తారు ఈవిధమైన సంఘటనలను నేటికీ మనం సమాజంలో చూస్తున్నాం కాబట్టి ఈ కథ ఎప్పటికప్పుడు నూతనంగా కనిపిస్తుంది ఇది విశిష్టత అని చెప్పక తప్పదు

గోపీచంద్‌గారి ఇతర కథలు–'గీతాపారాయణం', 'బస్సుఆగింది – పోయింది', 'స్వయం పాకం', 'సంపెంగపువ్వు , 'బీదవాళ్ళంతా ఒకటే', 'భార్యల్లోనే వుంది' అన్నీ రసగుళికలు వీరి కథారచనలు చదవ డాని కెంతో మనోరంజకంగావుండి మనస్సుకు ఉత్సాహము, ఉత్తేజము కలిగించును వీరుచెప్పదల్చు కొన్నది క్లుప్తముగాను, హృదయమునకు సూటిగా తాకునట్లు చెప్పగలరు అంతేగాక తాను కథకులుగా కథచెపుతున్నానని, తనకథను ఎవరో వింటున్నారనే ధోరణి గోపీచంద్‌గారిలో లేదు సహజ ధోరణిలో కథ చెప్పుకెళ్ళినట్లుంటుంది ఈ ఒక్క గుణమే వీరికి తెలుగు రచయితలలో ప్రత్యేకతను కలిగించింది. రాజకీయాలకు సంబంధించిన ఇతివృత్తాన్ని తీసు కొని కథారచన చేయడం వీరిలోని మరియొక ప్రత్యే కత అని చెప్పవచ్చు ఈ విధంగా సాంఘిక సమస్య లను రాజకీయాలతో జోడించి అత్యుత్తమంగా కథా రచన చేసే రచయితలు ఆంధ్రదేశంలో మరొకరు లేరు వీరి కథలలో పరాకాష్ఠ (Climax) విధిగా కని పించదు ఇది ఒక కొత్త పోకడ, నూతన టెక్నిక్ వీరు సృష్టించిన పాత్రలు కేవలం కీలు బొమ్మలవలె గాక, సజీవంగా నిత్య జీవితంలోని మానవులను పోలివుంటాయి. కాని ఏ ఒక్క వ్యక్తిని ఉద్దేశించి నిర్దేశించినవి మాత్రం కావు కథా పర్యవసానంలో పాత్రలు పాఠకుల సానుభూతిని పొందగలుగుతాయి

వీరికిగల రాజకీయ పరిజ్ఞానము, ప్రతిభ కధలలో ప్రతిబింబించుచుండును సత్యాన్వేషణ, భావ స్వాతంత్ర్యము గోచరించుచుండును వీరి కథా శైలిలో కూడా ప్రత్యేక విశిష్టత ప్రస్ఫుటంగా కనిపిస్తుంది కీ। శే। ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులుగారి వలె తెలుగు దేశంలోని పల్లె జీవితాన్ని అతి వాస్తవికంగా చిత్రించగలిగింది ఒక్క గోపీచంద్‌గారు మాత్రమే అని విజ్ఞులు భావిస్తున్నారు

చిన్నకథకు అనన్య ప్రచారంచేసిన ఘనత గోపీచంద్‌గారికే దక్కింది వారి కథా రచనా సంవిధానం అనితర సాధ్యమయింది చాలా మామూలు విషయాల నుండీ అపూర్వమైన ఫలితాలను సాధించడంలో వారికి వారేసాటి అందరికీ తెలిసినపదాలతో, అందరికీ పరిచితమైన సంఘటనలను, ఎవ్వరూచూడని కొత్త కోణంనుంచి చూసి పాఠకులను దిగ్భ్రాంతులను చేయడం గోపీచంద్‌గారి ప్రత్యేకత అందుచేతనే ఈనాడు నవ్యసాహిత్యంలో ఏకొద్ది పరిచయమున్న వారికైనా, కథ అనగానే ముందు గుర్తుకొచ్చేది గోపీచంద్‌గారు ఏ సామాన్య విషయాన్నయినా తీసుకొని మణిపూసలాంటి కథగా మలచేవారు కొందరు కథకులు కొన్ని కథా వస్తువులను మాత్రమే ఎన్నుకొంటారు, ఆయనకా పట్టింపులేదు

కళానికేతనము వారు "నేనూ-నా కథలూ'' అనే శీర్షికతో శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయములో ఏర్పాటు చేశారు శ్రీ గోపీచంద్ తమ ప్రసంగంలో కథాసాహిత్యము ఇతర దేశాలనుండి దిగుమతి కాలేదని విశిష్టమైన సంస్కృతి, నాగరికతలకు పుట్టినిల్లయిన మనదేశం క్రీస్తుకు చాలా పూర్వమే ఈ రంగంలోగూడా బాగా పరిణతిచెందినదని, మనుష్య పాత్రలతోనే కాక పక్షులు జంతువులు చెట్లతోగూడా మన పూర్వీకులు ఆనాడే కథలను చెప్పించారని పంచతంత్రము, హితోపదేశాల గూర్చి ప్రస్తావించారు ఈసబ్స్ ఫేబుల్స్‌లో ఈ కథల ఛాయలు ఉన్నాయని భారతీయ కథలు పర్షియా, అరేబియా, మధ్యప్రాచ్యం, ఫ్రాన్సు, తూర్పు ఐరోపా తదితర పాశ్చాత్య దేశాలకు ప్రాకాయని వివరించారు ఇంకా ఇలా పేర్కొన్నారు

"కథ ప్రయోజనం వ్యాసాలకన్నా భిన్నమైనది నాడూ, నేడూ, ఏనాడైనా, కథారచనలలో గల ఉద్దేశం ఒకటే నీతిబోధన, సద్గుణాల ప్రచారం పంచతంత్ర రచనకు కారణం విష్ణుశర్మను రాజు తన కుమారులకు మంచి గుణాలు అలవడేలా విద్యాబోధనం చేయమంటాడు లేత హృదయాలపై కథలు మంచి ప్రభావాన్ని వేస్తాయి కథలలో పొందుపరచబడే నీతి, లౌకికం, జ్ఞానము సామాన్యులకు అందుబాటులో ఉంటుంది నదులకు ఉపనదుల్లా పెద్ద కథల్లో చిన్ని కథలుచేర్చి అల్లడం మన దేశంలోనే పుట్టినది రామాయణ, మహాభారతాల్లో ఈ నైపుణ్యం పరిణతి అందుకొన్నది మన దేశంలో కథలు చెప్పలేని ముసలమ్మ, ఊకొట్టలేని బాలుడు లేరంటే కథాసాహిత్యము మన నరనరాల్లో ఎలా జీర్ణించుకొని పోయినదో ద్యోతకంకాక మానదు మధ్యకాలంలో మన ప్రగతి వెనుకబడి ఇతర దేశాలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందినవి కథకు మూడు దశలుంటాయి వీనికి పరిణామము ఉన్నది నవలలో సమగ్రమైన పాత్ర చిత్రణ ఉంటుంది కథ సంక్షిప్తము, ఒక సంఘటనను చిత్రించడమే కథలక్షణం ఐతే సంఘటనకు ప్రాధాన్యము ఇవ్వక కేవలం వాతావరణాన్ని మనస్తత్వాలను చిత్రించవచ్చు కేవలం సంభాషణలతో కథను నడపవచ్చు ఇది భావకవిత్వము లాంటిది కథను ఏపద్ధతిలో వ్రాసినా వ్రాసేవాడు సమర్థుడయితే అది రక్తికడుతుంది మనకు చలం

శ్రీమతి టి జయప్రదాదేవి

మునిమాణిక్యం, కుటుంబరావు వంటి ప్రసిద్ధ కథా రచయితలు ఉన్నారు

"ఇక నాకథలగూర్చి చెప్పాలంటే జీవితంలో నాకు ఒక ప్రత్యేక పద్ధతిలేనట్టే నాకథా రచనకు లేనట్ట నిపిస్తుంది కొన్నింటిని నేను సంఘటనలకు ప్రాధాన్య మిచ్చి వ్రాస్తే మరికొన్నింటిని సంభాషణలకు ప్రాధాన్యమిచ్చి చిత్రించాను మరి కొన్నింటిని మనస్తత్వము, వాతావరణము ప్రధానముగా రూపొందించాను అన్నింటి ప్రభావము నాపై కలదు ఐదారు సంఘటనలతో కథను వ్రాయబూనుకొంటే దానికి నవల లక్షణాలు సంక్రమిస్తాయి—ఒక్కొక్క విషయాన్ని చేపట్టి దానికి తగ్గపద్ధతిని అనుసరించి వ్రాయడం నా పద్ధతి, కథకు క్లయిమాక్స్ పెట్టటం మనస్తత్వాల చిత్రణ ఒక్కొక్కప్పుడు అవసరము కావచ్చు నా కథలు కొన్ని స్కెచ్ లవలే మరికొన్ని వ్యాసాలవలే ఆ ఛాయలు కన్పించినవి లేకపోలేదు ప్రతి కథారచయితది ఏదో ఒకపద్ధతి అవుతుంది ఏపద్ధతిలో ఇమడకపోతే అది కొత్తపద్ధతి అవుతుంది ఒకవ్యక్తిని ఒక దృక్కోణంనుండే పరిశీలించి వ్రాయవచ్చు, లేకవివిధ దృక్కోణాలలో తరచి చూచి చిత్రించవచ్చు"

ప్రేమ్‌చంద్ పేర్కొన్నట్లు "కథలో శీఘ్రగమనం కొత్తదనం వుండి మనోవికాసం గలిగించేటట్లుగా వుండాలి పై వానితోపాటు కథలో ఏదో తత్వం ప్రతిబింబించాలి ఏ తత్వమూలేని కథ మానసికాహ్లా దాన్ని కలిగించినా మనస్సును సంతృప్తి పొందించ లేదు కథలలో ఉపదేశాలకన్న మానవుని మేధస్సుకు ఆలోచనలు రేకెత్తించి ఉత్తేజపరచే శక్తి వుండాలి"

గోపీచంద్‌గారి కథారచనలన్నీ, పై లక్షణాలు కలిగి వారి ప్రతిభ పాఠకులకు ద్యోతక మౌతుంది అందు చేత వారి కథా సంవిధానం యిలా ప్రశంసించబడింది

"Among the top-ranking short story writers who have perfected the art of short narrative in Telugu, the late Tripuraneni Gopichand holds an enviable place Though he had made serious contributions to other branches of Telugu literature, his fame mainly rests upon his short stories Gopichand's merit comprises his crafty combination of theme, technique and style Hence the admiration of his stories by the intelligentia as well as the common folk Gopichand's stories are not of ephemeral value but informed with eternal verities and are sure to be cherished by posterity too Because of the universal appeal of his stories, Gopichand deserves a place on the pedestal of the best short story writers of the world"

—Indian Express, November 12

ఆంధ్రదేశంలో అసంఖ్యాకమైన కథా రచయిత లున్నప్పటికీ, వీరి కథా సంవిధానము, రచనా శిల్ప చాతుర్యము ప్రత్యేక విశిష్టతను కలిగించి కథా సాహిత్యంలో గోపీచంద్‌గారికి గొప్ప పేరు ప్రతి ష్టలు సంపాదించాయి ఆయన కథా సాహిత్యాకాశంలో ఎల్లప్పుడు 'ధృవతార'లా వెలుగొందుతునే వుంటారు

# చందనం వంటి......

శ్రీ పడ్లమూడి గోపాలకృష్ణయ్య

ఉత్తమ స్వరూపం
ఉన్నతవిగ్రహం
విశాలమైన నుదురూ
ప్రశాంత గంభీరమైన వదనమూ
నిశితమైన దృక్కులూ
నిబ్బరంతో కూడిన రీవీ
తిరిగీ తిరుగని గిరజాలతో ·
కరిగీ కరుగని నవనీతంవంటి హృదయంతో
నిండుగా కనిపించే గోపీచంద్
యెక్కడున్నాడెక్కడున్నాడు ?
పిలునామా లేని జీవితంతో
పాండిత్యం ఉన్నా-లేనట్లు వ్రాసే
పటుత్వం—పెళుసుదనం లేని రచనల్తో
పుట్టుశాస్త్రీ—పెట్టుశాస్త్రీ కాకుండానే
పరమేశ్వరుడుగా రూపొంది
ఒకవంక అభయంకర అభంగుర
మంగళకరుడుగా
మరోవంక సభయంకర సభంగుర
విలయంకరుడుగా జీవిస్తూ
సమర్థ జీవయాత్రసాగిస్తూ
అసమర్థుని జీవయాత్రలోని
ఆంతర్యాలనూ
అంత రాంతరాలనూ
అనుభవించిన రీతిగా
అవగాహన చేసుకుని
ఆవిష్కరించి
అందరికీ పంచిపెట్టి
మరకల్లేని మెరుపుల్తో
అరుణారుణ కిరణాల్తో
విరికన్నెల్లా విరిసిన
చెరుగని చిరునవ్వుల్తో
మయపాశాలను మించిన
యమపాశాలను విసిరి
పచ్చినరుడై పోయిన
నారాయణరావును
పిచ్చినరుడుగా జీవించిన
దరిద్ర నారాయణను
మృగతృష్ణవంటి సుఖాల్తో
పాపతృష్ణల్లో పడిపోయే
గోపీకృష్ణుల్ని సృష్టించి
తేజీలేని కోరికలతో
రాజీలేని యీరికలతో
బూజుపట్టిన జీవితాలతో
వాజమ్మలైన రాజమ్మల్ని చిత్రించి
అఖిల జీవితాలనూ

అన్ని విధాలుగానూ
అవలోకించి
ఆపోశనం పట్టి
అమేయ వచనా కల్పన లిచ్చిన
అపూర్వ రచనా శిల్పి
కోమల సుందర వదనం
రేపుమాపుల్తో పనిలేని
నిత్యమూ సత్యమైన
ఉదయంవంటి హృదయం
చందనంవంటి—
గోపీచందనం
కాదు-
మాంఛి యెర్రని యెర్ర చందనంవంటి
గుమ్మైన హృదయంకల
గోపీచంద్‌ను—
ఉన్న సత్యాన్ని
మిన్నుల్నంటే ఉన్నత నగ్నసత్యాన్ని
నిమ్నోన్నతాలతో నిమిత్తం లేకుండా
నిత్య నైమిత్తికాలతో
నిమిత్తంలేని వేదాంతిగా
వాదాంతం మోదాంతం కాని
వాస్తవిక ప్రపంచ మస్తక న్యస్త
హస్తాభయ జీవితంలా వెల్లడించే
నిర్భీక నిరంజనమూర్తిని
నిర్వ్యాగ్ర నిరామయ స్ఫూర్తిని
కత్తికైనా యెదురు తిరుగుతూ
మిత్తినే మోహింప చేస్తూ
రాయగా రాయగా అరుగుతూ
మహా కాళ నాగులు కూళ నాగులకుసైతం
ఆప్యాయంగా ఆలింగనం చెయ్యగా
ఆ విషనాగుల హృదయాలను కూడా
చందనంవంటి
వికసింప చేస్తూ
మహాగ్ని జ్వాలల్లో సైతం
మహా గంధాన్నావహింప జేసే
సుదృఢ గోపీచందనం వంటి
గోపీచంద్‌ను—
అతి కోమల సుమరజంలా
శృతి కోమలరాగ రంజిత
అమృత పారిజాత
అదృశ్య మృదు రజంలాఉండే
ఉండకాని గుండగా—
స్రవించని ద్రవంగా—
గుప్పుమనే మెత్తని
మంచి చందనం వంటి
గోపీచంద్‌ను—
అయినా కాకపోయినా
అందరికీ అయినవాడై
అక్కరలేని వెక్కసం చూపే
అవతల-యివతల-వారికైనా
"అయినవాడు" కాని వారికైనా
అయినవాడుగా నడయాడిన
గోపీచంద్‌ను—
యే పాపం యెరక్కుండానే
శాపం తగిలినట్లు
అర్ధంతరంలా హఠాత్తుగా
అనంతపృధివ్యప్ తేజో
వాయ్వాకాశాల్లో లీనమై
అనంతరూపం తాల్చిన వాస్తవాన్ని
యేపైన నేస్తాన్ని
యే స్వరూపంతో చూస్తాను!
యే సురూపంలో చూస్తాను!
యే రూపంలో చూస్తాను?

# గంభీరుడు

శ్రీ "ఉషశ్రీ"

చూపుకి కనుపించేరూపు యెంత గంభీరమయినదో వ్యక్తిత్వం కూడా అంత గంభీరమయినదని ఆయనతో నాకుగల స్వల్పకాలపరిచయంలో గ్రహించాను పైకి ఎంతో గంభీరంగా కనిపిస్తూ దగ్గరకు పోయేసరికి ఉత్తిబోళా అయిన వ్యక్తుల నెందరినో చూసిన నాకు ఆయనలోని ఈ వైశిష్ట్యం ఆశ్చర్యాన్ని కలిగించింది బహిరంతరాలలో మూర్తీభవించిన యీ గాంభీర్యాన్ని వివరించడం సాధ్యమయ్యే పనికాదు, అది అనుభవించవలిసిందే తెలుగు సాహిత్యంలో పెద్ద పెద్ద స్థానాలు సాధించుకొన్న పెద్దలందరిలోనూ కనుపించనిదిది బహుశా కొడవటిగంటి కుటుంబరావు కూడా యీతరహాకు చెందినవారేమోనని అనిపిస్తుంది ఏమయినా బహిరాకృతికీ, అంతరంగానికీ యింత సాదృశ్యంగల వ్యక్తులు అరుదుగానే ఉంటారని అంగీకరించక తప్పదు

గాంభీర్యానికి మౌనాన్ని అర్థంగా గ్రహించడం ఉచితం కాదు ఏ విషయంమీదనయినా పూర్వాపరాలు క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణయానికివచ్చి, దాని నుంచి వైదొలగక పోవడమే గోపీచంద్ గాంభీర్యానికి నా నిర్వచనం ఆయన దేన్నీ దాచుకోలేని గభీరుడు ఏది అనదలుచుకున్నాడో, అదితాను విశ్వసించిన అనంతరం, అనేసేవాడు ఈ స్వభావాన్నే అనేకులు హర్షించలేకపోయారు హర్షించలేని పెద్దలవల్ల గోపీచంద్‌కు జరిగినహాని లేకపోయినా ఆయన రచనలపట్ల అనేకులలో అపోహలు కలిగించడానికి ఉపక

రించింది తన్మూలంగానే గోపీచంద్‌కి రావలసినంత కీర్తి రాలేదు

ఈ విషయాన్ని ఆయన గుర్తించడం వల్లనే "నువ్వు పుస్తకం వ్రాయగానే నీకు కీర్తి వచ్చేసిందంటే నువ్వు సామాన్య మానవుల దౌర్బల్యం మీద బాగా దాడి చేశావన్నమాట" అన్నారాయన. ఆ పని ఆయన చెయ్యలేకపొయ్యాడు దౌర్బల్యంమీద దాడిచేసి పేరు తెచ్చుకోవడంకంటే కత్తివ్యాపారం లేదనేది ఆయన సిద్ధాంతం అందుకే ఆయన యేది వ్రాసినా యీ దౌర్బల్యదాడికి అతీతంగానే ఉండేది కాలంగడిచేకొద్దీ నిలబడే రచనల మీదనే ఆయన తన దృష్టిని నిలిపాడు

ఓనాడు—"నీ దగ్గర ఆముక్తమాల్యద ఉంటే ఓసారి ఇవ్వవయ్యా" అన్నారు "ప్రస్తుతం నా దగ్గర నైషధంఉంది కాపీ. మహాప్రభో ఆపాషాణ పాకం యేంచదువుతారండీ?" లన్నాను అప్పటికే ఆయన ఆదిలాబాద్ నుంచి తిరిగివచ్చి పడిశంతో అవస్థపడుతూ సెలవుమీద ఇంట్లోనే ఉన్నారు

"నువ్వుకూడా ఇలాగే అంటే ఇంక నీ సాటి వాళ్ళకు ఆముక్తమాల్యద చదివే యోగం కలిగించ వన్నమాట. నువ్వేదో వీళ్ళందరికంటె బుద్ధిమంతుడవనుకున్నాను. ఏమయినా నువ్వోమాటు అది సంపాయించి తీసుకురావయ్యా చదువుదాం ఇప్పటికి నేనది 11 మార్లు చదివాను సరేకాని ఆముక్తమాల్యద మీద ఓ వ్యాసం వ్రాయరాదూ" అన్నారు

నిజానికి నాకది వరంగానే అనిపించింది ఆముక్తమాల్యద మీద నాకెంతప్రీతి ఉన్నా భాషా, భావ సౌకుమార్యాలకు అలవాటుపడ్డవారికి అది పాషాణ పాకంగానే అనిపిస్తుంది.

అసలు గోపీచంద్ ఆముక్తమాల్యదను చూస్తారని అనుకోవడమే ఆశ్చర్యం కలిగించవచ్చు నాలాగే మరికొందరికి.

ఈ పడిశంపట్టిన రోజులలోనే మామధ్య సమాగమాలు యెక్కువయాయి ఆసందర్భంలో అన్నారాయన

"అసలు మనజాతికి పట్టిన దురదృష్ట మేమంటే—అసమర్థులు నాయకత్వానికి యెగబ్రాకుతున్నట్టే అసంతృప్తులు సాహిత్య విమర్శకు దిగుతున్నారు ఒకణ్ణి చూస్తే ఒకరికి గిట్టదు ఎందుకు చెప్పండి విశ్వనాథ సత్యనారాయణమీద అంత దండయాత్ర వీళ్ళలో ఒక్కడేనా ఆయన రచనలన్నీ సమగ్రంగా చదివారా?"

"తాత్కాలిక ప్రయోజనాల నాసించే రచయితలవల్ల సాహిత్యానికి, సంఘానికి ప్రయోజనం శూన్యమే దురదృష్టవశాత్తూ యీ శ్రేణి రచయితలే నేడు అధిక సంఖ్యాకులుగా ఉన్నా. ఒకరిద్దరు శాశ్వత దృష్టితో రచనలు చేసేవారు లేకపోలేదు" అనేవారు శ్రీ గోపీచంద్

"ఒక్క విషయం గుర్తుంచుకో—ఏ రచన కానియ్యి లోకంమీద పారెయ్యి మంచిచెడ్డలు అది నిర్ణయిస్తుంది అంతేకాని బ్రతికివున్న రచయిత అనేవాడి అభిప్రాయం వినకు ఇంతకాలం యిన్ని నవలలు, కథలు, నాటకాలు వస్తున్నా యింతవరకూ తెలుగులో ఉత్తమ నవలరాలేదని, కథరాలేదని, నాటకం బయలు దేరలేదని యేడిచేవాడు, ఈ వెధవ సాహిత్యంమీద చేసే విమర్శ అంతకంటే వెధవది అవుతుందని యెందుకూహించలేవయ్యా" అన్నారు ఓనాడు చాలా తాపీగా మాట్లాడుతూ, నిజానికి ఆయనపోవటం మాదృశులకు ఒక గభీరస్తంభం పోయినట్టే

# పట్టిందల్లా బంగారం:

శ్రీ ఎన్. వి. ఎస్. ప్రసాదరావు

శ్రీ త్రిపురనేని గోపీచంద్‌తో నాకెన్నడూ ప్రత్యక్ష సంబంధం ఏర్పడలేదు నిత్యవిహార రాజకీయ రంగంలో సంచరించిన నేనూ-సాహిత్య యాత్రా విహారాల్లో గడిపిన ఆయనా ఎక్కడా మఖీముఖీ తారసపడలేదు రెండుసార్లు మరొకరి సమ్ముఖాన కలుసుకున్నా, ఆ పరిచయం సప్తపదీనం కాలేదు

వారి రచనల ద్వారా వారు నా మనసు కెక్కిన వారు వారిటీవలివరకూ అధివసించిన స్థానం ఇప్పుడు నాకు లభించడం కాకతాళీయమే వారి కుర్చీలో కూచ్చుని చేసిన కృషిని గురించి నాకు చాలా తెలియవచ్చింది దాన్ని మిత్రులెందరో ఎన్నో విధాల చెప్పేవుంటారు ఇప్పుడు నేను చెప్పదలచింది, ఆంధునికాంధ్ర సాహితీ క్షేత్రంలో ఆ రైతుబిడ్డ పెంచిన లతల్ని, పూయించిన వసంతాల్ని, పండించిన ఫలాల్ని గురించే

ప్రబంధతుల్యమైన పద్య కవితకు మాత్రమే అందలాలు లభించే యుగం వ్యావహారిక భాషా సంప్రదాయాలకు మళ్ళనున్న కాలంలో, గ్రాంధిక పద్యకవితలో "కవిరాజు" అనిపించుకున్న తండ్రికి తనయుడైన గోపీచంద్ శిష్ట వ్యావహారిక భాషనుకూడా కాదని అచ్చమైన ప్రజా భాషను చేపట్టారు సాహసమేకాదు- "సమాసాలంకార సౌగంధ మాధురిలేని చచ్చు చెత్త మాటలు, మట్టి పిసుక్కునేవాళ్ళ మాటలుకూడా ఒక భాషేనా?" అని ఛీత్కరించిన కవులు మిక్కుటంగా గల కాలం అది

ఆ ''మట్టి'' మాటల్నే గోపీచంద్ చేపట్టి ''మాణిక్యాల్ని'' చేసిచూపెట్టారు ఆయన పట్టిందల్లా బంగారం అయింది ఆధునికాంధ్ర వచన రచనలో అంత సులభమైన పదాల్ని, అంత నేవళంగా, అంతవాడిగా, అంత వేడిగా వాడినవారు మరొకరులేరు నిత్య జీవితంలో మధ్య తరగతులవారు మాట్లాడే భాషను (అశ్లీల పదాలు తొలగించి) యధాతధంగా వాడుతూ గొప్ప చెమకులు, తళుకులు చూపించిన దిట్టలు గోపీచంద్, చలంగార్లు మాత్రమే చలంగారి రచనా వస్తువులు ఒక పరిధిలోనే సంచరించాయి, గోపీచంద్ చేపట్టవి వస్తువులేదు బహుముఖంగా—సామాన్య జీవిత కథ నుంచి సంక్లిష్ట తత్త్వశాస్త్ర విశేషాలవరకు, ఏ వస్తువును చేపట్టినా ఇదే భాషలో సకలార్ధ సౌలభ్యంతో రచించ గలిగినవాడు గోపీచంద్ ఒక్కడే

ఆధునిక కథా రచయితల్లో చింతా దీక్షితులు, స్వామి శివశంకరులు, శ్రీపాదవారు, చలం, కొడవటిగంటి, బుచ్చిబాబు, పాలగుమ్మి వంటి హేమాహేమీల కోవకు చెందుతూ—లక్ష్యంలో, విరుపుల్లో పొందికలో తనకు మాత్రమే సాధ్యమైన ఒక ప్రత్యేకతను చూపారు గోపీచంద్

నవలా రంగంలో గోపీచంద్ అనుసరించిన పద్ధతులు ఎంతటి వివాదాలకు, గుసగుసలకు దోవతీసినా— అవి సమకాలికబుద్ధిజీవుల చర్చలకు, తద్దత్త వివేచనా వికసనాలకు దోవలు తీశాయి అతి సాధారణ కౌటుంబిక సమస్యనుంచి, ప్రణయ ప్రయోగంనుంచి, యోగవిద్యా సామర్ధ్యం వరకు ఏ అంశాన్ని నవలీకరించినా గోపీచంద్ ప్రత్యేకత—భాషలోను, విమర్శనతో కూడిన విస్తరణలోను, ధ్యేయంలోను ద్యోతకమైంది

అందరూ బూతుగా భావించే ఇతివృత్తం (మెరుపుల మరకలు, శిథిలాలయం, ప్రేమోపహితులు) తీసుకున్నా ఒకానొక ఆధ్యాత్మికోన్నతి పొందిన మనీషి మాత్రమే మలచగల వృత్తాంతాలను సృష్టించారు ఈ ప్రత్యేకతే లేకపోతే ఆయన నవలల్లో సగం తృతీయశ్రేణి రచయితల ప్రణయ రచనల్లో మణిగిపోయేవి

నాటకాల సంగతిచూస్తే—ఉన్నవవారి ''మాలపల్లి'' గాక, పద్యశిల, విశ్వరూప సందర్శనం, మాంచాల వంటివి దేనికదే ఒక అపురూప కళాఖండంగా మలచిన ఘనత గోపీచంద్‌ది రేడియో రూపకాలు, ఉపన్యాసాలు, పదాలు, ప్రశ్నలకు జవాబులు—ఏది తీసుకున్నా ఆయన చేతిలో ఒక కళామయత్వాన్ని సంతరించుకునేవి ఆయన భావుకత అలాంటిది, లేఖిని అలాంటిది, లక్ష్యం అలాంటిది

అందుకే నేననేది — ''గోపీచంద్‌గారు పట్టిందల్లా బంగారం'' అని అందుకే ఆయన అజరామరుడు—! ఆయన స్మృతికి ఇదే నా అంజలి

# బహుధా

శ్రీ పోలవరపు శ్రీహరిరావు

"ఏమయ్యా!" అని కంచుకంఠంతో, ఖంగున పిలిచి, కంగారు తినిపించినా—కమ్మని మాటలతో యోగక్షేమా లడిగినంత అనుభూతినిచ్చే విలక్షణ వ్యక్తిత్వం ఆయంది ఆ పిలుపు గోపీచంద్‌గారి అదిలింపేనని వెంటనే గుర్తుపట్టినా, ఆ పరిచయస్థుడు కంగారుపడక మానడు మద్రాసునుంచి కర్నూలుకు తరలేవరకూ ఆయన పిలుపు 'పొలికేక' లాగే వుండేది మరి।

అయితేనేం? దానిలో నిండివుండేది ఆప్యాయతే! పిలవబడ్డ వ్యక్తి దగ్గరకువెళ్ళినతర్వాత గోపీచంద్ నవ్వుతారు ఆనవ్వు, దానితోపాటే వెలువడే "ఎక్కడికెళుతున్నా" వనేప్రశ్నా — మొదటి కేక ధ్వనికి పూర్తిగా వ్యతిరేకంగా అతిసున్నితంగా వుంటాయి అంతలోనే భిన్నధృవాలంత విభిన్నంగా మారిన ఆ పలకరింపు పరిచయస్థునికి చాలు ఆ తర్వాత ఆయన మరేమీ మాట్లాడక తనపనిమీద వెళ్ళిపోయినా—ఇవతలివ్యక్తి 'గోపీచంద్ నన్నుస్వయంగా పిలిచి సకల కుశలప్రశ్నలూ వేసి వెళ్ళా' రనుకున్నంత తృప్తిని పొందడం కద్దు ఇలాంటి విలక్షణ ప్రవర్తనతో, ఇంతటి అనుభూతిని కలిగించగల వ్యక్తిత్వం ఎందరి కుంటుందంటారు?

గోపీచంద్‌గారితో మొదటిసారి మాట్లాడినవారు అంత తృప్తిపడరు ఆయనొక గొప్పరచయిత, భావుకుడు, తత్వవేత్త అని తెలిసినవాళ్ళు— ఆయన్ని చూచి పరిచయం చేసుకుందామని వెళతారు. ఆయన

నిరాడంబరంగా, సాదాగా కనిపిస్తారు, పరిచయం చేసుకుంటారు సాహిత్యపరంగా కొంత సంభాషణ జరగవచ్చు, జరగకపోనూవచ్చు కొత్తవారితో సంభాషణ పెంచడం ఆయన కంతగా రుచించేదికాదు వెళ్ళినవాళ్ళు తిరిగివస్తూ – ఏదో కొరత ఫీలవడం, అసంతృప్తులవడం కద్దు ఇదేకారణంగా 'గోపీచంద్ గర్వి' అనుకునేవాళ్ళుకూడా వుండేవారు

ఆలాంటి మాటలువిన్నా–వారికి పరిచయంవున్న మిత్రులొకరు గుంటూరునుంచి, తెనాలి వారిని కలుసుకోడానికి వెళుతుంటే నేనూ వెళ్ళాను ఆయన కథలు నన్ను ప్రభావితం చేసినప్పట్నుంచీ వారిపై గురుభావం ఏర్పరచుకున్న వాణ్ణేమో—వార్ని చూచి, పరిచయం చేసుకోవాలనే కౌతుకాన్ని, ఇతరుల మాటలు వినికూడా అణచుకోలేక పోయాను

సూతాశ్రమంలో మామిత్రుడు వారికి నన్ను పరిచయం చేశాడు నేను నమస్కరించి, ప్రేక్షక మాత్రుణ్ణిగా వుండిపోయాను వారిరువురూ ఆనాటి రాజకీయాలమీదా, రచనలమీదా చర్చలు జరుపుకున్నారు మధ్యాహ్నానికి మేంముగ్గురం కలసి బజారుకు వెళ్ళి కాఫీతాగాం గోపీచంద్‌గారివద్ద సెలవుతీసుకుని మేమిద్దరం తిరిగి గుంటూరు వెళ్ళిపోయాం నామట్టుకు నాకు "గోపీచంద్ గర్విష్ఠే నేమో! ఝాము న్నర కూర్చున్నా పట్టుమని మూడు ముక్కలన్నా నాతోమాట్లాడలేదు" అనిపించింది

ఆ తరువాత సంవత్సరం గడిచిపోయింది వారు గుంటూరు రైలుస్టేషన్‌లో తెనాలి రైలెక్కుతూ కనిపించారు "ఆఁ, నాబోటివాళ్ళం గుర్తుంటామా?" అనుకుని నేను ప్రక్కగా తప్పుకుపోతుంటే–ఆయన "ఏమండీ, ఎక్కడికి ప్రయాణం?" అని పిలిచారు ప్రశ్నతో నేను కంగారుతిని, సంబాళించుకుంటూ నమస్కరించాను నేనింకా సమాధానానికి తడుముకుంటూండగానే గోపీచంద్‌గారు ఫక్కున నవ్వారు ఆయన మనసారానవ్వితే చుట్టుపట్ల పదిమందీ ఆటు మళ్ళి చూడవలసిందే ఆదో విశాలమైననవ్వు! రైలు పెట్టె మెట్లమీద నిలబడే "మనమిత్రుడెంత మోసం చేశాడో చూశారా? మిమ్మల్ని తీసుకువచ్చినవాడు మీరూ రచయితలేనని మాటమాత్రం అన్నాడా? మొన్నటి 'ప్రజామిత్ర'లో మీరచనచూచి పోల్చుకున్నాను–మీరేనని, ఆ బిడియం మీరచనలోనూవుంది. చెప్పదలచుకుంది నిర్భయంగా రాయండి" అన్నారు

రైలుకదిలింది. నమస్కరించి శెలవుతీసుకున్నాను రేపల్లె ప్రయాణం సంగతి మర్చిపోయి, తిరిగి యింటికొచ్చి నాలుగురోజులుగా మెదడులో తిరుగుతున్న వ్యాసాన్ని వ్రాసేశాను గూడవల్లి రామబ్రహ్మంగారు ప్రచురిస్తున్న "వాణి" అనే కథల వారపత్రికలో అది ప్రచురించబడింది ఆరోజుల్లో రచయితల అడ్రసులు సంపాదించడం, వారితో పరస్పర రచనల్ని గురించి ఉత్తరప్రత్యుత్తరాలు జరపడం ఓ సరదా గోపీచంద్‌గారి బోధనా ప్రభావంతో వ్రాసిన ఆవ్యాసప్రమరణాన్ని వారికి తెలియజేస్తూ, వారి అభిప్రాయం వ్రాయమని కోరాను ఆ తర్వాత రెండు సంవత్సరాలకు వారినొక రాజకీయసభా సందర్భంలో కలుసుకునేవరకూ–వారి అభిప్రాయం నాకు తెలియనే లేదు కాని, నన్నుచూడగానే వారు ఆనాటి నా వుత్తరానికి జవాబే చెప్పారు

ఇంకా 'గర్విష్ఠి' అనుకోడానికి తావెక్కడిదీ? మొదటిసారి నేను ఆయనతో సంభాషించాలని ప్రయత్నిస్తేగదా, ఆయన నాతో మూడు ముక్కలైనా మాట్లాడలేదని నెపంపెట్టడానికి! ఆ తర్వాత ఎంతో కాలానికి కలుసుకున్నా–ఆయనే నన్ను పలకరించి, నా వ్యక్తిత్వానికి ఓ విలువనిచ్చి, ఓ బోధచేసి మానసిక తత్వంలోని లగువు బిగువులను నా మనో

సేత్రానికి చూపి వెళ్ళాడుగథా ఎంత సన్నిహితులైనా ఇంతకంటె ఏంచెయ్యాలి? బహుశా ఇతరులుకూడా గోపీచంద్‌గారిని 'గర్విష్ఠి' అనుకోడానికి కారణా లుండవనుకుంటాను.

ఉత్తరాలు వ్రాసే అలవాటు అంతగా లేకపోవడమే కారణంగావి, ఎదుటి మనిషి ఎలాంటి కుర్రవాడైనా గుర్తించకపోవడం మాత్రం కారణంకాదని నే చెప్పిన సంఘటనలే సాక్ష్యం అవునుమరి, లౌకికంగా ఒకటికి పదిసార్లు పూసుకుతిరగడం ఆయన పద్ధతికాదు ఆయన ప్రవర్తనే ఒక గొప్ప చెణుకు లాంటిది గోపీచంద్‌గారికి ఒంటరిగా ఆలోచించడం కంటె, ఎవరో ఒకరితో వాదోపవాదాలు సాగదీస్తూ తాను వ్రాయదలచుకుంది మననం చేసుకోవడం ఎక్కువ అభిమాన పాత్రం తమ మనసులో నలుగుతున్న సమస్యను గురించి బహుముఖాల పరిశీలించుకోడంలో ఎదుటి వారిని ప్రశ్నలువేసి చర్చలకు దిగేవారు రెండోవ్యక్తి మేధావంతుడైనా కాకపోయినా, ఆయా సమస్యలపై ఒక అభిప్రాయంవున్న వాడైనా కాక పోయినా - గోపీచంద్‌గారు వాదనకు దించకుండా వదిలేవారు కాదు

ఎదుటి వ్యక్తి తాము చెప్పిందానికల్లా 'అవు'నని తల వూపుతూంటే ఆయనకసలు నచ్చేదికాదు. కావాలని తమ మాటను తామే ఖండించుకుంటూ అవునన్న దాన్ని 'కా'దని నిరూపించబూనుకునే వారు ఎదుటి వ్యక్తి 'అదీ నిజమేనేమో'నను కునేంత వరకూ సాగేది ఆ వితండవాదం తమ మనసులోని సమస్యకు ఆ రకంగా ఓ రూపం ఏర్పడిన తర్వాత- గోపీచంద్‌గారు మరేవేవో సంభాషణలు జరిపేవారు. వాదోపవాదాలన్నీ మరచిపోయినట్లే ప్రవర్తించేవారు. తీరా ఎదుటి వ్యక్తి సెలవు తీసుకుని వెళ్ళబోయేప్పుడు ''ఇందాక ఆ సమస్యపై మీరు చెప్పిందే నిజం-నా వాదనను కాదనడం ఇష్టంలేక అసత్యాన్ని ఒప్పేసు కున్నారుగాని'' అని ఫకఫకా నవ్వేవారు

ఈ తరహా చెణుకుల్ని అందరూ ఒకే రకంగా అర్థంచేసుకోలేరు ''తానో గొప్ప కుశాగ్ర బుద్ధిగల తార్కికుడనని, మనల్ని తికమకలుపెట్టి, తెలివి ఒలక బోసుకుంటాడు'' అనుకునేవాళ్ళు వున్నారు అంత టితో ఆయనకు దూరంగా మళ్ళిపోయి ''ఎలుకమీద పిల్లినీ, పిల్లిమీద ఎలుకనూ ఉసికొల్ప గల వాడురా గోపీచంద్'' అని ముద్రలు వేసినవాళ్ళుకూడాకద్దు ఆయా వ్యక్తులు యిలా అనుకుంటున్నారిని తెలిసినా గోపీచంద్ 'జాలిపడేవారే'గాని, సాధారణ లౌకికంగా ఆ పొరపాటు అభిప్రాయాలను పోగొట్టడానికి తాముగా ప్రయత్నించే వారుకాదు.

ఎవరో అభిమానులు, మరెవరో మిత్రులు ఫలానా విధంగా దురభిప్రాయపడి, పనిగట్టుకు దుష్ప్రచారం చేస్తున్నారని-ఇంకెవరో చెప్పేవారు ఆయన కస్సు మని, బుస్సునలేచి ఆయా దురభిప్రాయాల క్కారణాలను బిగ్గరగా ఏకరువు పెట్టేవారు -ఆవేశ కావే షాలతో ఉడికిపోతున్నట్లు ''ఇంతటి మేధావి ఈ అల్ప విషయానికే ఇంత వివశుడై పోతున్నాడేమిటా'' అని ఎదుటివాళ్ళు విస్తుపోయేవాళ్ళు కాని-తానుగా ఏ ప్రత్యర్థితోను వాదుకు దిగేవారు కాదు ఆ తరువాత ఎప్పటికో ఏ రచనలోనో ఆ యా దురభిప్రాయాలేర్ప రిచుకున్న వ్యక్తులవంటి పాత్రల్ని (ఆ దురభిప్రా యాల కారణా కారణాల చిత్రణ కవసరమైనంత మేరకే) సృష్టించి, తమ సమాధానాలు, పరిష్కారాలు సూచించేవారు

గోపీచంద్‌గారు కథకులుగా, నవలాకారులుగా, తాత్త్విక వ్యాసకర్తగా, సినీ దర్శకుడుగా, రేడియో కార్యక్రమాల ప్రయోక్తగా అనేక మందికి సుపరి చయులే గావి-ఆయన పత్రికా రచయితగా జరిపిన

శ్రీ పోలవరపు శ్రీహరిరావు

వ్యాసంగం ఎక్కువ మందికి తెలియదు కీ శే గూడవల్లి రామబ్రహ్మంగారు నడిపిన "ప్రజామిత్ర"లో 1935-40ల మధ్య అనాటి నాటకరంగంమీద దేదీప్యమానంగా వెలుగొందిన నటీనటులను కళాత్మకంగా పరిచయం చేసే వ్యాసాలు వ్రాశారు.

"కళాప్రపూర్ణ" బళ్ళారి-టి రాఘవ, డి వి సుబ్బారావు, తోట, దొమ్మేటి, యడవల్లి, కొచ్చెర్లకోట, బెల్లంకొండ, కస్తూరి, సి యస్ ఆర్, అద్దంకి, మాధవపెద్ది, కన్నాంబ, సురభి కమలాబాయి మరొకరిద్దరిని-వారాని కొకరి చొప్పున పరిచయం చేస్తూ-వారి నటనా వైదుష్యాన్ని విపులంగా సమీక్షిస్తూ శ్రీ గోపీచంద్ వ్రాసిన వ్యాసాలు, ఆ తరహా కళా విమర్శక వ్యాసాలకు తలమానికం వంటివి

తెనాలిలో పక్షపత్రికగా నడచి, ఆధునిక కథా రచయితలకు ఒరవడిగా ప్రసిద్ధి నొందిన "జ్యోతి" తరఫున నేను తరచుగా మద్రాసు వెళ్ళేవాణ్ణి అప్పటికి గోపీచంద్‌గారు "లక్ష్మమ్మ" దర్శకత్వాన్ని చేపట్టలేదు ఆ రోజుల్లో వారి యింట ప్రతిరోజూ ఏదో ఒకవేళ అయిదారుగురు పత్రికా రచయితలు కలుసుకుంటూండేవారు దిన పత్రికల సంపాదకులు అడపా దడపా వస్తే-వార, పక్ష, మాస పత్రికల సంపాదకులు నాలుగైదురోజుల కొకసారైనా వచ్చి గోపీచంద్‌గారితో ఒక పూటంతా సంభాషణలు, చర్చలు జరిపి వెళుతూండేవారు

అలాంటి సందర్భాలలో ఒకసారి నేను "మా జ్యోతిలో సినిమా శీర్షికలో వెలువడే వ్యాసాలవంటి కళాపరిశీలనాత్మక రచనలు, మరే పత్రికలోనూ రావడంలే"దని సగర్వంగా చాటుకోవడం జరిగింది గోపీచంద్‌గారు దాన్ని ఆమోదిస్తూ—"నాటక రంగానికి సంబంధించిన వ్యాసాలు కూడా అదే ఉత్తమ స్థాయిలో వెలువరించితే బాగుంటుం"దని సూచించారు అప్పుడే తాము లోగడ "ప్రజామిత"లో వ్రాసిన వ్యాసాల ప్రసక్తి తెచ్చారు. నేనవి ఆరోజుల్లో చదివిన వాణ్ణయినా, మళ్ళీ ఒకసారి చదవాలని కుతూహలపడ్డాను దురదృష్టవశాత్తు వాటి కాపీలు గోపీచంద్ గారివద్దలేవు

గోపీచంద్‌గారికి అచ్చయిన రచనలు ఫైల్ చేసుకునేంత శ్రద్ధ వుండేదికాదు వారి అర్ధాంగి, మాకు పూజ్యురాలు శకుంతలాదేవిగారు బహు జాగ్రత్తగా కటింగ్స్ భద్రం చేసేవారు ఎందువల్లనో ఈ నాటక రంగ వ్యాసావళి మాత్రం ఆమెగారు జాగ్రత్త పరచలేకపోయారు ఆ తర్వాత ఆ వ్యాసాల ప్రతులు సంపాదించాలని మేం చాలా ప్రయత్నించినా, ఫలితం దక్క-లేదు గోపీచంద్‌గారి రచనల్లో గ్రంథరూపాన లభించనివి యివి మాత్రమే

సినిమారంగంలోనూ, ఇతరరంగాలలోను ప్రసిద్ధులైన అనేకమందిని తీవ్రంగా విమర్శించే పత్రికా రచయితలు, తాముకూడా లోపాలుగల వాళ్ళమేననే గుర్తింపులేనివారు, గోపీచంద్‌గారితో కొంత సంభాషణ జరిగింతర్వాత, ఏదోఒక సందర్భంలో తమ లోపాలను, చిలిపిపనులను విపులంగా చెప్పుకుని వెళుతుండేవారు ఎవరికీ లొంగని ఈ ఘటాలు వారి ముందు ఇంత బేలలైపోవడం నాకు విచిత్రంగా వుండేది, ఆయన సంభాషణను చర్చలకు మళ్ళించే తీరు, ఎదుటివాడి స్వభావాన్ని, ఆత్మను రెచ్చగొట్టే తీరు అంత విశిష్టమైనవి.

ఇలా అందరిచేత మనసులు విప్పి పరిచేట్టుచేసే గోపీచంద్‌గారు తమ వివరాలను, ఆలోచనలను, కార్యక్రమాన్ని ఎదుటివారికి అంతుబట్టనిచ్చేవారుకాదు. స్వవిషయాల్లో గంభీర, హుందాతనాలు ప్రదర్శించేవారు వారి అర్ధాంగి శకుంతలాదేవిగారి తర్వాత—ఇటీవలిసంవత్సరాలలో శ్రీ ఆవుల సాంబశివరావు

బహుధా

గారితో మాత్రమే అంతర్యం విప్పిచెప్పేవారు అందుకే శకుంతలాదేవిగారు శ్రీ గోపీచంద్, శ్రీ సాంబశివరావులు నరనారాయణుల్లా వుండేవారని అంటారు,

పత్రికల విషయంగా గోపీచంద్‌గారికి గల మరి కొన్ని విశ్వాసాలు గమనించదగ్గవి వారి రచనలకు కొంద రెక్కువ, కొందరు తక్కువ, కొందరు పూర్ణానుస్వారంగా ప్రతిఫలాలిచ్చేవారు అయినా ఆయన అన్ని పత్రికలకూ సమాన గౌరవం యిచ్చే వారు వారి కథ ఏ మారుమూలనున్న దిగువ తరగతి (ప్రచారంలోను, పలుకుబడిలోను, విష యాలలోను) పత్రికలోనో ప్రచురించబడినప్పుడు—''మీబోటివారు ఆ పత్రిక్కి రాయడం ఏమిటండీ?'' అనేవాణ్ణి ఆయన ఫకఫకానవ్వి, ''మన రచన మంచిదోకాదో ముఖ్యంగాని, అది ప్రచురింపబడిన పత్రిక పేరు ప్రఖ్యాతులు ముఖ్యంకాదు పేరుగల పత్రికలో ప్రచురించబడితే సాధారణ రచనకు కూడా పాఠకులు ఎక్కువ విలువ వివ్వవచ్చు, పేరు లేని పత్రికలోని రచనకు పాఠకులు విలువను తగ్గిస్తారు ఆ దృష్టితో చదివిన పాఠకుణ్ణికూడా తృప్తి పరచగల రచనను మనం యివ్వగలిగితే–అది మన వ్యక్తిత్వం అదే మనద్వారా పత్రికకు జరిగేమేలు దిగువతరగతిలోవున్న పత్రికల్ని కూడా పై తరగతికి తేవడం రచయితల చేతుల్లో నేవుంది'' అనేవారు

వారు ఉద్యోగరీత్యా కర్నూలు వెళ్ళినా, హైదరాబాదులోవున్నా పత్రికలతో, పత్రికా రచయితలతో అంతసాన్నిహిత్యంగానూ వుండేవారు పత్రికా రచయితలు, సంపాదకులతో ఆయనకుగల దృఢమైత్రి చాలామంది సమకాలికులకు కన్నెఱ్ఱగా ఉండేదన్నా అతిశయోక్తికాదు అయితే—ఎంతటి సన్నిహితులకైనా తమ ఉద్యోగ, అధికారాలరీత్యా, తమకుగల పలుకుబడి దృష్ట్యా–ప్రత్యేకంగా ఒకరి నభిమానించి పక్షపాతం ప్రదర్శించి, అధికారదుర్వినియోగం చేసిన వారుకాదు నేటి ప్రజాస్వామికయుగంలో పైనున్న వారు తమ వారికి వడ్డించే విస్తళ్ళు ఎక్కువగా కని పిస్తున్నా–గోపీచంద్‌గారు అలాచేయనందుకు అలిగిన 'మిత్రులు' కూడా వున్నారు

ఆయన మద్రాసులో సినీరంగానికి ఎడంగా వున్న కాలంలో ఏమేమో ఇబ్బందులు పడిపోతున్నారని కొందరు సానుభూతి వెల్లడించేవారు – వారి ఎదుట కాదు సుమండీ–తమలోతాము, గుసగుసలుగా నిజానికి ఆయన ఆర్థికంగా ఇబ్బందులు పడవలసిన అవసరం ఏనాడూలేదు పైగా శకుంతలాదేవిగారు ఆదర్శభారతనారి ఉన్నవలక్ష్మీనారాయణ పంతులు గారి ''శారదా నికేతనం'' (గుంటూరు)లో విద్యాబుద్ధులు గరచి, ''కవిరాజు'' రామస్వామిచౌదరిగారి కోడలై, గోపీచంద్‌వంటి మహామనీషి అర్థాంగిగా–నిండుకుండకంటె గంభీరంగా సంసారం చక్కదిద్దుకున్నదామె

నిజానికి ఆర్థికవ్యవహారాలు, గృహవ్యవహారాలలో గోపీచంద్‌గారు బొత్తిగా అర్భకులుగా వుండే వారు ఇచ్చిపుచ్చుకోటాలు తెలియకపోగా–ఇంట్లోకి ఏనాడు ఏదికావాలో ఏమిటో ఆయనకు పట్టినట్టుండేదే కాదు అయినా ఏ క్షణానా దేనికీ తొక్కిసలాటా, వెదకులాటా, లాకేత్వం లేకుండా కుటుంబాన్ని నడుపుకున్న ఉత్తమాయిల్లాలు శకుంతలాదేవిగారు

''అంతటి గోపీచంద్‌గారి పత్ని అయినందుకు శకుంతలాదేవిగారు ధన్య'' లనుకుంటారు చాలా మంది అదినిజంకూడాను కాని–''అలాంటి ఉత్తమా యిల్లాలిని భార్యగా పొందిన గోపీచంద్‌గారు నిజంగా అదృష్టవంతు'' లంటాను నేను లేకపోతే, చిరు

శ్రీ పోలవరపు శ్రీహరిరావు

కోపం, సింహ గర్జనలు, నిరంతరాలోచనల్లో మునిగి లౌకికవ్యవహారాలు అంతగా పట్టించుకోకపోవడం మెండుగాగల గోపీచంద్‌తో కాపరం చెయ్యడం మెప్పుపొందడం అక్షరాలా అర్ధాంగి కావడం సామాన్య స్త్రీలకు చేతనయ్యేపనా ?! కార్యేషుదాసీ కిరణేషుమంత్రీ షట్కర్మయుక్తా కులధర్మపత్నీ'' అనే ఆదర్శ నారీ వర్ణనకు తగ్గదామె.

గోపీచంద్‌గారు ఏరచననైనా అర్ధంటుగా ముగించా లనుకున్నప్పుడు మంచంమీద పడుకుని, చూరువంక చూస్తూ, సిగరెట్‌మీద సిగరెట్ ఊదుతూ చెబు తూంటే శకుంతలా దేవిగారు అంత వేగంగానూ వ్రాసే వారు అసలు ఆమెకూడా "చిత్రాంగి" వంటి పత్రి కలలో నాలుగైదుకథలు వ్రాసినట్టు గుర్తు

గోపీచంద్‌గారితో అన్నిరంగాలలోను, దీర్ఘకాలం సన్నిహితంగా గడపిన నాబోటివారు, వార్నిగురించి చాలాచాలా వ్రాయవచ్చు కాని ఈసంచికలో ఇతర ప్రముఖులు తడుముకుండా వదలిన కొన్నిముఖ్యాం శాలు ముచ్చటించడమే నా వుద్దేశం ఆయన తనకు చేతనైన సహాయాన్ని తన ముఖ్యానుయాయులకైనా చెయ్యలేదనే అపప్రథ ఒకటుండేది ఇంటికి వచ్చినవారితో గంటలతరబడి మాట్లాడ్డం, ముచ్చటించడం, చర్చించడం వున్నాయి గాని–హిందూగృహస్థుల ఆచారంప్రకారం ప్రత్యేక లతిధిమర్యాదలు,భక్ష్యభోజ్యాలు సమకూర్చడం వంటివి లేదని కూడా కొందరు విడ్డూరంగా చెప్పుకునేవారు

నాకు తెలిసినంతలో ఈ అపప్రథలకు సకారణాలు లేకపోలేదుగాని – ఇటీవలి సంవత్సరాలలో ఆయన చాలా మారిపోయారు, అతిథి మర్యాదలు, లౌకిక ప్రశ్నోత్తరాలు ఎక్కువయ్యాయి మిత్రులకు అతి సామీప్యంగా, దృఢగాఢాప్యాయతలతో మెలగడం సాగించారు మిత్రులనడక్కుండానే, వారికి తెలియ కుండానే గోపీచంద్‌గారు స్వయంగా పూనుకుని మేళ్ళుచేసిన సందర్భాలనేకం వున్నాయి ఆ మేళ్ళు పొందినవారు, వాటిననుభవిస్తూగాని గోపీచంద్‌గారే ఈ భిక్షపెట్టారని గుర్తించుకోలేని వ్యవహారాలు కూడా జరిగాయి

సినిమారంగంలో గోపీచంద్ చేసిన ప్రయోగాలు, సాధించిన విజయాలు సామాన్యమైనవికావు, చారిత్ర కంగా పేర్కొదగ్గవి రైతుబిడ్డ, గృహప్రవేశం, లక్ష్మమ్మవంటి మరపురాని చిత్రాలకు సంభాషణలు సమకూర్చడమేగాక–శ్రీ రజనీవంటి వాగ్గేయకారుల్ని తొలిగా సినిమారంగానికి పరిచయం చేసింది వారే, శ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావుగారిని తొల్దొలుత సంగీత దర్శకుడుగా బుక్‌చేసిందీ గోపీచంద్‌గారే రజనీకాంతరావుగార్నికూడా మ్యూజిక్‌డైరెక్టర్ (ప్రియురాలు)గా పరిచయం చేశారుగాని, మధ్యలో నిర్మాతల దృష్టి మారిపోయింది శ్రీ కె. జగ్గయ్యను మొదటగా తెరకెక్కించిందీ ఆయనే

శ్రీ పి పుల్లయ్యగారి ''ధర్మదేవత'' చిత్రానికి సంభాషణలు కూర్చిందికూడా గోపీచంద్‌గారేనని ఎక్కువ మందికి గుర్తున్నట్టులేదు

ఉన్నత కుటుంబంలో పెద్ద కొడుకుగాపుట్టి, పండిత పుత్రుడనే ప్రవాదానికి లోనుగాకుండా స్వీయ ప్రతిభను పెంచుకుని, ఆధునిక తెలుగు సారస్వతానికి అమూల్యాభరణాలు సమకూర్చి, అశేష కీర్తి ప్రతిష్ఠ లతో దివికేగిన మా గురుతుల్యులు, గోపీచంద్ మెట్టిన ప్రతిరంగంలోనూ చెరగని ముద్రలువేసి, పట్టిన ప్రతిపనిలోను విశేష ప్రజ్ఞను కనబరచి ఆధు నిక రచయితలలో అసమాన్య బహుముఖ ప్రజ్ఞా శాలిగా నిత్య చైతన్య స్రవంతిగా జీవించి మనకిచ్చిన వారసత్వంద్వారా చిరంజీవులు.

# గేయ రచన

ఇది తెలంగాణా కన్నీటిగాథ
ఒక మహాకవి యెగజిమ్మిన
అగ్ని కణాల రొద
తల్లి రాల్చిన అశ్రుకణాలివి
వాటిసెగల పొగల వెనుక
ఆకృతిని నిర్మించి, మనసులను కరిగించి
ఆర్ద్రతను పెంచి, లోకపు చీకట్ల
దివ్వెలను వెలిగించి, హద్దులను మరపించి
విశ్వ దృష్టిని పెంచు ఈ కవి

ఓ కవీ, నీకు శుభము
మాతృశ్రీ కన్నీటి చుక్కలకు
నవ్యరీతులు దిద్దిన నీకు శుభము
శ్రీశ్రీ భుజములపైనుంచి
లోకమును పరికించు, నీకు శుభము
దీనుల ఆర్తారవములు నినదించు
లోకకళ్యాణమునకై పరితపించు
కవీ, ఓ కవీ, నీకు శుభము

గోపీచంద్

[శ్రీ కుందుర్తి 'తెలంగాణా"కు పీఠికలో]

# శాంతిగీతి

శ్రీ రజనీకాంతరావు

ఆది మధ్యాంత రహిత ! ఓ అక్షరాత్మ !
విశ్వసృష్టి సంరక్షణ విలయకర్త !
సగుణ నిర్గుణాతీత ! త్రిజగదధీశ !
సచ్చిదానంద లీలాప్రసన్నమూర్తి !

అతని గనియుందు వీవు, త్వదంతికమున
కొత్తగా వలసదిగె, లోకోత్తర మగు
నిత్య సారస్వతోద్యోగ నిరతి నీదు
కొలువు శిల్పుల యశమును కొల్లగొనగ !

ఆతని కటాక్ష వీక్షాచమద్దరహాస
    సరసోక్తులను ద్వ్యర్థ లరయబోకు,
నినుగూర్చి తనలోనొ, తనుగూర్చి నీలోనొ
    ఉన్నదున్నట్లన్న నులికి పడకు,
ఇహ పరమ్ములు రెంట నీ సృష్టి లోగుట్టు
    పరికించి, ప్రకటింప వెరగుపడకు,
నిన్ను మించిన దీక్ష నిర్విరామ కథా వి
    ధాతృత్వ మారసి తత్తరిలకు,

ఇహజగతి పాఠకుల మోద మొదరువడగ,
పరమున కకాలమున వచ్చిపడిన మేటి,
వివిధ పాత్ర మనోరంగ విపులద్రష్ట,
త్రిపురనేని గోపీచందు, అపరస్రష్ట!

ఈర్ష్యపడకో విధాత! నీ వింతదనుక
ఎదురుకొనబోని కథక విరించి అమర
ధామమున భౌతికమ్ము నాధ్యాత్మికమ్ము
కలిపి వడబోసి జీవితగాథ లల్లి!

నీ కొలువుచేరి యేడాది నిండె నేటి
కెన్ని గాథల నల్లునో, ఎన్నిలోక
చిత్తవృత్తుల తీర్చునో, చిత్ర, మతని
ఆత్మ కీయవో నిస్తులానంద శాంతి!